మహాకవి కాళిదాసకృత

రఘువంశము

మొదటి భాగము

(తెలుగు లఘువ్యాఖ్యా సహితము)

మొదటి తొమ్మిది సర్గలు

వ్యాఖ్యాత

కేశవపంతుల నరసింహశాస్త్రి

విద్వాన్, శిరోమణి, ఆకాశవాణీ సంస్కృత పరిచయ కార్యకర్త



891.2
NAR

ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి

కళాభవన్ - సైఫాబాదు

హైదరాబాదు 4

8912
NAR
N-10057
AUTHOR
TITLE

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి చేపట్టిన అనేక సారస్వత కార్యక్రమాలలో సంస్కృత గ్రంథ ప్రచురణ ఒకటి. ఆంధ్ర విద్వాంసులు, కవులు సంస్కృతీకరించిన కొన్ని తెలుగు కావ్యాలు అకాడమీ ప్రకటించింది. వీటిలో శ్రీ యస్. టి. జి. వరదాచార్యులుగారు సంస్కృతంలోనికి అనువదించిన ఏడు తెలుగు శతకాల సంపుటము, శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు పరివర్తించిన కళాపూర్ణోదయము, శ్రీ కుంటిమద్ది శేషశర్మగారు అనువదించిన మనుచరిత్రయు చేరి ఉన్నవి.

కొన్ని సంస్కృత స్వతంత్ర గ్రంథాలను కూడా అకాడమీ ప్రకటించింది. వీటిలో ఇప్పటివరకు ముద్రింపబడిన పుస్తకాలు :- ఆచార్య డా. బి. రామరాజుగారి సంపాదకత్వములో శ్రీ కృష్ణదేవరాయ రచితమైన జాంబవతీ పరిణయ నాటకము, 'అభినవ కాళిదాసు' వెల్లాల ఉమామహేశ్వరుడు రచించిన శృంగారశేఖర భాణము, మధురవాణి రచించిన శ్రీరామాయణసార కావ్యతిలకము, శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారి ఆంధ్రప్రదేశ హాస్యకథలు అనునవి.

డా. పుల్లెల శ్రీరామచంద్రుడు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగార్ల సంపాదకత్వమున ఒక తెలుగు-సంస్కృత నిఘంటువును కూడ అకాడమీ ప్రచురించింది. శ్రీహర్షమహాకవి రచించిన నైషధ కావ్యమును టీకా తాత్పర్య వ్యాకరణ విశేషములతో రచించు కార్యమును శ్రీ ఉడాలి సుబ్బరామశాస్త్రిగారికి అప్పగించినది. వారింతవరకు మూడేసి సర్గలుగా రచించిన మూడు సంపుటములు ముంద్రింపబడినవి. నాలుగవ సంపుటము ముద్రణకు సిద్ధముగా ఉన్నది. శ్రీ సుబ్బరామశాస్త్రిగారి సంపాదకత్వములోనే స్త్రీ ప్రత్యయాది విశేషములతో క్రొత్తరూపమును సంతరించుకొన్న, కీ. శే. గరణివైయాకరణ కృష్ణాచార్యవిరచితమైన శబ్దరత్నావళిని అకాడమీ ప్రచురించినది.

ఈ వరుసలోనే మహాకవి కాళిదాసు రచించిన రఘువంశ కావ్యమునకు తెలుగు లఘువ్యాఖ్యను రచించు పని శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి గారికి అప్పగింపబడినది.

శ్రీ శాస్త్రిగారు మొదటినుండి తొమ్మిది సర్గలవరకు ప్రతి పదార్థ తాత్పర్య విశేషములతో రచించిన ఈ మొదటి సంపుటమును ప్రచురించి సంస్కృత భాషాభిమానులైన చదువరుల ముందుంచుచున్నాము. రెండవ సంపుటముతో పూర్తి కానున్న ఈ రఘువంశమును శ్రీ శాస్త్రిగారు రచించుచున్నారు. ఈ రచనను చక్కగా నిర్వహించుచున్న శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారికి అకాడమీపక్షాన కృతజ్ఞతావందనములు.

ఆంధ్ర పాఠకలోకానికి ఈ గ్రంథము ఆదరపాత్రము కాగలదని విశ్వసించుచున్నాను.

హైదరాబాద్
28, జనవరి 1979

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి

AOUA102B133.

విజ్ఞప్తి

కవి కులగురువు, మహాకవి కాళిదాసు రచనలు మధురాతిమధురములన్న విషయము జగద్విదితము. అందులోను రఘువంశ మహాకావ్యము సంస్కృత భాషాధ్యయనము చేయువారి కందఱికిని ప్రప్రథమ పాఠ్యముగ నుండుటయేకాక బహురసభరితమై కంఠస్థముగ జేసికొన దగినట్టి గ్రంథము. దీనిని తెలుగులోనికి పద్యకావ్యముగ ననువదించినవారును, మొదటినుండి అయిదు సర్గలకు మాత్రము, పదవిభాగ, అర్థ, ఆకాంక్షాది విశేషములతో వ్యాఖ్యానమును రచించినవారును, తమ కవసరమని తోచిన సర్గలకు మాత్రము ప్రతిపదార్థ తాత్పర్యములను రచించిన వారును, మన పూర్వులలో నున్నారు. వానిలో కొన్ని అలభ్యములునై యున్నవి. కాగా విద్యార్థులకును, రఘువంశ కావ్యార్థమును పూర్ణముగా తెలిసికొన దలచిన రసజ్ఞులకును కలుగుచున్న క్లేశమును అకాడమీవారు గ్రహించినారు, ఈ సత్కార్యమునకు పూనుకొన్నారు.

ఆధునిక విద్యావంతులు కాళిదాసు రఘువంశకావ్య భావ సౌందర్యమును తమంతట తాము ఊహించి, గ్రహింప గల్గుటకు శ్లోకములందలి ప్రతి పదమునకును అర్థము తెలియ వలయును. అందువలన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారు నన్ను రఘువంశ కావ్యమునకు పూర్తిగా, పందొమ్మిది సర్గలకును, ప్రతి పదార్థమును వ్రాయుటకై ఆదేశించిరి. ఒక్క ప్రతిపదార్థమును మాత్రము రచించి వదలినచో చదువరులకు సుబోధముగా నుండజాలదని నేను సూచించుటచేత ఈ విధమైన లఘువ్యాఖ్యను వ్రాయుట కంగీకరించిరి. ఇంతకు అకాడమీవారి యుద్దేశము రఘువంశ మంతయు ఒక సంపుటముగా నుండినచో చదువరులకు సౌలభ్యము చేకూరుననన్నదియే. కాని అది సాధ్యపడలేదు, రెండు సంపుటములుగా నీ కావ్యము వెలువడుచున్నది.

ఈ రచనలో సంస్కృత శబ్ద స్వరూపము బోధపడుటకై శ్లోకములందును, అర్థము వ్రాయు నప్పుడును, విసంధులు పాటింప బడినవి. అర్థములు వ్రాయు నప్పుడు, అవసరమును బట్టి రెండు మూడు పదముల కొకసారియే అర్థమును వ్రాయుటయు, దీర్ఘ సమాసములందు కొన్నిచోట్ల ప్రతి పదమును విడదీసి యర్థమును వ్రాయుటయు, కొన్నిచోట్ల విడదీయకయే సముదాయమున కర్థము వ్రాయుటయు జరిగినది. ప్రతి శ్లోకమున కర్థము ముగిసిన పిమ్మట తాత్పర్య సూచక వాక్యము చేర్పబడినది. విశేషములు, శబ్దవ్యుత్పత్తులును అవసర మనుకున్నచోట చేర్చబడినవి ఇంత మాత్రముగానే ఈ లఘు వ్యాఖ్యను రచించుటకు కారణము చదువరులకు దీనిని సులభముగా నుంచుటయే. విశేషజ్ఞులయిన విద్వాంసులును, వ్యాకరణాది సర్వ విషయ జిజ్ఞాసువులైన విద్యార్థులును మన్నింతురుగాక.

లఘుమల్లినాథీయమనదగిన ఈ తెలుగు లఘువ్యాఖ్యను రఘువంశ మహాకావ్యమునకు రచించు భాగ్యమును నాకు గల్గించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికిని, తత్కార్యదర్శియైన శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికిని నేను సర్వదా కృతజ్ఞుడనై యున్నాను.

మొదటినుండి తొమ్మిది సర్గలుగల ఈ ప్రథమ సంపుటము నిప్పుడు మీ కరకమలములందుంచుచు, అచిర కాలమునందే రెండవ సంపుటము నందజేయు టకు ప్రయత్నించుచున్నాను.

26/3RT, బర్కత్‌పుర,
హైదరాబాద్

విద్వద్విధేయుడు
కేశవపంతుల నరసింహశాస్త్రి

విషయసూచిక

సర్గ - విషయము	పుటల నెంబరు
1. ప్రథమ సర్గము (దిలీపుడు సంతానోపాయార్థియై వసిష్ఠుని ఆశ్రమము (జేరుట)	1 - 40
2. ద్వితీయ సర్గము (వసిష్ఠాశ్రమము నందున్న దిలీపుడు నందినీధేనువును సేవచేసి వరమును పొందుట)	41 - 78
3. తృతీయ సర్గము (రఘువు పుట్టుట, పెరుగుట, దిలీపుని యాగాశ్వమును రక్షించుటలో ఇంద్రుని జయించుట)	79 - 118
4. చతుర్థ సర్గము (రాజ్యాభిషిక్తుడైన రఘుమహారాజు దిగ్విజయ యాత్ర)	119 - 157
5. పంచమ సర్గము (రఘు మహారాజు కౌత్సమునికి గురు దక్షిణ నొసగుట, అజుని జన్మము, ఇందుమతీ స్వయంవర యాత్ర)	158 - 204

సర్గ - విషయము	పుటల నెంబరు
5. షష్ఠ సర్గము (ఇందుమతీ స్వయంవర వర్ణనము ఆమె అజుని వరించుట)	205 - 251
7. సప్తమ సర్గము (ఇందుమతీ వివాహము, ఈర్ష్యాళువు లైన రాజులను జయించి, అజుడు ఇందుమతితో స్వగృహమును జేరుట)	252 - 290
8. అష్టమ సర్గము (అజుడు, ఇందుమతియు వనవిహారము చేయుచుండగా పూలదండ పడి ఇందు మతి మరణించుట, అజ విలాపము, దశ రథునకు యుక్తవయస్సు రాగానే రాజ్యా భిషేకముచేసి, అజుడు స్వర్గ సుఖము ననుభవించుట)	291 - 342
9. నవమ సర్గము (దశరథుని రాజ్యపాలనము, వేట కు వెళ్లుట, ముని శాపము)	343 - 391

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10,057

రఘువంశము

ప్రథమ సర్గము

ప్రార్థన

మాతాపిత్భ్యాం జగతో నమో వామార్ధజానయే,
సద్యో దక్షిణద్భక్వాతసంకుచద్వామదృష్టయే.

అంతరాయతిమిరోపశాంతయే శాంతపాపన మచింత్యవైభవమ్,
తం నరం వపుషి కుంజరం ముఖే మన్మహే కిమపి తుందిలం మహః

శరణం కరవాణి శర్మదం తే చరణం వాణీ! చరాచరోపజీవ్యమ్,
కరుణామసృణైః కటాక్షపాతైః కురు మా మంబ! కృతార్థసార్థవాహమ్॥

శ్లో. వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ. 1

వ్యాఖ్య: వాగర్థావివ (వాక్ + అర్థౌ + ఇవ) - శబ్దము, అర్థము వలె; సంపృక్తౌ - నిత్యసంబంధముగలవారును, జగతః - లోకమునకు, పితరౌ - తల్లి దండ్రులైనవారును అగు, పార్వతీపరమేశ్వరౌ - పార్వతీపరమేశ్వరులను, వాగర్థ ప్రతిపత్తయే - (వాక్ + అర్థ + ప్రతిపత్తయే) వాగర్థ - శబ్దార్థములయొక్క, ప్రతిపత్తయే - జ్ఞానముకొఱకు, వందే - నమస్కరించుచున్నాను. జగత్తుకు పితరులై శబ్దార్థములవలె నిత్యసంబంధముగల పార్వతీపరమేశ్వరులను శబ్దార్థజ్ఞానముకొఱకై నమస్కరించుచున్నాను అని భావము. "నిత్యః శబ్దార్థ సంబంధః" అని మీమాంసకులు శబ్దార్థములకు నిత్యసంబంధమును అంగీకరింతురు. ఈ శ్లోకమునందలి అలంకారము 'ఉపమ'. అమృతబీజమైన 'వ'కారముతో ఈకావ్య మారంభింపబడి నందున ఇది శుభప్రదము.

శ్లో. క్వ సూర్యప్రభవో వంశః క్వచాల్పవిషయా మతిః,
తితీర్షుః దుస్తరం మోహాదుడుపేనాస్మి సాగరమ్. 2

వ్యాఖ్య : సూర్యప్రభవః - సూర్యుడు మూలకారణముగాగల, వంశః - వంశము, క్వ - ఎక్కడ ! అల్పవిషయా - కొద్ది విషయములనుమాత్రమేయెఱిగిన, మతిః - నాబుద్ధి, క్వ - ఎక్కడ ! దుస్తరం - దాటుటకు సాధ్యముకాని, సాగరం - సముద్రమును, మోహాత్ - అజ్ఞానమువలన, ఉడుపేన - చిన్న తెప్పతో, తితీర్షుః - దాటగోరుచున్నవాడను, అస్మి - అగుచున్నాను. మహత్తరమైన సూర్యవంశ మెక్కడ ? అల్పజ్ఞుడనైన నేనెక్కడ ? అజ్ఞానమున సముద్రమును తెప్ప కొయ్యతో దాటదలచుకొంటున్నాను అని భావము. 'క్వ' అను రెండు అవ్యయ పదములు సూర్యవంశముయొక్క ఆధిక్యమును సూచించును. 'ఉడుపము' అనగా తెప్ప, లేదా చర్మముతో వెదురుబద్దలను దొప్ప ఆకారముతో కట్టిన పుట్టి. దీనిని 'అరిగిలి' అని కూడా అందురు.

శ్లో. మందః కవియశఃప్రార్థీ గమిష్యా మ్యపహాస్యతాం,
ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహు రివ వామనః. 3

వ్యాఖ్య : మందః - మూఢుడనైన (నేను), కవియశఃప్రార్థీ - కవులకు వచ్చు కీర్తిని కోరుచున్నవాడనై, ప్రాంశులభ్యే - ఎత్తుగానున్న వానిచేత పొంద దగిన, ఫలే - పండు విషయమున, లోభాత్ - ఆశవలన, ఉద్బాహుః - పైకి ఎత్తిన చేతులు గల, వామనః ఇవ - పొట్టివానివలె, అపహాస్యతాం - నగు బాటును, గమిష్యామి - పొందగలను. ప్రతివానికిని తాను కవిగా పేరు పొంద వలెనన్న యాశ ఉండును. అట్టి యాశకు లోనై అందని పండ్ల కట్టలు చాచు పొట్టివానివలె నగుబాటు పాలగుదునని భావము. ఇందలి 'కవి' శబ్దము ఆదికవి వాల్మీకిని సూచించుననియు, ఆయన రచించిన రామాయణకథను తాను రచింప బూనుట హాస్యాస్పదమనియు, తెల్పుచు కాళిదాసు తన వినయమును వాల్మీకిని దృష్టిలో నుంచుకొని తెల్పెనేగాని సామాన్య కవులను దలచి కాదు.

శ్లో. అథవా కృతవాగ్ద్వారే వంశేఽస్మిన్ పూర్వసూరిభిః,
మణౌ వజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మే గతిః. 4

వ్యాఖ్య : అథవా - లేదా, పూర్వసూరిభిః - పూర్వకవులచేత, కృత వాగ్ద్వారే — కృత - చేయబడిన, వాగ్ద్వారే - వాగ్రూపమైన ద్వారము గల, అస్మిన్ వంశే - ఈ వంశమునందు, వజ్రసముత్కీర్ణే - వజ్రముచేత బెజ్జము వేయబడిన, మణౌ - మణియందు, సూత్రస్యేవ (సూత్రస్య + ఇవ) - దారమ్ము

నకువలె, మే - నాకు, గతిః - గమనము, అస్తి - కలదు. పూర్వకవు లనగా వాల్మీకి ప్రభృతులు; వజ్రము అనగా మణులకు రంధ్రముచేయు సూది; వర్ణనీయమైన రఘువంశ రచనయందు నావాక్కు, రంధ్రములున్న మణులలో దారము దూరినట్లు ముందుకు సాగిపోవునని భావము.

శ్లో. సోఽహ మాజన్మ శుద్ధానా మాఫలోదయ కర్మణామ్,
ఆసముద్ర క్షితీశానా మానాక రథవర్త్మనామ్. 5

వ్యాఖ్య : (ఈ శ్లోకమునుండి "రఘూణామన్వయం వక్ష్యే" అను శ్లోకము వరకు ఒకే అన్వయము. అంతవరకును విశేషణములతో కూడిన ఒక పెద్ద వాక్యము). సోఽహం - (సః + అహం) - అట్టి నేను, ఆజన్మశుద్ధానాం - పుట్టుక మొదలుకొని పరిశుద్ధులైనవారును, ఆఫలోదయకర్మణాం - ఫలితము సిద్ధించువఱకు కర్మాచరణము చేయువారును, ఆసముద్రక్షితీశానాం - సముద్ర పర్యంతమైన భూమికి రాజులైనవారును, ఆనాకరథవర్త్మనాం - స్వర్గలోకపర్యంతము తము తము రథమార్గముగల వారును. "ఆజన్మ, ఆఫలోదయ, ఆసముద్ర, ఆనాక" అనుపదములలోని 'ఆ' కారము 'ఆఙ్' అను ఉపసర్గలోనిది. దీనికి, మర్యాద (హద్దు), అభివిధి (హద్దును కూడ కలుపుకొని) అనునవి అర్థములు. ఇచ్చట అభివిధి. 'ఆజన్మ' అనగా గర్భోత్పత్తి నుండియే వైదిక సంస్కారముల చేత శుద్ధులు అనియు, 'ఆసముద్ర' - సముద్రములనుకూడ కలుపుకొని అనియు, 'ఆనాక' అనగా స్వర్గమునందు కూడా వీరి రథములకు మార్గము కలదనియు భావము.

శ్లో. యథావిధి హుతాగ్నీనాం యథా కామార్చితార్థినామ్,
యథాపరాధ దండానాం యథా కాల ప్రబోధినామ్. 6

వ్యాఖ్య : యథావిధి - శాస్త్రప్రకారము, హుతాగ్నీనాం - హోమము చేయబడిన అగ్నులు కలవారును, యథాకామ - వారి కోరిక ననుసరించి, అర్చిత - పూజింపబడిన, అర్థినాం - యాచకులు గలవారును, యథాపరాధ - అపరాధమునకు తగినట్టి, దండానాం - దండనము గల వారును, యథాకాల - కాలము నతిక్రమింపక, ప్రబోధినాం - మేల్కొను నట్టి వారును. ఏ పాదమున కాపాదము ఒక్క సమాసము. విధిం అనతిక్రమ్య - యథావిధి; కామం అనతిక్రమ్య - యథాకామం; అపరాధం అనతిక్రమ్య - యథాపరాధం; కాలం అనతిక్రమ్య -

యథాకాలం; ఈ యథావిధ్యాదులు తమ ఉత్తరపదములైన హుతాదులతో సమాసమును పొందును. ఈ నాలుగు విశేషణములచేత రఘువంశ రాజులయొక్క దేవతాపూజ, అర్థి సత్కారము, దుష్టశిక్షణ శిష్టరక్షణములు, ప్రజా పాలన సమయ జాగరూకత, చెప్పబడినవి.

శ్లో. త్యాగాయ సంభృతార్థానాం సత్యాయ మితభాషిణామ్,
యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినామ్. 7

వ్యాఖ్య: త్యాగాయ - సత్పాత్రదానము కొఱకే, సంభృతార్థానాం - ప్రోగు చేయబడిన ధనము కలవారును, సత్యాయ సత్యపాలనము కొఱకే, మితభాషిణాం- మితముగా మాట్లాడువారును, యశసే - కీర్తికొఱకే, విజిగీషూణాం - విజయేచ్ఛ గలవారును, ప్రజాయై - సంతానము కొఱకే, గృహమేధినాం - వివాహమాడు వారును (భార్యను చేరువారును). "జాయాచ గృహిణీ గృహమ్" అను నిఘంటువు వలన 'గృహం' అనగా భార్య. గృహైఃదారైఃమేధంతే సంగచ్ఛంతే ఇతి గృహమేధినఃఅని వ్యుత్పత్తి. గృహమేధి అనగా వివాహితుడు. ఈ విశేషణముల చేత రఘువంశపు రాజుల పరోపకారము, సత్యప్రియత్వము, యశఃపరత్వము, పరిశుద్ధత్వము చెప్పబడినవి.

శ్లో. శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణామ్,
వార్ధకే మునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజామ్. 8

వ్యాఖ్య: శైశవే - బాల్యమునందు, అభ్యస్తవిద్యానాం - నేర్చుకొనబడిన విద్యలు కలవారును, యౌవనే - యౌవన దశయందు, విషయైషిణాం - భోగ్య వస్తువులను కోరువారును, వార్ధకే - ముదుసలితనమునందు, మునివృత్తీనాం - వానప్రస్థాశ్రమమును స్వీకరించి, మునులవలె జీవించువారును, అంత్యే - మరణ సమయమున, యోగేన - యోగాభ్యాస పాటవముచేత, (పరమాత్మ ధ్యానముచేత) తనుత్యజాం - శరీరమును విడుచు వారును;

శ్లో. రఘూణా మన్వయం వక్ష్యే తనువాగ్విభవోఽపిసన్,
తద్గుణైఃకర్ణమాగత్య చాపలాయ ప్రచోదితః. 9

వ్యాఖ్య: తనువాగ్విభవోఽపిసన్—తను - స్వల్పమైన, వాగ్విభవః - వాణీప్రసారము గలవాడను, సన్అపి - అగుచున్నవాడనైనను, సోఽహం - అట్టి

నేను, తద్గుణైః - ఆ రఘువంశ రాజుల సద్గుణములచేత, కర్ణంఆగత్య - నాచెవిని చేరి, చాపలాయ - చేతగాని పనిని చేయుటకొఱకై, ప్రచోదితః - ప్రేరేపింప బడిన వాడనై, రఘూణాం - రఘువంశపు రాజులయొక్క, అన్వయం - వంశమును 'రఘువంశ' మను కావ్యమును, వక్ష్యే - చెప్పబోవుచున్నాను. వారి గుణములే నన్ను ప్రేరేపించి నాచేత రఘువంశమను మహాకావ్యమును రచింప జేయు చున్నవని భావము. "సోఽహ .... రఘూణా మన్వయం వక్ష్యే" అని చెప్ప బడిన యీయన్వయమునకు 'కులకమ్' అని పేరు. నాలుగు, లేక అంతకు ఎక్కువగానున్న శ్లోకములకు కర్తృపదము, క్రియ ఒకటిగానే ఉన్నచో అది 'కులకము' అనబడును.

శ్లో. తం సంతః శ్రోతు మర్హంతి సదసద్వ్యక్తి హేతవః,
హేమ్నః సంలక్ష్యతేఽగ్న్యౌ విశుద్ధిః శ్యామికాపి వా. 10

వ్యాఖ్య : తం - ఆరఘువంశకావ్యమును, సదసద్వ్యక్తిహేతవః (సత్ + అసత్ + వ్యక్తి + హేతవః)- గుణదోషముల ప్రకటనమునకు కారణభూతులైన, సంతః - సత్పురుషులు, శ్రోతుం - వినుటకు, అర్హంతి - తగియున్నారు. హేమ్నః - బంగారముయొక్క, విశుద్ధిః వా - నిర్మలత్వముగాని, శ్యామికాపి వా - ఇతరలోహము కలిసిన దోషముగాని, అగ్నౌ - అగ్నియందు, సంలక్ష్యతే హి - చక్కగా చూడబడునుగదా ! బంగారముయొక్క గుణదోషములు అగ్నిలో తెలిసినట్లు కావ్యమునందలి మంచిచెడ్డలు సత్పురుషులచేనఁ దెలియునని భావము. గుణదోష వివేకాధికారము సజ్జనులయిన విద్వాంసులదేకాని ఇతరులది కాదన్నది కవిహృదయము. 'హేమ్నః' అని బంగారము పేరు నెత్తుటచేత తన కావ్యము ఉత్తమోత్తమ మన్న విశ్వాసము కాళిదాసుకు కలదని ధ్వని.

శ్లో. వైవస్వతో మను ర్నామ మాననీయో మనీషిణాం,
ఆసీ న్మహీక్షితా మాద్యః ప్రణవ శ్ఛందసా మివ. 11

వ్యాఖ్య : మనీషిణాం - విద్వాంసులకు, మాననీయః - పూజ్యుడును, ఛందసాం - వేదములకు, ప్రణవఃఇవ - ఓంకారమువలె, మహీక్షితాం - రాజులకు, ఆద్యః - మొదటివాడునునై న, వైవస్వతఃనామ - వైవస్వతుడను ప్రసిద్ధిగల, మనుః - మనువు, ఆసీత్ - ఉండెను. ఒక బ్రహ్మకల్పములో పదునాలుగు మంది మనువులు మారెదరు. మనువు విశ్వపరిపాలనము చేయునట్టి ధర్మనిర్ణేత.

ఈ వైవస్వతుడు వర్తమానమనువు. సూర్యపుత్రుడు (వివస్వతః సూర్యస్య అపత్యం పుమాన్ వైవస్వతః అని వ్యుత్పత్తి). మనువులు స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్యసావర్ణిక, దక్షసావర్ణిక, బహ్మసావర్ణిక, రుద్రసావర్ణిక, ధర్మసావర్ణిక, రౌచ్య, భౌచ్యులు పదునాలుగురు. వైవస్వతుడు సూర్యవంశపు రాజుల మూలపురుషుడు.

శ్లో. తదన్వయే శుద్ధిమతి ప్రసూతః శుద్ధిమత్తరః,
దిలీప ఇతి రాజేందు రిందుః క్షీరనిధావివ. 12

వ్యాఖ్య : శుద్ధిమతి - పవిత్రమైన, తదన్వయే (తత్ + అన్వయే) - ఆ మనుపుయొక్క వంశమునందు, శుద్ధిమత్తరః - అంతకంటెను పవిత్రుడైన, దిలీపఇతి - దిలీపుడను ప్రసిద్ధిగల, రాజేందుః - రాజచంద్రుడు, క్షీరనిధౌ - పాలసముద్రమునందు, ఇందుఃఇవ - చంద్రుడువలె, ప్రసూతః - పుట్టెను. పవిత్రమైన యా మనుపుయొక్క వంశమునందు అంతకంటెను పవిత్రుడైన దిలీపుడు, పాలసముద్రమునందు చంద్రునివలె పుట్టెనని భావము, అలంకారము : ఉపమ.

శ్లో. వ్యూఢోరస్కో వృషస్కంధః సాలప్రాంశు ర్మహాభుజః,
ఆత్మకర్మక్షమం దేహం క్షాత్రో ధర్మ ఇవాశ్రితః. 13

వ్యాఖ్య : వ్యూఢోరస్కః - విశాలమైన వక్షస్థలము గలవాడును, వృషస్కంధః - ఎద్దుమూపులవంటి భుజములు గల వాడును, సాలప్రాంశుః - మద్ది చెట్టువలె ఉన్నతమైన వాడును, మహాభుజః - దీర్ఘములైన బాహువులు గల వాడును అగు ఆ దిలీపుడు, ఆత్మకర్మక్షమం - తన పనులకు తగిన, దేహం - శరీరమును, ఆశ్రితః - ఆశ్రయించిన, క్షాత్రః - క్షత్రియ సంబంధమైన, ధర్మ ఇవ - ధర్మమా యనునట్లు, స్థితః - ఉండెను. క్షాత్రధర్మము దిలీపుడుగా అవతరించినదా ఏమి ! అని తాత్పర్యము. అలంకారము ఉత్ప్రేక్ష. ఇచ్చటినుండి మూడు శ్లోకములు దిలీపవర్ణనము.

శ్లో. సర్వాతిరిక్త సారేణ సర్వతేజోభిభావినా,
స్థితః సర్వోన్నతేనోర్వీం క్రాంత్వా మేరు రివాత్మనా. 14

వ్యాఖ్య : సర్వాతిరిక్త సారేణ - సర్వభూతముల కంటెను అధికమైన బలముగలదియు, సర్వతేజోభిభావినా - అన్నిటిని తన తేజస్సుచేత తిరస్కరించు

నదియు, సర్వోన్నతేన - అన్నిటికంటెను ఉన్నతమైన, ఆత్మనా-దేహముచేత, మేరుఃఇవ - మేరుపర్వతమువలె, ఉర్వీం - భూమిని, క్రాంత్వా - ఆక్రమించి, స్థితః - ఉండెను (విశేషణములన్ని మేరుపర్వతమునకుగూడ సరిపోవును) సర్వోత్కృష్టుడై యుండెనని భావము.

అష్టాభిశ్చ సురేంద్రాణాం మాత్రాభిర్నిర్మితో నృపః,
తస్మా దభిభవత్యేష సర్వభూతాని తేజసా.

అని మనుస్మృతి. అష్టదిక్పాలకుల యంశలచేత రాజు సృజింపబడును గనుక అతడు తన బలతేజముల చేత సర్వభూతములను అణచియుంచగలడని తాత్పర్యము.

శ్లో. ఆకారసదృశప్రజ్ఞః ప్రజ్ఞయా సదృశాగమః,
ఆగమైః సదృశారంభః ఆరంభ సదృశోదయః. 15

వ్యాఖ్య: ఆకారసదృశప్రజ్ఞః - ఆకారముతో సమానమైన ప్రజ్ఞకలవాడును, ప్రజ్ఞయా - బుద్ధిశక్తితో, సదృశాగమః - సమానమైన శాస్త్రపరిశ్రమ కలవాడును, ఆగమైః - శాస్త్రములతో, సదృశారంభః - సమానమైన కర్మలు (పనులు) గల వాడును, ఆరంభ - కార్యారంభముతో, సదృశోదయః - సమానమైన ఫలసిద్ధి గల వాడును. దిలీపుడు ఆకారమునకుదగిన ప్రజ్ఞ, ప్రజ్ఞకుదగిన శాస్త్రజ్ఞానము, దానికి దగిన కార్యారంభము, దానికిదగిన అభ్యుదయము గలవాడై యుండెనట.

శ్లో. భీమకాంతైః నృపగుణైః స బభూ వోపజీవినాము,
అధృష్య శ్చాభిగమ్యశ్చ యాదో రత్నై రివార్ణవః. 16

వ్యాఖ్య: భీమకాంతైః - భయంకరములును మనోహరములునగు, నృప గుణైః - రాజగుణములచేత (తేజస్సు, పరాక్రమము మొదలయిన భయంకర గుణములును, కులశీల దాక్షిణ్యాది మనోహర గుణములును), సః - ఆ దిలీపుడు, ఉపజీవినాం - ఆశ్రితులకు, యాదోరత్నైః - మొసళ్లు మొదలయిన జలజంతువుల చేతను ముత్యములు మొదలయిన రత్నములచేతను, అర్ణవఃఇవ - సముద్రుడువలె అధృష్యః చ - తిరస్కరించుటకు వీలులేనివాడును, అభిగమ్యః చ - ఆశ్రయించు టకు వీలయినవాడును, బభూవ - అయియుండెను. అధృష్యత్వము, అభిగమ్య త్వము రాజులకును, పాలకులకును ఉండవలసిన గుణములు, అవి లేకపోయినచో

ఆశ్రితులు, ప్రజలు తలపై కెక్కుదురు. లేదా విరక్తులై దూరము పోయెదరు కనుక ఆ రెండు గుణములును గలిగియుండెనని భావము.

శ్లో. రేఖామాత్ర మపి క్షుణ్ణా దామనో ర్వ్యర్త్మనః పరమ్,
న వ్యతీయుః ప్రజా స్తస్య నియంతు ర్నేమివృత్తయః. 17

వ్యాఖ్య : నియంతుః - శిక్షకుడైన (సారథియైన), తస్య - ఆ దిలీపుని యొక్క, ప్రజాః - ప్రజలు, నేమివృత్తయః - నేమి - చక్రముల అంచుల (కమ్ముల, లేక పట్టాల) యొక్క, వృత్తయః - వర్తనమువంటి వర్తనముగల వారై (నడక), ఆ, మనోః - మనువునుండి, క్షుణ్ణాత్ - అభ్యస్తమైయున్న (నలిగియున్న), వర్త్మనః - మార్గముకంటె, రేఖామాత్రం అపి - ఒక గీటు మాత్రముకూడ, న వ్యతీయుః - ప్రక్కకు తొలగకుండిరి. వైవస్వత మనువునుండి దిలీపుని వరకు ఎన్నో తరములు గడచినవి. అయినను ఆ వంశపు రాజులు మనువు చెప్పిన ధర్మమార్గమున తాము నడచుచు తమ ప్రజలను నడిపించు చుండిరని భావము. సమర్థుడైన సారథి రథచక్రములు రేఖామాత్రముకూడ ప్రక్కకు తొలగ నట్లు దిలీపుని పాలనమున ప్రజలు ధర్మమార్గమును కొంచముకూడ అతిక్రమింప కుండిరనుట వలన రెండిటికిని ఔపమ్యము స్ఫురించును. ఉపమాలంకార ధ్వని.

శ్లో. ప్రజానా మేవ భూత్యర్థం స తాభ్యో బలి మగ్రహీత్
సహస్రగుణ ముత్సృష్టు మాదత్తే హి రసం రవిః. 18

వ్యాఖ్య : సః - ఆ దిలీపుడు, ప్రజానాం ప్రజలయొక్క, భూత్యర్థం ఏవ (భూతి + అర్థం) - అభివృద్ధి కోసమే, తాభ్యః - వారివలన, బలిం - పన్నును (వారి ఆదాయంలో ఆరవ భాగరూపమైన పన్నులను), అగ్రహీత్ - తీసుకొనెను, హి - అదియుక్తమే, రవిః - సూర్యుడు, సహస్రగుణం - వేయి రెట్లుగా, ఉత్సృష్టుం - విడుచుటకు (వర్షించుటకే), రసం - జలమును, ఆదత్తే - స్వీకరించుచున్నాడు. ప్రజావృద్ధి కార్యముల కోసమే దిలీపుడు షష్ఠాంశరూపమైన పన్నులను స్వీకరించుచుండెను. సూర్యుడు వెయ్యిరెట్లుగా వర్షించుటకే నదీతటాకాదుల జలమును తీసుకొనుచున్నాడు. "ఆదిత్యా జ్జాయతే వృష్టిః" అని ప్రమాణము. అర్థాంతరన్యాసము అలంకారము.

శ్లో. సేనా పరిచ్ఛద స్తస్య ద్వయ మేవార్థ సాధనమ్,
శాస్త్రేష్వకుంఠితా బుద్ధిః మౌర్వీ ధనుషి చాతతా. 19

వ్యాఖ్య : తస్య - ఆదిలీపునికి, సేనా - చతురంగబలము, పరిచ్ఛదః - ఉపకరణమే (ఛత్రచామరాదులవలె రాజచిహ్నము మాత్రమే), అర్థసాధనం - ప్రయోజన సాధనము మాత్రము, ద్వయమేవ - రెండే, శాస్త్రేషు - అర్థశాస్త్ర నీతిశాస్త్రాదులందు, అకుంఠితా - నిరాటంకముగా ముందుకు సాగునట్టి, బుద్ధిః - బుద్ధియు, ధనుషి - విల్లునందు, ఆతతా - ఆరోపితమైన (ఎక్కు పెట్టబడిన), మౌర్వీ - అల్లెత్రాడును. దిలీపునికి సైన్యము మొదలయినవి అలంకార ప్రాయములు మాత్రమే, కార్యసాధనమునం దతని బుద్ధియు, ధనుస్సును మాత్రమే చాలియుండె నని భావము.

శ్లో. తస్య సంవృతమంత్రస్య గూఢాకారేంగితస్య చ,
ఫలానుమేయాః ప్రారంభాః సంస్కారాః ప్రాక్తనా ఇవ.20

వ్యాఖ్య : సంవృతమంత్రస్య - దాచబడిన ఆలోచనలు గలిగినట్టియు, గూఢాకారేంగితస్య చ—గూఢ - పైకి కనబడని, ఆకార - రాగద్వేషాదులును, ఇంగిత - హృదయము నందలి మార్పును గల, తస్య - ఆ దిలీపుని యొక్క, ప్రారంభాః - పనుల ఆరంభములు (సామాన్యోపాయ ప్రయోగములు), ప్రాక్తనాః - పూర్వజన్మకు సంబంధించిన, సంస్కారాః ఇవ - కర్మవాసనలువలె, ఫలానుమేయాః - ఫలితమునుబట్టి యూహింపదగినవి మాత్రమే (ఆసన్ - అయినవి). రాజ్యపాలనమునకు సంబంధించిన ఆలోచనలను, తన మనోభావములను, తానారంభించు పనులను రహస్యముగానుంచి ఫలితము ఏర్పడినప్పుడే నలుగురికి తెలియునట్లు చేయుచుండెనని భావము. ముందుగానే ప్రకటించుట నీతిగాదని యాజ్ఞవల్క్య స్మృతి చెప్పుచున్నది :

"మంత్రమూలం యతో రాజ్య మతో మంత్రం సురక్షితమ్.
కుర్యాత్ యథాన్యే న విదుః కర్మణాం ఆఫలోదయాత్."

శ్లో. జుగోపాత్మాన మత్రస్తో భేజే ధర్మ మనాతురః
అగృధ్ను రాదదే సోఽర్థ మసక్త స్సుఖ మన్వభూత్. 21

వ్యాఖ్య : సః - ఆదిలీపుడు, అత్రస్తః - భీరువుకాకయే, ఆత్మానం - శరీరమును, జుగోప - రక్షించుకొనెను, అనాతురః - బాధలు లేనివాడైనను, ధర్మం - సుకృతమును, భేజే - ఆర్జించెను, అగృధ్నుః - లోభికాకయే, అర్థం - ధనమును, ఆదదే - స్వీకరించెను, అసక్తః - ఆసక్తిలేనివాడై, సుఖం -

సౌఖ్యమును, అన్వభూత్ - అనుభవించెను. శరీరము ఆద్యధర్మసాధనము కనుక శరీర రక్షణమును చేసుకొనెనే కాని ఇతరులకు భయపడికాదనియు, ఏదియో ఆపద వచ్చినప్పుడు కాక నిత్యము పుణ్యకర్మలు చేసెననియు, పిసినిగొట్టుతనముచే గాక రాజధర్మముగా ధనము నార్జించెననియు, ఆ యా సుఖములందు వ్యసనియై ఆస క్తుడు గాక అర్హభోగముల ననుభవించెననియు భావము.

శ్లో. జ్ఞానే మౌనం క్షమా శక్తౌ త్యాగే శ్లాఘావిపర్యయః,
గుణా గుణానుబంధిత్వా త్తస్య సప్రసవా ఇవ. 22

వ్యాఖ్య : జ్ఞానే - పరవృత్తాంతము తెలిసినప్పుడును, మౌనం-మౌనము, శక్తౌ - ప్రతీకారము చేయగలశక్తి యున్నప్పుడును, క్షమా - సహనము, త్యాగే - దానముచేయుట యందు, శ్లాఘావిపర్యయః - స్తోత్రమును కోరకుండుటయు, ఇట్లు, తస్య - ఆదిలీపుని యొక్క, గుణాః - జ్ఞానాదిగుణములు, గుణానుబంధి త్వాత్ - విరుద్ధములైన మౌనాదిగుణములతో సాహచర్యముగలవి యగుటవలన, సప్రసవాఃఇవ - సమానముగా పుట్టినవా (సోదరులా) యనునట్లు, (అభూవ - ఉండినవి). "నాన్యోపతాపి వచనం మౌనం వ్రతచరిష్ణుతా" అను కామందకవచనము ననుసరించుచు, ఇతరులను బాధించు వచనమును పలుకక మౌనము వహించు చుండెను. "శక్తానాం భూషణం క్షమా" అని చాణక్య వచనము. దానము చేసితి నని చెప్పుకొనుట తప్పు అని మను వచనము: "న దత్త్వా పరికీర్తయేత్." విరుద్ధములైనను అతనియందు అవిరోధముగా పైగుణము లుండెనని భావము. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. అనాకృష్టస్య విషయై ర్విద్యానాం పారదృశ్వనః,
తస్య ధర్మరతే రాసీత్ వృద్ధత్వం జరసా వినా. 23

వ్యాఖ్య : విషయైః - ఇంద్రియభోగ్యములైన రూపరసాదులచేత, అనా కృష్టస్య - ఆకర్షింపబడని వాడును, విద్యానాం - వేదాది విద్యలయొక్క, పార దృశ్వనః - అంతమును చూచినవాడును, ధర్మరతేః - ధర్మమునం దాసక్తికల వాడును అగు, తస్య - ఆదిలీపునికి, జరసావినా - శారీరకమైన ముసలితనము లేకయే, వృద్ధత్వం - వార్ధక్యము, ఆసీత్ - ఏర్పడెను. అతడు శరీరముచేత యౌవనవంతుడైనను జ్ఞానముచేత వృద్ధుడై 'పెద్దమనిషి' అని అనిపించుకొనెనని భావము. వృద్ధత్వము వైరాగ్యముచేతను, విద్యచేతను, జ్ఞానముచేతను, వయసు

పెరుగుటచేతను నాల్గువిధములుగానుండును. అందు మొదటి మూడు వృద్ధత్వములు అతనికి కలిగినవి అని భావము.

శ్లో. ప్రజానాం వినయాధానాత్ రక్షణాత్ భరణా దపి,
స పితా పితర స్తాసాం కేవలం జన్మహేతవః. 24

వ్యాఖ్య : ప్రజానాం - ప్రజలకు, వినయాధానాత్ (విసయ + ఆధానాత్)-సన్మార్గ ప్రవర్తనము కలిగించుట వలనను, రక్షణాత్ - భయహేతువుల నుండి కాపాడుట వలనను, భరణాత్ అపి - అన్నపానాదులచేత పోషించుట వలనను కూడ, సః - ఆదిలీపుడు, పితా - తండ్రి యయ్యెను, తాసాం - వారియొక్క, పితరః - తండ్రులు, కేవలం జన్మహేతవః - పుట్టుటకు మాత్రమే కారకులు. ప్రజలకు తమ తల్లిదండ్రులు జన్మకు మాత్రమే కారణము, శిక్షరక్షణాదులచేత దిలీపుడే తండ్రివంటివాడై యుండెనని భావము.

శ్లో. స్థిత్యై దండయతో దండ్యాన్ పరిణేతుః ప్రసూతయే,
అప్యర్థకామౌ తస్యాస్తాం ధర్మ్యౌ ఏవ మనీషిణః. 25

వ్యాఖ్య : దండ్యాన్ - దండింప దగినవారిని, స్థిత్యై - లోకస్థితికొఱకే, దండయతః - శిక్షించు చున్నట్టియు, ప్రసూతయే - సంతానముకొఱకు మాత్రమే, పరిణేతుః - వివాహమాడినట్టియు, మనీషిణః - విద్వాంసుడైన, తస్య -ఆదిలీపుని యొక్క, అర్థకామౌ అపి - అర్థ కామపురుషార్థములుకూడ, ధర్మ్యాయ + ఏవ - ధర్మము కొరకే, ఆస్తాం - అయినవి. దండింప దగినవారిని క్రోధద్వేషములచేత కాక, లోకమునందు ధర్మమును ప్రతిష్ఠించుటకొఱకే, దండించుట. "అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాం శ్చైవాప్యదండయన్, అయశో మహదాప్నోతి నరకం చాధిగచ్ఛతి" అను శాస్త్రము ననుసరించుటకే, అట్లే సంతానము కొఱకే వివాహ మాడెననుట వలన యథేచ్ఛా కామప్రవృత్తి అతనియందు లేకుండెననియు, ఆ రెండు పురుషార్థములను ధర్మ పురుషార్థమును సాధించుటకొఱకే అత డనుసరించె ననియు భావము.

శ్లో. దుదోహ గాం స యజ్ఞాయ సస్యాయ మఘవా దివం,
సంపద్వినిమయేనోభౌ దధతు ర్భువనద్వయమ్. 26

వ్యాఖ్య : సః - ఆ దిలీపుడు, యజ్ఞాయ - యజ్ఞములు చేయుటకొఱకు, గాం - భూమిని, దుదోహ - పితికెను (పన్నులు తీసుకొనెను), మఘవా -

ఇంద్రుడు, సస్యాయ - పైరును వృద్ధిపరచుట కొఱకు, దివం - స్వర్గమును, దుదోహ - వర్షరూపమున పిదికెను, ఇట్లు, ఉభౌ - ఇద్దఱును, సంపద్వినిమయేన - తమ సంపదల మార్పుచేత (ఆదాన ప్రదానములచేత), భువనద్వయం - లోక ద్వయమును (భూలోక స్వర్గలోకములు రెండిటిని), దధతుః - పోషించిరి.

"రాజా త్వర్థా౯ సమాహృత్య కుర్యా దింద్రమహోత్సవమ్,
ప్రీణితో మేఘవాహస్తు మహతీం వృష్టి మావహేత్".

అని దండనీతి. రాజు యజ్ఞాదులచేత ఇంద్రుని తృప్తిపరచినచో ఇంద్రుడు వర్షములు కురిపించును. కనుక దిలీపుడు ఆ విధముగా చేయుచు తన దేశమున అనావృష్ట్యాది దోషములను రానీయక ప్రజాపాలనము చేసెనని భావము.

శ్లో. న కిలానుయయు స్తస్య రాజానో రక్షితు ర్యశః,
వ్యావృత్తా యత్ పరస్వేభ్యః శ్రుతౌ తస్కరతా స్థితా. 27

వ్యాఖ్య : రాజానః - ఇతర రాజులు, రక్షితుః - భయములనుండి కాపాడునట్టి, తస్య - ఆ దిలీపుని యొక్క, యశః - కీర్తిని, నానుయయుః కిల (న + అనుయయుః) - అనుకరింపజాలకపోయిరిసుమా, యత్ - ఎందువల్లననగా, తస్కరతా - చౌర్యము, పరస్వేభ్యః - ఇతరుల ధనములనుండి, వ్యావృత్తా - మరలినదై, శ్రుతౌ - వాచకశబ్దమునందు మాత్రమే (తస్కర శబ్దమునందు మాత్రమే), స్థితా - నిల్చియుండినదో. దిలీపుని రాజ్యమునందు తస్కరత్వము అనగా దొంగతనము లేకుండెను. తస్కరత్వమను శబ్దము మాత్రము 'వంధ్యా పుత్ర గగనకుసుమాది' శబ్దములవలె అర్థశూన్యమై యుండెనని భావము. అందు వల్ల పరరాజులు అతని కీర్తిని దొంగిలింపలేకపోయిరి. అతనివంటి కీర్తి మంతుఁడు లేకుండెనని భావము. అలంకారము : కావ్యలింగము.

శ్లో. ద్వేష్యోఽపి సమ్మతః శిష్టః తస్యార్తస్య యథౌషధం,
త్యాజ్యో దుష్టః ప్రియోఽప్యాసీ దంగుళీ వోరగక్షతా. 28

వ్యాఖ్య : శిష్టః - సజ్జనుడు, ద్వేష్యోపి(ద్వేష్యః + అపి) - శత్రువైనను, ఆర్తస్య - రోగికి, ఔషధంయథా - మందువలె, తస్య - ఆ దిలీపునికి, సమ్మతః - ఇష్టమైనవాడు, ఆసీత్ - ఆయెను, దుష్టః - దుర్జనుడు, ప్రియోఽపి (ప్రియః + అపి)- ప్రేమాస్పదుడైనను, ఉరగక్షతా - పాముచేత కఱవబడిన, అంగుళీవ - వ్రేలువలె, త్యాజ్యః - విడువదగినవాడు, ఆసీత్ - ఆయెను- అతనికి శిష్టుడే బంధువు, దుష్టుడే శత్రువు అని భావము. అలంకారము : ఉపమ.

శ్లో. తం వేధాః విదధే నూనం మహాభూతసమాధినా,
తథాహి సర్వే తస్యాసన్ పరార్థైకఫలాః గుణాః. 29

వ్యాఖ్య : వేధాః - బ్రహ్మ, తం - ఆదిలీపుని, మహాభూతసమాధినా - పంచమహాభూతముల యొక్క కారణ సామగ్రిచేత, విదధే నూనం - సృజించి యుండవచ్చును, తథాహి - అట్లేయైయుండును, తస్య - అతనియొక్క, సర్వే గుణాః - అన్ని గుణములును, పరార్థైకఫలాః - ఇతరుల ప్రయోజనమే ఫలముగా గలవి, ఆసన్ - అయినవి. పంచభూతముల గుణములైన శబ్దస్పర్శరూపరస గంధములు పరులకే యుపయోగపడునట్లు అతని గుణములుకూడ పరప్రయోజనమే ముఖ్యముగాగల వయ్యెనని భావము. కారణ గుణములు కార్యమునందు సంక్రమించినవను న్యాయము సూచింపబడినది. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. స వేలావప్ర వలయాం పరిఖీకృత సాగరామ్,
అనన్యశాసనా ముర్వీం శశాసైకపురీ మివ. 30

వ్యాఖ్య : సః - ఆదిలీపుడు, వేలావప్రవలయాం - సముద్రపుబొడ్డు కోట గోడగా కలదియు, పరిఖీకృతసాగరాం - అగడ్తగా చేయబడిన సముద్రములు గలదియు, అనన్యశాసనాం - మరియొకని శాసనము లేనిదియు నగు, ఉర్వీం - భూమిని, ఏకపురీం ఇవ - ఒక నగరమునువలె, శశాస - ఏలెను. చతుస్సముద్ర ముద్రితమైన భూమండలమును అనాయాసముగా పాలించెనని భావము. అలంకారము : రూపకము.

శ్లో. తస్య దాక్షిణ్య రూఢేన నామ్నా మగధవంశజా,
పత్నీ సుదక్షిణే త్యాసీ దధ్వరస్యేవ దక్షిణా. 31

వ్యాఖ్య : తస్య - ఆదిలీపునికి, మగధవంశజా - మగధ వంశమునందు పుట్టినదియు, దాక్షిణ్యరూఢేన - దాక్షిణ్య గుణముచేత ప్రసిద్ధమైన (దాక్షిణ్యమనగా ఎదుటివారి చిత్తవృత్తికి అనుకూలముగా వర్తించు గుణము, మొగమోటమి) నామ్నా - పేరుచేత, సుదక్షిణేతి (సుదక్షిణా + ఇతి) - సుదక్షిణయని, అధ్వరస్య - యజ్ఞపురుషునకు, దక్షిణా ఇవ - దక్షిణయనబడు స్త్రీవలె, పత్నీ - భార్య, ఆసీత్ - ఉండెను. దిలీపునికి మహాపవిత్రురాలగు సుదక్షిణ భార్యయై యుండెను. "యజ్ఞో గంధర్వ స్తస్య దక్షిణా అప్సరసః" అని శ్రుతి. దిలీపుడు యజ్ఞపురుషునితోను, సుదక్షిణ దక్షిణతోను పోల్పబడుటచేత ఆదంపతుల ధార్మికత్వ పవిత్రత్వములు సూచితములగును. అలంకారము : ఉపమ.

శ్లో. కళత్రవంత మాత్మాన మవరోధే మహత్యపి,
తయా మేనే మనస్విన్యా లక్ష్మ్యా చ వసుధాధిపః. 32

వ్యాఖ్య: వసుధాధిపః - భూపతియైన ఆదిలీపుడు, అవరోధే - అంతఃపుర జనము, మహత్యపి (మహతి + అపి) - ఎక్కువగా ఉన్నప్పటికిని, మనస్విన్యా - దృఢచిత్తయైన (పతిచిత్తానువర్తనాది నిర్బంధములను సహించునట్టిదియైన), తయా - ఆసుదక్షిణాదేవిచేతను, లక్ష్మ్యా చ - రాజ్యలక్ష్మిచేతను, ఆత్మానం - తనను, కళత్రవంతం - భార్యగలవానినిగా, మేనే - తలచెను. 'రాజానో బహువల్లభాః' అను న్యాయముచేత అంతఃపురస్త్రీలెందఱున్నను సుదక్షిణయే పట్టపురాణి. వసుధాధిపశబ్దముచేత భూమి, రాజ్యలక్ష్మి, సుదక్షిణ ఈ ముగ్గురి చేతనే అతడు తనను కళత్రవంతునిగా భావించెను. రాజులకు భూమిని, రాజ్య లక్ష్మిని భార్యలనుగా వర్ణించుట కవిసమయము.

శ్లో. తస్యా మాత్మానురూపాయాం ఆత్మజన్మసముత్సుకః,
విలంబితఫలైః కాలం స నినాయ మనోరథైః. 33

వ్యాఖ్య: సః - అతడు, ఆత్మానురూపాయాం - తనకు తగినదియైన, తస్యాం - ఆసుదక్షిణాదేవియందు, ఆత్మజన్మసముత్సుకః - కుమారుడు పుట్టుట యందు త్వరపడువాడై, విలంబితఫలైః - ఆలస్యమయిన పుత్రప్రాప్తి రూప ఫలముగల, మనోరథైః - కోరికలతో, కాలం - కాలమును, నినాయ - గడపెను. 'ఆత్మజన్మ' అను శబ్దమునకు పుత్రుడనియు, తానే పుత్రరూపమున జన్మించుట యనియు నర్థము. "ఆత్మా వై పుత్రనామాసి" అన్న శ్రుతి రెండవ యర్థమువకు ప్రమాణము. దిలీపుడు ఎప్పుడు కుమారుడు పుట్టునాయన్న కోరిక లతో కాలము గడపుచుండెనని భావము.

శ్లో. సంతానార్థాయ విధయే స్వభుజా దవతారితా,
తేన ధూర్జగతో గుర్వీ సచివేషు నిచిక్షిపే. 34

వ్యాఖ్య: తేన - ఆ దిలీపునిచేత, సంతానార్థాయ - సంతానమే ప్రయోజన ముగాగల, విధయే - అనుష్ఠానము కొఱకు, స్వభుజాత్ - తనభుజముల నుండి, అవతారితా - దింపబడిన, జగతః - భూమి యొక్క, గుర్వీ - గొప్పదియైన, ధూః - భారము, సచివేషు - మంత్రులయందు, నిచిక్షిపే - ఉంచబడెను, దిలీపుడు సంతానార్థమై చేయవలసిన మంత్రతంత్రాద్యనుష్ఠానము కొరకై రాజ్యపాలన భార మును మంత్రులపై నుంచెనని భావము.

శ్లో. అథాభ్యర్చ్య విధాతారం ప్రయతౌ పుత్రకామ్యయా,
తౌ దంపతీ వసిష్ఠస్య గురోర్జగ్మతు రాశ్రమమ్. 35

వ్యాఖ్య: అథ - తరువాత, పుత్రకామ్యయా - పుత్రసంతానేచ్ఛచేత, తౌ దంపతీ - ఆ భార్యాభర్తలు (సుదక్షిణా దిలీపులు), ప్రయతౌ - వ్రతనియమము కలవారై, విధాతారం - బ్రహ్మను, అభ్యర్చ్య - పూజించి, గురోః - తమ కుల గురువైన, వసిష్ఠస్య - వసిష్ఠమహాముని యొక్క, ఆశ్రమం - ఆశ్రమమును గుటించి, జగ్మతుః - వెళ్లిరి. సంతానార్థులైన సుదక్షిణా దిలీపులు వసిష్ఠాశ్రమమునకు వెళ్లిరి. పుత్రసంతానార్థులు బ్రహ్మను ఉపాసింపవలెనని మంత్ర శాస్త్రజ్ఞుల నిర్ణయము. "స ఖలు పుత్రార్థిభిరుపాస్యతే" కులగురువైన వసిష్ఠుడు ఉపాయము చెప్పునని అచ్చటికి నియమ నిష్ఠలుగలవారై వెళ్లిరని భావము.

శ్లో. స్నిగ్ధ గంభీర నిర్ఘోష మేకం స్యందన మాస్థితౌ,
ప్రావృషేణ్యం పయోవాహం విద్యు దైరావతా ఇవ. 36

వ్యాఖ్య: స్నిగ్ధ గంభీర నిర్ఘోషం - మధుర గంభీరమైన ధ్వనిగల, ఏకం స్యందనం - ఒకే రథమును, ప్రావృషేణ్యం - వర్షాకాలమునందు వచ్చునట్టి, పయోవాహం - మేఘమును, విద్యుదైరావతావివ (విద్యుత్ + ఐరావతౌ + ఇవ) - మెఱుపు, జలరూపమైన ఐరావత గజము వలె, ఆస్థితౌ - అధిరోహించినవారై (తౌ దంపతీ - ఆ దంపతులు, ఆశ్రమం - వసిష్ఠాశ్రమమును గురించి, జగ్మతుః - వెళ్లిరి). ఇచ్చటినుండి 45 వ శ్లోకమువరకును పూర్వశ్లోకము నందలి "తౌ దంపతీ వసిష్ఠస్య గురోర్జగ్మతు రాశ్రమమ్" అను వాక్య మనుబంధముగా నన్వయించుకొని యర్థము నెఱుఁగవలెను. ఏకస్యందన శబ్దము ఆ దంపతుల మనోరథైక్యమును సూచించుటయేగాక, వసిష్ఠాశ్రమమునకు వినయ వినీతులై ఆడంబరము లేనివారై వెళ్లిరను విషయమునుగూడ సూచించును. అలంకారము: ఉపమ.

శ్లో. మాభూ దాశ్రమ పీడేతి పరిమేయ పురస్సరౌ,
అనుభావ విశేషాత్తు సేనాపరివృతా ఇవ. 37

వ్యాఖ్య: ఆశ్రమ పీడా - ఆశ్రమమునకు బాధ, మాభూత్ - కలుగకుండుగాక, ఇతి - అని, పరిమేయపురస్సరౌ - లెక్కపెట్టదగిన సేవకులు గలవారై, అనుభావ విశేషాత్తు - తేజోవిశేషము వలనన్నై తే, సేనాపరివృతావివ (సేనాపరి

వృతౌ + ఇవ) ఒక సైన్యముచేత చుట్టబడియున్నారా ఏమి యనునట్లు, (స్థితౌ - ఉన్నవారై, జగ్మతుః - వెళ్లిరి) వసిష్ఠాశ్రమమునకు జన సమ్మర్దమువలని బాధ కలుగకుండుటకై 'పురస్సరౌ' అనగా ముందునడచువారు, ఆశ్రమ మార్గమును చూపుటకును తమకు కావలసినంతమట్టుకును గల పరిజనులతో వెళ్లిరని భావము.

శ్లో. సేవ్యమానౌ సుఖస్పర్శైః సాలనిర్యాస గంధిభిః,
పుష్పరేణూత్కరైర్వ్యాప్తై రాధూత వనరాజిభిః. 38

వ్యాఖ్య : సుఖస్పర్శైః - ప్రియమైన స్పర్శగలవియు, సాలనిర్యాస గంధిభిః - మద్దిచెట్ల జిగురువాసన గలవియు, పుష్పరేణూత్కరైః - పుప్పొడులను చల్లుచున్నట్టివియు, ఆధూతవనరాజిభిః - కొంచము కదలింపబడిన వనపంక్తులు గలవియునైన, వాతైః - వాయువులచేత, సేవ్యమానౌ - సేవింపబడుచున్న వారై (జగ్మతుః - వెళ్లిరి). ఆ + ధూత—ఆధూత, 'ఆఙ్' అను అవ్యయ మునకు మర్యాద - హద్దు, అభివిధి - పూర్తిగా తనలో కలుపుకొని, ఈషత్ - కొంచము అను నర్థములు కలవు. కనుక ఆధూత అనగా కొంచముగా కదల్పబడిన అని యర్థము. వారి దారిలో చలని మెలని పరిమళవంతములైన వాయువులు వీచినవనియు, అది భావిశుభసూచకమనియు భావము.

శ్లో. మనోఽభిరామాః శృణ్వంతౌ రథనేమి స్వనోన్ముఖైః,
షడ్జసంవాదినీః కేకాః ద్విధాభిన్నాః శిఖండిభిః. 39

వ్యాఖ్య : రథనేమిస్వనోన్ముఖైః - రథచక్రముల ధ్వనులవలన పైకెత్తబడిన ముఖములుగల (చక్రధ్వనులు మేఘధ్వనులను భ్రమచేతనని భావము), శిఖండిభిః - నెమళ్ళచేత, ద్విధా - రెండు విధములుగా, భిన్నాః - వేరుపడినవియు, షడ్జసంవాదినీః - షడ్జస్వరమును పోలినవియు, మనోఽభిరామాః - మనస్సునకు ప్రియమైనవియు నగు, కేకాః - నెమలి కేకలను, శృణ్వంతౌ - వినుచున్నవారై (జగ్మతుః - వెళ్లిరి) మనోహరములైన నెమలి కేకలను వినియానందించుచు వెళ్లిరని భావము. 'శుద్ధము, వికృతము' అను భేదములచేత, లేదా 'చ్యుతము, అచ్యుతము' అను భేదములచేత షడ్జస్వరము రెండు విధములు. అట్లే నెమలి కేక రెండు విధములుగా నుండును కనుక 'షడ్జసంవాదినీః' అన్నాడు. 'షడ్జం మయూరో వదతి' నెమలి షడ్జస్వరమును పలుకునని శాస్త్రము. 'స రి గ మ ప ద ని' అను సప్తస్వరములను పలుకుటలో పొరపాటు రాకుండుటకై వాటిని మృగ పక్షుల స్వరములతో పోల్చి నిర్ణయించినారు శాస్త్రజ్ఞులు.

"మయూర, చాతక, చ్ఛాగ, క్రౌంచ, కోకిల, దర్దురాః,
గజశ్చ స ప్త షడ్జాదీ క్రమాదుచ్చారయంత్యమీ".

నెమిలి, వానకోయిల, మేక, క్రౌంచపక్షి (కొరకంచు), కోకిల, కప్ప, ఏనుగు, వరుసగా స ప్తస్వరములను పలుకును.

శ్లో. పరస్పరాక్షి సాదృశ్య మదూరోజ్ఝిత వర్త్మసు,
మృగద్వంద్వేషు పశ్యంతౌ స్యందనాబద్ధ దృష్టిషు. 40

వ్యాఖ్య: అదూరోజ్ఝితవర్త్మసు - దగ్గరగానే విడువబడిన మార్గము కలవియు (రథము వెళ్ళుటకు మాత్రము దారిని వదలి ప్రక్కన నిల్చుని యుండినట్టివని యర్థము), స్యందనాబద్ధదృష్టిషు - రథమునందే నిలిపియుంచబడిన చూపులు గలవియు నగు, మృగద్వంద్వేషు - లేడిజంటలయందు, పరస్పరాక్షి సాదృశ్యం - ఒకరి కన్నుల సామ్యము నొకరు, పశ్యంతౌ - చూచుచున్నవారై, (జగ్మతుః - వెళ్లిరి). గుట్టములు, రథచక్రముల ధ్వనులు చిత్రముగా గనపడుటచేత లేడి జంటలు రథమునే చూచుచు దారిప్రక్కనే నిలిచియున్నవి. ఆడులేళ్ల కనులయందు సుదక్షిణానేత్రసాదృశ్యమును దిలీపుడును, మగలేళ్ల కనులయందు దిలీపనేత్ర సాదృశ్యమును సుదక్షిణాదేవియును చూచుకొనిరని భావము. ('మృగీచ మృగశ్చ మృగౌ' అని ఏకశేషసమాసము; పిమ్మట, మృగయోః ద్వంద్వాని మృగద్వంద్వాని, తేషు మృగద్వంద్వేషు అని తత్పురుష సమాసము. అప్పుడు మృగమిథునములజంటలు అనునర్థము వచ్చును).

శ్లో. శ్రేణీబంధా ద్వితన్వద్భి ర స్తంభాం తోరణస్రజమ్,
సారసై ఃకలనిర్హ్రాదై ఃక్వచి దున్నమితాననౌ. 41

వ్యాఖ్య: శ్రేణీబంధాత్ - వరుసలుకట్టుటవలన, అ స్తంభాం - స్తంభములు లేని, తోరణస్రజం - తోరణమాలను, వితన్వద్భిః - ఏర్పరచుచున్నట్లుగా నున్న ట్టియును, కలనిర్హ్రాదైః - అవ్యక్త మధురమైన అరపులుగల, సారసైః - బెగ్గురు పక్షులచేత, క్వచిత్ - ఒకచోట, ఉన్నమితాననౌ - ఆకాశమువైపున కెత్తబడిన ముఖములు గలవారై (జగ్మతుః - వెళ్లిరి). బెగ్గురుపక్షులు ఆకసమున బారులుతీర్చి అరచుచుండగా తలలెత్తి వాటిని చూచుచు నేగిరని భావము. తోరణమనగా ఇంటి బహిర్ద్వారము (పెద్దగానుండు ప్రాకారాదుల ద్వారము). దానికి కట్టునట్టి 'స్రజము' అనగా మామిడియాకులతో లేదా పూలతో కట్టబడుదండ. దానిని యేర్పరచుచున్నవా?

ఏమి అని ఉత్ప్రేక్ష. 'ఇవ' లేనందున అది గమ్యోత్ప్రేక్ష అలంకారము. ఇది వారి ప్రయాణమునకు శుభసూచకము.

శ్లో. పవన స్యానుకూలత్వాత్ ప్రార్థనా సిద్ధి శంసినః,
రజోభి స్తురగోత్కీర్ణై రస్పృష్టాలక వేష్టనౌ. 42

వ్యాఖ్య : ప్రార్థనాసిద్ధిశంసినః - మనోరథసిద్ధిని సూచించునట్టి, పవనస్య - వాయువుయొక్క, అనుకూలత్వాత్ - అనుకూల్యమువలన, తురగోత్కీర్ణైః - గుట్టములచేత పైకిచల్లబడిన, రజోభిః - దుమ్ములచేత, అస్పృష్టాలక వేష్టనౌ - అస్పృష్ట - తాకబడని, అలక - సుదక్షిణాదేవి ముంగురులును, వేష్టన - దిలీపుని తలపాగయు గలవారై (జగ్మతుః - వెళ్లిరి). అనుకూల వాయువనగా మనము వెళ్లు దిశకే వీచునట్టిగాలి, అదియు మెల్లగానుండునది. 'పవనస్య అనుకూలత్వాత్' గాలి అనుకూలముగా నుండుటవలన అనురీతిగా అర్థమును చెప్పుటకూడ ఆచారములో నున్నది. ఇట్టిచోట్ల షష్ఠికి ప్రథమార్థము చెప్పుటవలన తెలుగుఅర్థము బాగా బోధపడును.

శ్లో. సరసీ ష్వరవిందానాం వీచి విక్షోభ శీతలమ్,
ఆమోద ముపజిఘ్రంతౌ స్వ నిశ్వాసా నుకారిణమ్. 43

వ్యాఖ్య : సరసీషు - కొలకులయందు, వీచివిక్షోభ శీతలం - అలల కదలికచేత చల్లబడినదియు, స్వనిశ్వాసానుకారిణం - తమ నిట్టూర్పుగాలిని పోలినదియునగు, అరవిందానాం ఆమోదం - తామరపూల సువాసనను, ఉపజిఘ్రంతౌ - ఆఘ్రాణించుచున్నవారై (జగ్మతుః - వెళ్లిరి) చల్లని పద్మపరిమళము నాఘ్రాణించుచు ప్రయాణముచేసిరని భావము. సుదక్షిణా దిలీపుల నిశ్వాసవాయువును కమలగంధము అనుకరించుచున్నట్లు చెప్పుటచేత ఆ దంపతులు సాముద్రిక శాస్త్ర ప్రకారము ఉత్తమజాతి స్త్రీ పురుషులని ధ్వని. ఉపమానమగు కమలగంధమునకు ఉపమేయత్వము కల్పింపబడుటచేత ఇది ప్రతీపాలంకారము.

శ్లో. గ్రామే ష్వాత్మ విసృష్టేషు యూప చిహ్నేషు యజ్వనామ్,
అమోఘాః ప్రతిగృహ్ణంతా వర్ష్యాణ పన మాశిషః. 44

వ్యాఖ్య : ఆత్మవిసృష్టేషు - తమచేత దానము చేయబడినవియు, యూప చిహ్నేషు - యూప - యజ్ఞ పశుబంధన స్తంభములు, చిహ్నేషు - గుర్తులుగా

గల, గ్రామేషు - దారిలోవచ్చు గ్రామములందు, అమోఘాః - వృథాగాపోని, యజ్వానాం ఆశిషః - యజ్ఞములు చేసిన సోమయాజుల యొక్క ఆశీర్వాదములను, అర్ఘ్యానుపదం (అర్ఘ్య + అనుపదం) - పాదోదకమును తీసుకొన్న వెంటనే, ప్రతిగృహ్ణంతౌ - స్వీకరించు చున్నవారై (జగ్మతుః - వెళ్లిరి). తామిచ్చిన బ్రాహ్మణాగ్రహారములను యూపస్తంభముల గుర్తులతో తెలుసుకొని, రథము నాపి దిగి, వారు బంధుభావములతో నిచ్చిన నీటితో కాళ్లు కడుగుకొని, వెంటనే అమోఘములైన వారి యాశీస్సులను స్వీకరించుచు ఆలస్యము చేయక వెళ్లుచుండిరని భావము. 'అర్ఘ్యం' అనగా పూజాద్రవ్యములు, పాదములు కడుగుకొనుటకై ఇచ్చు నీరు మొదలగునది.

శ్లో. హైయంగవీన మాదాయ ఘోషవృద్ధా నుపస్థితాన్,
నామధేయాని పృచ్ఛంతౌ వన్యానాం మార్గశాఖినామ్. 45

వ్యాఖ్య : హైయంగవీనం - నిన్నటి పాలలో వచ్చిన వెన్నను కఱగ బెట్టగా వచ్చిన ఆవు నేతిని (సద్యోఘృతమును), ఆదాయ - తీసికొని, ఉపస్థితాన్ - వచ్చిన, ఘోషవృద్ధాన్ - గొల్లపల్లెల పెద్దలను, వన్యానాం - అడవిలో పుట్టిన, మార్గశాఖినాం - దారిలోని చెట్లయొక్క, నామధేయాని - పేర్లను, పృచ్ఛంతౌ - అడుగుచున్నవారై, (జగ్మతుః - వెళ్లిరి). రాజు తమ పల్లెల సమీపమునందలి మార్గమున వెళ్లుచున్నట్లు తెలిసిన గ్రామస్థులు" రిక్తహస్తేన నోపేయాత్ రాజానం, దేవతాం గురుమ్" అను న్యాయము ననుసరించి, తమ కృషి ఫలితములలో నుత్తమోత్తమమైన సద్యోఘృతమును కానుకగా తీసికొని ఆయనను దర్శించిరి. వచ్చిన పెద్దలను ప్రేమతో పలుకరించుట రాజధర్మము కనుక సుదక్షిణా దిలీపు లా పెద్దలను దారియందలి చెట్లపేర్ల నడుగుచు కొంతదూరము వారితో ముచ్చటించుచు వెళ్లి వారిని తృప్తిపరచిరని భావము. ఆనాటి రాజులకును ప్రజలకును ఉండిన సాన్నిహిత్యానుబంధము లట్టివి.

శ్లో. కాప్యభిఖ్యా తయో రాసీత్ ప్రవజతో శ్శుద్ధ వేషయోః,
హిమ నిర్ముక్తయో ర్యోగే చిత్రా చంద్రమసో రివ. 46

వ్యాఖ్య : ప్రవజతోః - వెళ్లుచున్నవారును, శుద్ధవేషయోః - తెల్లని వస్త్రములు ధరించిన, తయోః - ఆ సుదక్షిణాదిలీపులకు, హిమనిర్ముక్తయోః - మంచునుండి విడువబడిన, చిత్రాచంద్రమసోః ఇవ - చిత్తానక్షత్రమునకును చంద్రునికిని

వలె, యోగేసతి - ఒకచోట చేరుట జరుగగా, కాపి (కా + అపి) - ఒకావొక, అభిఖ్యా - శోభ, ఆసీత్ - కలిగెను. తెల్లని వస్త్రములు ధరించి వెళ్లుచున్న ఆ దంపతుల కాంతి విశేషము మంచునుండి విడివడిన చిత్తా నక్షత్ర చంద్ర సంయోగమువలె అనిర్వాచ్యముగా నుండెను. చిత్రా నక్షత్రముతో చంద్రునికి సంబంధ మేర్పడినప్పుడే చైత్ర మాసము వచ్చును. శిశిరఋతువులో మంచుతో గప్పబడి యుండుటవలన కాంతి యుండదు. ఈ యుపమానమువలన ఆ దంపతులకు దుఃఖకాలము గడచి సంతోషకాలము వచ్చినట్లు సూచింపబడినది. వసంత కాలము ఉల్లాసమును గలిగించునుగదా !

శ్లో. తత్ర ద్యూభిమపతిః పత్యై ర్యయౌ ప్రియదర్శనః,
అపి లంఘిత మధ్వానం బుబుధే న బుధోపమః. 47

వ్యాఖ్య: ప్రియదర్శనః - ప్రియమైన దర్శనము గలవాడును (చూడ ముచ్చటయైన రూపము గలవాడని యర్థము), బుధోపమః - బుధుడు ఉపమానముగా గలవాడును (అనేక విషయములు తెలిసినవాడు) అగు, భూమిపతిః - దిలీప మహారాజు, పత్యై - భార్యకు, తత్తత్ - ఆయా విశేషములను, దర్శయన్ - చూపుచు, లంఘితం అపి - దాటివచ్చినదేయైనప్పటికిని, అధ్వానం - మార్గమును, న బుబుధే - ఎఱుగక పోయెను.:ప్రియురాలికి మార్గస్థవిశేషములను దెలుపు సంతోషములో దిలీపునికి మార్గము గడచినట్లే యనిపించలేదని భావము.

శ్లో. స దుష్ప్రాపయశాః ప్రాప దాశ్రమం శ్రాంత వాహనః,
సాయం సంయమినస్తస్య మహర్షే ర్మహిషీసఖః. 48

వ్యాఖ్య: దుష్ప్రాపయశాః - ఇతరులకు పొందశక్యముగాని కీర్తిగలవాడును, శ్రాంతవాహనః - అలసిన రథాశ్వములు గలవాడును, మహిషీసఖః - భార్యమాత్ర సహాయుడును అగు, సః - ఆ దిలీపుడు, సాయం - సాయంకాలమున, సంయమినః - నియమవంతుడైన, తస్య మహర్షేః - అ వసిష్ఠమహర్షియొక్క, ఆశ్రమం - ఆశ్రమమును, ప్రాపత్ - చేరెను. సుదక్షిణా దిలీపులు, అలసిపోయిన గుఱ్ఱములు గలవారై తామును అలసి సాయంకాలమునకు వసిష్ఠాశ్రమమును జేరిరని భావము.

వసిష్ఠాశ్రమ వర్ణనము :

శ్లో. వనాంతరా దుపావృత్తైః సమి త్కుశ ఫలా హరైః,
పూర్యమాణ మదృశ్యాగ్ని ప్రత్యుద్యాతై స్తపస్విభిః. 49

వ్యాఖ్య : వనాంతరాత్ - ఇతర వనమునుండి, ఉపావృత్తైః - తిరిగి వచ్చినట్టియును, సమిత్కుశఫలాహృైః - సమిధలను, దర్భలను, ఫలములను తెచ్చుకొనుచున్నట్టియును, అదృశ్యాగ్నిప్రత్యుద్యాతైః - సామాన్య దృష్టికి అదృశ్యమైన హోమాగ్నులచేత ఎదుర్కొనబడుచున్నట్టి, తపస్విభిః - మునులచేత, పూర్యమాణం - నిండింపబడుచున్న (అంతకుముందు ఎక్కువ జనంలేని ఆశ్రమం ఇప్పుడు పచ్చుచున్న మునులతో నిండిపోవు చున్నదని భావము) ఆశ్రమం - అట్టి వసిష్ఠాశ్రమమును, ప్రాపత్ - చేరెను. అని వెనుకటి శ్లోకమునందలి క్రియతో అన్వయము. యజ్ఞములు చేయునట్టి ఆహితాగ్నులు మరియొకచోటికివెళ్లి తిరిగి వచ్చునప్పుడు హోమాగ్నులు, లోకమున గ్రామాంతరమునుండి తిరిగి వచ్చిన తండ్రిని పుత్రులు ఎదుర్కొనునట్లు, ఎదుర్కొనునని వేదము చెప్పుచున్నది. "ప్రోష్యా గచ్ఛతా మాహితాగ్నినామగ్నయః ప్రత్యుద్యాంతి" యథాహ - "కామం పితరం ప్రోషితవంతం పుత్రాః ప్రత్యాధావంత్యేవ మేతమగ్నయః ప్రత్యాధావంతి సశకలాఁ దారూనివాహరఁ".

శ్లో. ఆకీర్ణ మృషిపత్నీనా ముటజ ద్వార రోధిభిః,
అపత్యై రివ నీవార భాగధేయోచితై ర్మృగైః. 50

వ్యాఖ్య : నీవారభాగధేయోచితైః - నివ్వరిధాన్యముల భాగములకు అర్హములైనవియు, ఉటజద్వారరోధిభిః - పర్ణశాలల ద్వారములను అడ్డగించుచున్నవియునగు, మృగైః - లేళ్లచేత, ఋషిపత్నీనాం - మునిపత్నులయొక్క, అపత్యైరివ - బిడ్డలచేతవలె, ఆకీర్ణం - వ్యాప్తమైన (ఆశ్రమం - ఆశ్రమమును, ప్రాపత్ - చేరెను). భాగ + ధేయ - భాగధేయ - భాగము, "నామ, రూప, భాగ" అను శబ్దములకు తమ యర్థమునందే ఈ 'ధేయ' ప్రత్యయము వచ్చును. నామధేయము, రూపధేయము, భాగధేయము అని రూపములు. మునిపత్నులవద్ద, పిల్లలవలె మారాము చేయుచున్న లేళ్లగల నాయాశ్రమము కనపడెనని భావము.

శ్లో. సేకాంతే మునికన్యాభిః తక్షణోజ్ఝిత వృత్తుకమ్,
విస్రంభాయ విహంగానా మాలవాలాంబు పాయినామ్. 51

వ్యాఖ్య : సేకాంతే - నీళ్లు పోసిన పిమ్మట, మునికన్యాభిః - మునికన్యలచేత, ఆలవాలాంబుపాయినాం - పాదుల యందలి జలమును త్రాగునట్టి, విహంగానాం - పక్షులయొక్క, విస్రంభాయ - నమ్మకము కొఱకు, తక్షణోజ్ఝిత

వృక్షకం - వెంటనే విడిచిపెట్టబడిన మొక్కలుగల, (ఆశ్రమ - ఆశ్రమమును, ప్రాపత్ - చేరెను.) చెట్లకు నీళ్ళుపోసిన పిమ్మట పాదులలో నిల్చిన నీళ్ళను త్రాగు పక్షులు బెదరిపోకుండ మునికన్యలు దూరముగా నిల్చుని యుండిరని భావము. 'వృక్షః' అనగా చెట్టు. 'వృక్షకః' అనగా బాలవృక్షము (మొక్క). ఇచ్చట సమాసమునందు ద్వితీయాంతమై వృక్షకమ్ అని కనపడుచున్నది, ఆశ్రమం అనుదానికి విశేషణము.

శ్లో. ఆతపాత్యయ సంక్షిప్త నీవారాను సిషాదిభిః,
మృగై ర్వ్యర్తిత రోమంథ ముటజాంగణ భూమిషు. 52

వ్యాఖ్య: ఆతపాత్యయ సంక్షిప్త నీవారాను (ఆతప + అత్యయ + సంక్షిప్త + నీవారాను) - ఎండ తగ్గిపోగానే ప్రోగుచేయబడిన నీవారధాన్యములగల, ఉటజాంగణ భూమిషు - పర్ణశాలలయొక్క ముంగిటి ప్రదేశములందు, నిషాదిభిః - కూర్చొనియున్న (లేళ్లు కూర్చొనుట యనగా వొక విధముగా పరుండుటయే), మృగైః - లేళ్ళచేత, వ్యర్తిరోమంథం - చేయబడుచున్న నెమరుగల (నెమరు వేయుచున్న లేళ్ళుగల, (ఆశ్రమం + ప్రాపత్ - ఆశ్రమమును చేరెను) ఆశ్రమ కుటీరముల ముందు ఆరబోసిన నివ్వరిధాన్యములను, సాయంకాలమున ప్రోగులు చేసి యుంచగా చిఱుఎండలలో ఆ కుప్పలమీద కూర్చుని లేళ్ళు నెమరు వేయుచుండెనని భావము.

శ్లో. అభ్యుత్థితాగ్ని పిశునై రతిథీ నాశ్రమోన్ముఖాన్,
పునానం పవనోద్ధూతై ర్ధూమై రాహుతి గంధిభిః. 53

వ్యాఖ్య: అభ్యుత్థితాగ్ని పిశునైః (అభ్యుత్థిత, అగ్ని, పిశునైః) - ప్రజ్వలించిన అగ్నిని సూచించునట్టియు, పవనోద్ధూతైః - (పవన, ఉద్ధూతైః) వాయువు చేత పైకి ప్రసరింప జేయబడినట్టివియు, ఆహుతి గంధిభిః - అగ్నిలో వేయబడిన హోమద్రవ్యముల వాసనగలవియునగు, ధూమైః - పొగలచేత, ఆశ్రమోన్ముఖాన్ (ఆశ్రమ, ఉన్ముఖాన్) - ఆశ్రమము వైపునకు వచ్చుచున్న, అతిథీన్ - అతిథులను, పునానం - పవిత్రము కేయుచున్న, (ఆశ్రమం - ఆశ్రమమును, ప్రాపత్ - చేరెను.) ప్రజ్వలించుచున్న అగ్నులలోని హోమద్రవ్యముల పరిమళముతో గూడిన హోమధూమములు ఆశ్రమమునకు వచ్చుచున్న అతిథులను పవిత్రము చేయుచుండెనని భావము.

శ్లో. అథ యంతార మాదిశ్య ధుర్యాన్ విశ్రామయేతి సః,
తా మవారోపయ త్పత్నీం రథా దవతతార చ. 54

వ్యాఖ్య : అథ - అనంతరము (ఆశ్రమమును చేరిన పిమ్మట), సః - ఆదిలీపమహారాజు, యంతారం - సారథిని, "ధుర్యా≈ విశ్రామయ" - గుట్టము లను విశ్రమింపజేయుము, ఇతి - అని, ఆదిశ్య - ఆజ్ఞాపించి, తాంపత్నీం - భార్యయైన ఆ సుదక్షిణాదేవిని, రథాత్ - రథమునుండి, అవారోపయత్ - దింపెను, అవతతార చ - తానుగూడ దిగెను. దిలీపుడు సారథితో గుట్టము లను విశ్రమింపఁ జేయుమని చెప్పి, సుదక్షిణాదేవిని రథమునుండి దింపి, తాను దిగెనని భావము.

శ్లో. తస్మై సభ్యాః సభార్యాయ గోప్త్రే గుప్తతమేంద్రియాః.
అర్హణా మర్హతే చక్రుః మునయో నయ చక్షుషే. 55

వ్యాఖ్య : సభ్యాః - సభయందు యోగ్యులైన వారును, గుప్తతమేంద్రి యాః - మిక్కిలి నియమింపబడిన యింద్రియములు గలవారును, (అయిన) మునయః - మునులు, సభార్యాయ - భార్యాసహితుడును, గోప్త్రే - రక్షకు డును, అర్హతే - పూజ్యుడును, నయచక్షుషే - నీతిశాస్త్ర నిర్ణీతమైన చూపుగల వాడును అగు, తస్మై - ఆ దిలీపుని కొఱకు (దిలీపునికి), అర్హణాం - పూజను, చక్రుః - చేసిరి. 'గుప్తతమేంద్రియాః' అను పదము వారి రాగద్వేషములు లేని ప్రవర్తనను తెలుపును. 'సభ్యాః' అను పదము మునులందరును ఒక సభ గావించి దిలీపునికి స్వాగతము పలికిరనియు, 'అర్హణాం' అను పదము, దిలీపుడు రాజర్షి యనియు, అసలు రాజు అష్టదిక్పాలకుల అంశ కలవాడు కావున పూజార్హు డనియు తెలుపును. మునులు దిలీపునికి చక్కని అతిథి సత్కారము చేసిరని శ్లోక భావము.

శ్లో. విధేః సాయంతన స్యాంతే స దదర్శ తపోనిధిమ్,
అన్వాసిత మరుంధత్యా స్వాహయేవ హవిర్భుజమ్. 56

వ్యాఖ్య : సాయంతనస్య - సాయంకాలమునకు సంబంధించిన, విధేః - కర్మానుష్ఠానముయొక్క, అంతే - ముగింపునందు, సః - ఆదిలీపుడు, అరుం ధత్యా - అరుంధతీదేవిచేత, అన్వాసితం - సేవింపబడియుండిన (ఉచితాసనముపై గూర్చుండబెట్టి తాను ప్రక్కన గూర్చొని యుండినదని యర్థము), తపోనిధిం -

తపస్సులకు నిధియైన వసిష్ఠుని, స్వాహయా - స్వాహాదేవిచేత, అన్వాసితం - సేవింపబడిన, హవిర్భుజం ఇవ - అగ్నిహోత్రునివలె, దదర్శ - దర్శనము చేసెను. దిలీపుడు చేరునప్పటికి వసిష్ఠుడు సాయంకాల హోమాదులను చేయు చుండుటచేత, కర్మానుష్ఠానము పూర్తియగువఱకు వేచియుండి, వసిష్ఠుడు పత్నీ సహితుడై యుచితాసనమున గూర్చున్నప్పుడు దర్శనము చేసెనని భావము. పూజ్యులైనవారు చేతిలో సమిధలను, పువ్వులను, దర్భలను, అగ్నిని, జలమును, మృత్తును, అన్నమును, పుస్తకమును పట్టుకున్నప్పుడును, జపహోమములు చేయుచున్నప్పుడును వారికి నమస్కరింపరాదని శాస్త్రము. అనగా ప్రత్యభివాదన, ఆశీర్వాదాదులను చేయుటకు వీలులేని సమయమున అభివాదనము చేయకూడదని భావము. అందుకే దిలీపుడు వేచియుండుట. అగ్నిహోత్రుని భార్యకు 'స్వాహా, ఆగ్నాయీ' అని పేర్లు.

శ్లో. తయో ర్జగృహతుః పాదాన్ రాజా రాజ్ఞీ చ మాగధీ,
తౌ గురు ర్గురుపత్నీ చ ప్రీత్యా ప్రతిననందతుః. 57

వ్యాఖ్య : మాగధీ - మగధరాజపుత్రియు, రాజ్ఞీ - రాణియునైన, సుదక్షిణాదేవియు, రాజా చ - దిలీపమహారాజును, తయోః - ఆ యరుంధతీ వసిష్ఠుల యొక్క, పాదౌ - రెండు పాదములను, జగృహతుః - పట్టుకొనిరి, గురు పత్నీ - గురు భార్యయైన అరుంధతియు, గురుశ్చ - గురువైన వసిష్ఠుడును, తౌ - వారిద్దరిని (ఆ సుదక్షిణాదిలీపులను), ప్రీత్యా - ప్రేమతో, ప్రతినన దతుః - ఆశీర్వాదములతో గౌరవించిరి. సుదక్షిణాదిలీపులు నమస్కరింపగా నరుంధతీ వసిష్ఠు లాశీర్వదించిరని భావము.

శ్లో. త మాతిథ్యక్రియా శాంత రథక్షోభ పరిశ్రమమ్,
పప్రచ్ఛ కుశలం రాజ్యే రాజ్యాశ్రమ మునిం మునిః. 58

వ్యాఖ్య : మునిః - వసిష్ఠమహాముని, ఆతిథ్యక్రియా శాంత రథక్షోభ పరిశ్రమం - అతిథి సత్కారక్రియలచేత శాంతించిన రథసంచలనమువలని అలసట కలవాడును, రాజ్యాశ్రమ మునిం - రాజ్యమను ఆశ్రమమున మునివంటివాడును అగు, తం - ఆదిలీపుని, రాజ్యే - రాజ్యమందలి, కుశలం - క్షేమమును గుఱించి, పప్రచ్ఛ - అడిగెను. వసిష్ఠుడు దిలీపునికి ఆతిథ్య మిచ్చి, అలసట తీరిన పిమ్మట అతని కుశలము నడిగెను.

"బ్రాహ్మణం కుశలం పృచ్ఛేత్ క్షత్రబంధు మనామయం,
వైశ్యం క్షేమం సమాగమ్య శూద్ర మారోగ్య మేవచ".

అని మనుస్మృతి. క్రొత్తగా కలుసుకున్నప్పుడు, బ్రాహ్మణుని 'కుశలమా ?' యనియు, క్షత్రియుని 'అనామయమా?' అనియు, వైశ్యుని 'క్షేమమా?' యనియు, శూద్రుని 'ఆరోగ్యమా?' అనియు నడుగవలెను. ఇచ్చట దిలీపుడు మునివంటి వాడు కనుక 'కుశలమా' అని యడిగెనని తెలియవలెను.

శ్లో. అథాధర్వ నిధే స్తస్య విజితారిపురః పురః,
అర్థ్యా మర్థపతి ర్వాచ మాదదే వదతాం వరః. 59

వ్యాఖ్య : అథ - అనంతరము, విజితారిపురః - జయింపబడిన శత్రు నగరములు కలవాడును, వదతాంవరః - వక్తలలో శ్రేష్ఠుడును నగు, అర్థపతిః - కుబేరునివంటి వాడగు దిలీపమహారాజు, అధర్వనిధేః - అధర్వ వేదమునకు నిధి యైన, తస్య - ఆ వసిష్ఠునియొక్క, పురః - ఎదుట, అర్థ్యం - అర్థవంతమైన, వాచం - వాక్కును, ఆదదే - స్వీకరించెను (మాటలాడుటకు మొదలు పెట్టెనని యర్థము). "విజితారిపురః, అర్థపతిః, వదతాంవరః" అను విశేషణముల వలన దిలీపునికి అంగబలము, అర్థబలము, పలుకుబడియునున్నవి. సంతానము మాత్రమే కొఱత. కనుక అధర్వవేదనిధియైన వసిష్ఠుడు తమ కులగురువు, పురోహితుడు కనుక ఆయన నాశ్రయించెనని భావము. "త్రయ్యాంచ దండనీత్యాంచ కుశలః స్యాత్ పురోహితః, అధర్వవిహితం కుర్యాత్ నిత్యం శాంతికపౌష్టికే" అని పురో హిత లక్షణము. ఋగ్యజుస్సామ వేదములు వచ్చి, దండనీతి తెలిసి, అధర్వ వేదమునందు చెప్పబడిన శాంతిక పౌష్టిక కర్మలను జరిపించుచు రాజునకు శ్రేయ మును చేకూర్చువాడు పురోహితుడు. ఆ లక్షణములన్నియు వసిష్ఠునియందు కలవు కనుక దిలీపుడతనితో తన వాంఛను దెలుపుటకు ప్రారంభించెనని తాత్పర్యము.

శ్లో. ఉపపన్నం ననుశివం సప్తస్వంగేషు యస్య మే,
దైవీనాం మానుషీణాంచ ప్రతికర్తా త్వ మాపదామ్. 60

వ్యాఖ్య : యస్య - ఏనాయొక్క, దైవీనాం - దైవికములును, మానుషీ ణాంచ - మానవులవల్ల కలిగినవియునగు, ఆపదాం - ఆపదలకు, త్వం - నీవు, ప్రతికర్తా - ప్రతిక్రియచేయువాడవైయున్నావో, (తస్య)మే - అట్టి నాకు, సప్తసు, అంగేషు - ఏడయిన రాజ్యాంగములయందు, శివం - కుశలము, ఉపపన్నంనను -

ఉండనేయున్నదికదా. నీ మహిమచేత నాకెట్టి యాపదలును లేక సుఖముగా నున్నా నని భావము. 'స్వామి, అమాత్యుడు, సుహృత్, కోశము రాష్ట్రము, దుర్గము, సైన్యము' సప్తాంగములు, 'అగ్నిభయం, వరదలు, వ్యాధులు, కఱవు, జననష్టం,' ఈ అయిదు దైవికములయిన ఆపదలు. 'ఆయుక్తులు, చోరులు, శత్రురాజులు, రాజ వల్లభులు, రాజుయొక్క లోభము' అను అయిదు మానవులవల్ల కలుగు ఆపదలు.

శ్లో. తవ మంత్రకృతో మంత్రైః దూరా త్ప్రశమితారిభిః
ప్రత్యాదిశ్యంత ఇవ మే దృష్టలక్ష్యభిదః శరాః 61

వ్యాఖ్య : దూరాత్ - దూరమునుండియే (పరోక్షముగానే), ప్రశమితారిభిః- శమింపజేయబడిన శత్రువులుగల, మంత్రకృతః, తవ, మంత్రైః - మంత్రకర్త్రైన నీయొక్క మంత్రములచేత, దృష్టలక్ష్యభిదః - కంటికి కనపడు లక్ష్యము లను మాత్రమే భేదింప గలిగిన, మే - నాయొక్క, శరాః - బాణములు, ప్రత్యా దిశ్యంతే ఇవ - నిరాకరింపబడుచున్నవా ? యనున ట్లున్నది. నీవు దూరము నుండియే నాకు శత్రుబాధ లేకుండునట్లు ప్రయోగించు మంత్రముల ముందు నా బాణములు నిరుపయోగములు సుమా! అలంకారము: ఉత్ప్రేక్ష. మంత్రకర్తయనగా శత్రు నిర్మూలనార్థమై బీజాక్షర సంపుటిచేత చేయబడు మంత్రములకు కర్త, లేక ప్రయోక్త యని యర్థము. దిలీపుని శరములు అవసరము లేకయే వసిష్ఠుని మంత్ర ములచేత శత్రువులు నిర్వీర్యులగుచుండిరని భావము, ఇది మానుషములైన ఆపత్తు లకు వసిష్ఠుడు చేయుచున్న ప్రతీకారము.

శ్లో. హవి రావర్జితం హోతః త్వయా విధివ దగ్నిషు
వృష్టి ర్భవతి సస్యానాం అవగ్రహ విశోషిణామ్. 62

వ్యాఖ్య : హే హోతః! - హోమముచేయునట్టి ఓ వసిష్ఠ మునీ! త్వయా - నీచేత, విధివత్ - శాస్త్రప్రకారముగా, అగ్నిషు - అగ్నులయందు, ఆవర్జితం - వేయబడిన, హవిః - నెయ్యి, అన్నము మొదలయిన హోమద్రవ్యము, అవగ్రహ విశోషిణాం - అనావృష్టిచేత ఎండిపోవుచున్న, సస్యానాం-పైరులకు, వృష్టిః - వర్షము, భవతి - అగుచున్నది. నీవు చేయు హోమముల వలన నా దేశమున సస్యములు ఫలించుచున్నవని భావము. యజ్ఞయాగాదు లాచరించుచు వసిష్ఠుడు దిలీ పుని రాజ్యమునందు వచ్చు దైవికములైన యాపదలను తొలగించుచుండెను.

అగ్నిలో వేసిన ఆహుతి సూర్యునిఁ జేరి వర్షహేతు వగునని మనుస్మృతి చెప్పు చున్నది.

శ్లో. "అగ్నౌ ప్రాస్తాహుతిః సమ్య గాదిత్య ముపతిష్ఠతే
ఆదిత్యా జ్జాయతే వృష్టిః వృష్టే రన్నం తతః ప్రజాః"

శ్లో. పురుషాయుష జీవిన్యో నిరాతంకా నిరీతయః
య న్మదీయాః ప్రజా స్తస్య హేతు స్త్వద్బ్రహ్మవర్చసమ్ 63

వ్యాఖ్య : మదీయాః - నావారైన, ప్రజాః - ప్రజలు, పురుషాయుష జీవిన్యః - నూరు సంవత్సరములు జీవించువారును, నిరాతంకాః - భయరహితులును, నిరీతయః - ఈతిబాధలు లేనివారును అనునది, యత్ - ఏదైతే కలదో, తస్య - దాని కంతటికిని, త్వత్ బ్రహ్మవర్చసం - నీ వ్రతాధ్యయన సంపత్తియే, హేతుః - కారణము. నా ప్రజలు భయరహితులై, ఈతిబాధలు లేనివారై నూరు సంవత్సరములు జీవించుటకు నీ తపస్సే కారణమని భావము. "శతాయుర్వై పురుషః" అను శ్రుతి వలన 'పురుషాయుషం' అనగా నూరు సంవత్సరములు జీవితకాలము. ఈ శబ్ద మిట్లే యుండును. 'పురుషాయువు' అనుట తప్పు, ఈతిబాధలు: "అతివృష్టి, అనావృష్టి, శలభములు, మూషికములు, చిలుకలు, ఒకరి కొకరు దగ్గర దగ్గరగా నున్న రాజులు" అని ఆరు విధములని కామందక నీతిసారము చెప్పుచున్నది.

శ్లో. త్వయైవం చింత్యమానస్య గురుణా బ్రహ్మయోనినా
సానుబంధాః కథం న స్యుః సంపదో మే నిరాపదః. 64

వ్యాఖ్య : బ్రహ్మయోనినా - బ్రహ్మపుత్రుడవును, గురుణా - కులగురువువునైన, త్వయా - నీ చేత, ఏవం - ఈ చెప్పిన విధముగా, చింత్యమానస్య - తలపబడుచున్నవాడను, నిరాపదః - ఆపదలు లేనటువంటివాడనునగు, మే - నాయొక్క, సంపదః - సంపదలు, సానుబంధాః - అనుస్యూతములు (అవిచ్ఛిన్నములు), కథం న స్యుః - ఎట్లు కాకుండును? బ్రహ్మపుత్రుఁడవైన నీవు నాయందు కరుణ గలిగియున్నప్పుడు నా సంపద లవిచ్ఛిన్నముగా నుండక యేమగునని భావము.

శ్లో. కింతు వధ్వాం తవైతస్యాం అదృష్ట సదృశ ప్రజమ్
న మా మవతి సద్వీపా రత్నసూరపి మేదినీ. 65

వ్యాఖ్య : కింతు - కాని, తవ - నీ యొక్క, ఏతస్యాం వధ్వాం - ఈకోడలియందు, అదృష్టసదృశప్రజం - చూడబడని తగిన సంతానము గల, మాం - నన్ను, సద్వీపాఅపి - ద్వీపములతో కూడినదైనను, రత్నసూఃఅపి - రత్నములను ప్రసవించునదైనను, మేదినీ - భూమి, న అవతి - సంతోషపెట్టుటలేదు. ఈ నీ కోడలియందు నాకుఁ దగిన పుత్రుఁ డుదయింపనందున సర్వసంపన్నమైన నా రాజ్యము నన్ను సుఖపెట్టజాలకున్నది యని దిలీపుడు తాను వచ్చిన పనిని వసిష్ఠునితో నివేదించెను.

ఇచ్చటి నుండి ఆఱు శ్లోకముల వఱకు తనకు పుత్ర సంతానము లేనందు వల్ల కలుగుచున్న విషాదమును వెల్లడించును.

శ్లో. నూనం మత్తః పరం వంశ్యాః పిండ విచ్ఛేద దర్శినః
న ప్రకామ భుజ శ్రాద్ధే స్వధా సంగ్రహ తత్పరాః. 66

వ్యాఖ్య : మత్తః, పరం - నాతరువాత, పిండవిచ్ఛేదదర్శినః - పిండదానము ఆగిపోవుటను ఊహించుచున్న, వంశ్యాః - మా వంశమువారైన పితృదేవతలు, స్వధాసంగ్రహతత్పరాః - పితృభోజన ద్రవ్యమును దాచుకొనుటయందు ఆసక్తులగుచు, శ్రాద్ధే - ఇప్పుడు నేనుపెట్టు శ్రాద్ధకర్మయందు, ప్రకామభుజః - పూర్తిగా భోజనముచేయువారు, న భవంతి - అగుటలేదు. నూనం - సత్యము. 'స్వధా' అనునది అవ్యయము- పితృభోజ్యము అనియర్థము. ఇకముందు తమకు శ్రాద్ధములు జరుగవుగదా యన్న చింతతో నిప్పుడును తృప్తిగాతినక, నేనిచ్చిన 'స్వధా' ద్రవ్యమును నాపితరులు దాచుకొనుచున్నారు. అని తన అనపత్యతను గురించి విలపించుచున్న వానివలె వసిష్ఠునితో విన్నవించెను.

శ్లో. మత్పరం దుర్లభం మత్వా నూనమావర్జితం మయా,
పయః పూర్వైః స్వనిశ్వాసైః కవోష్ణ ముపభుజ్యతే. 67

వ్యాఖ్య : మత్పరం - నా యనంతరమున, దుర్లభం - అలభ్యమని, మత్వా - తలచి, మయా - నాచేత, ఆవర్జితం - విడువబడిన, పయః - జలము, స్వనిశ్వాసైః - నిట్టూర్పులు విడుచుచున్న, పూర్వైః - మాపితరులచేత, కవోష్ణం - వెచ్చబడునట్లుగా, ఉపభుజ్యతే నూనం - స్వీకరింపబడుచున్నదని ఊహించుచున్నాను .నాయనంతరమిట్టి జలము లభింపదుగదాయను దుఃఖమునవచ్చు నిట్టూర్పులతో వారుత్రాగు తర్పణజలము వెచ్చనై పోవుచుండవచ్చునని యూహించు చున్నానని భావము.

శ్లో. సోఽహమిజ్యా విశుద్ధాత్మా ప్రజాలోప నిమీలితః,
ప్రకాశ శ్చాప్రకాశశ్చ లోకాలోక ఇవాచలః 68

వ్యాఖ్య : ఇజ్యావిశుద్ధాత్మా - యాగముచేత పరిశుద్ధమైన ఆత్మగలవాడను, ప్రజాలోపనిమీలితః - సంతానలోపముచేత మఱుగుపడిన వాడనుఅగు, సోఽహం (సః + అహం) - అట్టినేను, లోకాలోకః- చక్రవాళ మనబడెడు, అచలఃఇవ - పర్వతమువలె, ప్రకాశశ్చ - ప్రకాశముకలవాడను, అప్రకాశశ్చ - ప్రకాశములేని వాడనుకూడ, (అస్మి - అగుచున్నాను.) నాకు యాగములు చేయుటచేత దేవ ఋణము తీరినదికాని పుత్రసంతానము లేనందున పితృఋణము తీరలేదు. కనుక చక్రవాళపర్వతము లోపలిభాగమున సూర్యతేజముచేత ప్రకాశించుచును, వెలుపలి భాగమున చీకటిచేత ప్రకాశములేనిదిగను ఉన్నట్లు నేను సగము చీకటియగు జీవితము గడుపుచున్నానని భావము. "లోకాలోక శ్చక్రవాళః" అని అమరము. ఈ పర్వతము సర్వవిశ్వమును చుట్టియుండి లోపలమాత్రమే కనబడుచున్నదనియు, వెలుపలిభాగమంతయు అంధకారమే యనియు పురాణవచనము.

శ్లో. లోకాంతర సుఖం పుణ్యం తపోదాన సముద్భవమ్,
సంతతిః శుద్ధవంశ్యా హి పరత్రేహ చ శర్మణే. 69

వ్యాఖ్య : తపోదాన సముద్భవం - తపస్సు, దానము కారణములుగా కలిగిన, పుణ్యం - పుణ్యము, లోకాంతరసుఖంహి - పరలోకమునందు కలుగునట్టి సుఖము కలిగించునది మాత్రమే. శుద్ధవంశ్యా - పరిశుద్ధమైన వంశమున బుట్టిన, సంతతిః-సంతానము, పరత్ర-పరలోకమునందును, ఇహచ- ఈ లోకమునందును, శర్మణే - సుఖముకొరకు (భవతి - అగుచున్నది) తపోదానాదులవలన కలిగిన పుణ్యము పరలోకసుఖమును మాత్రమే ఇచ్చును. సత్సంతానము ఇహ పరలోక సౌఖ్యములను ప్రసాదించునుగదా యని విన్నవించెను.

శ్లో. తయా హీనం విధాతర్మాం కథం పశ్యే న్న దూయతే,
సిక్తం స్వయమివ స్నేహాత్ వంధ్య మాశ్రమ వృక్షకమ్. 70

వ్యాఖ్య : హేవిధాతః - ఓబ్రహ్మ! తయా - అట్టి సంతతిచేత, హీనం - హీనుడనై (సంతతిలేనివాడనైన),మాం - నన్ను, స్నేహాత్ - వాత్సల్యము వలన, స్వయం - సొంతముగా, సిక్తం - నీళ్లుపోయబడినదై, వంధ్యం - గొడ్డువోయిన, ఆశ్రమవృక్షకం ఇవ - నీ యాశ్రమమునందలి చిన్నచెట్టునువలె, పశ్యన్ - చూచు

చున్నవాడవై, కథం - ఎట్లు, నదూయసే - బాధపడకున్నావు ? నీవు దోహదము చేసి, పెంచినమొక్క గొడ్డువోయినట్లు, నీ యనుగ్రహ పాత్రుడనైననేను సంతాన హీనుడనై యుండగా చూచుచు నెట్లూరకున్నావని భావము. 'విధాతః !' అని సంభోధించుటవలనశక్తికలిగియు ఉపేక్షించుటను సూచించును. 'ఆశ్రమవృక్షకం' అనునది తన సర్వశ్రేయమును వసిష్ఠుని దయపై నాధారపడియున్నట్లు తెలుపును. అలంకారము ; ఉపమ.

శ్లో. అసహ్య పీడం భగవన్! ఋణ మంత్య మవేహి మే,
అరుంతుద మివాలాన మనిర్వాణస్య దంతినః. 71

వ్యాఖ్య : హే భగవన్ - ఓ భగవంతుడా ! మే - నాయొక్క, అంత్యం - చివరిదియైన, ఋణం - పితృఋణమును, అనిర్వాణస్య - స్నానము లేనట్టి, దంతినః - ఏనుగునకు, అరుంతుదం - మర్మచ్ఛేదియైన (పుండును రాపిడి చేయునట్టి) ఆలానమివ - బంధన స్తంభమువలె, అసహ్యపీడం- భరింపరాని బాధ కలగించుదానినిగా, అవేహి - తెలిసికొనుము. జలమజ్జనములేని గజము కట్టుగొయ్య వద్ద బాధపడుచున్నట్లు నేను మర్మచ్ఛేదియైన పితృఋణముచే బాధపడుచున్నానని భావము. భగవంతుడనగా ప్రాణులయొక్క ఉత్పత్తిని, వినాశమును, ఆగమనమును, గమనమును, విద్యను ఎఱిగిన తపస్సంపన్నుడు. గజమునకు మూడు పనులు ముఖ్యము. "నిర్వాణము, ఉత్థానము, శయనము". అవిలేనిచో అది బాధపడును. మానవునికి జన్మతః మూడు ఋణము లేర్పడును. అవి, "దేవఋణము, ఋషి ఋణము, పితృఋణము" అనునవి. యాగము, దానము, సంతానము అనునవి క్రమముగా ఆఋణములను తీర్చును.

శ్లో. తస్మాన్ముచ్యే యథా తాత! సంవిధాతుం తథార్హసి,
ఇక్ష్వాకూణాం దురాపేఽర్థే త్వదధీనా హి సిద్ధయః. 72

వ్యాఖ్య ; హేతాత! - ఓతండ్రీ ! తస్మాత్ - ఆ పితృఋణమునుండి, యథా - ఏ విధముగా, ముచ్యే - ముక్తుడనగుదునో, తథా - ఆవిధముగా, సంవిధాతుం - చేయుటకు, త్వం -నీవు, అర్హసి - తగియున్నావు. ఇక్ష్వాకూణాం - ఇక్ష్వాకువంశీయులకు, దురాపే - దుర్లభమైన, అర్థే - కార్యమునందు, సిద్ధయః - ఫలితములు, త్వదధీనాఃహి - నీ యధీనములేకదా! కనుక ఆ పితృఋణము నుండి నేను విముక్తుడగు మార్గమును సూచింపుము. మా ఇక్ష్వాకువంశీయులకు అసాధ్యములైన పనులు నీ యనుగ్రహముచేతనే ఫలించుచుండును గదా అని భావము.

శ్లో. ఇతి విజ్ఞాపితో రాజ్ఞా ధ్యానస్తిమిత లోచనః,
ఋణమాత్ర మృషి స్తస్థౌ సుప్తమీన ఇవ హ్రదః. 73

వ్యాఖ్య: ఇతి - ఈ విధముగా, రాజ్ఞా - దిలీప మహారాజుచేత, విజ్ఞాపితః - విన్నవింపబడిన. ఋషిః - వసిష్ఠమహర్షి, ధ్యానస్తిమిత లోచనః - ధ్యానముచేత నిశ్చలములైన కన్నులుగలవాడై, క్షణమాత్రం - క్షణకాలము, సుప్తమీనః - నిద్రించిన చేపలుగల, హ్రదః ఇవ - సరోవరమువలె, తస్థౌ - ఉండెను. ఇట్లు దీనుడై ప్రార్థించుచున్న దిలీపునిపై కరుణగలిగి సంతానము లేకపోవుటకు గల కారణము నెఱుగుటకు వసిష్ఠుడు క్షణకాలము ధ్యాన నిమగ్నుడై యుండెనని తాత్పర్యము.

శ్లో. సోఽపశ్యత్ ప్రణిధానేన సంతతేః స్తంభకారణమ్,
భావితాత్మా భువో భర్తుః అథైనం ప్రత్యబోధయత్. 74

వ్యాఖ్య: సః - ఆ వసిష్ఠముని, ప్రణిధానేన - ఏకాగ్ర చిత్తముచేత, భావితాత్మా - శుద్ధమైన ఆంతఃకరణము గలవాడై, భువః - భూమికి, భర్తుః - పతియైన దిలీపునియొక్క, సంతతేః - సంతానమునకు, స్తంభకారణం - ప్రతిబంధక కారణమును, అపశ్యత్ - కనుగొనెను, అథ - తరువాత, ఏనం - దిలీపుని, ప్రత్యబోధయత్ - తెలియువానినిగా చేసెను (దిలీపునికి తెలిపెనని యర్థము) 'ప్రణిధాన' మనగా యోగవిశేషము. అట్లు ధ్యాన నిమగ్నుఁడైన వసిష్ఠుఁడు భావితాత్ముఁడై దిలీపునికి సంతానము గలుగకుండుటకు గల కారణమును దెలిసికొని, ముందు చెప్పబోవు రీతిగా నతనికిఁ జెప్పెనని భావము.

శ్లో. పురా శక్ర ముపస్థాయ తవోర్వీం ప్రతి యాస్యతః,
ఆసీ త్కల్పతరు చ్ఛాయాం ఆశ్రితా సురభిః పథి. 75

వ్యాఖ్య: పురా - పూర్వమొకప్పుడు, శక్రం - దేవేంద్రుని, ఉపస్థాయ - సేవించి, ఉర్వీం, ప్రతి - భూలోకమును గుఱించి, యాస్యతః - వచ్చుచున్న, తవ - నీయొక్క, పథి - మార్గమునందు, కల్పతరు చ్ఛాయాం - కల్పవృక్షము యొక్కనీడను, ఆశ్రితా - ఆశ్రయించినదై, సురభిః - కామధేనువు, ఆసీత్ - ఉండెను. నీవువచ్చు దారిలో కల్పవృక్షపునీడలో కామధేనువు పండుకొని ఉండినది. ఇంద్రసమాగమానంతరము తిరిగి భూలోకమునకు వచ్చుచున్న నీవు దానిని గమనింప లేదని భావము.

శ్లో. ధర్మలోప భయా ద్రాజ్ఞీం ఋతుస్నాతా మనుస్మరన్,
ప్రదక్షిణ క్రియార్హాయాం తస్యాం త్వం సాధు నాచరః. 76

వ్యాఖ్య : ఋతుస్నాతాం - రజస్వ లానంతర స్నానము చేసి యుండిన, రాజ్ఞీం - ఈ సుదక్షిణాదేవిని, ధర్మలోప భయాత్ - ధర్మలోపము కలుగునన్న భయమువలన, అనుస్మర - తలచుకొనుచున్న వాడవగుచు, ప్రదక్షిణక్రియార్హాయాం - ప్రదక్షిణమునకు తగియున్న, తస్యాం - ఆ కామధేనువు విషయమున, త్వం - నీవు, సాధు - ప్రదక్షిణాది సత్కారమును, నాచరః (న + అచరః) - చేయలేదు.

"మృదం గాం దైవతం విప్రం ఘృతం మధు చతుష్పథమ్,
ప్రదక్షిణాని కుర్వీత విజ్ఞాతాంశ్చ వనస్పతీన్". అని శాస్త్రము.

కనుక గోవునకు ప్రదక్షిణము చేయవలెను. ఇక కామధేనువు విషయమున చెప్పవలసిన దేమున్నది? కాని దిలీపుడు ఋతుస్నాతయైన భార్యవద్దకి వెళ్లకపోవుట ధర్మమన్న ఆలోచనలోపడి, ప్రదక్షిణము చేయలేదు. ఋతుకాల భార్యాసంగము ధర్మము. దానిని ఉపేక్షించుట అధర్మము అని పరాశరస్మృతి చెప్పుచున్నది.

"ఋతుస్నాతంతు యో భార్యాం స్వస్థస్సన్ నోపగచ్ఛతి,
బాలగోఘ్నాపరాధేన విధ్యతే నాత్ర సంశయః".

కనుక ఆత్వరలో వెళ్లుచు, దిలీపుడు కామధేనువునకు ప్రదక్షిణ నమస్కారాదులు చేయక వెళ్లిన సంగతిని వసిష్ఠుడతనితో జెప్పెనని భావము.

శ్లో. అవజానాసి మాం యస్మాత్ తతస్తే న భవిష్యతి,
మత్ప్రసూతి మనారాధ్య ప్రజేతి త్వాం శశాప సా. 77

వ్యాఖ్య : యస్మాత్ - ఏకారణమువలన, మాం - నన్ను, అవజానాసి - తిరస్కరించుచున్నావో, తతః - అందువల్ల, మత్ప్రసూతిం - నా సంతానమును, అనారాధ్య -ఆరాధింపక, తే - నీకు, ప్రజా - సంతానము, నభవిష్యతి - కలుగదు, ఇతి - ఇట్లని, సా - ఆకామధేనువు, త్వాం - నిన్ను, శశాప - శపించెను ఏ సంతానార్థివై వెళ్ళుచు నన్నవమానించితివో ఆ సంతానము నాబిడ్డ నారాధింపక నీకు కలుగకుండుగాక అని శాపమిచ్చెను. కామధేనువు : దిలీపుని మనోగతము నెఱిగియే తగీన శాపమిచ్చి తద్విమోచనోపాయమును పలికినది. నీవు సంతానార్థివై నన్ను మరచితివి కనుక, నా సంతానమును సేవించిననే కాని నీకు సంతానము కలుగబోదని శాపవచన రహస్యము.

శ్లో. సశాపోనత్వయా రాజన్ నచ సారథినా శ్రుతః
నదత్యాకాశగంగాయాః స్రోత స్యుద్దామదిగ్గజే. 78

వ్యాఖ్య : హే రాజన్ - ఓ రాజా! ఉద్దామదిగ్గజే - గొలుసు లూడదీసుకొని వచ్చిపడిన దిగ్గజములు గల, ఆకాశగంగాయాః స్రోతసి - ఆకాశగంగా ప్రవాహము, నదతి (సతి) - ధ్వనించుచుండగా, సఃశాపః - ఆశాపము, త్వయా - నీచేత, నశ్రుతః - వినబడలేదు. సారథినా చ - నీ రథసారథిచేతగూడ, నశ్రుతః - వినబడలేదు. గంగాప్రవాహ ధ్వనిలో నీకు గాని, నీ సారథికిగాని ఆ శాపవచనము వినపడలేదు. దిలీపుడు అన్యమనస్కుడగుటచేత కామధేనువును చూడలేదు. శాప వచనము ఆయనకుగాని, సారథికిగాని గంగానదిలోని దిగ్గజ ఘీంకార ప్రవాహ ధ్వనులచేత వినపడలేదు. వినియున్నచో కామధేనువును క్షమాపణము కోరియుండెడివాడే. రథ వేగము వలని వాయుధ్వని కూడా దానికి తోడ్పడినది. 'ఉద్గతాః దామ్నః ఉద్దామానః' అని ఉద్దామశబ్ద వ్యుత్పత్తి. దిగ్గజములు జలక్రీడార్థమై కట్టు త్రాళ్లు తెంచుకొని వచ్చి పడినవని భావము.

శ్లో. ఈప్సితం తదవజ్ఞానాత్ విద్ధి సార్గళ మాత్మనః,
ప్రతిబధ్నాతి హి శ్రేయః పూజ్య పూజా వ్యతిక్రమః. 79

వ్యాఖ్య : తదవజ్ఞానాత్ - తత్ - ఆకామధేనువుయొక్క, అవజ్ఞానాత్ - అవమానమువలన, ఆత్మనః - నీ యొక్క, ఈప్సితం - కోరిక, సార్గళం (స + అర్గళం) - ప్రతిబంధకముతో కూడినట్టిదని, విద్ధి - తెలిసికొనుము. పూజ్యపూజా వ్యతిక్రమః - పూజింపదగిన వారియొక్క పూజకు వ్యతిరేకముగా నడచుట, శ్రేయః - శ్రేయస్సును, ప్రతిబధ్నాతి హి - అడ్డగించును గదా! ఆ కామధేనువును గుర్తింపక పోవుట నీ కోరికకు ప్రతిబంధకమైనది. పూజ్యులను గుర్తింపక పోవుట శ్రేయస్సుకు భంగకరము గదా! యని వసిష్ఠుడు దిలీపునితో ననెను. అలంకారము : అర్థాంతరన్యాసము.

శ్లో. హవిషే దీర్ఘసత్రస్య సా చేదానీం ప్రచేతసః,
భుజంగ పిహిత ద్వారం పాతాళ మధితిష్ఠతి. 80

వ్యాఖ్య : సా చ - ఆ కామధేనువు కూడ, ఇదానీం - ఇప్పుడు, దీర్ఘ సత్రస్య - చిరకాలము చేయతగిన యాగము నాచరించుచున్న, ప్రచేతసః - వరుణునియొక్క, హవిషే - ఆజ్యము మొదలయిన హోమ ద్రవ్యము కొఱకై,

భుజంగ పిహిత ద్వారం - పాములచేత అడ్డగింపబడిన ద్వారముగల, పాతాళం - పాతాళలోకమును, అధితిష్ఠతి - అధివసించియున్నది (పాతాళము నందున్నది అని యర్థము). ఇప్పుడా కామధేనువు వరుణుఁడు చేయు యాగమునకు పాలు, నేయి చేకూర్చుటకు పాతాళ లోకమునందున్నది. నీవు వెళ్ళి ప్రార్థించుటకు వీలుపడదు; కామధేనువు వద్దికి వెళ్లుటకుగాని, శాప విమోచనమునకై ప్రార్థించుటకుగాని బహు కాలము వరకు వీలులేదని భావము. దీర్ఘసత్రయాగము పూర్తి యగువరకు చాల కాలము పట్టును గదా!

శ్లో. సుతాం తదీయాం సురభేః కృత్వా ప్రతినిధిం శుచిః,
ఆరాధయ సపత్నీకః ప్రీతా కామధుఘా హి సా. 81

వ్యాఖ్య : తదీయాంసుతాం - దాని పుత్రికను (నందినీ ధేనువును), సురభేః - కామధేనువునకు, ప్రతినిధింకృత్వా - ప్రతినిధినిగా చేసుకొని, శుచిః - పవిత్రుడవును, సపత్నీకః - భార్యాసహితుడవునై, ఆరాధయ - సేవింపుము. హి - ఎందువలననగా, సా - ఆ నందిని, ప్రీతా - సంతుష్టినిఁ జెందినదై, కామ దుఘా - కోరికలను పిండునది (భవతి - అగును) ఇప్పుడు కామధేనువు బిడ్డయగు నందినీ ధేనువును దాని తల్లికి ప్రతినిధిగా భావించి సేవింపుము, అది సంతసించి నీ కోరికలిచ్చును. కామధేనువు "మత్ప్రసూతిమనారాధ్య" అని శాపమిచ్చినది కనుక నందినీసేవ అపరిహార్యము. నందినికూడా కామధేనువు వలెనే కోరికలను ఫలింపఁ జేయగలదు. శాపప్రభావము సుదక్షిణపైఁగూడ పడును గనుక సపత్నీకుడవై సేవింపుమని వసిష్ఠుడు చెప్పెను.

శ్లో. ఇతి వాదిన ఏవాస్య హోతు రాహుతి సాధనమ్,
అనింద్యా నందినీనామ ధేను రావవృతే వనాత్. 82

వ్యాఖ్య : ఇతి - ఈ విధముగా, వాదినఏవ హోతుః - హోమశీలుడైన వసిష్ఠుడు చెప్పుచుండగానే, అస్య ఆహుతి సాధనం - అతని హోమ ద్రవ్యములకు సాధనమైనట్టిదియు, నందినీనామ - నందినియను పేరుగలదియు నగు (నందయతీతి నందినీ, సంతోషపెట్టునది యని వ్యుత్పత్తి), అనింద్యాధేనుః - పూజార్హమైనగోవు, వనాత్ - వనమునుండి, ఆవవృతే - తిరిగివచ్చెను. ఇట్లు వసిష్ఠుడు చెప్పుచుండగనే పూజార్హయగు నందిని వనమునుండి ఆశ్రమమునకు తిరిగివచ్చెను.

నందినీ వర్ణనము :

శ్లో. లలాటోదయ మాభుగ్నం పల్లవ స్నిగ్ధ పాటలా,
బిభ్రతీ శ్వేత రోమాంకం సంధ్యేవ శశినం నవమ్. 83

వ్యాఖ్య : పల్లవ స్నిగ్ధ పాటలా - చిగురాకువలె నిగనిగలాడుచు కొంచెము ఎఱ్ఱగా నున్నదియు, లలాటోదయం -నొసటియందు పుట్టిన, అభుగ్నం - కొంచెము వంకర తిరిగిన, శ్వేత రోమాంకం - తెల్లని వెంట్రుకల చిహ్నమును, బిభ్రతీ - ధరించు చున్నదియునై, సంధ్యాఇవ - సంధ్యవలె, (స్థితా - ఉండిన, ధేనుః - ఆవు, ఆవవృతే - తిరిగి వచ్చెను). మెత్తని చిగురాకువలె నిగనిగలాడు ఎఱ్ఱని శరీరముగల నందినీధేనువు నుదుట చంద్రవంక ఆకారములో తెల్లని వెంట్రుకల రేఖ యున్నది. ఆది సంధ్యాకాలమున ఎఱ్ఱబారిన ఆకాశమునందు కనపడు చంద్ర రేఖవలె నున్నది. సంధ్యా కాలమున సుదక్షిణా దిలీపులు వసిష్ఠాశ్రమమును చేరి నారు. సంధ్యవలె నందినీధేనువు వచ్చినది. ఈ మొదలయిన భావనాచిత్రము గీసిన కాళిదాసు ఉపమాలంకారము ఇతరులకు సాధ్యము కానిది.

శ్లో. భువం కోష్ణేన కుండోధ్నీ మేధ్యే నావవృథా దపి,
ప్రస్రవేనాభివర్షంతీ వత్సాలోక ప్రవర్తినా. 84

వ్యాఖ్య : కోష్ణేన - కొంచెము వెచ్చనై నట్టియు, అవభృథాత్ - అవభృథ స్నానముకంటెను, మేధ్యేన - పవిత్రమైనట్టియు, వత్సాలోక ప్రవర్తినా - దూడను చూచుటచేత కలిగినట్టిదియు నగు, ప్రస్రవేణ - క్షీర స్రావముచేత, భువం - భూమిని, అభివర్షంతీ - తడుపుచున్నది యై, కుండోధ్నీ - కడవవంటి పెద్ద పొదుగుగల (ఆ నందినీధేనువు, ఆవవృతే-తిరిగివచ్చెను.) కుండంతటి పొదుగుగల ఆ నందిని వత్సముపై మనస్సు కలిగి క్షీరధారలతో నేలను తడుపుచు ఆశ్రమమునకు వచ్చెనని భావము. అవభృథము : యజ్ఞము, వ్రతము, మొదలయిన కర్మల యందవలంబించిన దీక్షాంతమునందు పుణ్యనదీ జలమున చేయుస్నానము. అది ఒక ఉత్సవముగా చేయబడును.

శ్లో. రజఃకణైః ఖురోద్ధూతైః స్పృశద్భి ర్గాత్ర మంతికాత్,
తీర్థాభిషేకజాం శుద్ధిం ఆదధానా మహీక్షితః. 85

వ్యాఖ్య ; ఖురోద్ధూతైః-గిట్టలచేత నెగురగొట్టబడిన వియు(రేపబడిన), అంతికాత్ - సమీపమునుండి, గాత్రం - శరీరమును, స్పృశద్భిః-తాకుచున్న వియునగు,

రజఃకణైః - ధూళికణములచేత, మహీక్షితః - రాజునకు, తీర్థాభిషేకజాం - తీర్థస్నానమువలన కలిగిన, శుద్ధిం - పవిత్రతను, ఆదధానా - కగించుచున్నదియై, (ధేనుః - నందిని, ఆవవృతే - తిరిగివచ్చెను.) నందినీధేనువు తన బిడ్డకోసమై వేగముగా వచ్చుటచేత గిట్టల తాకిడితో లేచిన దుమ్ము సుదక్షిణా దిలీపులను కప్పి తీర్థస్నాన పుణ్యమును వారికి లభింపజేసినదని భావము. గోరజస్నానమునకు వాయవ్య స్నానమని పేరు. "ఆగ్నేయము, వారుణము, బ్రాహ్మము, వాయవ్యము" అని స్నానము నాలుగు విధములు.

"ఆగ్నేయం భస్మనా స్నానం అవగాహ్య తు వారుణమ్,
ఆపోహిష్ఠేతి చ బ్రాహ్మం వాయవ్యం గోరజః స్మృతమ్"

శ్లో. తాం పుణ్యదర్శనాం దృష్ట్వా నిమిత్తజ్ఞస్తపోనిధిః,
యాజ్య మాశంసితావంధ్య ప్రార్థనం పున రబ్రవీత్. 86

వ్యాఖ్య: నిమిత్తజ్ఞః - శకున శాస్త్రము తెలిసిన, తపోనిధిః - వసిష్ఠుడు, పుణ్యదర్శనాం - పవిత్రమైన దర్శనముగల, తాం - ఆ నందినీ ధేనువును, దృష్ట్వా - చూచి, ఆశంసితావంధ్య ప్రార్థనం - మనోరథ సాఫల్యముగల యాచన చేసిన, యాజ్యం - తనచే యజ్ఞాదులు చేయింపబడు దిలీపుని గురించి, పునః - మరల, అబ్రవీత్ - చెప్పెను. దిలీప వసిష్ఠులకు యాజ్యయాజక భావము సంబంధము. యాజకుడనగా వైదికకర్మలు చేయించు పురోహితుడు. యాజ్యుడనగా అట్టి కర్మలుచేయు యజమాని. వసిష్ఠుడు తపోనిధి కనుక పరోక్షమున జరిగిన శాపమును దెలిపెను. నిమిత్తజ్ఞుడు కనుక ఇప్పుడు శకునఫలమును చెప్పుచున్నాడని భావము.

శ్లో. అదూరవర్తినీం సిద్ధిం రాజన్! విగణ యాత్మనః
ఉపస్థితేయం కళ్యాణీ నామ్నా కీర్తిత ఏవ యత్. 87

వ్యాఖ్య: హేరాజన్ - ఓ రాజా! యత్ - ఏకారణమువలన, ఇయం - ఈ, కళ్యాణీ - మంగళరూపిణియైన నందిని, నామ్నా కీర్తిత ఏవ - పేరును చెప్పుకోగానే, ఉపస్థితా - వచ్చినదో, (తత్ - ఆ కారణమువలన, ఆత్మనః - నీయొక్క, సిద్ధిం - మనోరథ సిద్ధిని, అదూరవర్తినీం - సమీపమునందున్న దానినిగా, విగణయ - లెక్కింపుము (తెలిసికొనుము). అనుకొనుచుండగనే నందినీధేనువు వచ్చినది కనుక నీ మనోరథసిద్ధి చాలా సమీపకాలమునందే కలుగునని గ్రహింపుమని భావము.

శ్లో. వన్యవృత్తి రిమాం శశ్వ దాత్మానుగమనేన గాం,
విద్యా మభ్యసనే నేవ ప్రసాదయితు మర్హసి. 88

వ్యాఖ్య : వన్యవృత్తిః - వమమునందలి కందమూలాదులే జీవనోపాయముగా గలవాడవై, ఇమాం గాం - ఈ గోవును, శశ్వత్ - సదా (ఎప్పుడును విడువక), ఆత్మానుగమనేన (ఆత్మ + అనుగమనేన)-నీ యనుసరణముచేత, అభ్యసనేన - అభ్యాసముచేత, విద్యాం, ఇవ - విద్యనువలె, ప్రసాదయితుం - ప్రసన్నురాలిని చేసికొనుటకు, అర్హసి - తగుదువు (అట్లు చేయుము). విద్యార్థివలె బ్రహ్మచర్యమును, మునులవలె వన్యఫలాహారాదులను చేయుచు నిరంతరముగా నందినిని సేవింపుమని భావము.

శ్లో. ప్రస్థితాయాం ప్రతిష్ఠేథాః స్థితాయాం స్థితి మాచర,
నిషణ్ణాయాం నిషీదా స్యాం పీతాంభసి పిబే రపః. 89

వ్యాఖ్య : అస్యాం - ఈ ధేనువు, ప్రస్థితాయాం (సత్యాం) - బయలు దేరినదికాగా, ప్రతిష్ఠేథాః - నీవు బయలుదేరుము, స్థితాయాం - నిలువబడినది కాగా, స్థితిం, ఆచర - నీవును నిలుచుండుము. నిషణ్ణాయాం - కూర్చున్నది (పడుకున్నది) కాగా, నిషీద - నీవును కూర్చుండుము, పీతాంభసి - నీరుత్రాగినదికాగా, అపః - నీళ్లను, పిబేః - త్రాగుము. అది బయలుదేరినచో నీవు బయలుదేరి, అది పడుకున్నచో నీవు కూర్చుని, అది నీరుత్రాగినవుడు నీవు నీరుత్రాగి, నిరంతరము దానిని అనుసరించి సేవించుచుండుమని గవానుసరణప్రకారము నుపదేశించెను.

శ్లో. వధూ ర్భక్తిమతీ చై నాం అర్చితా మాతపోవనాత్,
ప్రయతా ప్రాతరన్వేతు సాయం ప్రత్యుద్వ్రజే దపి. 90

వ్యాఖ్య : వధూః చ - నీ భార్యకూడా (లేదా మా యింకోడలుకూడా) భక్తిమతీ - భక్తిగలదియు, ప్రయతా - నియమము గలదియునై, అర్చితాం - తనచేత గంధ పుష్పాదులు పెట్టి పూజింపబడిన, ఏనాం - ఈ ధేనువును, ప్రాతః - ఉదయమున, ఆతపోవనాత్ - తపోవనము వటకు, అన్వేతు - వెంట వచ్చును గాక, సాయం అపి - సాయంకాలమున గూడ, ప్రత్యుద్వ్రజేత్ - (అంతదూరము వచ్చి) ఎదుర్కొనునుగాక. నీ భార్యకూడా భక్తినియమములు గలదియై ఉదయమున దానిని పూజించి వనము దాక సాగనంప వలెను, సాయంకాల మది తిరిగి వచ్చునప్పుడు స్వాగతము చెప్పవలెను. గర్భధారణ, ప్రసవాదులచేత సంతానోత్పత్తికి

ముఖ్యాధారమైన సుదక్షిణాదేవి, కామధేనుశాప ప్రభావానికి గురియై యున్నందున ఆమెయు, స్త్రీ స్వభావమునకు, శక్తికి, విరుద్ధము కానంతవఱకు నందినీధేనుసేవను చేయవలసియే యున్నదని వసిష్ఠోపదేశ సారాంశము.

శ్లో. ఇత్యాప్రసాదా దస్యా స్త్వం పరిచర్యాపరో భవ,
అవిఘ్నమస్తు తే స్థేయాః పితేవ ధురి పుత్రిణామ్. 91

వ్యాఖ్య : ఇతి - ఈ చెప్పినవిధముగా, త్వం - నీవు, ఆప్రసాదాత్ - అనుగ్రహ పర్యంతము (ప్రసన్నురాలగువఱకు), అస్యాః - ఈ ధేనువుయొక్క, పరిచర్యా పరః - సేవా తత్పరుడవు, భవ - అగుము, తే - నీకు, అవిఘ్నం - అవిఘ్నము, అస్తు - అగుగాక, పితేవ (పితా + ఇవ) - మీ తండ్రివలెనే, పుత్రిణాం - సత్పుత్రులు గల వారియొక్క, ధురి - ముందు, స్థేయాః - నిలువుము (సత్పుత్రవంతులలో అగ్రేసరుడవు కమ్ము). ఇట్లు దానికి అనుగ్రహము కలుగువరకును పరిచర్య చేయుము, ఆ పరిచర్య నిర్విఘ్నముగా సాగునుగాక, నీ తండ్రివలె నీవును పుత్రవంతులలో శ్రేష్ఠుడ వగుదువుగాక అని వసిష్ఠుడాశీర్వదించెను.

శ్లో. తథేతి ప్రతిజగ్రాహ ప్రీతిమాన్ సపరిగ్రహః,
ఆదేశం దేశకాలజ్ఞః శిష్యః శాసితు రానతః. 92

వ్యాఖ్య : దేశకాలజ్ఞః - దేశకాలములనెరిగిన వాడును, ప్రీతిమాన్ - సంతోషవంతుడును, శిష్యః - శిష్యుడునగు దిలీపుడు, సపరిగ్రహః - భార్యాసహితుడై, ఆనతః (సన్) - వినమ్రుడైనవాడగుచు, శాసితుః - గురువైన వసిష్ఠునియొక్క, ఆదేశం - ఆజ్ఞను, తథేతి (తథా ఇతి) - అట్లేయని, ప్రతిజగ్రాహ - స్వీకరించెను (దిలీపుడు సంతోషముతో గురుని యాదేశమును బదులు పలుకక సరేయని స్వీకరించెను). ఇచ్చట దేశమనగా హోమాగ్ని సన్నిధి. కాలమనగా హోమానంతర కాలము. ఆ సమయమున తపోనిధియైన వసిష్ఠుడు ఆర్షజ్ఞానముతో చెప్పుట. ఇక దానికి బదులాడక అంగీకరించుటయే దిలీపుని దేశకాలజ్ఞతకు లక్షణము, కనుకనే బదులు పలుకక ఆదేశమును స్వీకరించెనని భావము.

శ్లో. అథ ప్రదోషే దోషజ్ఞః సంవేశాయ విశాం పతిమ్,
సూనుః సూనృతవాక్ ప్రస్థుః విససర్జో ర్జితశ్రియమ్. 93

వ్యాఖ్య : అథ - తరువాత, ప్రదోషే - రాత్రిసమయమున, దోషజ్ఞః -

విద్వాంసుడును, సూనృతవాక్ - సత్యప్రియ భాషియు, స్రష్టుః - బ్రహ్మయొక్క, సూనుః - పుత్రుడైన వసిష్ఠుడు, ఊర్జిత శ్రియం - సమృద్ధమైన సంపదగల, విశాం పతిం - ప్రజాధిపతి యైన దిలీపుని, సంవేశాయ - నిద్రకొఱకై, విససర్జ - విడిచి పెట్టెను (పంపెను). వసిష్ఠ మహాముని కామధేను శాపమును, తన్నివారణోపాయ మును, నందినీ సేవాక్రమమును దిలీపునికిచెప్పి, యతడంగీకరించిన పిమ్మట ఇక వెళ్లి నిద్రింపుమని యానతిచ్చెనని భావము. "ప్రియం సత్యం చ సూనృతమ్" అని హలాయుధ నిఘంటువు.

శ్లో. సత్యా మపి తపఃసిద్ధౌ నియమాపేక్షయా మునిః,
కల్పవిత్ కల్పయామాస వన్యా మేవాస్య సంవిధామ్. 94

వ్యాఖ్య : కల్పవిత్ - వ్రత ప్రయోగము నెఱిగిన, మునిః - వసిష్ఠుడు. తపఃసిద్ధౌ - తపస్సువలన రాజయోగ్యమైన ఆహారాదికమును సంపాదించు శక్తి, సత్యాం, అపి - ఉండినప్పటికిని, నియమాపేక్షయా - ఇప్పటినుండియే వారికి వ్రత చర్య ఆరంభమగుగాక యన్న భావముచేత, అస్య - ఆ దిలీపునికి, వన్యాం ఏవ - అరణ్య లభ్యమైనదే యైన, సంవిధాం - కుశాది శయనసామగ్రిని, ఫలాధికమును కల్పయామాస - యిప్పించెను. ఆ క్షణమునుండియే సుదక్షిణా దిలీపులకు బ్రహ్మ చర్య వ్రతాదులను కల్పించెనని భావము.

శ్లో. నిర్దిష్టాం కులపతినా స పర్ణశాలాం
అధ్యాస్య ప్రయత పరిగ్రహా ద్వితీయః,
తచ్ఛిష్యాధ్యయన నివేదితావసానాం
సంవిష్టః కుశశయనే నిశాం నినాయ. 95

వ్యాఖ్య : సః - ఆ దిలీపుడు, కులపతినా - ఆశ్రమాధిపతియైన వసిష్ఠుని చేత, నిర్దిష్టాం - చూపబడిన, పర్ణశాలాం అధ్యాస్య - పర్ణశాలయందు నివసించి (ఇచ్చట సప్తమ్యర్థమున ద్వితీయా విభక్తి) ప్రయత పరిగ్రహద్వితీయః-నియమవంతు రాలైన భార్య మాత్రమే తోడుగా గలవాడై, కుశశయనే - దర్భశయ్యయందు, సంవిష్టః - నిద్రించినవాడై, తచ్ఛిష్యాధ్యయననివేదితావసానాం - ఆయన శిష్యుల వేదపఠనముచేత తెలుపబడిన అంతముగల, నిశాం - రాత్రిని, నినాయ - గడపెను. దిలీపుడు కులపతియైన వసిష్ఠుడాదేశించిన బ్రహ్మచర్యమును పాటించి దర్భ పడక

పై నిద్రించి, శిష్యుల వేదఘోషచేత ఉషఃకాలమున మేల్కొనెనని భావము. 'కుల పతి' యనగా పదివేలమంది శిష్యులకు అన్నవస్త్రములిచ్చి వేదాధ్యయనము చేయించు మహర్షి. పూర్వకాలమున శిష్యులు అపరరాత్రమందు వేదమును కంఠస్థము చేసెడు వారు. అట్లు చేయవలయునని ధర్మశాస్త్రము. "నిశాంతే న పరిశ్రాంతో బ్రహ్మాధీత్య పునఃస్వపేత్" అని మనువు; "నచాపరరాత్రమధీత్య పునఃస్వపేత్" అని గౌతముడు. (తెల్లవారుజామున చదువుకొని మరల నిద్రింపరాదు; ఒకవేళ ఎక్కువగా అలసిపోయినచో మళ్లీ నిద్రింపవచ్చును).

ఇది మహాకవి కాళిదాసకృత

రఘువంశ కావ్యమున ప్రథమసర్గమునకు తెలుఁగు లఘువ్యాఖ్య.

మహాకవి కాళిదాసకృత రఘువంశము

ద్వితీయ సర్గము

శ్లో. అథ ప్రజానా మధిపః ప్రభాతే
జాయా ప్రతిగ్రాహిత గంధమాల్యాం,
వనాయ పీతప్రతిబద్ధ వత్సాం
యశోధనో ధేను మృషే ర్ముమోచ. 1

వ్యాఖ్య : అథ - అనంతరము, యశోధనః - కీర్తియే ధనముగా భావించు వాడును, ప్రజానాం - ప్రజలకు, అధిపః - పాలకుడు నైన దిలీప మహారాజు, ప్రభాతే - మరునాటి ప్రాతఃకాలమునందు, జాయా ప్రతిగ్రాహిత గంధమాల్యాం - జాయా - భార్యయైన సుదక్షిణా దేవిచేత, ప్రతిగ్రాహిత - స్వీకరింపజేయ బడిన, గంధమాల్యాం - గంధము, పూలదండలు కలదియును, పీత ప్రతిబద్ధ వత్సాం - పాలుత్రాగినదియు తిరిగి కట్టివేయబడినదియు నగు లేఁగ గలదియునగు, ఋషేః ధేనుం - వసిష్ఠ మహర్షియొక్క గోవును (నందినీధేనువును), వనాయ - వనము నకు వెళ్లుటకై, ముమోచ - విడిచిపెట్టెను. ఇందలి 'జాయా' శబ్దము సుదక్షిణా దేవి సంతానవతి కాబోవు నంశమును సూచించును. 'ప్రభాత' శబ్దము దిలీపుని జీవి తము నందలి అంధకారము తొలగుటను సూచించును. 'యశోధన' శబ్దము దిలీ పుడు తాను సంతాన హీనుడను నపకీర్తిని భరింపజాలక రాజుకు అనర్హమైనను ఆవును కాయుటకు పూనుకొనెనను విషయమును సూచించును.

శ్లో. తస్యాః ఖురన్యాస పవిత్ర పాంసు
మపాంసులానాం ధురి కీర్తనీయా,
మార్గం మనుష్యేశ్వర ధర్మపత్నీ
శ్రుతేరివార్థం స్మృతి రన్వగచ్ఛత్. 2

వ్యాఖ్య : అపాంసులానాం - నిర్దోషురాండ్రైన స్త్రీలయొక్క, ధురి - అగ్రమున, కీర్తనీయా - చెప్పదగిన, మనుష్యేశ్వర ధర్మపత్నీ - దిలీపుని భార్య

యైన సుదక్షిణ, ఖురన్యాస పవిత్ర పాంసుం - ఖురన్యాస - గిట్టలుంచుటచేత, పవిత్రపాంసుం - పవిత్రమైన ధూళిగల. తస్యాః మార్గం - ఆ నందినీధేనువు యొక్క మార్గమును, స్మృతిః - మనుస్మృతి మొదలయిన గ్రంథములు, శ్రుతేః - వేదముయొక్క, అర్థంఇవ - అర్థమునువలె, అన్వగచ్ఛత్ - అనుసరించి వెళ్లెను వేదముయొక్క అరమునే స్మృతులు సులభమైన భాషలో చెప్పును. "మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి, పరాశరస్మృతి" మొదలయిన స్మృతి గ్రంథములు దాదాపు ముప్పదియైదు లభ్యములు. శ్రుతి స్మృతి శబ్దములు స్త్రీలింగములు. అట్లే నందినీ సుదక్షిణా శబ్దములును స్త్రీ లింగములు. శ్రుత్యర్థమును తు చ తప్పక స్మృతి చెప్పినట్లు, సుదక్షిణ నందినీధేనువు యొక్క అడుగుజాడలలో నడిచి వెళ్లెనని యర్థము. అలంకారము: ఉపమ, విరోధాభాసాలంకారము ధ్వని.

శ్లో నివర్త్య రాజా దయితాం దయాళు
స్తాం సౌరభేయీం సురభిర్యశోభిః,
పయోధరీభూత చతుస్సముద్రాం
జుగోప గోరూపధరా మివోర్వీమ్. 3

వ్యాఖ్య : దయాళుః - దయావంతుడును, యశోభిః - కీర్తులచేత, సురభిః - మనోహరుడునగు, రాజా - దిలీపుడు, దయితాం - ప్రియురాలైన సుదక్షిణను, నివర్త్య - వెనుకకుపంపి, సౌరభేయీం - కామధేనువు పుత్రికయైన, తాం - ఆ నందినీధేనువును, పయోధరీభూత - స్తనములుగా చేయబడిన, చతుస్సముద్రాం - నాలుగు సముద్రములు గలదియు, గోరూపధరాం - ఆవు రూపములోనున్న, ఉర్వీం ఇవ - భూదేవిని వలె, జుగోప - కాపాడెను. "పయోధరీభూత" పయః అనగా పాలు, తన పాలచేత అధఃకరింపబడిన సముద్రములు కలది, అనగా ఎక్కువ పాల నిచ్చునదియని ధ్వని. ఉపమాలంకారముచేత రాజు తన భూమినెట్లు సర్వవిధముల కాపాడుకొనునో అట్లు ధేనువును కాపాడెనని భావము.

శ్లో. వ్రతాయ తేనా నుచరేణ ధేనోః
న్యషేధి శేషోఽ ప్యనుయాయివర్గః,
న చాన్యత స్తస్య శరీరరక్షా
స్వవీర్యగుప్తా హి మనోః ప్రసూతిః. 4

వ్యాఖ్య : వ్రతాయ - వ్రతము కొఱకై, ధేనోః - ధేనువునకు, అను

చరేణ - సేవకుడైన, తేన - ఆ దిలీపునిచేత, శేషః - మిగిలిన, అనుయాయివర్గః అపి - అనుచరుల సమూహము కూడ, న్యషేధి - నిషేధింపబడెను, తస్య - అతనికి, శరీరరక్షా - దేహరక్షణము, అన్యతః - మరియొకని వలన, న - అక్కర లేదు. మనోః - మనువుయొక్క, ప్రసూతిః - సంతతి (క్షత్రియజాతి), స్వవీర్య గుప్తా హి - తన పరాక్రమము చేతనే రక్షింప బడునట్టిదికదా ! సుదక్షిణతో పాటు మిగిలిన అనుచర వర్గమునుగూడ వెనుకకు పంపెనని భావము.

శ్లో. ఆస్వాదవద్భిః కబళై స్తృణానాం
కండూయనై ర్దంశనివారణైశ్చ.
అవ్యాహతైః స్వైరగతైశ్చ తస్యాః
సమ్రాట్ సమారాధన తత్పరోఽభూత్. 5

వ్యాఖ్య - సమ్రాట్ - చక్రవర్తియైన ఆ దిలీపుడు, ఆస్వాదవద్భిః - రసవంతములైన, తృణానాం - గడ్డిపరకలయొక్క, కబళైః - కబళములచేతను, కండూయనైః - గోకుటలచేతను, దంశనివారణైః - ఈగలను దోలుట చేతను, అవ్యాహతైః - ఇటునటు అదల్చబడని, స్వైరగతైః చ - స్వేచ్ఛా సంచారముల చేతను, తస్యాః - దానియొక్క (ఆ నందిని యొక్క), సమారాధన తత్పరః - సేవాతత్పరుడు, అభూత్ - ఆయెను. నందినికి మనస్సు సంతోషపడునట్లు సర్వ విధములయిన పరిచర్యలను చేయుచుండెనని భావము. రాజసూయ యాగము చేసినవాడును, భూ మండలాధిపతియై రాజులందరిని శాసింప గలవాడును నగు రాజు 'సమ్రాట్టు' అనబడును.

శ్లో. స్థితః స్థితా ముచ్చలితః ప్రయాతాం
నిషేదుషీ మాసన బంధధీరః,
జలాభిలాషీ జలమాదదానాం
ఛాయేవ తాం భూపతి రన్వగచ్ఛత్. 6

వ్యాఖ్య : భూపతిః - దిలీప మహారాజు, తాం - ఆ నందినీధేనువును, స్థితాం - నిలచియున్న దానిని, స్థితః - నిలుచున్న వాడగుచును, ప్రయాతాం - నడచుదానిని, ఉచ్చలితః - నడచువాడగుచును, నిషేదుషీం - పడుకొన్న దానిని, ఆసన బంధధీరః - స్థిరముగా కూర్చొనువా డగుచును, జలం - నీటిని, ఆదదానాం - తీసుకొనుచున్న దానిని, జలాభిలాషీ - తాను నీరు త్రాగ గోరుచును,

ఛాయా ఇవ - నీడవలె, అన్వగచ్ఛత్ - అనుసరించు చుండెను. మన నీడ మనమేమి చేసిన అది దానిని చేయును. కొంచము కూడ భేదముండదు. అట్లే దిలీపుడు నంది నిని విడువక సేనించెననియు దాని యాహారనిద్రాదు లెట్లో తనవియు నట్లే నియ మించుకొనెననియు తాత్పర్యము. 'ఛాయేవ' అనునది గొప్ప యుపమానము. అలంకారము - ఉపమ.

శ్లో. స న్యస్త చిహ్నా మపి రాజలక్ష్మీం
తేజోవిశేషానుమితాం దధానః,
ఆసీ దనావిష్కృత దానరాజిః
అంతర్మదావస్థ ఇవ ద్విపేంద్రః 7

వ్యాఖ్య : న్యస్త చిహ్నాం, అపి - తీసి యుంచబడిన లాంఛనములు కలది యైనను, తేజోవిశేషానుమితాం - తేజోవిశేష - ప్రాభవాతిశయముచేత, అనుమితాం - ఊహింపబడిన, రాజ లక్ష్మీం - రాజశోభను, దధానః - ధరించుచున్న, సః - ఆ దిలీపుడు, అనావిష్కృత - బయటికి కానరాని, దానరాజిః - మదోదక స్రావము గలదియు, అంతర్మదావస్థః - లోననే యున్న మదస్థితిగల, ద్విపేంద్రః ఇవ - గజరాజు వలె, ఆసీత్ - ఉండెను (రాజచిహ్నములను ధరింపకపోయినను దిలీపుడు రాజువలెనేకనబడెను).

శ్లో. లతాప్రతానోద్గ్రథితైః స కేశైః
అధిజ్యధన్వా విచచార దావం
రక్షాపదేశా న్మునిహోమధేనోః
వన్యాన్ వినేష్యన్నివ దుష్టసత్త్వాన్. 8

వ్యాఖ్య : లతాప్రతానోద్గ్రథితైః - లతాప్రతాన - వంకరలు తీరిన తీగల చేత, ఉద్గ్రథితైః - ఎత్తి కట్టబడిన, కేశైః - శిరోజములతో, సః - అతడు, అధిజ్యధన్వా - ఎక్కుపెట్టబడిన విల్లు కలవాడగుచు, ముని హోమధేనోః - వసిష్ఠ హోమార్థమున్న నందినీధేనువు యొక్క, రక్షాపదేశాత్ - రక్షణ నెపము వలన, వన్యాన్ - అరణ్యమునందున్న, దుష్ట సత్వాన్ - క్రూరమృగములను, వినేష్యన్, ఇవ - శిక్షింపబోవువాని వలె, దావం - అరణ్యమును, విచచార - సంచరించెను. అలం : ఉత్ప్రేక్ష. నందినిని రక్షించు నెపమున వేటకానివేషము ధరించిన దిలీపుడు దుష్టమృగములను శిక్షింపబోయిన వానివలె నుండెనని భావము).

శ్లో. విసృష్ట పార్శ్వానుచరస్య తస్య
పార్శ్వద్రుమాః పాశభృతా సమస్య,
ఉదీరయామాసు రివోన్మదానా
మాలోకశబ్దం వయసాం విరావైః 9

వ్యాఖ్య : విసృష్ట పార్శ్వానుచరస్య - విడిచిపెట్టబడిన పార్శ్వానుచరులు గలవాడును, పాశభృతా - వరుణునితో, సమస్య - సమానుడైన, తస్య - ఆ దిలీపునికి, పార్శ్వద్రుమాః - దారిప్రక్కనున్న వృక్షములు, ఉన్మదానాం - మదించిన, వయసాం - పక్షులయొక్క, విరావైః - ధ్వనులచేత, ఆలోకశబ్దం - 'రాజు వచ్చున్నాడు చూడుడు' అను శబ్దమును, లేదా 'జయ' శబ్దమును, ఉదీరయామాసుః ఇవ - పలికినవా యనినట్లుండెను. రాజభటులు చేయుపనిని వృక్షములు నిర్వర్తించెనని భావము. వరుణుడు ఋగ్వేద దేవతలలో సర్వశ్రేష్ఠుడు. అతని యుపమానము దిలీపుని యుత్కర్షను తెలుపును. దిలీపుడు నడచుదారి ప్రక్కన వృక్షములు, వానిపైని పక్షుల కిలకిలారావము లుండుట సహజము. వాటిని రాజు నడచునప్పుడు ప్రక్కననడచు సేవకులు పలుకు 'చూడుడు, తొలగుడు, జయ జయ' అను శబ్దములుగా చెప్పుటచే నిది ఉత్ప్రేక్షాలంకారము.

శ్లో. మరుత్ప్రయుక్తాశ్చ మరుత్సఖాభం
త మర్చ్యమారా దభివర్తమానం,
అవాకిరన్ బాలలతాః ప్రసూనైః
ఆచారలాజై రివ పౌరకన్యాః. 10

వ్యాఖ్య : మరుత్ప్రయుక్తాః - వాయువుచేత ప్రేరేపింపబడిన, బాలలతాశ్చ - లేతతీగలుకూడ, ఆరాత్ - సమీపమునందు, అభివర్తమానం - నడిచి వెళ్లుచున్నట్టియును, మరుత్సఖాభం - వాయుమిత్రుడైన యగ్నివలె ప్రకాశించుచున్నవాడును, అర్చ్యం - పూజనీయుడైన, తం - ఆ దిలీపమహారాజును, ప్రసూనైః - పువ్వులచేత, పౌరకన్యాః - పట్టణములందలి కన్యలు, ఆచారలాజైః ఇవ - రాజు బయటికి వెళ్లునప్పుడు చల్లు వరిపేలాల చేతవలె, అవాకిరన్ - చల్లినవి. గాలికి కదలుచున్న తీగలు పువ్వులను రాజుపై రాల్పగానవి పౌరకన్యలు చల్లు పేలాలవలె నుండెనట, దిక్పాలకాంశ గల రాజు అగ్నితుల్యుడు, అగ్ని మరుత్సఖుడు కనుక మిత్రుని గౌరవింపుడని మరుత్తు లతా కన్యలను ప్రేరేపించెను. అగ్ని సర్వదా పూజ్యుడు.

ఇచ్చట లతలకు పౌరకన్యోపమానము మిక్కిలి శ్లాఘింపదగినట్టిది. కవి సూక్ష్మ దృష్టిని వెల్లడించును. పౌరస్త్రీలన్నచో స్వారస్యముండదు. వారు పరాంగనలు కావచ్చును. రాజును చూచి సిగ్గుపడవచ్చును. కన్య లట్లుకాదు.

శ్లో. ధనుర్భృతోఽప్యస్య దయార్ద్రభావం
ఆఖ్యాత మంతఃకరణై ర్విశంకైః,
విలోకయంత్యో వపురాపు రక్ష్ణాం
ప్రకామవిస్తారఫలం హరిణ్యాః. 11

వ్యాఖ్య : ధనుర్భృతః, అపి - ధనుర్ధరుడై యున్నప్పటికిని, విశంకైః - అనుమానపడని, అంతఃకరణైః - మనస్సులచేత, ఆఖ్యాతం - చెప్పబడిన, దయార్ద్రభావం - దయాస్వభావముగల, అస్య - దిలీపునియొక్క, వపుః - శరీరమును, విలోకయంత్యః . చూచుచున్న, హరిణ్యాః - ఆడులేళ్లు, అక్ష్ణాం - తమ కన్నులయొక్క, ప్రకామవిస్తారఫలం - మిక్కిలి విశాలములై యుండుటకు తగిన ఫలమును, ఆపుః - పొందినవి. ధనుర్ధరుడై యున్నను, అతనియందు గోచరించు దయా స్వభావమును గమనించి, లేళ్లు నిర్భయముగా దిలీపునిజూచుచు తమ విశాల నేత్రముల సాఫల్యమును బొందెనని భావము.

శ్లో. స కీచకై ర్మారుతపూర్ణరంధ్రైః
కూజద్భి రాపాదిత వంశకృత్యం,
శుశ్రావ కుంజేషు యశః స్వ ముచ్చైః
ఉద్గీయమానం వనదేవతాభిః. 12

వ్యాఖ్య : సః - ఆ దిలీపుడు, మారుతపూర్ణరంధ్రైః - గాలిచేత నిండిన రంధ్రములు గల (కనుకనే), కూజద్భిః - ధ్వనించుచున్న, కీచకైః - వెదుళ్లచేత, ఉచ్చైః - బిగ్గరగా, ఆపాదిత వంశకృత్యం - కూర్పబడిన వేణువుల కర్తవ్యము కలుగునట్లుగా, కుంజేషు - పొదరిండ్లయందు, వనదేవతాభిః . వనదేవతల చేత, ఉదీయమానం - గానము చేయబడుచున్న, స్వం, యశః - తనకీర్తిని, శుశ్రావ - వినెను. గాలిచే పూరింపబడిన వెదుళ్లుచేయుధ్వని వేణునాద తానముకాగా వనదేవతల చేత చేయబడిన తన యశోగానమును దిలీపుడు వినెనని భావము.

శ్లో. పృక్త స్తుషారై ర్గిరినిర్ఝరాణాం
అనోకహాకంపిత పుష్పగంధీ,

త మాతపక్లాంత మనాతపత్రం
ఆచారపూతం పవనః సి షే వే. 13

వ్యాఖ్య : గిరినిర్ఝ రాణాం - పర్వతములనుండి దిగు ప్రవాహములయొక్క, తుషారై ః - నీటి తుంపురులచేత, పృ క్తః - తడిసినదియు, అనోకహా - కంపిత పుష్పగంధీ-అనోకహ -చెట్లయొక్క, ఆకంపిత - కొంచము కదలుచున్న, పుష్ప - పువ్వులయొక్క, గంధీ - పరిమళము గలదియు నగు, పవనః - గాలి, అనాత పత్రం - ఛత్రము లేని వాడును, ఆతపక్లాంతం - ఎండచే బడలినవాడును, ఆచార పూతం - నడవడిచేత పవిత్రుడునైన, తం - ఆ దిలీపుని, సిషేవే - సేవించెను. జగత్పావనుడైన పవనుడు వ్రతాచరణ పవిత్రుడై ఛత్రచామరములులేక వాడుబారు చున్న దిలీపునిని శైత్య సౌరభ్య మాంద్యగుణములు కలవాడై సేవించెనని భావము. దిలీపునికి హాయినిగొల్పు గాలి వీచెననుట.

శ్లో. శశామ వృష్ట్యాపి వినా దవాగ్నిః
ఆసీద్విశేషా ఫలపుష్ప వృద్ధిః,
ఊనం నసత్వే ష్వధికో బబాధే
తస్మిన్ వనం గోప్తరి గాహమానే. 14

వ్యాఖ్య : గోప్తరి - రక్షకుడైన, తస్మిన్ - ఆ దిలీప మహారాజు, వనం - అరణ్యమును గాహమానే (సతి) - ప్రవేశించిన వాడగుచుండగా, వృష్ట్యా, వినా, అపి - వర్షములేకున్నను, దవాగ్నిః - అరణ్యాగ్ని, శశామ - చల్లారెను, ఫల పుష్పవృద్ధిః - ఫలపుష్పములవృద్ధి - విశేషా - అధికమైనది, ఆసీత్ - అయ్యెను, స త్వేషు - మృగములయందు, అధికః- గొప్పదైన వ్యాఘ్రాదికము, ఊనం-తక్కువ బలముగల హరిణాదికమును, న బబాధే - బాధింపలేదు. దిలీపుడు వనమును ప్రవే శింపగానే దావాగ్ని చల్లారెననియు, ఫలపుష్పములు ఎక్కువగా వృద్ధిచెందెననియు, చిన్న మృగములను పెద్దవి బాధించుట మానెననియు భావము.

శ్లో. సంచారపూతాని దిగంతరాణి
కృత్వా దినాంతే నిలయాయ గంతుం,
ప్రచక్రమే పల్లవరాగతామ్రా
ప్రభా పతంగస్య మునేశ్చ ధేనుః. 15

వ్యాఖ్య : పల్లవరాగ తామ్రా - చిగురాకుల కాంతివలె ఎఱ్ఱనిదైన, పతం

గస్య - సూర్యుని యొక్క, ప్రభా - కాంతియు, మునేః - వసిష్ఠుని యొక్క, ధేనుః చ - గోవున్ను, దిగంతరాణి-దిక్కులనడిమి భాగములను, సంచారపూతాని-తనసంచారముచేత పవిత్రమైనవానినిగా, కృత్వా - చేసి, దినాంతే - సాయంకాలమందు, నిలయాయ - సూర్యపక్షమున అస్తపర్వతమునకు, ధేనుపక్షమున ఆశ్రమమునకు, గంతుం - వెళ్లుటకు, ప్రచక్రమే - ప్రారంభించెను. నందినీధేనువు ఎట్టిగానుండెనని భావము.

శ్లో. తాం దేవతా పిత్రతిథి క్రియార్థాం
అన్వగ్యయౌ మధ్యమలోకపాలః,
బభౌ చ సా తేన సతాం మతేన
శ్రద్ధేవ సాక్షా ద్విధినోపపన్నా. 16

వ్యాఖ్య : మధ్యమలోకపాలః - భూలోకపాలుడైన దిలీపుడు, దేవతాపిత్రతిథి క్రియార్థాం - దేవతల యొక్కయు, పితృదేవతల యొక్కయు, అతిథుల యొక్కయు క్రియలే ప్రయోజనముగాగల (యాగ శ్రాద్ధ దాన కర్మలు ప్రయోజనములుగాగల), తాం - ఆ నందినీధేనువును, అన్వక్ - అనుసరించి, యయౌ - వెళ్లెను, సతాం - సత్పురుషులకు, మతేన - సమ్మతుడైన, తేన - ఆ దిలీపునిచేత, ఉపపన్నా - కూడిన, సా చ - ఆ ధేనువుకూడ, సతాం మతేన విధినా - సత్పురుషులకు సమ్మతమైన అనుష్ఠానముచేత, ఉపపన్నా - కూడిన, సాక్షాత్ - కంటికి కనబడు, శ్రద్ధేవ (శ్రద్ధా + ఇవ) - ఆస్తిక్య బుద్ధివలె, బభౌ - ప్రకాశించెను. వైదికకర్మలకు శాస్త్రచోదితమైన అనుష్ఠానము (విధి) ఆస్తిక్యబుద్ధి (శ్రద్ధ) ముఖ్యములు. దిలీపుడు విధితోను, ధేనువు శ్రద్ధతోను పోల్చబడుటచే వారి పవిత్రత్వము వ్యక్తము.

శ్లో. స పల్వలోత్తీర్ణ వరాహయూథా
న్యావాస వృక్షోన్ముఖ బర్హిణాని,
యయౌ మృగాధ్యాసిత శాద్వలాని
శ్యామాయమానాని వనాని పశ్యన్. 17

వ్యాఖ్య : సః - ఆ దిలీప మహారాజు, పల్వలోత్తీర్ణ వరాహయూథాని - పల్వల - నీటి గుంటలనుండి, ఉత్తీర్ణ - పైకి వచ్చిన, వరాహ యూథాని - పందుల గుంపులు గలవియు, ఆవాసవృక్షోన్ముఖ బర్హిణాని - నివాస వృక్షముల పైపునకు మరలిన నెమళ్లు గలవియు, మృగాధ్యాసిత శాద్వలాని - లేళ్లచేత అధివ

సింపబడిన పచ్చికబయళ్లు గలవియు నగుటచేత, శ్యామాయమానాని - నల్లబడు చున్న, వనాని - అరణ్యములను, పశ్యన్ - చూచుచు, యయౌ - వెళ్లెను. సాయంకాలమున వనము మిక్కిలి పచ్చనై నలుపు రంగుతో కనపడుచుండె ననియు, ఆ వర్ణమునకు వరాహములు, నెమళ్లు, పచ్చికబయళ్లు కూడా దోహదము చేసినవనియు భావము.

శ్లో. ఆపీన భారోద్వహన ప్రయత్నాత్
గృష్టి ర్గురుత్వా ద్వపుషో నరేంద్రః.
ఉభా వలంచక్రతు రంచితాభ్యాం
తపోవనావృత్తిపథం గతాభ్యామ్. 18

వ్యాఖ్య : గృష్టిః - నందినీధేనువు, ఆపీనభారోద్వహన ప్రయత్నాత్ - పొదుగు బరువును మోయుటయందలి ప్రయాసము వల్లను, నరేంద్రః - దిలీప మహారాజు, వపుషః - దేహమయొక్క, గురుత్వాత్ - గొప్పతనము వలనను, ఉభౌ - ఇద్దరును, అంచితాభ్యాం - అందమొలుకుచున్న, గతాభ్యాం - నడకలచేత, తపోవనావృత్తిపథం - తపోవనమునుండి తిరిగివచ్చుమార్గమును, అలంచక్రతుః - అలంకరించిరి. పెద్ద పొదుగుగల ధేనువు, సర్వాంగపుష్టమైన దేహముగల దిలీపుడు మార్గమునకు అందమును గూర్చిరని భావము. గృష్టిః - ఒకయీత యీనిన ఆవు. నందినీ దిలీపులు తిరిగివచ్చుచున్న తపోవన మార్గము రమణీయముగా కనబడుటకు ఆ యిద్దరి నడకల హుందాతనము కారణము.

శ్లో. వసిష్ఠధేనో రనుయాయినం తం
ఆవర్తమానం వనితా వనాంతాత్,
పపౌ నిమేషాలస పక్ష్మపంక్తిః
ఉపోషితాభ్యామివ లోచనాభ్యామ్. 19

వ్యాఖ్య : వసిష్ఠధేనోః - వసిష్ఠుని గోవుయొక్క, అనుయాయినం - అనుచరుడైన వాడును, వనాంతాత్ - అరణ్యమునుండి, ఆవర్తమానం - తిరిగి వచ్చు చున్నవాడును నగు, తం - ఆ దిలీపుని, వనితా - సుదక్షిణాదేవి, నిమేషాలస పక్ష్మ పంక్తిః - నిమేష - మూతపడుటయందు, అలస - సోమరితనముగల, పక్ష్మ ఱెప్ప వెంట్రుకల యొక్క, పంక్తిః - వరుసకలది యగుచు (ఱెప్పలు వ్రాల్చని దై యని అర్థము), లోచనాభ్యాం - రెండు కన్నులతోను, ఉపోషితాభ్యాం, ఇవ -

ఉపవాసమున్నవాని చేతవలె, పపౌ - పానముచేసెను. ఉపోషితుడు దప్పిగొని, విడువక జలమును త్రాగునట్లు సుదక్షిణ తన రెండు కన్నులతో తిరిగి వచ్చుచున్న దిలీపుని త్రాగెను, అనగా తెప్పలు వాల్చక ప్రేమాతిశయమున చూచెనని భావము. దీని వలన సుదక్షిణ పాతివ్రత్యము, భర్తయందలి విశేషానురాగమును సూచిత ములు. 'వనితా' శబ్దమునకు అత్యంతానురాగవతి అని యర్థము.

శ్లో. పురస్కృతా వర్త్మని పార్థివేన
ప్రత్యుద్గతా పార్థివ ధర్మపత్న్యా
తదంతరే సా విరరాజ ధేనుః
దిన క్షపా మధ్యగతేవ సంధ్యా. 20

వ్యాఖ్య : వర్త్మని - మార్గమునందు, పార్థివేన - పృథివీశ్వరుడైన దిలీ పునిచేత, పురస్కృతా - ముందుంచుకొన బడినదియు, పార్థివ ధర్మపత్న్యా - రాజ ధర్మపత్ని సుదక్షిణచేత, ప్రత్యుద్గతా - ఎదురుకొనబడినదియు నగు, సా - ఆ నందినీ ధేనువు, తదంతరే - వారిద్దరినడుమ, దినక్షపా మధ్యగతా పగటికిని రాత్రికిని నడుమనున్న, సంధ్యా ఇవ - సంధ్యవలె, విరరాజ - ప్రకాశించెను. సంధ్య ఎట్టినిది, నందిని ఎట్టినిది కనుక ఆ ధేనువు వారి నడుమ దిన రాత్రుల నడుమనున్న సంధ్యవలె నుండెనని భావము.

శ్లో. ప్రదక్షిణీకృత్య పయస్వినీం తాం
సుదక్షిణా సాక్షతపాత్ర హస్తా,
ప్రణమ్య చానర్చ విశాల మస్యాః
శృంగాంతరం ద్వార మివార్థసిద్ధేః. 21

వ్యాఖ్య : సాక్షత పాత్ర హస్తా - అక్షతలుగల పళ్లెమును చేతులయందు పట్టుకొన్న, సుదక్షిణా - సుదక్షిణాదేవి, పయస్వినీం - సమృద్ధిగా పాలిచ్చునట్టి, తాం - ఆ నందినీధేనువును, ప్రదక్షిణీకృత్య - ప్రదక్షిణము చేసియు, ప్రణ మ్యచ - నమస్కరించియు, అస్యాః - దానియొక్క, విశాలం - వెడల్పుగానున్న, శృంగాంతరం - కొమ్ముల నడిమి భాగమును, అర్థసిద్ధేః - తమ కార్యసిద్ధకి, ద్వారం, ఇవ - ద్వారమువలె నున్నదానిని, అనర్చ - అర్చించెను. తమ కార్య సిద్ధికి ద్వారమా యనునట్లున్న నందినియొక్క ముఖమును సుదక్షిణ గంధ పుష్పా క్షతలతో అలంకరించెనని భావము.

శ్లో వతోన్సుకాఽపి స్తిమితా సపర్యాం
ప్రత్యగ్రహీ త్సేతి ననందతు స్తౌ,
భక్త్యోపపన్నేషు హి తద్విధానాం
ప్రసాద చిహ్నాని పురః ఫలాని. 42

వ్యాఖ్య : సా - ఆ నందిని, వతోన్సుకా, అపి - దూడవిషయమై త్వర పడుచున్నదైనను, స్తిమితా - కదలక నిలిచినదై, సపర్యాం - పూజను, ప్రత్య గ్రహీత్ - స్వీకరించినది, ఇతి - అని, తౌ - వారిద్దరు (సుదక్షిణా దిలీపులు), ననందతుః - సంతోషపడిరి, భక్త్యా - భక్తిచేత, ఉపపన్నేషు - కూడినవారి విష మున, తద్విధానాం - అలాంటి వారియొక్క (నందినివంటి మహనీయులయొక్క), ప్రసాద చిహ్నాని - ప్రసన్నతా లక్షణములు, పురఃఫలాని,హి - సమీపించిన ఫల సిద్ధి కలవి కదా! దూడవద్దికి వెళ్లిపోక, నిలిచి, తాముచేసిన పూజను నందిని స్వీక రించుట తమకు అచిరకలమున సంతాన ప్రాప్తికి సూచకమని వారు ఆనందించి రని భావము.

శ్లో. గురోః సదారస్య నిపీడ్య పాదౌ
సమాప్య సాంధ్యం చ విధిం దిలీపః
దోహావసానే పునరేవ దోగ్ధ్రీం
భేజే భుజోచ్ఛిన్నరిపు ర్నిషణ్ణాం. 43

వ్యాఖ్య : భుజోచ్ఛిన్నరిపుః (భుజ + ఉచ్ఛిన్న + రిపుః) - భుజములచేత ఛేదింపబడిన శత్రువులుగల అనగా పరాక్రమవంతుడైన, దిలీపః - దిలీపుడు, సదా రస్య - భార్యా సహితుడైన, గురోః - గురువైన వసిష్ఠునియొక్క, పాదౌ - పాదము ను, నిపీడ్య - పట్టి (నమస్కరించి), సాంధ్యం - సంధ్యాకాలమునకు సంబంధించిన, విధిం - అనుష్ఠానమును, సమాప్య, చ - ముగించియు, దోహా వసానే - పాలుపితికిన పిమ్మట, నిషణ్ణాం - పరుండిన, దోగ్ధ్రీం - పాడియావైన ఆ నందినిని, పునరేవ - మళ్లీకూడ, భేజే - సేవించెను. నందినివెంట నడచెనని తాత్పర్యము. పూర్వపదములేని 'దోగ్ధ్రీ' శబ్దము కోరికలను పితుకునది అన్న అర్థమును స్ఫురింపఁజేయును.

శ్లో. తా మంతికన్యస్త బలిప్రదీపాం
అన్వాస్య గోప్తా గృహిణీసహాయః,

క్రమేణ సుప్తామను సంవివేశ
సుప్తోత్థితాం ప్రాత రనూదతిష్ఠత్. 24

వ్యాఖ్య : గోప్తా - రక్షకుడైన దిలీపుడు, గృహిణీసహ్యాయః (సన్) - భార్యాసహితుడగుచు, అంతికన్యస్త బలిప్రదీపాం - సమీపమందుంచ బడిన పూజా ద్రవ్యములు దీపములునుగల, తాం - ఆ నందినీధేనువును, అన్వాస్య - అనుసరించి కూర్చుని, క్రమేణ - క్రమపరిపాటిగా, సుప్తాంఅను - నిద్రించిన యావు వద్దనే, సంవివేశ - నిద్రించెను, ప్రాతః - ఉదయమున, సుప్తోత్థితాం - నిద్రించి లేచినదానిని, అనూదతిష్ఠత్ అనుసరించి లేచెను. అది నిద్రమేల్కొనగా తానును లేచి నిల్చునె ననుట 'క్రమేణ' అను పదము వరుసగా జరుగుచున్న నందినీ దినచర్యను, దాని ననుసరించుచున్న సుదక్షిణా దిలీపుల వ్రత విధానమును సూచించును.

శ్లో. ఇత్థం వ్రతం ధారయతః ప్రజార్థం
సమం మహిష్యా మహనీయకీర్తేః
సప్త వ్యతీయు స్త్రిగుణాని తస్య
దినాని దీనోద్ధరణోచితస్య. 25

వ్యాఖ్య : ఇత్థం - ఈ విధముగా, ప్రజార్థం - సంతానము కొఱకు, మహిష్యాసమం పట్టపురాణితో గూడ, వ్రతం - వ్రతమును, ధారయతః - ఆచరించుచున్నవాడును, మహనీయకీర్తేః - కొనియాడ దగిన కీర్తిగలవాడును, దీనోద్ధరణోచితస్య(దీన + ఉద్ధరణ + ఉచితస్య)దీనుల దైన్యమును పోగొట్టుట కర్హుడైన, తస్య ఆ దిలీపునికి, త్రిగుణాని - మూడురెట్లయిన, సప్త ఏడు, దినాని -రోజులు, వ్యతీయుః - కడచినవి. ఇరువదియొక్క రోజులు గడచిపోయెననియు అట్లు ధేనువును సేవించెననియు భావము. కడచిన 25 శ్లోకములలో దిలీపునికి విశేషణములుగా ఉపయోగించబడిన "ప్రజానామధిపః, సమ్రాట్, మరుత్సఖాభం, ఆచారపూతం, మఘవల్లోకపాలః, భుజోచ్ఛిన్న రిపుః, గోప్తా, మహనీయకీర్తేః" అను పదములు దిలీపుని ధార్మిక ప్రజాపరిపాలనాది గుణములను, పరాక్రమమును, సంతానముకొఱకై పడు కష్టములను సూచించుటయేకాక, రాబోవు కథాంశమునుగూడ సూచించుచున్నవి.

శ్లో. అన్యేద్యు రాత్మానుచరస్య భావం
జిజ్ఞాసమానా మునిహోమధేనుః,
గంగాప్రపాతాంత నిరూఢ ఘాసం
గౌరీగురో ర్గహ్వార మావివేశ. 26

వ్యాఖ్య : అన్యేద్యుః - మరునాడు (ఇరువది రెండవ దినమున), మునిహోమధేనుః - వసిష్ఠుని హోమార్థమై యున్న నందినీధేనువు, ఆత్మానుచరస్య - తనకు సేవకుడైయున్న దిలీపునియొక్క, భావం - భక్తిభావమును, జిజ్ఞాసమానా - తెలిసికొన గోరుచున్నదియగుచు, గంగా ప్రపాతాంత నిరూఢ ఘాసం - గంగా ప్రవాహము పడుచోట మొలచిన లేత పచ్చికగల, గౌరీగురోః - పార్వతికి తండ్రి యగు హిమాద్రియొక్క, గహ్వారం - గుహను, ఆవివేశ - ప్రవేశించెను. ఇరు పది రెండవ దినమున నందిని దిలీపుని భక్తిని బరీక్షింప దలచినదియై ఒక హిమవత్పర్వత గుహలో ప్రవేశించెనని భావము.

శ్లో. సా దుష్ప్రధర్షా మనసాపి హింస్రైః
ఇత్యద్రి శోభా ప్రహితేక్షణేన,
అలక్షితాభ్యుత్పతనో నృపేణ
ప్రసహ్య సింహాః కిల తాం చకర్ష. 27

వ్యాఖ్య : సా - ఆ నందినీధేనువు, హింస్రైః ఘాతుక మృగముల చేత, మనసా, అపి - మనస్సుచేత కూడ (కోరికమాత్రమున గూడ), దుష్ప్ర ధర్షా - చెనకుటకు (భయపెట్టుటకు) శక్యముకానిది, ఇతి - ఇట్లనుకొని, ఆద్రిశోభా ప్రహితేక్షణేన - పర్వత సౌందర్యముపై ప్రసరింప జేయ బడిన కన్నులు గల, నృపేణ - రాజైన దిలీపునిచేత, అలక్షితాభ్యుత్పతనః (అలక్షిత + అభ్యుత్పతనః) - చూడబడని లంఘనముగల, సింహాః - ఒకానొక సింహము, తాం - ఆధేనువును, ప్రసహ్య - హఠాత్తుగా, చకర్ష, కిల - లాగుకొని పోయెనుసుమా! హిమాచల, గంగాపాత, శాద్వలాది శోభలను చూస్తూ ఒక క్షణకాలము ధేనువును చూచుటను దిలీపుడు ఏమరినప్పుడు ఆయనకు తెలియనీయక ఒక సింహము నందినిని లాగు కొని ఆ గుహలోనికి పోయెనని భావము.

శ్లో. తదీయ మాక్రందిత మార్తసాధోః
గుహానిబద్ధ ప్రతిశబ్ద దీర్ఘం,

రశ్మిష్వివాదాయ నగేంద్రసక్తాం
నివర్తయామాస నృపస్య దృష్టిమ్. 28

వ్యాఖ్య ; గుహానిబద్ధ ప్రతిశబ్దదీర్ఘం - ఆగుహయందు నిండి సుదీర్ఘమైన, తదీయం, ఆక్రందితం - ఆ నందినీ సంబధమైన యార్తనాదము (రోదనధ్వని), ఆర్తసాధోః - దుఃఖితుల విషయమున కరుణాశాలియైన, నృపస్య - రాజుయొక్క, నగేంద్రసక్తాం - పర్వతరాజుపై లగ్నమైయున్న, దృష్టిం - చూపును, రశ్మిషు - పగ్గములయందు (కట్టి), ఆధాయ, ఇవ - లాగబడినట్లు, నివర్తయామాస - వెనుకకు మరలించెను. సింహముచేత లాగబడిన గోవుయొక్క ఆక్రందనము దిలీపుని దృష్టిని హఠాత్తుగా గుహవైపు మరలించెనని భావము.

శ్లో. స పాటలాయాం గవి తస్థివాంసం
ధనుర్ధరః కేసరిణాం దదర్శ,
అధిత్యకాయా మివ ధాతుమయ్యాం
లోధ్రద్రుమం సానుమతః ప్రఫుల్లమ్. 29

వ్యాఖ్య ; ధనుర్ధరః - విల్లును ధరించిన, సః - ఆ దిలీపుడు, పాటలాయాం - కొంచము ఎఱ్ఱగానున్న, గవి - ధేనువుమీద, తస్థివాంసం - కూర్చుని యున్న, కేసరిణం - సింహమును, సానుమతః - పర్వతము యొక్క, ధాతుమయ్యాం - ఎఱుపురంగుతో కూడిన (ఎఱ్ఱని రాళ్లూ మట్టిగల గైరిక ధాతువు), అధిత్యకాయాం -నెత్తముమీద (పర్వతముయొక్క పైభాగమున ఒక ప్రక్కనున్న కొద్దిపాటి స్థలమునందు) తస్థివాంసం - ఉండినదియై, ప్రఫుల్లం - విరియ బూచిన, లోధ్రద్రుమం - లొద్దుగు చెట్టునువలె, దదర్శ - చూచెను. ఎఱ్ఱని నందినిపైఁ గూర్చునియున్న తెల్లని సింహము, జాజురంగుగల కొండనెత్తముపై నిల్చి విరియ బూచిన లొద్దుగు చెట్టువలె దిలీపుని కంటికిఁ గనపడెనని భావము.

'ధనుర్ధరః, కేసరిణం, ప్రఫుల్లం' మొదలయిన పదములన్నియు నిండైన యర్థములతో (సాభిప్రాయములు) నుండుటచేత ఇది పరికరాలంకార వుష్టమైన ఉపమాలంకారము. ఆరణ్యకమైన లోధ్రద్రుమోపమానము కాళిదాసుని సమయజ్ఞతను సూచించుచున్నది. సింహమును చూచుట, ధనువు నెక్కుబెట్టుట ఏకకాలమున జరిగెను.

శ్లో. తతో మృగేంద్రస్య మృగేంద్రగామీ
వధాయ వధ్యస్య శరం శరణ్యః,
జాతాభిషంగో నృపతి ర్నిషంగాత్
ఉద్ధర్తు మైచ్ఛత్ ప్రసభోద్ధృతారిః. 30

వ్యాఖ్య : తతః - తరువాత, మృగేంద్రగామీ - సింహము వలె నడచు వాడును, ప్రసభోద్ధృతారిః - బలాత్కారముగా పెరికి వేయబడిన శత్రువులు గల వాడును నగు, నృపతిః - దిలీపుడు, జాతాభిషంగః - కలిగిన అవమానముగల వాడై, వధ్యస్య - వధింపదగిన, మృగేంద్రస్య - సింహముయొక్క, వధాయ - సంహారముకొఱకు, నిషంగాత్ - తూణీరమునుండి, శరం - బాణమును, ఉద్ధర్తుం - పైకితీయుటకు, ఐచ్ఛత్ - తలచెను. వెంటనే దిలీపుడు సింహముపై బాణమును వేయుటకు సమకట్టెను. 'మృగేంద్రగామీ' అను పదము దిలీపుడు నందినిపైకెక్కి కూర్చున్న సింహమును చూడగానే సింహమువలె ఒక్క లంఘనముతో దగ్గరకువెళ్లి బాణమును తూణీరమునుండి తీయబోయెనను భావమును సూచించును.

శ్లో. వామేతర స్తస్య కరః ప్రహర్తుః
నఖప్రభా భూషిత కంకపత్రే,
సక్తాంగుళిః సాయకపుంఖ ఏవ
చిత్రార్పితారంభ ఇవావతస్థే. 31

వ్యాఖ్య : ప్రహర్తుః - కొట్టఁబోవు వాడైన, తస్య - ఆ దిలీపునియొక్క, వామేతరః (వామ + ఇతరః) - కుడిదియైన, కరః - చేయి, నఖప్రభారూషిత కంకపత్రే—నఖప్రభ - గోళ్ళకాంతులచేత, రూషిత - కప్పబడిన, కంక - రాబందు యొక్క, పత్రే - ఈకలు గల, పుంఖే ఏవ - పిడియందే, సక్తాంగుళిః - అతుక్కపోయిన వ్రేళ్లుగలదియై, చిత్రార్పితారంభఃఇవ - చిత్రపటమునందు చూపబడిన ప్రారంభము గలదివలె, అవతస్థే - ఆగిపోయెను. తూణీరమునుండి బాణమును తీయబోయిన దిలీపునిహస్తము బాణపుపిడిమీదనే అతుకుకొని పోయెననియు అది చిత్రపటమునందలి బొమ్మవలె కదలక మెదలక యుండెననియు భావము.
అలం : ఉపమ.

శ్లో. బాహు ప్రతిష్టంభ వివృద్ధ మన్యుః
అభ్యర్ణ మాగస్కృత మస్ప్యృశద్భిః,

రాజా స్వతేజోభి రదహ్య తాంత
ర్భోగీవ మంత్రౌషధ రుద్ధ వీర్యః. 33

వ్యాఖ్య : బాహు ప్రతిస్తంభవివృద్ధమన్యుః - భుజ ప్రతిబంధము వలన వృద్ధి చెందిన కోపముగల వాడైన, రాజా - దిలీపుడు, మంత్రౌషధరుద్ధ వీర్యః - మంత్రము చేతను, ఓషధి అనగా చెట్టురసము చేతను, ఆపబడిన శక్తిగల, భోగీవ (భోగీ + ఇవ) సర్పమువలె, అభ్యర్ణం - ఎదుటనున్న, ఆగస్కృతం తప్పు చేసిన దానిని (సింహమును), అస్పృశద్భిః - తాకకుండా ఉన్న, స్వతేజోభిః - తన ప్రతాపములచేత, అంతః - లోలోపలనే, అదహ్యత - దహింపబడెను. తన కపకారము చేసి యెదుటనున్న శత్రువును కబళబోగా మంత్రము మొదలయిన వానిచేత నిర్వీర్యము చేయబడిన సర్పమువలె బాణము వేయబోయిన చేయి ఆగిపోగా దిలీపుడు తనలోనే ఉడికిపోయెనని భావము. అలం : ఉపమ,

శ్లో. త మార్యగృహ్యం నిగృహీతధేనుః
మనుష్యవాచా మనువంశకేతుమ్,
విస్మాయయన్ విస్మిత మాత్మవృత్తౌ
సింహోరుసత్త్వం నిజగాద సింహః. 35

వ్యాఖ్య : నిగృహీతధేనుః - గట్టిగా పట్టుకోబడిన యావుగల, సింహః - సింహము, ఆర్యగృహ్యం - మంచివారి పక్షము వహించువాడును, మనువంశ కేతుం - మను వంశమునకు ధ్వజమువంటి వాడును, సింహోరుసత్త్వం - సింహము కంటే ఎక్కువైన బలముగల వాడును, ఆత్మవృత్తౌ అప్పటి తన స్థితి విషయమున, విస్మితం - ఆశ్చర్యపడుచున్న వాడును నగు, తం ఆ దిలీప మహారాజును, మనుష్యవాచా - మనుష్య భాషణముచేత, విస్మాయయన్ - ఇంకను ఆశ్చర్యమును పొందించుచు, నిజగాద - పెద్దగా పల్కెను, నిర్భయముగా పెద్దగా సింహము దిలీపుని గురించి పలికెనని భావము. 'విస్మాయయన్' ఇదియే సాధు ప్రయోగమనియు, 'విస్మాపయన్' సాధువు కాదనియు మల్లినాథుని వ్యాఖ్య.

శ్లో. అలం మహీపాల! తవ శ్రమేణ
ప్రయుక్త మప్యస్త్ర మితో వృథా స్యాత్
న పాదపోన్మూలన శక్తి రంహాః
శిలోచ్చయే మూర్ఛతి మారుతస్య. 34

వ్యాఖ్య : మహీపాల! - ఓ రాజా!, తవ - నీకు, శ్రమేణ - శ్రమతో, అలం పనిలేదు, ఇతః - ఈ నామీద, ప్రయుక్తం, అపి ప్రయోగింపబడినది యైనను, అస్త్రం - బాణము, వృథా, స్యాత్ - వ్యర్థమగును, పాదపోన్మూలన శక్తి - వృక్షములను పెల్లగించుటయందు శక్తిగల; మారుతస్య - వాయువు యొక్క, రంహః - వేగము, శిలోచ్చయే - పర్వతమునందు, న మూర్ఛతి - ప్రసరింపదు కదా! ఓ రాజా! నీవు నాపై బాణము వేసినను అది వ్యర్థమే అగును. వాయువుయొక్క వేగము చెట్టును పెకలించును గాని పర్వతమును గదలించునా? అని సింహము పలికెను.

శ్లో. కైలాసగౌరం వృష మారురుక్షోః
పాదార్పణానుగ్రహ పూతపృష్ఠమ్
అవేహి మాం కింకర మష్టమూర్తేః
కుంభోదరం నామ నికుంభమిత్రమ్ 16

వ్యాఖ్య : కైలాసగౌరం - కైలాసపర్వతమునవె తెల్లని యైన, వృషం - వృషభమును (నందీశ్వరుని), ఆరురుక్షోః - ఎక్కగోరుచున్న, అష్టమూర్తేః - శివునియొక్క, పాదార్పణానుగ్రహ పూతపృష్ఠం - పాదార్పణ - పాదమునుంచుట యనెడు, అనుగ్రహ - అనుగ్రహముచేత, పూత - పవిత్రము చేయబడిన, పృష్ఠం - వీపు కలవాడను, నికుంభమిత్రం - నికుంభుడనువానికి స్నేహితుడను, కుంభోదరం నామ - కుంభోదరుడను పేరుగల నన్ను, కింకరం - శివుని సేవకునిగా, అవేహి - తెలిసికొనుము. ఎత్తైన నందీశ్వరుని పైకెక్కునప్పుడు శివుడు నా వీపును మెట్టుగా నుపయోగించుకొనును. అట్లు శివపాదస్పర్శచేత పవిత్రమైన వీపుగల కుంభోదరుడనబడు శివసేవకుడను గాని మృగమునుగానని సింహము పలికెను. 'నికుంభుడు', సుప్రసిద్ధ శివకింకరుడుగాను, కుమారస్వామి భక్తుడుగాను పురాణములలో పేర్కొనబడెను. శివుని అష్టమూర్తులు (శరీరములు) : "పృథివి, జలము, తేజస్సు. వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, యజ్ఞము చేసిన సోమయాజి" అనునవి.

శ్లో. అముం పురః పశ్యసి దేవదారుం
పుత్రీకృతో సౌ వృషభధ్వజేన,

యో హేమకుంభస్తన నిస్సృతానాం
స్కందస్య మాతుః పయసాం రసజ్ఞః. 36

వ్యాఖ్య : పురః - ఎదుట, అముం, దేపదారుం ఈ దేవదారు వృక్షమును, పశ్యసి - చూచుచున్నావుకదా! అసౌ - ఇది, వృషభధ్వజేన శివునిచేత, పుత్రీకృతః - కుమారుడుగా భావింపబడినది, యః - ఏయీదేవదారువు, స్కందస్య, మాతుః - కుమారస్వామికి తల్లియైన పార్వతియొక్క, హేమకుంభస్తన నిస్సృతానాం - బంగారు కుండయను స్తనమునుండి స్రవింపనట్టి, పయసాం . ఉదకముల యొక్క (పాలయొక్క), రసజ్ఞః రుచినెఱిగినదై యున్నదో! పార్వతి కుమార స్వామిని క్షీరముతో తృప్తి పరచినట్లే ఈ దేవదారు వృక్షమును నీటితో తృప్తి పరచుచున్నదనియు, ఇది శివపార్వతులకు పుట్టుబిడ్డవంటిదనియు భావము.

శ్లో. కండూయమానేన కటం కదాచిత్
వన్యద్విపే నోన్మథితా త్వగస్య
అథైన మద్రేస్తనయా ఋుుోచ
సేనాన్య మాలీఢ మివాసురాస్త్రైః. 37

వ్యాఖ్య : కదాచిత్ - ఒకానొకప్పుడు, కటం - గండస్థలమును, కండూయమానేన - గోకుకొనుచున్న, వన్యద్విపేన - అడవి ఏనుగుచేత, అస్య - దీని యొక్క, త్వక్ - చర్మము, ఉన్మథితా - నలిగి పైకి లేచునట్లు చేయబడినది, అథ - అప్పుడు, అద్రేః - హిమాద్రియొక్క, తనయా - కూతురైన పార్వతి, అసురాస్త్రైః - రాక్షసుల బాణములచేత, ఆలీఢం - ఛేదింపబడిన, సేనాన్యం, ఇవ . కుమారస్వామిని గుఱించివలె, ఏనం ఈ దేవదారు వృక్షమును గుఱించి, ఋుుోచ - దుఃఖించెను. ఒకప్పుడు ఒక వనగజ మీ దేవదారు వృక్షమును రాచుకొనగా దీని చర్మము పైకి లేచినది, పార్వతి దానిని చూచి కుమారస్వామి రాక్షసుల బాణములచేత ఛేదింపబడినట్లువలె మిక్కిలి దుఃఖించినది.

శ్లో. తదాప్రభృత్యేవ వనద్విపానాం
త్రాసార్థ మస్మ న్నహ మద్రికుక్షౌ,
వ్యాపారిత శ్శూలభృతా విధాయ
సింహత్వ మంకాగత సత్త్వ వృత్తి. 38

వ్యాఖ్య : తదాప్రభృతి, ఏవ . అది మొదలుకొనియే, వనద్విపానాం - అడవి ఏనుగులయొక్క, త్రాసార్థం భయము కొఱకు శూలభృతా శివునిచేత, అంకాగతసత్త్వవృత్తి — అంకాగత - సమీపమునకు వచ్చిన, సత్త్వ - ప్రాణులు మాత్రమే, వృత్తి - జీవనాధారముగాగల, సింహత్వం - సింహమునై యుండుటను, విధాయ ఏర్పఱచి, అహం - నేను, అస్మిన్ ఈ, అద్రికుక్షౌ - పర్వతగుహయందు, వ్యాపారితః సేవకుడుగా నుంచబడితిని. అప్పటినుండి ఈ చేట్టును గజములు రాచుకొనకుండ చూచుటకై శివుడు నన్నిచ్చట కావలి యుంచినాడు. నేను 'అంకాగత స్తత్వ వృత్తి' అనగా నా వద్దికి వచ్చిన మృగాదులను మాత్రమే భక్షింపవలెనుగాని, ఆహారార్థమై వేటాడరాదు. అది శివుని యాజ్ఞ అని సింహము పలికెను.

శ్లో. తస్యాల మేషా క్షుధితస్య తృప్త్యై
ప్రదిష్టకాలా పరమేశ్వరేణ
ఉపస్థితా శోణితపారణా మే
సురద్విష శ్చాంద్రమసీ సుధేవ. 39

వ్యాఖ్య : పరమేశ్వరేణ శివునిచేత ప్రదిష్టకాలా - నిర్దేశంచబడిన భోజనకాలము గలదియై, ఉపస్థితా నా వద్దికి వచ్చిన, ఏషా - ఈ, శోణిత పారణా - రక్తభోజనము, సురద్విషః - దేవశత్రువైన రాహువుయొక్క, తృప్త్యై - తృప్తి కొఱకు, చాంద్రమసీ చంద్రునికి సంబంధించిన, సుధేవ (సుధా + ఇవ). అమృతమువలె, క్షుధితస్య - ఆకలిగొనియున్న, మే - నాయొక్క, తృప్త్యై - తృప్తి కొఱకు, అలం - చాలును. శివానుగ్రహము చేత ఆకలివేళకు నా యెదటికి వచ్చిన ఈ గోవు, రాహువునకు చంద్రకిరణామృతము వలె నాకిప్పటికి చాలును అన్నది సింహము. 'పారణ' యనగా వ్రతాదులయందలి యుపవాసము ముగిసిన పిమ్మట చేయునట్టి భోజనము. అమృతమునకై ప్రయత్నించిన రాక్షసులలో రాహువున కప్పుడప్పుడు లభించు చంద్రుని కిరణామృతముతోనే తృప్తి యని భావము.

శ్లో. స త్వం నివర్త్తస్వ విహాయ లజ్జాం
గురో ర్భవాన్ దర్శితశిష్యభక్తిః
శక్తేర్నిరస్యం యదశక్యరక్షం
న తద్యశః శస్త్రభృతాం క్షిణోతి. 40

వ్యాఖ్య : సః త్వం - అట్టి నీవు (ధేనువును రక్షింపగల ఉపాయము లేని నీవు), లజ్జాం - సిగ్గును, విహాయ - విడిచి, నివర్తస్వ - వెనుకకు మరలుము, భవాన్ - నీవు, గురోః - నీ గురువునకు, దర్శిత శిష్యభక్తిః - చూపబడిన శిష్యభక్తి గలవాడవయితివి, యత్ - ఏ, రక్ష్యం - కాపాడదగిన వస్తువు, శస్త్రేణ - ఆయుధము చేత, అశక్యరక్ష్యం - సాధ్యముగాని రక్షణకలదియో, తత్ - ఆ వస్తువు, శస్త్రభృతాం - సాయుధులైన క్షత్రియుల యొక్క, యశః - కిరిని, నక్షిణోతి - నశింపజేయదు. నీవు ధేనువును రక్షింపలేకపోయినందున కీర్తికి భంగము రాదు. పాపము కూడ కలుగదు, గురుభక్తిని చూపితివి. నీవు రక్షింపజాలని ధేనువు నెట్లు రక్షింపగల్గుదువు? అని భావము.

శ్లో. ఇతి ప్రగల్భం పురుషాధిరాజో
మృగాధిరాజస్య వచో నిశమ్య
ప్రత్యాహతాస్త్రో గిరిశ ప్రభావాత్
ఆత్మ న్యవజ్ఞాం శిథిలీచకార. 41

వ్యాఖ్య : పురుషాధిరాజః - పురుష శ్రేష్ఠుడైన దిలీపుడు, ఇతి - ఈ విధమైన, మృగాధిరాజస్య - మృగపతియైన సింహము యొక్క, ప్రగల్భం - ప్రౌఢమైన, వచః - పలుకును, నిశమ్య - విని, గిరిశ ప్రభావాత్ - శివునియొక్క ప్రభావమువలన, ప్రత్యాహతాస్త్రః - కుంఠితమైన బాణము కలవాడై, ఆత్మని - తన విషయమున, అవజ్ఞాం - అవమానమును, శిథిలీచకార - సడలించుకొనెను - విడిచెను. మానావమానములు సమానులతో ప్రతిఘటనము కలిగినప్పుడుగాని, పరమేశ్వరుని విషయమున కాదని గ్రహించెనని భావము,

శ్లో. ప్రత్యబ్రవీచ్చైన మిషుప్రయోగే
తత్పూర్వభంగే వితథప్రయత్నః
జడీకృత స్త్ర్యంబక వీక్షణేన
వజ్రం ముముక్షన్నివ వజ్రపాణిః 42

వ్యాఖ్య : తత్పూర్వభంగే - అదియే మొట్టమొదటి దైన ప్రతిబంధము గల, ఇషు ప్రయోగే బాణప్రయోగమునందు, వితథప్రయత్నః - వ్యర్థమైన ప్రయాసకలవాడై, వజ్రం - వజ్రాయుధమును, ముముక్షన్ - విడువగోరుచు, త్ర్యంబక వీక్షణేన - ముక్కంటి చూపుచేత, జడీకృతః - స్తంభితుడై పోయిన,

వజ్రపాణిః, ఇవ - ఇంద్రునివలె (ఉండిన దిలీపుడు), ఏనం - ఈ సింహమును గురించి, ప్రత్యబ్రవీత్ చ - బదులు పలికెను. (ప్రతి + అబ్రవీత్ = ప్రత్యబ్రవీత్). దిగంబర రూపమున అడ్డము వచ్చిన శివుని నెఱిగిక దారినుండి తొలగి పొమ్మనుచు, పోనందున నింద్రుడు వజ్రాయుధమును ప్రయోగింపబోగా శివుని మహిమచేత నది బాహవ్రతోసహా స్తంభించిపోయెను అని పురాణగాథ. అట్లే బాణము పిడికిలికి అంటుకుపోయిన చేయగల దిలీపుని స్థితికి ఇంద్రోపమానము చెప్పబడినది.

శ్లో. సంరుద్ధచేష్టస్య మృగేంద్ర కామం
హాస్యం వచ స్తద్య దహం వివక్షుః
అంతర్గతం ప్రాణభృతాం హి వేద
సర్వం భవాన్ భావ మతోఽభిధాస్యే, 43

వ్యాఖ్య : మృగేంద్ర - ఓ సింహమా! యత్ వచః - ఏ మాటను. అహం - నేను, వివక్షుః - పలుకదలచుచున్నానో, సంరుద్ధచేష్టస్య - అడ్డగింపబడిన కదలిక గల నాయొక్క, తత్ - ఆ మాట, కామం - మిక్కిలి, హాస్యం - పరిహసింప దగినదే, (కాని), భవాన్ - నీవు, ప్రాణభృతాం - ప్రాణులయొక్క, అంతర్గతం - మనస్సునందున్న, సర్వం - సమస్తమైన, భావం - అభిప్రాయమును, వేద హి - ఎఱుగుదువు కదా! అతః - అందువలన, అభిధాస్యే - చెప్పబోవుచున్నాను. సత్యమునే చెప్పెదను కనుక అది హాస్యాస్పదము కాదని సర్వప్రాణుల యొక్క హృద్గతాభిప్రాయము నెఱిగినట్టి నీవు గుర్తింపగలవని పలుకబోవుచున్నానని భావము.

శ్లో. మాన్య స్స మే స్థావర జంగమానాం
సర్గ స్థితి ప్రత్యవహార హేతుః
గురో రపీదం ధన మాహితాగ్నేః
నశ్యత్పురస్తా దనుపేక్షణీయమ్. 44

వ్యాఖ్య : స్థావరజంగమానాం - చరాచరములైన ప్రాణులయొక్క, సర్గ స్థితి ప్రత్యవహార హేతుః - పుట్టుకకు, బ్రతుకుటకు, మరణమునకు గూడ కారణమైన, సః - ఆ పరమేశ్వరుడు, మే - నాకు, మాన్యః - పూజ్యుడే, (కాని) పురస్తాత్ - కనులయెదుట, నశ్యత్ - నశించుచున్న (చావనున్న), ఇదం - ఈ, ఆహితాగ్నేః - యజ్ఞము చేయుచున్న, గురోః - గురువైన వసిష్ఠునియొక్క, ధనం,

అపి - గోరూపమైన ధనము కూడ, అనుపేక్షణీయం - ఉపేక్షింపఁదగినది కాదు గదా! సృష్టిస్థితి లయములకు హేతువైన ఈవుడు నాకును పూజ్యుఁడే. ఈశ్వరాజ్ఞ ననుసరించి 'అంకాగతసత్త్వవృత్తి' వైన నీకు గోవును విడిచినచో, కనుల యెదుట చనిపోవుచున్న గురువుగారి గోవును ఉపేక్షించిన పాపము నాకు తప్పదు కదా! అని భావము.

శ్లో. స త్వం మదీయేన శరీరవృత్తిం
దేహేన నిర్వర్తయితుం ప్రసీద
దినావసా నోత్సుక బాలవత్సా
విసృజ్యతాం ధేను రియం మహర్షేః. 45

వ్యాఖ్య : సః త్వం - అట్టి నీవు (దగ్గఱికి వచ్చిన ప్రాణిని మాత్రమే తినునట్టి వ్రతముగల నీవు), మదీయేన - నాదియైన, దేహేన - శరీరముచేత, శరీరవృత్తిం - నీ దేహజీవనమును, నిర్వర్తయితుం - నెరవేర్చుకొనుటకు, ప్రసీద - అనుగ్రహింపుము; దినావసానోత్సుక బాలవత్సా - దినావసాన - సాయం కాలమునందు, ఉత్సుక - తల్లి వచ్చునని యాతురపడుచున్న, బాలవత్సా - లేఁగ దూడ గలిగిన, ఇయం - ఈ, మహర్షేః ధేనుః - వసిష్ఠ మహాఋషియొక్క ఆవు, విసృజ్యతాం - విడిచిపెట్టబడుగాక. నందినీ ధేనువును విడిచి నన్ను ఆహారముగా స్వీకరింపుము. నీ దగ్గఱికి ధేనువువలెనే నేనును వచ్చినాను. పాలకెదురు చూచుచున్న లేఁగ గల యావును చంపుటకంటె నన్ను చంపి తినుట మేలుకదా అని భావము.

శ్లో. అథాంధకారం గిరిగహ్వరాణాం
దంష్ట్రామయూఖైః శకలాని కుర్వన్
భూయస్స భూతేశ్వర పార్శ్వవర్తీ
కించి ద్విహస్యార్థపతిం బభాషే. 46

వ్యాఖ్య : అథ - తరువాత, భూతేశ్వర పార్శ్వవర్తీ - ఈవుని యనుచరుడైన, సః - అసింహము, గిరిగహ్వరాణాం - పర్వత గుహలయొక్క, అంధకారం - చీకటిని, దంష్ట్రామయూఖైః - కోరలకిరణకాంతులచేత, శకలాని ముక్కలు ముక్కలుగా, కుర్వన్ - చేయుచున్నవాడియై, కించిత్ - కొంచముగా, విహస్య - నవ్వి, అర్థపతిం - సంపన్నుడైన దిలీపునుద్దేశించి, భూయః - మరల, బభాషే -

పలికెను. తరువాత సింహము తన కోరలకాంతులు గుహయందలి చీకటిని ముక్కలు చేయుచుండగా నవ్వి దిలీపునితో మరల పలికెను. కోరల కాంతులచేత చీకటి ముక్కలు ముక్కలుగా కనపడుచున్నదట! అనగా అంధకార బంధురమైన గుహలో దంష్ట్రా కాంతికిరణములు చొచ్చుకొని పోయినందున తిలతండులముల వలె తెల్లని కిరణములు, చీకటిముక్కలు కలిసి మనోహర దృశ్యముగా నేర్పడిన దని భావము. అద్భుతమైన భావన.

శ్లో. **ఏకాతపత్రం జగతః ప్రభుత్వం**
నవం వయః కాంత మిదం వపుశ్చ
అల్పస్య హేతోః బహుహాతు మిచ్ఛన్
విచారమూఢః ప్రతిభాసి మే త్వమ్. 47

వ్యాఖ్య : ఏకాతపత్రం - ఏకచ్ఛత్రాధిపత్యముగల, జగతః - ప్రపంచము యొక్క, ప్రభుత్వం - రాచఠీకమును, నవం క్రొత్తదైన, వయః - వయస్సును, కాంతం - చక్కదనముగల, ఇదంవపుః - ఈ శరీరమును, బహు - ఆనేకము, అల్పస్య - కొద్దిపాటిదైన, హేతోః - కారణమునకై, హాతుం - విడిచి పెట్టుటకు, ఇచ్ఛన్ - కోరుచున్న, త్వం - నీవు, మే - నాకు, విచారమూఢః - యుక్తాయుక్త విమర్శనజ్ఞానములేని మూర్ఖుడవుగా, ప్రతిభాసి - కనపడుచున్నావు. (అందుకే నవ్వుపచ్చినది) అల్పమైన గోవు ప్రాణమునకై ఏకచ్ఛత్రాధిపత్యము గల ప్రభుత్వము, నూత్నవయః సౌందర్యముగల దేహము విడువఁ దగినవి కావనియు, అట్లు విడువబూనుట వెట్టి యనియు తాత్పర్యము.

శ్లో. **భూతానుకంపా తవ చే దియం గౌః**
ఏకా భవేత్ స్వస్తిమతీ త్వదంతే,
జీవన్ పునః శశ్వ దుపప్లవేభ్యః
ప్రజాః ప్రజానాథ! పితేవ పాసి. 48

వ్యాఖ్య : ప్రజానాథ! - ఓ దిలీప మహారాజా! తవ - నీకు, భూతానుకంపాచేత్ - ప్రాణులయందు దయయే ఉండినచో, త్వదంతే (త్వత్ + అంతే) - నీ మరణానంతరము, ఇయం ఈ, ఏకా, గౌః - ఒక్క గోవు మాత్రమే, స్వస్తిమతీ - క్షేమముగలది, భవేత్ - ఆగును, జీవన్ పునః నీవు బ్రకితియున్న వాడవగుచో, పితేవ (పితా + ఇవ) - తండ్రివలె, ప్రజాః ప్రజలనందరిని, ఉపప్లవేభ్యః

భ్యః - ఉపద్రవములనుండి, శశ్వత్ - ఎల్లప్పుడును, పాసి - రక్షించుచుందువు. నీవు మరణించినచో నీ గోవు మాత్రమే బ్రతుకును. నీవు ప్రజానాథుడవు, ఒక్క గోవుకోసము ప్రాణములను విడుతువేని అనేక విపత్తులనుండి ప్రజాబాహుళ్యమును కాపాడవలసిన బాధ్యతగల రాజధర్మమును గోల్పోయి పతితుడవయ్యెదవు. కనుక నీ యు కి యు కముగా లేదు. అని సింహము పలికెను.

శ్లో. అథై కధేనో రపరాధ చండాత్
గురోః కృశానుప్రతిమాత్ బిభేషి,
శక్యోఽస్య మన్యు ర్భవతా వినేతుం
గాః కోటిశః స్పర్శయతా ఘటోధ్నీః. 49

వ్యాఖ్య : అథ - అట్లుకాక, ఏకధేనోః - ఒకే ఒక గోవు గల వాడను (కనుకనే), అపరాధచండాత్ - నీ యపరాధముచేత తీవ్రమైన కోపము గలవాడై, కృశాను ప్రతిమాత్ అగ్నిహోత్రునితో సమానుడగానగు, గురోః - గురుడైన వసిష్ఠుని పలన. బిభేషి భయపడుచున్నావా? అస్య - ఆయనయొక్క, మన్యుః - కోపము, ఘటోధ్నీః కుండలవంటి పొదుగులు గల, గాః - గోవులను, కోటిశః - కోట్లకొలదిగా, స్పర్శయతా దానముచేయునట్టి. భవతా - నీచేత, వినేతుం తొలగించుటకు, శక్యః సాధ్యమైనదే. ఈ గోవు పోయినందువలన కలుగు వసిష్ఠుని కోపమును కోట్లకొలదిగా నీవిచ్చు గోవులద్వారా పోగొట్టవచ్చును. కనుక గురుకోపమునకు భయపడకుము. దీనికి బదులుగా ననేక గోవుల నతనికిచ్చి కోపమును తొలగింపుమని భావము.

శ్లో. తద్రక్ష కల్యాణ పరంపరాణాం
భోక్తార మూర్జస్వల మాత్మదేహం.
మహీతల స్పర్శనమాత్ర భిన్నం
బుద్ధం హి రాజ్యం పద మైంద్ర మాహుః. 50

వ్యాఖ్య తత్ - అందువలన, కల్యాణపరంపరాణాం - శుభ పరంపరలను, భోక్తారం అనుభవించునట్టిదియును, ఊర్జస్వలం - మంచిబలము గలదియునగు, ఆత్మదేహం నీ శరీరమును, రక్ష - కాపాడుకొనుము; బుద్ధం - సర్వసంపదలతో వృద్ధిచెందిన, రాజ్యం - రాజ్యము, మహీతల స్పర్శనమాత్ర భిన్నం భూమిని స్పృశించుట మాత్రము చేతనే వేఱుగానున్న, ఐంద్రం ఇంద్ర

సంబంధమైన, పదం - పదవినిగా, ఆహూ:, హి - చెప్పుదురుగదా! సర్వసమృద్ధమైన రాజ్యము స్వర్గమే కనుక, దేహత్యాగము వలన నీకు కలుగబోవు స్వర్గమేదియు నుండదు. కనుక కల్యాణ పరంపరానుభవమునకు యోగ్యమైన దేహమును రక్షించుకొనుము.

శ్లో. ఏతావ దుక్త్వా విరతే మృగేంద్రే
ప్రతిస్వనే నాస్య గుహాగతేన
శిలోచ్చయోఽపి క్షితిపాల ముచ్చైః
ప్రీత్యా తమేవార్థ మభాషతేవ. 51

వ్యాఖ్య : మృగేంద్రే - సింహము, ఏతావత్ - ఇంతమాత్రము, ఉక్త్వా - పలికి, విరతే (సతి) - విరమించినది కాగా, గుహాగతేన - గుహయందు ప్రవేశించిన, అస్య - ఈ సింహము యొక్క, ప్రతిస్వనేన - ప్రతిధ్వని చేత, శిలోచ్చయః, అపి - పర్వతము గూడ, ప్రీత్యా - సంతోషముచేత, క్షితిపాలం - రాజును గుఱించి, తం. ఏవ, అర్థం - అదేయభిప్రాయమునే, ఉచ్చైః - బిగ్గరగా, అభాషతేవ (అభాషత + ఇవ) - పలికెనాయన్నట్లుండెను. గుహా ప్రతిధ్వనుల వలన సింహము పలుకులు దిలీపునికి రెండేసి పర్యాయములు వినపడెననియు, అది సింహ వచనములను పర్వతము సైతము ఆమోదించినట్లుండెనని భావము.

శ్లో. నిశమ్య దేవానుచరస్య వాచం
మనుష్యదేవః పున రప్యువాచ,
ధేన్వా తదధ్యాసిత కాతరాక్ష్యా
నిరీక్ష్యమాణః సుతరాం దయాళుః. 52

వ్యాఖ్య : దేవానుచరస్య - పరమేశ్వరుని సేవకుడైన సింహము యొక్క, వాచం - వాక్కును, నిశమ్య - విని, మనుష్యదేవః - రాజు, తదధ్యాసిత కాతరాక్ష్యా - తత్ - ఆ సింహము యొక్క, అధ్యాసిత - ఆక్రమణము చేత, కాతరాక్ష్యా - బెదరుచున్న చూపులు గల, ధేన్వా - గోవు చేత, నిరీక్ష్యమాణః - చూడబడుచున్న వాడగుచు, సుతరాం - ఇంకను ఎక్కువగా, దయాళుః - దయ గల

వాడగుచు, పునరపి - మరల కూడ, ఉవాచ - పలికెను. తనను సింహమునకు వదలిపెట్టు నేమో యని బెదరుచు, తనను చూచుచున్న గోవును చూచుచు, మిక్కిలి కఠినమైన హృదయము కలవాడైన దిలీపుడు మరల నిట్లు పలికెనని భావము.

శ్లో ఉదగ్రః కిల త్రాయత ఇత్యుదగ్రః
క్షత్రస్య శబ్దో భువనేషు రూఢః
రాజ్యేన కిం తద్విపరీత వృత్తేః
ప్రాణై రుపక్రోశ మలీమసై ర్వా. 53

వ్యాఖ్య : ఉదగ్రః - ఉన్నతమైన, క్షత్రస్య - క్షత్రియ వర్ణము యొక్క, శబ్దః - వాచకమైన పదము (అనగా క్షత్ర శబ్దము, లేదా క్షత్రియ శబ్దము), క్షతాత్ - నాశము నుండి, త్రాయతే - రక్షించును, ఇతి - అని (అను వ్యుత్పత్తి చేత), భువనేషు - లోకములందు, రూఢః కిల - ప్రసిద్ధమై యున్నదికదా! తద్విపరీత వృత్తేః - దానికి విరుద్ధమైన ప్రవర్తన గల వానికి, రాజ్యేన - రాజ్యముతో గాని, ఉపక్రోశమలీమసైః - నిందచేత మలినములైన, ప్రాణైః వా - ప్రాణములతో గాని, కిం - ఏమి పని ? క్షత్రియ శబ్దమునకు ఇతరులను కాపాడు వాడని యర్థము. అట్లు చేయలేని వానికి రాజ్యముతో గాని నింద్యములైన ప్రాణములతో గాని యేమి పని యని భావము. ఇది 'ఏకాతపత్రం' ఇత్యాది సింహ వచనమునకు సమాధానము. 'క్షత్ర' శబ్దము 'పంకజ' శబ్దము వలె యోగ రూఢము. అనగా వ్యుత్పత్త్యర్థమును, ప్రసిద్ధార్థమును గలది. అంతే కాని వట్టి ప్రసిద్ధార్థము గల 'అశ్వకర్ణ' వంటి శబ్దము కాదు. 'అశ్వకర్ణ' ఒక ఓషధి. అందులో అశ్వత్వము గాని, కర్ణత్వము గాని లేదు.

శ్లో. కథం ను శక్యో ఽనునయో మహర్షేః
విశ్రాణనా చ్చాన్యపయస్వినీనామ్,
ఇమా మనూనాం సురభే రవేహి
రుద్రౌజసా తు ప్రహృతం త్వయాస్యామ్. 54

వ్యాఖ్య : మహర్షేః - వసిష్ఠుని యొక్క, అనునయః చ - ఓదార్పు కూడ, అన్యపయస్వినీనాం - ఇతరములయిన పాడియావుల యొక్క, విశ్రాణనాత్ -

దానము వలన, కథం నుశక్యః - ఎట్లు సాధ్యపడును? ఇమాం - దీనిని, సురభేః - కామధేనువు కంటే, అనూనాం - తక్కువ కాని దానినిగా, అవేహి - తెలిసి కొనుము; అస్యాం - దీనిమీద, త్వయా - నీచేత, ప్రహృతం, తు - దెబ్బ పడుటయందువా? రుద్రౌజసా (రుద్ర + ఓజసా) - పరమేశ్వరుని సామర్థ్యము చేతనే. నీవు శివకింకరుడవై ఆ దేవుని ప్రభావము చేతనే దీనిమీద దెబ్బను వేసితివి కాని నీ శక్తి వలన కాదు, ఇది కామధేను తుల్య ప్రభావము గల గోవు. దీనికి బదులుగానేనెన్ని గోవులిచ్చినను సరిపోవు, వసిష్ఠుని కోపమును శమింపఁజేయుట అసాధ్యము అని దిలీపు డనెను.

శ్లో. సేయం స్వదేహార్పణ నిష్క్రయేణ
న్యాయ్యా మయా మోచయితుం భవత్తః
న పారణా స్యా ద్విహతా తవైవం
భవేదలుప్తశ్చ మునేః క్రియార్థః, ౬౫

వ్యాఖ్య: సేయం (సా + ఇయం) - అట్టి యీ నందినీ ధేనువు, మయా - నాచేత, స్వదేహార్పణ నిష్క్రయేణ - నా శరీరము నర్పించుట యను వెల చేత, భవత్తః - నీ నుండి, మోచయితుం - విడిపించుటకు, న్యాయ్యా - తగి యున్నది, ఏవం - ఈ విధముగా చేసినచో, తవ - నీ యొక్క, పారణా - భోజనము, విహతా - భంగము కలిగింపబడినది, న స్యాత్ - కాబోదు, మునేః - వసిష్ఠ మహర్షి యొక్క, క్రియార్థః చ - హోమక్రియ యను ప్రయోజనము కూడ, అలుప్తః - లోపించనిది, భవేత్ - కాఁగలదు. కనుక దీనిని విడిపించుట న్యాయ్యము, తల్లికై అల్లులు సాచుచున్న గోవత్సమునకును, వసిష్ఠ మునికిని నందినీ ధేనువే కావలెను. "అంకాగతస త్త్వవృ త్తి" దగ్గఱకు వచ్చిన ప్రాణిని భక్షింప వలసిన నీకు ధేను వై నను, నేనై నను, సమానమే కదా? యని సమా ధానము చెప్పెను.

శ్లో. భవానపీదం పరవా నవైతి
మహాన్ హి యత్న స్తవ దేవదారా,
స్థాతుం నియోక్తు ర్నహి శక్య మగ్రే
వినాశ్య రక్ష్యం స్వయ మక్షతేన. ౬౬

వ్యాఖ్య: పరవాన్ - పరతంత్రుఁడవైన, భవాన్, అపి - నీవుకూడ, ఇదం - ఈ చెప్పబోవు విషయమును, అవైతి - ఎఱుగుదవు; దేవదారౌ - దేవదారు వృక్ష విషయమున, తవ - నీ యొక్క, యత్నః - రక్షణ ప్రయత్నము, మహాన్ హి - గొప్పది కదా! రక్ష్యం - కాపాడదగిన వస్తువును, వినాశ్య - నాశము పొందించి, స్వయం - తాను మాత్రము, అక్షతేన - దెబ్బ తినకుండనున్న సేవకుని చేత, నియోక్తుః - తన స్వామి యొక్క, అగ్రే - ఎదుట, స్థాతుం - నిలుచుటకు, న, శక్యం, హి - సాధ్యము కాదు కదా! దేవదారు వృక్షమును నఱుంప జేసినచో నీవు శివుని యెదుట నిలువ సాధ్యము కానట్లే, నందినీ ధేనువును నఱుంపఁజేసి నేను వసిష్ఠుని యెదుట నిలువజాలనను విషయమును నీవెఱుగనిది కాదని భావము.

శ్లో. కి మప్యహింస్య స్తవ చేన్మతోఽహం
యశశ్శరీరే భవ మే దయాళుః
ఏకాంత విధ్వంసిషు మద్విధానాం
పిండే ష్వనాస్థా ఖలు భౌతికేషు. 57

వ్యాఖ్య: కిమపి - లేక, అహం - నేను, తవ - నీకు, అహింస్యః - చంపఁదగని వాడనుగా, మతః, చేత్ - ఇష్టుడనైతి నేని, మే - నా యొక్క, యశశ్శరీరే - కీర్తియనెడు శరీరము నందు, దయాళుః - కరుణగల వాడవు భవ - కమ్ము: మద్విధానాం - నాబోటి వారికి, ఏకాంత విధ్వంసిషు - తప్పక నఱించి పోవునట్టి, భౌతికేషు - పంచ భూతముల కలయికతో నేర్పడిన, పిండేషు శరీరముల యందు, అనాస్థా, ఖలు - అనపేక్షయే సుమా! నాకు శరీరము ముఖ్యము గాదు. వివేకవంతులయిన మాబోటి వారికి నశ్వరములైన దేహముల మీదికంటెను అనశ్వరమైన కీర్తిమీదనే యెక్కువ మక్కువ, కనుక నా దేహము మీద కాక నా కీర్తిమీద కరుణ జూపుమని దిలీపుడు పలికెను.

శ్లో. సంబంధ మాభాషణపూర్వ మాహుః
వృత్త స్స నౌ సంగతయో ర్వనాంతే
త దూఋతనా థానుగ! నార్హసి త్వం
సంబంధినో మే ప్రణయం విహంతుమ్. 58

వ్యాఖ్య : సంబంధం - సఖ్యమును, ఆభాషణపూర్వం - సంభాషణమే కారణముగా గలదానినిగా, ఆహుః - చెప్పుదురు, వనాంతే - అరణ్యమునందు, సంగతయోః - కలిసికొన్న, నౌ - మన యిద్దఱికి, సఃవృత్తః - అది జరిగినది, తత్ - అందువలన, హే భూతనాథానుగ - ఓ ఈశ్వరసేవకుడా! సంబంధినః - స్నేహితుడనైన, మే - నా యొక్క, ప్రణయం - ప్రార్థనను, విహంతుం - భంగపరచుటకు, త్వం - నీవు, నార్హసి (న + అర్హసి) - తగవు. పెద్దలు సంభాషణము వలన సఖ్యము కలుగునని చెప్పుదురు. అది మనకు జరిగినది కనుక సంబంధినైన నామాటను దీసివేయకుము. అని ధర్మబద్ధములును హేతు బద్ధములును అగు పలుకులతో దిలీప మహారాజు సింహమును నిరుత్తరమును గావించెను.

శ్లో. తథేతి గాం ముక్తవతే దిలీపః
సద్యఃప్రతిష్టంభ విముక్త బాహుః
స న్యస్త శస్త్రో హరయే స్వదేహ
ముపానయత్ పిండమి వామిషస్య. 59

వ్యాఖ్య : తథేతి (తథా + ఇతి) - అట్లేయని, గాం - ధేనువును. ముక్తవతే - విడిచి పెట్టినట్టి, హరయే - సింహము కొఱకు, సద్యఃః - వెంటనే, ప్రతిష్టంభవిముక్త బాహుఃః - స్తంభించుటనుండి విడివడిన బాహువుగల, సఃదిలీపఃః - ఆ దిలీపుడు, న్యస్తశస్త్రఃః - నేలపై నుంచబడిన ఆయుధము గలవాడగుచు, స్వదేహం - తన శరీరమును, ఆమిషస్య - మాంసము యొక్క, పిండం, ఇవ - కబళమును వలె, ఉపానయత్ - సింహసమీపమునకు జేర్చెను. సింహము దిలీపుని వచనముల నంగీకరించి ధేనువును విడువగా దిలీపుడు బాణ తూణీరములను నేలపై వదలి తన శరీరము నొక మాంసపు ముద్దనుగా సింహము వద్దకి జేర్చెను. ఈ శ్లోకమునందు కొందఱు వ్యాఖ్యాతలు "సన్న్యస్తశస్త్రఃః" అను పాఠమును గ్రహించి, దిలీపు డస్త్రసన్యాసమును చేసి తన దేహమును సింహమున కర్పించెననియు, గోరక్షణము చేయజాలని తన యస్త్రము వృథాయని భావించెననియు వ్యాఖ్యానించిరి. అట్లు చేసినచో మరల అస్త్రమును గ్రహించుట కతడు ప్రాయశ్చిత్త విధిని జరుపుకోవలసి యుండును, అట్టి సన్యాసమునకు బ్రవృత్తియు లేదు.

శ్లో. తస్మిన్ క్షణే పాలయితుఃప్రజానాం
ఉత్పశ్యతఃసింహనిపాత ముగ్రం,

అవాఙ్ముఖ స్యోపరి పుష్పవృష్టిః
పపాత విద్యాధర హస్త ముక్తా. 60

వ్యాఖ్య : తస్మిన్, క్షణే - ఆ క్షణమునందు, ఉగ్రం - భయంకరమైన, సింహనిపాతం - సింహము యొక్క పాటును, ఉత్పశ్యతః - ఊహించుచున్న వాడును, అవాఙ్ముఖస్య - క్రిందికివంచిన ముఖముగల వాడును, ప్రజానాం - ప్రజల యొక్క, పాలయితుః - పాలకుడైన దిలీపునియొక్క, ఉపరి - మీద, విద్యాధర హస్తముక్తాం - గగనచరులైన విద్యాధరులయొక్క చేతులనుండి విడువఁబడిన, పుష్పవృష్టిః - పుష్పవర్షము, పపాత - పడెను. అట్లు తనను ఱ్ఱిమింగుమని సింహాముముందు వంగిన దిలీపునిమీద విద్యాధరులు పుష్పవర్షము కురిపించిరి. కాని దిలీపుడు దానిని గమనింపక సమాహిత చిత్తుడై సింహనిపాతమున కెదురుచూచుచుండెను.

శ్లో. ఉత్తిష్ఠ వత్సే త్యమృతాయమానం
వచో నిశమ్యోత్థితముత్థిత స్సన్,
దదర్శ రాజా జననీ మివ స్వాం
గా మగ్రతః ప్రస్రవిణీం న సింహమ్. 61

వ్యాఖ్య : రాజా - దిలీప మహారాజు, అమృతాయమానం - అమృతము వంటిదగుచు, ఉత్థితం - బయలుదేరిన, "హేవత్స! ఉత్తిష్ఠ - నాయనా లెమ్ము" ఇతి - అను, వచః - మాటను, నిశమ్య - విని, ఉత్థితఃసన్ - లేచినవాడగుచు, అగ్రతః - ఎదుట, ప్రస్రవిణీం - పాలు కురియుచున్న, గాం - నందినీధేనువును, స్వాం జననీం, ఇవ - తన తల్లినివలె, దదర్శ - చూచెను, సింహం - సింహమును, న దదర్శ - చూడలేదు (సింహము అంతర్ధానమును పొందినది) అప్పుడు నాయనా! లెమ్ము అను అమృతవాక్కులు వినబడగానే దిలీపుడు లేచి నిల్చుండెను. ఎదుట పాలుకురియుచున్న నందిని మాత్రమే యున్నది. సింహము అదృశ్యమైనది.

శ్లో. తం విస్మితం ధేను రువాచ సాధో!
మాయాం మయోద్భావ్య పరీక్షితోఽసి,
ఋషిప్రభావా న్మయి నాంతకోఽపి
ప్రభుః ప్రహర్తుం కిముతాన్యహింస్రాః. 62

వ్యాఖ్య : విస్మితం ఆశ్చర్యముతోగూడిన, తం - ఆ దిలీపునిగుఱించి, ధేనుః - నందినీధేనువు, ఉవాచ - ఇట్లు పలికెను, సాధో! - ఓ సత్పురుషుడా! మయా - నాచేత, మాయాం మాయను, ఉద్భావ్య - కల్పించి, పరీక్షితః - పరీక్షింపబడినవాడవు, అసి - అగుచున్నావు; ఋషిప్రభావాత్ వసిష్ఠుని మహిమ పలన, అంతకః, అపి - యముడు కూడా, మయి - నా మీద, ప్రహర్తుం - దెబ్బ వేయుటకు, ప్రభుః - సమర్థుడు, న - కాడు, అన్యహింస్రాః - ఇతరములగు ఘాతుక మృగముముల విషయము, కిముత - ఏమి చెప్పవలెను? ఓ సజ్జనుడా! వినుము "వ్రతాచరణముకొఱకు నిన్ను వసిష్ఠుడు నావెంట పంపెనుగాని నన్ను రక్షించుటకుగాదు. నేను ఋషిమహిమచేతనే లేదా స్వీయప్రభావముచేతనే సురక్షితను. నన్నెవ్వరును చంపలేరు. ఈ జరిగినకథ నంతటిని నీ పరీక్షార్థమై నేను కల్పించితిని" అని విస్మితుడైయున్న రాజుతో నందిని యనెను,

శ్లో. భక్త్యా గురౌ మయ్యనుకంపయా చ
ప్రీతాస్మి తే పుత్ర! వరం వృణీష్వ,
న కేవలానాం పయసాం ప్రసూతి
మవేహి మాం కామదుఘాం ప్రసన్నామ్. 63

వ్యాఖ్య : పుత్ర - కుమారా! గురౌ . గురువునందలి, భక్త్యా - భక్తి చేతను, మయి - నాయందలి, అనుకంపయా చ - కరుణచేతను, తే నీకొఱకు, ప్రీతాస్మి (ప్రీతా + అస్మి)- తృప్తికలదానైతిని (నిన్ను గుఱించి సంతోషించితిని), వరం - వరమును, వృణీష్వ - కోరుకొనుము, మాం - నన్ను, కేవలానాం, పయసాం - ఒక పాలకుమాత్రమే, ప్రసూతిం - కారణమునుగా, న అవేహి - భావింపకుము (మంచి పాలిచ్చు గోవుగా మాత్రమే తలంపకుము), ప్రసన్నాం - ప్రసన్నురాలనై, కామధుఘాం - కోరికలనిచ్చు దానినిగా కూడ, అవేహి - తెలిసికొనుము. నీ గురుభక్తి చేతను, నాయందలి కరుణచేతను, సంతసించితిని 'వరమును కోరుము ఇచ్చెద'ననెను. 'పుత్ర!' అని సంబోధించుట పుత్రవరమును కోరుకొమ్మని సూచించుట. అంతేకాక, పదములవరుస "పుత్రవరం వృణీష్వ"అని యుండుట చమత్కారమును కలిగించుటయే కాక ఇక పుత్రవరమును కోరి సిద్ధిని పొందవచ్చుననియు సూచించును,

శ్లో. తత స్సమానీయ స మానితార్థీ
హస్తౌ స్వహస్తార్జిత వీరశబ్దః
వంశస్య కర్తార మనంతకీర్తిం
సుదక్షిణాయాం తనయం యయాచే. 64

వ్యాఖ్య : తతః - తరువాత, మానితార్థీ - గౌరవింపబడిన యాచకులు గల వాడును, స్వహస్తార్జిత వీరశబ్దః (స్వహస్త + ఆర్జిత + వీర + శబ్దః) తన భుజ ములచేత సంపాదింపఁబడిన 'వీర' అను బిరుద శబ్దముగల వాడును అగు, సః - ఆ దిలీపుడు, హస్తౌ - రెండు చేతులను, సమానీయ - జోడించి, (దోసిలినొగ్గి) వంశస్య - తనవంశమునకు, కర్తారం - ప్రవర్తకుడును, అనంతకీర్తిం - విస్తార మైన యశస్సు గలవాడును నగు, తనయం - పుత్రుని, సుదక్షిణాయాం - సుద క్షిణా దేవియందు, (కలుగునట్లు) యయాచే - యాచించెను. ఎందతో యర్థు లను తృప్తి పరచిన మహావీరుఁడగు దిలీపుఁడు చేతులు జోడించి వంశ ప్రతిష్ఠాప కుఁడైన కుమారుని ఇమ్మని నందినీ ధేనువును వరమడిగెను. సూర్యవంశమున 'ఇక్ష్వాకుడు' ప్రవర్తకు డగుటచే "కాకుస్థ వంశమనియు, ఇక్ష్వాకుడు ప్రవర్తకు డగుటచేత ఇక్ష్వాకువంశ" మనియు ఇంతవరకు ప్రసిద్ధమయ్యెను. ఇకమీద తనకు పుట్టబోవు కుమారుని పేరుతో ప్రసిద్ధము కావలెను. అది దిలీపుని కోరిక. అది నందినీ వరము చేత సిద్ధించి రఘువు పుట్టును. అతని పేరుతో నికమీద రఘు వంశపు రాజు లను పేరు వచ్చును. కాళిదాసు తన కావ్యమున కందులకే "రఘు వంశము" అని నామకరణము చేసెను.

శ్లో సంతానకామాయ తథేతి కామం
రాజ్ఞే ప్రతిశ్రుత్య పయస్వినీ సా
దుగ్ధ్వా పయః పత్రపుటే మదీయం
పుత్రోపభుంక్ష్వేతి త మాదిదేశ. 65

వ్యాఖ్య : సా, పయస్వినీ - ఆ పాడియావు, సంతాన కామాయ - సంతతిని గోరుచున్న, రాజే - దిలీప మహారాజు కొఱకు, తథేతి - సరేయని, కామం - కోరికను, ప్రతిశ్రుత్య - తప్పక యిచ్చెదనని చెప్పి, పుత్ర - ఓ కుమారా! మదీ యం, పయః - నా పాలను, పత్రపుటే - ఒక ఆకు దొప్పయందు, దుగ్ధ్వా -

పిండుకొని, ఉపభుంక్ష్వ - భుజింపుము (త్రాగుము). ఇతి - అని, తం - అతనిని, ఆదిదేశ . ఆజ్ఞాపించెను,

శ్లో. వత్సస్య హోమార్థవిధేశ్చ శేషం
గురో రనుజ్ఞా మధిగమ్య మాతః
ఔధస్య మిచ్ఛామి తవోపభోక్తుం
షష్ఠాంశ ముర్వ్యా ఇవ రక్షితాయాః. 66

వ్యాఖ్య: మాతః - ఓ తల్లీ ! వత్సస్య - దూడ యొక్కయు, హోమార్థ విధేశ్చ - హోమక్రియా విధి యొక్కయు, శేషం - మిగిలినట్టి (ఆ రెండు పనులకు కాగా మిగిలినట్టి) తవ - నీ యొక్క, ఔధస్యం - క్షీరమును, రక్షితాయాః - నాచే కాపాడబడిన, ఉర్వ్యాః - భూమి యొక్క (భూఫలితము యొక్క) షష్ఠాంశం, ఇవ - ఆఱవ భాగమునువలె, గురోః - గురువైన వసిష్ఠుని యొక్క, అనుజ్ఞాం - సమ్మతిని, అధిగమ్య - పొంది, ఉపభోక్తుం - అనుభవించుటకు, ఇచ్ఛామి - కోరుచున్నాను, పాలుదొన్నెలో పిండుకొని త్రాగుమన్న నందినితో తల్లీ ! వసిష్ఠ హోమమునకును, నీబిడ్డకును సరిపోగా మిగిలిన పాలను గురువునానతి పొంది త్రాగెదనని పలికెను. 'షష్ఠాంశమును' భూస్వామి యనుమతితోనే రాజు పన్నుగా గ్రహింపవలెను, యజమాని లేని సమయమున పంటనంతటిని రాజు గ్రహించుట ధర్మము కాదు. అందువలన దిలీపుడు గురు సమ్మతిని అపేక్షించినాడు. ఇది కాళిదాసు రాజనీతి వైశారద్యమునకు సూచకము.

శ్లో. ఇత్థం క్షితీశేన వసిష్ఠధేనుః
విజ్ఞాపితా ప్రీతతరా బభూవ
తదన్వితా హైమవతాచ్చ కుక్షేః
ప్రత్యాయయా వాశ్రమ మశ్రమేణ. 67

వ్యాఖ్య: ఇత్థం - ఈ విధముగా, క్షితీశేన - రాజు చేత, విజ్ఞాపితా - విన్నవింపబడిన, వసిష్ఠధేనుః - వసిష్ఠుని గోవు, ప్రీతతరా - మరింతగా సంతోషించినది, బభూవ - ఆయెను; తదన్వితా - ఆయనతో కలసినదియై, హైమవతాత్, కుక్షేః - హిమవత్పర్వతగుహ నుండి, అశ్రమేణ - సుఖముగా, ఆశ్రమం - ఆశ్రమమును గురించి, ప్రత్యాయయౌ, చ - తిరిగి వచ్చెను, కూడ.

దిలీపుని వచనముల వలన మిక్కిలి సంతోషించిన నందిని హిమగిరి గుహ నుండి దిలీప సహితముగా వసిష్ఠాశ్రమమునకు సుఖముగా తిరిగివచ్చెను.

శ్లో. తస్యాః ప్రసన్నేందుముఖః ప్రసాదం
గురు ర్నృపాణాం గురవే నివేద్య
ప్రహర్ష చిహ్నానుమితం ప్రియాయై
శశంస వాచా పునరుక్తయేవ. 68

వ్యాఖ్య: ప్రసన్నేందుముఖః - నిర్మలమైన చంద్రునివంటి ముఖముగల, నృపాణాం, గురుః - రాజులందఱిలోను పెద్దవాడైన దిలీపుడు, ప్రహర్ష చిహ్నాను మితం - తన సంతోషాతిశయము యొక్క చిహ్నాముల చేతనే ఊహింపబడిన (ప్రహర్ష + చిహ్న + అనుమితం), తస్యాః - ఆ ధేనువు యొక్క, ప్రసాదం - అనుగ్రహమును, పునరుక్తయేవ (పునరుక్తయా + ఇవ - తెలిసిన విషయమునే మరల చెప్పుచున్నట్లున్న, వాచా - వాక్కుచేత, గురవే - గురువైన వసిష్ఠుని కొఱకు, నివేద్య - విన్నవించి, ప్రియాయై - ప్రియురాలైన సుదక్షిణకును, శశంస - చెప్పెను. చెప్పినది చెప్పుట పునరుక్తి, కాని యిచ్చట ముఖ చిహ్నాములచేతనే గ్రహించిన వసిష్ఠ సుదక్షిణలకు దిలీపుని హృక్కు పునరుక్తియా యను నట్లు భాసించినది. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. స నందినీ స్తన్య మనిందితాత్మా
సద్వత్సలో వత్సహుతావశేషం
పపౌ వసిష్ఠేన కృతాభ్యనుజ్ఞః
శుభ్రం యశో మూర్త మివాతితృష్ణః. 69

వ్యాఖ్య: అనిందితాత్మా - మెచ్చదగిన స్వభావము గలవాడును, సద్వత్సలః - మంచివారి యందు ప్రేమకలవాడును నగు, సః - ఆ దిలీపుడు, వసిష్ఠేన - వసిష్ఠునిచేత, కృతాభ్యనుజ్ఞః. (కృత + అభి + అనుజ్ఞః) - చేయబడిన యనుమతి కలవాడై, వత్సహుతావశేషం - వత్సకు, హోమమునకు, సరిపోగా మిగిలిన, నందినీ స్తన్యం - నందినీ ధేనువు క్షీరమును, శుభ్రం - తెల్లనిదియు, మూర్తం - రూపమును ధరించిన (మూర్తిమంతమైన) యశః, ఇవ - కీర్తినివలె, అతితృష్ణః (సన్) - మిక్కిలి దప్పిగొన్న వాడగుచు, పపౌ - పానముచేసెను.

పవిత్రాత్మగల దిలీపుడు వసిష్ఠానుమతి పొంది వత్సకు హోమమునకు సరిపడగా ఱ్ఱాళ్ళు కుడుళ్ళును మూర్తీభవించిన కీర్తినివలె మిక్కిలి శ్రద్ధతో పానముచేసెను. కీర్తి తెల్లగా నుండునని కవి సమయము. ఇచ్చట క్షీరము మూర్తిమంతమైన యశస్సుగా భావింపబడినది కనుక ఉత్ప్రేక్షాలంకారము.

శ్లో. ప్రాత ర్యథోక్త వ్రత పారణాంతే
ప్రాస్థానికం స్వస్త్యయనం ప్రయుజ్య
తౌ దంపతీ స్వాం ప్రతి రాజధానీం
ప్రస్థాపయామాస వశీ వసిష్ఠః. 70

వ్యాఖ్య: వశీ - జితేంద్రియుడైన, వసిష్ఠః - వసిష్ఠుడు, ప్రాతః - మరునాటి ప్రాతఃకాలమున, యథోక్త వ్రతపారణాంతే (యథా + ఉక్త + వ్రత + పారణా + అంతే) - శాస్త్రోక్తమైన గోసేవావ్రత సమాప్తియందు చేయవలసిన భోజనము చేసినపిమ్మట, ప్రాస్థానికం - ప్రయాణకాలమునందు చేయవలసిన, స్వస్త్యయనం - శుభాశీర్వచనమును, ప్రయుజ్య - చేసి, తౌ - ఆ, దంపతీ - భార్యాభర్తలను, స్వాం, రాజధానీం, ప్రతి - తమరాజధానీ నగరమును గుఱించి, ప్రస్థాపయామాస - ప్రయాణము చేయించెను. వసిష్ఠుడు వ్రతసమాప్తిని గావించిన సుదక్షిణా దిలీపులను భోజనము చేయించి మరునాడు స్వనగరమునకు ప్రయాణము చేయించెను.

శ్లో. ప్రదక్షిణీకృత్య హుతం హుతాశం
అనంతరం భర్తు రరుంధతీం చ
ధేనుం సవత్సాం చ నృపః ప్రతస్థే
సన్మంగ ళోదగ్రతర ప్రభావః. 71

వ్యాఖ్య: నృపః - దిలీపమహారాజు, హుతం - అప్పుడే హోమము చేయబడిన, హుతాశం - అగ్నినీ (హోమద్రవ్యముచే ప్రజ్వలించి మండుచున్న అగ్నిదేవునినీ), భర్తుః - భర్తయైన వసిష్ఠుని యొక్క, అనంతరం - తరువాత, అరుంధతీం చ - అరుంధతీదేవిని, సవత్సాం - దూడతో కలిసియున్న, ధేనుం చ - నందినీధేనువును, ప్రదక్షిణీకృత్య - ప్రదక్షిణముచేసి (అందఱికిని ప్రదక్షిణము చేసి యని యర్థము). సన్మంగళోదగ్రతర ప్రభావః (సత్ + మంగళ + ఉదగ్ర

తర + ప్రభావః) - మంచి ప్రదక్షిణాది మంగళాచారములచేత, మిక్కిలి యతిశ
యించిన మహిమగల వాడగుచు, ప్రతస్థే - బయలుదేరెను. దిలీపుడు హోమా
గ్నికిని, వసిష్ఠునికిని, అరుంధతికిని, సవత్సయైన నందికిని ప్రదక్షిణముచేసి,
తన్మూలమున అతిశయించిన తేజస్సుగల వాడై బయలుదేరెను. పుత్రవరప్రాప్తి,
గురుజన సేవాలాభము, దిలీపుని ప్రభావము 'ఉదగ్రతరము' అనగా మిక్కిలి
యినుమడించుటకు కారణములు. మహాసంతోషముతో తిరిగివెళ్లెనని యభిప్రాయము.

శ్లో. శ్రోత్రాభిరామ ధ్వనినా రథేన
స ధర్మపత్నీ సహితః సహిష్ణుః,
యయా వనుద్ఘాత సుఖేన మార్గం
స్వేనేవ పూర్ణేన మనోరథేన. 72

వ్యాఖ్య: ధర్మపత్నీ సహితః - భార్యాసహితుడును, సహిష్ణుః - వ్రతాది
కష్టములను సహించు స్వభావము గలవాడునగు, సః - ఆ దిలీపుడు, శ్రోత్రాభిరామ
ధ్వనినా - చెవులకింపైన ధ్వనిగలదియు, అనుద్ఘాత సుఖేన - కుదుపులు లేనందున
సుఖకరమైనదియు నగు, రథేన - రథముచేత, స్వేన - తనదియగు, పూర్ణేన -
సఫలమైన, మనోరథేనేవ (మనోరథేన + ఇవ) - కోరికచేత వలెనే, మార్గం -
క్రోవను, యయౌ - నడచెను. శ్రుతి సుఖమును గలిగించు ధ్వనిగల రథముపై
ధర్మపత్నీ సహితుడైన దిలీపుడు పూర్ణమనోరథుడై స్వనగరమునకు వెళ్లెను.
దిలీపుడు వసిష్ఠనివద్దకి వచ్చునప్పుడు, రథధ్వని "స్నిగ్ధగంభీర నిర్ఘోషమై" యుండి
నది. ఇప్పుడు "అనుద్ఘాతసుఖము"గా నున్నది. అప్పుడు చింతాక్రాంతుడైయున్నం
దున అది రణగొణ ధ్వని, ఇప్పుడు సంతోషచిత్తుడు గావున శ్రోత్రాభిరామధ్వని.
మనోరథపక్షమున సుతుడు కలుగునన్న సుఖవాక్యశ్రుతి.

శ్లో. త మాహితౌత్సుక్య మదర్శనేన
ప్రజాః ప్రజార్థవ్రత కర్శితాంగం,
నేత్రైః పపుః తృప్తి మనాప్నువద్భిః
నవోదయం నాథ మివౌషధీనామ్. 73

వ్యాఖ్య: అదర్శనేన - ఇంతకాలము కనబడకుండుటచేత, ఆహితౌ
త్సుక్యం (ఆహిత + ఔత్సుక్యం) - కలిగింపబడిన ఉత్కంఠకలవాడును, ప్రజార్థ

Acc NO. 10054

వ్రత కర్మితాంగం - సంతానార్థమైన వ్రతముచేత కృశించిన శరీరము గలవాడును, నవోదయం - సూతనాభ్యుదయము కలవాడును నగు, తం - ఆ దిలీపుని, ప్రజాః- ప్రజలు, తృప్తిం - తృప్తిని, అనాప్నువద్భిః - పొందలేకున్నట్టి, నేత్రైః - కన్నులతో, ఓషధీనాం, నాథం, ఇవ - చంద్రునినివలె, పపుః - పానము చేసిరి (మిక్కిలి ఆసక్తిసతో చూచిరని యర్థము) చంద్రపక్షమున, అదర్శనేన - కాలమువలన (కృష్ణపక్ష) కనబడకుండుట, వ్రత - తన కళలను దేవతలకు వరుసగానిచ్చు వ్రతము. నవోదయం-శుక్లపక్షోదయము, మొదలయిన యర్థములను గ్రహింపవలెను.

శ్లో. పురందరశ్రీః పుర ముత్పతాకం
ప్రవిశ్య పౌరై రభినంద్యమానః,
భుజే భుజంగేంద్ర సమాన సారే
భూయః స భూ మే ర్ధుర మాపసంజ.

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No. 74

వ్యాఖ్య: పురందరశ్రీః - దేవేంద్రుని సంపదవంటి సంపదగల, సః - ఆ దిలీపుడు, పౌరైః - ఎదురొక్కనుటకు వచ్చిన పురజనులచేత, అభినంద్యమానః- సంతోష పెట్టబడుచున్నవాడగుచు, ఉత్పతాకం - ఉన్నతముగా చేయబడిన జెండాలుగల, పురం - పట్టణమును, ప్రవిశ్య - ప్రవేశించి, భుజగేంద్ర సమానసారే - ఆదిశేషునితో సమానమైన బలముగల, భుజే - తన భుజమునందు, భూయః - మరల, భూమేః -భూమియొక్క, ధురం - భారమును, ఆససంజ - వహించెను. "తేన ధూర్జగతో గుర్వీ సచివేషు నిచిక్షిపే" (ప్రథమసర్గ 34 శ్లో) ఆశ్రమమునకు వెళ్లినప్పుడు మంత్రులపై నుంచబడిన రాజ్యభారమును మరల వహించెనని భావము. "ఉత్పతాకం" రాజులు రాజధానీ నగరమును విడిచి వెళ్లినప్పుడు సౌధములమీద జెండాను తీసియుంచుటయు, వారు నగరమును చేరగానే మరల పతాకము నెగుఱవేయుటయు నాచారమై యుండెను. దానివలన ప్రజలకు రాజు నగరమున నుండెనా? లేక గ్రామాంతరమునకు వెళ్లెనా యను సంశయము కలుగకుండుటయు, ఇతరములగు మరికొన్నియు ప్రయోజనములు.

శ్లో. అథ నయనసముత్థం జ్యోతి రత్రేరివ ద్యౌః
సురసరిదివ తేజో వహ్నినిష్ఠ్యూత మైశం,

నరపతికుల భూత్యై గర్భ మాధత్త రాజ్ఞీ
గురుభి రభినివిష్టం లోకపాలానుభావైః. 75

వ్యాఖ్య: అథ - తరువాత, ద్యౌః - ఆకాశము, అత్రేః - అత్రిమహర్షి యొక్క, నయనసముత్థం - నేత్రమునుండి పుట్టిన, జ్యోతిః, ఇవ - కాంతినివలె (చంద్రునిని వలెను), సురసరిత్ - దేవనదియైన గంగ, వహ్నిష్ఠ్యాత - అగ్ని చేత ఉంచబడిన, ఐశం - ఈశ్వర సంబంధమైన, తేజః, ఇవ - వీర్యరూపమైన షణ్ముఖునివలెను, రాజ్ఞీ - సుదక్షిణాదేవి, నరపతి కులభూత్యై - దిలీపుని వంశాభి వృద్ధికొఱకు, గురుభిః - గొప్పవియైన, లోకపాలానుభావైః - దిక్పాలకుల తేజ స్సులచేత, అభినివిష్టం - ప్రవేశింపబడిన, గర్భం - గర్భమును, ఆధత్త - ధరిం చెను. అత్రి మహాముని నేత్రమునుండి చంద్రుడు పుట్టినట్లు హరివంశము నందు న్నది. శివవీర్యమును అగ్నితెచ్చి గంగానదియం దుంచుటచేత కుమారస్వామి పుట్టి నట్లు రామాయణాదులందు కలదు. ఇచ్చట చెప్పబడిన "లోకపాల" శబ్దము దిలీపు నికి పర్యాయపదము, "అష్టానాం లోకపాలానాం వపుర్ధారయతే నృపః" అని మనుస్మృతి. ఇందలి "ఆధత్త" అను క్రియ స్త్రీ కర్తృకమైన గర్భధారణమును తెలుపును. వైదికమత సంప్రదాయము ననుసరించి భర్త, భార్యను, "నీవు గర్భ మును ధరించి పదియవమాసమున ప్రసవింపుము" అని కోరవలసినట్లు ఋగ్వేదాశ్వ లాయన సీమంతమంత్రము చెప్పుచున్నది. "యథేయం పృథివీమహ్యాత్తానా గర్భ మాదధే, ఏవం త్వం గర్భమాధేహి దశమే మాసి సూతవే" కనుక సుదక్షిణ పై విధ ముగా గర్భమును ధరించినట్లు చెప్పుట కాళిదాసుయొక్క లౌకిక, వైదిక పాండితికి తార్కాణము.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ
కావ్యమున ద్వితీయ సర్గకు
తెలుగు లఘువ్యాఖ్య.

మహాకవి కాళిదాసకృత రఘువంశ మహాకావ్యము

తృతీయసర్గము

శ్లో. అథేప్సితం భర్తు రుపస్థితోదయం
సఖీజనోద్వీక్షణ కౌముదీముఖం,
నిదాన మిక్ష్వాకుకులస్య సంతతేః
సుదక్షిణా దౌర్హృదలక్షణం దధౌ. 1

వ్యాఖ్య : అథ - గర్భధారణము తర్వాత, సుదక్షిణా - రాణియైన సుదక్షిణాదేవి, ఉపస్థితోదయం - సమీపించిన ఫలకాలముగల, భర్తుః - పతియైన దిలీపుని యొక్క, ఈప్సితం - మనోరథ మైనట్టిదియు, సఖీజనోద్వీక్షణ కౌముదీముఖం - సఖీజన - చెలికత్తెలయొక్క, ఉద్వీక్షణ - ఎదురుచూపులకు, కౌముదీముఖం - వెన్నెల వచ్చుట వంటిదియు, ఇక్ష్వాకు కులస్య - ఇక్ష్వాకు వంశముయొక్క, సంతతేః - అవిచ్ఛిన్నతకు, నిదానం - మూలకారణమైనదియు నగు, దౌర్హృదలక్షణం - గర్భచిహ్నమును (ముందు చెప్పబోవు రీతిగా), దధౌ - ధరించెను, "సఖీజనోద్వీక్షణ కౌముదీ మహమ్" అని మరియొక పాఠము గలదు. 'కౌముదీ' అనగా దీపోత్సవతిథి (పండుగ). భవిష్యోత్తర పురాణమునందు "కౌముదీతే జనా యస్యాం తేనాసౌ కౌముదీ మతా" అని చెప్పబడి యున్నది. సుదక్షిణా గర్భచిహ్నము సఖీజనమున కా పండుగవంటిడని భావము. మాతృహృదయము, శిశు హృదయమును కలిసి యుండుటచేత గర్భమునకు "దౌర్హృదము" అని పేరు వచ్చినది. అలంకారము : రూపకము.

శ్లో శరీరసాదా దసమగ్ర భూషణా
ముఖేన సా లక్ష్యత లోధ్రపాండునా,

తనుప్రకాశేన విచేయతారకా
ప్రభాతకల్పా శశినేవ శర్వరీ. 2

వ్యాఖ్య : శరీరసాదాత్ - దేహము యొక్క కృత్యముపలన, అసమగ్ర భూషణా - కొన్ని యాభరణములు మాత్రమే ధరించినదియు, లోధ్రపాండునా - లొద్దుగు పువ్వువలె తెల్లబడిన, ముఖేన - ముఖముతో (కూడిన), సా - ఆ సుదక్షిణా దేవి, విచేయతారకా - వెదుకదగిన నక్షత్రములు గలదియు, (కొద్దిపాటి తారకలు గలది) తను ప్రకాశేన - అల్పమైన కాంతిగల, శశినా చంద్రునితో (కూడినది) ప్రభాతకల్పా ప్రాతఃకాల ప్రాయమైన, శర్వరీ, ఇవ - రాత్రివలె, అలక్ష్యత - కనబడెను. కొద్దిపాటి యాభరణములతోను, లొద్దుగపువ్వువలె తెల్లబారిన ముఖముతోను, చిక్కిపోయిన శరీరముతోను ఉన్న సుదక్షిణాదేవి లెక్కింపదగిన చుక్కలతో, కాంతి తఱిగి పోయిన చంద్రబింబముతోను కూడి తెల్లవారబోయే ముందున్న రాత్రివలె కనబడుచుండెనని భావము. ఈ ఉపమాలంకారము వలన "క్షామత" అను గర్భ లక్షణము చెప్పబడినది. రాత్రిని వెన్నెల రాత్రినిగా చెప్పుట చక్కని ఉపమానము.

శ్లో. తదాననం మృత్సురభి క్షితీశ్వరో
రహ స్యుపాఘ్రాయ న తృప్తి మాయయౌ,
కరీవ సిక్తం పృషతైః పయోముచాం
శుచివ్యపాయే వనరాజి పల్వలమ్. 3

వ్యాఖ్య : క్షితీశ్వరః - రాజు, రహసి - ఏకాంతమునందు, మృత్సురభి - మట్టిచేత సువాసనకలదైన, తదాననం - ఆ సుదక్షిణాదేవి ముఖమును, ఉపాఘ్రాయ వాసనచూచి, తృప్తిం - తృప్తిని, న, ఆయయౌ - అంతగా పొందలేదు. (ఎవరు దేనినివలె) శుచి వ్యపాయే - శుచి - గ్రీష్మ ఋతువు యొక్క, వ్యపాయే - అవసానమునందు, పయోముచాం - మేఘములయొక్క, పృషతైః - నీటిచుక్కలచేత, సిక్తం - తడుపబడిన, వనరాజ్యాః - అరణ్య పంక్తికి సంబంధించిన, పల్వలం చిన్న సరస్సును, ఉపాఘ్రాయ - మూర్కొనిన పిమ్మట, కరీవ - ఏనుగువలెనే. తొలకరి చినుకులు పడినప్పుడు వచ్చు భూగంధముగల చిన్నచిన్న గుంటలలో ఏనుగులు నేలను మూర్కొనుచు ఆనందపడినట్లు, దిలీపుడు మట్టివాసనతో కూడిన సహజసుగంధమగు సుదక్షిణా ముఖ పరిమళమును పదే పదే

ఆఘ్రాణించుచుండెనని భావము. గర్భిణీస్త్రీలు మృద్భక్షణము చేయుట లోక ప్రసిద్ధము. దీని వలన "దోహదము" అను లక్షణము చెప్పబడినది.

శ్లో. దివం మరుత్వానివ భోక్ష్యతే భువం
దిగంత విశ్రాంత రథో హి తత్సుతః,
అతోఽభిలాషే ప్రథమం తథావిధే
మనో బబంధాన్యరసాన్ విలంఘ్య సా. 4

వ్యాఖ్య : హి - ఎందువల్లనైతే, దిగంత విశ్రాంత రథః - దిగంతము లందు విశ్రమించునట్టి రథములుగలుగు (చక్రవర్తికానున్న), తత్సుతః - ఆ సుదక్షిణా కుమారుడు, మరుత్వాన్ - ఇంద్రుడు, దివం, ఇవ - స్వర్గమునువలె, భువం - భూమిని, భోక్ష్యతే - అనుభవింపబోవనున్నాడో, అతః - ఇందువలన, ప్రథమం - మొదట, సా - ఆమె, తథావిధే - ఆ విధమైన (భూవికారమైన మట్టి) అభిలాషే - భోగ్యవస్తువునందు, అన్యరసాన్ - ఇతర రసములు గల పదార్థములను, విలంఘ్య - అతిక్రమించి (విడిచి), మనః - మనస్సును, బబంధ - నిలిపెను. ఇతర గంధములకంటె నామెకు మట్టి వాసనయే యెక్కువ ఇష్టముగానుండెను. 'దోహద' లక్షణమైన మృద్భక్షణమును గురించిన ఉత్ప్రేక్ష ఇది. పుట్టబోవు పుత్రుని భూభోగసూచనార్థమైనదే యీ మృద్భక్షణము అని తాత్పర్యము.

శ్లో. న మే హ్రియా శంసతి కించి దీప్సితం
స్పృహావతీ వస్తుషు కేషు మాగధీ,
ఇతి స్మ పృచ్ఛ త్యనువేల మాదృతః
ప్రియాసఖీ రుత్తర కోసలేశ్వరః. 5

వ్యాఖ్య : మాగధీ - మగధరాజ పుత్రియైన సుదక్షిణ, హ్రియా - సిగ్గుచేత, కించిత్, ఈప్సితం - ఏ కోరికనుగూడ, మే - నాకు, న శంసతి - చెప్పదు, కేషు వస్తుషు - ఏ వస్తువులయందు, స్పృహావతీ - కోరిక గలదైయున్నదో : ఇతి - అని, అనువేలం - అనుక్షణమును (నిమిషనిమిషమునకు) ఆదృతః - ఆదరము కలవాడై, ప్రియాయాః - భార్యయొక్క, సఖీ - చెలికత్తెలను (దాసీ

లను), ఉత్తర కోసలేశ్వరః - ఉత్తర కోసల దేశమునకు ప్రభువైన దిలీపుడు, పృచ్ఛతిస్మ - అడిగెను. సఖులకైనచో కోరికలు దాపక చెప్పునని యభిప్రాయము. "ఉత్తర కోసలేశ్వర మాగధీ" శబ్దములు వారి యాభిజాత్యమును వెల్లడించుచున్నవి.

శ్లో. ఉపేత్య సా దోహద దుఃఖ శీలతాం
యదేవ వవ్రే తదపశ్య దాహృతమ్,
న హీష్ట మస్య ద్రిదివేఽపి భూపతేః
అభూ దనాసాద్య మధిజ్యధన్వనః. 6

వ్యాఖ్య: సా - ఆ సుదక్షిణాదేవి, దోహద దుఃఖశీలతాం - దోహద - గర్భిణీ మనోరథముచేత, దుఃఖశీలతాం - దుఃఖ స్వభావము కలిగియుండుటను, ఉపేత్య - పొంది, యత్ - ఏ వస్తువును, వవ్రే - కోరెనో, తత్ - ఆ వస్తువు, (భర్త్రా - భర్తచేత), ఆహృతం - తీసుక రాబడినదిగా, అపశ్యదేవ - చూడనే చూచెను (పొందెనని యర్థము), హి - ఎందువలన ననగా, అధిజ్యధన్వనః అస్య భూపతేః - ధనుర్ధరుడగు ఈ దిలీపమహారాజునకు, త్రిదివేపి - స్వర్గమునందుఁగూడ, ఇష్టం - కోరబడిన వస్తువు, అనాసాద్యం - పొంద శక్యముగానిది, న అభూత్ - లేకుండెను. గర్భిణీ మనోరథమును తీర్చకపోయినచో గర్భమునకు వికారముగాని, స్రావముగాని కలుగునని యాయుర్వేదము. కనుక దిలీపుఁడు సుదక్షిణపై గల యనురాగవిశేషముచేఁ గాక శాస్త్రసమ్మత మనియే ఆమె కోర్కెలను దీర్చుచుండెనని భావము. "దోహదస్యాప్రదానేన గర్భోదోషమవాప్నుయాత్" అని ప్రమాణము.

శ్లో. క్రమేణ నిస్తీర్య చ దోహదవ్యథాం
ప్రచీయమానావయవా రరాజ సా,
పురాణ పత్రాపగమా దనంతరం
లతేవ సన్నద్ధ మనోజ్ఞ పల్లవా. 7

వ్యాఖ్య: సా - ఆ సుదక్షిణాదేవి, క్రమేణ - క్రమముగా, దోహద వ్యథాం - దౌర్హృదక్లేశమును (గర్భిణీ బాధను) చ - కూడ, నిస్తీర్య - దాటి,

ప్రచీయమానావయవా - ఆరోగ్యపడుచున్న అవయవములు గలవి యగుచు, పురాణపత్రాపగమాత్, అనంతరం - పండుటాకులు రాలిపోయిన పిమ్మట, సంనద్ధ మనోజ్ఞ పల్లవా - సంనద్ధ - మొలచిన, మనోజ్ఞ - అందమైన, పల్లవా - చిగుళ్లుగల, లతేవ - తీగవలె, రరాజ - ప్రకాశించెను. క్రమక్రమముగా క్లేశము తగ్గిన సుదక్షిణ, పండుటాకులు రాలినపిమ్మట చిగిర్చిన తీగవలె నిగనిగలాడుచు అందముగా గనబడుచుండెనని భావము.

శ్లో. దినేషు గచ్ఛత్సు నితాంతపీవరం
తదీయ మానీలముఖం స్తనద్వయమ్,
తిరశ్చకార భ్రమరాభిలీనయోః
సుజాతయోః పంకజకోశయోః శ్రియమ్. 8

వ్యాఖ్య: దినేషు - దోహదదినములు, గచ్ఛత్సు - గడచుచున్నవి కాగా, నితాంతపీవరం - మిక్కిలి బలసినదియు, ఆనీలముఖం - అంతట నల్లబడిన చూచుకములు గలదియు నగు, తదీయం స్తనద్వయం - ఆ సుదక్షిణాదేవిది యగు చన్నుగవ, భ్రమరాభిలీనయోః - తుమ్మెదలచే గప్పబడినవియు, సుజాతయోః - సుందరములైన, పంకజకోశయోః - తామర మొగ్గలయొక్క, శ్రియం - కాంతిని, తిరశ్చకార - తిరస్కరించెను. (అనగా వానికంటె నందముగా నుండెనని భావము). అలంకారము: వ్యతిరేకము.

శ్లో. నిధానగర్భా మివ సాగరాంబరాం
శమీ మివాభ్యంతరలీన పావకామ్,
నదీ మివాంతఃసలిలాం సరస్వతీం
నృపః ససత్వాం మహిషీ మమన్యత. 9

వ్యాఖ్య: నృపః - రాజు, ససత్వాం - ఆపన్నసత్వయైన (గర్భిణియైన), మహిషీం - పట్టపురాణిని, నిధానగర్భాం - నిధి గర్భమునందున్న, సాగరాంబరాం ఇవ - సముద్రవసనయైన భూదేవిని వలెను, అభ్యంతరలీన పావకాం - లోపల దాగియున్న అగ్నిగల, శమీమివ - జమ్మితీగనువలెను, అంతఃసలిలాం - అంతర్గత జలముగల, సరస్వతీం నదీమివ - సరస్వతీ నదినివలెను, అమన్యత - తల

చెను. "ఆపన్నసత్వా, గుర్వినీ, అంతర్వత్నీ, గర్భిణీ" ఇవి సమానార్థకములు; సుదక్షిణాదేవికి జెప్పఁబడిన పై యుపమానములచేత గర్భస్థమైన శిశువుయొక్క భాగ్యవత్త్వము తేజస్విత్వము, పావనత్వమును సూచింపఁబడినవి. యజ్ఞాగ్నిని శమీ గర్భమునుండి మథించి సంపాదించుట వైదికాచారము. దిలీపుడు సుదక్షిణను గర్భమునందు నిధిగల భూదేవితోను, అంతర్గతాగ్నియైన శమీలతతోను, అంత స్సలిలయైన సరస్వతీనదితోను సమానముగా, పవిత్రురాలిగా భావించెనని యభి ప్రాయము.

శ్లో. ప్రియానురాగస్య మనః సమున్నతేః
భుజార్జితానాం చ దిగంత సంపదాం,
యథాక్రమం పుంసవనాదికాః క్రియాః
ధృతేశ్చ ధీరః సదృశీ ర్వ్యధత్త సః. 10

వ్యాఖ్య: ధీరః - ధీరుడైన, సః - ఆ దిలీప మహారాజు, ప్రియానురాగస్య - భార్యయందలి యనురాగమునకును, మనః సమున్నతేః - తన మనస్సు యొక్క యౌన్నత్యమునకును (అనగా తన యౌదార్యమునకు), భుజార్జితానాం - తన భుజ బలముచేత సంపాదింపఁబడిన, దిగంత సంపదాం - అన్ని దిక్కులయందుఁ గూర్పబడిన సంపదలకును, ధృతేశ్చ - తనకు పుత్రుఁడు కలుగఁ బోవుచున్నాడను సంతోషమునకును, సదృశః - తగినట్టి, పుంసవనాదికాః - పుంసవనము మొదలయిన, క్రియాః - సంస్కారములను, యథాక్రమం - వరుసను తప్పనీయక, వ్యధత్త - చేసెను. పుసంవన, అనవలోభన, సీమంతోన్నయనాది గర్భ సంస్కారములను క్రమముగా ద్వితీయ, చతుర్థ, షష్ఠ మాసములందు మహా వైభవముగా జరిపించెనని భావము. మానవుఁడు పుట్టగానే మానవుఁడు కాఁజాలఁడు, గర్భధారణము మొదలు చతుర్వింశతి సంస్కారములను పొంది, ఆత్మ గుణ, విద్యా, పురుషార్థాదులను సంపాదించిననాడే యుత్తమ మానవుఁడు కాగలుగునని భారతీయుల విశ్వాసము. అందువలన దిలీపుఁడా సంస్కారములను గర్భమునకు జరిపించెను.

శ్లో. సురేంద్ర మాత్రా శ్రిత గర్భ గౌరవాత్
ప్రయత్న ముక్తాసనయా గృహోగతః,

తదుపచారాంజలి భిన్న హస్తయా
ననంద పారిప్లవ నేత్రయా నృపః. 11

వ్యాఖ్య: గృహాగతః - అంతఃపురమునకు తిరిగి వచ్చిన, నృపః - దిలీపుఁడు, సురేంద్రమాత్రాశ్రిత గర్భగౌరవాత్ - సురేంద్ర - అష్ట దిక్పాలకుల యొక్క, మాత్రా - అంశలచేత, ఆశ్రిత - అనుప్రవిష్టమైన, గర్భ - గర్భము యొక్క, గౌరవాత్ - బరువు వలన, ప్రయత్న ముక్తాసనయా - ప్రయత్న - ప్రయత్నముచేత, ముక్త - విడువఁ బడిన, ఆసనయా - పీఠము గలదియును (అతి ప్రయత్నముతో లేచి నిలుచున్నట్టి అని యర్థము), ఉపచారాంజలి భిన్న హస్తయా - ఉపచార - గౌరవమునకు సంబంధించిన, అంజలి - దోయిలినిఁ గూర్చుటయందు, భిన్న - చేతగాని, హస్తయా - చేతులు గలదియును, పారిప్లవ నేత్రయా - త్వరగా మర్యాదను పాటింపలేక పోయితినిగదా యను భయమువలన చలించుచున్న నేత్రములు గలదియు నగు, తయా ఆ సుదక్షిణచేత, ననంద - సంతోషించెను. పతి తనవద్దికి వచ్చినపుడు గర్భభారముచేత ఉపచారములు చేయఁ జాలక చింతిలుచున్న సుదక్షిణను చూచి ఇంతకాలమునకు గర్భభారాలసయైన భార్యను జూడఁ గలిగితినిగదా! యని దిలీపుఁడు సంతోషించెనేకాని ఆమె పూర్వమువలె ప్రత్యుత్థానాద్యుపచారములు చేయలేదని కినియలేదు. రాజు దిక్పాలకాంశతో జన్మించునని మనువు చెప్పెను. "అష్టాభిశ్చ సురేంద్రాణాం మాత్రాభిర్నిర్మితో నృపః".

శ్లో. కుమార భృత్యా కుశలై రనుష్ఠితే
భిషగ్భి రాప్తై రథ గర్భభర్మణి,
పతిః ప్రతీతః ప్రసవోన్ముఖీం ప్రియాం
దదర్శ కాలే దివ మభ్రితా మివ. 12

వ్యాఖ్య: అథ - తరువాత, కుమార భృత్యా కుశలైః - శిశు చికిత్సయందు నేర్పరులైన (భృత్యా - చికిత్స), ఆప్తైః - తమమేలును గోరునట్టి, భిషగ్భిః - వైద్యులచేత, గర్భభర్మణి - గర్భపోషణము, అనుష్ఠితే సతి - చేయబడినది యగుచుండగా, కాలే - దశమ మాసమునందు, ప్రసవోన్ముఖీం - ప్రసవించుటకు సిద్ధముగా నున్న, ప్రియాం - భార్యను, అభ్రితాం - మేఘయుక్తమైన, దివం

ఇవ - ఆకాశమునువలె, పతిః - భర్త, ప్రతీతః - హృష్టుఁడగుచు, దదర్శ - చూచెను (ఎప్పుడు ప్రసవించునా యని యెదురు చూచుచుండెను.) వర్షింపఁబోవు మేఘముతోఁ గూడిన యాకాశమును ప్రజలు హృష్టులై చూచినట్లు ప్రసవింపఁబోవు భార్యను దిలీపుఁ డమందానంద భరితుఁడై చూచెనని భావము. "గర్భకర్మణి" అను పాఠమునందు గర్భాధాన ప్రతీతి కలుగుటవలన ఆ పాఠమును మల్లినాథుఁడు వదలిపెట్టెను. అలం: ఉపమ.

శ్లో. గ్రహైస్తతః పంచభి రుచ్చసంశ్రయై
రసూర్యగైః సూచితభాగ్యసంపదమ్.
అసూత పుత్రం సమయే శచీసమా
త్రిసాధనా శక్తి రివార్థ మక్షయమ్. 13

వ్యాఖ్య: తతః - పిమ్మట, శచీసమా - శచీదేవితో సమానురాలైన ఆ సుదక్షిణాదేవి, సమయే - ప్రసూతి కాలమునందు, ఉచ్చసంశ్రయైః - తమ తమ ఉచ్చస్థానములైన మేషాదిరాసుల యం దున్నవియును, అసూర్యగైః - సూర్య గ్రహముతో కలియనివియు (అనగా అస్తమింపనివియు) నగు, పంచభిఃగ్రహైః - అయిదు గ్రహములచేత (అప్పటి కాలచక్రము ననుసరించి యథాసంభవముగా నుచ్చరాసి స్థితములైన ఏవో అయిదు గ్రహములచేత నని యర్థము), సూచితభాగ్య సంపదం - సూచింపబడిన భాగ్య, రాజ్య, ధనాది భావములు పొందగలిగిన, పుత్రం - కుమారుని, త్రిసాధనా - ప్రభావ, మంత్ర, ఉత్సాహాత్మకములైన సాధనములు గల, శక్తిః - శక్తి, అక్షయం - నశింపని, అర్థం ఇవ - ప్రయోజనమునువలె, అసూత - కనెను. (మంచి ముహూర్తమున సుదక్షిణ పుత్రునిఁ గనెనని భావము). ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి అనబడు శక్తిత్రయము రాజ్యస్థైర్య పాలనాదులకు ముఖ్యము. ఈ శ్లోకమునందు నవగ్రహముల స్థాన నిర్దేశాదులచేత కవి తన జ్యోతిర్విద్యా ప్రావీణ్యమును వెల్లడించెను. సుదక్షిణాదేవిని ఇంద్రాణితో నుపమించుటచేత పుట్టిన శిశువుయొక్క భాగ్యవిశేషము సూచితమైనది.

శ్లో. దిశః ప్రసేదు ర్మరుతో వవుః సుఖాః
ప్రదక్షిణార్చి ర్హవి రగ్ని రాదదే,

బభూవ సర్వం శుభశంసి తత్క్షణం
భవో హి లోకాభ్యుదయాయ తాదృశామ్. 14

వ్యాఖ్య: తత్క్షణం - ఆ నిమిషమునందు, దిశః - దిక్కులు, ప్రసేదుః - నిర్మలము లయ్యెను, మరుతః - వాయువులు, సుఖాః - హాయి నిచ్చునవియై, వవుః - వీచెను, అగ్నిః - హోమాగ్ని, ప్రదక్షిణార్చిః - సవ్యముగా తిరుగు జ్వాలలు కలదియై, హవిః - హోమ ద్రవ్యమును, ఆదదే - స్వీకరించెను, సర్వం - సమస్తమును, శుభశంసి - శుభ సూచకమైనది, బభూవ - అయ్యెను, తాదృశాం - అట్టి వారియొక్క, భవః - జన్మము, లోకాభ్యుదయాయ హి - లోక శ్రేయస్సు కొఱకేకదా! అందువలన దేవతలుగూడా సంతుష్టులైరని భావము. ఆశిశువు పుట్టగానే ప్రకృతి యంతయు ప్రసన్నమై దేశ శ్రేయస్సును సూచించెను.

శ్లో. అరిష్టశయ్యాం పరితో విసారిణా
సుజన్మన స్తస్య నిజేన తేజసా,
నిశీథదీపాః సహసా హతత్విషో
బభూవు రాలేఖ్యసమర్పితా ఇవ. 15

వ్యాఖ్య: అరిష్టశయ్యాం పరితః - అరిష్ట - సూతికా గృహము నందలి, శయ్యాంపరితః - పరుపుచుట్టును (ఇచ్చట షష్ఠీ విభక్త్యర్థముగల శయ్యా శబ్దము పరితఃఅను నవ్యయముతో జేరుటవలన ద్వితీయా విభక్త్యంతమైనది), విసారిణా - వ్యాపించినదియు, సుజన్మనః - మంగళకరమైన పుట్టుకగల, తస్య - ఆ శిశువు యొక్క, నిజేన - సహజమైన, తేజసా - తేజస్సుచేత, సహసా - హఠాత్తుగా, హతత్విషః - క్షీణించిన కాంతులుగల, నిశీథ దీపాః - అర్ధరాత్రము నందలి దీపములు, ఆలేఖ్యసమర్పితాః ఇవ - చిత్తరువునం దుంచబడినవివలె, బభూవుః - అయినని. నిశీథ శబ్దము దీపముల కాంత్యాధిక్యమును సూచించుటకు, అట్టి కాంతిగల దీపములు ఆ శిశువుయొక్క సహజ కాంతిచేత నిస్తేజస్కములై చిత్తరువు నందలి దీపములవలె కనబడుచుండెనని భావము.

శ్లో. జనాయ శుద్ధాంతచరాయ శంసతే
కుమార జన్మామృత సమ్మితా ముదమ్,

అదేయ మాసీత్త్రయమేవ భూపతేః
శశిప్రభం ఛత్ర ముభే చ చామరే. 16

వ్యాఖ్య: భూపతేః - దిలీపునికి, అమృత సమ్మితాక్షరం - అమృతముతో సమానమైన అక్షరములుగల, "కుమారజన్మ", - "పుత్రోత్పత్తి"అని, శంసతే - చెప్పుచున్న, అంతఃపురాయ - అంతఃపురమునఁ దిరుగునట్టి, జనాయ - జనము కొఱకు, త్రయమేవ - మూడు మాత్రమే, అదేయం - ఇచ్చుటకు వీలు లేనివి, ఆసీత్ - అయ్యెను, (అవి యేవి యనఁగా) శశి ప్రభం - చంద్ర కాంతిగల, ఛత్రం - శ్వేత చ్ఛత్రమున్ను, ఉభే చామరేచ - రెండు చామరములున్ను. ఛత్ర చామరములు రాజ చిహ్నములు కనుక వాటిని తప్ప ఇతర వస్తువుల నన్నిటిని పుత్రోత్పత్తి వార్తను చెప్పిన పరిజనమునకు సంతోషముతో బహూకరించెనని భావము.

శ్లో. నివాత పద్మ స్తిమితేన చక్షుషా
నృపస్య కాంతం పిబతః సుతాననమ్,
మహోదధేః పూర ఇవేందుదర్శనాత్
గురుః ప్రహర్షః ప్రబభూవ నాత్మని. 17

వ్యాఖ్య: నివాత పద్మ స్తిమితేన - నివాత - గాలిలేని ప్రదేశము నందలి, పద్మ - కమలమువలె, స్తిమితేన - కదలిక లేని, చక్షుషా - కంటితో, కాంతం - సుందరమైన, సుతాననం - పుత్రముఖమును, పిబతః - త్రాగుచున్న (మిక్కిలి యాసక్తితో చూచుచున్న), నృపస్య - దిలీప మహారాజుయొక్క, గురుః - అత్యధిక మైన, ప్రహర్షః - సంతోషము, ఇందుదర్శనాత్ - చంద్ర దర్శనమువలన, గురుః - పెద్దదయిన, మహోదధేః పూరః ఇవ - సముద్రముయొక్క జలమువలె, ఆత్మని - తనలో, న ప్రబభూవ - నిలువలేక పోయెను. చంద్రోదయ కాలము నందు పొంగిన సముద్రజలము ఒడ్డు లొరసినట్లు, పుత్ర ముఖదర్శనము వలనఁ గలిగిన ప్రహర్షము దిలీపునిలో నిముడజాలక బహిర్గతమయ్యెను. అందటి యెదుట తన సంతోషాతిశయమును దిలీపుఁడు వెల్లడించెనని భావము.

శ్లో. స జాతకర్మణ్యఖిలే తపస్వినా
తపోవనా దేత్య పురోధసా కృతే,

దిలీపసూనుర్మణిరాకరోద్భవః
ప్రయుక్తసంస్కార ఇవాధికం బభౌ 18

వ్యాఖ్య: సః - ఆ దిలీపసుతుఁడు, తపస్వినా - తపస్వియైన వాడును, పురోధసా - పురోహితుఁడునైన వసిష్ఠునిచేత, తపోవనాత్ - తపో వనమునుండి, ఏత్య - వచ్చి, అఖిలే సమగ్రమైన, జాతకర్మణి - పుట్టిన శిశువునకు చేయవలసిన సంస్కారము, కృతే - చేయఁబడినదికాగా, ప్రయుక్త సంస్కారః - సాన బట్టుట మొదలయిన సంస్కారము చేయఁబడిన, ఆకరోద్భవః మణిః ఇవ - గనిలో పుట్టిన రత్నమువలె, అధికం - ఎక్కువగా, బభౌ - ప్రకాశించెను. వసిష్ఠుని మంత్ర ప్రభావమువలన శిశువు మిక్కిలి తేజస్వి యయ్యెననియు వైదిక సంస్కారము ఖనిలో పుట్టిన మణికి శాణకషణమువలె మిక్కిలి యవసరమనియు, జాతకర్మ అట్టిదనియు భావము. "ప్రాఙ్నాభివర్ధనా త్పుంసో జాతకర్మ విధీయతే" అను మనువచనమువలన మగ శిశువునకు బొడ్డు కోయకముందు చేయవలసిన వైదిక సంస్కారమునకు "జాతకర్మ" అని పేరు.

శ్లో. సుఖశ్రవా మంగళతూర్య నిస్వనాః
ప్రమోద నృత్తైర్యః సహ వారయోషితామ్,
న కేవలం పద్మని మాగధీపతేః
పథి వ్యజృంభంత దివౌకసా మపి. 19

వ్యాఖ్య: సుఖశ్రవాః - వినుటకు సొంపైన, మంగళతూర్య నిస్వనాః - మంగళవాద్య ధ్వనులు, వారయోషితాం - వేశ్యలయొక్క, ప్రమోద నృత్తైర్యఃసహ - ఆనంద నర్తనములతో కూడ, మాగధీపతేః - సుదక్షిణా భర్తయగు దిలీపుని యొక్క, సద్మనికేవలం - గృహమునందు మాత్రమే, న - కాదు, దివౌకసాం - దేవతలయొక్క, పథి అపి - మార్గమైన యాకాశమునందు సైతము, వ్యజృంభంత - విజృంభించెను. మంగళవాద్య ధ్వనులు రాజగృహముననేకాక, పుట్టిన బిడ్డ దేవాంశ సంభూతుఁడును, దేవతల కుపకరింపబోవు వాడును నగుటచేత దేవదుందుభులును మ్రోగెనని భావము.

శ్లో. న సంయత స్తస్య బభూవ రక్షితుః
విసర్జయే ద్యం సుతజన్మహర్షితః,

ఋణాభిధానా త్స్వయ మేవ కేవలం
తదా పితౄణాం ముముచే స బంధనాత్. 20

వ్యాఖ్య: రక్షితుః - చక్కని పాలకుడైన, తస్య - ఆ దిలీపునికి, సంయతః - కారాగారబద్ధుడు, న బభూవ - లేకపోయెను, సుతజన్మహర్షితః - కుమారునియొక్క పుట్టుకచేత సంతోషపడిన వాడై, యం - ఏ బద్ధుని, విసర్జయేత్ - విడిపింపఁ దలచెనో; కనుక, సః -అతఁడు, తదా - అప్పుడు, పితౄణాం - పితృ దేవతలయొక్క, ఋణాభిధానాత్ - ఋణమను పేరుగల, బంధనాత్ - బంధనమునుండి, కేవలం స్వయమేవ - ఒక్క తాను మాత్రమే, ముముచే - విడువఁబడెను. రాజులకు కుమారోదయాది హర్షాతిరేకము కలిగినప్పుడు కారాగార బద్ధులను విడుచుట యాచారము, సత్పరిపాలకుడైన యతని రాజ్యమునందు దొంగతనము మొదలయినవి లేకుండుటవలన బద్ధుఁడే లేకపోయెను. కనుక ఇక తానొక్కడే పితృఋణ బంధనమునుండి విముక్తిని గాంచెనని భావము. ఇచ్చట "ఏష వా అనృణోయః పుత్రీ" అను శ్రుతి ప్రమాణము.

శ్లో. శ్రుతస్య యాయా దయ మంత మర్భకః
తథా పరేషాం యుధి చేతి పార్థివః,
అవేక్ష్య ధాతో ర్గమనార్థ మర్థవిత్
చకార నామ్నా రఘు మాత్మసంభవమ్. 21

వ్యాఖ్య: అర్థవిత్ - శబ్దముల యర్థము నెఱిఁగిన వాఁడైన, పార్థివః - పృథివీపతియగు దిలీపుడు, అయం అర్భకః - ఈ పిల్లవాఁడు, శ్రుతస్య - శాస్త్రముయొక్క, అంతం - పారమును, యాయాత్ - చేరుటకు శక్తుఁడగును, ఇతి - అను కారణమువలన, ధాతోః - 'లఘి' ధాతువునకుగల, గమనార్థం - గమనమను నర్థమును, అవేక్ష్య - ఎఱిఁగి, ఆత్మసంభవం - తన పుత్రుని. నామ్నా - పేరుచేత, రఘుం - రఘువునుగా (రఘు శబ్దవాచ్యునిగా) చకార - చేసెను. రఘువు అని నామకరణము చేసెననియు అది సార్థక నామధేయమనియు భావము. "అఘి వఘి లఘి గత్యర్థాః" అను పాణినీయ ధాతుపాఠముపందు చెప్పబడిన 'లఘి' ధాతువునకు గమనము అర్థము. దానికి ఉణాది సూత్రములచేత ఉత్వము, రేఫము వచ్చుటచేత 'రఘుః' అను శబ్దము సిద్ధించును. పదిరోజుల

పురుడు దాటగానే శిశువునకు నామకరణము చేయవలయునని శంఖస్మృతి చెప్పు చున్నది. "ఆశౌచే తు వ్యతిక్రాంతే నామకర్మ విధీయతే".

శ్లో. పితుః ప్రయత్నా త్స సమగ్రసంపదః
శుభైః శరీరావయవై ర్దినేదినే,
పుపోష వృద్ధిం హరిదశ్వ దీధితే
రనుప్రవేశా దివ బాలచంద్రమాః. 22

వ్యాఖ్య: సః - ఆ రఘువు. సమగ్ర సంపదః - సంపూర్ణ సంపదలుగల, పితుః - తండ్రియొక్క, ప్రయత్నాత్ - ప్రయత్నము వలన, శుభైః - మనోహరములైన, శరీరావయవైః - శరీరముయొక్క అవయవములచేత, హరిదశ్వ దీధితేః - హరిదశ్వ - సూర్యుని యొక్క, దీధితేః - కాంతి యొక్క, అనుప్రవేశాత్ - ప్రవేశమువలన, బాలచంద్రమాః - బాలచంద్రుఁడు, ఇవ - వలె, దినేదినే - ప్రతి దినమును, వృద్ధిం - పెఱుగుదలను, పుపోష - సంతరించుకొనెను. పోషణము వలన రఘువు చంద్రునివలె దినదినాభివృద్ధిని పొంది ముద్దులు మూట గట్టుచుండెనని భావము.

శ్లో. ఉమావృషాంకౌ శరజన్మనా యథా
యథా జయంతేన శచీపురందరౌ,
తథా నృపః సాచ సుతేన మాగధీ
ననందతు స్తత్సదృశేన తత్సమౌ. 23

వ్యాఖ్య: ఉమా వృషాంకౌ - పార్వతీ పరమేశ్వరులు. శరజన్మనా - కుమారస్వామిచేత, యథా - ఏ విధముగా, ననందతుః - సంతోషపడిరో, శచీపురందరౌ - శచీదేవియు ఇంద్రుఁడును, జయంతేన - జయంతునిచేత, యథా - ఏ విధముగా, ననందతుః - సంతోషపడిరో, తథా - అదేవిధముగా, తత్సమౌ - ఆ పార్వతీ పరమేశ్వర, శచీ పురందరులతో సమానులైన, సా మాగధీ - ఆ మగధరాజపుత్రియగు సుదక్షిణయు, నృపశ్చ - దిలీపుడును, తత్సదృశేన - ఆ షణ్ముఖ జయంతులతో సమానుఁడైన, సుతేన - కుమారుఁడైన రఘువుచేత, ననందతుః - సంతోషపడిరి.

శ్లో. రథాంగనామ్నో రివ భావబంధనం
బభూవ యత్ప్రేమ పరస్పరాశ్రయమ్,
విభక్త మప్యేకసుతేన తత్తయోః
పరస్పరస్యోపరి పర్యచీయత. 24

వ్యాఖ్య: రథాంగనామ్నోః ఇవ - చక్రవాకముల జంటకువలె, తయోః - ఆ సుదక్షిణా దిలీపులకు, భావబంధనం - హృదయాకర్షకమైన, పరస్పరాశ్రయమ్ - ఒండొరుల నాశ్రయించిన, యత్ప్రేమ - ఏ ప్రేమ, బభూవ - ఉండెనో, తత్ - ఆ ప్రేమ, ఏకసుతేన - ఒకే కుమారునిచేత, విభక్తమపి - విభజింపఁబడినను, పరస్పరస్య ఉపరి - ఒకరిమీద నొకరికి, పర్యచీయత - ఎక్కువగా వృద్ధిచెందెను. జలాదిరూపమైన ఒకానొక వస్తువు ఒక యాధారమునందు (పాత్రయందు) ఉంచ బడినప్పుడున్న కొలతను, రెండు పాత్రములందు పంచినప్పుడు కోల్పోవును. అట్లే యా దంపతుల కొకరిపై నొగరికిఁగల ప్రేమ విభక్తమై కుమారునియందుఁ బ్రవేశించినది కనుక తగ్గవలెను. కాని అట్లు తగ్గక యింకను వృద్ధిచెందినది. ఇది చమత్కారము. అనగా "నీవలన నాకింత చక్కని కుమారుఁడు కలిగెఁగదా!" యని దిలీపుడును, అట్టి భావముతోనే సుదక్షిణయు, కృతజ్ఞతాపూర్వకమును, పుత్ర దర్శనోద్దీపితమును నగు ప్రేమను పరస్పరము పెంచుకొని యానందించిరని తాత్పర్యము.

శ్లో. ఉవాచ ధాత్ర్యా ప్రథమోదితం వచో
యయౌ తదీయా మవలంబ్య చాంగులిమ్,
అభూచ్చ నమ్రః ప్రణిపాతశిక్షయా
పితుర్ముదం తేన తతాన సోఽర్భకః. 25

వ్యాఖ్య: సః అర్భకః - ఆబిడ్డడు, ధాత్ర్యా -దాదిచేత, ప్రథమోదితం - మొదట పలికింపఁబడిన, వచః - మాటను, ఉవాచ - పలికెను, తదీయాం - ఆదాదిదియైన,అంగులిం - వ్రేలిని, అవలంబ్య - పట్టుకొని, యయౌచ - నడచెను గూడ, ప్రణిపాత శిక్షయా - ప్రణిపాత - నమస్కారము యొక్క, శిక్షయా - నేర్పుటచేత, నమ్రః - నమస్కరించు వాఁడు, అభూచ్చ - అయ్యెనుగూడ, తేన - ఇట్టి యభివృద్ధిచేత, పితుః - తండ్రికి, ముదం - సంతోషమును, తతాన-

ఎక్కువచేసెను. ఆ పిల్లవాడు దాది పలికించిన మాటలు పలుకుచును, ఆమె వ్రేలు పట్టుకొని నడచుచును, పెద్దలకు నమస్కరించుచును దిలీపునికి మిక్కిలి సంతోషమును గూర్చెనని భావము.

శ్లో. తమంక మారోప్య శరీరయోగజైః
సుఖైర్నిషించంత మివామృతం త్వచి,
ఉపాంత సంమీలిత లోచనో నృపః
చిరాత్ సుతస్పర్శ రసజ్ఞతాం యయౌ. 26

వ్యాఖ్య: శరీరయోగజైః - శరీర స్పర్శవలన కలిగిన, సుఖైః - సుఖములచేత, త్వచి - చర్మేంద్రియమునందు, అమృతం - అమృతమును, నిషించంతంఇవ - చిలుకరించుచున్నట్లున్న, తం - ఆ పుత్రుని, అంకం - తొడను, ఆరోప్య - ఎక్కించుకొని (తొడమీద నెక్కించుకొని), ఉపాంత సమ్మీలిత లోచనః - ఉపాంత - తుదిమెప్పులచేత, సమ్మీలిత - మూయబడిన, లోచనః - కన్నులుగల వాడగుచు, నృపః - దిలీపుడు, చిరాత్ - చాలాసేపు, సుతస్పర్శ రసజ్ఞతాం - పుత్రస్పర్శ రసాస్వాదమును, యయౌ - పొందెను. 'చిరాత్' అను పదమునకు బహుకాలమునకు అని యర్థము చెప్పినచో, దిలీపునికి బహుకాలమునకు సంతానము కలిగినది కనుక యింతకాలమునకు పుత్రగాత్ర పరిష్వంగ సుఖమెట్టిదో తెలిసి యానందరస నిమగ్నుడయ్యెనను భావముగూడ సిద్ధించును.

శ్లో. అమంస్త చానేన పరార్ధ్య జన్మనా
స్థితేరభేత్తా స్థితిమంత మన్వయమ్,
స్వమూర్తిభేదేన గుణాగ్ర్యవర్తినా
పతిః ప్రజానా మివ సర్గ మాత్మనః. 27

వ్యాఖ్య: స్థితేః అభేత్తా - మర్యాదాపాలకుడైన - ఆ దిలీపుడు, పరార్థ్య జన్మనా - ఉత్కృష్టమైన జన్మముగల, అనేన - ఈ రఘువుచేత, అన్వయం - వంశము, ప్రజానాం పతిః - బ్రహ్మ, గుణాగ్ర్యవర్తినా - గుణ - సత్త్వరజస్తమో గుణములలో, అగ్ర్య - మొదటిదియైన సత్వ గుణముచేత, వర్తినా - నడచునట్టి, స్వమూర్తిభేదేన - తన యవతారమైన విష్ణువుచేత, ఆత్మనః - తన

యొక్క, సర్గంఇవ - సృష్టినివలె, స్థితిమంతం - ప్రతిష్ఠావంతమైన దానినిగా, అమంస్త - తలచెను (తన వంశము నిలచినట్లు భావించెను). సృష్టికర్త తన సృష్టిలో సత్వగుణ ప్రధానమైన విష్ణురూపమున తానే యవతరించుటచేత సృష్టి మర్యాద ప్రతిష్ఠావంతమైనట్లు భావించినరీతిగా, దిలీపుఁడుత్తమోత్తమ జన్మగల యా పుత్రునిచేత తన వంశమర్యాద సుస్థిరమైనట్లు భావించెనని యభిప్రాయము.

శ్లో. స వృత్తచూల శ్చలకాకపక్షకై
రమాత్యపుత్రై ర్వినయోపి రన్వితః,
లిపే ర్యథావద్గ్రహణేన వాఙ్మయం
నదీముఖేనేవ సముద్ర మావిశత్. 28

వ్యాఖ్య: వృత్తచూలః - కడచిన చూడాకర్మగల (పుట్టువెండ్రుకలు తీసి జుట్టు పెట్టఁబడిన) సః - ఆ రఘువు, చలకాకపక్షకైః - కదలి యాడుచున్న పిల్లజుట్లు కలవారును, సవయోభిః - స్నేహితులునగు, అమాత్య పుత్రైర్ - మంత్రుల కుమారులతో, అన్వితఃసన్ - కలిసినవాఁడగుచు, లిపేః - ఏబదిసంఖ్య గల అకారాదిక్షకారాంత వర్ణములయొక్క, యథావద్గ్రహణేన - ఉన్నది యున్నట్లు గ్రహించుటచేత, వాఙ్మయం - శబ్దజాతమును, నదీముఖేన ఇవ - నదీద్వారమున, సముద్రమివ - సముద్రమునువలె, ఆవిశత్ - ప్రవేశించెను. మొసలి మొదలగు జంతువులు నదిద్వారా సముద్రమునందు ప్రవేశించినట్లు రఘువు పంచాశద్వర్ణాత్మిక యైన మాతృకద్వారా వాఙ్మయ సముద్రమున సులభముగాఁ బ్రవేశించెను. పర్ణమాలను నేర్చుకొని విద్యలో ప్రవేశించెనని భావము.

శ్లో. అథోపనీతం విధివ ద్విపశ్చితో
వినిన్య రేనం గురవో గురుప్రియమ్,
అవంధ్యయత్నాశ్చ బభూవు రత్రతే
క్రియా హి వస్తూపహితా ప్రసీదతి. 29

వ్యాఖ్య: అథ - అనంతరము (మనుప్రోక్తమైన గర్భైకాదశ వతసరము నందు - పదకొండవయేట) విధివత్ - శాస్త్ర ప్రకారముగా, ఉపనీతం - ఉపనయనము చేయఁబడి నట్టియు, గురుప్రియం - గురువులకు ప్రేమ పాత్రుఁడు నగు,

ఏనం - ఈ రఘువును, విపశ్చితః - విద్వాంసులగు, గురవః - గురువులు, వినిన్యుః - శిక్షించిరి (విద్యల నభ్యసింపఁ జేసిరి). తే - ఆ గురువులు, అత్ర - ఈ రఘువునందు, అవంధ్య యత్నాశ్చ - సఫల ప్రయత్నము గలవారును, బభూవుః - అయిరి ; హి - అదియట్లే యగును, క్రియా - విద్యా శిక్షణము, వస్తూపహితా - వస్తు - అర్హుఁడగు విద్యార్థియందు, ఉపహితా - ప్రయోగింపఁబడినదియై, ప్రసీదతి - ఫలించును. రఘు కుమారునికి గురువులు బోధించిన విద్యలు చక్కగా వచ్చుచుండెను. వారు సఫలప్రయత్నులగుచుండిరి. ఇచ్చట క్రియా శబ్దమునకు 'శిక్ష' అర్థము, "క్రియాహి ద్రవ్యం వినయతి నా ద్రవ్యమ్" అని కౌటిల్యార్థ శాస్త్రము. చదువు వచ్చుటకు స్వభావసిద్ధమైన పాత్రతకావలయునని కౌటిల్య మతము.

శ్లో. ధియః సమగ్రైర్గుణైరుదారధీః
క్రమాచ్చతస్రశ్చతురర్ణవోపమాః,
తతార విద్యాః పవనాతిపాతిభి
ర్దిశో హరిద్భిర్హరితా మివేశ్వరః. 30

వ్యాఖ్య: ఉదారధీః - ఉత్కృష్టబుద్ధిగల, సః - ఆ రఘువు, సమగ్రైర్గుణైః - సంపూర్ణములైన, ధియఃగుణైః - బుద్ధియొక్క గుణములచేత, చతురర్ణవోపమాః - నాలుగు సముద్రములతో సమానమగు, చతస్రః - నాలుగైన, విద్యాః - "ఆన్వీక్షికీ, త్రయీ, వార్తా, దండనీతి" యను విద్యలను, హరితాం - దిక్కులకు, ఈశ్వరః - ప్రభువైన సూర్యుఁడు, పవనాతిపాతిభిః - గాలికన్నను ముందు పరుగెత్తునట్టి, హరిద్భిః - తన గుఱ్ఱముల చేత, చతస్రః దిశఃఇవ - నాలుగు దిక్కులనువలె, క్రమాత్ - వరుసగా, తతార - దాటెను (నేర్చెనని యర్థము). రఘు కుమారుడు, శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ఊహాపోహాలు, అర్థవిజ్ఞానము, తత్త్వజ్ఞానము అను ధీగుణములు కలవాఁడై వానిచేత సముద్రోపమానములైన చతుర్విద్యలను, సూర్యుఁడతివేగముగల తన గుఱ్ఱములచేత సువిశాలములైన దిక్కులనధిగమించిన ట్లధిగమించెనని భావము.

శ్లో. త్వచం స మేధ్యాం పరిధాయ రౌరవీం
అశీతతాక్ష్ణం పితురేవ మంత్రవత్,

న కేవలం తద్గురు రేక పార్థివః
క్షితావభూ దేక ధనుర్ధరోఽపి సః. 31

వ్యాఖ్య: సః - ఆ రఘువు. మేధ్యం - పరిశుద్ధమైనదియు, రౌరవం - మహాకృష్ణ మృగమునకు సంబంధించిన (నల్లని మగజింకదియగు) త్వచం - చర్మ మును. పరిధాయ - ధరించి. మంత్రవత్ - సమంత్రకమైన, అస్త్రం - ఆగ్నే యాది అస్త్రజాతమును, పితుఏవ - తండ్రి వలననే. అశిక్షిత - నేర్చుకొనెను. తద్గురుః - అతని తండ్రియైన దిలీపుడు, ఏకపార్థివః కేవలం - ఏక - అద్వితీ యుడైన, పార్థివః కేవలం - రాజుమాత్రమే, న - కాదు, క్షితౌ - భూమిమీద, సః - అతడు, ఏక ధనుర్ధరః అపి - అద్వితీయుడైన విలుకాడును, అభూత్ - అయియుండెను. దిలీపుడు అద్వితీయుడైన చక్రవర్తియే కాక అసాధారణ ధనుర్ధరుడు నగుటచేత నతనివద్దనే రఘువు శస్త్రాస్త్ర విద్యలను నేర్చెనని భావము. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య బ్రహ్మచారులు క్రమముగా గృష్ణాజిన, రౌరవాజిన, మేషచర్మములను ధరింప వలయుననియు, శణక్షౌమాది వస్త్రములను (నారబట్ట లను, పట్టువస్త్రములను) సైతము ధరింపవచ్చుననియు మనువుచెప్పెను.

శ్లో. మహోక్షతాం వత్సతరః స్పృశన్నివ
ద్విపేంద్రభావం కలభః శ్రయన్నివ,
రఘుః క్రమాత్ యౌవనభిన్న శైశవః
పుపోష గాంభీర్యమనోహరం వపుః. 32

వ్యాఖ్య: రఘుః - రఘువు, క్రమాత్ - వరుసగా, యౌవనభిన్న శైశవః సన్ - యౌవన - పడుచుదనముచేత, భిన్న - తొలగింపబడిన, శైశవః సన్ - శిశుత్వము గలవాడగుచు, మహోక్షభావం - మహావృషభత్వమును, స్పృశన్ - తాకుచున్న (పొందుచున్న), వత్సతరఃఇవ - కోడెదూడవలెను, ద్విపేంద్రభావం - మహాగజత్వమును, శ్రయన్ - ఆశ్రయించుచున్న, కలభః ఇవ - ఏనుగుపిల్ల వలెను, గాంభీర్యేణ - లోతైన హృదయముచేత, మనోహరం - అందమైన, వపుః - దేహమును, పుపోష - పెంచెను. రఘువుదేహము, బాల్యమునుండి తారు ణ్యమునందు ప్రవేశించెనని భావము.

శ్లో. అథాస్య గోదానవిధే రనంతరం
వివాహదీక్షాం నిరవర్తయ ద్గురుః,
నరేంద్రకన్యా స్తమవాప్య సత్పతిం
తమోనుదం దక్షసుతా ఇవాబభుః. 33

వ్యాఖ్య: అథ - అనంతరము, గురుః - తండ్రి, అస్య - ఈ రఘువు నకు, గోదానవిధేః - కేశాంతమను సంస్కారముయొక్క, అనంతరం - తరువాత, వివాహదీక్షాం - వివాహదీక్షను, నిరవర్తయత్ - జరిపించెను, అథ - ఆ తరువాత, నరేంద్రకన్యాః - రాజకన్యకలు, తం - ఆ రఘువును, దక్షసుతాః - దక్ష ప్రజాపతి కుమార్తెలైన రోహిణి మొదలగువారు, తమోనుదం ఇవ - చంద్రునివలె, సత్పతిం - మంచి మగనిని, అవాప్య - పొంది, ఆబభుః - చక్కగా ప్రకాశించిరి. "రాజానో బహువల్లభాః" అను న్యాయమున నతని కనేక కన్యలతో వివాహము జరిగెనని భావము. 'గావో లోమాని కేశాదీయంతే ఖండ్యంతే అస్మిన్ ఇతి గోదానం' గౌః (గో) అను శబ్దము పుంలింగమైనప్పుడు సూర్యుడు, వృషభము, ఒకానొకక్రతువు (గోదానం), ఋషి అని యర్థములు. స్త్రీ లింగమైనప్పుడు దిక్కు, భారతి, భూమి, కామధేనువు అని యర్థములు. 'గో' శబ్ద ముభయలింగమైనప్పుడు స్వర్గము, వజ్రము, జలము, కిరణము, చూపు, బాణము, కేశము (వెంట్రుక) అర్థములని కేశవనిఘంటువు. ఈ గోదానకర్మ బ్రాహ్మణునికి పదహారవ సంవత్సరమునందును, క్షత్రియునికి ఇరువది రెండవ సంవత్సరమునందును జరుగవలెనని మనువు చెప్పెను. 'తమోనుదం'అనుపదము రఘువునకుఁ గూడ నన్వయించును. తన యజ్ఞానమును (తమస్సును) విద్యలచేత పోగొట్టుకున్నట్టి వాఁడని యర్థము.

శ్లో. యువా యుగవ్యాయత బాహు రంసలః
కవాటవక్షాః పరిణద్ధ కంధరః,
వపుః ప్రకర్షా దజయ ద్గురుం రఘు
స్తథాపి నీచై ర్వినయా దదృశ్యత. 34

వ్యాఖ్య: ఇఁక రఘువుయొక్క యౌవరాజ్య యోగ్యతను గురించిన వర్ణనము: యువా - యువకుండును, యుగవ్యాయత బాహుః - యుగ - కాడిమ్రానువం

వలె, వ్యాయత - సుదీర్ఘములైన, (ఎత్తైన భుజములు గలవాఁడు). కవాటపక్షుఃస్థలము గలవాఁడును, పరిణద్ధ కంధరః - విశాలమైన మెడ కలవాఁడును అగు, రఘుః - రఘువు, వపుఃప్రకర్షాత్ - శరీరాధిక్యము వలన, గురుం - తండ్రిని, అజయత్ - జయించెను, తథాపి - అట్లయ్యును, వినయాత్ - నమ్రతవలన, నీచైఃస్థ - చిన్నవాఁడుగా, అదృశ్యత - కనఁబడెను. యౌవన మద విలసితుఁడై యుండెననియు, దీర్ఘ బాహువులతోను, విశాలమైన వక్షస్థలముతోను, గాంభీర్యముతోను చూడముచ్చటగా నుండెనని భావము.

శ్లో. తతః ప్రజానాం చిర మాత్మనా ధృతాం
నితాంతగుర్వీం లఘుయిష్యతా ధురం,
నిసర్గ సంస్కారవినీత ఇత్యసౌ
నృపేణ చక్రే యువరాజ శబ్దభాక్. 35

వ్యాఖ్య: తతః - తరువాత, ఆత్మనా - తనచేత, చిరం - బహుకాలము, ధృతాం - ధరింపఁ బడినదియు, నితాంతగుర్వీం - మిక్కిలి బరువై నదియు నగు, ప్రజానాం - ప్రజలయొక్క, ధురం - భారమును (ప్రజాపాలన భారమును), లఘుయిష్యతా - చులకనచేసుకోఁ దలచుచున్న, నృపేణ - దిలీప మహారాజుచేత, అసౌ - ఈ రఘువు, నిసర్గ సంస్కారవినీతః - నిసర్గ - స్వభావముచేతను, సంస్కార - శాస్త్రజనిత వాసనచేతను, వినీతః - నమ్రుఁడు, ఇతి - ఇట్లని, యువరాజ శబ్దభాక్ - యువరాజ శబ్దవాచ్యుఁడుగా, చక్రే - చేయఁబడెను. దిలీపుఁడు రఘువును యువరాజుగాఁజేసి తన భారమును తగ్గించుకొనఁ దలఁచినవాఁడై యతనికి యౌవరాజ్య పట్టాభిషేకమును జేసెను. వినయము: 'స్వాభావికము, కల్పితము' అని రెండువిధములు రఘువు ఉభయ సంపన్నుఁడు కనుక "వినీత మౌరసం పుత్రం యౌవరాజ్యేఽభిషేచయేత్"అను కామందక వచనానుసారముగా రఘువును యువరాజునుగాఁ జేసెనని భావము.

శ్లో. నరేంద్ర మూల యతనా దనంతరం
తదాస్పదం శ్రీ ర్యువరాజ సంజ్ఞితమ్,
అగచ్ఛ దంశే గుణభిలాషిణీ
నవావతారం కమలాది వోత్పలమ్. 36

వ్యాఖ్య: గుణాభిలాషిణీ - గుణములను అభిలషించునట్టి, శ్రీః - రాజ్యలక్ష్మి (పద్మముల నాశ్రయించు కాంత్యధిదేవతయు). నరేంద్రమూలాయతనాత్ - నరేంద్ర - దిలీపుఁడను, మూలాయతనాత్ - ప్రధాన స్థానమునుండి, అనంతరం - సన్నిహితమును, యువరాజ సంజ్ఞితం - యువరాజను పేరుగలదియు నగు, తదాస్పదం - ఆ రఘువు అనెడు తనస్థానమును, కమలాత్ - బహుకాలముక్రింద పుట్టిన కమలమునుండి, నవావతారం - క్రొత్తగా ఉదయించిన, ఉత్పలమివ - కలువనువలె, అంశేన - భాగముచేత, అగచ్ఛత్ - చేరెను. పగటి వేళయందు కమలమునందుండి యుండి విసిగిన పద్మశ్రీ సాయంత్రమునందు క్రొత్తగా విచ్చిన కలువయందు మక్కువను జూపినట్లు, దిలీపునియందుఁ జిరకాలము వసించిన రాజ్యలక్ష్మి యువకుడైన రఘువును మక్కువతోఁ జేరెనని యభిప్రాయము. స్త్రీలు సహజముగా యువకునియం దనురక్త లగుదురుగదా! కమలమునుండి యుత్పలమును పద్మశ్రీ చేరినట్లు చెప్పిన యుపమానమువలన దిలీపుడు సూర్యునివంటి వాఁడనియు, రఘువు చంద్రునివంటి వాఁడనియు, చంద్రోదయ సమయమునకు సూర్యుఁడు వృద్ధుఁడయ్యెననియు, 'అంశేన' అనుటచేత సూర్యాంశ చంద్రునిలో నుండుటచేత రాజ్యలక్ష్మి అవ్యభిచారిణి యనియు ధ్వనించుచున్నది. కాళిదాసు చెప్పునట్టి ఉపమానము ఉపమేయమున కెంతటి యాధిక్యమును జేకూర్చవలయునో యంతటి యాధిక్యమును జేకూర్చును. కనుకనే 'ఉపమా కాళిదాసస్య' అన్నారు విజ్ఞులు.

శ్లో. విభావసుః సారథినేవ వాయునా
ఘన వ్యపాయేన గభస్తిమా నివ
బభూవ తేనా తితరాం సుదుస్సహాః
కటప్రభేదేన కరీవ పార్థివః. 37

వ్యాఖ్య: సారథినా - సహాయభూతుఁడైన, వాయునా - వాయువుచేత, విభావసుః ఇవ - అగ్నివలెను, ఘన వ్యపాయేన - శరత్సమయముచేత (ఘన - మేఘము, దాని వ్యపాయము వినాశము. మేఘములు తొలఁగి పోవుటయే శరత్తు) గభస్తిమాన్ ఇవ - సూర్యునివలెను, కటప్రభేదేన - గండస్థలము పగిలి మదము స్రవించుటచేత, కరీఇవ - ఏనుగువలెను, పార్థివః - రాజు (దిలీపుడు) తేన - సహాయభూతుఁడైన ఆ రఘువుచేత, అతితరాం - ఎక్కువగా, సుదుస్సహాః -

సహనశీలుఁడు, బభూవ - అయ్యెను. యువరాజైన రఘువు తోడ్పడుచుండుట చేత ప్రజాపాలనాది క్లేశమును దిలీపుఁడు సులభముగా సహించుచు హాయిగా నుండెనని భావము.

శ్లో. నియుజ్య తం హోమతురంగ రక్షణే
ధనుర్ధరం రాజసుతై రనుద్రుతమ్.
అపూర్ణ మేకేన శతక్రతూపమః
శతం క్రతూనా మపవిఘ్న మాప సః. 38

వ్యాఖ్య: శతక్రతూపమః - ఇంద్రుడు ఉపమానముగాఁ గల, సః - ఆ దిలీపుడు, రాజసుతైః - పెక్కు రాజకుమారులచేత, అనుద్రుతం - వెంబడింపఁబడినవాఁడును, ధనుర్ధరం - ధానుష్కుఁడునైన, తం - ఆ రఘువును, హోమతురంగ రక్షణే - యజ్ఞాశ్వ రక్షణమునందు, నియుజ్య - నియోగించి, ఏకేన - ఒకే అశ్వమేధముచేత మాత్రమే, అపూర్ణం - తక్కువగానున్న, క్రతూనాం - అశ్వమేధయాగము యొక్క, శతం - నూరింటిని, అపవిఘ్నం - విఘ్నములు తొలఁగునట్లుగా, ఆప - పొందెను. రఘువు యాగాశ్వములను వెంబడించి దిగ్విజయమును సాధింపఁగా, దిలీపుఁడు తొంబది తొమ్మిది అశ్వమేధ యాగములను పూర్తి చేసెనని భావము. "శతం వై తుల్యా రాజపుత్రా దేవా ఆశాపాలాః" అను శ్రుతి ననుసరించి రఘు సహాయార్థము రాజపుత్రశతమును బంపెను.

శ్లో. తతః పరం తేన మఖాయ యజ్వనా
తురంగ ముత్సృష్ట మనర్గలం పునః,
ధనుర్భృతా మగ్రత ఏవ రక్షిణాం
జహార శక్రః కిల గూఢవిగ్రహాః. 39

వ్యాఖ్య: తతఃపరం - తొంబది తొమ్మిది క్రతువులు చేసిన పిమ్మట, యజ్వనా - యజ్ఞకర్తయైన, తేన - ఆ దిలీపునిచేత, పునః - మరల, మఖాయ - యాగము చేయుటకొఱకు, ఉత్సృష్టం - విడువబడినదియు, అనర్గలం - అవ్యాహతమైన స్వేచ్ఛా గమనముగల, తురంగం - గుఱ్ఱమును, ధనుర్భృతాం, రక్షిణాం - దానిని రక్షించుచున్న విలుకాండ్రయొక్క, అగ్రతః ఏవ - ఎదుటనే,

శక్రః - ఇంద్రుఁడు, గూఢ విగ్రహః - కనఁబడని శరీరము గలవాఁడగుచు జహార కిల - అపహరించెనట ; శతతమాశ్వమేధమునకై విడువఁబడిన గుఱ్ఱమును రక్షకుల యెదుటనే ఇంద్రుఁడు గూఢముగా నపహరించెను. "అపర్యావర్తయంతోఽశ్వ మనుచరంతి" అను ఆపస్తంబ స్మృతివలన యాగాశ్వము, దాని యిష్టమువచ్చిన రీతిగా ముందునకు వెళ్లుచుండగా రక్షకులు దానివెంట వెళ్లవలసినదే కాని, దానిని యిటునటు మఱపరాదు కనుక నది యనర్గలముగా వెళ్లుచుండినది.

శ్లో. విషాద లుప్త ప్రతిపత్తి విస్మితం
కుమారసైన్యం సపది స్థితంచ తత్,
వసిష్ఠధేనుశ్చ యదృచ్ఛ యాగతా
శ్రుతప్రభావా దదృశేఽథ నందినీ. 40

వ్యాఖ్య: తత్ - ఆ రఘువునకు సంబంధించిన, సైన్యం - సైన్యము, సపది - ఆక్షణమునందు, విషాదలుప్త ప్రతిపత్తి - విషాద - మనోభంగ రూపమైన దుఃఖముచేత, లుప్త - లోపించిన, ప్రతిపత్తి - కర్తవ్య జ్ఞానము గలదియై (ఏమియుఁ దోచనిదియై), విస్మితం - ఆకస్మికమైన అశ్వనాశమున కాశ్చర్యము గలదియగుచు, స్థితం - నిలచిపోయినది, అథ - తరువాత, శ్రుతప్రభావా - ప్రసిద్ధ ప్రభావముగలదియు, యదృచ్ఛయా - స్వేచ్ఛచేత, ఆగతా - వచ్చినదియు, నందినీ - నందినియను పేరుగల, వసిష్ఠధేనుశ్చ - వసిష్ఠుని గోవు, దదృశే - కనఁబడెను. గుఱ్ఱము ఉన్నదున్నట్లు మాయమగుటచేత రఘువు, అతని సైన్యమును ఆశ్చర్య చకితులైరి. ఇంతలో నక్కడ నందినీ ధేనువు సాక్షాత్కరించెను. రెండు 'చ' కారములు, సైన్యము స్తబ్ధమగుటయు, నందినీ ధేనువు సాక్షాత్కరించుటయు అవిలంబముగా జరిగినవి అని తెలుపుటకు ప్రయోగింపబడినవి. రఘువు తన యనుగ్రహము వలన పుట్టినవాడు కనుక సహాయపడుటకు నందిని వచ్చెను.

శ్లో. తదంగ నిష్యంద జవేన లోచనే
ప్రమృజ్య పుణ్యేన పురస్కృతః సతామ్,
అతీంద్రియేష్వ ప్యుపపన్న దర్శనో
బభూవ భావేషు దిలీప నందనః. 41

వ్యాఖ్య: సతాం - సత్పురుషులకు, పురస్కృతః - ముందున్న వాఁడైన, (సత్పురుషాగ్రణియైన అని యర్థము), దిలీప నందనః - రఘురాజు, పుణ్యేన - పవిత్రమైన. తదంగ నిష్యందజలేన - తత్ - ఆ నందినీ ధేనువుయొక్క, అంగ - శరీరమునుండి, నిష్యంద - స్రవించిన - జలేన - జలముచేత (ఆ నందినీ ధేనువు యొక్క మూత్రముచేత), లోచనే - కన్నులను, ప్రమృజ్య - తుడుచుకొని, అతీంద్రియేషు - నేత్రాదులైన యింద్రియములకు గోచరింపని, భావేషు, అపి - వస్తువులయందు సైతము, ఉపపన్న దర్శనః - సంభవించిన సాక్షాత్కార శక్తిగల వాఁడు (ఇతరుల దృష్టికి కనపడని వస్తువులను జూడగల శక్తి గలవాఁడు) బభూవ - అయ్యెను. అట్లువచ్చిన నందినీధేనువు మూత్రముచేత కన్నులు తుడుచు కొనగా రఘువునకు అందటికిఁ గనపడని వస్తువులను తాను చూడఁగల శక్తి వచ్చెను.

శ్లో స పూర్వతః పర్వతపక్ష శాసనం
దదర్శ దేవం నరదేవ సంభవః,
పునఃపునః సూత నిషిద్ధ చాపలం
హరంత మశ్వం రథరశ్మి సంయతమ్. 42

వ్యాఖ్య: నరదేవ సంభవః - రాజకుమారుఁడైన, సః - ఆ రఘువు, పునఃపునః - మాటిమాటికిని, సూత నిషిద్ధచాపలం - సూత - సారథిచేత, నిషిద్ధ - నివారింపబడిన, చాపలం - ఔద్ధత్యము గలదియు (ఇటునటు లాగుచు నెగిసిపోఁ బోవుచున్నట్టిదియు), రథరశ్మి సంయతం - రథముయొక్క పగ్గములచేత కట్టి వేయబడినదియు నగు, అశ్వం - గుఱ్ఱమును, హరంతం - అపహరించుక పోవు చున్న, పర్వత పక్షశాతనం - పర్వత - పర్వతములయొక్క, పక్ష - రెక్కలను, శాతనం - నఱికి వేయునట్టి, దేవం - దేవతా రూపుఁడగు పురుషుని (ఇంద్రునిని) పూర్వతః - తూర్పుదిక్కునందు, దదర్శ - చూచెను. యాగాశ్వము మొండికెత్తి యెగురుచున్నను దానిని రథమునకు గట్టించి యపహరించుక పోవుచున్న యింద్రుఁడు తూర్పుదిశయందు రఘువునకుఁ గానవచ్చెను.

శ్లో. శ్మశ్రు స్తస్య మణ్ణా మనిమేషవృత్తిభిః
హరిం విదిత్వా హరిభిశ్చ వాజిభిః,

అవోచదేనం గగనస్పృశా రఘుః
స్వరేణ ధీరేణ నివర్తయన్నివ 43

వ్యాఖ్య: రఘుః - రఘుమహారాజు, తం - గుఱ్ఱము నపహరించుకొని పోవుచున్న యాతనిని, అనిమేష వృత్తిభిః - తెప్పలు ర్రాల్చకుండునవి యైన, అక్ష్ణాం,శతైః - కన్నులయొక్క శతములచేతను (సహస్ర నేత్రములచేత), హరిభిః - ఆకుపచ్చని రంగుగలవియైన, వాజిభిశ్చ - గుఱ్ఱముల చేతను, హరిం - ఇంద్రునిగా, విదిత్వా - తెలిసికొని, ఏనం - కనబడుచున్న ఆ యింద్రుని, గగనస్పృశా - ఆకాశమును తాకునదియు, ధీరేణ - గంభీరమైనదియు నగు, స్వరేణ ఏవ - ధ్వనిచేతనే, నివర్తయన్ ఇవ - వెనుకకు మరలించుచున్న వాఁడువలె, అవోచత్ - పలికెను (ఉచ్చైఃస్వరముతో పలికెనని యర్థము) రఘువు సహస్ర నేత్ర హరిదశ్వాది చిహ్నములచేత యింద్రుని గుర్తించి పెద్దగా వరచుచు పలికెనని భావము.

శ్లో. మఖాంశభాజాం ప్రథమో మనీషిభి
స్త్వ మేవ దేవేంద్ర! సదా నిగద్యసే,
అజస్ర దీక్షాప్రయతస్య మద్గురోః
క్రియావిఘాతాయ కథం ప్రవర్తసే? 44

వ్యాఖ్య: హే దేవేంద్ర - ఓ దేవేంద్రుడా! మనీషిభిః - విద్వాంసులచేత, త్వమేవ - నీ వొకండవే, మఖాంశభుజాం - యజ్ఞ భాగములను అనుభవించువారిలో, ప్రథమః - మొదటివాఁడవుగా, సదా - ఎల్లప్పుడును, నిగద్యసే - చెప్పఁబడుచుందువు, (తథాపి - అట్లయ్యును) అజస్రదీక్షా ప్రయతస్య - అజస్ర - నిత్యమును, దీక్షా - యజ్ఞదీక్షయందు, ప్రయతస్య - నియమితుఁడైన, మద్గురోః - మా తండ్రియొక్క, క్రియా విఘాతాయ - క్రతు వినాశమును చేయుటకు, కథం - ఎట్లు, ప్రవర్తసే - పూకుకొనుచున్నావు? ఓ దేవేంద్రా! నీవు యజ్ఞభోక్తవు, యజ్ఞమునందలి హవిర్భాగమును ప్రప్రథమము స్వీకరించునట్టి నీవు నిరంతరముగా యజ్ఞదీక్షితుఁడై యున్న మా తండ్రియాగమునే యేల భంగపరచ దలఁచితివి? అది నీకే నష్టముకదా! అని ప్రశ్నించెను.

శ్లో. త్రిలోకనాథేన సదా మఖద్విషః
త్వయా నియమ్యా ననుదివ్యచక్షుషా

స చేత్స్వయం కర్మసు ధర్మచారిణాం
త్వ మంతరాయో భవసి చ్యుతో విధిః. 45

వ్యాఖ్య: త్రిలోకనాథేన - ముల్లోకములకును ప్రభుఁడ వైనట్టియు, దివ్య చక్షుషా - అతీంద్రియ వస్తుదర్శనము చేయఁగల వాఁడవునైన, త్వయా - నీ చేత, మఖద్విషః - క్రతు విఘాతకులు, సదా - ఎల్లప్పుడును, నియమ్యాఃనను - శిక్షింపఁదగిన వారుకదా: సః త్వం - అట్టినీవు, ధర్మచారిణాం - ధర్మము నాచరించువారి యొక్క, కర్మసు - క్రతువులయందు, స్వయం - స్వయముగా (నీవే), అంతరాయం - విఘ్నము, భవసిచేత్ - అగుదువేని, విధిః - అనుష్ఠానము, చ్యుతః - నష్టమైనట్టిదే. త్రిలోకనాథుఁడవైన నీవు యజ్ఞవిఘాతకులను శిక్షింప వలసిన వాఁడవు. అట్టినీవే యజ్ఞాచరణమునకు విఘ్నమును జేతువేని లోకమునందు సత్కర్మయే నశించిపోవునని యనెను.

శ్లో. త దంగ మగ్ర్యం మఘవన్ ! మహాక్రతో
రముం తురంగం ప్రతిమోక్తు మర్హసి,
పథః శ్రుతే ర్దర్శయితార ఈశ్వరా
మలీమసా మాదదతే న పద్ధతిమ్. 46

వ్యాఖ్య: హేమఘవన్ - ఓ యింద్రుఁడా: తత్ - పైఁజెప్పిన కారణము వలన, మహాక్రతోః - అశ్వమేధ యాగమునకు, అగ్ర్యం - ప్రప్రథమమైన, అంగం - సాధనమగు, అముంతురంగం - ఈ గుఱ్ఱమును, ప్రతిమోక్తుం - వెనుకకు విడుచుటకు (తిరిగి నాకిచ్చివేయుటకు), అర్హసి - తగుదువు, (ఎందుకనగా) శ్రుతేః - వేదముయొక్క, పథః - మార్గములను, దర్శయితారః - చూపించువారగు (సన్మార్గదర్శకులైన) ఈశ్వరాః - గొప్పవారు, మలీమసాం - మలినమైన, పద్ధతిం - మార్గమును, న ఆదదతే - స్వీకరింపరు. (చెడ్డమార్గమున నడువరని యర్థము) వేదవేత్తవైన నీవిట్లు చేయుట తగదుగనుక నా గుఱ్ఱమును నాకిచ్చి వేయుము.

శ్లో. ఇతి ప్రగల్భం రఘుణా సమీరితం
వచో నిశమ్యాధిపతి ర్దివౌకసాం,

నివర్తయామాస రథం సవిస్మయః
ప్రచక్రమేచ ప్రతివక్తు ముత్తరమ్. 47

వ్యాఖ్య: ఇతి - ఇట్లు, రఘుణా - రఘుమహారాజు చేత, సమీరితం - పలుకబడిన, ప్రగల్భం వచః - ప్రౌఢమైన వచనమును, నిశమ్య - విని, దివౌకసాం - స్వర్గవాసులకు, అధిపతిః - ప్రభువైన దేవేంద్రుడు, సవిస్మయః - ఆశ్చర్యము కలవాఁడగుచు, రథం - తన రథమును, నివర్తయామాస - వెనుకకు మరల్చెను, ప్రతివక్తుం - బదులుపలుకుటకు, ప్రచక్రమేచ - ప్రారంభించెను గూడ. రఘుమహారాజు మాటల కాశ్చర్యచకితుఁడైన యింద్రుఁడు తన రథమును వెనుకకు మరల్చి ఇట్లు పలుకదొడగెను.

శ్లో. యదాత్థ రాజన్యకుమార! తత్తథా
యశస్తు రక్ష్యం పరతో యశోధనైః,
జగత్ప్రకాశం తదశేష మిజ్యయా
భవద్గురు ర్లంఘయితుం ముమోద్యతః. 48

వ్యాఖ్య: హే రాజన్యకుమార - ఓ క్షత్రియ యువకుఁడా! యత్ - ఏ వాక్యమును, ఆత్థ - పలుకుచున్నావో, తత్తథా - అదియట్లే (సత్యమే), తు - కాని, యశోధనైః - కీర్తియే ధనముగాఁగల మావంటి వారిచేత, పరతః - శత్రువునుండి, యశః - కీర్తి, రక్ష్యం - కాపాడఁదగినట్టిది (ఇతరుల బారినిఁ బడనీయక మా కీర్తిని మేము రక్షించుకొనుట యవసరము), భవద్గురుః - నీ తండ్రియగు దిలీపుఁడు, జగత్ప్రకాశం - లోక ప్రసిద్ధమైయున్న, అశేషం - సర్వమైన, మమ - నాయొక్క, తత్ - ఆ కీర్తిని (ఆ నాకీర్తియంతటిని), ఇజ్యయా - యాగముచేత, లంఘయితుం - అతిక్రమించుటకు, ఉద్యతః - ఉద్యుక్తుఁడై యున్నాఁడు. ఓయి! నీవు చెప్పునది సత్యమే. కావి మీ తండ్రి నూరుయజ్ఞములు పూర్తిచేసి నాకున్న "శతక్రతు" బిరుదమును, కీర్తిని రూపుమాపుటకు ప్రయత్నించుచున్నాడు. మరి నా కీర్తిని నేను రక్షించుకొనవలదా? యని యింద్రుఁడు రఘువుతో ననెను.

శ్లో. హరి ర్యథైకః పురుషోత్తమః స్మృతో
మహేశ్వర స్త్ర్యంబక ఏవ నాపరః.

తథా విదుర్మాం మునయః శతక్రతుం
ద్వితీయగామీ నహి శబ్ద ఏష నః. 49

వ్యాఖ్య: యథా - ఏ విధముగా, హరిః - విష్ణువు, ఏకః - ఒక(డే, పురుషోత్తమః - పురుషోత్తము(డని, స్మృతః - స్మరింప(బడుచున్నా(డో (చెప్పబడుచున్నా(డో), యథాచ - ఏవిధముగానైతే, త్ర్యంబక ఏవ - శివుడే, మహేశ్వరః స్మృతః - మహేశ్వరు(డుగా చెప్ప(బడుచున్నా(డో, నాపరః - మఱియొక పురుషు(డుకాదో, తథా - అదేవిధముగా, మాం - నన్ను, మునయః -ఋషులు, శతక్రతుం - శతక్రతు శబ్దవాచ్యునిగా, విదుః - గుర్తింతురు, నః - మా యొక్క- (హరిహరులయొక్క-యు, నాయొక్క-యు), ఏషః - ఈ, శబ్దః - శబ్దము (పురుషోత్తమ, మహేశ్వర, శతక్రతు శబ్దములు) ద్వితీయగామీ - రెండవ వానిని చేరునది, నహి - కాదుసుమా ! నేనుతప్ప మరియొకడు "శతక్రతు, శతమన్యు" శబ్దములచేత(బిలువ(బడుటకు అర్హుడుకాడని భావము.

శ్లో. అతోఽయ మశ్వః కపిలానుకారిణా
పితు స్త్వదీయస్య మయాపహారితః,
అలం ప్రయత్నేన తవాత్ర మానిధాః
పదం పదవ్యాం సగరస్య సంతతేః. 50

వ్యాఖ్య: అతః - ఈ కారణమువలన (నేనుమాత్రమే శతక్రతు శబ్ద వాచ్యు(డ నైనందువలన), త్వదీయస్యపితుః - మీ తండ్రియొక్క-, అయం - నూరవదియైన యీ, అశ్వః - గుఱ్ఱము, కపిలానుకారిణా - కపిలమహాముని బోలియున్న, మయా - నాచేత, అపహారితః - అపహరింప(బడినది, తవ - నీకు, అత్ర - ఈ గుఱ్ఱము విషయమై, ప్రయత్నేన - ప్రయత్నముచేత, అలం - చాలును (ఈ గుఱ్ఱముకొరకై నీవు ప్రయత్నింపకుము), సగరస్య - సగర చక్రవర్తియొక్క-, సంతతేః - సంతానముయొక్క-, పదవ్యాం - మార్గమునందు, పదం - అడుగును, మానిధాః - పెట్టకుము. పెద్దవారిని తిరస్క-రించుట నీకు వినాశమూల మగుననియు గుఱ్ఱముపై నాశ విడువుమనియు నింద్రుడు పల్క-ను. పూర్వము సగరచక్రవర్తి యాగార్థమై అశ్వమును విడువ(గా నదియొక గోతిలో దిగబడి పాతాళమునందు తపస్సు చేసికొనుచున్న కపిలునివద్ద చేరెను. సగరుని

కుమారులు (60 వేల సంఖ్య గలవారు) అచ్చటికి నేలను త్రవ్వుకొని యేగి కపిలుఁడు అశ్వము నపహరించెనని యవమానించి కపిలుని కోపవహ్నిలో బస్మమై పోయిరి. ఆ కథ నింద్రుఁ డిచ్చట రఘువునకు "కపిలానుకారిణా" యను పదము చేత సూచించి నీవును అట్లు నశింపకుమని హితము చెప్పెను.

శ్లో. తతః ప్రహస్యాపభయః పురందరం
పున ర్బభాషే తురగస్య రక్షితా,
గృహాణ శస్త్రం యది సర్గ ఏష తే
న ఖల్వనిర్జిత్య రఘుం కృతీ భవాన్. 51

వ్యాఖ్య: తతః - తరువాత, తురగస్య - గుఱ్ఱమునకు, రక్షితా - రక్షకుఁడైన రఘువు, ప్రహస్య - పెద్దగానవ్వి, అపభయఃసన్ - భయములేనివాఁడగుచు, పునః - తిరిగి, పురందరం - ఇంద్రుని గుఱించి, బభాషే - పలికెను (బదులు పలికెనని యర్థము). హే దేవేంద్రా! - ఓ దేవేంద్రుఁడా! ఏషః - ఇది (గుఱ్ఱమును విడువకపోవుట) తే - నీ యొక్క, సర్గఃయది - నిశ్చయమే యైనచో, శస్త్రం - ఆయుధమును, గృహాణ - తీసుకొనుము, భవాన్ - నీవు, రఘుం - రఘువును (నన్ను), అనిర్జిత్య - జయింపకుండ, కృతీ - కృతకృత్యుఁడవు, నఖలు - కాలేవుసుమా! రఘువు పెద్దగానవ్వి అశ్వమును విడువక పోవుటయే నీ నిశ్చయమైనచో శస్త్రపాణివై నాతో యుద్ధము చేయుమని యింద్రునితో ననెను. 'సర్గ' శబ్దమునకు స్వభావ, నిర్మోక్ష, నిశ్చయ, అధ్యాయ, సృష్టులు అర్థములు.

శ్లో. స ఏవ ముక్త్వా మఘవంత మున్ముఖః
కరిష్యమాణః సశరం శరాసనమ్,
అతిష్ఠ దాలీఢవిశేష శోభినా
వపుఃప్రకర్షేణ నిదర్శితేశ్వరః. 52

వ్యాఖ్య: సః - ఆ రఘువు, ఉన్ముఖః - ఎత్తిన ముఖము కలవాఁడగుచు, (ఇంద్రుడు ఆకాశమునందు రఘువు నేలమీద నుండుటవలన నని భావము) మఘవంతం - ఇంద్రుని గుఱించి, ఏవం - పైన చెప్పినవిధముగా, ఉక్త్వా - పలికి, శరాసనం - ధనుస్సును, సశరం - బాణముతో కూడినదానిగా, కరిష్యమాణః -

చేయబోవుచున్న వాఁడగుచు, ఆలీఢ విశేష శోభినా—ఆలీఢ - 'ఆలీఢ'మను పేరు గల, విశేష - ఒకానొక స్థితిభేదముచేత, శోభినా - ప్రకాశించుచున్న, వపుఃప్రకర్షేణ - శరీరౌన్నత్యముచేత, విడంబితేశ్వరః - అనుకరింపఁబడిన శివుడు కలవాఁడై (శివునివలె), అతిష్ఠత్ - నిలిచెను. ఆకాశముపైపు తలనెత్తి, బాణమునెక్కుపెట్టి రఘువు ఇంద్రునితో యుద్ధము చేయుటకు సిద్ధపడెను. ధనుర్ధరులు యుద్ధమునందు నిలుచు స్థానభేదములు: "వైశాఖము, మండలము, సమపదము, ఆలీఢము, ప్రత్యాలీఢము" అని యైదు విధములు, ఆలీఢమనగా నొకకాలు వెనుకకును ఒకకాలు ముందునకును పెట్టి నిలుచుండుట.

శ్లో. రఘో రవష్టంభమయేన పత్రిణా
హృది క్షతో గోత్రభిదప్యమర్షణః,
నవాంబుదానీక ముహూర్త లాంఛనే
ధనుష్య మోఘం సమధత్త సాయకమ్. 53

వ్యాఖ్య: రఘోః - రఘుమహారాజుయొక్క, అవష్టంభమయేన - స్తంభరూపమైన (లేక సువర్ణరూపమైన), పత్రిణా - బాణముచేత, హృది - వక్షస్థలమునందు, క్షతః - కొట్టఁబడినవాఁడై, (కనుకనే) అమర్షణః - క్రుద్ధుఁడైన, గోత్రభిత్, అపి - ఇంద్రుఁడుసైతము, నవాంబుదానీక ముహూర్తలాంఛనే: - నవాంబుద - తొలకరి మేఘములయొక్క, అనీక - బృందమునకు, ముహూర్త - క్షణకాలము, లాంఛనే - చిహ్నముగా నుండునట్టి, ధనుషి - తన యింద్రధనుస్సునందు, అమోఘం - వ్యర్థముకాని, సాయకం - బాణమును, సమధత్త - కూర్చెను, రఘువుచేత వక్షస్థలముపై కొట్టబడిన యింద్రుఁడు క్రుద్ధుఁడై తన యింద్రధనుస్సునందు బాణము నెక్కుపెట్టెను.

శ్లో. దిలీపసూనోః స బృహద్భుజాంతరం
ప్రవిశ్య భీమాసుర శోణితోచితః,
పపా వనాస్వాదితపూర్వ మాశుగః
కుతూహలేనేవ మనుష్య శోణితమ్. 54

వ్యాఖ్య: భీమాసుర శోణితోచితః — భీమ - భయంకరులైన, అసుర - రాక్షసులయొక్క, శోణిత - రక్తమునందు, ఉచితః - పరిచితమైన, సః - ఆ

యింద్రునిచే విడువఁబడిన, ఆశుగః - బాణము, దిలీపసూనోః - రఘువుయొక్క, బృహత్ - విశాలమైన, భుజాంతరం - వక్షస్థలమును, ప్రవిశ్య - ప్రవేశించి, అనాస్వాదిత పూర్వం - ఇంతకుపూర్వము రుచి చూడనట్టి, మనుష్య శోణితం - మనుష్య రక్తమును, కుతూహలేనేవ - కుతూహలమచేతవలె, పపౌ - పానము చేసెను. భయంకరమైన యింద్రబాణము రఘువుయొక్క వక్షస్థలమున నాటి రక్తమును స్రవింపఁ జేసెను.

శ్లో. హరేః కుమారోఽపి కుమారవిక్రమః
సురద్విపాస్ఫాలన కర్కశాంగులౌ,
భుజే శచీపత్రవిశేష కాంకితే
స్వనామచిహ్నాం నిచఖాన సాయకమ్. 55

వ్యాఖ్య: కుమార విక్రమః - కుమారస్వామియొక్క పరాక్రమమువంటి పరాక్రమముగల, కుమారోఽపి (కుమార + అపి) - రఘువుగూడ, సురద్విపాస్ఫాలనకర్కశాంగులౌ—సురద్విప - ఐరావతముయొక్క, ఆస్ఫాలన - చఱపుల చేత, కర్కశ - కఠినములైన (మార్దవము పోయిన) అంగులౌ - వ్రేళ్లుకలదియును, శచీపత్ర విశేషకాంకితే—శచీ - శచీదేవియొక్క (ఆమె బుగ్గలు మొదలైన ప్రదేశములందు చిత్రింపబడిన) పత్రవిశేషక - మకరికాది పత్రరచనలు, బుక్క మొదలగువానిచేత, అంకితే - చిహ్నితమైన (ఆయా రంగులన్నియు నంటుకొనిన) హరేః - ఇంద్రుని యొక్క, భుజే - భుజము మీద, స్వనామ చిహ్నాం - స్వనామాంకితమైన ('రఘు' అను పేరుగల) సాయకం - బాణమును, నిచఖాన - నాటెను. నిష్కంటకముగా స్వర్గరాజ్యము నేలుచున్న యింద్రుని కిది మహాపరాభవము. అతని భుజమునందు రఘునామాంకితమైన శరము నాటుకొని నిలిచి యుండెనట.

శ్లో. జహార చాన్యేన మయూరపత్త్రిణా
శరేణ శక్రస్య మహాశనిధ్వజమ్,
చుకోప తస్మై స భృశం సురశ్రియః
ప్రసహ్య కేశవ్యపరోపణా దివ. 56

వ్యాఖ్య: అన్యేన - మరియొకటి యైన, మయూరపత్త్రిణా - నెమలి యీకలుగల, శరేణ - బాణము చేత, శక్రస్య - ఇంద్రునియొక్క, మహాశని ధ్వజం - గొప్ప వజ్రాయుధ రూపముగల కేతనమును (జెండాను), జహార - హరించెను (భేదించెను), సః - ఆ యింద్రుఁడు, సురశ్రియః - దేవరాజ్యలక్ష్మి యొక్క, ప్రసహ్య - బలాత్కారముచేసి (లాగి), కేశవ్యపరోపణాదివ - కేశ బంధ మును భేదించుటవలన వలె, తస్మై - ఆ రఘువుకొఱకు, భృశం - మిక్కిలి, చుకోప - కోపించెను. రఘువు మరియొక బాణముచేత ఇంద్రుని ధ్వజమును విరుగ గొట్టగా స్వర్గరాజ్యలక్ష్మియొక్క సిగను గోసినట్లు భావించి ఇంద్రుఁడు అతనిని మిక్కిలికోపించి చంపఁ దలచెనని భావము.

శ్లో. ఇయో రుపాంతస్థిత సిద్ధసైనికం
గరుత్మదాశీవిష భీమదర్శనైః,
బభూవ యుద్ధం తుములం జయైషిణో
రధోముఖై రూర్ధ్వముఖై శ్చ పత్త్రిభిః. 57

వ్యాఖ్య: జయైషిణోః - ఒకరినొకరు జయింపఁదలచుకున్న, తయోః - ఆ యిద్దఱికి (యింద్ర రఘువులకు), గరుత్మదాశీవిషభీమ దర్శనైః - గరుత్మత్ - ఱెక్కలుగల, ఆశీవిష - సర్పములవలె, భీమ - భయంకరమైన, దర్శనైః - దర్శనముగల (ఱెక్కలుగల సర్పములవలె చూచువారికి భయమును గలిగించు చున్నట్టి), అధోముఖైః - అధోముఖములును, ఊర్ధ్వముఖైశ్చ - ఊర్ధ్వముఖములు నైన (ఇంద్రుఁడు వేయునవి అధోముఖముగాను, రఘువు వేయునవి ఊర్ధ్వముఖ ముగాను పోవుచుండెనని భావము), పత్త్రిభిః - బాణములచేత, ఉపాంతస్థిత సిద్ధి సైనికం - ఉపాంతస్థిత - తటస్థులుగా నున్న, సిద్ధ - ఇంద్రుని పక్షమువారైన సిద్ధులును, సైనికం — రఘు పక్షీయులైన సైనికులు కలదియునగు, తుములం, యుద్ధం - సంకులమైన యుద్ధము, బభూవ - జరిగెను. ఇంద్రుని బాణములు నేల మీదికిని రఘువు బాణములు ఆకాశమునకును బహుళముగా వ్యాపించుచుండగా జూచుచున్న యిరుపక్షములవారికిని భయమును గలిగించు సంకులయుద్ధము జరిగెను,

శ్లో. అతిప్రబంధ ప్రహి తాస్త్రవృష్టిభిః
త మాక్షయం దుష్ప్రసహస్య తేజసః,

శశాక నిర్వాపయితుం న వాసవః
స్వతశ్చ్యుతం వహ్నిమివాద్భి రంబుదః. 58

వ్యాఖ్య: వాసవః - ఇంద్రుఁడు, అతిప్రబంధ ప్రహితాస్త్ర వృష్టిభిః - అతిప్రబంధ - ఎడతెగకుండ, ప్రహిత - ప్రయోగింపఁ బడిన, అస్త్ర వృష్టిభిః - బాణవర్షములచేత, దుష్ప్రసహ్య - ఓర్వజాలనట్టి, తేజసః - ప్రతాపమునకు, ఆశ్రయం - ఆశ్రయుఁడైన, తం - ఆ రఘువును, అంబుదః - మేఘము, అద్భిః - ఉదకములచేత, స్వతశ్చ్యుతం - తనంతట జాటిన, వహ్నింఇవ - అగ్నిని వలె, నిర్వాపయితుం - చల్లార్చుటకు, న శశాక - శక్తుఁడు కాలేకపోయెను. మేఘము తన జలధారలచేత విద్యుద్రూపమైన పిడుగు మొదలయినవానిని చల్లార్పఁజాలనట్లు, లోకపాలాంశతోఁ బుట్టిన రఘుమహారాజు ఇంద్రాంశ సంభూతుఁడే కనుక నతని ప్రతాపము నాపఁ జాలకపోయెనని భావము. "అష్టాభి ర్లోకపాలానాం మాత్రాభి ర్నిర్మితో నృపః".

శ్లో. తతః ప్రకోష్ఠే హరిచందనాంకితే
ప్రమథ్యమానార్ణవ ధీరనాదినీమ్,
రఘుః శశాంకార్ధముఖేన పత్త్రిణా
శరాసనజ్యా మలునాత్ బిడౌజసః. 59

వ్యాఖ్య: తతః - తరువాత, రఘుః - రఘురాజు, హరిచందనాంకితే - శ్రీగంధముచే పూయఁబడిన (లేదా కల్పవృక్షములలో నొకదాని చిహ్నముగల) ప్రకోష్ఠే - ఇంద్రుని మణిబంధమునందు, ప్రమథ్యమానార్ణవ ధీరనాదినీం— ప్రమథ్యమాన - మథింపఁబడుచున్న, అర్ణవ - సముద్రమువలె, ధీర - గంభీరముగా, నాదినీం - ధ్వనించుచున్న, బిడౌజసః - ఇంద్రునియొక్క, శరాసనజ్యాం - విల్లుయొక్క అల్లెత్రాటిని (మౌర్వి ని), శశాంకార్ధ ముఖేన - అర్ధచంద్రాకార ముఖముగల, పత్త్రిణాం - బాణముచేత, అలునాత్ - ఛేదించెను. 'వేవేష్టి వ్యాప్నోతి ఇతి విట్ - వ్యాపకం ఓజః యస్య సః బిడౌజాః తస్య బిడౌజసః' అని బిడౌజశ్శబ్ద వ్యుత్పత్తి. "వబయో రభేదః" కనుక "విట్, బిట్" అయినది. వ్యాపకమైన పరాక్రమము గలవాఁడని యర్థము.

శ్లో. స చాప మున్ముత్సృజ్య వివృద్ధమత్సరః
ప్రణాశనాయ ప్రబలస్య విద్విషః,
మహీధ్ర పక్ష వ్యపరోపణోచితం
స్ఫురత్ప్రభామండల మస్త్ర మాదదే. 60

వ్యాఖ్య: వివృద్ధమత్సరః - ప్రబలిన వైరముగల, సః - ఆ యింద్రుడు, చాపం - ధనుస్సును, ఉత్సృజ్య - వదలివేసి, ప్రబలస్య - అధికుడైన, విద్విషః - శత్రువుయొక్క, ప్రణాశనాయ - వధకొఱకై, మహీధ్ర పక్ష వ్యపరోపణోచితం — మహీధ్ర - పర్వతములయొక్క, పక్ష - రెక్కలను, వ్యపరోపణ - ఛేదించుటయందు, ఉచితం - సమర్థమైనదియు, స్ఫురత్ప్రభా మండలం - ప్రకాశించు కాంతిమండలము గల, అస్త్రం - అస్త్రమును (అనగా వజ్రాయుధమును) ఆదదే - తీసికొనెను. వజ్రాయుధముచేత రఘువును నఱుకుట కుద్యుక్తుడయ్యెనని భావము.

శ్లో. రఘు ర్భృశం వక్షసి తేన తాడితః
పపాత భూమౌ సహ సైనికాశ్రుభిః,
నిమేషమాత్రా దవధూయ తద్వ్యథాం
సహోత్థితః సైనిక హర్ష నిస్వనైః. 61

వ్యాఖ్య: రఘుః - రఘువు, తేన - ఆ వజ్రాయుధముచేత, భృశం - అత్యధికముగా, వక్షసి - వక్షస్థలమునందు, తాడితః - కొట్టబడినవాడై, సైనికాశ్రుభిః సహ - తన సైనికుల కన్నీళ్లతోకూడ, భూమౌ - నేలపైన, పపాత - పడెను (సైనికుల దుఃఖాశ్రువులును రఘుమహారాజు శరీరమును ఏకకాలమున నేలపై బడినవి). నిమేషమాత్రాత్ - క్షణ కాలములోనే, తద్వ్యథాం - ఆ వజ్రఘాతమువలన కలిగిన బాధను, అవధూయ - దులుపుకొని (లెక్కసేయక), సైనిక హర్ష నిస్వనైఃసహ - రఘురాజు భటుల హర్షధ్వానములతో (సింహ నాదముతో కూడ), ఉత్థితః - లేచి నిలువబడెను. నేలపై బడుటకును మరల లేచి నిలుచుండుటకును ఎక్కువ వ్యవధానము లేకపోయెననియు, వజ్రాయుధపు దెబ్బను సైతము రఘువు లెక్కసేయక వెంటనే తేరుకొనెననియు భావము.

శ్లో. తథాపి శస్త్రవ్యవహార నిష్ఠురే
విపక్షభావే చిర మస్య తస్థుషః,
తుతోష వీర్యాతిశయేన వృత్రహా
పదం హి సర్వత్ర గుణై ర్నిధీయతే. 62

వ్యాఖ్య: తథాపి - వజ్రఘాతము జరిగినప్పటికిని, శస్త్ర వ్యవహారనిష్ఠురే - శస్త్ర - ఆయుధములయొక్క, వ్యవహార - వ్యాపారముచేత (బాణములు వేయుచునే యుండుటచేత), నిష్ఠురే - క్రూరమైన, విపక్షభావే - శాత్రవమునందు, చిరం - ఎక్కువసేపు, తస్థుషః - నిలచియున్న, అస్య - ఈ రఘువుయొక్క, వీర్యాతిశయేన - పరాక్ర మాతిశయముచేత, వృత్రహా - ఇంద్రుడు, తుతోష - సంతోషించెను (శత్రువువలన సంతోషవడుట యెట్లు? అనగా) గుణైః - సద్గుణములచేత, సర్వత్ర - అంతట (శత్రుమిత్ర ఉదాసీనులయందు), పదం - పాదము, నిధీయతే - ఉంచబడును. ఇంద్రుఁడు రఘు పరాక్రమమునకు సంతోషించెను. గుణములు అంతటను ప్రవేశించును గనుక, రఘురాజు గుణములు శత్రువగు నింద్రునిపైత మాకర్షించినవని భావము. అలంకారము: అర్థాంతర న్యాసము.

శ్లో. అసంగ మద్రిష్వపి సారవత్తయా
న మే త్వదన్యేన ఽసోఢ మాయుధమ్,
అవేహి మాం ప్రీత మృతే తురంగమాత్
కి మిచ్ఛసీతి స్ఫుట మాహ వాసవః. 63

వ్యాఖ్య: సారవత్తయా - మహాపటిష్ఠమైన దగుటచేత, అద్రిషు, అపి - పర్వతములయందు సైతము, అసంగతం - అప్రతిహతమైన, మే, ఆయుధమ్ - నాయొక్క వజ్రాయుదము, త్వదన్యేన - నీకంటే యితరునిచేత, న విసోఢం - సహింపఁబడలేదు, (అతః - ఇందువలన) మాం - నన్ను, ప్రీతం - సంతుష్టుడైన వానినిగా, అవేహి - తెలిసికొనుము, తురంగమాత్, ఋతే - గుఱ్ఱముతప్ప, కిం ఇచ్ఛసి - ఏమి కోరెదవు? ఇతి - ఇట్లని, స్ఫుటం - స్పష్టముగా, వాసవః - ఇంద్రుఁడు, ఆహ - పలికెను. పర్వతములను సైతము ఛేదింపఁగల నా వజ్రాయుధముయొక్క దెబ్బను నీవుతప్ప సహించినవాఁడు లేడు కనుక సంతసించితిని.

తురంగముతప్ప యే మడిగినను ఇచ్చెదను నీకు కావలసిన వరమును కోరుకొమ్మని యింద్రుఁడు రఘువుతో ననెను.

శ్లో. తతో నిషంగా దసమగ్ర ముద్ధృతం
సువర్ణపుంఖ ద్యుతి రంజితాంగులిమ్,
నరేంద్రసూనుః ప్రతిసంహర న్నిషుం
ప్రియంవదః ప్రత్యవదత్ సురేశ్వరమ్. 64

వ్యాఖ్య: తతః - పిమ్మట, నిషంగాత్ - తూణీరమునుండి, అసమగ్రం - అసంపూర్ణముగా (సగముగా). ఉద్ధృతం - పైకి తీయబడినదియు, సువర్ణపుంఖ ద్యుతిరంజితాంగులిమ్ — సువర్ణపుంఖ - బంగారుపిడియొక్క, ద్యుతి - కాంతుల చేత, రంజిత - పూయబడిన, అంగులిం - వ్రేళ్లుగలదియునగు, ఇషుం - బాణమును, ప్రతిసంహరన్ - మరల నమ్ములపొదిలో విడుచుచున్న వాఁడై (తనను కొట్టనివానిని తాను కొట్టరాదను యుద్ధధర్మమును పాటించువాఁడై), ప్రియంవదః - ప్రేమవచనములు పలుకునట్టి, నరేంద్రసూనుః - రాజకుమారుఁడు, సురేశ్వరం - దేవతలకు ప్రభువైన యింద్రుని గుఱించి, ప్రత్యవదత్ - బదులు పలికెను.

శ్లో. అమోచ్య మశ్వం యది మన్యసే ప్రభో !
తతః సమాప్తే ఽధినైవ కర్మణి,
అజస్ర దీక్షాప్రయతః స మద్గురుః
క్రతో రశేషేణ ఫలేన యుజ్యతామ్ 65

వ్యాఖ్య: హే ప్రభూ ! (ఇంద్రా !), అశ్వం - గుఱ్ఱమును, అమోచ్యం - విడుచుటకు వీలులేనిదానినిగా, మన్యసే, యది - తలఁచుచున్న వాఁడవగుదువేని, తతః - అట్లయినచో, అజస్రదీక్షాప్రయతః — అజస్ర - ఎల్లపుడును, దీక్ష - క్రతు దీక్షయందు, ప్రయతః - నిష్ఠాపరుఁడై యున్న, సః మద్గురుః - ఆ మా తండ్రి, విధినైవ (విధినా + ఏవ) - శాస్త్రవిధానముచేతనే, కర్మణి - యాగకర్మ, సమాప్తే సతి పూర్తిచేయబడినదికాగా, క్రతోః - యాగమునకు, యత్ఫలం - ఏ ఫలమువచ్చునో, అశేషేణ - మిగులక సంపూర్ణమైన, ఫలేన - ఆ ఫలముచేత, యుజ్యతాం - కూర్పఁబడుగాక, మా తండ్రికి శతాశ్వమేధ ఫలము నిమ్ము అని

కోరెను. "అవిధినా కృతం అకృతం". విధివిధానము ననుసరించి చేయని కర్మ చేసినట్టేకాదు. కనుక శాస్త్రప్రకారము పరిసమాప్తి చేయఁబడిన అశ్వమేధయాగము యొక్క సంపూర్ణఫలమును మా తండ్రి కియ్యవలసినదని రఘువు ఇంద్రునిఁ గోరెను. అతఁడశ్వము తప్ప మరి దేనినైనను గోరు మనియుండెనుగదా! అశ్వమేధయాగ ఫలము దక్కినప్పు డశ్వముతో నేమిపని యని రఘు విట్లు కోరెను. ఇంద్రుఁడు యాగఫలప్రదాత కనుక కోరిక సమంజసముగా నున్నది. అట్టి కోరికను ఇంద్రుఁడు నిరాకరించుటకు వీలులేదు. దిలీపచక్రవర్తిని గూడ తనవలెనే "శతక్రతు, శతమన్యు" శబ్దవాచ్యునిగా భావించి స్వర్గరాజ్యసింహాసనార్ధ భాగముపై నెక్కుట కంగీకరింపవలసినదే. ఇది రఘువునకు తోచిన యుపాయము.

శ్లో. యథాచ వృత్తాంత మిమం సదోగత
త్రిలోచనైకాంశతయా దురాసదః,
తవైవ సందేశహరా ద్విశాంపతిః
శృణోతి లోకేశ! తథా విధీయతామ్. 66

వ్యాఖ్య: సదోగతః - యాగసభయందు గాని, రాజ్యసభయందు గాని యున్నవాడును, త్రిలోచనైకాంశతయా - త్రిలోచనుడగు శివుని ఒకమూర్తియైన వాఁడగుటచేత, దురాసధః - మాబోటివారిచేత సమీపించుటకు శక్యముకాని వాఁడును నగు, విశాంపతిః - రాజైన దిలీపుఁడు, యథా - ఏ ప్రకారముగానైతే, ఇమం - ఈ, వృత్తాంతం - వార్తను, తవ - నీయొక్క, సందేశహరాదేవ - వార్తాహరునివలననే, శృణోతి చ - వినువాఁడగునో, హే లోకేశ - ఓ యింద్రా! తథా - ఆ విధముగా, విధీయతాం - చేయఁబడుగాక, (ఈ వార్తను నీ దూత ద్వారానే తెలుపుమని కోరెను). "భూతార్కచంద్రయజ్వానో మూర్తయోష్టౌ ప్రకీర్తితాః" పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, సూర్యుఁడు, చంద్రుఁడు, యజ్వా (యాగదీక్షితుఁడు); ఇవి శివుని అష్టమూర్తులు. ఇందులో దిలీపుఁడు యజ్వ కనుక త్రిలోచనుని యొకయంశగాఁ జెప్పబడెనని గ్రహింప వలయును.

శ్లో. తథేతి కామం ప్రతిశుశ్రువాన్ రఘోః
యథాగతం మాతలిసారథి ర్యయౌ,

నృపస్య నాతిప్రమనాః సదోగృహం
సుదక్షిణాసూను రపి న్యవర్తత. 67

వ్యాఖ్య: మాతలిసారథిః - ఇంద్రుఁడు (మాతలియను సారథి గలవాడు), రఘోః - రఘువుయొక్క, కామం - కోరికను, తథేతి (తథా + ఇతి) - అట్లే యగుగాక యని, ప్రతిశుశ్రువాన్ - అంగీకరించిన వాఁడగుచు, యథాగతం - వచ్చినదారిని, యయౌ - వెళ్లిపోయెను, సుదక్షిణాసూనుః, అపి - రఘువుకూడ, నాతిప్రమనాః - అంతయెక్కువ సంతోషము లేనివాఁడగుచు, నృపస్య - రాజైన దిలీపునియొక్క, సదోగృహం - యాగమంటపమును గుఱించి, న్యవర్తత - తిరిగి వెళ్లెను. (విజయము చేకూరినను యాగాశ్వము పోయినందున రఘువుకు ఎక్కువ సంతోషము కలుగలేదని భావము).

శ్లో. త మభ్యనందత్ ప్రథమం ప్రబోధితః
ప్రజేశ్వరః శాసనహారిణా హరేః,
పరామృశన్ హర్షజడేన పాణినా
తదీయ మంగం కులిశ వ్రణాంకితమ్. 68

వ్యాఖ్య: హరేః - ఇంద్రునియొక్క, శాసనహారిణా - ఆజ్ఞను తెచ్చిన సేవకునిచేత, ప్రథమం - మొదట, బోధితః - తెలుపఁబడినవాఁడై (ఇంద్ర రఘు యుద్ధము, తనకు శతాశ్వమేధ ఫలము లభించుట మొదలగు నంశములు తెలుపఁబడిన వాఁడై), ప్రజేశ్వరః - రాజైన దిలీపుఁడు, హర్షజడేన - సంతోషాతిశయము చేత చల్లబడిన, పాణినా - చేతితో, కులిశవ్రణాంకితం—కులిశ - వజ్రాయుధము చేతనైన, వ్రణ- వ్రణముచేత, అంకితం - చిహ్నితమైన, తదీయం - ఆ రఘువునకు సంబంధించిన, అంగం - శరీరమును, పరామృశన్ - నిమురుచు, తం - అతనిని, అభ్యనందత్ - అభినందించెను. ఇంద్రుని దూతద్వారా ముందే సర్వము నెఱిఁగిన దిలీపుడు రఘువు రాగానే యతని నభినందించెను.

శ్లో. ఇతి క్షితీశో నవతిం నవాధికాం
మహాక్రతూనాం మహనీయశాసనః,

సమారురుక్షు ర్దివ మాయుషః క్షయే
తతాన సోపానపరంపరా మివ. 69

వ్యాఖ్య: మహనీయ శాసనః - పూజనీయమైన యాజ్ఞగల, క్షితీశః - దిలీప మహారాజు, ఇతి - ఈ ప్రకారముగా, మహాక్రతూనాం - అశ్వమేధ యాగములయొక్క, నవాధికాం - తొమ్మిదిచేత నెక్కువైన, నవతిం - తొంబదిని (99 అని యర్థము), ఆయుషః - తన ఆయుష్యముయొక్క, క్షయే - క్షయము జరిగినప్పుడు (తాను మృతిచెందినప్పుడు), దివం - స్వర్గమును, ఆరురుక్షుః - అధిరోహింపఁ దలఁచినవాఁడై, సోపానపరంపరామివ - మెట్లవరుసనువలె, తతాన - చేసెను (విస్తరించెను). తొంబది తొమ్మిది యాగములుచేసి, నూరవ అశ్వమేధ ఫలమునుగూడ కూమారుఁడైన రఘువు పరాక్రమముచేత సాధించిన దిలీపుఁడు స్వర్గమును సరాసరిగాఁ జేరుటకుఁ దగిన సోపానపరంపర నశ్వమేధములద్వారా యేర్పరచుకొనెను.

శ్లో. అథ స విషయ వ్యావృత్తాత్మా యథావిధి సూనవే
నృపతికకుదం దత్త్వా యూనే సితాతపవారణమ్,
మునివన తరుచ్ఛాయాం దేవ్యా తయా సహ శిశ్రియే
గలితవయసా మిక్ష్వాకూణా మిదం హి కులవ్రతమ్. 70

వ్యాఖ్య: అథ - ఆ తరువాత, విషయ వ్యావృత్తాత్మా—విషయ - భోగ్య వస్తువులనుండి, వ్యావృత్త - మరలిన, ఆత్మా - మనస్సుగల, సః - ఆ దిలీపుఁడు, యథావిధి - శాస్త్రప్రకారముగా, యూనే - యువకుఁడైన, సూనవే - కుమారుని కొఱకు (కుమారునికి), నృపతికకుదం - రాజచిహ్నమైన, సితాతపవారణం - శ్వేత చ్ఛత్రమును, దత్త్వా - ఇచ్చి (రాజ్యపట్టాభిషేకముచేసి యని యర్థము), తయా - ఆ, దేవ్యాసహ - భార్యయగు సుదక్షిణా దేవితోఁగూడ, మునివన తరుచ్ఛాయాం - మునివన - తపోవనమునందలి, తరు - ఒకానొక వృక్షముయొక్క, ఛాయాం - నీడను, శిశ్రియే - ఆశ్రయించెను, (వానప్రస్థాశ్రమమును స్వీకరించెనని భావము), హి - అది యట్లే, గలితవయసాం - వృద్ధులైనట్టి, ఇక్ష్వాకూణాం - ఇక్ష్వాకు వంశీయులైన రాజులకు, ఇదం - ఇది, కులవ్రతం - వంశాచారము. తరువాత దిలీపుఁడు వైరాగ్యము గలవాఁడై కుమారునికిఁ బట్టాభిషేకము గావించి, భార్యతో

సహా తమ వంశాచారమైన వానప్రస్థాశ్రమమును స్వీకరించెను. 'దేవ్యాసహ' అని చెప్పుటచేత 'సపత్నీక వానప్రస్థాశ్రమమును' స్వీకరించెనని భావము. "సుతవిన్యస్త పత్నీక స్తయావానుగతో వనమ్, వానప్రస్థో బ్రహ్మచారీ సాగ్నిఃసోపాసనో వ్రజేత్" అను యాజ్ఞవల్క్యస్మృతి వచనమువలన భార్యను కుమారులవద్ద విడిచివెళ్లుట యొక పక్షము. భార్యతోకూడ వెళ్లుట మరియొక పక్షము, ఎట్లయినను వానప్రస్థుఁడు బ్రహ్మచారియై, అగ్నికార్యము చేయుచు జీవితమును గడపవలయును. కావ్యారంభమునందు "వార్ధకే మునివృత్తీనామ్" అని చెప్పినదాని కిది యుదాహరణము.

ఇది మహాకవి కాళిదాసకృత

రఘువంశ కావ్యమున

తృతీయ సర్గకు తెలుఁగు లఘువ్యాఖ్య

మహాకవి కాళిదాసక్కృత రఘువంశము

చతుర్థ సర్గము

శ్లో. స రాజ్యం గురుణా దత్తం ప్రతిపద్యాధికం బభౌ,
దినాంతే నిహితం తేజః సవిత్రేవ హుతాశనః. 1

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, గురుణా - తండ్రియైన దిలీపునిచేత, దత్తం - ఈయఁబడిన, రాజ్యం - రాజ్యాధికారమును, ప్రతిపద్య - పొంది, దినాంతే - సాయంకాలమునందు, సవిత్రా - సూర్యునిచేత, నిహితం - ఉంచ బడిన, తేజః - తేజస్సును, ప్రతిపద్య - పొందినపిమ్మట, హుతాశనః ఇవ - అగ్నిహోత్రునివలె, అధికం. బభౌ - ఎక్కువగా ప్రకాశించెను. పరాక్రమతేజః ప్రభావాదులచేత సహజముగానే ప్రకాశించుచున్న రఘువు పితృదత్తమైన రాజ్యాధికారమునుపొంది, సాయంకాలమున సూర్యతేజస్సు సంక్రమించిన యగ్నివలె, విశేషముగా ప్రకాశించెనని భావము. సూర్యతేజస్సు రాత్రియం దగ్నిని ప్రవేశించునని శ్రుతిప్రమాణము గలదు.

శ్లో. దిలీపానంతరం రాజ్యే తం నిశమ్య ప్రతిష్ఠితం,
పూర్వం ప్రధూమితో రాజ్ఞాం హృదయేఽగ్ని రివోత్థితః. 2

వ్యాఖ్య: దిలీపానంతరం - దిలీపుని తరువాత, రాజ్యే - రాజ్యమునందు, ప్రతిష్ఠితం - నిలుప బడిన, తం - ఆ రఘువును, నిశమ్య - విని, పూర్వం - దిలీపుని కాలమునందు, రాజ్ఞాం - శత్రురాజులయొక్క, హృదయే మనస్సునందు, ప్రధూమితః - బాగా పొగలేచునట్లు చేయఁబడిన, అగ్నిః - సంతాపాగ్ని, ఉత్థితః ఇవ - మంటలురేగెనో యనునట్లుండెను. పూర్వము దిలీపుని ప్రతాపము వలననే శత్రురాజుల గుండెలలోనున్న సంతాపాగ్ని పొగలు లేచుచుండెను. ఇప్పుడా స్థాన

మున రఘువువచ్చుటచేత నా సంతాపము మంటలై మండెను. అనగా దిలీపుని కాల మందే భయముచేత కుమిలిపోవుచున్న శత్రువుల కిప్పు డధికతరతాపముగల్గి భయ పడు చుండిరని భావము.

శ్లో. పురుహూతధ్వజస్యేవ తస్యోన్నయనపంక్తయః
నవాభ్యుత్థానదర్శిన్యో ననందుః సప్రజాః ప్రజాః. 3

న్వాఖ్య : పురుహూతధ్వజస్య ఇవ - ఇంద్రధ్వజముయొక్క వలె, తస్య - ఆ రఘుమహారాజుయొక్క, నవాభ్యుత్థాన దర్శిన్యః - నూతనాభ్యుదయమును చూచు చున్నట్టియును, సప్రజాః - పుత్ర పుత్రీజనముతో గూడిన, ప్రజాః - జనులు, ఉన్నయనపంక్తయః - ఎత్తబడి విప్పారిన కనులవరుసలు గలవారై, ననందుః - చూచియానందించిరి. అచ్చటిజనులు పిల్లలను వెంటఁబెట్టుకొచి ప్రతిసంవత్సరము, వర్షములు పడుటకై జరుపబడునట్టి యింద్రధ్వజోత్సవము నందలి యెత్తైన ధ్వజ మును బారులుబారులుగా నెత్తఁబడిన కనులతో నెట్లు చూచుచుండిరో అట్లే రఘు మహారాజుయొక్క అభ్యున్నతిని తలలెత్తి చూచుచు నానందించిరని భావము. సువృష్టి కలుగుటకై రాజద్వారమునందు ఇంద్రధ్వజమును సమున్నతమైన దానినిగా స్థాపించి జాతరసేయు నాచారము మనదేశమున నుండెఘు.

శ్లో. సమ మేవ సమాక్రాంతం ద్వయం ద్విరదగామినా,
తేన సింహాసనం పిత్ర్య మఖిలం చారిమండలం 4

వ్యాఖ్య: ద్విరదగామినా - ఏనుగు నడకగల, తేన - ఆ రఘు మహారాజుచేత, పిత్ర్యం - తండ్రివలన లబ్ధమైన, సింహాసనం - సింహాసనము, అఖిలం అరిమండలం చ - సమస్తమైన శత్రురాష్ట్రమునను, ద్వయం - రెండును, సమమేవ - ఏకకాలమునందే, సమాక్రాంతం - అధిష్ఠింపఁబడినది. ఏనుగువంటి నడకయు, ఏనుగుల సైన్యమును గల రఘుమహారాజు పితృసింహాసనముపై నెక్కి గానే శత్రుపు లతని గజసైన్య యుద్ధమునకు భయపడి విధేయులై వర్తించుట కారంభించిరని భావము. "ద్విరదగామినా" ద్విరద ఇవగచ్ఛతీతి ద్విరదగామీ, అనియు, 'ద్విరదైః గచ్ఛతీతి ద్విరదగామీ' అనియు విగ్రహములు చెప్పవలెను.

శ్లో. ఛాయామండల లక్ష్యేణ త మదృశ్యా కిల స్వయం,
పద్మా పద్మాతపత్రేణ భేజే సామ్రాజ్యదీక్షితమ్. 5

వ్యాఖ్య: పద్మా - లక్ష్మీదేవి, **స్వయం** - తాను, ఆదృశ్యాకిల - కనబడని దగుచునే ఛాయామండలలక్ష్యేణ - కాంతిమండలముచేత నూహింపఁదగిన, పద్మా తపత్రేణ - కమలమనెడు గొడుగుచేత, సామ్రాజ్యదీక్షితం - మండలాధిపత్యము నందు దీక్షవహించిన, తం - ఆ రఘుమహారాజును, భేజే - సేవించెను. రఘువు సింహాసనమెక్కఁగానే యతని ముఖమున కొక గొప్పకాంతి కలిగెను. అది మండలాకారమున గోచరించుటచేత రాజ్యలక్ష్మి తానదృశ్యమయ్యును కమలాతపత్రముచేత సామ్రాజ్యదీక్షితుఁడైన యతనిని సేవించుచున్నట్లుగా నుండెనని భావము. సింహాసన మెక్కఁగానే రాజ్యలక్ష్మీ సాన్నిధ్య మతనికిఁ గలిగె ననునది పరమార్థము.

శ్లో. పరికల్పితసాన్నిధ్యా కాలేకాలే చ వందిషు,
స్తుత్యం స్తుతిభి రర్థ్యాభి రుపతస్థే సరస్వతీ. 6

వ్యాఖ్య: సరస్వతీ చ - సరస్వతియును, కాలేకాలే - ఆయా సమయములయందు, వందిషు - స్తుతిపాఠకులయందు, పరికల్పితసాన్నిధ్యా - కల్పించుకోఁబడిన సన్నిధానము కలదియై, స్తుత్యం - స్తుతించుటకర్హుడైన యతనిని, అర్థ్యాభిఃఅర్థవంతమునైన, స్తుతిభిః - స్తోత్రములచేత, ఉపతస్థే - పూజించెను. సరస్వతీ దేవికూడ ఆయా సమయములయందు స్తోత్రములు చేయు స్తుతిపాఠకులయందు ప్రవేశించినదియై అర్థవంతములైన స్తోత్రములతో నతనిని స్తుతించి పూజించెను. "నా విష్ణుః పృథివీపతిః" అనియు, "అష్టాభిర్లోకపాలానాం మాత్రాభిర్నిర్మితో నృపః" అనియున్న ప్రమాణవచనములవలన సరస్వతి రఘువును దేవతాబుద్ధిచేతను, విష్ణుభావముచేతను స్తుతించుట దోషముకాదని భావము.

శ్లో. మనుప్రభృతిభి ర్మాన్యై ర్భుక్తా యద్యపి రాజభిః,
తథాఽప్యనన్యపూర్వేవ తస్మి న్నాసీ ద్వసుంధరా. 7

వ్యాఖ్య: వసుంధరా - భూమి, మనుప్రభృతిభిః - మనువు మొదలగు, మాన్యైః రాజభిః - పూజ్యులైన రాజులచేత, భుక్తా యద్యపి - అనుభవింపఁబడినదే, తథాఅపి - అట్లయినను, తస్మిన్ - ఆ రఘుమహారాజు విషయమున, అనన్యపూర్వా ఇవ - పూర్వము తన నెవ్వఁడును అనుభవింపని దానివలె, ఆసీత్ - ప్రవర్తించెను. పూర్వము మను ప్రభృతులగువారిచేత ననుభవింపఁబడినదేయైనను భూదేవి, రఘుమహారాజును జేరి ప్రథమ భర్తయం దనురక్తురాలైన యువతివలె

వడచుకొనెను. అనగా పూర్వరాజుల పరిపాలనమునందుకంటె రఘు పరిపాలనము నందు భూమి సస్యశ్యామలకాగా, భూప్రజలు భక్తిసంతోషములు గలవారై యుండిరని భావము.

శ్లో. స హి సర్వస్య లోకస్య యుక్తదండతయా మనః
ఆదదే నాతిశీతోష్ణో నభస్వా నివ దాక్షిణాః. 8

వ్యాఖ్య: హి - ఏలయనగా, సః - అతఁడు, యుక్త దండతయా - అపరాధమునకు తగిన దండన చేయువాఁడగుటచేత, సర్వస్య, లోకస్య - సమస్త జనముయొక్క, మనః - మనస్సును, నాతి శీతోష్ణః - అంత యెక్కువచల్లదనము గాని, అంత యెక్కువవేడిగాని లేనట్టి, దాక్షిణాః - దక్షిణదిక్కునుండి వచ్చునది యగు, నభస్వాన్ ఇవ - గాలివలె (మలయమారుతము వలె), ఆదదే - ఆకర్షించెను. తీక్ష్ణదండముగాని మెత్తదనముగాని లేక యుక్తదండనము చేయునట్టి రఘు మహారాజు ప్రజల మనస్సును శీతోష్ణములు తగుమాత్రముగానున్న మలయ మారుతమువలె నాకర్షించెను. ప్రజలకు తీక్ష్ణదండముగల రాజుపై నేవగింపును, మృదుదండుడైనచో చులకదనమును కలుగును గనుక పాలకుఁడు యుక్త దండుడుగా నుండవలెనని కామందకనీతిసారము చెప్పుచున్నది.

శ్లో. మందోత్కంఠాః కృతాస్తేన గుణాధికతయా గురౌ,
ఫలేన సహకారస్య పుష్పోద్గమ ఇవ ప్రజాః. 9

వ్యాఖ్య: తేన - అతనిచేత, గుణాధికతయా - గుణములచే గొప్పవాఁడగుటచేత, ప్రజాః ప్రజలు, గురౌ - తండ్రియగు దిలీపునియెడల, సహకారస్య - తియ్యమామిడియొక్క, ఫలేన - పండుచేత, పుష్పోద్గమే ఇవ - పూత పట్టుటయందువలె, మందోత్కంఠాః - సన్నగిల్లిన యౌత్సుక్యము గలవారుగా, కృతాః - చేయఁబడిరి. తియ్యమామిడికి పరిమళవంతమైన పూతవచ్చినప్పుడు ప్రజలు సంతసింతురు. తరువాత కాయలు, పండ్లురాగానే పూతమీది ప్రేమ సన్నగిల్లును. అట్లే దిలీపునియందున్న భక్తి విశ్వాసములు ప్రజలకు రఘువు రాగానే సన్నగిల్లి యితనిమీదనే యెక్కువగా కలిగెనని భావము.

శ్లో. నయవిధి ర్నవే రాజ్ఞి సదస చ్చోపదర్శితమ్,
పూర్వ ఏవాభవ త్పుత్రస్మి న్నాభవ దుత్తరః. 10

వ్యాఖ్య: నయవిద్భిః - నీతిశాస్త్రవిదులగు మంత్రులచేత, నవే రాజ్ఞి - క్రొత్తగారాజైన రఘుమహారాజువిషయము, సత్ - ధర్మయుద్ధస్వరూపము, అసచ్చ-కూటయుద్ధ స్వరూపముకూడ, ఉపదర్శితం - తెలుపఁబడినది, తస్మిన్ - ఆ రఘువునందు, పూర్వ్యః పక్షః ఏవ - మొదటిదగు ధర్మయుద్ధాదికమే, అనభవత్ - నిలిచెను, ఉత్తరః - రెండవదియగు నధర్మకూట యుద్ధాదికము, నా భవత్ (న+అభవత్) - నిలువలేదు, రాజ్యపాలనమునం దనుభవము కలుగుటకై నీతికోవిదుల చేత రఘువున కువదేశింపఁబడిన ధర్మాధర్మ యుద్ధములలో, నతనియందు మొదటిదియగు ధర్మయుద్ధ నైపుణ్యమే నిలిచెనుగాని, రెండవది చెవికెక్కలేదు. సత్పక్షము నవలంబించెనేగాని యసత్పక్షము నవలంబింపలేదని భావము. రెండవది తెలివిడికి మాత్రమే.

శ్లో. పంచానా మపి భూతా నా ముత్కర్షం పుపుషు ర్గుణాఃా,
నవే తస్మిన్ మహీపాలే సర్వం నవ మివాభవత్. 11

వ్యాఖ్య: పంచానాం, అపి, భూతానాం - పృథివి మొదలయిన పంచ భూతములయొక్కగూడ, గుణాఃా - గంధాది గుణములు, ఉత్కర్షం - అతిశయమును, పుపుషుఃా - పొందినవి (పుష్టినొందినవి). తస్మిన్, నవే, మహీపాలేసతి - అతఁడు క్రొత్తరాజు కాగానే, సర్వం - సమస్తవస్తుజాతము, నవమివ - క్రొత్తదివలె, అభవత్ - అయినది. రఘుమహారాజు పాలకుఁడు కాగానే పంచభూతముల యొక్క గుణములకు అనగా భూమి, జలము, వాయువు మొదలయినవాని సహాయముతో పుట్టిన వస్తుజాత మంతటికిని క్రొత్తసోయగము క్రొత్తరుచి పెంపొంది, అనుభవించు ప్రజల కిదియేదో నూతన వస్తుజాతమన్న భావమును, ఆనందమును గలిగించెను. పూర్వమున్న వాటికే అపూర్వగుణములబ్బి శోభిల్లెనని భావము.

శ్లో. యథా ప్రహ్లోదనాచ్చంద్రః ప్రతాపా త్తపనో యథా,
తథై వ సోఽభూ దన్వర్థో రాజా ప్రకృతిరంజనాత్. 12

వ్యాఖ్య: యథా - ఏ విధముగా, చంద్రః - చంద్రుఁడు, ప్రహ్లోదనాత్ - చూచువారి నాహ్లాదపరచుటవలన, అన్వర్థః - సార్థకనామధేయుఁడయ్యెనో, యథా-ఏ విధముగానైతే, తపనః - సూర్యుఁడు, ప్రతాపాత్ - తపింపఁ జేయుటవలన, అన్వర్థః - సార్థకనామధేయుఁడయ్యెనో, తథైవ - అదేవిధముగా, సఃరాజా-అరఘు

మహారాజు, ప్రకృతి రంజనాత్ - ప్రజలను సంతోషపెట్టుటవలన, అన్వర్థః - సార్థక నామధేయుఁడు, అభూత్ - అయ్యెను. చంద్రుఁడు, తపనశబ్ద వాచ్యుఁడైన సూర్యుఁడును శబ్ద వ్యుత్పత్తికిఁగల యర్థముచేత అన్వర్థ నామధేయులైరో అట్లే రఘువు రాజశబ్ద వ్యుత్పత్తిచేత సార్థకనామధేయుఁడై యుండెను. "చంద్రయతి (ఆహ్లాదపరచువాడు) ఇతి చంద్రః" అనియు, "తపతి(తాపమును గలిగించు వాఁడు) ఇతి తపనః" అనియు, రంజయతి (ప్రజలను రంజింపఁ జేయువాఁడు) ఇతి రాజా" అనియు నీమూడు శబ్దములయొక్క వ్యుత్పత్త్యర్థములు.

శ్లో. కామం కర్ణాంతవిశ్రాంతే విశాలే తస్య లోచనే,
చక్షుష్మత్తా తు శాస్త్రేణ సూక్ష్మకార్యార్థదర్శినా. 13

వ్యాఖ్య: విశాలే - పెద్దవియైన, తస్యలోచనే - అతనియొక్క కన్నులు, కామం - ఎక్కువగా, కర్ణాంతవిశ్రాంతే - చెవులవరకు వ్యాపించినవి, చక్షుష్మత్తాతు - కనులుగలిగి యుండుటవలని ఫలముమాత్రము, సూక్ష్మకార్యార్థదర్శినా— సూక్ష్మ - ఊహ కందని, కార్యార్థ - చేయఁదగిన పనుల ప్రయోజనమును, దర్శినా - తెలుపునట్టి, శాస్త్రేణ - శాస్త్రముచేతనే. రఘుమహారాజు కన్నులు సువిశాల దీర్ఘములై యుండినవి. కాని, కార్యాకార్య విచారముల యందలి సూక్ష్మదర్శనము మాత్రము శాస్త్రముచేతనే చేయుచుండెను. వివేకవంతులైనవారికి శాస్త్ర దృష్టియే నిజమైన దృష్టియని భావము.

శ్లో. లబ్ధప్రశమనస్వస్థ మథైనం సముపస్థితా,
పార్థివశ్రీ ర్ద్వితీ యేవ శరత్ పంకజలక్షణా. 14

వ్యాఖ్య: అథ - తర్వాత, లబ్ధప్రశమన స్వస్థం — లబ్ధ - పొందఁబడిన రాజ్యముయొక్క, ప్రశమన - స్థిరీకరణముచేత, స్వస్థం - సమాహిత చిత్తుఁడయిన, ఏనం - ఈ రఘుమహారాజును, పంకజలక్షణా - కమలములు చిహ్నములుగా గల, శరత్ - శరదృతువు, ద్వితీయా - రెండవదియగు, పార్థివశ్రీః, ఇవ - రాజ్యలక్ష్మివలె, సముపస్థితా - చేరెను. పితృప్రాప్తమైన రాజ్యమునకు శత్రు నిర్మూలనాదుల చేత స్థైర్యమును జేకూర్చి హాయిగానున్న రఘుమహారాజును కమలాలయయగు లక్ష్మిచేరినట్లే కమలశోభగల శరత్తు రెండవ రాజ్యలక్ష్మిగాఁ జేరెను. అతఁడట్లు సుఖియైయుండగా శరదృతువు వచ్చెనని భావము. "లబ్ధప్రశమనం" అనునది రాజ

నీతి శాస్త్రమందు వాడబడిన ఒకవిశేష శబ్దము. దానినిట్లు నిర్వచించినారు, "రాజ్య స్యాచిర లబ్ధస్య శమనం పరిపంథినాం రంజన ప్రతీకారాభ్యాం లబ్ధప్రశమనం విదుః".

శ్లో. నిర్వ్యష్టలఘుభి ర్మేఘై ర్ముక్తవర్త్మా సుదుస్సహాః,
ప్రతాప స్తస్య భానోశ్చ యుగప ద్వ్యానశే దిశః. 15

వ్యాఖ్య: నిర్వ్యష్ట లఘుభిః - నిశ్శేషముగా వర్షించుటచేత తేలికపడిన, మేఘైఃః - మేఘములచేత, ముక్తవర్త్మా - విడువఁబడిన మార్గముగలది (అగుట చేతనే), సుదుస్సహాః - మిక్కిలి సహింపరానిదగు, తస్య - అతనియొక్కయు, భానోశ్చ - సూర్యునియొక్కయు, ప్రతాపః - పరాక్రమము, ఎండయును, యుగపత్ - ఏకకాలమునందే, దిశః - దిక్కులను, వ్యానశే - నిశేషముగా వ్యాపించెను. నిశ్శేషముగా వర్షించిన మేఘము లాకాశమార్గమునుండి తొలఁగిపోగానే సూర్యుని యెండయు, వర్షాకాలముపోయి మార్గములు నిష్పంకములు కాగానే రఘుమహారాజు ప్రతాపము, (అనగా సైన్యములు) అన్ని దిక్కులకును వ్యాపించెను. అనఁగా శరదృతువు రాజులకు విజయయాత్రాకాలము గనుక సూర్యాతపమువలె రఘుపరాక్రమము వ్యాపించెనని భావము.

శ్లో. వార్షికం సంజహా రేంద్రో ధనుర్జైత్రం రఘు ర్దధౌ,
ప్రజార్థసాధనే తౌ హి పర్యాయోద్యతకార్ముకౌ. 16

వ్యాఖ్య: ఇంద్రః - ఇంద్రుఁడు, వార్షికం - వర్షహేతువైన, ధనుః - ధనుస్సును, సంజహార - ఉపసంహరించెను, రఘుః - రఘుమహారాజు, జైత్రం - జయశీలమైన, ధనుః - ధనుస్సును, దధౌ - ధరించెను, హి - ఎందువలననగా, తౌ - వారిద్దఱును, ప్రజార్థసాధనే - ప్రజల ప్రయోజనములు నెరవేర్చుట యందు, పర్యాయోద్యత కార్ముకౌ - వరుస ననుసరించి యెత్తబడు ధనుస్సులు గలవారు. మొదట యింద్రుఁడు అన్నపానాదులుగూర్చు వర్షార్థమై ధనువు నెత్తగా పిమ్మట విజయసౌఖ్యాదులు కూర్చుటకై రఘువు ధనుస్సు నెత్తెను ఇద్దఱును ప్రజల శ్రేయస్సునకై యట్లు వరుసతప్పక ధనుర్ధరులగుదురని భావము.

శ్లో. పుండరీకాతపత్ర స్థం వికసత్కాశచామరః,
ఋతు ర్విడంబయామాస న పునః ప్రాప తచ్ఛ్రియమ్. 17

వ్యాఖ్య: పుండరీకాతపత్రః—పుండరీక - శ్వేత పద్మము, ఆతపత్రః - గొడుగుగాగలదియై, వికసత్కాశ చామరః - విరిసిన తెల్లుపూవులు చామరములుగా గలదియై, ఋతుః - శరదృతువు, తం - ఆ రఘుమహారాజును, విడంబయామాస - అనుకరించెను, తచ్ఛ్రియంపునః - అతని కాంతిని మాత్రము, న ప్రాప - పొందలేకపోయెను. రాజుకు శ్వేతచ్ఛత్రము, వింజామరలు చిహ్నములు. ఆ చిహ్నములను బోలిన తామరపువ్వులను, తెల్లుపూవులను ధరించి శరదృతువుసైతము రాజు వేషమును వేసెనుగాని యతని కాంతి విశేషమును మాత్రము పొందలేకపోయెనని భావము. శరత్తునందలి తెల్లదామరలు శ్వేతచ్ఛత్రములను, తెల్లుపూవులు తెల్లనివీచోపులను బోలి ఋతుశోభ నినుమడింపఁ జేయుచుండెనన్నది వర్ణనలోని పరమార్థము.

శ్లో. ప్రసాదసుముఖే తస్మిం శ్చంద్రే చ విశదప్రభే,
తదా చక్షుష్మతాం ప్రీతి రాసీత్ సమరసా ద్వయోః. 18

వ్యాఖ్య: ప్రసాదసుముఖే ప్రసన్న ముఖుఁడైన, తస్మిన్ - ఆ రఘు మహారాజు నందును, విశద ప్రభే - నిర్మల కాంతిగల, చంద్రే చ - చంద్రుని యందును, ద్వయోః - ఇద్దరియందును, తదా - అప్పుడు, చక్షుష్మతాం - కన్నులు గలవారియొక్క, ప్రీతిః - అనురాగము, సమరసా - సమానమైన ఆస్వాదము గలది, ఆసీత్ - అయ్యెను. వెన్నెలలు కురియుచున్న చంద్రునిని, ప్రసన్నముఖుఁడైన రఘువును చూచి ప్రజలు సమానమైన ప్రీతినిఁ బొందుచుండిరి. రఘువు అంత చల్లనివాఁడై ప్రజాపాలనము జేయుచుండెననియు, శరత్తుచంద్రునితో ప్రకాశించుచుండెననియు భావము.

శ్లో. హంసశ్రేణీషు తారాసు కుముద్వత్సు చ వారిషు,
విభూతయ స్తదీయానాం పర్యస్తా యశసా మివ. 19

వ్యాఖ్య: హంసశ్రేణీషు - అంచల బారులయందును, తారాసు - నక్షత్రములయందును, కుముద్వత్సు, వారిషు, చ - తెల్ల కలువలుగల జలములయందును,

తదీయానాం, యశసాం - ఆ రఘుమహారాజువియైన కీర్తులయొక్క, విభూతయః- సంపదలు, పర్యస్తాఃఇవ - వెదజల్లబడినవో యనునట్లుండెను. శరత్తునందు, తెల్లని యైన హంసాదులు విశేష ధావళ్యముగలవై కనబడుచున్నందున వానిపై రఘురాజు కీర్తి సంపదలు చల్లిరాయేమి యన్నట్లుండెను. కీర్తి తెల్లగానున్నట్లు వర్ణించుట కవి సమయము.

శ్లో. ఇక్షుచ్ఛాయనిషాదిన్య స్తస్య గోప్తు ర్గుణోదయం,
ఆకుమారకథోద్ఘాతం శాలిగోప్యో జగు ర్యశః. 20

వ్యాఖ్య: ఇక్షుచ్ఛాయ నిషాదిన్యః - చెఱకుతోటల నీడలలో గూర్చున్న, శాలిగోప్యః - వరిచేల కాపరులైన స్త్రీలు, గోప్తుః తస్య - రక్షకుడైన ఆ రఘు మహారాజుయొక్క, గుణోదయం - సద్గుణములవలన బుట్టినదియు, ఆ కుమారక దోద్ఘాతం - బాల్యకథలు మొదలుకొని యారంభింప బడినదియునగు, యశః - కీర్తిని, జగుః - గానముచేసిరి. వరిపంటచేలను కాయుటకువచ్చిన ముద్దరాండ్రు సమీపమున దట్టమైయున్న చెఱకుతోట నీడలందుగూర్చుని కాలక్షేపమునకై తమ యేలికయగు రఘుమహారాజుయొక్క బాల్యకథలు మొదలుకొని యున్న యశస్సును పాటలుకట్టి పాడుకొనుచుండిరి. శరచ్ఛ్యామలైన వరిచేలు, చెరుకుతోటలు, ముద్ద రాండ్ర గానముతో మిక్కిలి శోభించెనని భావము.

శ్లో. ప్రససా దోదయా దంభః కుంభయోనే ర్మహౌజసః,
రఘోః పరిభవాశంకి చుక్షుభే ద్విషతాం మనః. 21

వ్యాఖ్య: మహౌజసః - గొప్ప తేజస్సుగల, కుంభయోనేః - అగస్త్యుని యొక్క (అగస్త్య నక్షత్రముయొక్క), ఉదయాత్ - ఉదయమువలన, అంభః - ఒండునీరు, ప్రససాద - తేరెను, మహౌ జసః - గొప్ప పరాక్రమముగల, రఘోః - రఘు మహారాజుయొక్క, ఉదయాత్ - అభ్యుదయమువలన, పరిభవా శంకి - పరాభవము నూహించుచున్న, ద్విషతాం - శత్రువులయొక్క, మనః - మనస్సు, చుక్షుభే - కలతఁ జెందెను. అగస్త్య నక్షత్రోదయము కాగానే నదీ తటాకములయందలి జలముతేరుకొని నిర్మలమయ్యెననియు, శరదృతువు కావున మహా పరాక్రమ వంతుడైన రఘువు జైత్రయాత్రకు బయలుదేరునేమో యని

శత్రురాజుల మనస్సు భయముచేత కలఁకబాఁతెననియు భావము. అగస్త్యోదయము వలన నీరు నిర్మలమగునని శాస్త్రము.

శ్లో. మదోదగ్రాః కకుద్మంతః సరితాం కూలముద్రుజాః,
లీలాఖేల మనుప్రాపు ర్మహోక్షా స్తస్య విక్రమమ్. 22

వ్యాఖ్య: మదోదగ్రాః - పొగరెక్కినవియు, కకుద్మంతః - గొప్ప మూపురములు గలవియు, సరితాం - నదులయొక్క, కూల ముద్రుజాః - గట్టులను గోరాడునవియు నగుచు, మహోక్షాః - ఆఁబోతులు, లీలాఖేలం - విలాసక్రీడలుగల, తస్య, విక్రమం - ఆ రఘు మహారాజుయొక్క పరాక్రమమును, అనుప్రాపుః - అనుకరించినవి. ఉత్సాహవంతుడు, ఆజానుబాహువు, శత్రుభంజనుడుంనైన రఘుమహారాజు విక్రమ విలాసమును ఆఁబోతులు అనుకరించుచుఁ దెలిపినవట.

శ్లో. ప్రసవైః సప్తపర్ణానాం మదగంధిభి రాహతాః,
అసూయ యేవ తన్నాగాః సప్తధైవ ప్రసుస్రువుః. 23

వ్యాఖ్య: మదగంధిభిః - మదజలమువంటి పరిమళముగల, సప్తపర్ణానాం, ప్రసవైః - ఏడాకుల యరఁటిచెట్లయొక్క పువ్వులచేత, ఆహతాః - కొట్టబడిన, తన్నాగాః (తత్ + నాగాః) - ఆ రఘు మహారాజుయొక్క యేనుఁగులు, అసూయయేవ (అసూయయా + ఇవ) - పువ్వులయుత్కర్షయందలి అసహనము చేతవలె, సప్తధైవ - ఏడు ప్రకారములుగానే, ప్రసుస్రువుః - మదమును స్రవించినవి. తమ మదమువంటి వాసనగల యేడాకులయరఁటి పువ్వులు తాకగానే వానిని శత్రువులనుగా భావించిన రఘుమహారాజు గజములు తామును మదమును ఏడు ప్రదేశములనుండి స్రవించినవి. ఏనుఁగులకు తొండపు రెండు రంధ్రములనుండియు, రెండు గండస్థలముల నుండియు, పురుషాంగము నుండియు, రెండుకనులనుండియు మదము స్రవించునని శాస్త్రప్రసిద్ధి కలదు.

శ్లో. సరితః కుర్వతీ గాధాః పథ శ్చాశ్యానకర్దమాన్,
యాత్రాయై చోదయామాస తం శ క్రేః ప్రథమం శరత్. 24

వ్యాఖ్య: సరితః - నదులను, గాధాః - లోతులేని వానినిగా (సులభముగా దాటుటకు వీలైనవి), పథశ్చ - మార్గములనుగూడ, ఆశ్యానకర్దమాన్ - ఎండి

పోయిన బురద కలవానిగాను, కుర్వతీ - చేయుచున్నదియై, శరత్ - శరదృతువు, తం - ఆ రఘుమహారాజును, శక్తేః ప్రథమం - ఉత్సాహశక్తికంటె ముందుగా, యాత్రాయై - దిగ్విజయ యాత్రకొఱకు, చోదయామాస - ప్రేరేపించెను. నదులను దాటుటకు వీలుగను, మార్గములను బురద లేనివానిగను మార్చి, శరత్తు, ప్రభు మంత్రశక్తి సంపన్నుఁడైన యతని కుత్సాహశక్తిని జేకూర్చి విజయయాత్రకానుకూల్యమును గలిగించెను. పరిసరములుచూచిన యతని కుత్సాహము గలిగెనని భావము.

శ్లో. తస్మై సమ్యగ్హుతో వహ్ని ర్వాజినీరాజనా విధౌ,
ప్రదక్షిణార్చిర్వ్యాజేన హస్తే నేవ జయం దదౌ. 25

వ్యాఖ్య: వాజి నీరాజనా విధౌ - గుఱ్ఱములకు హారతినిచ్చు శాంతికర్మయందు, సమ్యగ్హుతః (సమ్యక్ + హుతః) - యథాశాస్త్రముగా హోమము చేయఁబడిన, వహ్నిః - అగ్ని, ప్రదక్షిణార్చి ర్వ్యాజేన—పదక్షిణ - ప్రదక్షిణముగాఁ దిరిగెడు, అర్చిః - జ్వాలయొక్క, వ్యాజేన - మిషచేత, హస్తేన ఇవ - చేతితోవలె, తస్మై - ఆ రఘువుకొఱకు, జయం - విజయమును, దదౌ - ఇచ్చెను. రఘుమహారాజు శరత్కాలమునందుఁ జేయవలసిన గజాశ్వాది నీరాజన కర్మయందు అగ్నికి హోమముచేయఁగా, ప్రదక్షిణముగాఁ దిరుగుచున్న జ్వాలలద్వారా అగ్ని రాబోవు విజయమును సూచించెనని భావము.

శ్లో. స గుప్తమూలప్రత్యంతః క్షుద్రపార్ష్ణి రయాన్వితః,
షడ్విధం బల మాదాయ ప్రతస్థే దిగ్జిగీషయా. 26

వ్యాఖ్య: గుప్తమూలప్రత్యంతః—గుప్త - రక్షింపఁబడిన, మూల - తన నివాస స్థానము, ప్రత్యంతః - ప్రాంత దుర్గమును గలవాఁడును, క్షుద్రపార్ష్ణిః - శత్రు నిర్మూలనముచేసి సైన్యముచేత కాపాడఁబడుచున్న పృష్ఠభాగము గలవాఁడును, అయాన్వితః - శుభావహమైన విధానమతోఁ గూడినవాఁడునునగు, సః - అతఁడు, షడ్విధం - ఆఱు విధములైన, బలం - సైన్యమును, ఆదాయ - వెంటఁ బెట్టుకొని, దిగ్జిగీషయా - దిక్కులను జయించు తలంపుచేత, ప్రతస్థే - బయలు

దేరెను. రఘుమహారాజు, తన రాజధానికిని, సమీపదుర్గమునకును, రక్షణ కల్పించి వెనుక భాగమునందు శత్రుభయము లేకుండఁజేసి, శుభప్రదములైన కర్మల నాచరించి, ఆఱు విధములైన దండును వెంటఁబెట్టుకొని, దిగ్విజయ యాత్రకు బయలు దేరెను. "మూలబలము, సుహృద్బలము, భృత్యబలము, శ్రేణీబలము, ద్విషద్బలము, ఆటవిక బలము" అనునవి షడ్విధబలములు.

శ్లో. అవాకిరన్ వయోవృద్ధా స్తం లాజైః పౌరయోషితః,
పృషతై ర్మందరోద్ధూతైః క్షీరోర్మయ ఇవాచ్యుతమ్. 27

వ్యాఖ్య: వయో వృద్ధాః - వయస్సుచేత పెద్దవారైన, పౌరయోషితః - పురస్త్రీలు, తం - ఆ రఘుమహారాజును, లాజైః - వరిపేలాలతో, క్షీరోర్మయః - క్షీర సముద్రమునందలి తరంగములు, మందరోద్ధూతైః - మందర పర్వతముచేత నెగురగొట్టబడిన, పృషతైః - పాలచుక్కలచేత, అచ్యుతం ఇవ - విష్ణుమూర్తిని వలె, అవాకిరన్ - చల్లిరి. రఘుమహారాజు విజయయాత్రకు బయలుదేరి వెళ్లుచుండగా పురమునందలి పెద్దముత్తైదువులు ఆయనమీద మంగళాచారము కొఱకై వరిపేలాలను చల్లిరి, అది మందర పర్వతముచేత చిలుకబడుచున్న క్షీరసాగర వీచికలు పాలతుంపురులను విష్ణుమూర్తిపైఁ జల్లినట్లు మనోహరముగా నుండెను.

శ్లో. స యయౌ ప్రథమం ప్రాచీం తుల్యః ప్రాచీనబర్హిషా,
అహితా ననిలోద్ధూతై స్తర్జయ న్నివ కేతుభిః 28

వ్యాఖ్య: ప్రాచీన బర్హిషా - ఇంద్రునితో, తుల్యః - సమానుఁడైన, సః - ఆతఁడు, అనిలోద్ధూతైః - అనుకూలవాయువుచే రెప రెప లాడింపఁబడుచున్న కేతుభిః - జెండాలచేత, అహితాన్ - శత్రువులను, తర్జయన్ ఇవ - బెదిరించుచున్నవాఁడువలె, ప్రథమం - మొఱట, ప్రాచీం - తూర్పు దిక్కును గుఱించి, యయౌ - వెళ్లెను. ఇంద్రతుల్యుఁడైన రఘువు ఇంద్రాధిపత్యముగల తూర్పు దిక్కునకు మొదట బయలుదేరెను. అనుకూల వాయువుచే రెప రెప లాడుచున్న సైన్యపతాకములు శత్రువులను బెదిరించుచున్నట్లుండెను. అనుకూల వాయువు ఈ శకునము.

శ్లో. రజోభిః స్యందనోద్ధూతైః గజైశ్చ ఘనసన్నిభైః
భువ స్తల మివ వ్యోమ కుర్వన్ వ్యోమేవ భూతలమ్. 29

వ్యాఖ్య : స్యందనోద్ధూతైః - రథములచేత రేపఁబడిన, రజోభిః - ధూళులచేతను. ఘనసన్నిభైః - మేఘములతో సమానములైన గజైశ్చ - ఏనుఁగులచేతను, వ్యోమ - ఆకాశమును, భువః తలం ఇవ - భూతలమును వలెను, భూతలం - నేలను, వ్యోమేవ(వ్యోమ + ఇవ) -ఆకాశమునువలెను, కుర్వన్ - చేయుచున్నవాఁడై, యయౌ - వెళ్లెను, రఘుమహారాజుసైన్యసమేతుఁడై వెళ్లుచుండగా రథములచేత రేపఁబడిన దుమ్ము దట్టముగా నలముకొనుటచేత ఆకాశము భూప్రదేశముగాను, నేలపై నడయాడు గజములు ప్రమాణమువందును వన్నెయందును మేఘములను బోలియుండుటచేత భూతలము అకాశముగాను కనఁబడుచుండెను.

శ్లో. ప్రతాపోఽగ్రే తతః శబ్దః పరాగ స్తదనంతరం
యయౌ పశ్చా ద్రథాదీతి చతుస్కంధేవ సా చమూః 30

వ్యాఖ్య: అగ్రే - ముందు, ప్రతాపః - తేజోవిశేషము, తతః - తరువాత శబ్దం - ధండు యొక్క కలకలము, తదనంతరం - దానితర్వాత, పరాగః - దుమ్ము, పశ్చాత్ - ఆతరువాత, రథాది - రథములు మొదలైన చతురంగబలము, ఇతి - ఈవిధముగా, సా చమూః - ఆ సైన్యము, చతుస్కంధా ఇవ - నాలుగు వ్యూహములుగలదివలె, యయౌ - వెళ్లెను. రఘు మహారాజు సేన నడుచుచుండగా, ముందు ఒకానొక తేజో విశేషము, దాని వెంట సేనా కలకలము, ఆతరువాత ధూళి, అటు పిమ్మట చతురంగబలము, అను వరుసతో నాలుగు వ్యూహములు కలదానివలెఁగనబడెను.

శ్లో. మరుపృష్ఠా న్యుదంభాంసి, నావ్యాః సుప్రతరా నదీః,
విపినాని పరిక్షాణి, శక్తిమత్వా చ్చకార సః 31

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, శక్తిమత్త్వాన్ - సమర్థుఁడగుటవలన, మరుపృష్ఠాని - ఎడారిప్రదేశములను, ఉదంభాసి - ఉబికిపై కివచ్చుచున్న జలములుగలవాటినిగాను, నావ్యాః - నౌకలతో దాటిపోఁదగిన, నదీః - నదులను, సుపరితరాః - సులభముగా దాటఁదగిన వాటినిగాను. విపినాని - ఆరణ్యములను, ప్రకాశాని - బట్టబయళ్లనుగాను, చకార - చేసెను, సైన్యసమేతుఁడై వెళ్లుచున్న యతఁడు పరియాణ సౌకర్యము కొఱకై ఎడారి భూములలో జలమును పుట్టించి, బల్లకట్లతో దాటవలసిన నదులకు సులభముగా దాటు నుపాయములు చేసి, అరణ్యములను

కొట్టించి బయళ్లుగా త్వరలో చేయించెను. లేదా ఆయాప్రదేశములను శక్తిసామర్థ్యములచేత సైన్యము సులభముగా దాటిపోవునట్లు చేసెనని భావము.

శ్లో. స సేనాం మహతీం కర్షన్ పూర్వసాగరగామినీం
బభౌ హరజటాభ్రష్టాం గంగా మివ భగీరథః 32

వ్యాఖ్య: పూర్వ సాగరగామినీం - తూర్పు సముద్రమునకు వెళ్లుచున్న, మహతీం, సేనాం - గొప్పసైన్యమును, కర్షన్ సః - వెంటఁగొని పోవుచున్న యతఁడు, హరజటాభ్రష్టాం - శివుసి జటాజూటమునుండి జారినదియు, పూర్వ సాగరగామినీం - తూర్పుసముద్రమునకు వెళ్లుచున్నధియునగు, గంగాం - గంగా నదిని, కర్షన్ - వెంటగొనిపోవుచున్న, భగీరథః ఇవ - భగీరథునివలె, బభౌ - ప్రకాశించెను. అడ్డంకులన్నింటిని అధిగమించి యేక ప్రవాహముగా తూర్పునకు నడచుచున్న సేనను వెంటబెట్టుకొని ముందుకు నడచుచున్న రఘుమహారాజు. శివ జటాజూటమునుండి బయలుదేరి తూర్పు సముద్రమునకు వెళ్లుచున్న గంగానదికి ముందునడచు భగీరథునివలె ప్రకాశించెను. భగీరథుని సంబంధమువలననే గంగకు భాగీరథి యను పేరుపచ్చినది. భగీరథుఁడు సగర చక్రవర్తి వంశమునందలి గొప్పరాజఋషి.

శ్లో. త్యాజితైః ఫల మున్ఖాతై ర్భగ్నైశ్చ బహుధా నృపైః
తస్యాసీ దుల్బణో మార్గః పాదపై రివ దంతినః 33

వ్యాఖ్య: ఫలం - లాభమును, త్యాజితైః - విడిపింపఁబడిన వారును, ఉన్ఖాతైః - అధికారమునుండి తొలగింపబడినవారును, బహుధా - అనేక విధములుగా, భగ్నైశ్చ - భంగపరుపఁబడిన వారునునగు, నృపైః - శత్రురాజులచేత, ఫలం - కాచిన కాపును, త్యాజితైః - వదలింప బడినవియు, ఉన్ఖాతైః - పెల్లగింపబడినవియు, భగ్నైశ్చ - విఱువఁబడినవియునగు, పాదపైః - వృక్షములచేత, దంతినః ఇవ - ఏనుగుయొక్కవలె, తస్య - ఆరఘుమహారాజుయొక్క, మార్గః - మార్గము, ఉల్బణః - స్పష్టమైనది. ఆసీత్ - అయ్యెను. ఒకయేనుఁగు వనమునందలి చెట్లయొక్క పూలు, కాయలురాల్చి, పెకలించి, కొమ్మలు విఱిచి ముందుకు వెళ్లిన దారివలె, కొందఱు రాజుల ధనములను గొని, కొందఱిని స్థానభ్రష్టులనుజేసి,

కొందఱిననేక విధములుగా నోడించుచు వెళ్లిన రఘుమహారాజు మార్గము అయన విజయములమ సృష్టముగా దెలుపుచుండెనని భావము.

శ్లో. పౌరస్త్యా నేవ మాక్రామం స్తాంస్తాన్ జనపదాన్ జయీ
పాశీప తాళీవనశ్యామ ముపకంఠం మహోదధేః 34

వ్యాఖ్య : జయీ - జయశీలుడై న రఘుమహారాజు, ఏవం - ఈప్రకారము పౌరస్త్యాన్ - తూర్పుననున్న, తాంస్తాన్ (తాన్ + తాన్) - ఆయా, జనపదాన్ - దేశములను, ఆక్రామన్ - ఆక్రమించుచు, తాళీవనశ్యామం - తాటితోపులతో శ్యామల వర్ణముగల, మహోదధేః - గొప్పసముద్రముయొక్క, ఉపకంఠం - సమీపమును, ప్రాప - చేరెను. ఈ విధముగా తూర్పు దిక్కునగల ఆ యాదేశములను జయించి, ఆక్రమించుచు, తాటిచెట్లు దట్టముగా గల సముద్రపు ఒడ్డును జేరెను. పౌరస్త్యాః (పౌరస్త్యులు) తూర్పున నున్నవారు; "పురః భవాః పౌరస్త్యాః" అని విగ్రహము. దాక్షిణాత్యాః (దాక్షిణాత్యులు) దక్షిణ దిశయందున్న వారు; "దక్షిణా భవాః దాక్షిణాత్యాః" పాశ్చాత్యాః (పాశ్చాత్యులు) పడమటనున్నవారు; "పశ్చాత్ భవాః పాశ్చాత్యాః" "దక్షిణాపశ్చాత్పురస స్త్యక్" అనుపాణిని సూత్రము చేత నీశబ్దములు సిద్ధించెను. ఇందలి "దక్షిణా" శబ్దముగూడ అవ్యయము.

శ్లో. అనమ్రాణాం సముద్ధర్తు స్తస్మాత్ సింధురయా దివ
ఆత్మా సంరక్షితః సుహ్మైః వృత్తి మాశ్రిత్య వైతసీమ్ 35

వ్యాఖ్య : అనమ్రాణాం - లొంగనివారిని, సముద్ధర్తుః - ఉన్మూలించువాడగు, తస్మాత్ - ఆ రఘు మహారాజువలన, సింధురయాత్ ఇవ - నదీవేగమునుండివలె, సుహ్మైః - సుహ్మదేశపు రాజులచేత, వైతసీం - ప్రబ్బలి చెట్లది యగు, వృత్తిం - ప్రవర్తనను, ఆశ్రిత్య - అవలంబించి, ఆత్మా - ప్రాణము, సంరక్షితః - కాపాడుకోబడినది. వంగక లొంగక యెదురు తిరుగువారిని నిర్మూలనము చేయుచు వచ్చుచున్న రఘుమహారాజు నుండి తప్పించు కొనుటకై సుహ్మదేశపురాజులు వైతసీవృత్తి నవలంబించి లొంగిపోయి తమ ప్రాణములు కాపాడుకొనిరి. (నదీవేగమునందు నిలుచున్న వృక్షములు నిర్మూలములగును, ప్రవాహానుకూలముగా వంగిపోవునట్టి ప్రబ్బలి చెట్లు నిర్మూలింపబడక, విఱుగక, ప్రవాహము

తగ్గగానే మరల లేచి నిలుచుండును. దానికి "వైతసీవృత్తి" అనిపేరు. సుహ్మ దేశపు రాజు లట్లు చేసిరి.

శ్లో. వంగా నుత్ఖాయ తరసా నేతా నౌసాధనోద్యతాన్
నిచఖాన జయస్తంభాన్ గంగాస్రోతోంతరేషు సః 86

వ్యాఖ్య: నేతా - సైన్యమును వెంటఁగొని పోవుచున్న ఆ రఘురాజు, నౌసాధనోద్యతాన్ - నౌకా సైన్యములతో నెదురించిన, వంగాన్ - వంగ దేశపు రాజులను, తరసా - బలముచేత, ఉత్ఖాయ - ఉన్మూలించి, గంగా స్రోతోంతరేషు గంగాస్రోతః - గంగా నది పాయలయొక్క, అంతరేషు - మధ్యభాగమునగల లంకలయందు, జయస్తంభాన్ - జయస్తంభములను, నిచఖాన - నాటెను. నాయకుఁడగు రఘుమహారాజు ఓడలపై నెక్కివచ్చి యెదుర్కొనిన వంగదేశపు రాజులను ఓడించి గంగానది లంకలలో తనజయస్తంభములు నాటించెను.

శ్లో. ఆపాదపద్మప్రణతాః కలమా ఇవ తే రఘుం
ఫలైః సంవర్ధయామాసు రుత్ఖాత ప్రతిరోపితాః 87

వ్యాఖ్య: ఆపాదపద్మప్రణతాః - ఆపాదపద్మ - పాదకమలము వఱకు, ప్రణతాః - వంగిననుస్కరించిన వారు (అగుటవలన), ఉత్ఖాతప్రతిరోపితాః - మొదట రాజ్యాధికారమునుండి తొలగింపఁబడి, మరల ప్రతిష్ఠింపబడినవారగు, తే - ఆ వంగ దేశపురాజులు, ఆపాదపద్మప్రణతాః - పాదములకువరకు వంగినవియై (నారుగా నున్నప్పుడు), ఉత్ఖాతప్రతిరోపితాః - ఊడబెఱికి మరల నాటఁబడిన కలమాః ఇవ - పరిపైరులవలె, రఘుం - రఘుమహారాజును, ఫలైః ధనముల చేత, (వరి పక్షమున ధాన్యములచేత), సంవర్ధయామాసుః - వృద్ధిని పొందించిరి. పాదాక్రాంతులగుటచేత, పదభ్రష్టులై మరల రాజ్యమునందు నిలుపబడిన వంగ రాజులు, ఊడదీసి మరల నాటఁబడిన వరిపైరు ధాన్యము నిచ్చునట్లు, రఘు మహా రాజుకు ధనములను కానుకలుగా నిచ్చి సంతోష పరచిరని భావము.

శ్లో. స తీర్త్వా కపిశాం సైన్యైర్బద్ధద్విరదసేతుభిః
ఉత్కలైర్దర్శితపథః కళింగాభిముఖో యయౌ. 88

వ్యాఖ్య: సః - అతఁడు, బద్ధద్విరదసేతుభిః—బద్ధ - కట్టఁబడిన, ద్విరద సేతుభిః - ఏనుగులవరుస యనెడు వంతెనలు గల, సైన్యైః - సైన్యములచేత,

కపిశాం - కపిశానదిని, తీర్త్వా - దాటి, ఉత్కలైః - ఓడ్రరాజులచేత, దర్శిత పథః - చూపఁబడిన మార్గముగల వాఁడగుచు, కళింగాభిముఖః - కళింగదేశాభిముఖుడై, యయౌ - వెళ్లెను, వంగదేశవిజయము తరువాత రఘుమహారాజు, ఏనుగులను వరుసగానిలిపి కట్టబడిన వంతెనలమీదుగా కపిశానదిని సైన్య సమేతముగా దాటి ఉత్కలాధిపులు చూపిన మార్గము ననుసరించి కళింగదేశముపైకి వెళ్లెను. ఉత్కళులు దారిని చూపిరనగా వారు రఘుమహారాజు అడుగు పెట్టగానే లొంగి మిత్రులైరని భావము.

శ్లో. స ప్రతాపం మహేంద్రస్య మూర్ధ్ని తీక్ష్ణం న్యవేశయత్
అంకుశం ద్విరదస్యేవ యంతా గంభీరవేదినః. 39

వ్యాఖ్య: సః- ఆ రఘుమహారాజు, మహేంద్రస్య - మహేంద్రపర్వతము యొక్క, మూర్ధ్ని - శిఖరమునందు, తీక్ష్ణం - సహింపశక్యముకాని, ప్రతాపం - పరాక్రమమును, యంతా - మావటివాఁడు, గంభీరవేదినః,ద్విరదస్య - గంభీరవేది యనఁబడు గజముయొక్క, మూర్ధ్ని -తలమీద, తీక్ష్ణం అంకుశంఇవ - మిక్కిలి పదునుగల అంకుశమును వలె, న్యవేశయత్ - ఉంచెను. కళింగదేశమును జేరిన రఘుమహారాజు అచ్చటి మహేంద్రపర్వతముపైన తన ప్రతాపమును, మావటివాఁడు గంభీరవేది యనఁబడు మదగజము తలపైన నంకుశమునువలె నిలిపెను. మహేంద్రము, సప్తకుల పర్వతములలో నొకటి; అవి "మహేంద్రము, మలయము, సహ్యపర్వతము, ఋక్షిమంతము, వృక్షపర్వతము, వింధ్యపర్వతము, పారియాత్రము" అనునవి. "గంభీరవేది" యనఁగా, చర్మమును చీల్చినను, రక్తము కాటినను, మాంసము ఊడిపడినను మదాతిరేకముచేత నెఱుఁగని గజము. తానెఱిఁగిన శిక్షనుసైతము మదముచే నాలస్యముగాఁ దెలిసికొను గజము "గంభీరవేది" యనఁబడునని మరియొక మతము.

శ్లో. ప్రతిజగ్రాహ కాళింగ స్తమస్త్రైర్గజసాధనః
పక్షచ్ఛేదోద్యతం శక్రం శిలావర్షీవ పర్వతః. 40

వ్యాఖ్య: గజసాధనః - గజసైన్యము ఎక్కువగానున్న, కాళింగః - కళింగదేశపురాజు, అస్త్రైః - ఆయుధములతో, తం - ఆ రఘుమహారాజును, పక్షచ్ఛేదోద్యతం — పక్షచ్ఛేద - పర్వతములయొక్క తెక్కలను నఱుకుటయందు,

ఉద్యతం - ఉద్యుక్తుఁడైన, శక్రం - ఇంద్రుని, శిలావర్షి - రాళ్లను వర్షించునట్టి, పర్వతః ఇవ - కొండవలె, ప్రతిజగ్రాహ - ఎదుర్కొనెను. తనకుఁగూడ గజ సైన్యమధికముగాఁ గలదను గర్వముతో కళింగరాజు, రాలవానతో నొక కొండ ఇంద్రుని దాకినట్లు, రఘుమహారాజును ఆయుధములతో నెదుర్కొనెను. ఈ యుప మానము పర్వత మింద్రునిచేతిలో నోడిపోయినట్లు కళింగరాజు రఘుమహారాజు చేతిలో నోడక తప్పదను విషయమును సూచించును.

శ్లో. ద్విషాం విషహ్యా కాకుస్థ స్తత్ర నారాచదుర్దినం
సన్మంగళస్నాత ఇవ ప్రతిపేదే జయశ్రియమ్. 41

వ్యాఖ్య: తత్ర - అచ్చట, కాకుస్థః - రఘుమహారాజు, ద్విషాం - శత్రువులయొక్క, నారాచదుర్దినం - బాణవర్షమును, విషహ్య - ఓర్చి, సన్మంగళ స్నాతః, ఇవ - శుభార్థమైన మంగళస్నానముఁ జేసినవాఁడువలె, జయశ్రియం - విజయలక్ష్మిని, ప్రతిపేదే - పొందెను. ఆ మహేంద్ర పర్వతముమీద కాళింగులు బాణవృష్టిని గురిపింపగా దానిని లీలగా శుభకర్మార్థమైన మంగళస్నానముగా భావించి, వారిని జయించి జయలక్ష్మినిఁ గొనెనని భావము. "దుర్దిన"మనగా నెడ తెగని వర్షము పడుచు మేఘావృతమైన ఆకాశముగల రోజు. ఇచ్చట లక్షణచేత "వర్ష"మను నర్థమునందు ప్రయోగింపఁబడినది. యత్తు సర్వౌషధిస్నానం తన్మం గళ ముదీరితం" అని యాదవ నిఘంటువు, శుభకర్మాంగముగా జేయుస్నాన జలమునందు అనేక ఓషధులను గలుపవలసి యుండును. ఆయుద్ధ మతని కంత తేలికగా నుండెనన్నది పరమార్థము.

శ్లో. తాంబూలీనాం దళై స్తత్ర రచితాపానభూమయః
నారికేళాసవం యోధాః శాత్రవం వ పపు ర్యశః. 42

వ్యాఖ్య: తత్ర - ఆ మహేంద్రపర్వతముమీద, యోధాః - యుద్ధభటులు, రచితాపాన భూమయః - తయారు చేసుకోబడినమద్యపాన ప్రదేశములుగలవారై, నారికేళాసవం - కొబ్బరికల్లును, తాంబూలీనాం - తమలపు తీగలయొక్క, దళైః - ఆకులతో, శాత్రవం - శత్రువులకు సంబంధించిన, యశోవ - కీర్తినిబోలె, పపుః - త్రాగిరి. ఆమహేంద్రపర్వతముపై విజయోత్సాహవంతులై నరఘుసైనికులు పానగోష్ఠి ప్రదేశముల నేర్పరచుకొని యచ్చట విరివిగా దొరకునట్టి నారికేళమద్యమును తమల

పాకు దొన్నెలతో త్రాగిరి. కల్లు తెల్లగా నుండును గనుక అది యుద్ధభటులు శత్రువుల కీర్తిని (కీర్తిగూడ తెల్లనిది) త్రాగివేసినట్లుండెనని తాత్పర్యము. ఇచ్చట "యశోవ" అను పదమునందల 'వ' కారము 'ఇవ' (వలె) అను నర్థమునందు ప్రయోగింపఁబడినది. "ఇవార్థే వ శబ్దో వా శబ్దోనా బోధ్యః" అని ప్రమాణ వచనము.

శ్లో. గృహీతప్రతిముక్తస్య స ధర్మవిజయీ నృపః
శ్రియం మహేంద్రనాథస్య జహార న తు మేదినీమ్. 43

వ్యాఖ్య: ధర్మవిజయీ - ధర్మముకొఱకే జయశీలుఁడైన, సః నృపః - ఆ రఘుమహారాజు, గృహీత ప్రతిముక్తస్య - పట్టుబడి మరల విడువఁబడిన. మహేంద్రనాథస్య - కళింగరాజుయొక్క, శ్రియం - చరాస్థిరూపమైన ధనాది సంపదను. జహార - తీసుకొనెను, మేదినీం తు - భూమినిమాత్రము. న జహార - అపహరించలేదు. జయశీలుఁడైన రఘువు తానుచేయనున్న ధర్మకార్యములకొరకై మహేంద్రనాథుని వస్తుసముదాయమును, ధనమును మాత్రము స్వీకరించి, శరణాగత వాత్సల్యముచేత నతని రాజ్యము నతనికే వదలిపెట్టెనని భావము.

శ్లో తతో వేలాతటేనైవ ఫలవత్పూగమాలినా
అగస్త్యచరితా మాశా మనాశాస్యజయో యయౌ. 44

వ్యాఖ్య: తతః - తూర్పుదిక్కు విజయమును సాధించినపిమ్మట, ఫలవత్పూగమాలినా—ఫలవత్ - బాగాపండిన, పూగ - పోకచెట్లయొక్క, మాలినా - వరుసలుగల, వేలాతటేన, ఏవ - సముద్రతీరము గుండానే, అగస్త్యచరితాం - అగస్త్యమునిచే దిరుగబడిన, ఆశాం - దిక్కును (దక్షిణ దిశను), అనాశాస్య జయః - కోరనక్కరలేని విజయముగల రఘుమహారాజు, యయౌ - చేరెను. ప్రాగ్దిశావిజయమును సాధించినపిమ్మట పోకవ్రాకుల బారులతో మనోహరమైయున్న సముద్రతీర మార్గముగుండానే రఘువు దక్షిణదిక్కును జేరెను. వింధ్యపర్వత గర్వనిర్వాపణము తరువాత అగస్త్యుఁడు దక్షిణభారతము నందలి యరణ్యమునసే యుండుటయు, అగస్త్య నక్షత్రము అకాశమునందలి దక్షిణ భాగమునందే యుండుటయు, దక్షిణదిక్కును "అగస్త్యచరితామాశాం" అని

కవి నిర్దేశించుటకుఁ గారణములు. ఈవిషయమును బ్రహ్మాండపురాణమిట్లు వివరించి నది "అగస్త్యో దక్షిణా మాశామాశ్రిత్య నభసి స్థితః। వరుణస్యాత్మజో యోగీ వింధ్య వాతాపి మర్దనః".

శ్లో. స సైన్యపరిభోగేన గజదానసుగంధినా
కావేరీం సరితాం పత్యుఃశంకనీయా మి వాకరోత్. 45

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, గజదాన సుగంధినా—గజదాన - ఏనుఁగుల మదజలముచేత, సుగంధినా -పరిమళముగలది యగు, సైన్య పరిభో గేన - సైనికులయొక్క అనుభవముచేత, కావేరీం - కావేరీనదిని, సరితాం, ప్రత్యుఃపత్యుః - నదులకు భర్తయగు సముద్రునికి, శంకనీయాం, ఇవ - అనుమానింపఁ దగిన దానినివలె, అకరోత్ - చేసెను. రఘుసైన్యగజములు, సైనికులు, తనలో మునుగుటచేత కావేరీజలము పరిమళవంతమైనది. అట్టి కావేరి సముద్రమును జేరి నపుడు అమె ఇతరపురుష సంభోగమును జేసెనా యేమి? యని సముద్రుఁడను మానపడునట్లు చేసెనని భావము. ఈశ్లోకమునందలి "గజదాన సుగంధినా" యను సమాసము పాణినీయ వ్యాకరణ విరుద్ధమైనను, "నిరంకుశాఃకవయఃకవయః" యను నభియుక్తోక్తి ప్రకారము గ్రాహ్యమని మల్లనాథసూరి యభిప్రాయము.

శ్లో. బలై రధ్యుషితా స్తస్య విజిగీషో ర్గతాధ్వనః
మరీచోద్భ్రాంతహారీతా మలయాద్రే రుపత్యకాఃమలయాద్రే రుపత్యకాఃమలయాద్రే రుపత్యకాఃమ

వ్యాఖ్య: అశ్వక్షుణ్ణానాం - గుఱ్ఱములచేత నలగద్రొక్కఁబడిన, ఏలానాం - ఏలకితీగలయొక్క, ఉత్పతిష్ణవః - పై కెగురునవియైన, ఫలరేణవః - కాయల ధూళులు, తుల్యగంధిషుః - సమానమైన పరిమళముగల, మత్తేభకపేషు - మదపు టేనుఁగులయొక్క గండస్థలముల యందు, ససంజుఃః - అంటుకొన్నవి. గుఱ్ఱముల త్రొక్కుడుచేత నలిగి పై కెగసిన యేలకికాయల పొడులు తమవంటి వాసనగల గజ గండస్థలములం దంటుకొన్నవి. అనగా తమవంటివే కనుక మై తిచేత నేలకి పొడుము లచ్చట చేరినవన్నది చమత్కారము.

శ్లో. భోగివేష్టనమార్గేషు చందనానాం సమర్పితం
నాస్రసత్ కరిణాం గ్రైవం త్రిపదీచ్ఛేదినా మపి 48

వ్యాఖ్య: చందనానాం - గంధపు చెట్లయొక్క, భోగివేష్టనమార్గేషు— భోగి - సర్పములయొక్క, వేష్టన - చుట్టుకొనుటచేత నేర్పడిన, మార్గేషు - నిమ్న ప్రదేశములయందు (నఱదలయందు), సమర్పితం - ఉంచబడినదై, త్రిపదీ చ్ఛేదినాం, అపి - కాలికట్లను త్రెంచుకొనునవియైనను, కరిణాం - ఏనుఁగుల యొక్క, గ్రైవం - మెడకట్టు, నాస్రసత్ - జూఱలేదు. నిరంతరము సర్పములు చుట్టుకొనుటచేత నరదలేర్పడిన శ్రీగంధపు చెట్లకు గజము మెడకట్లను తగిలించుట చేత ఏనుగులు కాలికట్లు త్రెంచుకున్నను కంఠబంధనలు మాత్రము జారిపోలే దనియు, గంధపు త్రాకులవద్దనే గజములు నిలిచియుండెననియు భావము. 'త్రిపదీ' యనఁగా ఏనుఁగు కాలిగొలుసు. గంధపుచెట్ల స్కంధములపై ఁగల సర్పవేష్టన చిహ్నములు, వానివద్ద నిలిచిన యేనుఁగులు మలయవర్వత శోభ నినుమడింపఁజేసె నన్నది చమత్కారము.

శ్లో. దిశి మందాయతే తేజో దక్షిణస్యాం రవే రపి
తస్యా మేవ రఘోఃపాండ్యాఃప్రతాపం న విషేహిరే. 49

వ్యాఖ్య: దక్షిణస్యాం దిశి - దక్షిణ దిక్కునందు, రవేః అపితేజః - సూర్యునియొక్క తేజస్సుకూడ, మందాయతే - తగ్గును, తస్యాం ఏవ దిశి - ఆ దిక్కునందే. పాండ్యాఃపాండ్యదేశరాజులు, రఘోఃప్రతాపం - రఘుమహా రాజుయొక్క పరాక్రమమును, న విషేహిరే - సహింపలేకపోయిరి. దక్షిణాయ నమునందు సూర్యునియెండ తక్కువగానుండును. అనగా దక్షిణ దిశయందు

సూర్యుఁడు సైతము పాండ్యరాజులకు వెఱచి మందతేజుఁడగుచున్నాఁడు. అట్టి దక్షిణదిశయందు విజయమునకై వచ్చిన రఘుమహారాజు తేజమును పాండ్యులు సహించలేకపోయిరి. సూర్యునిగూడ జయించిన పాండ్యులను జయింపఁగలుగుట రఘుమహారాజుయొక్క పరాక్రమమునకు ఉత్కర్ష.

శ్లో. తామ్రపర్ణిసమేతస్య ముక్తాసారం మహోదధేః
తే నిపత్య దదుస్తస్మై యశః స్వమివ సంచితమ్ 50

వ్యాఖ్య: తే - ఆపాండ్యరాజులు, తామ్రపర్ణిసమేతస్య - తామ్ర పర్ణినదితో గూడిన, మహోదధేః - మహాసముద్రము యొక్క, సంచితం - కూడ బెట్టబడిన ముక్తాసారం - శ్రేష్ఠమైన ముత్యమును, స్వం సంచితం యశః ఇవ - తమ దాచి యుంచబడిన కీర్తినివలె, తస్మై - ఆ రఘుమహారాజు కొఱకు, నిపత్య - నమస్కరించి, దదుః - ఇచ్చిరి. పాండ్యరాజులు రఘుమహారాజు కాళ్లపైఁబడి, తామ్రపర్ణీ సాగర సంగమ ప్రదేశమున తమకు లభించిన ఒక గొప్పముత్యమును (లేదా ముత్తెముల రాశిని), చిరసంచితమైన తమ యశస్సును వలె నతనికి సమర్పించిరి. ఆవిధముగా శరణు వేడిరని భావము, ముత్యములు, యశస్సును తెల్లనివి గనుక పోలిక చెప్పఁబడినది.

శ్లో. స నిర్విశ్య యథాకామం తటే ష్వాలీఢ చందనౌ
స్తనావివ దిశస్తస్యాః శైలౌ మలయదర్దురౌ. 51

అసహ్యవిక్రమః సహ్యాం దూరాన్ముక్త ముదన్వతా
నితంబ మివ మేదిన్యాః పర్యస్తాంశుక మలంఘయత్. 52

వ్యాఖ్య : అసహ్యవిక్రమః సః - సహింపరాని పరాక్రమముగల ఆ రఘు మహారాజు, తటేషు - చటియలమీద, ఆలీఢచందనౌ - వ్యాపించిన చందన వృక్షములుగలవియై, (స్తనముల పక్షమున గందపుఁబూతగల), తస్యాః దిశః - ఆ దక్షిణ దిశకు, స్తనౌ ఇవ - స్తనములవలెనున్న, మలయదర్దురౌ శైలౌ - మలయము, దర్దురము అను పేరుగల పర్వతములను, యథాకామం - ఇచ్ఛ వచ్చినట్లు విర్విశ్య - అనుభవించి, ఉదన్వతా - సముద్రునిచేత, దూరాన్ముక్తం (దూరాత్ + ముక్తం)-దూరముగా వదలబడినదియై, పర్యస్తాంశుకం - జాఱిన చీరగల, మేదిన్యాః

నితంబమివ - భూదేవి పిఱుదువలెనున్న, సహ్యం - సహ్య పర్వతమును, అలం షయత్ - దాపెను. సైన్యసమేతుఁడైన రఘుమహారాజు మలయ దర్దుర పర్వత ముల విడుదులను పూర్తి చేసికొని, సహ్యాద్రిని దాటి వెళ్లెననునది ముఖ్యాంశము. కాని చందన బహుళములైన మలయ దర్దురములు భూదేవి స్తనములుగా నుత్ప్రేక్షింపఁబడుట వలన వాటిని యథేచ్ఛగా అనుభవించి, సముద్రమునకు కొంచెము దూరముగా నున్న సహ్యాద్రి తెల్లనిచీరక్రిందికి జాఱిన భూదేవినితంబముగా నుత్ప్రేక్షింపఁబడుటచేత దానిని దాటి వెళ్లెననునది తాత్పర్యము. కాగా, భూభర్తయగు రఘువు, చందన చర్చిత స్తనద్వయము, స్రస్తాంశుకమైన నితంబమును గల భూదేవిని భోగించిచనె ననునది ఉత్ప్రేక్ష లబ్ధమైన వ్యంగ్యార్థము. ఇది రెండు శ్లోకములు కలిపి చెప్పిన వాక్యము. ఇట్టి ధానిని "కుళకం" అందురు.

శ్లో. తస్యానీకై ర్విసర్పద్భి రపరాంతజయోద్యతైః
రామాస్త్రోత్సారితో ప్యాసీత్ సహ్యాలగ్న ఇవార్ణవః. 53

వ్యాఖ్య: అపరాంతజయోద్యతైః అపరాంత - పశ్చిమదేశముల యొక్క జయోద్యతైః జయమునందు ఉద్యుక్తము లైనవియు, విసర్పద్భిః - ముందుకు నడుచుచున్నవి యునైన, తస్యఅనీకైః - అరఘుమహా రాజుయొక్క సైన్యముల చేత, అర్ణవః - సముద్రము, రామాస్త్రోత్సారితోపి. రామాస్త్ర - పరశురాముని బాణములచేత, ఉత్సారితః ఆపి-దూరముగా తొలగింవఁబడినదైనను, సహ్యాలగ్నః ఇవ - సహ్య పర్వతమునకంటుకొని యున్నదాని వలెనే, ఆసీత్ - ఉండెను (కన పడెను). పూర్వము సహ్యపర్వతము నంటుకొనియున్న సముద్రమును పరశు రాముఁడస్త్రములచేత దూరముగా నెట్టుటవలన సహ్యాద్రికిని సముద్రమునకును నడుమ బయలు ఏర్పడెను. ఇప్పుడు రఘు సైన్యములు సహ్యాద్రిని దిగి పశ్చిమాభిముఖములై వెళ్లుచుండగా బయలు ప్రదేశము నిండిపోయి మరల సముద్రము సహ్యాద్రినంటుకొని యున్నట్లుగానే కనబడుచుండెనని భావము. అపరాంతాః - పాశ్చాత్య దేశములు. "అపరాంతాస్తు పాశ్చాత్యాః" అని యాదవ నిఘుంటువు.

శ్లో. భయోత్సృష్టవిభూషాణాం తేన కేరళయోషితాం
అలకేషు చమూరేణు శ్ఛ్చూర్ణప్రతినిధీకృతః 54

వ్యాఖ్య: తేన - అరఘుమహారాజు చేత, భయోత్సృష్టవిభూషాణాం - భయముచేత తీసివేయఁబడిన సొమ్ములుగల, కేరళయోషితాం - కేరళ దేశ స్త్రీల

యొక్క, అలకేషు - ముంగురులయందు, చమూరేణుః - సైన్యధూళి, చూర్ణప్రతినిధీకృతః - చూర్ణ - కుంకుమాది చూర్ణములకు, ప్రతినిధీకృతః - బదులుగా జేయబడెను. రఘుసైన్యములు ప్రవేశింపగానే భయపడి, ఆభరణములు తీసివేసి పారిపోవుచున్న కేరళ దేశస్త్రీలముంగురులపై బడిన సైన్యధూళి వారికి కుంకుమాది చూర్ణముల శోభను గలిగించెను.

శ్లో. మురళా మారుతోద్ధూత మగమత్ కైతకం రజః
తద్యోధ వారవాణానా మయత్న పటవాసతామ్. 55

వ్యాఖ్య: మురళామారుతోద్ధూతం - మురళామారుత - ముర్ళానదిపై నుండివచ్చు గాలిచేత, ఉద్ధూతం - రేపబడినదియగు, కైతకం - మొగలి పూలకు సంబంధించిన, రజః - ధూళి, తద్యోధవారవాణానాం - తద్యోధ - ఆ రఘుమహారాజు యుద్ధభటులయొక్క, వారవాణానాం - కవచములకు, అయత్నపటవాసతాం - ప్రయత్నము లేకయే కలిగిన బుక్కాతనమును, అగమత్ - పొందెను. మురళానదిపై నుండి వచ్చుగాలిచే నెగిరిన:మొగలిపుప్పొడి ఆ రఘుసైనికుల కవచములపై బడి, అప్రయత్నముగా వారికి లభించిన బుక్కాపొడివలె నుండెను. చల్లదనము, మెల్లదనము, పరిమళమును గల వాయువులచేత సైనికుల శ్రమ తగ్గుచుండెనని భావము.

శ్లో. అభ్యభూయత హాహోనాం చరతాం గాత్రసంజితైః
వర్మభిః సవనోద్ధూత రాజతాళీ వనధ్వనిః. 56

వ్యాఖ్య: చరతాం - నడచుచున్న, వాహానాం - గుఱ్ఱములయొక్క, గాత్ర సంజితైః - శరీరములపై గట్టబడిన, వర్మభిః - కవచములచేత (కొయిరాలేకజీను అనబడువాని చేత), పవనోద్ధూత రాజతాళీవన ధ్వనిః—పవన - గాలిచేత, ఉద్ధూత - బాగా కదల్పబడిన, రాజతాళీవన - శ్రీతాళవృక్షవనమునొయొక్క, ధ్వనిః-శబ్దము, అభ్యభూయత - మరుగుపరుపబడెను. గుఱ్ఱపుసైన్యము నడచుచుండగా గుఱ్ఱములమీది జీనులచప్పుడు అధికముగా వినవచ్చుచు, తాటితోపుల మర్మరధ్వనిని మరగుపరచెను. అనగా రెండు ధ్వనులును ఒకమాదిరివే యగుటచేత గుఱ్ఱముల కవచధ్వనులలో అంతకంటే తక్కువస్థాయిలోనున్న తాళీవనధ్వని వినపడకపోయెనని భావము.

శ్లో. ఖర్జూరీ స్కంధ నద్ధానాం మదోద్గార సుగంధిషు
కచేషు కరిణాం పేతుః పున్నాగేభ్యః శిలీముఖాః. 57

వ్యాఖ్య: ఖర్జూరీ స్కంధ నద్ధానాం — ఖర్జూరీ - చిట్టీత చెట్లయొక్క, స్కంధ - బోదెలకు, నద్ధానాం - కట్టివేయఁబడిన, కరిణాం - ఏనుఁగులయొక్క, మదోద్గార సుగంధిషు—మదోద్గార - మదస్రావముచేత, సుగంధిషు - సువాసన గల, కచేషు - గండస్థలముమీది, శిలీముఖాః - తుమ్మెదలు, పున్నాగేభ్యః - పొన్నపూవులనుండి, పేతుః - వ్రాలినవి. దండు విడిసినప్పుడు ఏనుఁగులను చిట్టీత చెట్లకుఁగట్టివేయగా, సమీపమున పొన్నచెట్లపైనున్న తుమ్మెదలు పొన్న పూవులను విడిచి మదస్రావ సుగంధముగల గజ గండస్థలములపై వ్రాలెను. పొన్నలకంటె కరి గండస్థలములు ఎక్కువ పరిమళముగలవియై యుండుట కారణ మని భావము.

శ్లో. అవకాశం కిలోదన్వాన్ రామాయ యాభ్యర్థితో దదౌ
అపరాంత మహీపాల వ్యాజేన రఘువే కరమ్. 58

వ్యాఖ్య: ఉదన్వాన్ - సముద్రుఁడు, రామాయ - పరశురామునికి, అభ్య ర్థితః - యాచింపఁబడిన వాఁడై అవకాశం - నివసించుటకు చోటును. దదౌకిల - పూర్వమిచ్చియుండెనుగదా, రఘువేతు - రఘు మహారాజు కొఱకేమో, అపరాంత మహీపాల వ్యాజేన - పాశ్చాత్యరాజులను మిషతో, కరం - కప్పమునే, దదౌ - ఇచ్చెను. పూర్వము బ్రాహ్మణులు కోరగా భూమండలమును వదలిపెట్టుట కంగీక రించిన పరశురాముఁడు, తనకు నివసించుట కవకాశమునిమ్మని ప్రార్థింపఁగా సముద్రుఁ డంగీకరించి యిచ్చెను. ఇప్పుడు రఘుమహారాజు కోరకపోయినను పాశ్చాత్యప్రభువులను నెపమున తానే కప్పమునిచ్చెను. అపరాంత దేశములు సముద్ర మధ్యస్థములగుటచేత వారిచ్చిన కప్పములను సముద్రుఁడే యిచ్చినట్లు ఆరోపింపఁబడినది. ఈదానము భయముచేతగాని యాచనచేతగాదు, కనుక పరశు రామునికన్న రఘుమహారాజు గొప్పవాఁడని భావము.

శ్లో. మత్తేభ రదనోత్కీర్ణ వ్యక్త విక్రమ లక్షణం
త్రికూట మేవ తత్రోచ్చై ర్జయస్తంభం చకార సః. 59

వ్యాఖ్య: తత్ర - ఆ పడమటిదిక్కున, సః - ఆ రఘుమహారాజు, మత్తేభ రదనోత్కీర్ణ వ్యక్తవిక్రమ లక్షణం—మత్తేభరదన - మదవుటేనుఁగుల దంతములయొక్క, ఉత్కీర్ణ - గీరలనెడి, వ్యక్తవిక్రమ లక్షణం - స్పష్టముగాఁ గనపడునట్టి విక్రమ చిహ్నములుగల, త్రికూట మేవ - త్రికూట పర్వతమునే, ఉచ్చైః - ఉన్నతమైన, జయస్తంభం - విజయధ్వజమునుగా, చకార - చేసెను. అక్కడ రఘుసైన్య గజములు కోరాడుటచేత త్రికూటపర్వత సానువులపై స్పష్టమైన గీతలేర్పడెను. ఆ గీతలే విజయమును దెలుపు నక్షరములుగా భావింపఁ బడి, సమున్నతమైన త్రికూటపర్వతమునే తన దిగ్విజయ స్తంభమునుగా జేసెనని భావము. 'ఉత్కీర్ణ' శబ్దము చెక్కబడిన యక్షరములను సూచించును.

శ్లో. పారసీకాం స్తతో జేతుం ప్రతస్థే స్థలవర్త్మనా
ఇంద్రియాఖ్యా నివ రిపూం స్తత్త్వజ్ఞానేన సంయమీ. 60

వ్యాఖ్య: తతః - అటుతర్వాత, సః - ఆ రఘుమహారాజు, సంయమీ - యోగి, తత్త్వజ్ఞానేన - ఆత్మజ్ఞానముచేత, ఇంద్రియాఖ్యాన్ - ఇంద్రియములను పేరుగల, రిపూన్ ఇవ - శత్రువులనువలె, స్థలవర్త్మనా - భూమార్గముద్వారా, పారసీకాన్ - పారసీక దేశపురాజులను, జేతుం- గెలుచుటకు, ప్రతస్థే - ప్రయాణము చేసెను. యోగీశ్వరుఁడు తత్త్వజ్ఞానముచేత అంతశ్శత్రువులైన యింద్రియములను జయించినట్లు, సంపూర్ణముగా జయించుటకై పారసీకులపైకి వెళ్లెను. సముద్రయానము నిషిద్ధమగుటచేత జలమార్గము దగ్గరిదైనను స్థలమార్గమునందే ప్రయాణము చేసెను.

శ్లో. యవనీ ముఖ పద్మానాం సేహే మధుమదం నసః
బాలాతప మివాబ్జానా మకాలజలదోదయః. 61

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, యవనీముఖ పద్మానాం—యవనీ - యవనస్త్రీలయొక్క, ముఖపద్మానాం - కమలములవంటి ముఖములయొక్క, మధుమదం - మద్యముచేత గలుగు మదరాగమును, అకాల జలదోదయః - వర్షాకాలము కాని సమయమునందలి, మేఘోదయము, అబ్జానాం - తామర పువ్వులకు సంబంధించిన, బాలాతపం ఇవ - లేత యెండనువలె, నసేహే - సహింపకపోయెను, అకాలమునవచ్చిన మేఘము కమలవికాసమును గలిగించు లేతయెండను దొల

గించునట్లు, రఘు మహారాజు యవనస్త్రీల ముఖములపై గలుగు మధుమదమును సహింపలేకపోయెను. అనగా రఘువు యవనవీరులను యుద్ధమున కాహ్వానించుట చేత యవనస్త్రీలకు భర్తలతోగలిసి చేయునట్టి మధుపానము, తన్మూలకమైన ముఖమునందలి మదవిలాసము లేకపోయెనని భావము. వరాకాలమునందు కమల వికాసమునకే యవకాశలేదుకనుక "అకాల జలదోదయః" అనిచెప్పెను. దీనివలన యవనులకు గలిగిన హతాద్వియోగము సూచితము.

శ్లో. సంగ్రామ స్తుములస్తస్య పాశ్చాత్యై రశ్వసాధనైః
శార్ఙ్గకూజిత విజ్ఞేయ ప్రతియోధే రజస్యభూత్. 62

వ్యాఖ్య: తస్య - ఆ రఘుమహారాజునకు, అశ్వసాధనైః - గుఱ్ఱములు ముఖ్యసాధనములుగాగల, పాశ్చాత్యైః - పడమటివారైన యవనులతో, శార్ఙ్గ కూజిత విజ్ఞేయ ప్రతియోధే—శార్ఙ్గకూజిత - ధనుష్టంకారములచేత (లేదా ఊద బడుచున్న కొమ్ములధ్వనితో), విజ్ఞేయ - తెలిసికోదగిన, ప్రతియోధే - శత్రు భటులుగల, రజసి - ధూళియందు, తుములఃసంగ్రామః - సంకులయుద్ధము, అభూత్ - జరిగెను. పారసీకులకు గుఱ్ఱపుదండు ముఖ్యసాధనము కనుక దానితో వారు రఘుమహారాజు సైన్యము నెదుర్కొనగా విశేషమైన దుమ్ము రేగెను. ఆ ధూళి లో ఎవరు తమవారో ఎవరు పగవారో తెలియకుండుటచేత ధనుష్టంకారమువల్లను. కొమ్ముబాకాల ధ్వనులచేతను గుర్తించుచు యుద్ధముచేసిరి. ఆ విధముగా నచ్చట దొమ్మియుద్ధము జరిగెను. శృంగముచేత చేయబడినది శార్ఙ్గము - ధనుస్సు. శృంగమునకు సంబంధించిన ధ్వనియు శార్ఙ్గమే.

శ్లో. భల్లాపవర్జితై స్తేషాం శిరోభిః శ్మశ్రులై ర్మహీం
తస్తార సరఘూవ్యాప్తైః సక్షౌద్రపటలై రివ. 63

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, భల్లాపవర్జితైః - బల్లెములచేత తొలగింపబడినవియు, శ్మశ్రులైః - పెరిగిన గడ్డములును, మీసములును గలవియునగు, తేషాంశిరోభిః - ఆ యవనులయొక్క తలలతో, సరఘూవ్యాప్తైః - తేనెటీగల చేత వ్యాపించిన, క్షౌద్రపటలైఃఇవ - తేనెపట్టులచేతవలె (తేనెతెట్టెలచేత). మహీం - నేలను, తస్తార - కప్పివేసెను. గడ్డములు, మీసములు పెరిగియున్న

పారసీక సైనికుల తలలను బల్లెములతో తొలగించి నేలపై బడవేయగా, అవి తేనెటీగలతో చుట్టుకోబడిన తేనెపట్టులుగా నుండినవి. అట్టి యసంఖ్యాకములైన శిరస్సులతో రఘుమహారాజు నేలను కప్పివేసెను. నేలయంతయు శ్మశ్రులములగు తలకాయలతో పరువబడి యుండెనని భావము.

శ్లో. అపనీతశిరస్త్రాణాః శేషా స్తం శరణం యయుః ;
ప్రణిపాతప్రతీకారః సంరంభో హి మహాత్మనామ్. 64

వ్యాఖ్య: శేషాః - చావక మిగిలిన పారసీకులు, అపనీత శిరస్త్రాణాః - తీసివేయబడిన శిరస్త్రాణములు (బొమిడికలు) గలవారగుచు, తం - ఆ రఘుమహారాజును, శరణంయయుః - శరణుజొచ్చిరి, హి - అదియుక్తమే, మహాత్మనాం - గొప్పవారియొక్క, సంరంభః - కలత (ఉద్రేకము), ప్రణిపాత ప్రతీకారః— ప్రణిపాత - నమస్కారమే (కాళ్లపైబడుటయే), ప్రతీకారః - ప్రతిక్రియగాగలది. హతశేషులైన పారసీకులు తమ తలలపైనుండిన శిరస్త్రాణములను దీసి రఘుమహారాజు పాదములపైబడి శరణువేడిరి. మహాత్ములకు పరుల యొద్ధత్యమే కిట్టదుగాని వారి ప్రాణములు కావు కనుక, రఘుమహారాజు సంరంభమును తగ్గించుటకై వారట్లుచేసిరి. యుద్ధమునందు శిరస్త్రాణములుదీయుట శరణాగత లక్షణము. రఘువు శాంతించెనని భావము.

శ్లో. వినయంతేస్మ తద్యోధా మధుభి ర్విజయశ్రమం
ఆస్తీర్ణాజినరత్నాసు ద్రాక్షావలయభూమిషు. 65

వ్యాఖ్య: తద్యోధాః - ఆ రఘుమహారాజుయొక్క భటులు, ఆస్తీర్ణాజినరత్నాసు—ఆస్తీర్ణ - పరువబడిన. అజినరత్నాసు - శ్రేష్ఠములైన చర్మములుగల, ద్రాక్షావలయభూమిషు - ద్రాక్షపొదలక్రింది నేలలమీద, మధుభిః - మద్యములచేత, విజయశ్రమం - విజయమువలన గలిగిన యలసటను, వినయంతేస్మ - తొలగించుకొనిరి. పారసీక విజయానంతరము రఘురాజ భటులు ద్రాక్షపొదలక్రింది నేలలపై మంచి చర్మములు పరచుకొని, యచ్చట కూర్చుని, మంచి మద్యములు త్రాగుచు, తమ యుద్ధవిజయశ్రమను పోగొట్టుకొనిరి. "వినయంతే" అను పర్తమాన క్రియకు 'స్మ' అనుదానిని చేర్చినందున అది భూతకాలికమైన అర్థమును దెలుపును.

శ్లో. తతః ప్రతస్థే కౌబేరీం భాస్వానివ రఘుర్దిశం
శరైరుసైరివోదీచ్యా నుద్ధరిష్యన్ రసానివ. 66

వ్యాఖ్య: తతః - తర్వాత, రఘుః - రఘుమహారాజు, భాస్వానివ - సూర్యుడువలె, శరైః - బాణములచేత, ఉసైరివ (ఉసైఃఇవ) - కిరణములచేతవలె, ఉదీచ్యాన్ - ఉత్తరప్రాంత రాజులను, రసానివ - ఉదకములనువలె, ఉద్ధరిష్యన్ - నిర్మూలము చేయగలవాడగుచు, పీల్చివేయగలవాడగుచు, కౌబేరీం - కుబేరునికి సంబంధించిన, దిశం - దిక్కును (ఉత్తర దిక్కును గుఱించి), ప్రతస్థే - తరలెను. ఉత్తరాయణమునందు సూర్యుడు వివిధముగా తన కిరణములచేత నుదకములను పీల్చివేయునో అట్లు ఉదీచ్యులగు రాజులను తన బాణములచేతనిర్మూలింపగలవాడై ఉత్తర దిక్కునకు రఘుమహారాజు పయనించెను. "కుబేరస్య ఇయం కౌబేరీ" కుబేరుడు దిక్పాలకుం డగుటచేత నుత్తర దిక్కునకు "కౌబేరి" అన్నపేరు వచ్చినది. "ఉదక్ భవాః" ఉదీచ్యాః - ఉత్తర దిక్కున నున్నవారు.

శ్లో. వినీతాధ్వశ్రమా స్తస్య సింధుతీర వివేష్టనైః
దుధువు ర్వాజినః స్కంధాన్ లగ్నకుంకుమకేసరాన్. 67

వ్యాఖ్య: సింధుతీరవివేష్టనైః—సింధుతీర - సింధునదమునొక్క ఒడ్డుల మీద, వివేష్టనైః - పొరలుటలచేత, వినీతాధ్వశ్రమాః - తొలగించుకోబడిన మార్గాయాసముగల, తస్యవాజినః - ఆ రఘుమహారాజుయొక్క గుఱ్ఱములు, లగ్నకుంకుమకేసరాన్ — లగ్న - తమ కంటుకొన్న, కుంకుమకేసరాన్ - కుంకుమపూలయొక్క కింజల్కములుగల, స్కంధాన్ - జూలుతోనున్న బుజములను (కందములను) దుధువుః - దులుపుకొన్నవి. కాశ్మీరదేశమునందలి సింధునదమునొక్క గట్టులమీద ఇటునటు దొరలి మార్గాయాసమును దీర్చుకొన్న రఘుమహారాజు గుఱ్ఱములు, అక్కడ తమ జూలువెండ్రుకలకును, శరీరములకును అంటుకొన్న కుంకుమపూల కింజల్కములను లేచి నిల్చుని బాగా దులుపుకొన్నవి. కాశ్మీరదేశమునందలి కాశ్మీర బాహుళ్యమును ఈ వర్ణనము సూచించును.

శ్లో. తత్ర హూణావరోధానాం భర్తృషు వ్యక్తవిక్రమం
కపోలపాటలాదేశి బభూవ రఘుచేష్టితమ్. 68

వ్యాఖ్య: తత్ర - ఆ యుత్తర దేశమునందు, భర్తృషు - తమ భర్తల విషయమున, వ్యక్తవిక్రమం - స్పష్టమైన పరాక్రమముగలది యగు, రఘు చేష్టితం - రఘువుయొక్క వ్యాపారము, హూణావరోధానాం—హూణ - హూణ దేశపు రాజులయొక్క, అవరోధానాం - అంతఃపుర స్త్రీలకు, కపోల పాటలాదేశి - చెక్కిళ్లపై నెఱ్ఱదనమును నేర్పునది, బభూవ - అయ్యెను. హూణరాజుల వధచేత వ్యక్తమైన రఘుమహారాజు పరాక్రమము వారి భార్యలకు చెక్కిళ్లపై పాటల వర్ణము నుపదేశించినది. అనగా మృతులైన భర్తలకొఱకై యేడ్చుచు మొగమును బాదుకొన్నవారి కపోలములమీద నెఱ్ఱదనము కలిగెననియు, అది రంజకద్రవ్యము లేకయే కలిగినదనియు భావము. పరాక్రమ మెట్టనిది కనుక అట్లు సర్వత్ర వ్యాపించగలిగినది.

శ్లో. కాంభోజాః సమరే సోఢుం తస్య వీర్య మనీశ్వరాః
గజాలాన పరిక్లిష్టై రంకోలై ః సార్థ మానతాః. 69

వ్యాఖ్య: కాంభోజాః - కంబోజదేశపు రాజులు, సమరే - యుద్ధములో, తస్య - అతనియొక్క, వీర్యం - పరాక్రమమును, సోఢుం - సహించుటకు, అనీశ్వరాః - శక్తిలేనివారగుచు, గజాలాన పరిక్లిష్టైః—గజాలాన - ఏనుగుల కాలి కట్లచేత, పరిక్లిష్టైః - రాచుకోఁబడిన, అంకోలైః సార్థం - ఊడుగుచెట్లతోగూడ, ఆనతాః - వంగిపోయిరి. కంబోజదేశపు రాజులు యుద్ధమునందు రఘుమహారాజు పరాక్రమమునకు తట్టుకొనఁజాలనివారై, సైన్యగజములని కాలిగొలుసుల రాపిడికిని ఈడ్పునకును అచ్చటి యూడుగచెట్లు వంగిపోయినట్లే తామును లొంగిపోయిరి.

శ్లో. తేషాం సదశ్వభూయిష్ఠా స్తుంగద్రవిణ రాశయః
ఉపదా వివిశుః శశ్వ న్నోత్సేకాః కోసలేశ్వరమ్. 70

వ్యాఖ్య: తేషాం - ఆ కాంబోజరాజులయొక్క, సదశ్వ భూయిష్ఠాః - మంచి గుఱ్ఱములచేత నధికములైన, తుంగద్రవిణరాశయః - ఎత్తైన ధనరాసుల రూపమునన్నున్న, ఉపదాః - కానుకలు, శశ్వత్ - మాటిమాటికిని (అడుగడుగున), కోసలేశ్వరం - రఘుమహారాజును, వివిశుః - చేరినవి, ఉత్సేకాః - గర్వములు మాత్రము, నవివిశుః - చేరలేదు. మంచిమంచి గుఱ్ఱము లెక్కువగానున్న గొప్ప

ధనరాసులను ఆ కాంబోజరాజులు రఘుమహారాజుకు కానుకలుగా ననేక పర్యాయములుగా నిచ్చిరి. అన్ని కానుకలు లభించినను రఘువు గర్వపడలేదు.

శ్లో. తతో గౌరీగురుం శైల మారురో హాశ్వసాధనః
వర్ధయ న్నివ తత్కూటా నుద్ధూతై ర్ధాతురేణుభిః 71

వ్యాఖ్య : తతః - తర్వాత, అశ్వసాధనః - గుఱ్ఱములను సాధనముగాఁ జేసి కొన్న రఘుమహారాజు, గౌరీగురుం - పార్వతికి తండ్రియగు, శైలం - పర్వతమును (హిమమత్పర్వతమును), ఉద్ధూతైః - గుఱ్ఱముల గిట్టలచే రేపఁబడిన ధాతురేణుభిః - గైరికాది ధాతువుల యొక్క ధూళులచేత, తత్కూటాన్ - ఆహిమాలయము యొక్క శిఖరములను, వర్ధయన్ ఇవ - వృద్ధిని పొందించుచున్న వాఁడువలె, ఆరురోహ - ఎక్కెను. అంతవఱకు గజసాధనుఁడై వెళ్లిన రఘుమహారాజు, అప్పుడు కాంబోజులిచ్చిన గుఱ్ఱముల నుపయోగించుకొని (అవి పర్వతము లెక్కఁజాలవను గనుక) హిమాలయముపైకిఁ దరలెను. అట్లు వెళ్లుచున్నప్పుడు గుఱ్ఱముల గొరిజల తొక్కిడిచే రేగిన ఆయాధాతువుల ధూళి పైకెగసి హిమవత్పర్వత శిఖరములను పెంచుచున్నట్లు కనబడెను.

శ్లో. శశంస తుల్యసత్త్వానాం సైన్యఘో షేప్యసంభ్రమం
గుహాశయనాం సింహానాం పరివృ త్యావలోకనమ్. 72

వ్యాఖ్య : తుల్యసత్త్వానాం - సైన్యములతో సహనమగు బలముగలవియై, గుహాశయానాం - గుహలయందు పరుండియున్న, సింహానాం - సింహముల యొక్క, (సింహములు) పరివృత్య - మెడలను వెనుకకు (తిప్పి) అవలోకనం-చూచుట, సైన్యఘోషే, అపి - సేనయొక్క కలకలమునందుఁగూడ, అసంభ్రమం - మనస్సు చెదరకుండుటను, శశంస - చెప్పెను. రఘు సైన్యములు మహాకోలాహలముతో హిమగిరి నెక్కుచున్నప్పుడు ప్రక్కన గుహలలో పరుండియున్న సింహములు లేచిపోక పడుకొనియే మెడలు మాత్రము త్రిప్పిచూచినవి. ఆ చూపు వాటి ధైర్యమును, సైనికులను లెక్క చేయకపోవుటను చెప్పకయే చెప్పినది.

శ్లో. భూర్జేషు మర్మరీభూతాః కీచక ధ్వని హేతవః
గంగాశీకరిణోమార్గే మరుత స్తం సిషేవిరే. 78

వ్యాఖ్య: భూర్జేషు - భుజపత్ర వృక్షముల మీద, మర్మరీభూతాః - ఎండుటాకుల చప్పుడుగా మారినవియై, కీచకధ్వనిహేతవః - కీచక - రంధ్రములు గల వెదుళ్లయొక్క, ధ్వని - నాదములకు, హేతవః - కారణములై, గంగాశీకరిణః - గంగానదియొక్క నీటి తుంపరులుగలవియగు, మరుతః - వాయువులు, మార్గే - దారిలో, తం - ఆ రఘు మహారాజును, సిషేవిరే - సేవించినవి. రఘువుహిమగిరి నెక్కుచున్నప్పుడు, వాయువులు భుజపత్ర వృక్షముల అకుల యందు మర్మర ధ్వనిని, వెదుళ్లయందు మధుర నాదములను బుట్టించుచు, గంగాజల శీకరయుక్తములై యతనిని సేవించినవి. అనగా మెల్లని చల్లని మందమారుతములు రఘురాజునకు సేదదీర్చిన వని భావము. వాయువర్ణనము, శైత్యసౌరభ్య మాంద్య యుతముగా నుండవలెనని కవిసమయము.

శ్లో. విశ్రమ్య తత్రామేరూణాం ఛాయా స్వధ్యాస్య సైనికాః
దృషదో వాసితోత్సంగా నిషణ్ణ మృగనాభిభిః 74

వ్యాఖ్య: సైనికాః - భటులు, అమేరూణాం - సురపొన్న చెట్లయొక్క, ఛాయాసు - నీడలయందు, నిషణ్ణమృగనాభిభిః నిషణ్ణ - అంతకుముందే పడుకొని లేచి పోయిన, మృగ - కస్తూరి మృగములయొక్క, నాభిభిః - కస్తూరులచేత, వాసితోత్సంగాః - పరిమళింపఁజేయఁబడిన ఉపరితలములుగల, దృషదః - బండలను, అధ్యాస్య - అధిష్ఠించి, విశ్రమ్య - విశ్రమించిరి. రఘుమహారాజు సైనికులు, సురపొన్న చెట్లనీడలలో, అంతకుముందు పడుకొని లేచిపోయిన కస్తూరి మృగములచే పరిమళింపఁజేయఁబడిన బండలమీదఁ గూర్చుని, యలసటను బాపుకొనిరి.

శ్లో. సరళా సక్త మాతంగ గైరేయ స్ఫురిత త్విషః
అస్నోషధయో నేతు రక్త మస్నేహదీపికాః 75

వ్యాఖ్య: సరళా....త్విషః-సరళ - దేవదారుచెట్లకు, ఆసక్త - కట్టి వేయఁబడిన, మాతంగ - ఏనుగులయొక్క, గైరేయ - మెడ గొలుసుల యందు, స్ఫురిత - ప్రతిబింబించిన, త్విషః - కాంతులుగలవియైన, ఓషధయః - వెలుతురుమొక్కలు, నేతుః - నాయకుఁడగు రఘువునకు, నక్తం - రాత్రియందు, అస్నేహదీపికాః - నూనెలేని దీపములు, ఆసన్ - అయినవి. అచ్చట రాత్రివేళల యందు,

దేవదారు చెట్లకుఁ గట్టివేయఁబడిన యేనుగుల మెడగొలుసులయందు ప్రతిఫలించు చున్న వెలుతురు తీగలు, రాజుకు, సైనికులకు నూనెయక్కఱలేని దీపములుగా నుపయోగపడినవి. వారికి చీకటి బాధ లేకపోయెను.

శ్లో. తస్యోత్సృష్ట నివాసేషు కంఠరజ్జు క్షత త్వచః
గజవర్ష్మ కిరాతేభ్యః శశంసు ర్దేవదారవః 76

వ్యాఖ్య: తస్య - ఆ రఘు మహారాజుయొక్క, ఉత్సృష్టనివాసేషు - విడువఁబడిన మజిలీలయందు, కంఠరజ్జుక్షత త్వచః—కంఠరజ్జు - మెడల సరిపెణల చేత, క్షత - నలిపివేయఁబడిన, త్వచః - చర్మములుగలవియగు, దేవదారవః - దేవదారుచెట్లు, కిరాతేభ్యః - బోయలకొరకు(వేటకాండ్రకు), గజవర్ష్మ - రఘుసైన్య గజములయొక్క, ఎత్తును, శశంసుః - సూచించినవి. రఘుసైన్యములు విడిచివెళ్లిన మజిలీలకు వేఁటకై వచ్చిన బోయలుకొఱకు అచ్చటిదేవదారు వృక్షములకు గజములను కట్టివేయుటచేత వాటి మెడ సరిపెణల రాపునకు నలిగిన చర్మముల గుర్తులు గల ఆ చెట్లనుజూచి 'ఆయేనుగుల యెత్తు ఇంత గొప్పదా? రఘుమహారాజుకు ఇంతింత పెద్ద యేనుఁగులుగలవా?' యని యాశ్చర్యపడిరని భావము. 'వర్ష్మ' అనగా ప్రమాణము, దేహము అని యర్థములు.

శ్లో. తత్ర జన్యం రఘో ర్ఘోరం పార్వతీయై ర్గణై రభూత్
నారాచ క్షేపణీయాశ్మ నిష్పేషో త్పతితానలమ్. 77

వ్యాఖ్య: తత్ర - ఆ హిమాలయమునందు, రఘోః - రఘువునకు, పార్వతీయైః - పర్వతముపై నివసించువారైన, గణైః - ఉత్సవ, సంకేతు లనెడు గణములతో, నారాచక్షేపణీయాశ్మ నిష్పేషోత్పతితానలం—నారాచ - ఒక విధమైన బాణములయొక్కయు, క్షేపణీయ - విసరి వేయఁదగిన భిండివాలములయొక్కయు, అశ్మ - పాషాణములయొక్కయు, నిష్పేష - రాపిడులచేత, ఉత్పతితానలం - ఎగయుచున్న మంటలు గలదియై, ఘోరం - భయంకరమైన, జన్యం - యుద్ధము అభూత్ - జరిగెను. అక్కడ రఘుసైన్యములకును "ఉత్సవ సంకేతు"లను పేరు గల పర్వతగణములకును యుద్ధము జరిగెను. ఆ యుద్ధమునం దుపయోగింపఁబడిన నారసములు భిండివాలములును పర్వత గణాలెక్కువగా విసరిన పాషాణములును ఒరసికొనుటచేత మంటలు బయలుదేరి భయంకరముగా నుండెను. "గణానుత్సవ

సంకేతా నజయత్ సప్తపాండవః" అను మహాభారత ప్రమాణమువలన ఆ గణము లేడుగా నుండెనని గ్రహింపవలయును.

శ్లో. శరై రుత్సవసంకేతాన్ స కృత్వా విరతోత్సవాన్
జయోదాహరణం బాహ్వో ర్గాపయామాస కిన్నరాన్. 78

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, శరైః - బాణములచేత, ఉత్సవ సంకేతాన్ - ఉత్సవ సంకేతగణములను, విరతోత్సవాన్ - చాలింపఁబడిన యుత్సవ ములు గలవారినిగా, కృత్వా - చేసి (జయించియని యర్థము), కిన్నరాన్ - అచ్చటి కిన్నరులను, బాహ్వోః - తన భుజములయొక్క, జయోదాహరణం - జయమును వర్ణించునట్టి "ఉదాహరణ"మను కావ్యమును, గాపయామాస - గానము చేయించెను. రఘుమహారాజు, ఆ పార్వతీయ గణములను ఓడించి, అది అపూర్వ విజయము గనుక, తన బాహుపరాక్రమ జయమును వర్ణించునట్టి "ఉదాహరణ" కావ్యమును రచింపఁజేసి, కిన్నరులచేత గానము చేయించెను. ఆ గణముల కది అపూర్వమైన ఓటమి.

శ్లో. పరస్పరేణ విజ్ఞాత స్తేషూ పాయనపాణిషు
రాజ్ఞా హిమవతః సారో రాజ్ఞః సారో హిమాద్రిణా. 79

వ్యాఖ్య: తేషు - ఆ యుత్సవ సంకేత గణములు, ఉపాయన పాణిషు - కానుకలు చేతులయం దుంచుకొన్నవారుకాగా, రాజ్ఞా - రఘుమహారాజు చేత, హిమవతః - హిమవంతునియొక్క, సారః - ధనరూపమైన సారము, హిమా ద్రిణా - హిమవంతుని చేత, రాజ్ఞః - రఘుమహారాజుయొక్క, సారః - బల రూపమైనసారము, పరస్పరేణ - ఒండొరులచేత, విజ్ఞాతః - తెలిసికొనఁబడినది. ఓడిపోయిన పార్వతగణములు రాజుకొఱకు కానుకలను గొనిరాగా, హిమవంతునికి రఘు పరాక్రమమును, రఘురాజున కట్టి వెలకట్టజాలని కానుకలకు మూలమైన హిమవంతుని ధనసంపదయు బోధపడినవి.

శ్లో. తత్రాక్షోభ్యం యశోరాశిం నివే శ్యావరురోహ సః
పౌలస్త్యతులితస్యాద్రే రాదధాన ఇవ హ్రియమ్. 80

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, తత్ర - అహిమవత్పర్వతమునందు, అక్షోభ్యం - కదల్చుటకు వీలుపడని, యశోరాశిం - కీర్తిరాశిని, నివేశ్య - పేర్చి,

పౌలస్త్యతులితస్య - రావణునిచేత నెత్తఁబడిన, అద్రేః - పర్వతమునకు (కైలాస పర్వతమునకు), హ్రీయం - సిగ్గును, ఆదధానఃఇవ - కలిగించుచున్నవాఁడువలె, అవరురోహ - దిగెను. అట్లు హిమవత్పర్వతముమీద నితరులు కదల్చుటకు వీలు కాని యయోరాశినిఉంచి, రావణునిచే నొకప్పు డెత్తి తూచబడిన కైలాస పర్వతమునకు వెళ్లక, ఆ పర్వతమునకు సిగ్గును గలిగించుచున్నవాఁడువోలె హిమాలయము నుండి క్రిందికి దిగెను. శూరులైనవారు పూర్వమొకరు గెల్చినదాని నంటుట సహజముగాదుగనుక రావణుఁడు గెల్చిన కైలాసమునంటక విడిచెను. ఆ కారణము చేతను, తనవలెనే తెల్లనిదగు యయోరాశిని తన ప్రక్కనే నిలుపుటచేతను, కైలాసమునకు సిగ్గువాటిల్లెనని భావము.

శ్లో. చకంపే తీర్ణలౌహిత్యే తస్మిన్ ప్రాగ్జ్యోతిషేశ్వరః
తద్గజాలానతాం ప్రాప్తైః సహ కాలాగరుద్రుమైః 81

వ్యాఖ్య : తస్మిన్ - ఆ రఘుమహారాజు, తీర్ణలౌహిత్యే (సతి) - దాటఁబడిన లౌహిత్యయను నదికలవాడుకాగా, ప్రాగ్జ్యోతిషేశ్వరః - ప్రాగ్జ్యోతిషదేశపు రాజు, తద్గజాలానతాం—తద్గజ - ఆ రఘు మహారాజుయొక్క యేనుగులకు, ఆలాన తాం - కట్టుకంబమగుటను, ప్రాప్తైః - పొందినట్టి, కాలాగరుద్రుమైః సహ - నల్లయగరు చెట్లతోఁగూడ, చకంపే - వణకిపోయెను. రఘుమహారాజు లౌహిత్యా నదిని దాటిన వార్త తెలియగానే (ప్రాగ్జ్యోతిషమనగా నేటి అస్సాం), రఘు గజములకు కట్టుకంబములుగా సైనికులచే నుపయోగింపబడిన అగరుచెట్లు ఎట్లు చలించినవో అట్లు వణికిపోయెను. అగరుచెట్లు చిన్నవి కనుక ఏనుఁగులఱేపునకు కదులుచుండెను.

శ్లో. న ప్రసేహే స రుద్ధార్క మధారావర్ష దుర్దినం
రథవర్త్మరజోఽప్యస్య కుత ఏవ పతాకినీమ్. 82

వ్యాఖ్య : సః - ఆప్రాగ్జ్యోతిషరాజు, రుద్ధార్కం - అడ్డగింపఁబడిన సూర్యుఁడు గలదియు, అధారావర్షదుర్దినం—అధారావర్ష - ధారావర్షములేని, దుర్దినం - మేఘావృతమైన పగలుగల (మబ్బులు పట్టినరోజు)దియును నగు, అస్య - ఈ రఘుమహారాజుయొక్క, రథవర్త్మరజఃఅపి—రథవర్త్మ - రథ మార్గము నందలి, రజః అపి - ధూళినిగూడ, నప్రసేహే - ఓర్వలేకపోయెను, పతాకినీం - సేనను, కుతఏవప్రసేహే - ఎక్కడ ఓర్వగలడు? రఘురథము యొక్క దారిలో రేగిన

ధూళి, సూర్యబింబమును కనపడనీక, వర్షధారలు, మేఘములును లేని దుర్దినమును సృజించి వచ్చుచుండగా, దానికే ప్రాగ్జ్యోతిషపతి తట్టుకొన లేకపోయెను. ఇకనా దుమ్ము వెనుక వచ్చు సైన్యమే వచ్చి మీదఁబడినచో తట్టుకొనఁగలడను మాటయే యెక్కడిది? సులభముగా లొంగిపోయెనని భావము.

శ్లో. తమీశః కామరూపాణా మత్యాఖండల విక్రమం
భేజే భిన్నకపై ర్నాగై రన్యా నుపరురోధ యైః 83

వ్యాఖ్య: కామరూపాణాం - కామరూప దేశముయెక్క, ఈశః - రాజు, అత్యాఖండలవిక్రమం - ఇంద్రుని కంటె మించిన పరాక్రమముగల, తం - ఆ రఘుమహారాజును, యైః - వేనిచేత, అన్యాన్ - ఇతరరాజులను, ఉపరురోధ - అడ్డగించెనో (జయించెనో), అట్టి, భిన్నకపైః - మదస్రావ యుక్తమైన గండస్థలములుగల, నాగైః - గజములచేత, భేజే - సేవించెను. కామరూపదేశపతి యేగజములచేత నితరరాజులందటిని జయించెనో ఆమదపుటేనుగులనే ఇంద్రుని కన్న పరాక్రమవంతుఁడైన రఘుమహారాజున కిచ్చి సేవించెను, రఘువు శూరులకు శూరుఁడని భావము.

శ్లో. కామరూపేశ్వర స్తస్య హేమపీఠాధిదేవతాం
రత్నపుష్పావహారేణ చ్ఛాయా మానర్చ పాదయోః 84

వ్యాఖ్య: కామరూపేశ్వరః - కామరూప దేశపురాజు, హేమపీఠాధిదేవతాం హేమపీఠ - బంగారుపాదపీఠమునకు. అధిదేవతాం - అధిష్ఠాన దేవతయగు, తస్య పాదయోః, ఛాయాం - ఆ రఘువుయొక్క పాదములకాంతిని, రత్నపుష్పోపహారేణ - రత్న - రత్నములనెడు, పుష్ప - పువ్వులయొక్క, ఉపహారేణ - సమర్పణముచేత, ఆనర్చ - పూజించెను. కామరూపేశ్వరుఁడు రఘుమహారాజు పాదములను బంగారు పీఠముపై నుంచి. రత్నములతో పూజించెనని భావము.

శ్లో. ఇతి జిత్వా దిశో జిష్ణు ర్న్యావర్తత రథోద్ధతం
రజో విశ్రామయన్ రాజ్ఞాం ఛత్రకూన్యేషు మౌళిషు. 85

వ్యాఖ్య: జిష్ణుః - జయశీలుఁడైన రఘువు, ఇతి - ఈవిధముగా (వెనుక వర్ణించినరీతిగా) దిశః - దిక్కులను, జిత్వా - జయించి, రథోద్ధతం - రథములచేత

రేపఁబడిన, రజః - ధూళిని, రాజ్ఞాం - రాజులయొక్క, ఛత్రశూన్యేషు - చత్ర ములులేని, మౌళిషు - ముడిచిన పిగలుగల తలలపై, విక్షామయన్ - సంక్ర మింపఁజేయుచు, న్యవర్తత - వెనుకకు మరలెను. ఈవిధముగా దిగ్విజయమును సాధించి, రథవేగమున రేగుచున్న ధూళిని ఛత్రహీనములైన రాజుల మౌళులపై బడునట్లు చేయుచు, స్వదేశమునకు మరలి వెళ్లెను. రఘుమహారాజు ఏకచ్ఛత్రాధి పతిగా నిర్ణయింపఁబడుటచేత ఇతర రాజులందఱును ఛత్రహీనులుగా మారిపోయి రని భావము.

శ్లో. స విశ్వజిత మాజహ్రే యజ్ఞం సర్వస్వదక్షిణం
ఆదానం హి విసర్గాయ సతాం వారిముచా మివ. 86

వ్యాఖ్య: సః - ఆ రఘు మహారాజు, సర్వస్వదక్షిణం - సర్వధనమును దక్షిణగా నీయవలసిన, విశ్వజితం - విశ్వజిత్తు అనుపేరుగల, యజ్ఞం - యజ్ఞ మును, ఆజహ్రే - చేసెను. (అదియుక్తమే) సతాం - సత్పురుషులకు, వారిముచాం ఇవ - మేఘములకువలె, ఆదానం - ఆర్జనము, విసర్గాయహి - త్యాగము కొఱకే గదా : సర్వదిగ్విజయమునం దార్జించిన ధనరాసులతో నిల్లుచేరిన రఘుమహారాజు, సర్వస్వదక్షిణాకమైన విశ్వజిద్యాగమును తలపెట్టి, అందులో నాధనమునే కాక తన యొద్దనున్న ధనమునంతటిని సత్పాత్రదానము చేసెను. సత్పురుషు లార్జించుట దానము చేయుట కొఱకే గాని తమ భోగార్థము కాదుగదా : మేఘములు తాము గ్రహించిన నీటిని లోకోపకారార్థము వర్షించుచున్నవి. విశ్వజిద్యాగమును జేయుట విజయ గర్వముచేతగాక, "విశ్వజిత్సర్వదక్షిణః" అను శ్రుతి ప్రమాణమునను సరించి లోకోపకారార్థము శుభకర్మచేయుటకని భావము.

శ్లో. సత్రాన్తే సచివసఖః పురస్క్రియాభిః
గుర్వీభిః శమిత పరాజయ వ్యళీకాన్
కాకుత్థ స్చిరవిరహోత్సుకావరోధాన్
రాజన్యాం తస్వపురనివృత్తయేఽ నుమేనే. 87

వ్యాఖ్య: కాకుత్థ్సః - రఘు మహారాజు, సత్రాన్తే - విశ్వజిద్యాగము యొక్క అంతమునందు, సచివసఖః - మంత్రులతో కూడినవాఁడై, గుర్వీభిః -

గొప్పనియగు, పురస్క్రియాభిః - సత్కారములచేత, శమిత పరాజయ వ్యళీకాన్- శమిత - చల్లార్పఁబడిన, పరాజయవ్యళీకాన్ - ఓటమిచేతఁ గలిగిన దుఃఖముగల వారును, చిరవిరహోత్సుకావరోధాన్—చిరవిరహ - బహుకాల వియోగముచేత, ఉత్సుక - భర్తలను కలిసికొనుటకు త్వరపడుచున్న, అవరోధాన్ - అంతఃపుర స్త్రీలుగలవారును, (అయిన) రాజన్యాన్ - రాజులను, స్వపురనివృత్తయే - తమ నగరములకు తిరిగి వెళ్లుటకై, అనుమేనే - అంగీకరించెను. యాగము ముగిసిన పిమ్మట రఘుమహారాజు, మంత్రులతో కలిసిన వాడగుచు, తనచే నోడింపఁబడి తన సైన్యమునందుఁగలిసి వచ్చి యాగసమాప్తి వఱకు నుండిన, రాజులందఱిని గొప్ప బహుమానములతో సత్కరించి వారి మనస్సులందుఁగల పరాజయ దుఃఖమును, ముఖములందలి ఖిన్నతను తొలగింపఁజేసెను, చిరకాలవియోగము ననుభవించుచున్న భార్యలుగల ఆరాజులందఱినీ తమతమ నగరములకు దిరిగి వెళ్లిపోవుటకై యనుమతి నిచ్చెను. ఓడిపోయిన రాజులందఱును విజేతయగు రాజు చేయునట్టి రాజసూయాది యాగములకు రావలసియుండుట అనాటి యాచారము, అట్లు వచ్చిన వారిని సత్కరించి మైత్రిని నెఱపుట విజేత ధర్మము, అట్టి దంతయు రఘు మహారాజు చేసిన విశ్వజిద్యాగమునందు జరిగెనని భావము. 'సత్త్రి' మనగా యాగము. ఆశబ్దము నేడు గౌణార్థమున నుపయోగింపఁబడుచున్నది.

శ్లో. తే రేఖాధ్వజకలశాతపత్రచిహ్నం
సమ్రాజశ్చరణయుగం ప్రసాదలభ్యం
ప్రస్థానప్రణతిభి రంగుళీషు చక్రుః
మౌళిస్రక్చ్యుత మకరంద రేణు గౌరమ్. 88

వ్యాఖ్య: తే - ఆ రాజులు, రేఖా కలశాతపత్రచిహ్నం—రేఖా - రేఖల రూపమునన్న, ధ్వజ - కేతనము, కలశ - పాత్ర, ఆతపత్ర - ఛత్రము చిహ్నం - చిహ్నములుగా గలదియు, ప్రసాదలభ్యం - అనుగ్రహముచేతనే లభించునధియునగు, సమ్రాజః - సార్వభౌముఁడైన రఘుమహారాజుయొక్క, చరణయుగం - పాదములజంటను, ప్రస్థానప్రణతిభిః - ప్రయాణ సమయమందలి ననుస్కారములచేత, అంగుళీషు - రఘువుయొక్క కాలివ్రేళ్లమీద, మౌళిస్రక్ చ్యుత మకరంద రేణు గౌరం—మౌళిస్రక్ - శిరములందలి పుష్పమాలలనుండి, చ్యుత - జాఱిన, మకరంద - పుష్పముల రసములచేతను, రేణు - పుప్పొడుల

చేతను, గౌరం - పసుపువర్ణమును, చక్రుః - కలిగించిరి. రఘుమహారాజు పాద ములయందు సార్వభౌమ లక్షణములైన ధ్వజరేఖ, కలశరేఖ, ఛత్రరేఖ యుండి నవి. అతని యనుగ్రహము పొందినవారికే ఆపాదస్పర్శ లభ్యము. అట్టి చరణ యుగ్మముయొక్క ప్రేళ్లపైన స్వదేశములకు వెళ్లనున్న రాజులు నమస్కారములు చేయుచు తమ శిరస్సులనుంచుటచేత, తలపూమాలలనుండి మకరందమును, పుప్పొ డులును రాలి యా పాదాంగుళులమీద ఒకమనోహరమైన గౌరవర్ణము నెలకొనెను. ఎందఱో రాజులు నమస్కరించి వెళ్లిరని భావము. ఇది ప్రహర్షిణీవృత్తము.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ కావ్యమున

చతుర్థ సర్గమునకు తెలుఁగు

ల ఘు వ్యా ఖ్య

మహాకవి కాళిదాసకృత రఘువంశము

పంచమ సర్గము

శ్లో. త మధ్వరే విశ్వజితి క్షితీశం
నిశ్శేష విక్రాణిత కోశజాతం
ఉపాత్తవిద్యో గురుదక్షిణార్థీ
కౌత్సః ప్రపేదే వరతంతుశిష్యః. 1

వ్యాఖ్య: విశ్వజితి - విశ్వజిత్ అనుపేరుగల, అధ్వరే - యాగమునందు, నిశ్శేష విక్రాణిత కోశజాతం—నిశ్శేష - పూర్తిగా, విక్రాణిత - దానము చేయఁ బడిన, కోశజాతం - ధన సమూహము గలవాఁడైన, తం, క్షితీశం - ఆ రఘు మహారాజును, ఉపాత్తవిద్యః - పొందఁబడిన విద్యలు గలవాఁడును, వరతంతు శిష్యః - వరతంతుఁడను మునికి శిష్యుఁడునగు, కౌత్సః - కౌత్సుఁడను పేరుగల మునికుమారుఁడు, గురుదక్షిణార్థీ - గురుదక్షిణను గోరువాఁడై, ప్రపేదే - చేరెను. సర్వస్వ దక్షిణాకమైన విశ్వజిద్యాగమునుచేసి, నిర్ధనుఁడైయున్న రఘు మహారాజు వద్దికి, కౌత్సుఁడను ఋషికుమారుఁడు, తన గురువగు వరతంతుముని కీయఁదలచుకొన్న గురుదక్షిణాధనమును యాచించుటకై వచ్చెను. ఈ సర్గయందలి శ్లోకములు ఉపజాతివృత్తమున రచింపఁబడినవి.

శ్లో. స మృణ్మయే వీతహిరణ్మయత్వాత్
పాత్రే నిధా యార్ఘ్య మనర్ఘశీలః
శ్రుతప్రకాశం యశసా ప్రకాశః
ప్రత్యుజ్జగా మాతిథి మాతిథేయః. 2

వ్యాఖ్య: అనర్ఘశీలః - అమూల్య స్వభావముగలవాఁడును, ఆతిథేయః - అతిథులయందు భక్తిగలవాఁడును నగు, సః - ఆ రఘుమహారాజు, వీతహిరణ్మ

యత్వాత్—వీత - ఖర్చయిపోయిన, హిరణ్మయత్వాత్ - బంగారుపాత్రలు గల వాఁడగుటవలన, మృణ్మయే, పాత్రే - మట్టిదియైన పాత్రయందు, అర్ఘ్యం - పూజాద్రవ్యమును (పువ్వులు గంధం మొదలగువానిని), నిధాయ - ఉంచుకొని, శ్రుతప్రకాశం - శాస్త్రజ్ఞానముచేత ప్రకాశించుచున్న, అతిథిం - అభ్యాగతుఁడగు కౌత్సమునిని, ప్రత్యుజ్జగామ - ఎదురుకొనెను. యశస్వియు, అతిథిభక్తుఁడునునగు రఘుమహారాజు, తానుచేసిన యాగమునందు సువర్ణపాత్రలన్నియు ఖర్చయి పోయినందున, మట్టిపాత్రలో పూజాద్రవ్యములు పెట్టుకొని, విద్యలచేత నొకానొక కాంతి విశేషముగల యతిథిని యెదురేగి సత్కరించెను. "అతిథిషు సాధుః ఆతిథేయః" అని విగ్రహము.

శ్లో. త మర్చయిత్వా విధివత్ విధిజ్ఞః
తపోధనం మానధనాగ్రయాయీ
విశాంపతి ర్విష్టరభాజ మారాత్
కృతాంజలిః కృత్యవి దిత్యువాచ. 3

వ్యాఖ్య : విధిజ్ఞః - శాస్త్రము నెఱిఁగినవాఁడును, మానధనాగ్రయాయీ—మానధన - అభిమానవంతులలో, అగ్రయాయీ - ముందడుగు వేసినవాడును, కృత్యవిత్ - కార్యజ్ఞుఁడునునగు, విశాంపతిః - నరపతియైన రఘుమహారాజు, విష్టరభాజం - ఆసనముపైఁ గూర్చున్నట్టి, తం, తపోధనం - ఆ తపోధనుఁడగు కౌత్సమునిని, విధివత్ - శాస్త్రప్రకారముగా, అర్చయిత్వా - పూజించి, ఆరాత్ - సమీపమున, కృతాంజలిః - చేతులు జోడించుకొన్నవాఁడగుచు, ఉవాచ - ముందు చెప్పఁబోవు రీతిగా పలికెను. అభిమానధనుడైన రఘువు అతిథిపూజాదుల విధానమును, అవి చేయకపోయినచో వచ్చు ప్రత్యవాయాది దోషములను ఎఱిఁగినవాఁడు కనుక కౌత్సమునిని ఒక ఉన్నతాసనమున గూర్చుండఁబెట్టి, యతిథిపూజ చేసి, దగ్గరగా నిల్చుని, బద్ధాంజలియై సంభాషించెనని భావము. ఇచ్చట 'విష్టర'ము దర్భాసనము, లేక అడుగున దర్భలు వేయఁబడిన పీఠము అని గ్రహింపవలెను. అది పవిత్రమైనట్టిది. ఇందలి విశేషణములన్నియు రఘుమహారాజుయొక్క ఔన్నత్యమును సూచించుచున్నవి.

శ్లో. అప్యగ్రణీ ర్మంత్రకృతా మృషీణాం
కుశాగ్రబుద్ధే! కుశలీ గురు స్తే,

యత స్త్వయా జ్ఞాన మశేష మాత్తం
లోకేన చైతన్య మి వోష్ణరశ్మేః. 4

వ్యాఖ్య: హే కుశాగ్రబుద్ధే! • ఓ సూక్ష్మబుద్ధిగలవాఁడా! మంత్రకృతాం-వేదమంత్ర ద్రష్టలైన, ఋషీణాం - ఋషులలో. అగ్రణీః - శ్రేష్ఠుఁడైన, తేగురుః - నీ గురువు, అపికుశలీ - కుశలముగా నున్నాఁడా?, యతః - ఏ గురువు వలన, త్వయా - నీచేత, అశేషం, జ్ఞానం - సమస్తమైన జ్ఞానము, లోకేన - జనముచేత, ఉష్ణరశ్మేః - సూర్యునివలన, చైతన్యం ఇవ - ప్రబోధము వలె, ఆత్తం - స్వీకరింపఁబడినదో. మిక్కిలి తెలివితేటలుగల ఓ మునికుమారా! సూర్యునినుండి జనులు చైతన్యమును పొందినట్లు, యే మహనీయునినుండి నీవు సమస్తమైన శాస్త్రజ్ఞానమును స్వీకరించితివో, ఆ ఋషిశ్రేష్ఠుఁడు, మంత్రద్రష్టయు నైన నీ గురువు కుశలియేకదా? అని రఘువు కౌత్సమునిని ప్రశ్నించెను. కుశాగ్రం అనఁగా దర్భకట్టయొక్క చివర. అది చాలా సన్నగానుండును. దానివంటి బుద్ధి అనఁగా "సూక్ష్మబుద్ధి"కలవాఁడని యర్థము. దీనికి విరుద్ధపదము "ముసలాగ్ర బుద్ధి" అనఁగా మొద్దుబుద్ధి కలవాఁడని యర్థము.

శ్లో. కాయేన వాచా మనసాపి శశ్వత్
యత్సంభృతం వాసవధైర్యలోపి,
ఆపాద్యతే న వ్యయ మంతరాయైః
కచ్చి న్మహర్షే స్త్రివిధం తప స్తత్. 5

వ్యాఖ్య: కాయేన - శరీరముచేతను, వాచా - వాక్కుచేతను, మనసా - మనస్సుచేతను, వాసవధైర్యలోపి - ఇంద్రునియొక్క మనోధైర్యమును పోగొట్టునట్టి, యత్, తపః - ఏ తపస్సు, శశ్వత్ - నిరంతరముగా, సంభృతం - సమకూర్చుకోఁబడి యున్నదో, మహర్షేః - వరతంతు మహర్షియొక్క, త్రివిధం - మూడు విధములైన (కాయికము, వాచికము, మానసికమునైన), తత్, తపః - ఆ తపస్సు, అంతరాయైః - విఘ్నములచేత (అప్సర శ్శాపాదులచేత), వ్యయం - నాశమును, నాపాద్యతే కచ్చిత్ (న + ఆపాద్యతే + కచ్చిత్) - పొందింపఁబడుట లేదుకదా? శరీరముచేత చేయు తపస్సు కాయికము, అది ఉపవాస కృచ్ఛ్ర చాంద్రయణాది రూపము; వాక్కుచేత చేయునట్టి తపస్సు వాచికము, అది వేదశాస్త్ర

పఠనరూపము; మనస్సుచేత చేయునది మానసిక తపస్సు. అది గాయత్రీ మొదలగు మహామంత్రజపరూపము; ఇట్టి త్రివిధతపస్సును నిరంతరమును సాగించుచున్న వరతంతుమహర్షికి ఇంద్రుఁడు తన పదవికి భంగము రాఁగలదేమోయను భయముచేత అప్సరసాదుల మూలమున విఘ్నములను గలిగింపగా, ఆ విఘ్నశాంతికై శాపమును బెట్టవలసివచ్చి, తన్మూలకముగాఁ గొంతతపస్సును వ్యయపఱుపవలసిన చిక్కులు, (మీ గురువుగారికి) కలుగుటలేదుగదా : యని రఘుమహారాజు కౌత్సమునిని అడిగెను.

శ్లో. ఆధారబంధప్రముఖైః ప్రయత్నైః
సంవర్ధితానాం సుతనిర్విశేషం,
కచ్చి న్న వాయ్వాది రుపప్లవో వః
శ్రమచ్ఛిదా మాశ్రమపాదపానామ్. 6

వ్యాఖ్య; ఆధారబంధప్రముఖైః—ఆధార - పాదులయొక్క, బంధ - కట్టుటయే, ప్రముఖైః - ముఖ్యముగాగల, ప్రయత్నైః - ఎఱువులువేయుట మొదలయిన ప్రయత్నములచేత, సుతనిర్విశేషం - పుత్రుల కంటే భేదములేనియట్లు, సంవర్ధితానాం - పెంచఁబడినవియు, శ్రమచ్ఛిదాం - అలసటను పోగొట్టునవియునై న, వః ఆశ్రమపాదపానాం - మీయాశ్రమ వృక్షములకు, వాయ్వాదిః ఉపప్లవః- గాడ్పులు మొదలయిన బాధ, నకచ్చిత్ - లేదుగదా: పాదులుకట్టి నీళ్లుపెట్టి యెఱువులు మొదలయిన దోహదములుచేసి పుత్రులవలె పెంచబడినవియు, మునిజనుల యలసటను దీర్చునవియునగు మీయాశ్రమవృక్షములకు సుడిగాలులు దావాగ్ని మొదలయిన యుపద్రవములు లేవుగదా: అని రఘువు ఆశ్రమవాసియగు కౌత్సుని నడుగ తగిన క్షేమసమాచారము నడిగెను. ఆధారశబ్దమునకు ఆలవాలము, అంబు బంధము, అధికరణము (ఆధారము) అర్థములు.

శ్లో. విర్వ్యర్థతే యై ర్నియమాభిషేకో
యేభ్యో నివాపాంజలయః పిత్ర్యాణాం
తా న్యంచషష్ఠాంకితసైకతాని
శివాని వ స్తీర్థజలాని కచ్చిత్. 7

వ్యాఖ్య : యైఃవేటిచేత, నియమాభిషేకః - నిత్యస్నానము (త్రిషవణ స్నానాదికము), నిర్వర్త్యతే - చేయఁబడుచున్నదో, యేభ్యః - వేనివలన (నదుల నుండి పైకి తెచ్చిన జలములవలన), పిత్యాణాం - అగ్నిష్వాత్తాది పితృదేవతలకు నివాపాంజలయః - తర్పణాంజలులు, నిర్వర్త్యంతే - ఇయ్యఁబడుచున్నవో, ఉంఛ షష్ఠాంకితసైకతాని_ఉంఛ - పొలములయందురాలిపడగా నేఱుకొనితెచ్చినధాన్యము యొక్క, షష్ఠ - రాజుకీయవలసిన యాఱవభాగములచేత, అంకిత - గుర్తులుగల, సైకతాని - ఇసుక దిబ్బలు కలవియగు, వః - మీయొక్క, తాని, తీర్థజలాని - ఆతీర్థజలములు, శివానికచ్చిత్ - భద్రములైయున్నవికదా ? ఆశ్రమవాసులకు నిత్య స్నాన సంధ్యా పితృతర్పణాదులకు పరిశుద్ధములైన నదీజలములు ముఖ్యము. తీర్థ మనఁగా నదిలోనికి దిగుదారి. ఉంఛశబ్దమునకు పఱిగెధాన్యము, లేక రాలినగింజలు అని యర్థము. తపస్వీజను లట్టి ఉంఛవృత్తితో జీంవింపవలయును. ఆవిధముగా, దెచ్చుకొన్న ధాన్యమునందు సైతము రాజుకు ఆఱవభాగమును పన్నుగా నిచ్చుట, యాచారము, కనుక ఈ విషయములన్నిఁటిని యెఱిఁగిన రఘుమహారాజు, కొత్తనితో మీమునిజన నిత్యస్నాన పితృతర్పణాదుల కుపయోగించునవియు, తమ చుట్టున్న యసుక దిబ్బలపై చిహ్నములుగా నుంచబడిన యుంఛ ధాన్య షష్ఠ భాగములతో విరాజిల్లునవియునగు మీతీర్థజలములు ఇతరులచేతను, మృగాదులచేతను కలుషితములు చేయబడక నిర్మలములుగా, భద్రములుగా, నున్నవికదా ? అని యడిగెను. "ఉంఛవృత్తి, శిలావృత్తి" అని ఆర్షజీవన పద్ధతి రెండు విధములు కర్షకులు పూర్తిగా తీసుకొని వదిలిపెట్టినచేలలో నక్కడక్కడ నున్న పఱిగకంకులు తెచ్చుకొనుట ఉంఛవృత్తి; పొలమునగాని కళ్లమునగాని రాలిన గింజల నేఱుకొని తెచ్చుకొనుట శిలావృత్తి; "ఉంఛోధాన్యాంశకాదానం కణిశాద్యార్జనం శిలం" అని నిఘంటువు.

శ్లో. క్రియానిమిత్తేష్వపి వత్సలత్వాత్
అభగ్నకామా మునిభిఃకుశేషు
తదంకశయ్యా చ్యుత నాభినాళా
కచ్చిన్మృగీణా మనఘా ప్రసూతిః 8

వ్యాఖ్య : క్రియానిమిత్తేషు,అపి - అనుష్ఠానములకు సాధనములైనవియైనను, కుశేషు - దర్భలయందు, మునిభిః - మునులచేత. వత్సలత్వాత్ - వాత్సల్యము

వలన, అభగ్నకామా - భంగ పరుపఁబడని కోరికగలదియును, తదంకశయ్యాచ్యుతనాభినాళా—తదంక - ఆమునుల తొడలనెడి, శయ్యా - పడకలమీద, చ్యుత - ఊడిపడిన, నాభినాళా - బొడ్డుచేరులు గలదియునగు, మృగీణాం,ప్రసూతిః - ఆడులేళ్ల సంతతి, ఆనఘాకచ్చిత్ - అపాయము లేనిదిగా నున్నదికదా ? హోమాదిక్రియలకై తెచ్చిపెట్టుకున్న దర్భలపైఁబడి చెదరగొట్టుచున్నను, తమ తొడలపైనెక్కి కూర్చుని బొడ్డు చేరులను వదిలి వేసినను, వాత్సల్యాతిశయముచేత, మునులచే నదిలింపఁబడక యథేష్టముగా దిరుగాడు లేడిపిల్లల కెట్టి యపాయమును గలుగక సుఖముగా నున్నవికదా ? క్రూరమృగములు చంపునను భయముచేత ఆడులేళ్లు ప్రసవింపగానే మునులు పదిరాత్రులవఱకు నామృగశిశువులను తమ యొడుల లో బెంచుచుండిరట.

శ్లో. నీవారపాకాది కడంగరీయై
రామృశ్యతే జానపదై ర్న కచ్చిత్
కాలోపపన్నాతిథి కల్ప్య భాగం
వన్యం శరీరస్థితి సాధనం వః 9

వ్యాఖ్య: కాలోపపన్నాతిథికల్ప్యభాగం—కాల - యోగ్యకాలములయందు, ఉపపన్న - పచ్చిన, అతిథి - ఆతిథులకు, కల్ప్య - చేకూర్పఁదగిన, భాగం - భాగములుగలదియును. వన్యం - ఆరణ్యమునఁబండినదియు, శరీరస్థితిసాధనం - దేహస్థితికి సాధనమైనదియునగు, వః - మీయొక్క, నీవారపాకాది - నివ్వరి, చామలు, మొదలయిన ధాన్యము, జానపదైః - సమీప గ్రామములనుండి వచ్చిన, కడంగరీయైః - గోమహిషాదులచేత, నామృశ్యతేకచ్చిత్ (న + ఆమృశ్యతే + కచ్చిత్) తాకఁబడుటలేదుగదా ? అవి వచ్చి తినివేయుట లేదుగదా ? యని అర్థము. అరణ్యమునందు కృషి లేకయే పండిన నివ్వరి, చామలు, మొదలగు గడ్డి ధాన్యములు మీ శరీరపోషణమునకును, మీవద్దికి యుక్తకాలములందు వచ్చునట్టి యతిథులకును నుపయోగపడునట్టివి. అట్టి తృణధాన్యములను పల్లెలమండి వచ్చిన వృషభ మహిషాదులు ముట్టుటలేదు గదా ? యని అడిగెను. 'కాల'మనగా ఇష్టి, కుతప మొదలయిన కాలములందును, భోజన సమయమందును వచ్చిన అతిథులకునని యర్థము; 'కడంగరం' అనగా గడ్డి, పొట్టు మొదలయినవి. అవి తినుట కర్హమైనవి "కడంగరీయములు" గోమహిషాదులు. "అమృశ్యతే" అనుక్రియ మహిషాదులు తాకినను ఆధాన్యము పనికి రాకపోవునను శౌచవిధిని సూచించును.

శ్లో. అపి ప్రసన్నేన మహర్షిణా త్వం
సమ్యగ్వినీయానుమతో గృహాయ
కాలోఽయం సంక్రమితుం ద్వితీయం
సర్వోపకారక్షమ మాశ్రమం తే. 10

వ్యాఖ్య: త్వం - నీవు, ప్రసన్నే - శాంతచిత్తుఁడైన, మహర్షిణా - వరతంతు మహర్షిచేత, సమ్యక్ - చక్కగా, వినీయ - శిక్షింపఁబడి (చక్కగా విద్యలునేర్పి), గృహాయ - గృహస్థాశ్రమ ప్రవేశముకొఱకు, అనుమతః, అపి - అంగీకరింపఁ బడితివా? తే - నీకు, సర్వోపకారక్షమం—సర్వ - అన్ని ఆశ్రమములయొక్కయు, ఉపకార - ఉపకారము చేయుటయందు, క్షమం - సమర్థమయిన, ద్వితీయం, ఆశ్రమం - రెండవదియగు గృహస్థాశ్రమమును, సంక్రమితుం - ప్రవేశించుటకు, అయం, కాలఃహి - ఇది సమయముగదా! ఇంతవఱకు కౌత్సుని గురువునకును అతడు నివసించు నాశ్రమమునకును సంబంధించిన కుశలప్రశ్నలు చేసి, ఇప్పుడు కౌత్సునికే సంబంధించిన ప్రశ్న నడుగుచున్నాఁడు; చక్కగా విద్యలన్నియునేర్పి ప్రసన్న హృదయుండైన మీగురువు నీవు గృహస్థాశ్రమమున ప్రవేశించుట కనునుతించెనా? బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమములందుండు వారందరికిని ఉపకారము చేయుటకు శక్తిగల రెండవ యాశ్రమమును అనఁగా గృహస్థాశ్రమమును స్వీకరించుటకునీ కిది తగిన సమయముగదా! ఇట్లడుగుటకు, కౌత్సుడు సకల విద్యావంతుఁడైన బ్రహ్మచారి కనుక ఇఁక జరుగవలసినది వివాహమేకదా? యనియు, తదర్థమైన సహాయమును తనను వేడుటకు వచ్చెనేమో యను పందేహమును కారణములు.

శ్లో. తవార్హతో నాభిగమేన తృప్తం
మనో నియోగక్రియ యోత్సుకం మే
అధ్యాస్యతా శాసితు రాత్మనా వా
ప్రాప్తోసి సంభావయితుం వనాన్మామ్. 11

వ్యాఖ్య: అర్హతః - పూజ్యుఁడవైన, తవ - నీయొక్క, అభిగమేన - రాకచేత మాత్రమే, మే, మనః - నాయొక్క మనస్సు, న తృప్తం - తృప్తి పడలేదు, (కింతు - మరియేమనగా) నియోగక్రియయా - ఆజ్ఞాకరణమునందు (నప్త

మ్యర్థమున తృతీయా విభక్తి), ఉత్సుకం - వేగిరపడుచున్నది, శాసితుః - నీకు శాసకుఁడగు గురువుయొక్క, ఆజ్ఞయా, అపి - ఆజ్ఞచేతనా? ఆత్మనా, వా - స్వయముగానా? మాం - నన్ను, సంభావయితుం - గౌరవించుటకు, వనాత్ - వనమునుండి, ప్రాప్తోసి (ప్రాప్తః + అసి) - వచ్చితివి? పూజ్యుఁడవైన నీవు వచ్చుటచేత మాత్రమే నా మనస్సు తృప్తిని పొందలేదు. నీ యాజ్ఞ ననుసరించుటకు త్వరపడుచున్నది; మీ గురువుగారి యాజ్ఞచేతనా? లేక స్వబుద్ధిచేతనా? నీ విట్లు వనమునుండి వచ్చి నన్ను ధన్యునిజేయుటకుఁగల కారణమని రఘువు కౌత్సుని ప్రశ్నించెను. కుశలప్రశ్నలపిమ్మట వచ్చినకారణ మడిగెనని భావము.

శ్లో. ఇ త్యర్ఘ్యపాత్రానుమిత వ్యయస్య
రఘో రుదారా మపి గాం నిశమ్య
స్వార్థోపపత్తిం ప్రతి దుర్బలాశః
త మి త్యవోచత్ వరతుంతుశిష్యః. 12

వ్యాఖ్య: అర్ఘ్యపాత్రానుమిత వ్యయస్య—అర్ఘ్యపాత్ర - పూజాద్రవ్యము లుంచిన మట్టిపాత్రచేతనే, అనుమిత - ఊహింపఁబడిన, వ్యయస్య - సర్వధన వ్యయముగల, రఘోః - రఘుమహారాజుయొక్క, ఇతి - ఇంతకుముందు పలికిన, ఉదారాం, అపి, గాం - ఔదార్యయుక్తమేయగు వాక్కును, నిశమ్య - విని, వరతంతుశిష్యః - కౌత్సుఁడు, స్వార్థోపపత్తిం, ప్రతి - స్వప్రయోజనసిద్ధిని గురించి, దుర్బలాశః - సడలినకోరిక గలవాఁడగుచు, తం - ఆ రఘుమహారాజును గుఱించి, ఇతి - ఇట్లు (ముందు పలుకబోవురీతిగా) అవోచత్ - పలికెను, కౌత్సుఁడు తనను పూజించుటకుఁ దెచ్చిన మట్టిపాత్రచేతనే, రఘుమహారాజు ధన వ్యయముచేసి యున్నాడని యూహించి, అతఁడెంత యుదారముగా "మీ యాజ్ఞను చేయుటకు సంసిద్ధుడనై యున్నానని" పలికినను, వచ్చినపని వాకిటనే జరిగినదని విరుత్సాహపడి యీ క్రిందిరీతిగా పలికెను.

శ్లో. సర్వత్ర నో వార్త మవేహి రాజన్!
నాథే కుత స్త్వ య్యశుభం ప్రజానామ్,
సూర్యే తప త్యావరణాయ దృష్టేః
కల్పేత లోకస్య కథం తమిస్రా. 13

వ్యాఖ్య: హే రాజన్! - ఓరాజా!, సర్వత్ర - అంతటను, నః - మాకు, వార్తం - స్వాస్థ్యమును(క్షేమమేయని), అవేహి - తెలిసికొనుము, త్వయి, నాథే - నీవు అధిపతివైయుండగా, ప్రజానాం - ప్రజలకు, అశుభం - అశుభము, కుతః - ఎక్కడిది? సూర్యే - సూర్యుడు, తపతి (సతి) - ప్రకాశమానుడగుచుండగా, తమిస్రా - అంధకారము, లోకస్య - జనముయొక్క, దృష్టేః, ఆవరణాయ - చూపును అడ్డగించుటకు, కథం కల్పేత - ఎట్లు సమర్థవంతమగును? రాజా! నీవు నాథుడవై యున్నంతకాలము ప్రజలకు క్షేమమేయని తలంపుము, సూర్యుడు వెలుగుచుండగా చీకటి లోకముయొక్క చూపును అడ్డగింపగల్గునా?

శ్లో. భక్తిః ప్రతీక్ష్యేషు కులోచితా తే
పూర్వాన్ మహాభాగ! తయాతిశేషే,
వ్యతీతకాల స్త్వహ మభ్యుపేతః
త్వా మర్థిభావా దితి మే విషాదః. 14

వ్యాఖ్య: ప్రతీక్ష్యేషు - పూజ్యులయందు (అతిథులయందు), భక్తిః - భక్తి, తవ - నీకు, కులోచితా - వంశాభ్యస్తము (వంశక్రమాగతము), హే మహాభాగ - ఓ సార్వభౌమా! తయా - ఆ భక్తిచేత, పూర్వాన్ - మీ పూర్వులను, అతిశేషే - మించుచున్నావు, అహం - నేను, వ్యతీతకాలః - అతిక్రమించిన సమయము గలవాడనై, అర్థిభావాత్ - యాచకత్వమువలన, త్వాం - నిన్ను, అభ్యుపేతః - సమీపించితిని, ఇతి - ఇట్లని, మే - నాకు, విషాదః - ఖేదము. పూజ్యులయిన అతిథులయందు భక్తిగలిగియుండుట మీకు కులక్రమాగతము, అందులోను నీవు మీ పూర్వులను మించినావు, కాని నేను సమయమునతిక్రమించి యాచకత్వముతో నిన్ను జేరితిని గదా! యని నా మనస్సు ఖేదపడుచున్నది. అని కౌత్సుడు రఘుమహారాజుతో ననెను. పంచయజ్ఞములు ప్రతిదినమును జేయువారు అతిథికోసము ప్రతీక్షించుచుందురు. అందువలన అతిథికి "ప్రతీక్ష్యుః" అను పేరు వచ్చినది.

శ్లో. శరీరమాత్రేణ నరేంద్ర! తిష్ఠన్
ఆభాసి తీర్థ ప్రతిపాదితర్ద్ధిః,

ఆరణ్యకోపాత్త ఫలప్రసూతిః
స్తంబేన నీవార ఇ వావశిష్టః. 15

వ్యాఖ్య: హే నరేంద్ర! - ఓ రాజా! తీర్థప్రతిపాదితర్ధిః — తీర్థ - సత్పాత్రమునందు, ప్రతిపాదిత - దానము చేయఁబడిన, ఋద్ధిః - సంపదగల వాఁడవైననీవు, శరీరమాత్రేణ - శరీరముతో మాత్రము, తిష్ఠన్ - నిలిచిన వాఁడవగుచు (మిగిలి), ఆరణ్యకోపాత్త ఫలప్రసూతిః — ఆరణ్యక - అరణ్యమునందుండు మునులు మొదలగువారిచేత, ఉపాత్త - తీసుకోఁబడిన, ఫలప్రసూతిః - పంటకలదియై, స్తంబేన - కాండముతో మాత్రము, అవశిష్టః - మిగిలిన, నీవారఃఇవ - నివ్వరి ధాన్యపు మొక్కవలె, ఆభాసి - ప్రకాశించుచున్నావు. ఓ రాజా! నీ సంపద నంతను సత్పాత్రదానము చేసి శరీరమాత్రము మిగిలిన వాఁడవైన నీవు, అరణ్యమునందు మునులు మొదలగువారిచే గ్రహింపఁబడిన కంకులుగలదియై దంటుతోమాత్రము మిగిలిన నివ్వరి సస్యమువలె ప్రకాశించుచున్నావు. "తీర్థ" శబ్దమునకు సత్పాత్రము, దర్శనము, పుణ్యక్షేత్రము, రేపు మొదలయిన అర్థములు గలవు.

శ్లో. స్థానే భవా నేకనరాధిపః స
న్నకించనత్వం మఖజం వ్యనక్తి
పర్యాయ పీతస్య సురై ర్హిమాంశోః
కలాక్షయః శ్లాఘ్యతరోహి వృద్ధేః 16

వ్యాఖ్య: భవాన్ - నీవు, ఏకనరాధిపఃసన్ - సార్వభౌముఁడవగుచును, మఖజం - యజ్ఞమువలన గలిగిన, అకించనత్వం - నిర్ధనత్వమును, వ్యనక్తి - ప్రకటించుచున్నావు, స్థానే - యుక్తమైయున్నది, సురైః - దేవతలచేత, పర్యాయ పీతస్య - క్రమానుసారముగా పానము చేయఁబడిన, హిమాంశోః - చంద్రుని యొక్క, కళాక్షయః - కళల తఱుగుటకంటెను, వృద్ధేః - పెఱుగుటకంటెను, శ్లాఘ్యతరోహి (శ్లాఘ్యతరః+హి) - ఎక్కువ మెచ్చుకోఁదగినది కదా! నీవు సార్వభౌముఁడ వయ్యును యజ్ఞమునందు సర్వస్వమును దానముచేసి దారిద్ర్యమునొందుట యుక్తముగా నున్నది. దేవతలచేత పానముచేయఁబడిన యమృతకిరణుని క్షయము వృద్ధికంటెను మిక్కిలి పొగడఁదగినదికదా! "ధర్మార్థం క్షీణకోశస్య

క్షీణత్వమపి శోభతే : సురైః పీతావశేషస్య కృష్ణపక్షే విధోరివ" అని కామందక నీతిసారము.

శ్లో. తదన్యతస్తావదనన్యకార్యో
గుర్వర్థమాహర్తుమహం యతిష్యే
స్వస్త్యస్తు తే నిర్గళితాంబుగర్భం
శరద్ఘనం నార్దతి చాతకోపి 17

వ్యాఖ్య : తత్ - అందువలన, అనన్యకార్యః - గురుకార్యము తప్ప మరియొక పనిలేని, అహం నేను, అన్యతః,తావత్ - మఱియొక దాతనుండియే, గుర్వర్థం - గురుధనమును, ఆహర్తుం - తెచ్చుకొనుటకు, యతిష్యే - ప్రయత్నింపఁగలను. తే, స్వస్తి, అస్తు - నీకు మంగళమగుగాక, చాతకః, అపి - వానకోయిల కూడా, నిర్గళితాంబుగర్భం - నిశ్శేషముగా కురిసిన జలముగల, శరద్ఘనం - శరదృతువు నందలి మేఘమును, నార్దతి (న+అర్దతి) - యాచింపదుగదా ! అందువలన గురుధనార్జనము తప్ప మరియొక పనిలేని నేను మరియొక దాత వద్ది నుండియే నాగురుధనమును సంపాదించుకొనుటకు ప్రయత్నింతును. ఎందుకనగా నిశ్శేషముగా వర్షించిన శరత్కాల మేఘమును చాతకపక్షి యాచింపదుగదా ! అని కౌత్సుఁడు రఘుమహారాజుతో ననెను. నేలపైఁబడిన జలము చాతకమునకు రోగహేతువు. కనుక అనన్య గతికమైనను అది నీరులేని శర్మన్మేఘమును యాచించి యేమిపొంద గలదు ? అని భావము.

శ్లో. ఏతావదుక్త్వా ప్రతియాతుకామం
శిష్యం మహర్షేర్నృపతి ర్నిషిధ్య
కిం వస్తు విద్వన్ ! గురవే ప్రదేయం
త్వయా కియ ద్వేతి తమన్వయుంక్త 18

వ్యాఖ్య : ఏతావత్ - ఇంతమాత్రము, ఉక్త్వా - పలికి, ప్రతియాతుకామం - తిరిగి వెళ్ళదలఁచినట్టి, మహర్షేః శిష్యం - వరతంతు శిష్యుఁడైన కౌత్సుని, నృపతిః - రాజు, నిషిధ్య - వద్దనిఆపి, హేవిద్వన్ - ఓవిద్వాంసుఁడ! త్వయా - నీచేత, గురవే - మీగురువునకు, ప్రదేయం - ఇయ్యవలసిన, వస్తు - ద్రవ్యము,

కిం - ఏది? కియద్వా (కియత్ + వా) - ఎంత పరిమాణము గలది? ఇతి - ఇట్లని, తం - ఆకౌత్సుని అన్వయుంక్త - ప్రశ్నించెను. క్లుప్తముగా పలికి మఱలి పోఁదలచిన కౌత్సుని ఆపి, ఓపండితుడా! మీగురువుగారి కియ్యవలసిన వస్తువేది? అది యెంత? అని రఘుమహారాజు ప్రశ్నించెను.

శ్లో. తతో యథావ ద్విహితాధ్వరాయ
తస్మై స్మయావేశ వివర్జితాయ
వర్ణాశ్రమాణాం గురవే స వర్ణీ
విచక్షణం ప్రస్తుత మాచచక్షే. 19

వ్యాఖ్య: తతః - తర్వాత, యథావత్ - తగినరీతిగా, విహితాధ్వరాయ - అనుష్ఠింపఁబడిన యజ్ఞము గలిగినట్టియును, స్మయావేశ వివర్జితాయ - గర్వము లేనివాఁడును, వర్ణాశ్రమాణాం - బ్రాహ్మణాది వర్ణములకును, బ్రహ్మచర్యాద్యాశ్రమములకును, గురవే - నియామకుఁడునగు, తస్మై - ఆరఘుమహారాజు కొఱకు (రఘువునకు), విచక్షణః - పండితుఁడును, వర్ణీ - బ్రహ్మచారి యునైన, సః - ఆ కౌత్సుఁడు, ప్రస్తుతం - ప్రకృత విషయమును, ఆచచక్షే - విపులముగాఁజెప్పెను. విధి విహిత ప్రకారముగా యజ్ఞముచేసి, గర్వము రవంతయులేక, వర్ణాశ్రమ ధర్మ రక్షకుఁడైయున్న రఘుమహారాజు వినయముతో నడిగినప్పుడు, తన కార్యము సిద్ధించునన్న యాశ లేక పోయినను, సమాధానము చెప్పుట కౌత్సుని ధర్మము, కనుక పండితుఁడై బ్రహ్మచారియునైయున్న యతఁడు తాను వచ్చిన పనిని రఘు మహారాజుతో విపులముగాఁ జెప్పుట కారంభించెను.

శ్లో. సమాప్తవిద్యేన మయా మహర్షిః
విజ్ఞాపితో భూత్ గురుదక్షిణాయై
స మే చిరా యాస్థలితోపచారాం
తాం భక్తి మే వాగణయత్ పురస్తాత్. 20

వ్యాఖ్యః సమాప్తవిద్యేన - ముగింపఁబడిన విద్యలుగల, మయా - నా చేత, మహర్షిః - వరతంతు మహాఋషి, గురుదక్షిణాయై - గురుదక్షిణను స్వీకరించుటకొఱకై, విజ్ఞాపితః - అభూత్ మనవిచేయబడినవాఁడయ్యెను. సః - ఆయన

చిరాయ - బహకాలము, అస్ఖలితోపచారాం - పొరపాటులేని సేవగల, తాం, మే, భక్తిమేవ - ఆనాగురుభక్తినే, పురస్తాత్ - ప్రథమముగా, అగణయత్ - లెక్కించెను. నేను విద్యలు ముగించిన పిమ్మట గురు దక్షిణను స్వీకరించుట కనుమతిని వేడగా, మాగురువు వరతంతు మహర్షి, నేను తొట్రుపాటు లేక చిరకాలము చేసిన సేవారూపమగు గురుభక్తినే మొదట లెక్కించెను, అదియే దక్షిణ, దానితోనే సంతసించితి ననెను.

శ్లో. నిర్బంధ సంజాత రుషా ర్థకార్శ్యా
మచింతయిత్వా గురుణా హ ముక్తః
విత్తస్య విద్యా పరిసంఖ్యయా మే
కోటీ శ్చతస్రో దశ చాహరేతి. 21

వ్యాఖ్య: నిర్బంధ సంజాతరుషా—నిర్బంధ - బలవంత పెట్టుటచేత, సంజాత - కలిగిన, రుషా - కోపముగలవాడైన, గురుణా - మా గురువుచేత. అర్థకార్శ్యం - నాధనహీనత్వమును, అచింతయిత్వా - ఆలోచింపకయే, అహం - నేను, విత్తస్య - ధనముయొక్క, చతస్రః - దశచ - నాలుగున్ను పదియునైన, కోటీః - కోట్లను, మే, ఆహర - నాకొఱకు తెమ్ము. ఇతి - ఇట్లని, విద్యాపరి సంఖ్యయా-విద్యా - నేను ఆయన వద్ద చదువుకొన్న విద్యల యొక్క, పరి సంఖ్యయా - లెక్కప్రకారము, ఉక్తః - చెప్పబడినవాడనైతిని, మనుస్మృతి ప్రకారము, "ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము, మీమాంస, న్యాయము, పురాణము, ధర్మశాస్త్రము" అనునవి 14 విద్యలు. వీనిని కౌత్సుడు వరతంతుముని వద్ద చదివి యుండుటచేత, గురుదక్షిణ స్వీకరింపుడని కౌత్సుడు పదే పదే ప్రార్థించి బలవంత పెట్టుటవలన వరతంతు మునికి కోపమువచ్చి, ఇతడు ధనవంతుడా దరిద్రుడా అన్న విచారమునుమాని, నీవు నావద్ద పదునాలుగు విధ్యలు నేర్చితివిగదా! విద్యకొక కోటి ప్రకారము పదునాలుగు కోట్ల బంగారు నాణెములు తెచ్చి యిమ్మని యడిగెనని కౌత్సుడు రఘుమహారాజుతో జెప్పెను.

శ్లో. సో హం సపర్యావిధి భాజనేన
మత్వా భవంతం ప్రభుశబ్దశేషమ్

అభ్యుత్సహే సంప్రతి నోపరోద్ధు
మల్పేతరత్వాత్ శ్రుతనిష్క్రయస్య. 22

వ్యాఖ్య: సోఽహం (సః + అహం) - అట్టినేను, సపర్యావిధిభాజనేన- సపర్యావిధి - పూజావిధానమునకు సంబంధించిన. భాజనేన - పాత్రచేత (పూజా పాత్రచేత), భవంతం - నిన్ను, ప్రభుశబ్దశేషం - 'ప్రభువు' అనుమాటచేతనే మి గి లి యు న్న వానినిగా, మత్వా - తెలిసికొని, శ్రుతనిష్క్రయస్య - విద్యా మూల్యము, అల్పేతరత్వాత్ - కొంచెము కానిదగుటవలన, సంప్రతి - ఈ సమయమున, ఉపరోద్ధుం - నిర్బంధ పెట్టుటకు, నాభ్యుత్సహే - ఇష్టపడను. గురువు చేత పదునాలుగు కోట్లు తెమ్మని కోరఁబడిన నేను, నన్ను పూజించుటకు తెచ్చిన మట్టి పాత్రచేతనే నీవు సర్వస్వమును వ్యయించి "ప్రభువు" అ న్న మా ట తో మాత్రమే మిగిలియున్నావని గ్రహించితిని. ఇట్టి సమయమున అత్యధికమైన ధనము కోసమై నిన్ను ఇబ్బంది పెట్టుట కిష్టపడుటలేదు.

శ్లో. ఇత్థం ద్విజేన ద్విజరాజకాంతి
రావేదితో వేదవిదాం వరేణ
ఏనో నివృత్తేంద్రియవృత్తి రేనం
జగాద భూయో జగదేకనాథః. 23

వ్యాఖ్య: ద్విజరాజ కాంతిః - చంద్రునియొక్క కాంతివంటి కాంతిగల వాఁడును, ఏనోనివృత్తేంద్రియ వృత్తిః—ఏనః - పాపమునుండి, నివృత్త - మరలిన, ఇంద్రియవృత్తిః - ఇంద్రియవ్యాపారము గలవాఁడును, జగదేకనాథః - లోకమునకేకైక ప్రభువునైన రఘుమహారాజు, వేదవిదాం, వరేణ - వేదవేత్తలలో శ్రేష్ఠుడైన, ద్విజేన - బ్రాహ్మణునిచేత (కౌత్సునిచేత), ఇత్థం - ఇట్లు (పూర్వమతఁడు చెప్పినరీతిగా), ఆవేదితః - విన్నవింపఁబడిన వాఁడగుచు, ఏనం - ఇతనిని గుఱించి, భూయః - మరల, జగాద - పలికెను. వచ్చినవాఁడు ద్విజుఁడు, తాను ద్విజరాజ కాంతిగలవాఁడు, చంద్రుఁడు ద్విజులకు రాజైనట్లు శ్రుతిప్రమాణము కలదు. ఏ విధమైన పాపస్పర్శలేని చిత్తవృత్తిగల రఘువు వేదవేత్తయైన యాచకుఁడు నిరాశతో వెనుకకు మరలుటను సహించునా? కనుక అతనితో మరల నీ క్రిందివిధముగా పలుకుచున్నాఁడు.

శ్లో. గుర్వ్వర్థ మర్థీ శ్రుతపారదృశ్వా
రఘోఃసకాశా దనవాప్య కామం
గతో వదాన్యాంతర మి త్యయం మే
మాభూత్ పరీవాదనవావతారః. 24

వ్యాఖ్య: శ్రుతపారదృశ్వా - శాస్త్రముల అంతమును చూచినవాఁడును' గుర్వర్థం - గురువుకొఱకు, అర్థీ - యాచకుఁడైన ఒకవ్యక్తి, రఘోఃసకాశాత్ - రఘువువద్దనుండి, కామం - కోరికను, అనవాప్య - పొందక, వదాన్యాంతరం - మఱియొక దాతనుగురించి, గతః -వెళ్లెను, ఇతి ఈ విధమైన, అయం - ఈ. పరీవాదనవావతారః—ప రీ వా ద - అపకీర్తియొక్క, నవావతారః - క్రొత్తపుట్టుక, మే - నాకు, మాభూత్ - లేకపోవుగాక. ఓ కౌత్సుడా! 'సకలశాస్త్ర పారంగతుఁడై గురుదక్షిణను యాచింపవచ్చిన' ఒక ద్విజుఁడు, రఘువువద్ద తన కోరికను పొందలేక మఱియొక దాతను యాచించుటకై వెళ్లెను.' అను క్రొత్త యపకీర్తి నాకు రాకుండునుగాక యని రఘుమహారాజు వేడుకొని, ఇంకను ఈ క్రింది రీతిగా పలికెను. అన్యః వదాన్యః - వదాన్యాంతరం; అన్యఃగ్రామః - గ్రామాంతరం. ఇట్టి విగ్రహములుగల ఈ పదములు అవ్యయీభావ సమాసములు. ఇచ్చట "రఘోః" అను స్వనామోచ్చారణము, తనవంటి సంభావితునికి అని సూచించుటకు

శ్లో. స త్వం ప్రథ స్తే మహితే మదీయే
వసం శ్చతుర్థోఽగ్ని రి వాగ్న్యగా రే,
దిత్రా ణ్యహో న్యర్హ్వా సి సోఢు మర్హ్వా న్
యా వ ద్యతే సాధయితుం త్వదర్థమ్. 25

వ్యాఖ్య: సఃత్వం - అట్టినీవు (పండితుఁడవై గురుదక్షిణార్థము వచ్చిన నీవు నాకు అవమానముఁ గూర్పదగవు కనుక), మహితే - పూజితమై, ప్రథ స్తే - ప్రసిద్ధమైన, మదీయే, అగ్న్యగారే - నాత్రేతాగ్నిశాల యందు, చతుర్థఃఅగ్నిఃఇవ - నాలుగవ అగ్నివలె, ద్విత్రాణి - రెండుమూడు, అహాని - దినములను, సోఢుం - సహించుటకు, అర్హ్వాసి - తగుదువు, హేఅర్హ్వాన్ - ఓ పూజ్యుఁడా! త్వదర్థం - నీవు కోరిన ధనమును, సాధయితుం - చేకూర్చుటకు, యావద్యతే

(యావత్ + యతే) - ప్రయత్నింపఁగలను. నీవు నిరాశచెంది మరియొక దాత వద్దకి వెళ్లితివను క్రొత్త యవమానమును నాకు కలిగింపక పవిత్రమైన నా యాగశాలయందు పవిత్రుఁడైన నాలుగవ యగ్నిహోత్రునివలె రెండుమూడు రోజులు నివసింపుము, నీ గురుద్రవ్యమును సంపాదించుటకు తప్పక ప్రయత్నింపఁగలనని రఘుమహారాజు కౌత్సమునితో ననెను. ద్వేత్రీణీవా - ద్విత్రాణి (రెండు మూడు), పంచషట్ వా పంచషాఃl (అయిదాఱు) అను విగ్రహములుగల బహువ్రీహి సమాసములు. త్రేతాగ్నులనగా యజ్ఞముచేసిన వ్యక్తి యింటిలో నిరంతరముగా మూడు కుండములలో నుండవలసిన మూడు అగ్నులు. వాటికి ఆహవనీయాగ్ని, దాక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని అనిపేర్లు. నీవు చతుర్థాగ్నిపలె మండు మనుటలో రఘుమహారాజుకు కౌత్సునిపైఁగల పవిత్రభావము వ్యక్తమగును.

శ్లో. తథేతి తస్యావితథం ప్రతీతఃl
ప్రత్యగ్రహీ త్సంగర మగ్రజన్మా,
గా మాత్తసారాం రఘు రప్యవేక్ష్యl
నిష్క్రష్టు మర్థం చకమే కుబేరాత్. 28

వ్యాఖ్య: అగ్రజన్మా - బ్రాహ్మణుఁడు (కౌత్సుడు), ప్రతీతఃl సన్ - సంతోషించినవాఁడగుచు, తస్య - ఆ రఘుమహారాజుయొక్క, అవితథం - అసత్యముకాని, సంగరం - ప్రతిజ్ఞను, తథేతి (తథా + ఇతి) - సరేయని, ప్రత్యగ్రహీత్ - ఒప్పుకొనెను, రఘురపి - రఘుమహారాజుకూడా, గాం - భూమిని, ఆత్తసారాం - అంతకుపూర్వమే గ్రహింపఁబడిన ధనము కలదానినిగా, అవేక్ష్య - చూచి, కుబేరాత్ - కుబేరునివలన, అర్థం - ధనమును, నిష్క్రష్టుం - బలాత్కారముగా తెచ్చుటకు, చకమే - తలంచెను. రఘువు సత్యప్రతిజ్ఞుఁడు కనుక అతని మాటను కౌత్సుఁడు సరేయని యంగీకరించెను. రఘుమహారాజుకూడా, తన రాజ్యమునుండి విశ్వజిద్యాగ సమయమునందే సర్వధనములను స్వీకరించియుండుటచేత నిప్పుడు నిస్సారమైనదానినిగా గ్రహించి, ధనపతియైన కుబేరుని వలన క్షత్రధర్మప్రకారము యుద్ధముప్రకటించి ధనమును తెచ్చుటకై తలంచెను. "సంగర" శబ్దమునకు "ప్రతిజ్ఞ, యుద్ధము, జ్ఞానము, ఆపద" అర్థములు. ఇచ్చటి సంగర శబ్దమునకు వాచ్యార్థము ప్రతిజ్ఞయైనను, అది రాఁబోవు యుద్ధప్రకటనమును సూచించును.

శ్లో. వసిష్ఠ మంత్రోక్షణ జాత్ ప్రభావాత్
ఉదన్వ దాకాశ మహీధరేషు.
మరుత్సఖ స్యేవ వలాహకస్య
గతి ర్విజఘ్నే న హి తద్రథస్య. 27

వ్యాఖ్య: వసిష్ఠ మంత్రోక్షణ జాత్ — వసిష్ఠ - వసిష్ఠ మహర్షియొక్క, మంత్రోక్షణ - మంత్రోచ్చారణముచే ప్రోక్షించుటవలన, జాత్ - కలిగిన, ప్రభావాత్ - సామర్థ్యముపలన, ఉదన్వ దాకాశ మహీధరేషు—(ఉదన్వత్ + ఆకాశ + మహీధరేషు) - సముద్రముల మీదను, ఆకాశమునందును, పర్వతములపైనను, మరుత్సఖస్య, వలాహకస్య, ఇవ - వాయుసహాయుఁడైన మేఘునియొక్క వలె, తద్రథస్య - ఆ రఘుమహారాజు రథముయొక్క, గతిః - గమనము (సంచారము), న, విజఘ్నె, హి - అకుంఠితమై యున్నది సుమా! వసిష్ఠమహాఋషి అభిమంత్రించి చల్లిన మంత్రోదకముల ప్రభావమువలన రఘుమహారాజు రథమునకు, వాయుసహితమైన మేఘమునకువలె, సముద్రముల మీదను, అంతరిక్షమునందును, పర్వతములపైనను అప్రతిహతమైన (అడ్డులేని) గమనము కలదుసుమా!

శ్లో. అథాధిశిశ్యే ప్రయతః ప్రదోషే
రథం రఘుః కల్పితశస్త్రగర్భం
సామంతసంభావన యైవ ధీరః
కైలాసనాథం తరసా జిగీషుః. 28

వ్యాఖ్య: అథ - పిమ్మట, ప్రదోషే - మునిమాపున, ధీరః - ధీరుఁడును, ప్రయతః - నియమ పరిశుద్ధుఁడునగు, రఘుః - రఘుమహారాజు, సామంత సంభావనయా, ఏవ - తనకు లొంగిపోగల సామాన్యరాజు అను తలంపు చేతనే, కైలాసనాథం - కైలాసపర్వత ప్రాంతాధిపతియగు కుబేరుని, తరసా - బలముచేత, జిగీషుః - జయింపఁ దలఁచిన వాడగుచు, కల్పిత శస్త్రగర్భం - సిద్ధపరుపఁబడిన యస్త్రములు లోన నుంచఁబడిన, రథం - రథమునందు, అధిశిశ్యే - ఎక్కి పరుండెను. (ఇచ్చటి రథం అను ద్వితీయకు సప్తమి అర్థము) దిక్పాలకుఁడైన కుబేరుఁడుగూడ ఒక సామాన్య సామంతరాజే అను భావనతో రఘుమహారాజతనిని బలముతో జయింప దలఁచి, శస్త్రాస్త్రములచేత యుద్ధమునకు సన్నద్ధ

పరుపఁబడిన రథముమీద ఆనాటి పూర్వరాత్రివేళ యెక్కిపరుండెను. రాజులు ప్రదోష సమయమున యానారోహణమును జేయవలయునిని శాస్త్రము. ఈవుఁడు కైలాసవాసిమాత్రమే. కైలాసమునకు కుబేరుఁడే అధిపతి. కనుక కైలాసనాథం అని ప్రయోగము.

శ్లో. ప్రీతః ప్రయాణాభిముఖాయ తస్మై
సవిస్మయాః కోశగృహే నియుక్తాః
హిరణ్మయీం కోశగృహస్య మధ్యే
వృష్టిం శశంసుః పతితాం నభస్తః 29

వ్యాఖ్య: ప్రీతః - ఆమరునాటి వేకువయందు, ప్రయాణాభిముఖాయ - బయలు దేరుటకు సిద్ధముగానున్న. తస్మై - అతనికొఱకు (ఆరఘుమహారాజుకు) కోశగృహే. నియుక్తాః - ధనాగారము నందలి యుద్యోగులు. సవిస్మయాః - ఆశ్చర్యముతో కూడిన వారగుచు, కోశగృహస్యమధ్యే - ధనాగారముయొక్క నడుమ, నభస్తః - అకాశమునుండి, పతితాం - పడిన, హిరణ్మయీం, వృష్టిం - సువర్ణ వృష్టిని, శశంసుః - తెలిపిరి. రథముపై నిద్రించి, వేకువజామున ప్రయాణమగుచున్న రఘుమహారాజు వద్దికి భాండాగార నియుక్తులైన ఉద్యోగులు వచ్చి, గతరాత్రి యందు ఆకాశమునుండి, ధనాగారగవాక్షముద్వారా, సువర్ణ వృష్టి కురిసినట్లుతెలిసిరి. మహాపరాక్రమవంతుఁడగు రఘుమహారాజు తనపై కి యుద్ధమునకు రానున్నాఁడని తెలిసి, భయపడి కుబేరుఁడు సువర్ణవృష్టిని గురుసించెనని భావము.

శ్లో. తం భూపతి ర్భాసురహేమరాశిం
లబ్ధం కుబేరా దభియాస్యమానాత్
దిదేశ కౌత్సాయ సమస్త మేవ
శృంగం సుమేరో రివ వజ్రభిన్నమ్. 30

వ్యాఖ్య: భూపతిః - రఘుమహారాజు. అభియాస్యమానాత్ - తానుదండెత్తి పోఁదలఁపబడినవాఁడగు, కుబేరాత్ - కుబేరునివలన, లబ్ధం - పొందఁబడినదియు, వజ్రభిన్నం - ఇంద్రుని వజ్రాయుధముచేత పగులగొట్టఁబడిన, సుమేరోః, శృంగమివ (స్థితం) - మేరు పర్వతముయొక్క శిఖరము వలెనున్నదియు నగు. తం,

భాసురహేమరాశిం - ఆప్రకాశించుచున్న బంగారపురాశిని, సమస్తమేవ - అంతటిని, కౌత్సాయ - కౌత్సమునికి, దిదేశ - ఇచ్చెను. తాను దండు వెడలనున్న కుబేరుఁడు స్వయముగా లొంగిపోయినట్లు సూచించుటకై కురిపించిన సువర్ణవృష్టివలన తనకు లభ్ధమైన బంగారము, ఇంద్రునివజ్రాయుధముచేత ఛేదింపబడినేలపైఁబడిన మేరు పర్వత శిఖరమువలెనుండెను. ఆసువర్ణ రాశినంతటిని రఘుమహారాజు కౌత్సమునికి ఇచ్చి వేసెను, అనఁగా పదునాలుగు కోట్లకంటె అధికముగా నిచ్చెనని భావము.

శ్లో. జనస్య సాకేతనివాసిన స్తౌ
ద్వా వప్యభూతా మభినంద్యసత్త్వౌ;
గురుప్రదేయాధికనిఃస్పృహోఽర్థీ
నృపోఽర్థికామా దధికప్రదశ్చ. 31

వ్యాఖ్య: తౌ, ద్వావపి - ఆయాచకుఁడు, ఆదాతయును, సాకేతనివాసినః - అయోధ్యానగరమందున్న, జనస్య - జనమునకు, అభినంద్యసత్త్వౌ - మెచ్చుకోఁదగినప్రయత్నములుగలవారు అభూతాం - అయిరి; అర్థీ - యాచకుఁడైన కౌత్సుడు గురుప్రదేయాధికనిస్పృహః - గురుప్రదేయాధిక - గురువుగారి కీయవలసిన దానికంటె అధికమైన ధనమునందు, నిస్పృహః - కోరికలేనివాడును ; నృపః - రఘుమహారాజు, అర్థికామాత్ - యాచకుని కోరికకంటె, అధికప్రదశ్చ - ఎక్కువగాఇచ్చువాఁడును, మహారాఁగా వచ్చిపడిన బంగారమునంతటిని గొని పొమ్మని రఘుమహారాజును, మాగురువుగారి కీయవలసిన పదునాలుగు గోట్ల ధనము కంటె ఎక్కువనాకక్కఅలేదని కౌత్సుఁడును పలుకుచు నొకరి నొకరు ఒప్పించుటకు వారు చేయుచున్న ప్రయత్నమువలన ఆదాత, ఆయాచకుడు, ఇద్దఱును సాకేత నగర వాసులగు ప్రజలకు మెచ్చుకోఁదగిన వారైయుండిరి. ఇద్దఱిని జనము మెచ్చుకొనిరనిభావము. 'సత్త్వ' శబ్దమునకు ద్రవ్యము, ప్రాణము, వ్యవసాయము (ప్రయత్నము), జంతువు, అర్థములు.

శ్లో. అథోష్ట్రవామీ శత వాహితార్థం
ప్రజేశ్వరం ప్రీతమనా మహర్షిః
ప్రత్యర్పయన్ కరే ణానతపూర్వకాయం
సంప్రస్థితో వాచ మువాచ కౌత్సః. 32

వ్యాఖ్య: అథ - ఎట్లో ఒప్పించి ధనమంతయు నిచ్చినపిమ్మట, ప్రీతమనాః - సంతోషించిన మనస్సుగల, మహర్షిః - కౌత్సుడు, సంప్రస్థితః - బయలుదేరగల వాడగుచు, ఉష్ట్రి వామీ శతవాహితార్థం—ఉష్ట్రి - ఒంటెలయొక్కయు, వామీ - ఆడుగుట్టములయొక్కయు, శత - శతములచేత, వాహిత - మోయింపబడిన, అర్థం - ధనముగలవాడును, ఆనతపూర్వకాయం - వినయ - వినమ్రశరీరము గలవాడును నగు, ప్రజేశ్వరం - రఘుమహారాజును, కరేణ హస్తముచేత, స్పృశన్ - తాకుచు, వాచం - మాటను, ఉవాచ - పలికెను. ఎట్టకేలకు కౌత్సుని అంగీకరింపజేసి రఘుమహారాజు ధనము నంతటిని ఒంటెలమీదను, ఆడుగుట్టములమీదను వేయించెను. దానిని గ్రహించి వెళ్లబోవుచున్న కౌత్సుని పాదములపైవంగి నమస్కరించుచున్న రఘువును చేతితో స్పృశించుచు కౌత్సుడు ఇట్లు పలికెను.

శ్లో. కిమత్ర చిత్రం యది కామసూ ర్భూః
వృత్తే స్థిత స్యాధిపతేః ప్రజానామ్
అచింతనీయస్తు తవ ప్రభావో
మనీషితం ద్యౌ రపి యేన దుగ్ధా. 33

వ్యాఖ్య: వృత్తే - చతుర్విధమైన రాజవృత్తమునందు (నడవడియందు), స్థితస్య - ఉన్నట్టి, ప్రజానాం,అధిపతేః - రాజునకు, భూః - భూమి, కామసూః యది - కోరికల నిచ్చునది యగునన్నచో, అత్ర,కిం,చిత్రం - ఈవిషయమునందాశ్చర్యమేమున్నది ? కింతు - కాని, యేన - ఏనీచేత, ద్యౌరపి - స్వర్గము గూడా మనీషితం - కోరికను, దుగ్ధా - పితుకబడినదో, తవ అట్టి నీయొక్క, ప్రభావః తు - మహిమమాత్రము, అచింతనీయః - ఊహింపరానిది. చక్కని ప్రవర్తనగల రాజునకు భూమి కోరికల నిచ్చుటలో అశ్చర్యములేదు. కాని స్వర్గము నుండి కూడ కోరికలను దీర్చుకోగలిగిన నీ ప్రభావము అద్భుతముగా నున్నది. "న్యాయే నార్జన మర్థస్య వర్ధనం పాలనం తథా: సత్పాత్రే పతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్" అనుకామందక నీతిసారము ననుసరించి, న్యాయమార్గమున ధనము నార్జించుట, దానిని వృద్ధిపరచుట, రక్షించుట, తగిన వారికి దానమిచ్చుట యనునవి నాలుగును రాజవృత్తములు. అట్లు చేయు రాజుకు ధనలోప ముండదు.

శ్లో. ఆశాస్య మన్యత్ పునరుక్తభూతం
శ్రేయాంసి సర్వా ణ్యధిజగ్ముష స్తే
పుత్రం లభ స్వాత్మగుణానురూపం
భవంత మిడ్యం భవతః పితేవ. 34

వ్యాఖ్య: సర్వాణి. శ్రేయాంసి - సమస్తమ లైన శ్రేయస్సులను, అధిజగ్ముషః - పొందియున్నట్టి. తే - నీకు, అన్యత్ - మఱియొక, ఆశాస్యం - ఆశీర్వచన సాధ్యమగునది, పునరుక్త భూతం - అన్నదే మఱల యనుటవంటిది, కింతు- అయితే, ఈడ్యం - స్తుతి పాత్రుఁడవైన, భవంతం - నిన్ను, భవతః - నీ యొక్క, పితేవ - తండ్రివలె, ఆత్మగూణానురూపం - నీగుణములకు తగినవాఁడ గు(నీతో సమానుఁడగు) పుత్రం - కుమారుని, లభస్వ - పొందుము, రథగజతు రగాది సమస్త సంపదలు గల నీకు ఆశీర్వచనముతో నే వస్తువును కోరినను అది పునరుక్తమై కలిగియున్న వస్తువే మరల కలుగుగాక యని దీవించినట్లగును. కనుక స్తుతి యోగ్యుఁడవైన నిన్ను నీతండ్రి కన్నట్లు, నీవును నీవంటి సద్గుణముచా గల కుమారునిఁ గనుము అని కౌత్సుఁడు ఆశీర్వదించెను.

శ్లో. ఇత్థం ప్రయు జ్యాశిష మగ్రజన్మా
రాజ్ఞే ప్రతీయాయ గురోః సకాశమ్
రాజాపి లేభే సుత మాశు తస్మాత్
ఆలోక మర్కా దివ జీవలోకః. 35

వ్యాఖ్య: అగ్రజన్మా - బ్రాహ్మణుఁడైన కౌత్సుఁడు, ఇత్థం - ఈవిధముగా రాజ్ఞే - రాజుకు. అశిషం - ఆశీర్వచనమును, ప్రయుజ్య - ఇచ్చి, గురోః, సకాశమ్ - తన గురువు వద్దకి, ప్రతీయాయ (పతి + ఇయాయ) - తిరిగి వెళ్లెను. రాజాపి - రఘుమహారాజు కూడ, జీవలోకః - ప్రాణిసమూహము, అర్కాత్ - సూర్యునివలన, ఆలోకం, ఇవ - వెలుతురును వలె, తస్మాత్ - అకౌత్స ముని యాశీర్వచనము వలన, ఆశు - శీఘ్రకాలము నందే, సుతం - కుమారుని, లేభే - పొందెను. "నీవు సద్గుణవంతుఁడవైనట్లు నీవంటి కుమారుని కనుము." అని యాశీర్వదించి కౌత్సుఁడు గురువగు వరతంతు మహర్షి యాశ్రమమునకుఁ దిరిగి వెళ్లిపోయెను. రఘుమహారాజుకూడ, సూర్యునివలన జీవలోకము వెలుతురును

పొందినట్లు ఆముని దీవెనవలన శీఘ్రముగానే పుత్రునిఁగనెను. పుత్ర దర్శనము లేకుండుట మానవునికి అంధకారమనియు, కుమారోదయము జీవితమునకు వెలుతురనియు భావము,

శ్లో. బ్రాహ్మే ముహూర్తే కిల తస్య దేవీ
కుమారకల్పం సుషువే కుమారం
అతః పితా బ్రహ్మణ ఏవ నామ్నా
త మాత్మజన్మానమజం చకార. 36

వ్యాఖ్య : తస్య - ఆరఘుమహారాజుయొక్క, దేవీ - భార్య, బ్రాహ్మే - బ్రహ్మ అధి దేవతగాఁగల, ముహూర్తే - ముహూర్తమునందు, కుమారకల్పం - కుమారస్వామితో సమానుఁడైన, కుమారం - పుత్రుని, సుషువేకిల - కనెనట అతః - బ్రాహ్మముహూర్తాన పుట్టినందున, పితా - తండ్రియగు రఘువు బ్రహ్మణ ఏవనామ్నా - బ్రహ్మ పేరుతోనే, తం, ఆత్మజన్మానం - అకుమారుని, అజం - అజుఁడను పేరుగలవానిని, చకార - చేసెను, రఘుమహారాజు పట్టపురాణి ఒక, నాటిబ్రాహ్మముహూర్తనందు కుమారస్వామి వంటి పుత్రునిప్రసవించెను, బ్రహ్మకు 'అజః' అనునది పర్యాయ పదము కనుక ముహూర్తము ననుసరించి, రఘు మహారాజు పుత్రునికి 'అజః' (అజుఁడు) అని నామకరణము చేసెను, 'బ్రాహ్మే ముహూర్తే' అనుదానికి మల్లినాథ వ్యాఖ్య బొంబాయి ప్రతిలో అభిజిన్ముహూర్తే అని యుండగా, వేదము వేంకటరాయశాస్త్రిగారి ప్రతిలో "అజనామకే ముహూర్తే" అని యున్నది. 'అభిజిత్' అను ముహూర్తమునకు బ్రహ్మ అధిపతియని జ్యోతిష గ్రంథములు చెప్పుచున్నని. "అజచరణ" మను నొక ముహూర్తము కలదు, కాని అది బ్రహ్మ దేవతాకము కాదు. కనుక అభిజిత్తనుట మేలు.

శ్లో. రూపం తదోజస్వి తదేవ వీర్యం
తదేవ నైసర్గిక మున్నతత్వం
న కారణాత్ స్మాత్ బిభిదే కుమారః
ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్. 37

వ్యాఖ్య : ఓజస్వి - తేజస్సుగల, రూపం - దేహము, తదేవ - అదియే, (రఘుమహారాజుదే); వీర్యం - శౌర్యము, తదేవ - అదియే; నైసర్గికం - స్వభావ

సిద్ధమైన, ఉన్నతత్వం - ఎత్తు, తదేవ - అదియే; కుమారః - బాలుఁడు(అజుఁడు) ప్రవర్తితః - వెలిగింపబడిన, దీపః - దీపము, ప్రదీపాత్ ఇవ - తనను వెలిగించిన పెద్ద దీపమునుండిపలె, స్వాత్, కారణాత్ - తన పుట్టుకకు కారణమైన రఘుమహారాజు కంటె, నబిభిదే - భేదమును పొందలేదు, ఒక పెద్ద దీపమునుండి వెలిగింపబడిన చిన్న దీపము రూపకాంతులలో నెట్లు ఒకే మాదిరిగా నుండునో, అట్లే పుట్టిన పిల్లవాడు రూప వీర్యాదుల యందు అచ్చముగా రఘుమహారాజును పోలి యుండెనని భావము.

శ్లో. ఉపాత్తవిద్యం విధివత్ గురుభ్యః
తం యౌవనోద్భేద విశేష కాంతం
శ్రీః సాభిలాషా ఒపి గురో రనుజ్ఞాం
ధీరేవ కన్యా పితు రాచకాంక్ష. 38

వ్యాఖ్య: గురుభ్యః - గురువుల వలన, విధివత్ - శాస్త్రప్రకారముగా, ఉపాత్తవిద్యం - పొందఁబడిన విద్యలు కలవాఁడును, యౌవనోద్భేధవిశేషకాంతం -యౌవనోద్భేద - యౌవనము వచ్చుటవలన, విశేషకాంతం - మిక్కిలి మనోహరుఁడైయున్న, తం - ఆయజుని గుఱించి, సాభిలాషా,అపి - కోరిక గలదియేయైనను, శ్రీః - రాజ్యలక్ష్మి, ధీరా - స్థిరము, ఉన్నతమునైన చిత్తముగల, కన్యా - కన్య, పితుఃఇవ - తండ్రియొక్కవలె, గురోః - పెద్దవాఁడైన రఘువు యొక్క, అనుజ్ఞాం - అనుమతిని, ఆచకాంక్ష - కోరెను. చక్కగా విద్యలునేర్చుకొని, యౌవనావిర్భావముచేత మిక్కిలి యందగాఁడైయున్న అజునిఁ జేరుటకు రాజ్యలక్ష్మి యువిళ్లూరుచున్నను, హృదయమును చిక్కబట్టుకోఁగల యొకా నొక కన్య తండ్రి యాజ్ఞకెదురు చూచుచున్నట్లు, రఘుమహారాజు సమ్మతికై ప్రతీక్షించుచుండెను. యుక్తవయస్కుఁడైన యజునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయు ప్రయత్నములు జరుగుచుండెనని భావము.

శ్లో. అథేశ్వరేణ క్రథకైశికానాం
స్వయంవరార్థం స్వసు రిందుమత్యాః,
ఆప్తైః కుమారానయనోత్సుకేన
భోజేన దూతో రఘవే విసృష్టః. 39

వ్యాఖ్య: అథ - తర్వాత, స్వసుః, ఇందుమత్యాః - చెల్లెలయిన యిందుమతి యొక్క, స్వయంవరార్థం - స్వయంవరముకొఱకు, కుమారానయనోత్సుకేన — కుమార - అజునియొక్క, ఆనయన - రప్పించుటయందు, ఉత్సుకేన - కుతూహలముగల, క్రథ కైశికానాం. ఈశ్వరేణ - విదర్భ దేశమునకు రాజైన, భోజేన - భోజునిచేత, ఆప్తః - హితుఁడైన, దూతః - దూత, రఘవే - రఘుమహారాజు కొఱకు (వద్దకి), విసృష్టః - పంపఁబడెను. అజునికి మంచి యౌవనదశ వచ్చిన సమయమున, విదర్భదేశపు రాజైన భోజుఁడు తన చెల్లెలగు ఇందుమతికి స్వయంవరోత్సవము ప్రకటించి. ఆప్తుఁడైన యొకదూతద్వారా కుమారుఁడైన యజునిఁ బంపవలసినదిగా రఘుమహారాజును వేడెను.

శ్లో. తం శ్లాఘ్యసంబంధ మసౌ విచింత్య
దారక్రియా యోగ్యదశం చ పుత్రమ్
ప్రస్థాపయామాస ససైన్య మేన
మృద్ధాం విదర్భాధిపరాజధానీమ్. 40

వ్యాఖ్య: అసౌ - ఇతఁడు (రఘుమహారాజు), తం - ఆ భోజుని, శ్లాఘ్య సంబంధం - మెచ్చుకోఁదగిన బాంధవ్యము గలవానిగాను, పుత్రం చ - కుమారుని గూడ, దారక్రియా యోగ్యదశం — దారక్రియా - వివాహమునకు, యోగ్యదశం - తగినవయస్సు కలవానినిగాను, విచింత్య - ఆలోచించి, ససైన్యంఏనం - సైన్య సమేతుఁడైన పుత్రుని, ఋద్ధాం - సర్వ సమృద్ధమైన, విదర్భాధిపరాజధానీం - భోజునియొక్క రాజధానిని గుఱించి, ప్రస్థాపయామాస - పయనము చేయించెను (పంపెను). భోజునిదూత ఇందుమతి స్వయంవర విషయమును జెప్పగానే రఘుమహారాజు, భోజుని చుట్టఱికము మంచిదైయుండుటను, కుమారునికి వివాహయోగ్యమైన వయస్సు వచ్చియుండుటను అలోచించి, సైన్యసమేతముగా అజుని పంపించెను. రాజధానీ శబ్దమునకు, "ధీయతే అస్యాం ఇతిధానీ. రాజ్ఞాం ధానీ రాజధానీ" అని విగ్రహము చెప్పవలెను.

శ్లో. త స్యోపకార్యారచితోపచారా
వన్యేతరా జానవదోపదాభిః
మార్గే నివాసా మనుజేంద్రసూనోః
బభూవు రుద్యానవిహారకల్పాః 41

వ్యాఖ్య: ఉపకార్యారచితోపచారాః—ఉపకార్యా - డేరాలయందు, రచిత-చేకూర్చఁబడిన, ఉపచారాః - పరుపు మొదలయిన వస్తువులు గలవియు, జానపదోపదాభిః—జానపద - పల్లెలనుండి వచ్చినవారియొక్క (వారుతెచ్చిన), ఉపదాభిః - కానుకలచేతను, వన్యేతరాః - వనమునందలివి కానట్లున్న, తస్య, మనుజేంద్ర సూనోః - ఆ రాజకుమారునియొక్క, మార్గే, నివాసాః - మార్గమునందలి మజిలీలు, ఉద్యాన విహారకల్పాః - ఇంచుమించుగా ఉపవన విహారములవంటివి, బభూవుః - అయినవి. దారిలో డేరాలువేసి, అందులో శయనాదులను సమకూర్చి, జానపదులు ఉపాయనములుగా తెచ్చిన వస్తువుల నచ్చట నుంచుటచేత, ఆజుని వాసనికములు (మజిలీలు) ఉద్యాన విహారములుగా నుండెనేకాని యడవిలోని విడుదులవలె నుండలేదని భావము.

శ్లో. స నర్మదారోధసి శీకరార్ద్రైః
మరుద్భి రానర్తితనక్తమాలే
నివేశయామాస విలంఘితాధ్వా
క్లాంతం రజోధూసరకేతు సైన్యమ్. 42

వ్యాఖ్య; విలంఘితాధ్వా - అతిక్రమింపఁబడిన మార్గముగల, సః - ఆ యజుఁడు, శీకరార్ద్రైః - నీటి తుంపురులచేత తడిసిన మరుద్భిః - వాయువులచేత. అనర్తిత నక్తమాలే—అనర్తిత - కదలింపఁబడిన, నక్తమాలే - క్రానుగుచెట్లుగల, నర్మదారోధసి - నర్మదానది యొడ్డున, క్లాంతం - అలసినదియు, రజోధూసరకేతు - దుమ్ముతో కప్పబడిన జెండాలు కలదియునగు, సైన్యం - సేనను, నివేశయామాస - విడిది చేయించెను, చాలామార్గము దాటి వచ్చినపిమ్మట బడలినదియు, దుమ్ముతోఁ బూడిదవర్ణములై పోయిన జండాలతో నున్నదియు నగు తన సైన్యమును, అజుఁడు చల్లని నీటి తుంపురులతో వచ్చుచు మెల్లగా క్రానుగు చెట్లను కదలించుచున్న మంద మారుతములుగల నర్మదావది యొడ్డున విశ్రమించుట కాజ్ఞనిచ్చెను. క్రానుగుచెట్లు దట్టమైన నీడను, చల్లదనమును ఇచ్చును.

శ్లో. ఆథోపరిష్టాత్ భ్రమరైః భ్రమద్భిః
ప్రాక్సూచితాంతః సలిల ప్రవేశః

నిర్ధౌత దానామల గండభిత్తిః
వన్యః సరిత్తో గజ ఉన్మమజ్జ. 43

వ్యాఖ్య: అథ - అట్లు విడిసిన పిమ్మట, ఉపరిష్టాత్ - నీటి పైభాగమున, భ్రమద్భిః - వర్తులముగా దిరుగుచున్న, భ్రమరైః - తుమ్మెదలచేత, ప్రాక్సూచితాంత స్సలిల ప్రవేశః—ప్రాక్ - ముందుగా, సూచిత - తెలుపబడిన, అంత స్సలిల - నీటిలోని, ప్రవేశః - ప్రవేశముగలదియు, నిర్ధౌతదానామలగండభిత్తిః—నిర్ధౌత - కడిగి వేయబడిన, దాన - మదస్రావముగలవి యగుటచేత, అమల - నిర్మలములైన, గండభిత్తిః - ప్రశస్తములైన గండస్థలములు గలదియు నగు, వన్యఃగజః అడవియేనుగు, సరిత్తః నర్మదానదిలో నుండి, ఉన్మమజ్జ - పైకిలేచెను. అజుడట్లు సైన్యసమేతుడై నర్మదానదీతీరమునందు విడిసిన పిమ్మట, ఆ నదిలో, మొదట, తిరుగుచున్న తుమ్మెదలతో తాను ముందే నీటిలో మునిగి యున్నట్లు సూచించి, కడిగివేయబడిన మదస్రావముగల పెద్ద గండస్థలములతో నొక యడవియేనుగు నదీజలమునుండి పైకిలేచెను ఇచ్చటి 'భిత్తి' శబ్దము గోడ అనునర్థము నందుకాక ప్రశస్తమైన అనునర్థమునఁ బ్రయోగింపబడినది. "మత్తల్లి కోద్ధుమిశ్రాః స్యుః ప్రకాండ స్థలభిత్తయః" అని గణరత్న మహోదధి.

శ్లో. నిశ్శేషవిక్షాళితధాతునా ఽపి
వప్రక్రియా మృత్తువత స్తటేషు
నీలోర్ధ్వరేఖాశబలేన శంసన్
దంతద్వయే నాళ్మవికుంఠితేన. 44

శ్లో. పంవారవిశ్రేవలఘుక్రియేణ
హస్తేన తీరాభిముఖః సశబ్దమ్,
బభౌ స భిందన్ బృహత స్తరంగాన్
వార్వ్యర్గలాభంగ ఇవ ప్రవృత్తః. (యుగ్మం) 45

వ్యాఖ్య: నిశ్శేషవిక్షాళితధాతునా, అపి—నిశ్శేష - పూర్తిగా. విక్షాళిత - కడిగివేయబడిన. ధాతునాపి - గైరికాది ధాతువులుగలది యైనను, నీలోర్ధ్వరేఖాశబలేన—నీల - నల్లనివియైన, ఊర్ధ్వరేఖా - పైకిఁ గనవడు గీటులచేత, శబలేన -

చిత్రవర్ణము గలిగినట్టియును, అశ్మవికుంఠితేన - పాషాణములచేత మొక్కలు పోయిన, దంతద్వయేన - రెండు దంతములచేత, ఋక్షవతః - ఋక్షవంతమను పేరుగల యచ్చటి పర్వతముయొక్క, తటేషు - చటియలయందు, వప్రక్రియాం-తాను ఆడిన ఉత్ఖాతకేళిని (చెలగాటమును), శంసన్ - సూచించుచును, సంహార విక్షేపలఘుక్రియేణ—సంహార - ముడుచుకొనుటయందును, విక్షేప - చూచుట యందును, లఘుక్రియేణ - వేగమైన చలనముగల, హస్తేన - తొండముచేత, సశబ్దం - ఘీంకార యుక్తముగా, బృహతః, తరంగాన్ - పెద్ద పెద్ద యలలను, భిందన్ - చెదరగొట్టుచు, తీరాభిముఖః, సః - ఒడ్డున కెదురుగా నిలుచున్న ఆ యడవియేనుఁగు, వార్యర్గలాభంగే—వారీ - గజబంధనియగు, అర్గలా - గొలుసు యొక్క, భంగే - తెగిన సందర్భమునందు, ప్రవృత్తః ఇవ - ముందుకు రాఁబోవు నదివలె, బభౌ - ప్రకాశించెను. నర్మదానదిలో యథేష్టముగా నీదుటచేత దంతముల కంటుకొనిన గిరికాది ధాతువులు కడుగబడి యున్నను, ఋక్షవత్పర్వత పాషాణము లను గోరాడుటచేత రెండు దంతములమీదను నల్లనిచారలుకలిగి, శీఘ్రగతిని తొండ మును ముడుచుకొనుచు, చాచుచు, తాను నిలుచుండి కదలుటచేత దగ్గఱికివచ్చిన పెద్ద పెద్ద యలలను జెదరఁగొట్టుచు, కాలి గొలుసు తెగినదానివలె తీరమును జూచుచు వా యరణ్య గజము ప్రకాశించెను. (నిలుచుని తీరస్థులను జూచెను).

శ్లో. శైలోపమఃశైవలమంజరీణాం
జాలాని కర్ష న్నురసా సపశ్చాత్
పూర్వం తదుత్పీడిత వారిరాశిః
సరిత్ప్రవాహా స్తట ముత్ససర్ప. 46

వ్యాఖ్య: శైలోపమః - పర్వతముతో సమానమగు, సః - ఆ గజము, శైవలమంజరీణాం - నాచుతీగల చుట్టలయొక్క, జాలాని - మొత్తములను, ఉరసా - వక్షస్థలముచేత, కర్షన్ - లాగుచు, పశ్చాత్ - తర్వాత, తటం - ఒడ్డును. ఉత్ససర్ప - ఎక్కివచ్చెను, పూర్వం - ఆ ఏనుగుకంటే ముందు, తదు త్పీడిత వారరాశిః—తదుత్పీడిత - ఆ ఏనుగుచేత పైకి త్రోయబడిన, వారరాశిః - జలసమూహముగల, సరిత్ప్రవాహః - నదీప్రవాహము, తటం - తీరమును, ఉత్స సర్ప - ఎక్కివచ్చెను. ఉన్నతమైన ఆయడవియేనుఁగు తీరమునకు నెక్కినప్పుడు

ముందుగా దానిచే త్రోయఁబడిన నదీజలము, పిమ్మట వశిష్ఠలముచేత నాచుతీగలను లాగుకొని వచ్చుచున్న తానును, ఒడ్డును జేరినవి.

శ్లో. తస్యైకనాగస్య కపోలభిత్త్యోః
జలావగాహ క్షణమాత్ర శాంతా,
వన్యేతరానేకప దర్శనేన
పున ర్దిదీపేమదదుర్దినశ్రీః • 47

వ్యాఖ్య: తస్య, ఏకనాగస్య - అద్వితీయమైన ఆ యేనుఁగుయొక్క, కపోల భిత్త్యోః - విశాలమైన గండస్థలములయందు, జలావగాహక్షణ మాత్ర శాంతా — జలావగాహ - నీటిలో మునుగుటచేత, క్షణమాత్ర - క్షణకాలము మాత్రము, శాంతా - తగ్గిపోయిన, మదదుర్దినశ్రీః - ఎదతెగక స్రవించు మద సంపద, వన్యేతరానేకపదర్శనేన—వన్యేతర - అడవియందలివికాని, అనేకప - ఏనుగులయొక్క, దర్శనేన - దర్శనముచేత, పునః - మరల, దిదీపే - ప్రకాశించెను (వృద్ధిపొందెను). మహోన్నతమైన యా గజముయొక్క గండస్థలములమీద స్రవించు మదజలము నీటిలో మునుగుటచేత క్షణకాలము శాంతించినను, నగరముల నుండి వచ్చిన సైన్యగజములను జూచుటచేత మరల మదోదకము స్రవించుట కారంభించెనని భావము. "అనేకప" అనగా ద్విపము, రెండుసాధనములతో (తొండముతోను నోటితోను) నీళ్లుత్రాగునది యని వ్యుత్పత్తి.

శ్లో. సప్తచ్ఛద క్షీర కటుప్రవాహా
మసహ్యా మాఘ్రాయ మదం తదీయమ్,
విలంఘి తాధోరణ తీవ్రయత్నాః
సేనాగజేంద్రా విముఖా బభూవుః. 48

వ్యాఖ్య: సప్తచ్ఛద క్షీరకటుప్రవాహ—సప్తచ్ఛద - ఏడాకుల యరఁటి చెట్లయొక్క, క్షీర - పాలవలె, కటుప్రవాహం - పరిమళవంతమైన యోడిక గలదియును, అసహ్యా - వెగటుగానున్న, తదీయ, మదం - ఆ యడవి యేనుఁగు మదమును, ఆఘ్రాయ - వాసనచూచి, సేనా గజేంద్రాః - సైన్యమునందలి పెద్ద యేనుఁగులు, విలంఘితాధోరణతీవ్రయత్నాః—విలంఘిత - అతిక్రమింపఁబడిన,

ఆధోరణ - మావటివాండ్రయొక్క, తీవ్రయత్నాః దృఢ ప్రయత్నములు గలవి యగుచు విముఖాః వెనుకకు మొగములు పెట్టినవి, బభూవుః - అయినవి. ఏడాకుల యరటి పాలవంటి పరిమళము గలిగి, వెగటుగానున్న ఆ యరణ్యగజ మదమును వాసనబట్టిన సైన్యగజములు, మావటివాండ్రెంత ప్రయత్నించినను ఆగకయింటిమొగముపట్టి పారిపోవుచుండెనని భావము. 'కటు' శబ్దమునకు పాధారణముగా కారము అని యర్థము. ఇచ్చట పరిమళముగలయను నర్థమునఁ బ్రయోగింపఁ బడినది. "కటుతిక్త కషాయాస్తు సౌరభ్యేఽపి ప్రకీర్తితాఃఁ" అని యాదవనిఘంటువు.

శ్లో. స చ్ఛిన్నబంధ ద్రుత యుగ్యశూన్యం
భగ్నాక్ష పర్యస్త రథం క్షణేన
రామా పరిత్రాణ విహస్త యోధం
సేనానివేశం తుములం చకార, 49

వ్యాఖ్య: సఃఁ - ఆ యేనుఁగు, ఛిన్నబంధద్రుతయుగ్యశూన్యం — ఛిన్న బంధ - త్రెంచబడిన పగ్గములు కలవియై, ద్రుత - పరుగెత్తిపోయిన, యుగ్య - గుఱ్ఱములు కలవి గనుకనే, శూన్యం - శూన్యమైనదియును, భగ్నాక్ష పర్యస్త రథం - విరిగిన యిరుసులతో పడిపోయిన రథములు కలదియును, రామా పరిత్రాణ విహస్తయోధం—రామాపరిత్రాణ - స్త్రీలయొక్క రక్షణమునందు, విహస్త యోధం - వ్యాకులవడుచున్న భటులు కలదియునునగు, సేనానివేశం - శిబిరమును, క్షణేన - క్షణకాలమున, తుములం - చెల్లాచెదరైపోయిన దానినిగా, చకార - చేసెను. ఆ యేనుగు తీరమును జేరగానే, గుఱ్ఱములు భయపడి పగ్గములు త్రెంచుకొని పరుగెత్తుటలో ఇరుసులు విరిగి పడిపోయిన రథములు, స్త్రీలను గాపాడుటలో నిట్టునట్టు పరుగెత్తు యోధులు మొదలగువాని కలకలముతో నజుని శిబిరమంతయు నస్తవ్యస్త మైపోయెనని భావము. "విహస్త వ్యాకులౌ సమౌ" అని యమరము. కనుక 'విహస్త' శబ్దమునకు వ్యాకులపడిన అనియర్థము.

శ్లో. త మాపతంతం నృపతే రవధ్యో
వన్యః కరీతి శ్రుతవాన్ కుమారః

నివర్తయిష్యన్ విశిఖేన కుంభే
జఘాన నాత్యాయత కృష్ట శార్ఙ్గః. 50

వ్యాఖ్య: నృపతేః - రాజునకు, వన్యః, కరీ - అడవియేనుఁగు, అవధ్యః- చంపకూడనిది, ఇతి - అని, శ్రుతవాన్ - వినియున్న, కుమారః - అజుఁడు, ఆపతంతం, తం - వచ్చిపడుచున్న ఆ యేనుఁగును, వివర్తయిష్యన్ - వెనుకకు మాత్రము మరలింపగలవాఁడై, నాత్యాయత కృష్టశార్ఙ్గః—నాత్యాయత - అంత యెక్కువగాకాని యట్లు, కృష్ట - లాగబడిన, శార్ఙ్గః - ధనుస్సుగలవాఁడై. విశిఖేన - బాణముచేత, కుంభే - కుంభస్థలముమీద, జఘాన - కొట్టెను. "యుద్ధమునందు తప్ప ఇతరత్ర రాజు ఏనుఁగును చంపరాదు" అను శాస్త్ర వచనమును విన్న యజుఁడు, ఆ యడవియేనుగును చంపక వెనుకకుమాత్రము మరల్పదలచినవాఁడై కొద్దిగా లాగబడిన ధనుస్సుగల బాణముచేత దాని కుంభస్థలముమీద కొట్టెను. "లక్ష్మీకామో యుద్ధాదన్యత్ర కరివధం న కుర్యాత్, ఇయం హి శ్రీర్యేకరిణః" అని ధర్మశాస్త్ర వచనము. అందుకే 'వన్యః' అను విశేషణము.

శ్లో. స విద్ధమాత్రః కిల నాగరూప
ముత్సృజ్య తద్విస్మితసైన్య దృష్టః
స్ఫురత్ప్రభా మండల మధ్య వర్తి
కాంతం వపు ర్వ్యోమచరం ప్రపేదే. 51

వ్యాఖ్య: సః - ఆ యేనుఁగు, విద్ధమాత్రఃకిల - బాణముచే గ్రుచ్చబడినంతలోనే, నాగరూపం - గజశరీరమును, ఉత్సృజ్య - విడిచి, తద్విస్మితసైన్య దృష్టః (సన్)—తత్ - ఆ సంఘటనచేత, విస్మిత - ఆశ్చర్యపడిన, సైన్య - సైన్యముచేత, దృష్టఃసన్ - చూడఁబడుచున్న దగుచు, స్ఫురత్ప్రభా మండల మధ్యవర్తి—స్ఫురత్ప్రభా మండల - ప్రకాశించుచున్న కాంతిమండలముయొక్క మధ్యవర్తి - నడుమనున్నదియు, కాంత - మనోహరమైనదియు, వ్యోమచరం- ఆకాశమున సంచరించుచున్న, వపుః - దేహమును, ప్రపేదే - పొందెను. అజుఁడు కొద్దిపాటి దెబ్బతగులునట్లు విడిచినబాణము క్రుచ్చుకొన్నంతలోనే ఆ గజము గజ శరీరమునువిడిచి, సైనికులందఱును ఆశ్చర్యచకితులై చూచుచుండగా మండలాకారమైన కాంతిపుంజమునడుమ ఆకాశముపై మనోహరమగు గంధర్వ రూపమును ధరించెను.

శ్లో. అథ ప్రభావోపనతైః కుమారం
కల్పద్రుమోత్థైరవకీర్య పుష్పైః
ఉవాచ వాగ్మీ దశనప్రభాభిః
సంవర్ధితోరస్థలతారహారః. 52

వ్యాఖ్య: అథ - తర్వాత. ప్రభావోపనతైః - తన ప్రభావముచేత సమీపమునకుపచ్చిన, కల్పద్రుమోత్థైః, పుష్పైః - కల్పవృక్ష పుష్పములచేత, కుమారం - అజుని, అవకీర్య - చల్లి (అజునిపై పుష్పములుచల్లి) దశన ప్రభాభిః - దంతకాంతులచేత, సంవర్ధితోరస్థల తారహారః—సంవర్ధిత - ఎక్కువ కాంతి గలదిగా జేయబడిన, ఉరస్థల - వక్షస్థలముమీది, తారహారః - పెద్ద ముత్తెముల దండగలవాడును. వాగ్మీ - వక్తయునగు పురుషుడు, ఉవాచ - పలికెను. ఆ గజము దివ్యపురుషరూపమును ధరించినపిమ్మట. ఆ పురుషుడు తన మహిమ చేతవచ్చిన కల్పవృక్ష పుష్పములను అజునిపైజల్లి, తన దంతకాంతులచేత మెడలోని తారహారకాంతుల నినుమడింపజేయుచు నజునితో నిట్లుపలికెను.

శ్లో. మతంగశాపాదవలేపమూలాత్
అవాప్తవానస్మి మతంగజత్వమ్
ఆవేహి గంధర్వపతేస్తనూజం
ప్రియంవదం మాం ప్రియదర్శనస్య. 53

వ్యాఖ్య: అవలేపమూలాత్ - గర్వహేతుకమైన, మతంగశాపాత్ - మతంగమహాముని శాపమువలన, మతంగజత్వం - గజత్వమును, అవాప్తవాన్ - పొందినవాడను, అస్మి - అయితిని, మాం - నన్ను, ప్రియదర్శనస్య, గంధర్వపతేః - ప్రియదర్శనుండను పేరుగల గంధర్వరాజుయొక్క, తనూజం - కుమారుడనైన, ప్రియంవదం - ప్రియంవదుడను పేరు గలవానినిగా, ఆవేహి - ఎఱుగుము. ఒకానొకప్పుడు నాగర్వప్రవర్తనముచేత కినిసిన మతంగమహాముని శాపమువలన నేను గజమునై జన్మించితిని, నిజమునకు నేను ప్రియదర్శనుండను పేరుగల గంధర్వ రాజపుత్రుడను, నాపేరు ప్రియంవదుడు అని చెప్పెను. మతంగపర్వతమునందు విశేషముగా నేనుగులు పుట్టుటవలన వాటికి "మతంగజములు"అను వ్యవహారము కలిగినది.

శ్లో. సచానునీతః ప్రణతేన పశ్చాత్
మయా మహర్షి ర్మృదుతా మగచ్ఛత్
ఉష్ణత్వ మగ్న్యాతపసంప్రయోగాత్
శైత్యం హి యత్సా ప్రకృతి ర్జలస్య. 54

వ్యాఖ్య: సః, మహర్షిః చ - ఆమతంగమహాముని యు ప్రణతేన, మయా- వినమ్రుఁడనై న నాచేత, అనునీతః - బ్రతిమాలుకోబడినవాఁడై, పశ్చాత్ - తరువాత, మృదుతాం - మెత్తదనమును (శాంతిని), అగచ్ఛత్ - పొందెను. హి - అదియట్లే, జలస్య - నీటికి, ఉష్ణత్వం - వేడిమి, అగ్న్యాతపసంప్రయోగాత్ - అగ్నియొక్కగాని, ఆతపము యొక్కగాని, సంపర్కమువలననే (కలుగును), యత్, శైత్యం - ఏచల్లదనమైతే కలదో, సా - అదియే, ప్రకృతిః - నిజస్వభావము నేను వినమ్రుఁడనై నమస్కరించి బ్రతిమాలుకొనుటచేత మతంగముని శాంతిని పొంది కనికరించెను. నీటికి వేడిమి, నిప్పుయొక్కగాని, యెండయొక్కగాని సంబంధమువలన నేర్పడునదే కాని చల్లదనమేకదా దాని స్వభావము. మహామునులకు శాంతియే స్వభావము. నేను పొగరుబోతునై వ్యవహరించుటచేతనే మతంగమునికి కోపము వచ్చినది, నేను మళ్లీ నమస్కరించి బ్రతిమాలుకొనుటచేత నతఁడు స్వభావసిద్ధమైన శాంతిని వహించెనని భావము (జలమునకు చల్లదనమువలె ఋషులకు శాంతి సహజము).

శ్లో. ఇక్ష్వాకు వంశ ప్రభవో యదా తే
భేత్స్యత్యజః కుంభ మయోముఖేన
సంయోక్ష్యసే స్వేన వపుర్మహిమ్నా
తదే త్యవోచత్ స తపోనిధి ర్మామ్. 55

వ్యాఖ్య: ఇక్ష్వాకువంశప్రభవః - ఇక్ష్వాకువంశమునఁబుట్టిన, అజః - అజ మహారాజు, యదా - ఎప్పుడు, తే - నీయొక్క, కుంభం - కుంభ స్థలమును, అయోముఖేవ - బాణముచేత, భేత్స్యతి - భేదింపగలదో, (చీల్చునో) తదా - అప్పుడు. స్వేన - స్వకీయమైన, వపుర్మహిమ్నా - శరీరమహిమచేత. సంయోక్ష్యసే - సంబంధమునుపొందగలవు (కూడుకొందువు), ఇతి - ఇట్లని, సః తపోనిధిః - అతపోనిధియైన మతంగ మహాముని, మాం - నన్నుగూర్చి, అవోచత్ -

పలికెను. ఇక్ష్వాకు రాజువంశమున౮బుట్టిన అజు౮డు ఎప్పుడైతే గజరూపమునన్నున్న నీకుంభ స్థలమును బాణముచేత భేదింప౮గలడో అప్పుడు నీవుగజశరీరమును విడచి మహిమోపేతమైన స్వశరీరమును పొంద౮గలవని తపోనిధియైన యామతంగముని నాతో౮ జెప్పెను.

శ్లో. సమ్మోహితః సత్త్వవతా త్వయా ఒహం
శాపాత్ చిర ప్రార్థిత దర్శనేన
ప్రతిప్రియం చేత్ భవతో న కుర్యాం
వృథా హి మే స్యాత్ స్వపదోపలబ్ధిః. 56

వ్యాఖ్య: చిరప్రార్థితదర్శనేన—చిరం - బహుకాలమునుండి, ప్రార్థిత - కోరబడిన, దర్శనేన - దర్శనము కలిగినట్టియును, సత్త్వవతా - బలవంతుడవైన త్వయా - నీచేత, అహం - నేను, శాపాత్ - మునిశాపమునుండి, సమ్మోహితః - అస్మి - విడిపింపబడిన వాడనైతిని; భవతః - నీకు, ప్రతిప్రియం - ప్రత్యుపకారమును, న,కుర్యాం,చేత్ - చేయనివాడనైనచో, మే - నాయొక్క, స్వపదోపలబ్ధిః - స్వస్థానప్రాప్తి, వృథా,స్యాత్హి - వ్యర్థమైపోపునుగదా!, బహుకాలము నుండి నీదర్శనమునకై వేచియుండగా ఇప్పుడు బలశాలివైన నీచేత ముని శాపము నుండి విడిపింపబడితిని. దీనికిదగిన ప్రతిప్రియమును నీకు నేను జేకూర్పనిచో నాకు గలిగిన స్వస్థాన ప్రాప్తి నిరుపయోగమేకదా? అని ప్రియంవదుడు అజునితో ననెను.

శ్లో. సమ్మోహనం నామ సఖే! మమాస్త్రం
ప్రయోగ సంహార విభక్త మంత్రమ్
గాంధర్వ మాదత్స్వ యతః ప్రయోక్తుః
న చారిహింసా విజయశ్చ హస్తే. 57

వ్యాఖ్య: హేసఖే - ఓప్రాణమిత్రమా! ప్రయోగసంహార విభక్తమంత్రం-
ప్రయోగ ప్రయోగించుట యందును, సంహార - ఉపసంహరించుట యందును,
విభక్త - వేరువేరుగానున్న, మంత్రం - మంత్రములు కలదియును, గాంధర్వం-
గంధర్వ దేవతాకమై, సమ్మోహనం నామ - సమ్మోహనమను పేరుగల, మమ
అస్త్రం - నాయొక్క అస్త్రమును, ఆదత్స్వ - స్వీకరింపుము; యతః ఏయస్త్రము

వలన ప్రయోక్తుః - ప్రయోగించువానికి, అరిహింసా - శత్రుపులవలనిబాధ(లేదా శత్రువులను చంపవలసిన యవసరము). నచ - ఉండదో, విజయశ్చ - విజయము కూడ హస్తే - చేతియందు (ఉండునో). ఏయస్త్రమునలన ప్రయోక్తకు శత్రు బాధగాని, శత్రువును చంపవలసిన యవసరముగాని లేక, విజయము హస్తగత మగునో అట్టిదియై, ప్రయోగ, ఉపసంహారములకు, వేఱు వేఱు మంత్రములు గలిగి, గంధర్వ దేవతాకమై, సమ్మోహనమను పేరుగల నాయస్త్రమును ప్రతిప్రియ ముగ స్వీకరింపుమని ప్రియంవదుఁ డజునితో ననెను. బంధు, సుహృత్, మిత్ర, సఖి శబ్దములకు ప్రత్యేకమైన యర్థములున్నవి.

శ్లో. "అత్యాగ సహనో బంధుః, సదైవానుమతః సుహృత్,
ఏకక్రియం భవే న్మిత్రం, సమప్రాణః సఖా మతః"

శ్లో. అలం హ్రియా మాం ప్రతి యన్మహార్హం
దయాపరో ఽభూః ప్రహర న్నపి త్వమ్
తస్మా దుపచ్ఛందయతి ప్రయోజ్యం
మయి త్వయా న ప్రతిషేధరౌక్ష్యమ్. 58

వ్యాఖ్య: మాంప్రతి - హ్రియా - సిగ్గుచేత, అలం - చాలును (నావిషయ మునసిగ్గుపడబోకుము), యత్ ఏకారణమువలన, త్వం - నీవు, ప్రహరన్ అపి-కొట్టుచున్నవాడవయ్యును, ముహూర్తం - క్షణకాలము, దయాపరః - దయగల వాఁడవు, అభూః - అయితివో, తస్మాత్ - అదేకారణమువలన, ఉపచ్ఛందయతి, మయి - ప్రార్థించుచున్న నావిషయమున, త్వయా - నీచేత, ప్రతిషేధరౌక్ష్యం-నిషేధించుట యను పరుషత్వము, నప్రయోజ్యం - ప్రయోగింపఁదగినది కాదు. నాయెదుట సిగ్గుపడ బోకుము, నాపైన బాణమునువేయుటలో చిన్నగాఁగొట్టి దయను జూపితివి. నీవు సహజముగా దయాపరుఁడవు గావున ఇంతగా బ్రతిమాలు కొను చున్న నామీద 'సమ్మోహనాస్త్రము నాకక్కఱలేదు.' అను పరుషవాక్యమును ప్రయో గింపకుము. అని గంధర్వుఁడజునితో ననెను.

శ్లో. తథే త్యుపస్పృశ్య పయః పవిత్రం
సోమోద్భవాయాః సరితో నృసోమః

ఉదఙ్ముఖః సోఽస్త్రవి దస్త్రమంత్రం
జగ్రాహ తస్మా న్నగృహీతశాపాత్. 59

వ్యాఖ్య: నృసోమః - పురుషశ్రేష్ఠుడై, అస్త్రవిత్ - అనేకాస్త్రముల నెఱిఁగిన, సః - ఆ యజమహారాజు, తథాఽఽతి - సరేయని సమ్మతించి, సోమోద్భవాయాః, సరితః - నర్మదా నదియొక్క, పవిత్రం, పయః - పావనమైనజలమును, ఉపస్పృశ్య - ఆచమనము చేసి, ఉదఙ్ముఖః - ఉత్తరాభిముఖుఁడై, నిగృహీత శాపాత్ - నివర్తింపఁబడిన శాపముగల, తస్మాత్ - ఆప్రియంవదునివలన, అస్త్ర మంత్రం - ఆసమ్మోహనాస్త్ర మంత్రమును, జగ్రాహ - స్వీకరించెను. అజుఁడు గంధర్వుని మాటకు సమ్మతించి నర్మదా జలము నాచమనముచేసి, ఉత్తరదిశాభి ముఖుఁడై తనవలన శాపనివృత్తిని పొందిన అప్రియంవదుని వలన సమ్మోహ నాస్త్రముయొక్క ప్రయోగ, ఉపసంహార మంత్రములను స్వీకరించెను. బాణము లలో, మంత్రసహితమైన దానికి అస్త్రమనియు, మంత్రములేని దానికి శస్త్రమనియు పేర్లు. సోమోద్భవయనఁగా నర్మదానది. "రేవా తు నర్మదా సోమోద్భవా మేఖల కన్యకా" అని యమరము.

శ్లో. ఏవం తయో రధ్వని దైవయోగాత్
ఆసేదుషోః సఖ్యమచింత్యహేతు
ఏకో యయౌ చైత్ర రథ ప్రదేశాన్
సౌరాజ్యరమ్యా నపరో విదర్భాన్. 60

వ్యాఖ్య: ఏవం - ఇట్లు, అధ్వని - మార్గమునందు, దైవయోగాత్ - దైవికముగా, అచింత్యహేతు - ఊహింపరాని కారణముగల, సఖ్యం - మైత్రిని, ఆసేదుషోః - పొందినట్టి, తయోః - వారిద్దరిలో, ఏకః - ఒకడైన ప్రియం వదుఁడు, చైత్రరథప్రదేశాన్ - కుబేరోద్యానప్రదేశములను గుఱించియు, అపరః - మరియొకఁడైన యజమహారాజు, సౌరాజ్యరమ్యాన్ - మంచి రాజుండుటచే రమ్యములయిన, విదర్భాన్ - విదర్భదేశమును గుఱించియు, యయౌ - వెళ్లెను. అట్లు దారిలో దైవవశమున నూహింపరాని కారణముగల సఖ్యమును పొందిన ఆ యిద్దరిలో ప్రియంవదుఁడు కుబేరోద్యానవనమునకును, అజమహారాజు విదర్భ దేశమునకును వెళ్లిరి. కుబేరుని యుద్యానవనమునకు "చైత్రరథము" అనిపేరు.

దేశవాచకపదములు సంస్కృతమునందు బహువచనములుగాఁ బ్రయోగింపఁబడు చుండును, ఉదా: కాశ్మీరాః, వంగాః. కళింగాః. ఆంధ్రాః మొ.

శ్లో. తం తస్థివాంసం నగరోపకంతే
తదాగమారూఢ గురుప్రహర్షః
ప్రత్యుజ్జగామ ప్రథకైశికేంద్రః
చంద్ర ప్రవృద్ధోర్మ్మి రివోర్మ్మిమాలీ 61

వ్యాఖ్య: నగరోపకంతే - రాజధానీ నగరమునందు, తస్థివాంసం - నిలిచి యుండిన, తం - ఆ యజమహారాజ కుమారుని, తదాగమారూఢ గురుప్రహర్షః— తదాగమ - అతని రాకచేత, ఆరూఢ - ఉత్పన్నమైన, గురుప్రహర్షః - గొప్ప సంతోషముగల, ప్రథకైశికేంద్రః - విధర్భదేశాధిపతి, ప్రవృద్ధోర్మ్మిః - మిక్కిలి పైకిలేచిన యలలుగల, ఊర్మ్మిమాలీ - సముద్రుఁడు, చంద్రంఇవ - చంద్రునిని వలె, ప్రత్యుజ్జగామ (ప్రతి + ఉత్ + జగామ) - ఎదుర్కొనెను. అజుఁడు స్వయంవరోత్సవమున పాల్గొనుటకై వచ్చి, నగరసమీపమున నిలిచిన వార్త తెలి సిన భోజుఁడు, గొప్పసంతోషముగలవాఁడై, ఉదయించుచున్న చంద్రునిని ఉవ్వె త్తున లేచిన తరంగ హస్తములతో సముద్రుఁడువలె స్వాగతపూర్వకముగా నెదురుకొనెను. "ఊర్మ్మిమాలీ" యను విశేషణము సర్వనదీతటాక తరంగములకన్న నత్యున్నతములైన తరంగములుగల సముద్రమునకే చెల్లును.

శ్లో. ప్రవేశ్య చైనం పుర మగ్రయాయీ
నీచైస్థథోపాచర దర్పితశ్రీః
మేనే యథా తత్ర జనః సమేతో
వైదర్భ మాగంతు మజం గృహేశమ్. 62

వ్యాఖ్య: (సః - ఆ విదర్భరాజు) ఏనం - ఈ వచ్చిన యజుకుమారుని అగ్రయాయీ - ముందు నడచుచున్నవాఁడై, నీచైః - వినమ్రుఁడై, పురం, ప్రవేశ్య - నగరమును ప్రవేశింపఁజేసి, అర్పితశ్రీః - సమర్పింపఁబడిన సకలో పచారసంపదలు గలవాఁడగుచు, తథా, ఉపాచరత్ - ఆ విధముగా మర్యాద

చేసెను; యథా - ఏవిధముగానైతే, తత్ర, సమేతః, జనః - అచ్చట గుమి గూడిన జనము, వైదర్భం - భోజరాజును, ఆగంతుం - ఇతర ప్రదేశమునుండి వచ్చిన యతిథినిగాను, అజం - అజకుమారుని, గృహేశం - యజమానునిగాను, మేనే - తలఁచెనో. భోజుఁడు ముందు నడచుచు వినమ్రుఁడై యజుని నగర ప్రవేశము చేయించి, సకలోపచార సంపదలును సమకూర్చి, అచ్చటికి చూడవచ్చిన జనము భోజుఁడే యతిథి, అజుఁడే గృహయజమాని అని తలంచునట్లుగా ఉపచారము (మర్యాద) చేసెను. "ఆగంతుః" అను శబ్దము తెలుఁగున 'క' ప్రత్యయము చేర్చి "అగంతుకుఁడు" అని సాధారణముగాఁ బ్రయోగింపఁబడుచుండును. లేనిచో "ఆగంతువు" లేదా ఆగంతుఁడు అని యనవలెను.

శ్లో. తస్యాధికార పురుషైః ప్రణతైః ప్రదిష్టాం
ప్రాగ్ద్వారవేది వినివేశిత పూర్ణకుంభాం
రమ్యాం రఘుప్రతినిధిః స నవోపకార్యాం
బాల్యాత్ పరా మివ దశాం మదనోఽధ్యువాస. 83

వ్యాఖ్య: రఘుప్రతినిధిః - రఘుమహారాజుతో సమానుఁడగు, సః - ఆ యజుఁడు, ప్రణతైః - వినమ్రులైన, తస్య అధికారపురుషైః - ఆ భోజుని యొక్క ఉద్యోగులచేత, ప్రదిష్టాం - చూపబడినదియు, ప్రాగ్ద్వారవేది వినివేశిత పూర్ణకుంభాం—ప్రాగ్ద్వారవేది - తూర్పువాకిలి వద్దయరుగు మీద, వినివేశిత - ఉంచఁబడిన, పూర్ణకుంభాం - మంగళకలశము గలదియును, రమ్యాం - అందమైనదియునగు, నవోపకార్యాం (నవ + ఉపకార్యాం) - క్రొత్తడేరాతో వేయఁబడిన విడిదిని (ఒక క్రొత్త రాజభవనమును), మదనః - మన్మథుఁడు, బాల్యాత్, పరాం - బాల్యము తర్వాతిదియైన, దశాంఇవ - యౌవన దశనువలె, అధ్యువాస (అధి + ఉవాస) - అధిష్ఠించెను (ప్రవేశించెను). రఘుసమానుఁడగు నజుఁడు, భోజుని యధికార పురుషులు ప్రణమిల్లి వినమ్రులై చూపినదియు, తూర్పువాకిఁటి యరఁగుమీద నిండుకలశ ముంచఁ బడినదియు, మనోహరమైనదియునగు విడిదియింటిని, మన్మథుడు బాల్యదశనుండి యౌవనదశనువలె ప్రవేశించెను. ఇచ్చటి "రఘు ప్రతినిధి" శబ్దమునందలి 'ప్రతినిధి' శబ్దము సాదృశ్యవాచకము. "కల్ప, దేశీయ, దేశ్య, ప్రఖ్య, ప్రతినిధి" శబ్దములు సమానార్థకములని దండి చెప్పెను మరియొక విశేష మేమనఁగా, స్వయంవరోత్స వాహ్వానము వచ్చినప్పుడు, సా ర్వ

భౌముఁడైన రఘుమహారాజు, కొందఱు రాజులనలె స్త్రీలోలుఁడుగాక యుచిత జ్ఞుఁడై, తనకు బదులు యువరాజైన తన కుమారునిఁ బంపెనను విషయమును స్ఫురింపఁజేయుటకే 'ప్రతినిధి' శబ్దము నుపయోగించుట యని తలంపవలయును.

శ్లో. తత్ర స్వయంవర సమాహృత రాజలోకం
కన్యాఽలామ కమనీయ మజస్య లిప్సోఃl
భావావబోధకలుషా దయితేవ రాత్రౌ
నిద్రా చిరేణ నయనాభిముఖీ బభూవ. 64

వ్యాఖ్య: తత్ర - ఆ నివాస భవనమునందు, స్వయంవర సమాహృతరాజ లోకం—స్వయంవర - స్వయంవరమునకై, సమాహృత - ఒకచోటికి తీసుక రాఁబడిన, రాజలోకం - రాజబృందము గలదియును, కమనీయం - కోరదగినదియు నగు, కన్యాలలామ - కన్యారత్నమైన ఇందుమతిని, లిప్సోఃl - పొందఁదలఁచిన, అజస్య - అజునికి, భావావబోధకలుషా—భావ - పురుషుని భావముయొక్క, అవ బోధ - ఎఱుఁగుటయందు, కలుషా - అసమర్థురాలగు, దయితా, ఇవ - ప్రియు రాలువలె, రాత్రౌ - ఆనాటి రాత్రియందు, నిద్రా - నిద్ర, చిరేణ - చాలసేపటికి, నయనాభిముఖీ - కన్నులపువై నకు వచ్చునది, బభూవ - అయ్యెను. ఆ స్వయంవర నివాస భవనమునకు, అందఱు రాజకుమారులను రప్పించుటకు కారణమైన కన్యా రత్నమగు ఇందుమతిని పొందఁదలచుచున్న అజునికి, ఆ రాత్రియందు నిద్ర, ప్రియునిభావము నెఱుఁగు చుఱుకుదనమలేని ప్రియురాలివలె చాలసేపటికి వచ్చెను. "నయనాభిముఖీ" యనుశబ్దము వచ్చీరాని నిద్రను తెలుపును. ఆ రాత్రి అజునికి నిద్రపట్టలేదని భావము.

శ్లో. తం కర్ణభూషణ నిపీడితపీవరాంసం
శయ్యోత్తరచ్ఛద విమర్ద కృశాంగరాగమ్,
సూతాత్మజాఃl సవయసఃl ప్రథితప్రబోధం
ప్రాబోధయన్నుషసి వాగ్భి రుదారవాచఃl. 66

వ్యాఖ్య: కర్ణభూషణ నిపీడిత పీవరాంసం - బలిసిన పై భుజములు కల వాఁడును, శయ్యోత్తరచ్ఛద విమర్ద కృశాంగరాగం—శయ్యా - పరుపుయొక్క,

ఉత్తరచ్ఛద విమర్ద - పైవస్త్రము రాపిడిచేత, కృశాంగరాగం - తరిగిపోయిన మైపూత కలిగినట్టియును, ప్రథితప్రబోధం - ప్రఖ్యాతమైన జ్ఞానము గలవాఁడునునగు, తం - ఆ యజమహారాజును, సవయసః - సమానమైన యీడుగలవారును, ఉదారవాచః - గుణవంతములగు స్తోత్రవాక్కులుగల, సూతాత్మజాః - వంది పుత్రులు, వాగ్భిః - స్తుతి పాఠములచేత, ఉషసి - తెల్లవారు జామున, ప్రాబోధయన్ - మేలుకొలిపిరి. నిద్రపట్టక యిటునటు పొరలుటచేత చెపుల పోగులొత్తిన పైభుజములతోను, పఱుపుమీది గుడ్డ రాచుకొనుటచేత రాలిపడిన మైపూతతోను పడుకొనియున్న అజమహారాజును, అతని యీడువారై, మధుర ప్రగల్భములైన వాక్కులు గలవారై వెంటవచ్చిన వైతాళిక కుమారులు, సహజ ప్రబోధము గల వాఁడని యెఱిఁగియు రాజలాంఛనములగు స్తుతి గీతములతో వేకువజామున (ముందు చెప్పబోవురీతిగా) మేలుకొలిపిరి, మేలుకొలుపులు సాడిరి.

శ్లో. రాత్రి ర్గతా మతిమతాం వర ! ముంచ శయ్యాం
ధాత్రా ద్విధైవ నను భూ ర్జగతో విభక్తా,
తా మేకత స్తవ బిభర్తి గురు ర్వినిద్రః
తస్యా భవా నపర ధుర్య పదావలంబీ. 88

వ్యాఖ్య: హేమతిమతాం, వరః - బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడవైన ఓ అజ మహారాజా: రాత్రిః, గతా - రాత్రి వెళ్లిపోయినది, శయ్యాం, ముంచ - పడకను విడువుము, ధాత్రా - బ్రహ్మచేత, జగతఃభూః - లోకముయొక్క భారము, ద్విధైవ - రెండు విధములుగానే, విభక్తానను పంచబడియున్నదిగదా:, తాం - ఆ భారమును, ఏకతః - ఒక ప్రక్కన, తవ, గురుః - మీ తండ్రి, వినిద్రః - జాగరూకుడై (నిద్రను విడిచి), బిభర్తి - మోయుచున్నాఁడు, తస్యాః - ఆ భారమునకు, భవాన్ - నీవు, అపరధుర్య పదావలంబీ—అపరధుర్య - రెండవమోతకాని యొక్క, పద - చోటును, అవలంబీ - పట్టుకొనవలసిన వాఁడవుగదా: (కనుక మేల్కొనుము). ఓ మతిమంతులలో గొప్పవాడవైన అజమహాలాజా: రాత్రి గడచిపోయినది, ప్రక్కమీదినుండి లెమ్ము; బ్రహ్మదేవుఁడు జగద్భారమును రెండు భాగములుగానే విభజించియున్నాడు. బండికి కట్టు కాడికొనవలె నున్న ఆ భారములలో ఒకప్రక్క భారమును మీ తండ్రి తన భుజములపై పెట్టుకొని మోయుచున్నాఁడు; ఆ బరువుయొక్క రెండవప్రక్కగల కాడికొనను మోయ

వలసిన చోటు నీది. కనుక నిద్రలేచి నీ కర్తవ్యమును పూర్తిచేయుము. బండిని లాగుటకు కాడికి రెండెద్దులుసు గావలయును.

శ్లో. నిద్రావశేన భవతా ప్యనవేక్షమాణా
పర్యుత్సుకత్వ మబలా నిశి ఖండితేవ,
లక్ష్మీ ర్వినోదయతి యేన దిగంతలంబీ
సోఽపి త్వదాననరుచిం విజహాతి చంద్రః. • 87

వ్యాఖ్య: నిద్రావశేన, భవతా - నిద్రాధీనుఁడవైన నీ చేత, (నీ యంచలి) పర్యుత్సుకత్వం, అపి - అనురక్త భావమునుసైతము, నిశి - గతరాత్రియందు, ఖండితా, అబలా, ఇవ - ఖండితా నాయికవలె, అనవేక్షమాణా - ఆలోచింపని దగుచు, లక్ష్మీః - లక్ష్మి, యేన - ఎవనిచేత, పర్యుత్సుకత్వం - నీ విరహ వేదనను, వినోదయతి(వి + నోదయతి) - తొలగించుకొనుచుండెనో, సోఽపిచంద్రః- ఆ చంద్రుడుసైతము, దిగంతలంబీ - పడమటి దిక్కు చివరను జేరినవాఁడగుచు, త్వదాననరుచిం - నీ ముఖకాంతివంటి కాంతిని, విజహాతి - విడిచివేయుచున్నాఁడు. "చంద్ర, అరవింద, రాజవదనములు లక్ష్మీ నివాసస్థానములు" అను ప్రసిద్ధి ననుసరించిన వర్ణనము ఇది, ఓ రాజా! నీవు నిద్రానాయికకు వశుఁడవై యుండుటచేత నీ యందలి యనురాగాతిశయమునుగూడ వదలి, రాత్రియందు, అన్యస్త్రీ సంబంధము చేతఁ గినిసిన ఖండితా నాయికవలె, లక్ష్మి, యెవనిని జేరి నీ వలనివియోగ బాధను దొలఁగించుకొను చుండెనో ఆ చంద్రుఁడుగూడ పశ్చిమ దిక్కువద్దకిఁ జేరుచు నీ ముఖకాంతి సదృశమైన తన కాంతిని వదలి వేసినాడు. అందువలన అనన్యగతికయైన లక్ష్మి నిన్నుఁ జేరుటకై నీవు నిద్రమేల్కొనుము అని భావము. 'నిద్రా' శబ్దము స్త్రీ లింగము కనుక ఆజుని నిద్రావశత్వము పరకీయ నాయికా సంబంధము వంటిది. లక్ష్మి ఏకాకినియై ఖండితయై, అజ ముఖకాంతి సాదృశ్యముకల చంద్రుని నాశ్రయించి తన విరహ వేదనను దొలగించుకొను చుండినది. విరహిజనులు అసలు వస్తువు లేనప్పుడు సదృశవస్తువును జూచి యూరడిల్లుచుందురు. లక్ష్మి అట్లు చేసినది. చంద్రుఁడుకూడ పశ్చిమ దిగంగన వద్దికి చేరుటచేత నిప్పుడా వినోద స్థానముగూడ పోయినది. కనుక నీవే లక్ష్మికి దిక్కు అన్నది వ్యంగ్యార్థము. ఖండిత అష్టవిధ శృంగార నాయికలలో నొకతె. "జ్ఞాతేఽన్యాసంగవికృతే ఖండితే ర్ష్యాకషాయితా" అని లక్షణము. అనఁగా భర్త అన్యస్త్రీ

సంగమ చిహ్నములుగల వాడగుట నెఱిగి యీర్ష్యతో గోపమువచ్చిన నాయిక. పకృతమున లక్ష్మి అట్టినాయికగా వర్ణింపబడినది.

శ్లో. తద్వల్గునా యుగప దున్మిషితేన తావత్
సద్యఃపరస్పరతులా మధిరోహతాం ద్వే
ప్రస్పందమానపరుషేతరతార మంతః
చక్షుస్తవ ప్రచలితభ్రమరం చ పద్మమ్. 68

వ్యాఖ్య: తత్ - అందువలన, వల్గునా - మనోహరమైన. యుగపత్తావత్ - ఒకే సమయము నందలి, ఉన్మిషితేన - వికసనముచేత, అంతః - లోపల, ప్రస్పందమాన పరుషేతరతారం—ప్రస్పందమాన - కదలుచున్న, పరుషేతర - స్నిగ్ధమైన (నువ్వని), తారం - కనుపాపగల, తవ,చక్షుః - నీ నేత్రమున్ను అంతః - లోనిభాగమున, ప్రచలితభ్రమరం—ప్రచలిత - కదులుచున్న, భ్రమరం - తుమ్మెదగల, పద్మం - కమలమున్ను ద్వే - ఈ రెండును, సద్యః - వెంటనే, పరస్పరతులాం - ఒండొకటితో పోలికను, అధిరోహతాం - పొందునుగాక లక్ష్మీపరిగ్రహము చేయవలసియున్నది కనుక, లోపల కదలుచున్న నల్లగ్రుడ్డు గల నీ నేత్రము, లోపల చలించుచున్న తుమ్మెదగల పద్మమును, ఇప్పటికే పోలిక గల యీ రెండును, ఒకే సనుయమునందు మనోహరముగా వికసించుట చేత గూడ తమ సాదృశ్యమును నిలుపుకొని ఒకదాని నొకటి పోలునుగాక. కమలములు వికసించుచున్నవి. నీ కన్నులు గూడ వాటితోపాటు వికసించునుగాక; మేలుకొనుము అని భావము.

శ్లో. వృంతా చ్ఛథం హరతి పుష్ప మనోకహానాం
సంసృజ్యతే సరసిజై రరుణాంశుభిన్నైః
స్వాభావికం పరగుణేన విభాతవాయుః
సౌరభ్య మిప్పు రివ తే ముఖమారుతస్య. 69

వ్యాఖ్య: విభాతవాయుః - ప్రాతఃకాలపు గాలి, స్వాభావికం - ప్రకృతి సిద్ధమైన, తే ముఖమారుతస్య - నీ నిశ్వాస వాయువుయొక్క, సౌరభ్యం - పరిమళమును బోలిన పరిమళమును, పరగుణేన - తనది కాని గుణముచేత, ఈప్పురివ

- పొందఁదలఁచినదివలె, అనోకహానాం - ఎత్తైన చెట్లయొక్క, శ్లథం, పుష్పం - తొడిమ సడలిన పువ్వును (తొడిమలూడిన పూలను), వృంతాత్ - తొడిమ నుండి హరతి - ఎత్తుక పోవుచున్నది; అరుణాంశుభిన్నైః - సూర్యకిరణముల చేత వికసింప జేయఁబడిన, సరసిజైః - కమలములతో, సంసృజ్యతే - కలియుచున్నది. సహజ పరిమళముగల నీ నిట్టూర్పును బోలియుండవలెనన్న కాంక్షతో ప్రాతఃకాల వాయువు పెద్ద వృక్షములపై నుండి తొడిమ సడలిన పూవులను తొడిమలనుండి అపహరించుచున్నది. సూర్య కిరణ స్పర్శచే వికసించిన కమలములను గలియుచున్నది. తనకు సహజము కాక పోయినను పరగుణములనే సంక్రమింపఁ జేసికొనియైనను నీ నిట్టూర్పుతో పోలికను సంపాదించుకొనుటకు ప్రయత్నించుచున్నది. అనగా చెట్ల నుండి పూలు రాలుచున్నవి, తామరలు విచ్చుకొనుచున్నవి, ప్రాతఃకాల వాతూలములు వీచుచున్నవి, నిద్ర మేలుకొనుమని భావము.

శ్లో. తామ్రోదరేషు పతితం తరుపల్లవేషు
నిర్ధాతహారగుళికావిశదం హిమాంభః
ఆభాతి లబ్ధ పరభాగతయ ఒధరోష్ఠే
లీలాస్మితం సదశనార్చి రివ త్వదీయమ్. 70

వ్యాఖ్య: తామ్రోదరేషు - ఎఱ్ఱని లోనిభాగములుగల, తరుపల్లవేషు - చెట్ల చిగుళ్లమీద, పతితం - పడినదియై, నిర్ధాతహారగుళికా విశదం—నిర్ధౌత - పులుగడిగిన, హారగుళికా - ముత్యాలదండ యందలి ముత్తెములవలె, విశదం - నిర్మలమైన, హిమాంభః - మంచునీరు, లబ్ధపరభాగతయా—లబ్ధ - పొందఁబడిన, పరభాగతయా - గుణోత్కర్ష కలదగుటచేత, అధరోష్ఠే - క్రింది పెదవి మీద, త్వదీయం - నీదియగు, సదశనార్చిః - దంత కాంతితోఁగూడిన, లీలాస్మితంఇవ- విలాసహాసమువలె, ఆభాతి - బాగుగా ప్రకాశించుచున్నది. ఎఱ్ఱని లోభాగములుగల చెట్ల చిగుళ్లమీద పడి, పులుగడిగిన ముత్తెపు సరుల ముత్యాల వరుస వలెనున్న మంచు నీరు, చిగురాకుల యెఱ్ఱదనము తనలో ప్రతిఫలింపఁగా గుణోత్కర్షను పొంది, క్రింది పెదవిపైఁబడి గుణోత్కర్షను పొందిన, దంత కాంతిసహితమైన నీ చిఱునగవు వలె మిక్కిలి యందముగా నున్నది. "పరభాగ" శబ్దమునకు గుణాధిక్యమర్థము "పరభాగో గుణోత్కర్షః" అని యాదవ నిఘంటువు.

శ్లో. యావత్ ప్రతాపనిధి రాక్రమతే న భాను
రహ్నాయ తావ దరుణేన తమో నిరస్తమ్
ఆయోధనాగ్రసరతాం త్వయి వీర! యాతే
కింవా రిపూం స్తవ గురుః స్వయ ముచ్ఛినత్తి. 71

వ్యాఖ్య: ప్రతాపనిధిః - తేజస్సునకు ఆకరమైన, భానుః - సూర్యుఁడు, యావత్ - ఎంతవఱకు, న ఆక్రమతే - ఉన్నతిని పొందఁడో, తావత్ - అంత వఱకే, అహ్నాయ - శీఘ్రముగా, అరుణేన - ఆనూరునిచేత, తమః - చీకటి, నిరస్తం - పోగొట్టఁ బడినది, (తథాహి - అదియుక్తమే) హేవీర! ఓ వీరుడా! త్వయి - నీవు, ఆయోధనాగ్రసరతాం - యుద్ధములందు అగ్రగామిత్వమును, యాతే (సతి)- పొందిన వాఁడవగుచుండఁగా, తవ. గురుః - నీ తండ్రి, రిపూన్ - శత్రువులను, స్వయం - తాను, ఉచ్ఛినత్తికింవా - తెగటార్చునా యేమి? తేజోనిధియగు సూర్యుడాకసము పైకెక్కుటకు ముందు మాత్రమే అనూరుఁడు చీకటినిఁ బాఱద్రోలునుగదా! నీవు యుద్ధములం దగ్రగామిత్వమును పొందిన పిమ్మట మీ తండ్రి స్వయముగా శత్రువులను బరిమార్చునా. సమర్థుఁడైన పుత్రునియం దుంచ బడిన రాజ్య భారముగల మీ తండ్రికి తాను శ్రమవడవలసిన పనియేమి యని భావము. జీవలోకమున కాలోకమును ప్రసాదించుట సూర్యుని పని యైనట్లు పితృదత్త రాజ్య పర్యవేక్షణము నీ పని గనుక నిద్రమేల్కొనుమని తాత్పర్యము. ఈ శ్లోకమునందలి "ఆక్రమతే" అను క్రియ చాల అర్థవంతముగా నుపయోగింపఁ బడినది. సహజముగా పరస్మైపది యగు "క్రము" ధాతువునకు 'ఆఙ్' అను ఉపసర్గమును జేర్చుటచేత నది ఆత్మనేపదియై, ఉద్గమనము (పైకివచ్చుట) సూర్యుని పక్షమునందును, అభ్యుదయము అజుని పక్షమునను అర్థములగునట్లు చేసినది.

శ్లో. శయ్యాం జహా త్యుభయపక్ష వినీత నిద్రాః
స్తంబేరమా ముఖర శృంఖల కర్షిణ స్తే,
యేషాం విభాంతి తరుణారుణరాగయోగాత్
భిన్నాద్రిగైరికతటా ఇవ దంతకోశాః. 72

వ్యాఖ్య: ఉభయపక్ష వినీతనిద్రాః—ఉభయపక్ష - ఇటునటు పొరలుట చేత రెండు పార్శ్వముల యందును, వినీతనిద్రాః - తీర్చుకోఁబడిన నిద్రగలవియు, ముఖరశృంఖల కర్షిణాః—ముఖర - ధ్వనించుచున్న, శృంఖల - కట్టుగొలుసులను కర్షిణాః - లాగుకొనుచున్నవియు నగు, తే, స్తంబేరమాః - నీయొక్క యేనుఁగులు, శయ్యాం - పడకను, జహతి - నిడుచుచున్నవి; యేషాం - ఏనీ యేనుఁగులయొక్క, దంతకోశాః - మొగ్గలవంటి దంతములు, తరుణారుణ రాగ యోగాత్ - బాలసూర్యుని కాంతి సంబంధమువలన, భిన్నాద్రి గైరికతటాఃఇవ—భిన్న - తమచే కోరాడి పగులగొట్టఁబడిన, అద్రి - పర్వతములయొక్క, గైరిక తటాః ఇవ - మణిశిలాది ధాతుమయములైన చరియలు గలవివలె, విభాంతి - ప్రకాశించుచున్నవో, కుడిప్రక్కన కొంతసేపును, ఎడమప్రక్కన కొంతసేపును పడుకొని నిద్రను తీర్చుకొన్నవియై, గల గల శబ్దము కలుగునట్లు కాలి గొలుసుల నీడ్చుకొనుచున్న నీ యేనుఁగులు పడకలను విడిచి లేచుచున్నవి. అట్లు లేచిన యా యేనుఁగుల మొగ్గలవంటి దంతములు, బాల సూర్యకాంతులు తమపైఁ బడుటచేత, మణిశిలాది పర్వత సానువులను గోరాడి యున్నట్లు ప్రకాశించుచున్నవి, ఆ యంద మును జూచుటకు మేల్కొనుమని యభిప్రాయము.

శ్లో. దీర్ఘే ష్వమీ నియమితాః పటమండపేషు
నిద్రాం విహాయ వనజాక్ష! వనాయుదేశ్యాః,
వక్త్రోష్మణా మలినయంతి పురోగతాని
లేహ్యాని సైంధవశిలా శకలాని వాహాః. 73

వ్యాఖ్య: హేవనజాక్ష - ఓ కమలనయన! దీర్ఘేషు, పటమండపేషు - పొడవుగా వేయఁబడిన డేరాలయందు, నియమితాః - కట్టివేయఁబడినవియు, వనాయుదేశ్యాః - పారశీక దేశమునఁ బుట్టినవియునగు, అమీ, వాహాః - ఈ గుఱ్ఱములు, నిద్రాంవిహాయ - నిద్రను విడిచి, పురోగతాని - తమముందున్న, లేహ్యాని - నాలుకతో రుచిచూడఁదగిన, సైంధవశిలాశకలాని - సైంధవ లవణపు ముక్కలను, వక్త్రోష్మణా - నోటి వెచ్చదనముచేత, మలినయంతి - నల్లబరచు చున్నవి. ఓ పద్మాక్ష! నిడివిగా వేయబడిన డేరాలయందుఁ గట్టి వేయఁబడినవియు, పారశీక దేశమునుండి తెప్పింపఁబడినవియునగు నీ యీ గుఱ్ఱములు, తమ ముందుంచబడిన సైంధవలవణపు ముక్కలను నోటి వేడిమిచేత నల్లబడునట్లుగాఁ

జేయుచున్నవి. అనఁగా గుఱ్ఱములకు ప్రాతఃకాలమున లవణము పెట్టు సమయమైనది నిద్ర లెమ్మనిభావము. సైంధవలవణము మిక్కిలి తెల్లనిది కనుక నోటి వేడిమికి నల్లఁబడుచున్నట్లు చెప్పెను. గుఱ్ఱములకు ఉదయ కాలమున లవణమును బెట్టుట ఆరోగ్యకరమని సిద్ధయోగ సంగ్రహమను గ్రంథమున నున్నట్లు మల్లినాథ వ్యాఖ్య.

"పూర్వాహ్ణకాలే చాశ్వానాం ప్రాయశో లవణం హితం।
అర్కుచి గ్లాని శూలఘ్నం లవణం సైంధవం వరమ్."

శ్లో. భవతి విరళభక్తి ర్గ్లానపుష్పోపహారః
స్వకిరణ పరివేషోద్భేద శూన్యాః ప్రదీపాః
అయ మపి చ గిరం నస్త్వత్ప్రబోధప్రయుక్తా
మనువదతి శుక స్తే మంజువాక్ పంజరస్థః 74

వ్యాఖ్య: గ్లానపుష్పోపహారః—(పూజలకై, అలంకరణమునకై వేయ బడినవియై) గ్లాన - వాడిపోయిన, పుష్పోపహారః - మాలారూపమున సమర్పింప బడిన పూలకానుక, విరళ భక్తిః - సడలిన కూర్పుకలది, భవతి - అగుచున్నది; ప్రదీపాశ్చ - పెద్ద పెద్ద దీపములు సైతము, స్వకిరణ పరివేషోద్భేదశూన్యాః—స్వకీరణ - తమకిరణముల యొక్క, పరివేష - మండలముయొక్క, ఉద్భేద - స్ఫురణము చేత, శూన్యాః - శూన్యములైనవి (కిరణ మండలములు లేనివి). భవంతి - అగుచున్నవి, అపిచ - మరియును, ఆయం - ఈ, మంజువాక్ - ముద్దు పలుకులు గలదియు, పంజరస్థః - పంజరమున నున్నదియునగు, తే.శుకః- నీ చిలుక, త్వత్ప్రిబోధప్రయుక్తాం—త్వత్ప్రిబోధ - నిన్ను మేల్కొలుపుటకై, ప్రయుక్తాం - ఉచ్చరింప బడిన, నః, గిరం - మా వాక్కును, అనువదతి - తిరిగి పలుకుచున్నది. దేవతాది విగ్రహములకు, గృహాలంకరణాదులకు సమర్పింపబడిన పూలదండల కూర్పు, పూలు వాడుటచేత సడలి పోవుచున్నది, దీపములు తమ చుట్టు నేర్పడిన కిరణమండలములను గోల్పోవుచున్నవి, పంజరమునందున్న యీ నీ చిలుక మేము పాడుచున్న ప్రబోధ గీతములను పలుకుచున్నది. కనుక నిద్ర మేల్కొనుము అని భావము. అనువదతి అనునది క్రియ, అనువాదము నామవాచకము.

శ్లో. ఇతి విరచితవాగ్భి ర్వందిపుత్రైః కుమారః
సపది విగతనిద్రః తల్ప ముజ్జాంచకార;
మదపటు నినదద్భి ర్బోధితో రాజహంసైః
సురగజ ఇవ గాంగం సైకతం సుప్రతీకః 75

వ్యాఖ్య: ఇతి - ఈ ప్రకారముగా, వందిపుత్రైః - వైతాళిక యువకుల చేత, విరచితవాగ్భిః - స్తుతివర్ణనాత్మకముగా రచింపఁబడిన వాక్కులచేత, సపది - తక్షణమే, విగతనిద్రః - తొలఁగిన నిద్రగల, కుమారః - అజుఁడు, తల్పం-శయ్యను, మదపటునినదద్భిః—మదముచేత మధురముగా అరచుచున్న. రాజహంసైః - రాయంచల చేత, బోధితః - మేలుకొలుపఁబడిన, సుప్రతీకః - సుప్రతీక మను పేరిటి, సుదగజః - ఈశానదిగ్గజము, గాంగం, సైకతం, ఇవ - గంగానది యందలి యిసుక దిబ్బను వలె, ఉజ్జాంచకార - వదలెను. మధుర రచనాత్మకములైవ వైతాళికుల స్తుతి గీతములను విన్న వెంటనే, నిద్ర తొలగిఁన యజమహారాజు, తన తల్పమును, మదమధురములైన రాయంచల యరపుల చేత సుప్రతీక మను దిగ్గజము గంగ యందలి యిసుకదిబ్బనువలె, విడిచిలేచెను. ఇచ్చట సుప్రతీకము నుపమానముగాఁ జెప్పుటకు కారణము, అది ఈశాన్యదిగ్గజమై కైలాస వాసము గలది యగుటచేత గంగాస్నాన, గంగా సైకత శయనములు దానికి నిత్యము లభించుచుండునని సూచించుటకు. "ఐరావతము, పుండరీకము, వామనము, కుముదము, అంజనము, పుష్పదంతము, సార్వభౌమము, సుప్రతీకము" అనునవి వరుసగా దిగ్గజముల పేర్లు.

శ్లో. అథ విధి మవసాయ్య శాస్త్రదృష్టం
దివసముఖోచిత మంచితాక్షిపక్ష్మా,
కుశల విరచితానుకూల వేషః
క్షితిపసమాజ మగాత్ స్వయంవరస్థమ్. 76

వ్యాఖ్య: అథ - నిద్రమేల్కొని పాన్పును వదలి వచ్చినతరువాత, అంచితాక్షిపక్ష్మా - అందమైన కనురెప్పలుగల యజమహారాజు, శాస్త్రదృష్టం - శాస్త్రమునందుఁ జూడబడినదియు, దివసముఖోచితం — దివసముఖ - ప్రాతఃకాలమునందు, ఉచితం - చేయఁదగిన, విధిం - కర్మానుష్ఠానమును, అవసాయ్య -

ముగించి, కుశలవిరచితానుకూలవేషఃకుశల - అలంకరించుటలో నేర్పరులైన వారిచేత, విరచిత - ధరింపఁ జేయఁబడిన, అనుకూలవేషః - స్వయంవరమున కనుకూలమైన వేషము గలవాఁడై, స్వయంవరస్థం - స్వయంవర మంటపము నందున్న, క్షితిపసమాజం - రాజబృందమును, అగాత్ - చేరెను. నిద్రనుండి మేలుకొనిన పిమ్మట నజుఁడు శాస్త్రమునందుఁ జూడఁబడిన ప్రాతఃకాల కర్మలను నిర్వర్తించి, నేర్పరులైన వారిచే రచింపఁబడిన వేష భూషణములు గలవాఁడై, స్వయంపర•మంటపమునందున్న రాజబృందమును జేరెను. ఇచ్చటి "అంచితాక్షి పక్ష్మ" యను విశేషణము, అజుఁడు నిద్రనుండి లేవగానే ఎట్లు ప్రసన్న ముఖముతో నుండెనో. అతని కనులయం దెట్లు శాస్త్ర దర్శనము వెల్లివిరియు చుండెనో తెలుపుటకు. అసలు ప్రతివర్ణనమును ఒక చిత్రముగీసి చూపుట కాళిదాసుకు సహజముగదా!

ఇది మహాకవి కాళిదాసకృత

రఘువంశ కావ్యమున పంచమ సర్గమునకు

తెలుఁగు లఘువ్యాఖ్య

మహాకవి కాళిదాసకృత రఘువంశము

ష ష్ఠ స ర్గ ము

శ్లో. స తత్ర మంచేషు మనోజ్ఞ వేషాన్
సింహాసనస్థా నుపచారవత్సు,
వైమానికానాం మరుతా మపశ్య
దాకృష్టలీలాన్ నరలోకపాలాన్. 1

వ్యాఖ్య: సః - ఆ యజమహారాజు, తత్ర - ఆ స్వయంవర మంటపము నందు, ఉపచారవత్సు - రాజోపచారములతో గూడిన, మంచేషు - సుఖముగా కూర్చునిచూచుటకు వీలైన ఉన్నతాసనములగు మంచలయందు, సింహాసనస్థాన్ - భద్రాసనముల మీద కూర్చున్న వారును, మనోజ్ఞ వేషాన్ - మనోహరమైన వేషములు గలవారును, వైమానికానాం - విమానములపై సంచరించుచున్న, మరుతాం-దేవతలయొక్క, ఆకృష్టలీలాన్-ఆకర్షింపఁబడిన విలాసములు గలవారైన, నరలోక పాలాన్ - రాజకుమారులను, అపశ్యత్ - చూచెను. స్వయంవరార్థమై వచ్చిన రాజకుమారులందఱు వరుసగానున్న మంచెలమీద దేవతల వైభవముతో గూర్చుని యుండుటను అజమహారాజు చూచెనని భావము.

శ్లో. రతే ర్గృహీతానునయేన కామం
ప్రత్యర్పితస్వాంగ మివేశ్వరేణ,
కాకుత్స్థ మాలోకయతాం నృపాణాం
మనో బభూవేందుమతీ నిరాశమ్. 2

వ్యాఖ్య: రతేః - రతిదేవియొక్క, గృహీతానునయేన — గృహీత - స్వీకరింపఁబడిన, అనునయేన - బ్రతిమాలుకొనుటగల (రతిదేవి ప్రార్థనకు ప్రస

న్నుఁడైన) ఈశ్వరేణ - శివునిచేత, ప్రత్యర్పిత స్వాంగం - తిరిగి యిచ్చివేయఁ బడిన తన శరీరముగల, కామమివ - మన్మథుఁడో యనునట్లు, స్థితం - ఉన్నట్టి, కాకుత్సం - అజమహారాజును, ఆలోకయతాం - చూచుచున్నట్టి, నృపాణాం - రాజులయొక్క, మనః - మనస్సు, ఇందుమతీ నిరాశం - ఇందుమతియందు నిరాశ గలది, బభూవ - ఆయెను. మన్మథునివలెనున్న అజమహారాజును జూచినపిమ్మట ఇందుమతి తమను పరింపఁబోదని స్వయంవరాగతులైన రాజులు నిరాశ బొందిరని భావము.

శ్లో. వైదర్భ నిర్దిష్ట మసౌ కుమారః
క్లృప్తేన సోపానపథేన మంచం,
శిలావిభంగై ర్మృగరాజ శాబ
స్తుంగం నగోత్సంగ మివారురోహ. 3

వ్యాఖ్య: అసౌ - ఈ, కుమారః - యువకుఁడైన అజుఁడు, వైదర్భ నిర్దిష్టం - విదర్భ రాజైన భోజునిచేత చూపఁబడిన, మంచం-మంచెను, క్లృప్తేన - చక్కగా తయారు చేయఁబడిన, సోపానపథేన - మెట్లదారిచేత, మృగరాజశాబః - సింహపుపిల్ల, శిలావిభంగైః — శిలా - బాళ్లయొక్క, విభంగైః - మెట్లు మెట్లుగా నేర్పడిన బాళ్లచేత, తుంగం - ఎత్తయిన, నగోత్సంగం ఇవ—నగ - పర్వతముయొక్క, ఉత్సంగంఇవ - అగ్రభాగమునువలె, ఆరురోహ - ఎక్కెను. ఈనాటి సర్కస్ గ్యాలరీవలె సోపానమార్గమును, దానిపై మంచెలను ఉన్నతముగా నమర్చియుండిరని భావము. అట్టి మంచెమీదికి సింహపుపిల్ల కొండమీదికి ఎక్కినట్లు అజుడు ఎక్కెను.

శ్లో. పరార్ధ్య వర్ణాస్తరణోపపన్న
మాసేదివాఁ రత్నవదాసనం సః,
భూయిష్ఠ మాసీ దుపమేయకాంతి
ర్మృయూరపృష్ఠాక్రమణా గుహేన. 4

వ్యాఖ్య: పరార్ధ్య వర్ణాస్తరణోపపన్నం—పరార్ధ్య - శ్రేష్ఠములైన, వర్ణ-రంగులుగల, ఆస్తరణ - పరువఁబడిన రత్న కంబళాదులతో, ఉపపన్నం - కూడి

నదియు, రత్నవత్ - వివిధ రత్నములుగల, ఆసనం - పీఠమును, ఆసేదివాన్ - ఎక్కిన, సః - ఆ యజమహారాజు, మయూర పృష్ఠాశ్రయిణా - నెమలి వీపుమీద కూర్చున్న, గుహేన - కుమారస్వామితో, భూయిష్ఠం - ఎక్కువగా, ఉపమేయ కాంతిః - పోల్పఁదగిన కాంతి గలవాఁడు, ఆసీత్ - ఆయెను. రంగురంగుల యీకలుగల నెమలిమీద కూర్చున్న షణ్ముఖునివలె రత్నకంబళము పరచిన మంచె మీద కూర్చున్న యజుఁడు ప్రకాశించెనని భావము.

శ్లో. తాసు శ్రియా రాజపరంపరాసు
ప్రభావిశేషోదయ దుర్నిరీక్ష్యః,
సహస్రధాఽఽత్మా వ్యరుచ ద్విభక్తః
పయోముచాం పంక్తిషు విద్యుతేవ. 5

వ్యాఖ్య: తాసు, రాజపరంపరాసు - ఆ రాజులయొక్క వరుసలయందు, శ్రియా - కాంతిచేత, పయోముచాం - మేఘములయొక్క, పంక్తిషు - వరుసలయందు, విద్యుతేవ (విద్యుతా + ఇవ) - మెఱుపుచేతవలె, సహస్రధా - వేయి విధములుగా, విభక్తః - విభజింపబడినట్టిదై, ప్రభావిశేషోదయ దుర్నిరీక్ష్యం — ప్రభావిశేష - ఒక్కొక్క కాంతియొక్క, ఉదయ - పుట్టుకచేత, దుర్నిరీక్ష్యం - చూడ శక్యముగానిదైన, ఆత్మా - కాంతిస్వరూపము, వ్యరుచత్ - ప్రకాశించెను. జల తరంగములయందు సూర్యుఁడువలె కాంతిస్వరూపము ఒక్కొక్క రాజునం దొక్కొక్క విధముగా సంక్రమించి స్వయంవర మంటపమునందు కనులు మిరు మిట్లు గొలుపుచు ప్రకాశించెనని భావము.

శ్లో. తేషాం మహార్హాసన సంస్థితానాం
ఉదార నైపథ్య భృతాం స మధ్యే,
రరాజ ధామ్నా రఘుసూను రేవ
కల్పద్రుమాణా మివ పారిజాతః. 6

వ్యాఖ్య: మహార్హాసన సంస్థితానాం — మహార్హాసన - శ్రేష్ఠములైన పీఠ ముల మీద, సంస్థితానాం - కూర్చున్నట్టియును. ఉదార నైపథ్యభృతాం - ఉజ్జ్వల మైన వేషములను ధరించినట్టి, తేషాం - ఆ రాజులయొక్క, మధ్యే - నడుమ, కల్పద్రుమణాం - దేవతా వృక్షములయొక్క, మధ్యే - నడుమ

పారిజాతః ఇవ - పారిజాత వృక్షమువలె, సః - ఆ, రఘుసూనుః ఏవ - రఘు రఘుమహారాజు కుమారుఁడైన యజుఁడే, ధామ్నా - తేజస్సుచేత, రరాజ - ప్రకాశించెను. ఆసనములమీఁద ఉజ్వల వేషధారులై యున్న ఆ రాజకుమారు లందఱిలోను కల్పవృక్షముల నడుమ పారిజాతమువలె అజుఁడే మహోజ్వలముగా ప్రకాశించెనని భావము. ఇచ్చట 'కల్పద్రుమ' శబ్దము 'కల్పవృక్ష' పర్యాయమేయైనను కల్పయంతి మనోరథాన్ (కోరికలనిచ్చునది) అను వ్యుత్పత్తిచేత దేవతరువు లన్నిటికినీ ఉపలక్షకముగాఁ బ్రయోగింపఁబడినది. కనుక కల్పవృక్షములలో పారిజాతము వలెనని భావము. 'ధామ్నా' అనుచోట 'భూమ్నా' అను పాఠము గలదు. అప్పుడు 'భూమ్నారరాజ' అనగా నెక్కువగా ప్రకాశించెనని యర్థము.

శ్లో. నేత్రవ్రజాః పౌరజనస్య తస్మిన్
విహాయ సర్వాన్ నృపతీన్ నిపేతుః,
మదోత్కటే రేచితపుష్పవృక్షా
గంధద్విపే వన్య ఇవ ద్విరేఫాః. 7

వ్యాఖ్య: పౌరజనస్య - పురజనముయొక్క, నేత్రవ్రజాః - నయన సమూహములు(చూపులన్నియు), సర్వాన్ నృపతీన్ - రాజులందరిని, విహాయ - విడిచిపెట్టి, తస్మిన్-ఆ యజునియందు, మదోత్కటే - మదము కారుచున్నగండస్థలములు గలదియు, వన్యే - వనమునందలిది యైన, గంధద్విపే - మదగజముమీద, రేచితపుష్పవృక్షాః—రేచిత - రిక్తములుగాఁజేయఁబడిన, పుష్పవృక్షాః -పూలచెట్లుగల, ద్విరేఫాః ఇవ-తుమ్మెదలువలె, నిపేతుః - పడినవి. మదస్రావముగల గంధ గజము రాగానే తుమ్మెదలు తామున్న పూలచెట్లను పూర్తిగా వదలి యా యేనుఁగుపై వ్రాలినట్లు పురజనుల చూపులు అజుఁడురాగానే రాజులందఱిని వదలి యతనిపై వ్రాలెనని భావము. ఇందలి 'వన్య' శబ్దము తుమ్మెదలు పుష్పవృక్షములను వదలుటకును, 'గంధద్విప' శబ్దము పుష్పపరిమళ మకరందములకంటెఁ దుమ్మెదలకు గజమదము మిక్కిలి యాకర్షకమనుటకును ఉపయుక్తములు. నేత్రవ్రజములకు ద్విరేఫసామ్యము పోలికయందేకాక ఏకకాల పతనమునకు నుపయోగించుచున్నది. పరికర, పరికరాంకురములను నలంకారముల సహాయమును పొందిన యుపమాలంకారము స్ఫుటముగా నున్నది.

శ్లో. అథ స్తుతే వందిభి రన్వయజ్ఞైః
సోమార్కవంశ్యే నరదేవలోకే
సంచారితే చాగరుసారయోనౌ
ధూపే సముత్సర్పతి వై జయంతీః. 8

వ్యాఖ్య: ఈ శ్లోకమునుండి మూడు శ్లోకముల వఱకు నొకే మహావాక్యము. అథ - పిమ్మట, అన్వయజ్ఞైః - రాజవంశముల నెఱిగినవారైన, వందిభిః - స్తుతిపాఠకులచేత, సోమార్క వంశ్యే - చంద్ర సూర్యవంశములందు బుట్టిన, నరదేవలోకే—నరదేవ - స్వయంవరమునకు వచ్చిన రాజులయొక్క, లోకే - సమూహము, స్తుతే (సతి) - పొగడబడిన దగుచుండగా, సంచారితే - అంతటను ప్రసరించునట్లు చేయబడినదియు, అగరుసారయోనౌ - శ్రేష్ఠమైన యగరువలన బుట్టినదియునగు, ధూపే - ధూపము (పరిమళ యుక్తమైన పొగ), వైజయంతీః - జెండాలను (అందఱు రాజులవి), సముత్సర్పతి (సతి) - ఎగబ్రాకుచున్నది యగుచుండగా.

శ్లో. పురోపకంఠోపవనాశ్రయాణాం
కలాపినా ముద్ధత నృత్త హేతౌ,
ప్రౌధ్మాతశంఖే పరితో దిగంతాన్
తూర్యస్వనే మూర్ఛతి మంగళార్థే. 9

వ్యాఖ్య: పురోపకంఠోపవనాశ్రయాణాం — పురోపకంఠ - పట్టణ సమీపమునందలి, ఉపవనాశ్రయాణాం - ఉద్యానములు నివాసములుగా గల, కలాపినాం - నెమళ్లయొక్క, ఉద్ధత నృత్తహేతౌ - ఉత్కృష్టతాండవమునకు కారణమైనదియు, ప్రౌధ్మాతశంఖే - పెద్దగా ఊదబడిన శంఖములు గలదియు, మంగళార్థే - శుభప్రయోజనము గలదియు నగు, తూర్యస్వనే - వాద్యముల ధ్వని, పరితః - అంతట, దిగంతాన్ - దిగంతములను, మూర్ఛతి (సతి) - వ్యాపించుచున్నదగుచుండగా.

శ్లో. మనుష్యవాహ్యం చతురంతయాన
మధ్యాస్య కన్యా పరివారశోభి,

వివేశ మంచాంతర రాజమార్గం
పతింవరా క్ష్మా ప్రవివాహవేషా. 10

వ్యాఖ్య: పతింవరా - పతిని వరించునదియు, క్ష్మాప్తవివాహవేషా - రచిం
పఁబడిన పెండ్లికూతురు వేషము గలదియునగు, కన్యా - కన్యక (ఇందుమతి),
మనుష్యవాహ్యం - మనుష్యులచేత మోయఁబడినదియు, పరివారశోభి - దాస దాసీ
జనముచేత ప్రకాశించుచున్నదియునగు, చతురంతయానం - పల్లకిని, అధ్యాస్య -
ఎక్కి, మంచాంతర రాజమార్గం - మంచెల నడుమనున్న రాజమార్గమును
(రాజులు ఇరుప్రక్కలగల మార్గమునని యర్థము), వివేశ - ప్రవేశించెను. ఇట్లు
మూడు శ్లోకములు కలిసి యొక వాక్యముగా నేర్పడుదానికి విశేషకమనియు, కుశక
మనియుఁ బేర్లు వైభవోపేతముగా పల్లకి యందు గూర్చొని స్వయంవర మంట
పము లోనికి ఇందుమతి ప్రవేశించెనని భావము.

శ్లో. తస్మిన్ విధానాతిశయే విధాతుః
కన్యామయే నేత్రశతైకలక్ష్యే
నిపేతు రన్తఃకరణై ర్నరేంద్రా
దేహైాః స్థితాః కేవల మాసనేషు. 11

వ్యాఖ్య: నేత్రశతైకలక్ష్యే—నేత్రశత - అసంఖ్యాకమైన నేత్రములకు,
ఏకలక్ష్యే - ఒకేయొక దృశ్యమైనదియు, కన్యామయే - కన్యారూపమున నున్న
దియునగు. విధాతుః - బ్రహ్మయొక్క, తస్మిన్ - ఆ, విధానాతిశయే - సృష్టివిశే
షమునందు, నరేంద్రాః - రాజులు, అంతఃకరణైః - మనస్సులచేత, నిపేతుః -
పడిరి, ఆసనేషు - పీఠములయందు, దేహైాఃకేవలం - శరీరములచేత మాత్రము,
స్థితాః - ఉండిరి. రాజులందఱును దేహములను మఱచి యిందుమతియందు
చిత్తములను నిలిపిరని భావము.

శ్లో. తాం ప్రత్యభివ్యక్త మనోరథానాం
మహీపతీనాం ప్రణయాగ్రదూత్యః,

ప్రవాళశోభా ఇవ పాదపానాం
శృంగారచేష్టా వివిధా బభూవుః. 12

వ్యాఖ్య: తాంప్రతి - ఆ యిందుమతీదేవిని గూర్చి, అభివ్యక్తమనోరథానాం - ప్రకటమైన వాంఛలుగల, మహీపతీనాం - రాజులకు, ప్రణయాగ్రదూత్యః—ప్రణయ - ప్రేమవాంఛ నెఱుకపరచుటయందు, అగ్రదూత్యః - మొదటి దూతికలైన (కుంచెనకత్తె లయిన), వివిధాః - అనేక విధములగు, శృంచారచేష్టాః - శృంగార వికారములు, పాదపానాం - చెట్లకు, ప్రవాళశోభాః ఇవ - చిగురుజొంపముల సొగసులవలె, బభూవుః - ఆయినవి (ఉప్పతిల్లినవి), ఇందుమతియందు రాజులకుఁగల ప్రేమవాంఛలు వసంత ఋతువునందు వృక్షముల నుండి పుట్టుకవచ్చు చిగురు జొంపముల వలె నొక్కసారిగా నుప్పతిల్లినవని భావము. శృంగార చేష్టలను దూతికలనుగా భావించుటచేత నలంకారము : ఉత్ప్రేక్ష; విభావానుభావ సాత్త్విక సంచారి భావములచేత సహృదయాస్వాద నీయతను పొందిన రతికి 'శృంగార' మని పేరు. 'రతి' యనఁగా నాయికా నాయకులకు పరస్పరముగా నేర్పడిన స్థిరమైన ఇచ్ఛ. చేష్ట లనగా దాని అనుభావములు.

శ్లో. కశ్చిత్కరాభ్యా ముపగూఢనాళ
మాలోల పత్త్రాభిహత ద్విరేఫమ్
రజోభి రన్తఃపరివేష బంధి
లీలారవిందం భ్రమయాంచకార. 13

వ్యాఖ్య: కశ్చిత్ - ఒకఁడు (స్వయంవరమంచస్థుఁడైన యొక్క రాజు) కరాభ్యాం - చేతులతో, ఉపగూఢనాళం - పట్టుకోఁబడిన కాడగలదియు, ఆలోల పత్రాభిహతద్విరేఫం—ఆలోల - కదలుచున్న, పత్ర - రేకలచేత, అభిహత - కొట్టఁబడిన, ద్విరేఫం - తుమ్మెదలు గలదియు, రజోభిః - పుప్పొడులచేత, అంతఃపరివేషబంధి-లోపల వర్తులాకారము నేర్పరచు నదియునగు, లీలారవిందం-విలాసార్థమై చేతిలో పట్టుకోబడిన కమలమును, భ్రమయాంచకార - గుండ్రముగా త్రిప్పెను, ఆరాజు లీలారవింద భ్రమణ రూపమైన శృంగార చేష్టను ఇందుమతి యెదుట కనబఱచెనని యర్థము. నీవు నన్ను పెండ్లి చేసికొన్న పిమ్మట, నేనిప్పుడు కమలమును తిప్పుచున్నట్లు నీవు నన్ను త్రిప్పవలయునని ఆరాజు భావము. ఇందు

మతి యతనిని "హస్తఘూర్ణకుఁడు - చేతులు నిర్నిమిత్తముగాఁ ద్రిప్పువాఁడు, అవలక్షణకుఁడు" అని భావించి వరింపకపోయెను.

శ్లో. విస్రస్త మంసా దపరో విలాసీ
రత్నానువిద్ధాంగద కోటి లగ్నమ్
ప్రాలంబ ముత్కృష్య యథాప్రదేశం
నినాయ సాచీకృత చారువక్త్రః 14

వ్యాఖ్య: విలాసీ - విలాస స్వభావముగల. అపరః - మరియొక్కరాజు, అంసాత్ - భుజమునుండి, విస్రస్తం - జాఱినదియు. రత్నానువిద్ధాంగద కోటి లగ్నం—రత్న - మణులతో, అనువిద్ధ - చెక్కబడిన, అంగద - భుజకీర్తి యొక్క, కోటి - కొనయందు, లగ్నం - తగుల్కొనిన, ప్రాలంబం - చక్కగా వ్రేలాడుచున్న హారమును, ఉత్కృష్య - పైకియెత్తి (రెండు చేతులతో నని భావము), సాచీకృత చారువక్త్రః - అడ్డముగా త్రిప్ప బడిన అందమగు ముఖము కలవాఁడగుచు, యథాప్రదేశం - దాని స్థానమును, నినాయ - పొందించెను. నిన్ను ఈవిధముగా కొఁగిలించుకొనెదనని యతని యభిప్రాయము. ఇతని దేహమునందు దాచుకొన వలసిన లోపమేదియో కలదని యిందుమతి యనుమానము. ఈ శ్లోకము నందలి "ప్రాలంబ" శబ్దమును "ప్రావార" మని గ్రహించిన పాఠము కలదు. ప్రావారమనగా నుత్తరీయము. శరీరమును దాచుకొనుటకు హారముకంటె ఉత్తరీయ మనుకూలముగా నుండును. కనుక ఆపాఠమే సమంజసముగాఁ గనబడుచున్నది.

శ్లో. ఆకుంచితాగ్రాంగుళినా తతోఽన్యః
కించి త్సమావర్జిత నేత్రశోభః
తిర్య గ్విసంసర్పి నఖప్రభేణ
పాదేన హైమం విలిలేఖ పీఠమ్. 15

వ్యాఖ్య: తతః - వానికంటె, అన్యః - మరియొకఁడు, కించిత్సమావర్జిత-నేత్రశోభః—కించిత్ - కొంచెముగా. సమావర్జిత - వంచఁబడిన, నేత్రశోభః-కన్నుల సోయగము గలవాఁడగుచు, ఆకుంచితాగ్రాంగుళినా—ఆకుంచిత - వంచ

బడిన, ఆగ్రాంగుళినా - కొనవేళ్లు గలదియు, తిర్యగ్విసంసర్పినఖప్రభేణ--తిర్యక్-అడ్డముగా, విసంసర్పి - ప్రసరించుచున్న. నఖప్రభేణ - గోళ్లకాంతులుగలదియు నగు, పాదేన - షాదముచేత, హైమం - బంగారపుదైన, పీఠం - పాదపీఠమును, విలిలేఖ - గీచెను. నా వద్దికి రమ్మనునది యాతని యభిప్రాయము. నేలగీఱు వాడు అవలక్షణపు పెండ్లి కొడుకని యిందుమతి యనుమానము. నేలను గీఱుట లక్ష్మీవినాశహేతువని లోకాభిప్రాయము.

శ్లో. నివేశ్య వామం భుజ మాసనార్థే
తత్సన్నివేశా దధికోన్నతాంసః
కశ్చి ద్వివృత్త త్రిక భిన్నహారః
సుహృత్సమాభాషణ తత్పరోఽభూత్. 16

వ్యాఖ్య : కశ్చిత్ - ఒకానొకరాజు. వామం, భుజం - ఎడమ బాహువును, ఆసనార్థే - సింహాసనముయొక్క సగమునందు, నివేశ్య - ఉంచి. తత్సన్నివేశాత్ -దాని నట్లుంచుటవలన, అధికోన్నతాంసః—అధికోన్నత - మిక్కిలియెత్తైన, అంసః - భుజ శిరస్సు గలవాఁడగుచు, వివృత్తత్రిక భిన్నహారః—వివృత్త - తిరిగిన, త్రిక - వెన్నెముక యొక్క క్రింది భాగమునందు, భిన్న - చెదరి వ్రేలాడుచున్న, హారః - ముత్యాల హారము గలవాఁడగుచు, సుహృత్సమాభాషణతత్పరః—సుహృత్ - మిత్రునితో (ఎడమ ప్రక్కన గూర్చున్నవాఁడు), సమాభాషణ - మక్కువతో మాట్లాడుకొనుట యందు, తత్పరః - ఆసక్తిగలవాఁడు. అభూత్-అయ్యెను. "పృష్ఠవంశాధరే త్రికమ్" అని యమరము. నిన్ను వా మాంకముపైఁ గూర్చుండ బెట్టుకొని యిట్లు ముచ్చట లాడెదనని యీరాజు భావము. నన్ను జూచి పెడ మొగము పెట్టుకొన్న యితనిని వరించి యేమి లాభమని యిందుమతి యభిప్రాయము.

శ్లో. విలాసినీ విభ్రమ దంతపత్ర
మాపాండురం కేతకబర్హ మన్యః
ప్రియా నితంబోచిత సన్నివేశై
ర్వ్యపాటయామాస యువా నఖాగ్రైః 17

వ్యాఖ్య: అన్యః - మరియొక, యువా - యువకుడు, విలాసినీవిభ్రమ దంతపత్రం—విలాసినీ - విలాసవతులగు స్త్రీలకు, విభ్రమ - విలాసార్థమైన, దంతపత్రం - చెవి కమ్మయైనట్టిదియు. ఆపాండురం - అంతటను తెల్లగా నున్న కేతకబర్హం - మొగలి రేకును. ప్రియానితంబోచితసన్నివేశైః—ప్రియానితంబ-ప్రియురాలి పిఱుదల యందు, ఉచిత సన్నివేశైః - అభ్యసించిన ఉనికిగల, నఖా గైశ్చ - గోళ్ల కొనలచేత, విపాటయామాస - చీల్చుచుండెను. ఈ విధముగా సీనితంబమునందు నఖక్షతములుంచెదనని రాజు నభిప్రాయము. ఇతడు తృణచ్ఛేదకుడైన యవలక్షణుడని యిందుమతి యతని నంగీకరింపలేదు.

శ్లో. కుశేశయాతామ్ర తలేన కశ్చిత్
కరేణ రేఖాధ్వజ లాంఛనేన
రత్నాంగుళీయ ప్రభయా ఽనువిద్ధాన్
ఉదీరయామాస సలీల మక్షాన్ 18

వ్యాఖ్య: కశ్చిత్ - ఒకానొక రాజు, కుశేశయాతామ్రతలేన—కుశేశయ-నూఱురేకుల తామర పువ్వువలె, ఆతామ్ర - అంతటను ఎఱ్ఱగా నున్న, తలేన-అరచేయి కలదియు, రేఖాధ్వజలాంఛనేన—రేఖాధ్వజ - రేఖా రూపమున నున్న ధ్వజముచేత (సాముద్రిక శాస్త్ర ప్రసిద్ధమైన ధ్వజరేఖచేత) లాంఛనేన - చిహ్నము గలిదియునగు, కరేణ - చేతితో, రత్నాంగుళీయ ప్రభయా - రత్నాలు చెక్కిన యుంగరపు కాంతిచేత. ఆనువిద్ధాన్ - వ్యాప్తములైన, అక్షాన్ - పాచికలను, ఉదీరయామాస - ఎత్తివేసెను. నీతో నేనిట్లు క్రీడలు సల్పుదునని యతనిభావము ఈతడు జూదగాడు గాని సత్పురుషుడు గాడని యిందుమతి యభిప్రాయము. పేయి రేకులు గల తామర పువ్వునకు 'కమల' మనియు, నూఱురేకులు గల దానికి 'కుశేశయ' మనియు బేర్లు. "అక్షైర్మాదీవ్య" అని వేదము జూదమాడుటను నిషేధించినది. కనుక ఇందుమతి యతనిని వరింపలేదు.

శ్లో. కశ్చి ద్వ్యథాభాగ మవస్థితేఽపి
స్వసన్నివేశాత్ వ్యతిలంఘి నీవ
రత్నాంశు గర్భాంగుళి రంధ్ర మేకం
వ్యాపారయామాస కరం కిరీటే. 19

వ్యాఖ్య : కశ్చిత్ - ఒకరాజు, యథాభాగం - ఉండవలసినచోట, అవస్థితే అపి - ఉన్నదేయైనను, స్వసన్నివేశాత్ - తానుండవలసినచోట. నుండి, వ్యతిలంఘిని ఇవ - తొలగియున్నట్టి దానియందువలె, కిరీటే - తన కిరీటమునందు, రత్నాంశుగర్భాంగుళిరంధ్రం—రత్నాంశు - మణికాంతులు, గర్భ - లోపలగలిగిన, అంగుళి - వ్రేళ్లయొక్క, రంధ్రం - సందులు గలిగిన, ఏకంకరం- ఒక చేతిని, వ్యాపారయామాస - ప్రవర్తింపఁజేసెను. ప్రేమతో ఈ కిరీటమునువలె నిన్ను తలపై నెక్కించుకొని లాలనము చేయుదునని యతని యభిప్రాయము, శుభసమయమున నెత్తి మీద చేతిని పెట్టుకొన్న యితఁడపలక్షణుఁడవి యిందుమతి భావము. ఇట్లు స్వయంవరమంచస్థులైన రాజులు ఇందుమతిని చూడగానే నన్ను వరింపుము, నన్ను వరింపుము, అని శృంగార చేష్టలు చేసిరనియు, ఆచేష్టలేవియు నిందుమతికి సమ్మతినిఁ జేకూర్పఁజాలక పోయెననియుఁ గడచిన యేడు శ్లోకములవర్ణనకుఁ దాత్పర్యము,

శ్లో. తతో నృపాణాం శ్రుతవృత్తవంశా
పుంవత్ ప్రగల్భా ప్రతిహారరక్షీ
ప్రాక్సన్నికర్షం మగధేశ్వరస్య
నీత్వా కుమారీ మవదత్ సునందా 20

వ్యాఖ్య : తతః - పిమ్మట, నృపాణాం - రాజులయొక్క, శ్రుతవృత్తవంశా - శ్రుత - వినఁబడియున్న, వృత్త - నడవడికలును, వంశా - వంశములును గలదియు. ప్రగల్భా - వాగ్మినియునైన సునందా - సునంద యను పేరుగలఃప్రతిహారరక్షీ - అంతఃపుర ద్వారపాలకురాలు. ప్రాక్ - మొట్టమొదట, కుమారీం- ఇందుమతిని, మగధేశ్వరస్య - మగధ రాజు యొక్క, సన్నికర్షం - సమీపమును, నీత్వా - చేర్చి, పుంవత్ - పురుషునివలె (దిట్టతనముతో), అవదత్ - పలికెను, రాజకుమారుల కుల శీల వేషముల నెఱిగినట్టి సునందయను సఖి మొదట మగధరాజు వద్ద నిలిపి వర వర్ణనము చేయుట కారంభించెనని భావము.

శ్లో. అసౌ శరణ్యఃశరణోన్మఖానాం
అగాధసత్త్వో మగధప్రతిష్ఠః

రాజా ప్రజారంజన లబ్ధవర్ణః
పరంతపో నామ యథార్థనామా 21

వ్యాఖ్య: అసౌ - ఈ యెదుటనున్న, రాజా - రాజు, శరణోన్ముఖానాం-శరణార్థులకు, శరణ్యః - రక్షకుఁడును, అగాధసత్త్వః - లోతైన స్వభావము గల వాఁడును, మగధప్రతిష్ఠః - మగధ దేశమునందు నివాసము గలవాఁడును, ప్రజారంజనలబ్ధవర్ణ—ప్రజారంజన - ప్రజారంజనమునందు, లబ్ధవర్ణః - సంపాదింపబడిన యశస్సు గలవాఁడును, పరంతపః నామ - పరంతపుఁడను పేరున ప్రసిద్ధుఁడైన, యథార్థనామా - సార్థకనామధేయుఁడైన రాజు, (శత్రువులను భయపెట్టువాఁడు) ఇతఁడు శరణాగత రక్షణ గాంభీర్య, ప్రజారంజనాది గుణములు గల వాఁడు. ఇతని పేరు "పరంతపుడు" అని చెప్పెను.

శ్లో. కామం నృపాః సంతు సహస్రశోఽన్యే
రాజ్వతీ మాహు రనేన భూమిం
నక్షత్ర తారాగ్రహ సంకులాఽపి
జ్యోతిష్మతీ చంద్రమసైవ రాత్రిః 22

వ్యాఖ్య: అన్యే - ఇతరులైన, నృపాః - రాజులు, కామం - యథేచ్ఛగా, సహస్రశః - వేలకొలది. సన్తు - ఉందురుగాక, భూమిం - భూమిని. అనేన-ఈ పరంతపుని చేతనే, రాజన్వతీం - మంచి రాజు కల దానినిగా, ఆహుః-చెప్పుదురు. (అదియుక్తమే) నక్షత్ర తారాగ్రహసంకులా, అపి—నక్షత్ర-అశ్వని మొదలగు నక్షత్రములచేతను, తారా - సామాన్య తారలచేతను, గ్రహ - కుజాది గ్రహములచేతను, సంకులాపి - క్రిక్కిఱిసి యున్నదైనను, రాత్రిః - రాత్రి, చంద్రమసైవ (చంద్రమసా + ఏవ) చంద్రుని చేతనే. జ్యోతిష్మతీ - వెలుతురు కలది యగును. ఎందఱు రాజులున్నను పరంతపుని వలె దేశమునకు కీర్తిని దెచ్చిన వారులేరనియు నితఁడొకఁడే గొప్పరాజనియు భావము ఎన్ని నక్షత్రములున్నను చంద్రుని వలె రాత్రికి వెలుతురు నియ్యజాలపు కదా!

శ్లో. క్రియాప్రబంధా దయ మధ్వరాణాం
అజస్ర మాహూత సహస్రనేత్రః

శచ్యా శ్చిరం పాండుకపోల లంబాన్
మందారశూన్యా నలకాం శ్చకార. 23

వ్యాఖ్య: అయం - ఇతఁడు, అధ్వరాణాం - యజ్ఞములయొక్క, క్రియా ప్రబంధాత్ - అనుష్ఠాన నిత్యతవలన (అవిచ్ఛిన్నముగా యాగములు చేయు చుండుటవలన), అజస్రం - నిత్యమును, అహూత సహస్రనేత్రః - ఆహ్వానింపఁబడిన యింద్రుఁడు కలవాఁడగుచు (ఇంద్రుని యాహూతిలేని యజ్ఞముండదు కనుక ప్రైనందినముగా నింద్రుఁ డితనివద్దకి వచ్చుటయో లేక యిచ్చటనే యుండి పోవుటయో జరుగుచుండునని భావము). చిరం - బహుకాలము, శచ్యాః - శచీదేవి యొక్క, అలకాన్ - ముంగురులను, పాండుకపోల లంబాన్—పాండుకపోల - తెల్లబాఱిన చెక్కిళ్లయందు, లంబాన్ - ప్రేలాడుచుండు వానినిగాను. మందార శూన్యాన్ - కల్పవృక్ష కుసుమ శూన్యములుగాను, చకార - చేసెను. నిత్యము నింద్రుఁడితని వద్దికి వచ్చుచుండుటచేత శచికిని ఇంద్రునికిని వియోగము కల్గిన దనియు, ఆమె పతివ్రతగావున మొగము తెల్ల బడుటయేగాక కేశసంస్కార, కుసుమధారణాదులను మానివేసినదని భావము. "ప్రోషితే మలినా కృశా" అనియు, "క్రీడాం శరీర సంస్కారం సమాజోత్సవ దర్శనం, హాస్యం పరగృహేయానం త్యజేత్ ప్రోషిత భర్తృకా" అనియు లక్షణములు.

శ్లో. అనేన చే దిచ్ఛసి గృహ్యమాణం
పాణిం వరేణ్యేన కురు ప్రవేశే
ప్రాసాద వాతాయిన సంస్థితానాం
నేత్రోత్సవం పుష్పపురాంగనానామ్. 24

వ్యాఖ్య: వరేణ్యేన - వరింపఁ దగినవాఁడయిన, అనేన - ఈ పరంతప మహారాజుచేత, గృహ్యమాణం - పట్టుకోబడు దానినిగా, పాణిం - చేతిని, ఇచ్ఛసిచేత్ - కోరుదువేని (ఇతనిచేత పాణిగ్రహణమున కిష్టపడెదవేని), ప్రవేశే - పుర ప్రవేశమునందు, ప్రాసాద వాతాయన సంస్థితానాం - మేడలయొక్క కిటికీల వద్ద నిలుచుండిన, పుష్పపురాంగనానాం - పాటలీపుత్ర నగరమునందిలి స్త్రీలకు, నేత్రోత్సవం - కన్నుల పండుగను, కురు - చేయుము. అందగత్తెలయిన ఆ రాచనగరు స్త్రీలకు సైతము దర్శనీయమూర్తి వగుదువు కనుక ఇతనిని వరింప దలచినచో వరింపుమని భావము.

శ్లో. ఏవం తయోక్తే తమవేక్ష్య కించి
ద్విస్రంసి దూర్వాంక మధూక మాలా
ఋజుప్రణామ క్రియయైవ తన్వీ
ప్రత్యాది దేశైనమభాషమాణా. 25

వ్యాఖ్య: ఏవం - ఈ విధముగా, తయా - ఆ సునందచేత, ఉక్తేసతి - చెప్పఁబడినది కాగా, తం - మగధరాజైన ఆ పరంతపుని, అవేక్ష్య - చూచి, కించిద్విస్రంసిదూర్వాక మధూకమాలా—కించిత్ - కొంచెముగా, విస్రంసి - జారుచున్న, దూర్వాంక - గఱిక పఱికల చిహ్నాముగల (నడుమ నడుమ గఱిక పఱికలు పెట్టి యల్లిన అని యర్థము), మధూకమాలా - ఇప్పపూల దండగల, తన్వీ - ఇందుమతి, ఏనం - ఈ పరంతపుని, అభాషమాణా - పలుకరింపనిదగుచు, ఋజు ప్రణామ క్రియయైన—ఋజు - సాధారణమైన (ఏ విధమైన వక్రతలేని, అనగా భావశూన్యమును, భాషణశూన్యమునగు), ప్రణామక్రియయాఏవ - నమస్కారము చేయుటచేతనే, ప్రత్యాదిదేశ - పరిహరించెను (అతనిని వరింపక పోయెను). ఒక నమస్కారము పెట్టి ముందుకు సాగెను. పరంతపుఁడు నిరంతరముగా శత్రు నిర్హేలనార్థమైన యుద్ధముల యందును, యజ్ఞ దీక్షలయందును ఆసక్తి గలవాఁడు గనుక పూజ్యుఁడేకాని రసజ్ఞుఁడు కాడని యిందుమతి యభిప్రాయము.

శ్లో. తాం సైవ వేత్రగ్రహణే నియుక్తా
రాజాంతరం రాజసుతాం నినాయ
సమీరణోత్థేవ తరంగరేఖా
పద్మాంతరం మానసరాజహంసీమ్. 26

వ్యాఖ్య: సైవ, వేత్రగ్రహణే, నియుక్తా - దౌవారికియైన అసునందయే, తాం, రాజసుతాం - ఆ యిందుమతిని, రాజాంతరం - మరియొక రాజును గురించి (మరియొకని వద్దికి), సమీరణోత్థా—సమీరణ - గాలిచేత, ఉత్థా - పైకిలేచిన. తరంగరేఖా - రేఖారూపమైన తరంగపంక్తి, మానసరాజహంసీం - మానస సరోవరమునందలి రాజహంసిని, పద్మాంతరం, ఇవ - మరియొక పద్మమువద్దికి వలె, వినాయ - చేర్చెను. ఇది చక్కని యుపమానముగల ఉపమాలంకారము. గాలికి

కదలిన తరంగమాల రాజహంసిని మరియొక కమలమువద్దికిఁ జేర్చినట్లు సునంద యిందుమతిని మరియొక రాజువద్దికిఁ జేర్చినదట.

శ్లో. జగాద చైనా మయ మంగనాథః
సురాంగనా ప్రార్థిత యౌవనశ్రీః
వినీతనాగః కిల సూత్రకారైః
ఐంద్రం పదం భూమిగతోఽపి భుఙ్క్తే. 27

వ్యాఖ్య: ఆసునుద, ఏనాం జగాదచ - ఈ యిందుమతికి ఇట్లు చెప్పెను గూడ, అయం - ఇతఁడు, అంగరాజః - అంగదేశాధిపతి, సురాంగనా ప్రార్థిత యౌవనశ్రీఃసురాంగనా - అప్సరసలచేత, ప్రార్థిత - కోరఁబడిన, యౌవన శ్రీః - జవ్వనపు సొంపుగలవాఁడు, సూత్రకారైః - గజశాస్త్రకారులచేత (పాల కాదులగు మహర్షులచేత), వినీతనాగః, కిల - శిక్షింపఁబడిన ఏనుగులు కలవాఁడని యందురు, భూమిగతః, అపి - భూమిమీద నున్నవాఁడైనను, ఐంద్రం - ఇంద్రుని సంబంధమైన, పదం - పదవిని (ఐశ్వర్యమును), భుఙ్క్తే - అనుభవించుచున్నాఁడు. పూర్వమొకప్పు డింద్రసహాయార్థమై యితఁడు స్వర్గమునకు వెళ్లినప్పుడు అప్సరసలు ఇతనిని కామించిరనియు, ఏదో కారణమువలన భూలోకమున కవతరించిన దిగ్గజవర్గ మితనికి లొంగకపోగా నింద్రుఁడు పంపిన పాలకాదులైన గజశాస్త్ర కారులగు మహర్షులవలన నా గజశాస్త్రమునునేర్చి వాటిని లొంగదీసి భూలోకమున గజశాస్త్ర సంప్రదాయమును విస్తరింపఁజేసె ననియుఁ జెప్పుదురు. కనుక నితఁడు భూలోకమందున్నను, దిగ్గజములచేతను, దేవర్షులచేతను సేవింపబడుటవలన నింద్ర పదము ననుభవించుచున్నాఁడనియు, నితనిని వరించినచో నీకు స్వర్గసుఖ, స్వర్గ గమనాగమనాదులు సుకరము లగుననియు సునంద ఇందుమతికి సూచించెను.

శ్లో. అనేన పర్యాసయతా ఽస్రబిందూన్
ముక్తాఫల స్థూలతమాన్ స్తనేషు,
ప్రత్యర్పితాః శత్రువిలాసినీనా
మున్మార్జ్య సూత్రేణ వినైవ హారాః. 28

వ్యాఖ్య: శత్రువిలాసినీనాం - శత్రువుల భార్యలయొక్క, స్తనేషు - స్తనములయందు, ముక్తాఫల స్థూలతమాన్ - ముత్యములవలె మిక్కిలి పెద్దవైన,

అస్రబిందూన్ - కన్నీటి చుక్కలను, పర్యాసయతా - ప్రస్తరించుచున్న (ఒక చుక్కవెంబడి మరియొక చుక్క యెడతెగక వచ్చునట్లు చేయుచున్న), అనేన - ఈ యంగరాజుచేత, ఉన్మృచ్య - ఎత్తునుండి జార్చి, సూత్రేణవినా - దారము లేకయే, హారాః ఏవ - ముత్యాల హారములే, ప్రత్యర్పితాః - ఉంచఁబడినవి ఇతఁడు శత్రువిజేత, వీరుఁడు. అవిచ్ఛిన్నమైన అశ్రుబిందు ప్రవర్తనమువలన దారములేని హారమే వారి స్తనములయం దుంపఁబడినధా! యను భావము గోచరించుచుండుటవలన నలంకారము: గమ్యోత్ప్రేక్ష.

•

శ్లో. నిసర్గ భిన్నాస్పద మేకసంస్థం
అస్మిన్ ద్వయం శ్రీశ్చ సరస్వతీ చ
కాంత్యా గిరా సూనృతయా చ యోగ్యా
త్వమేవ కల్యాణి! తయో స్తృతీయా. 29

వ్యాఖ్య: నిసర్గ భిన్నాస్పదం—నిసర్గ - స్వభావముచేతనే, భిన్నాస్పదం - వేరువేరు స్థానములందుండునట్టి, శ్రీశ్చ - లక్ష్మియు, సరస్వతీచ - సరస్వతియు ననెడి, ద్వయం - జంట, అస్మిన్ - ఇతనియందు, ఏకసంస్థం - ఒకే యునికి గలదై యున్నది, హే కల్యాణి! - ఓ శుభాంగీ! కాంత్యా - శరీర లావణ్యము చేతను, సూనృతయా - సత్యప్రియమైన, గిరాచ - వాక్కుచేతను, యోగ్యా - తగినదానవై న, త్వమేవ (త్వం + ఏవ) - నీవే, తయోః - ఆ యిద్దటికిని, తృతీయా - మూడవదానవు. నీవే ఇతనికిఁ దగినదానవు. లక్ష్మి, సరస్వతుల యందలి లావణ్య వాగ్మిత్వములుగల నీవు భార్యవగుటకుఁ దగినదానవై యితనిని వరింపుమనియు, నీతని దక్షిణ నాయకత్వమును నిలుపుమనియు భావము.

శ్లో. అథాంగరాజా దవతార్య చక్షుః
యూహీతి జన్యా మవదత్ కుమారీ
నాసౌ నకామ్యా న చ వేద సమ్యక్
ద్రష్టుం న సా భిన్నరుచిర్హి లోకః. 30

వ్యాఖ్య: అథ - ఆ తరువాత, కుమారీ - ఇందుమతీదేవి, అంగరాజాత్ - అంగరాజునుండి, చక్షుః - చూపును, అవతార్య - దింపి, జన్యాం - తల్లిచెలికత్తె

యైన సునందను, యాహి - పద, ఇతి - అని, అవదత్ - పలికెను; అసౌ - ఈ యంగరాజు, కామ్యః - కోరదగినవాఁడు, నేతి న (న + ఇతి + న) - కాడు అనికాదు, సా - ఆ యిందుమతి, సమ్యక్ - చక్కఁగా, ద్రష్టుం - వివేచన చేయుటకు, న వేద ఇతి న - ఎఱుగదు అనుటయుకాదు; లోకః - జనము, భిన్నరుచిః - వేర్వేరురుచి కలది, హి - కదా: సకల గుణసంపన్నుఁడే యైనను అంగరాజును యిందుమతి వరింపలేదు. ఇరువురును గుణవంతులే యైనను ఒకరికొకరు నచ్చక పోవుట లోకస్వభావము. దానికిఁ గారణమును జెప్పఁజాలమని భావము. "జన్యా" యనగా మాతృసఖి. "జన్యా మాతృసఖీ ముదోః" అని విశ్వకోశము. లేక "జన్యా వధూ భృత్యా" అను కేశవ నిఘంటువు ననుసరించి, పెండ్లికుమార్తె దాసి యని యర్థము.

శ్లో. తతః పరం దుష్ప్రసహాం ద్విషద్భిః
నృపం నియుక్తా ప్రతిహారభూమౌ
నిదర్శయామాస విశేషదృశ్యం
మిందుం నవోత్థాన మివేందుమత్యై. 31

వ్యాఖ్య: తతః - తర్వాత, ప్రతిహారభూమౌ - ద్వార ప్రవేశమునందు, నియుక్తా - నియుక్తురాలైన సునంద, ద్విషద్భిః - శత్రువులచేత, దుష్ప్రసహాం - సహింప శక్యముగాని వాఁడును, విశేష దృశ్యం - ఎక్కువగా చూడఁదగిన వాఁడును (రూపవంతుఁడని యర్థము), పరం - మఱియొకఁడైన, నృపం - రాజును, నవోత్థానం - నూతనోదయముగల, ఇందుం, ఇవ - చంద్రునివలె, ఇందుమత్యై - ఇందుమతికి, నిదర్శయామాస - బాగా చూపించెను. శౌర్యవంతుండును, రూపవంతుఁడునైన మఱియొక రాజును చూపెనని భావము. విశేషము: "ప్రతిహార" మనగా ద్వారము. "స్త్రీ ద్వార్ద్వారంప్రతీహారః" అని యమరము.

శ్లో. అవంతినాథోఽయ ముదగ్రబాహు
ర్విశాలవక్షా స్తనువృత్తమధ్యః
ఆరోప్య చక్రభ్రమ ముష్ణతేజాః
త్వష్టేవ యత్నోల్లిఖితో విభాతి. 32

వ్యాఖ్య: ఉదగ్రబాహుః - పొడవైన బాహువులు గలవాఁడును, విశాల వక్షాః - వెడల్పైన వక్షస్థలము గలవాఁడును, తనువృత్తమధ్యః - సన్నపాటి గుండ్రని నడుము గలవాఁడును అయిన, అయం - ఇతఁడు, అవంతినాథః - అవంతి దేశాధీశ్వరుఁడు, త్వష్ట్రా - విశ్వకర్మచేత, చక్రభ్రమం - చక్రాకారమైన సానను, ఆరోప్య - ఎక్కించి, యత్నోల్లిఖితః—యత్న - ప్రయత్నముచేత, ఉల్లిఖితః - చెక్కఁబడిన, ఉష్ణతేజాః, ఇవ - సూర్యునివలె, విభాతి - ప్రకాశించుచున్నాఁడు. సానబట్టిన సూర్యునివలె చూచుటకు వీలై నవాఁడై ప్రకాశించుచున్నాఁడని భావము. విశ్వకర్మ కూతురు సంజ్ఞాదేవి సూర్యునిభార్య; ఆమె తన భర్త యొక్క తేజస్సునకు తట్టుకొనలేక తండ్రిని ప్రార్థింపగా, నతఁడు (త్వష్ట), సూర్యునిచేత ననుజ్ఞాతుఁడై చక్రాకారమైన యంత్రముపై సూర్యుని నఱగరాచుటకు ప్రయత్నించెనని మార్కండేయ పురాణము చెప్పుచున్నది.

"విశ్వకర్మాత్వనుజ్ఞాతః శాకద్వీపే వివస్వతా।
భ్రమ మారోప్య తత్తేజ శ్శాతనాయోపచక్రమే".

కనుక సూర్యుని సానబట్టుట కవి కల్పితముగాక పురాణ ప్రసిద్ధమనియు, అట్టి సూర్యుడు ప్రకృతరాజునకు ఉపమానముగా జెప్పఁబడెననియు గ్రహింపవలయును.

శ్లో. అస్య ప్రయాణేషు సమగ్రశక్తే
రగ్రేసరై ర్వాజిభి రుత్థితాని
కుర్వంతి సామంత శిఖామణీనాం
ప్రభా ప్రరోహా స్తమయం రజాంసి. 33

వ్యాఖ్య: సమగ్రశక్తేః - సంపూర్ణమైన శక్తిగల (రాజున కుండివలసిన ప్రభుశక్తి, మంత్రవక్తి, ఉత్సాహశక్తి అనఁబడు శక్తిత్రయము గలవాఁడని యర్థము), అస్య - ఈ యవంతిరాజుయొక్క, ప్రయాణేషు - జైత్రయాత్రలందు, అగ్రేసరైః - ముందుగా నడచుచున్న, వాజిభిః - గుఱ్ఱములచేత, ఉత్థితాని - పైకి చిమ్మబడిన, రజాంసి - దుమారములు, సామంత శిఖామణీనాం—సామంత - అంతటనుగల శత్రురాజులయొక్క, శిఖామణీనాం - తలలపైఁగల మణులయొక్క, ప్రభాప్రరోహా స్తమయం—ప్రభాప్రరోహ - వెలుగు మొలకలయొక్క, అస్త

మయం - వినాశమును, కుర్వంతి - చేయుచున్నవి. ఇతని విజయ యాత్రలందు లేచినధూళి శత్రురాజుల కిరీట మణికాంతులను మాయించుచుండును అనగా, శత్రువులను తేలికగా జయించువాఁడని భావము.

శ్లో. అసౌ మహాకాళ నికేతనస్య
వస న్నదూరే కిల చంద్రమౌళేః
తమిస్రపక్షేఽపి సహాప్రియాభిః
జ్యోత్స్నావతో నిర్విశతి ప్రదోషాన్. 84

వ్యాఖ్య: అసౌ - ఈ అవంతిదేశాధిపతి, మహాకాళ నికేతనస్య - మహాకాళమను క్షేత్రము ఆలయముగాఁగల, చంద్రమౌళేః - శిరస్సునందు చంద్రుఁడుగల శివునికి, అదూరే - సమీపమునందు, వసన్ - నివసించుచున్నవాఁడగుచు, తమిస్రపక్షేఅపి - కృష్ణపక్షమునందు సైతము, ప్రియాభిఃసహ - ప్రియురాండ్రతో గూడ, జ్యోత్స్నావతః - వెన్నెలగల, ప్రదోషాన్ - పూర్వరాత్రులను, నిర్విశతి కిల - అనుభవించుచున్నాఁడు సుమా! మహాకాళనాథుని శిరమునందలి చంద్రుని వెన్నెలలో నిరంతరము నితఁడు సుఖించుననియు, అన్య దుర్లభమైన యట్టి సుఖము నీకు వాంఛనీయమనియు దూతిక యభిప్రాయము. మహాకాళనాథుఁడు ఉజ్జయినికి సన్నిహిత దైవము. అవంతి దేశమునకు ఉజ్జయిని రాజధాని. కాళిదాసుకు ఉజ్జయినియందు మిక్కిలి ప్రీతి. కనుకనే చారిత్రకులు కాళిదాసు జన్మస్థానము ఉజ్జయినియై యుండునని భావించుచున్నారు. మేఘసందేశ కావ్యమునందు సైతము కాళిదాసు ఉజ్జయినీ పట్టణమును, సిప్రానదిని మిక్కిలి మక్కువతో వర్ణించెను.

శ్లో. అనేన యూనా సహ పార్థివేన
రంభోరు! కచ్చి న్మనసో రుచి స్తే
సిప్రా తరంగానిల కంపితాసు
విహర్తు ముద్యాన పరంపరాసు? 85

వ్యాఖ్య: హేరంభోరు - ఓ సౌందర్యవతీ! (అరఁటి బోదెవంటి తొడలుగలదానా యని యర్థము), యూనా - యువకుఁడైన, అనేన, పార్థివేన, సహ - ఈ రాజుతోఁగూడ, సిప్రాతరంగా నిలకంపితాసు—సిప్రా - సిప్రానదియొక్క,

తరంగానిల - అలల మీదుగావచ్చు గాలిచేత, కంపితాసు - కదల్పఁబడిన, ఉద్యాన పరంపరాసు - ఉద్యానవన పంక్తులయందు, విహర్తుం - విహరించుటకు తే - నీయొక్క, మనసః - మనస్సునకు, రుచిః కచ్చిత్ - కోరికయున్నదా?, యువకుఁడైన యితనితో సిప్రానది మీదనుండి వచ్చు మందమారుతములచే గదల్పఁబడుచున్ని ఉద్యాన వనములయందు క్రీడించుటకు వాంఛకలదా? అని యడిగినది.

శ్లో. తస్మి న్నభిద్యోతిత బంధుపద్మే
ప్రతాప సంశోషిత శత్రుపంకే
బబంధ సా నో త్తమసౌకుమార్యా
కుముద్వతీ భానుమతీవ భావమ్. 36

వ్యాఖ్య: ఉత్తమ సౌకుమార్యా - శ్రేష్ఠమైన శరీర మార్ధవముగల, సా - ఆ యిందుమతి, అభిద్యోతిత బంధుపద్మే—అభిద్యోతిత - ప్రకాశింపఁ జేయఁబడిన, బంధు - బాంధువులనెడు, పద్మే - కమలములు గలవాఁడును, ప్రతాపసంశోషితశత్రుపంకే—ప్రతాప - తేజస్సుచేత, సంశోషిత - ఎండింపఁబడిన, శత్రు - శత్రువులనెడు, పంకే - బురదకలవాఁడును నగు, తస్మిన్ - ఆ యవంతి రాజునందు, కుముద్వతీ - కలువ తీఁగ, భానుమతీవ (భానుమతి + ఇవ) - సూర్యుని యందువలె, భావం - చిత్తమును, నబబంధ - నిలుపలేదు. అతనిని ప్రేమింపలేదని భావము. బంధువులను పద్మములుగాను, శత్రువులను బురదగాను రూపణము చేయుటచేత ఆ రాజునకు సూర్యసామ్యము గోచరించుచున్నది. కలువతీగ చల్లని చంద్రుని వరించునుగాని వేడివెలుఁగుల తేడైన సూర్యుని వరింపదుగదా! కనుక ఇందుమతి యంగీకరింపకపోవుట సమంజసమే.

శ్లో. తా మగ్రత స్తామరసాంత రాభాం
అనూపరాజస్య గుణై రనూనాం
నిధాయ సృష్టిం లలితాం విధాతుః
జగాద భూయః సుదతీం సునందా. 37

వ్యాఖ్య: సునందా - సునంద, తామరసాంతరాభాం—తామరసాంతర - తామరపువ్వు లోపలిభాగముయొక్క, ఆభాం - కాంతివంటి కాంతి గలదియు (బంగారపురంగు శరీరముకలది యని యర్థము), గుణైః - రూపశీలాది గుణముల

చేత, అనూనాం - లోపములేనిదియు, సుదతీం - చక్కని పలువరుస గలదియు, విధాతుః - బ్రహ్మయొక్క, లలితాం, సృష్టిం - మధుర నిర్మాణమైన, తాం - ఆ యిందుమతీదేవిని, అనూపరాజస్య - అనూపదేశ రాజుయొక్క, అగ్రతః - ఎదుట, నిధాయ - నిలువఁబెట్టి, భూయః - మరల, జగాద - పలికెను. "జల ప్రాయ మనూపం స్యాత్" అని యమరము. జలసమృద్ధిగల దేశమునకు "అనూపము" అని పేరు. అనుగతాః ఆపః యేషు తే అనూపాః అని వ్యుత్పత్తి. సంస్కృత భాషయందు దేశవాచక శబ్దములు బహువచనాంతములై యుండును, ఆంధ్రాః, కళింగాః, కేరళాః, కాశ్మీరాః" ఇత్యాదులు. తెలుఁగునందు "ఆంధ్రము, కళింగము, కాశ్మీరము" అని యందురు. అ రాజు పాలించు దేశము జలసమృద్ధి గలదై యుండుటచేత దానికి "అనూప" శబ్దము రూఢమైనది. కనుక "అనూప రాజస్య" యని కాళిదాసు ప్రయోగించెను. ఆ యనూపరాజువద్ద ఇందుమతిని సునంద ఆపెనని యర్థము, ప్రతిచోటను ఇందుమతి పల్లకిపైఁ గూర్చుని చూచిన దనియు, సునంద ప్రక్కన నిలిచి చెప్పినదనియు మనము గ్రహింపవలెను.

శ్లో. సంగ్రామ నిర్విష్ట సహస్ర బాహు
రష్టాదశ ద్వీప నిఖాత యూపః
అనన్యసాధారణ రాజ శబ్దో
బభూవ యోగీ కిల కార్తవీర్యః. 38

వ్యాఖ్య: సంగ్రామనిర్విష్టసహస్రబాహుః - యుద్ధములయం దను భవముగల వేయిచేతులు గలవాఁడును, అష్టాదశ ద్వీపనిఖాత యూపః—అష్టాదశ - పదునెనిమిది యైన, ద్వీప - ద్వీపములయందు, నిఖాత - నాటఁబడిన' యూపః - యూపస్తంభములు గలవాఁడును, అనన్యసాధారణ రాజశబ్దః - ఇతరుల కెవ్వరికిని లేని రాజశబ్దము గలవాఁడును, యోగీ - బ్రహ్మవేత్తయునైన, కార్తవీర్యః - కార్తవీర్యుడను రాజు, బభూవకిల - ఉండెనుగదా! కార్తవీర్య మహారాజు నెఱుఁగుదువుగదా! అని భావము. నలచక్రవర్తి మొదలయిన భారత దేశ సార్వభౌములు అష్టాదశ ద్వీపములను జయించినట్లు కలదు. 'యూపము' అనగా యజ్ఞపశువును మంత్రపూతముగాఁ గట్టివేయునట్టి చిన్నస్తంభము. ఇతరులకు సాధారణముగాని 'రాజ' శబ్దమనఁగా నితఁడు సర్వభూతరంజనము చేయుటవలన

"రంజయతీతి రాజా" యను రాజశబ్దవ్యుత్పత్తి యితనియందు సమగ్రమై యుండిన దని భావము. కృతవీర్యుని కుమారుఁడు గావున నితనికి కార్తవీర్యుఁడని పేరు. అన్నిదీవులయందు యజ్ఞములుచేసిన సార్వభౌముఁడనియు, పరాక్రమవంతుఁడనియు, బ్రహ్మవిద్యావేత్త యనియు భావము.

శ్లో. అకార్యచింతా సమకాల మేవ
ప్రాదుర్భవన్ చాపధరః పురస్తాత్
అంతశ్శరీరేష్వపి యః ప్రజానాం
ప్రత్యాదిదేశావినయం వినేతా. 39

వ్యాఖ్య: వినేత - శిక్షకుఁడైన, యః - ఏ కార్తవీర్యుఁడు, అకార్య చింతా సమకాలమేవ - చెడ్డపని చేయుదమను తలంపుకలిగిన సమయమునందే, పురస్తాత్ - (అట్టి తలంపుకలిగిన వాని) యెదుట, చాపధరః - ధనుర్ధారియై, ప్రాదుర్భవన్ - సాక్షాత్కరించుచు, ప్రజానాం - ప్రజలయొక్క, అంతశ్శరీరేషు - మనస్సులయందలి, అవినయం, అసి - అపరాధమును శైతము, ప్రత్యాదిదేశ - తొలగించెనో. అట్టికార్తవీర్యుఁడుండెనుకదా యని యన్వయము. ఇచ్చటి శరీర శబ్దమునకు లక్షణావృత్తిచేత ఇంద్రియమని యర్థము. కాగా అంతశ్శరీరమనగా అంతఃకరణమని యర్థము. ప్రజల మనస్సులలో కలుగు దురాలోచనలను శైతము గుర్తించి శిక్షించువాఁడని భావము.

శ్లో. జ్యా బంధ నిష్పంద భుజేన యస్య
వినిశ్వస ద్వక్త్రిపరంపరేణ
కారాగృహే నిర్జితవాసవేన
లంకేశ్వరేణోషిత మాప్రసాదాత్. 40

వ్యాఖ్య: జ్యాబంధనిష్పందభుజేన—జ్యా - అల్లెత్రాటిచేతనైన, బంధ - బంధనముచేత, నిష్పంద - కదలజాలని, భుజేన - బాహువులు గలవాఁడును, వినిశ్వస ద్వక్త్రి పరంపరేణ—వినిశ్వసత్ - నిట్టూర్చుచున్న, వక్త్రి - ముఖముల యొక్క, పరంపరేణ - వరుసగల వాఁడును (దశముఖుఁడు కనుక), నిర్జితవాసవేన - ఓడింపఁబడిన యింద్రుఁడు గలవాఁడునునగు, లంకేశ్వరేణ - రావణా

సురునిచేత (రావణుడు) యస్య - ఏకార్తవీర్యునియొక్క. కారాగృహే - చెరసాలయందు, ఆప్రసాదాత్ - కార్తవీర్యుని కనుగ్రహము గలుగు పర్యంతము, ఉషితం - ఉండుటయో. అట్టి కార్తవీర్యుడని భావము. "లంకేశ్వరేణ ఉషితమ్" (రావణాసురుడుండుట) ఇది "రామేణ భూయతే" వంటి భావార్థక ప్రయోగము.

శ్లో. తస్యాన్వయే భూపతి రేష జాతః
ప్రతీప ఇత్యాగమవృద్ధ సేవీ
యేన శ్రియః సంశ్రయ దోష రూఢం
స్వభావలోలే త్యయశః ప్రమృష్టమ్. 41

వ్యాఖ్య: ఆగమవృద్ధసేవీ — ఆగమ - శాస్త్రమచేత, వృద్ధ - పెద్దలయిన వారిని, సేవీ - సేవించువాడును, ప్రతీపః ఇతి - ప్రతీపుడను పేరుతో ప్రసిద్ధుడైన, ఏషః భూపతిః - ఈ రాజు, తస్య - ఆ కార్తనీర్యునియొక్క, అన్వయే-వంశమునందు, జాతః - పుట్టినవాడు, యేన - ఎవనిచేతనైతే, సంశ్రయదోష రూఢం — సంశ్రయ - ఆశ్రయింపబడిన వానియొక్క, దోష - వ్యసన దుర్వ్యయాదులగు తప్పిదముల వలన, రూఢం - పుట్టినట్టి, శ్రియః - లక్ష్మికి, స్వభావలోలా - ప్రకృతి చంచల, ఇతి - అనెడి, అయశః - అపకీర్తి, ప్రమృష్టం-తుడిచి వేయబడినదో, లక్ష్మి చంచల యను నపకీర్తి పురుషదోషము వలన నేర్పడినదే యని తన సత్ప్రవర్తనతో నిరూపించిన యితడు నిరంతరము లక్ష్మివంతుడై యుండునని భావము.

శ్లో. ఆయోధనే కృష్ణగతిం సహాయ
మవాప్య యః క్షత్రియకాళరాత్రిం
ధారాం శితాం రామపరశ్వధస్య
సంభావయ త్యుత్పలపత్ర సారామ్. 42

వ్యాఖ్య: యః - ఏప్రతీపమహారాజు, ఆయోధనే - యుద్ధమునందు, కృష్ణ గతిం - అగ్నిని, సహాయం - తోడుగా, అవాప్య - పొంది, క్షత్రియకాళరాత్రీం-క్షత్రియులకు సంహార రాత్రియైన, రామపరశ్వధస్య - పరశు రాముని గండ్ర గొడ్డలి యొక్క, శితాం - వాడియైన, ధారాం - అంచును, ఉత్పలపత్రసారాం-

ఉత్పలపత్ర - కలువ రేకుల యొక్క, సారాం - గట్టిదనము వంటి గట్టితనము గల దానినిగా, సంభావయతి - తలంచునో. అగ్నిహోత్రుఁడు నీ నగరము పైకి వచ్చిన శత్రువులను నేనే కాల్చి వేయుదునని యీప్రతీపరాజుకు వరమిచ్చి, అట్లు చేయుచుండుట వలన సర్వక్షత్రియ కాళరాత్రియైన పరశురాముని గొడ్డలి వాదర నితఁడు కలువ రేకువలె మెత్తనయిన దానిగా భావించి లెక్క చేయఁడు కనుక నితనికి శత్రు భయము లేదని భావము.

శ్లో. అస్యాంకలక్ష్మీ ర్భవ దీర్ఘబాహోః
మాహిష్మతీ వప్రనితంబ కాంచీం
ప్రాసాదజాలై ర్జలవేణిరమ్యాం
రేవాం యది ప్రేక్షితు మస్తి కామః 43

వ్యాఖ్య: మాహిష్మతీ వప్రనితంబ కాంచీం—మాహిష్మతీ - మాహిష్మతీ పురి యొక్క, వప్రనితంబ - ప్రాకార మనెడి నితంబమునకు (నితంబ మనగా పిఱుదులును వానిపై నున్న కటి ప్రదేశమును గలసిన భాగము), కాంచీం- మొలనూలు వంటిదై, జలవేణిరమ్యాం - జలవేణి - జడల రూపమునఁ బ్రవహించు జలము చేత, లేక జలము యొక్క వేణీ రూపములైన పాయలచేత, రమ్యాం - అందముగా గనపడునట్టి. రేవాం - నర్మదానదిని, ప్రాసాదజాలైః- మేడల యొక్క కిటికీల ద్వారా, ప్రేక్షితుం - చూచుటకు. కామః - కోరిక, ఆస్తి యది - ఉండినచో, దీర్ఘబాహోః - ఆజానుబాహువైన, అస్య - ఈప్రతీప మహారాజునకు, అంకలక్ష్మీః - తొడ మీది కాంత్యధి దేవతవు, భవ - కమ్ము. మాహిష్మతీ నగర సౌధము నుండి నర్మదా నదీ సౌందర్యమును జూడ దలచినచో ఇతని తొడ మీద కూర్చొనుము-వరింపుము అని భావము.

శ్లో. తస్యాః ప్రకామం ప్రియదర్శనోఽపి
న సక్షితీశో రుచయే బభూవ
కరప్రమృష్టాంబుధరోపరోధః
కశీప పర్యాప్తకళో నశిన్యాః 44

వ్యాఖ్య : ప్రకామం - మిక్కిలి, ప్రియదర్శనోఽపి (పియదర్శనః + అపి) ప్రీతితోఁ జూడఁ దగినవాఁడే యైనను (చాలా అంధగాడేయైనను), సఃక్షితీశఃఆరాజు, శరత్ ప్రమృష్టాంబుధరోపరోధఃశరత్ ప్రమృష్ట - శరదృతువుచేత తుడిచి వేయఁబడిన, అంబుధర - మేఘముల యొక్క, ఉపరోధః - అడ్డంకి గల వాఁడును (మేఘములు క్రమ్ముకొనుట పోయి నిర్మలాకాశమునఁ బ్రకాశించువాఁడై నను) పర్యాప్తకళః - సంపూర్ణ కళలు గలవాఁడైనను (పూర్ణమనాటి వాఁడైనను), శశీ - చంద్రుఁడు, నళిన్యాఃఇవ - పద్మలతకువలె, తస్యాఃఆ యిందుమతి యొక్క, రుచయే - ఇష్టము కొఱకు, న బభూవ - కాకపోయెను. ప్రతీవుఁడెంత గుణవంతుఁడైనను అమెకు రుచింపక పోయెను "లోకోభిన్నరుచిః" యనిభావము.

శ్లో. సా శూరసేనాధిపతిం సుషేణ
ముద్దిశ్య లోకాంతరగీత కీర్తిమ్
ఆచారపూతోభయవంశ దీపం
శుద్ధాంతరక్ష్యా జగదే కుమారీ 45

వ్యాఖ్య : లోకాంతరగీతకీర్తిం - ఇతర లోకముల యందును గొనియాడఁబడిన కీర్తి గలవాఁడును. ఆచారపూతోభయ వంశ దీపంఆచారపూత - సదాచారముచేతఁ బవిత్రములైన, ఉభయవంశ - మాతా పిత్య వంశములకు దీపం-ప్రకాశకుఁడైనవాఁడును, (అయిన) శూరసేనాధిపతిం - శూరసేన దేశమున కధిపతి యగు, సుషేణం, ఉద్దిశ్య - సుషేణుని గుఱించి. శుద్ధాంతరక్ష్యా - అంతఃపుర పాలికయగు సునందచేత, సాకుమారీ - ఆయిందుమతి, జగదే - చెప్పఁబడెను. ప్రతీపుని నిరాకరించిన పిమ్మట సునంద ఇందుమతిని శూరసేన దేశపు రాజైన సుషేణుని గురించి చెప్పుటకు మొదలు పెట్టెను.

శ్లో. నీపాన్వయః పార్థివ ఏష యజ్వా
గుణై ర్యమాశ్రిత్య పరస్పరేణ
సిద్ధాశ్రమం శాంత మివైత్య పత్త్వాః
నైసర్గికోఽప్యుత్ససృజే విరోధః. 46

వ్యాఖ్య : యజ్వా - యజ్ఞములు చేసినట్టి, ఏషః, పార్థివః - ఈరాజు, నీపాన్వయః - నీప వంశమున బుట్టినవాఁడు; యం - ఏయితనిని (సుషేణుని),

ఆశ్రిత్య - ఆశ్రయించి, గుణైః - జ్ఞాన మౌన క్రోధ దయాది గుణములచేత, శాంతం - ప్రసన్నమైన, సిద్ధాశ్రమం - ఋష్యాశ్రమమును, ఏత్య - చేరి, సత్త్వైః - ఇవ - గజ సింహాది జంతువులచేతవలె, నైసర్గికః ఆపి - స్వాభావికమేయైనను, పరస్పరేణ - ఒండొకటి చేత, విరోధః - విరోధము, ఉత్ససృజే - విడువఁబడినదో ; ఒకటి యున్నచోట మరియొకటి యుండని క్రోధ శాంతములు, జ్ఞాన మౌనములు ఒక సిద్ధాశ్రమము నందలి గజ సింహాది మృగములవలె పరస్పర విరోధమును విడిచి యితని యందున్నవనియు, నితఁడు శీల గుణభూషితుఁడనియు భావము.

శ్లో. యస్యాత్మగేహే నయనాభిరామా
కాంతి ర్హిమాంశో రివ సన్నివిష్టా
హార్మ్యాగ్ర సంరూఢ తృణాంకురేషు
తేజోఽవిషహ్యం రిపుమందిరేషు 47

వ్యాఖ్య : హిమాంశోః - చంద్రునియొక్క, కాంతిఃఇవ - వెన్నెలవలె, నయనాభిరామా - కన్నుల కింపైన, యస్య - ఎవనియొక్క, కాంతిః - ప్రకాశము ఆత్మగేహే - తనయింట (తానున్నచోట), సన్నివిష్టా - సంక్రమించినదో ; అవిషహ్యం - సహింప శక్యముగాని, తేజః - సరాక్రమము, హార్మ్యాగ్ర సంరూఢ తృణాంకురేషు—హార్మ్యాగ్ర - మెడలపై భాగములయందు, సంరూఢ మొలచిన, తృణాంకురేషు - గడ్డి మొలకలు గల, రిపుమందిరేషు - శత్రునగరముల యందు, సన్నివిష్టం - సంక్రమించి యున్నదో; ఆసుషేణుని వరింపు మని యర్థము. ఇతఁడు స్వజనమునకును, ఆశ్రితులకును చంద్రుని వలె చల్లనివాఁడును, శత్రువులకు పరంతపుడు నని భావము. శత్రువుల మేడలపై గడ్డి మొలచుట యనగా వారు నశించిపోవుట. ఇచ్చటి మందిర శబ్దమునకు నగరమని యర్థము. "మందిరం నగరే గృహే" అని విశ్వకోశము.

శ్లో. యస్యావరోధ స్తన చందనానాం
ప్రక్షాళనా ద్వారివిహార కాలే
కళిందకన్యా మధురాం గతాఽపి
గంగోర్మి సంసక్త జలేవ భాతి 48

వ్యాఖ్య: యస్య - ఏసుషేణుని యొక్క, వారి విహారకాలే - జలక్రీడా సమయమునందు, అవరోధస్తనచందనానాం—అవరోధ - అంతఃపుర స్త్రీల యొక్క, స్తన - స్తనములమీది, చందనానాం - గంధముల యొక్క, ప్రక్షాళనాత్ -కడుగుట వలన, కళిందకన్యా - యమునానది, మధురాం - ఇతని నగరమైన మధురా పురమును, గతాపి (గతా + అపి) - చేరినదైనను, గంగోర్మిసంసక్తజలేవ గంగోర్మి - గంగానది యొక్క తరంగములతో, సంసక్త - కలుసుకొనిన. జలేవ-నీరు కలదివలె, భాతి - ప్రకాశించునో ! "కళిందకన్యా" కళింద పర్వతమునందు పుట్టుటచేత యమునకీ పేరు వచ్చినది. మధుర వద్ద నున్న యమున యింకను గంగతో కలియ లేదు కనుక యీ విధముగా నుత్ప్రేక్షింపఁబడినది. స్తనగంధము కారణము.

శ్లో. త్రస్తేన తార్క్ష్యాత్ కిల కాళియేన
మణిం విసృష్టం యమునౌకసా యః
వక్షస్థల వ్యాపి రుచిం దధానః
సకౌస్తుభం శ్రీపయతీవ కృష్ణమ్ 49

వ్యాఖ్య: తార్క్ష్యాత్ - గరుత్మంతునివలన, త్రస్తేన - భయపడి నట్టియు, యమునౌకసా - యమునానది నివాసముగాఁగల వాఁడును నగు, కాళియేన - కాళియుఁడను సర్పముచేత, నిసృష్టం కిల - ఈయఁబడి యున్నది గదా: వక్షస్థల వ్యాపిరుచిం - వక్షస్థలము మీద వ్యాసించుచున్న కాంతిగల, మణిం - ఆరత్నమును దధానః - ధరించుచున్న, యః - ఏసుషేణుఁడు, సకౌస్తుభం - కౌస్తుభ రత్నసహితుఁడైన, కృష్ణం - విష్ణుమూర్తిని, శ్రీపయతీవ (శ్రీపయతి + ఇవ) - సిగ్గుల జేయుచున్నట్లున్నాఁడో: అభయ ప్రదాత యగు సుషేణునికి కాళియుఁడొకమణిని ప్రతిఫలముగా నిచ్చెనని యొక కథ. అమణి కౌస్తుభ రత్నము కంటెను మిక్కిలి కాంతి గలదియై యున్నదనియు దానిని ధరించి యతఁడు విష్ణుమూర్తిని సిగ్గుపడునట్లు చేయుచున్నాడనియు భావము.

శ్లో. సంభావ్య భర్తార మముం యువానం
మృదుప్రవాళోత్తర పుష్పశయ్యే
బృందావనే చైత్రరథా దనూనే
నిర్విశ్యతాం సుందరి! యావనశ్రీః 50

వ్యాఖ్య: యువానం - యువకుఁడైన, అముం - ఇతనిని (సుషేణుని), భర్తారం - భర్తనుగా, సంభావ్య - అంగీకరించి, మృదుప్రవాళోత్తరపుష్పశయ్యా- మృదుప్రవాళ - లేత చిగురాకులు, ఉత్తర - పై భాగమునగల, పుష్పశయ్యా - పూల పానుపుగలదియు, చైత్రరథాత్ - కుబేరుని యుద్యానముకంటే, ఆనూనే- తక్కువగాని, బృందావనే - 'బృందావన' మను పేరుగల యుద్యాన వనమునందు హేసుందరి - ఓ సౌందర్యవతీ! యౌవనశ్రీః - యౌవనసంపద, నిర్విశ్యతాం - అనుభవింప బడుగాక. యువకుఁడైన యితనిని భర్తనుగా స్వీకరించి బృందావన మందు పూల పాన్పు మీద యౌవన సుఖము ననభవింపుము.

శ్లో. అధ్యాస్య చాంభఃపృషతోక్షితాని
శైలేయగంధీని శిలాతలాని
కలాపినాం ప్రావృషి పశ్య నృత్తం
కాంతాసు గోవర్ధన కందరాసు 51

వ్యాఖ్య: చ (కించ) - మఱియు, ప్రావృషి - వర్షాకాలము నందు. కాంతాసు - రమణీయములైన, గోవర్ధన కందరాసు - గోవర్ధన పర్వతముయొక్క- గుహల యందు. అంభఃపృషతోక్షితాని—అంభఃపృషత్ - నీటి చుక్కలచేత, ఉక్షితాని - తడుపబడినవియు, శైలేయగంధీని - శిలాజిత్తుయొక్క వాసనలు గలవి యునగు, శిలాతలాని - ఱాతి ప్రదేశములను, అధ్యాస్య - అధిష్ఠించి (ఆబండలమీద కూర్చుని). కలాపినాం - నెమళ్లయొక్క. నృత్తం - నృత్తమును పశ్య - చూడుము (నృత్తమనగా తాళానుకూలమైన పాదవిన్యాసము. ఇందులో భావ ప్రదర్శనముండదు) మరియు నితనితో గలిసి గోవర్ధన పర్వతముపై గూర్చుని అచ్చటి నెమళ్ల నృత్తమును జూడుమని భావము. శైలేయమనగా శిలాజిత్తు; లేదా ఱాతి పువ్వు అనబడు ఓషధి,

శ్లో. నృపం తమావర్తమనోజ్ఞనాభిః
సా వ్యత్యగాదన్యవధూర్భవిత్రీ
మహీధరం మార్గవశాదుపేతం
స్రోతోవహా సాగరగామినీవ 52

వ్యాఖ్య: ఆవర్తమనోజ్ఞనాభిః—ఆవర్త - నీటి సుడివలె, మనోజ్ఞమనోహరమైన, నాభిః - బొడ్డుగల, సా - ఆ యిందుమతి, అన్యవధూః - మరియొకనికి భార్య, భవిత్రీ - కాఁగలదియై, తం నృపం - ఆరాజును, సాగరగామినీ - సముద్రమును గూర్చి పోవునట్టిది యగు, స్రోతోవహా - మహానది, మార్గవశాత్ - మార్గవశమున, ఉపేతం - వచ్చిన, మహీధరం ఇవ - పర్వతమునువలె, వ్యత్యగాత్ - దాటి వెళ్లి పోయెను. మటియొకనికి భార్యకాఁగలదియై సుషేణుని వద్ద నిలువక సముద్రమునకు వెళ్లు మహానది దారిలో వచ్చిన కొండను త్రోసుకొని వెళ్లినట్లు ముందుకు సాగెనని భావము.

శ్లో. అథాంగదాశ్లిష్ట భుజం భుజిష్యా
హేమాంగదం నామ కళింగనాథమ్
ఆసేదుషీం సాదిత శత్రుపక్షం
బాలా మబాలేందుముఖీం బభాషే 53

వ్యాఖ్య: అథ - తరువాత, భుజిష్యా - సేవకురాలు (సునంద), అంగదాశ్లిష్టభుజం—అంగద - భుజకీర్తులతో అశ్లిష్ట - కూడిన, భుజం - బాహువులు గలవాఁడును, సాదితశత్రుపక్షం—సాదిత - నశింపఁజేయబడిన, శత్రుపక్షం - శత్రువర్గము గలవాడును, హేమాంగదం,నామ - హేమాంగదుఁడను పేరు గల వాఁడును నగు. కళింగనాథం - కళింగ దేశపురాజును, ఆసేదుషీం - సమీపించి నదియు, అబాలేందుముఖీం - పూర్ణ చంద్రుని వంటి ముఖము గలదియునగు, బాలాం - ఇందుమతిని గురించి, బభాషే - పలికెను. ఆతరువాత కళింగ రాజైన హేమాంగదుని వద్దకి వెళ్లి యిందుమతికి నతనిని గురించి చెప్పుటకు సునంద మొదలిడెను. "భుజిష్యాకింకరీమతా" అని హలాయుధ నిఘంటువు. ఇచ్చట "అబాలేందు" శబ్దము పూర్ణచంద్రుఁడను నర్థమున శబ్దాలంకారమునకై ప్రయోగింపఁబడినది.

శ్లో. అసౌ మహేంద్రాద్రి సమానసారః
పతి ర్హైహ్మంద్రస్య మహోదధేశ్చ
యస్యోర్వరైనన్య గజచ్ఛలేన
యాత్రాసు యాతీవ పురో మహేంద్రః 54

వ్యాఖ్య : అసౌ - ఇతడు, మహేంద్రాద్రిసమానసారః - మహేంద్రపర్వతమునకు సమానమైన సారము (స్థైర్యము) గలవాఁడు. మహేంద్రస్య - మహేంద్ర పర్వతమునకును, మహోదధేశ్చ - తూర్పు సముద్రమునకును, పతిః - అధిపతి; యస్య - ఎవనియొక్క, యాత్రాసు - విజయ యాత్రల యందు, క్షరత్తైన్య గజచ్ఛలేన—క్షరత్ - మదమును స్రవించుచున్న. సైన్యగజ - సేన యందలి యేనుగులయెక్క, ఛలేన - మిషచేత. మహేంద్రః - మహేంద్ర పర్వతము, పురః - ముందు, యాతీవ (యాతి + ఇవ) - నడచుచున్నట్లుండునో! ఇతని గజములు అద్రులతో సమానము లనియు ఇతఁడు తూర్పు సముద్రమునకును మహేంద్ర పర్వతమునకును అధిపతియనియు భావము. ఇచ్చటి మహేంద్ర శబ్దము శబ్దాలంకారమును నిర్వహించుటయే కాక ఇంద్రవాచకము గూడనగుట చేత విరోధాభాసమను నర్థాలంతరమును సైతము స్ఫురింపఁజేయునున్నది.

శ్లో. జ్యా ఘాత రేఖే సుభుజో భుజాభ్యాం
బిభర్తి యశ్చాపభృతాం పురోగః
రిపుశ్రియాం సాంజన బాష్పసేకే
బందీకృతానా మివ పద్ధతీ ద్వే 55

వ్యాఖ్య : సుభుజః - దీర్ఘ బాహువులు గలవాఁడును, చాపభృతాం - ధనుర్ధారులలో, పురోగః - అగ్రేసరుఁడును నగు, యః - ఏ హేమాంగద మహారాజు, బందీకృతానాం - చెఱసాలయం దుంచబడిన, రిపుశ్రియాం - శత్రురాజ్యలక్ష్ములయొక్క, సాంజనబాష్పసేకే - కాటుక కన్నీటియోడికలు గలవియునగు, పద్ధతీఇవ - దారులవలెనున్న, ద్వే - రెండైన, జ్యాఘాతరేఖే—జ్యాఘాత - అల్లెత్రాటి దెబ్బలవలన కాయలు కాసిన, రేఖే - రెండు చాఱలను, భుజాభ్యాం - రెండు భుజములచేతను, బిభర్తి - ధరించుచున్నాఁడో! ఇతఁడు రెండు చేతులతోను బాణములు వేయు సవ్యసాచియగు ధనుర్ధరుఁడు. కనుక రెండు భుజముల మీదను అల్లెత్రాడును లాగునప్పుడు తగిలిన దెబ్బలతో కాయలుకాచి నల్లని చారలేర్పడినవి. అవి, యితఁడు శత్రులక్ష్ములను బందీలుగా తెచ్చుచుండ వారి కాటుక కన్నీటి చారలు జారిన మార్గములో యనునట్లున్నవి అని భావము. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. యమాత్మనః సద్మని సన్నికృష్టో
మంద్రధ్వని ర్వ్యాజిత యామతూర్యః
ప్రాసాద వాతాయన దృశ్య వీచిః
ప్రబోధయ త్యర్ణవ ఏవ సుప్తమ్. 56

వ్యాఖ్య: ఆత్మనః - తనయొక్క, సద్మని - యింటియందు, సుప్తం - శయనించిన, యం - ఏ హేమాంగద మహారాజును, సన్నికృష్టః - సమీపమునందున్నవాఁడును, ప్రాసాద వాతాయనదృశ్యవీచిః—ప్రాసాదవాతాయన - హేమాంగదుని మేడల కిటికీలద్వారా, దృశ్య - చూచుటకు వీలైన, వీచిః - తరంగములు గలవాఁడును, మంద్రధ్వని ర్వ్యాజితయామతూర్యః—మంద్రధ్వని - గంభీరధ్వనిచేత, ర్వ్యాజిత - మాన్పబడిన, యామ - జాముయొక్క (ప్రతిరోజు చివరియందు కొట్టవలసిన), తూర్యః - భేర్యాది వాద్యములు కలవాడును నగు, అర్ణవః, ఏవ - సముద్రుఁడే, ప్రబోధయతి - మేలుకొలుపు చున్నాఁడో ! తన తరంగముల మంద్ర ధ్వని చేతనే యామతూర్య కార్యక్రమమును నిర్వహించుచు సముద్రుఁడే యితనిని సేవించుచుండును. ఇక యితరు లితనిని సేవించు విషయమును గురించి చెప్పనేల ? యని భావము.

శ్లో. అనేన సాకం విహరాం బురాశేః
తీరేషు తాళీవన మర్మరేషు
ద్వీపాంతరానీత లవంగ పుష్పైః
అపాకృత స్వేదలవా మరుద్భిః. 57

వ్యాఖ్య: అనేన, సాకం - ఇతనితోకూడ, తాళీవనమర్మరేషు—తాళీవన - తాటి తోపులచేత, మర్మరేషు - మర్మరధ్వనులుగల (తాటియాకుల గలగల ధ్వనులుగల), అంబురాశేః - సముద్రముయొక్క, తీరేషు - తీరములయందు, ద్వీపాంతరానీతలవంగపుష్పైః - ఇతర ద్వీపములనుండి తీసుకరాబడిన దేవకుసుమములుగల, మరుద్భిః - వాయువులచేత, అపాకృతస్వేదలవా - తొలగింపఁబడిన చెమట బిందువులు కలదానవై, విహర - విహరింపుము. ఇతనితోకలసి తాటి తోపులుగల సముద్ర తీరమునందు ద్వీపాంతరములనుండి వచ్చు గాడ్పులచేత తొలగింపఁ బడిన రతిశ్రమజనిత స్వేదబిందువులు కలదానివై విహరింపుమని భావము.

శ్లో. ప్రలోభితాఽప్యాకృతి లోభనీయా
విదర్భరాజావరజా తయైవమ్
తస్మా దసావ ర్తత దూరకృష్టా
నీత్యేవ లక్ష్మీ ప్రతికూలదై వాత్. 58

వ్యాఖ్య: ఆకృతిలోభనీయా - రూపముచేత ఆకర్షింపఁ బడదగినదై న, విదర్భరాజావరజా (విదర్భరాజ + అవరజా) - విదర్భరాజు చెల్లెలు (ఇందుమతి) తయా - ఆ సునందచేత, ఏవం - ఇట్లు, ప్రలోభితా, అపి - ప్రోత్సాహింపఁ బడినదై నను, నీత్యా - పురుష ప్రయత్నముచేత, దూరకృష్టా - చాలావరకు తీసుకురాఁబడిన, లక్ష్మీ - సంపద, ప్రతికూలదై వాత్, ఇవ - విరుద్ధమైన యదృష్టముగల పురుషునినుండివలె, తస్మాత్ - ఆ హేమాంగదరాజు వద్దినుండి, అపావ ర్తత - ప్రక్కకుతొలగి వెళ్లెను. ఎంత ప్రయత్నించినను దురదృష్టవంతుని వద్దికి లక్ష్మి చేరనియట్లు, ఎంత వర్ణించినను హేమాంగదుని రూపము ఇందుమతికి నచ్చక ముందుకుసాగెనని భావము.

శ్లో. అథోరగాఖ్యస్య పురస్య నాథం
దౌవారికీ దేవసరూప మేత్య
ఇత శ్చకోరాక్షి ! విలోకయేతి
పూర్వానుశిష్టాం నిజగాద భోజ్యామ్. 59

వ్యాఖ్య: అథ - తరువాత, దౌవారికీ - ద్వారపాలకురాలై న సునంద, దేవాసరూపం - దేవతలతో సమానమైన రూపము గలవాడును, ఉరగాఖ్యస్య, పురస్య - నాగపురమునకు, నాథం - ప్రభువగువానిని, ఏత్య - సమీపించి, చకోరాక్షి - ఓ యిందుమతీ! (చకోరపక్షుల కన్నులవంటి కన్నులు గలదానా), ఇతః- ఇటు, విలోకయ - చూడుము, ఇతి - అని, పూర్వానుశిష్టాం - ముందుగా హెచ్చరింవఁబడిన, భోజ్యాం - భోజరాజు కూతురై న యిందుమతిని గూర్చి, నిజగాద - పలికెను. ఇటుచూడు అని హెచ్చరించి, చెప్పవలసినది చెప్పెనని భావము. నాగపురము, పాండ్యదేశము నంధలి కాయకుఠార నదీతీరమునం దుండినట్లు మల్లినాథవ్యాఖ్య.

శ్లో. పాండ్యోఽయ మంసార్పిత లంబహారః
క్లుప్తాంగరాగో హరిచందనేన
ఆభాతి బాలాతప రక్తసానుః
సనిర్ఝరోద్గార ఇవాద్రిరాజః. 60

వ్యాఖ్య: అంసార్పిత లంబహారః - భుజములయం దుంచబడి వ్రేలాడు చున్న ముత్యాలహారము గలవాఁడును, హరిచందనేన - గోశీర్షకమను చందనము చేత, క్లుప్తాంగరాగః - చేయఁబడిన మైపూతగల వాఁడును, అయిన, అయం, పాండ్యః - ఈ పాండ్యదేశాధిపతి, బాలాతపరక్తసానుః—బాలాతప - లేత యెండచేత, రక్త - ఎఱ్ఱబారిన. సానుః - చటీయలు గలదై. సనిర్ఝరోద్గారః - సెలయేళ్ల ప్రవాహ స్యందముగల, అద్రిరాజః ఇవ - పర్వత రాజువలె, ఆభాతి - ప్రకాశించుచున్నాడు. కొంచము ఎఱ్ఱగానున్న హరిచందనముచేత పూయఁబడిన శరీరము, ఇరు భుజములమీదనుండి క్రిందికి జాఱుచున్న ముత్యాలహారములు గల పాండ్యరాజు, లేతయెండకు ఎఱ్ఱబారిన సానుప్రదేశములును, పైనుండి క్రిందికి ప్రవహించుచున్న సెలయేటి కాల్వలును గల ఒక పర్వతమువలె ప్రకాశించుచున్నాఁడని భావము. అలంకారము: ఉపమ.

శ్లో. వింధ్యస్య సంస్తంభయితా మహాద్రేః
నిశ్శేష పీతోజ్ఝిత సింధురాజః
ప్రీత్యా ఽశ్వమేధావభృథార్ద్రమూర్తేః
సౌస్నాలికో యస్య భవత్యగస్త్యః. 61

వ్యాఖ్య: వింధ్యస్య - వింధ్యయను, మహాద్రేః - మహా పర్వతమునకు, సంస్తంభయితా - స్తంభనము కలిగించిన వాఁడును (సూర్యగమనము నడ్డగించుటకై పెరుగుచున్న వింధ్యాద్రిని పెరగనీయక అపినవాఁడు). నిశ్శేష పీతోజ్ఝిత సింధురాజః - నిశ్శేషముగా పానము చేయఁబడి మరల వదలబడిన మహాసముద్రము గలవాఁడునైన, అగస్త్యః - అగస్త్య మహర్షి, అశ్వమేధావభృథార్ద్రమూర్తేః—ఆశ్వమేధావభృథ - అశ్వమేథయాగముయొక్క దీక్షాంత స్నానమునందు, ఆర్ద్రమూర్తేః - తడిసిన శరీరముగల. యస్య - యే పాండ్యరాజుకు,

ప్రీత్యా - స్నేహముచేత, సౌస్నాతికుఁడు - స్నానము చక్కఁగా జరిగెనా ? యని అడుగువాఁడు, భవతి - అగుచున్నాఁడో. మహర్షి యగస్త్యునంతటివాఁ డితనికి మిత్రుఁడనియు, అతడు "అవభృథస్నానము చక్కఁగా చేసితివా ?" అని యడుగు చుండుననియు భావము. "అవభృథ"మనగా యజ్ఞము, నివాహము మొదలయిన వైదిక కర్మలను దీక్షాపూర్వకముగా నిర్వహించి, ముగింపులో నదీ తటాకాదుల యందు చేయుస్నానము (ఈ యుత్సవమునందు స్నానముకంటె ముందు వసంతము (రంగులు) చల్లుకొనుటయుఁ గలదు). "సౌస్నాతికః" నుస్నాతం పృచ్ఛతి ఇతి సౌస్నాతికః అని వ్యుత్పత్తి. ఇట్లే "సౌఖశాయనికః" అని యగును. సుఖ శాయినం పృచ్ఛతి ఇతి సౌఖశాయనికః (సుఖనిద్ర పట్టినదా ? యని యడుగు వాఁడని యర్థము).

శ్లో. అస్త్రం హరా దాప్తవతా దురాపం
యేనేంద్రలోకాపజయాయ దృప్తః
పురా జనస్థాన విమర్దశంకీ
సంధాయ లంకాధిపతిః ప్రతస్థే. 62

వ్యాఖ్య: పురా - పూర్వము, జనస్థానవిమర్దశంకీ—జనస్థాన - ఖరాసుర నివాసమైన జనస్థానమునకు, విమర్ద - దేవతలపలని యువద్రవమును, శంకీ - ఊహించువాఁడై, దృప్తః - గర్వితుండైన, లంకాధిపతిః - రావణుఁడు, దురాపం- దృప్తః - దుర్లభమైన, అస్త్రం - బ్రహ్మశిరోనామకాస్త్రమును, హరాత్ - శివుని వలన, ఆప్తవతా - పొందియుండిన, యేన - యే పాండ్య రాజుతో, సంధాయ - సంధి చేసికొని, ఇంద్రలోకాపజయాయ - ఇంద్రలోకమునకు అపజయమును గలిగించుటరొఁబకు (అనగా తాను స్వర్గమును జయించుటకొఁబకు), ప్రతస్థే - బయలు దేరెనో. జనస్థానమునకు దేవత లుపద్రవమును గల్పింతురేమోయను శంకతో రావణుఁడు స్వర్గమునోడించి తన గుప్పిట నుంచుకొనఁ దలఁచెను. కాని పాండ్యుఁడు దేవతలకు సహాయమును జేయఁబూనెనేని తన యాట కట్టును. పాండ్యునిపద్ద శివప్రసాదలబ్ధమైన బ్రహ్మశిరోనామకమగు మహాస్త్రమున్నది. కనుక పాండ్యరాజుతోఁ సంధిచేసికొని స్వర్గముమీదికి దండెత్తెను. ఇంద్రునిసయితము జయించిన రావణునికి పాండ్యదేశాధీశుఁడన్న భయము. ఇట్టి మహావీరుని వరింపు మని సునంద యిందుమతి నుద్బోధించెనని భావము.

శ్లో. అనేన పాణా విధివత్ గృహీతే
మహాకులీనేన మహీవ గుర్వీ
రత్నానువిద్ధార్ణవ మేఖలాయా
దిశః సపత్నీ భవ దక్షిణస్యాః. 63

వ్యాఖ్య: మహాకులీనేన - గొప్ప వంశమునందు పుట్టిన, అనేన - ఇతని చేత, పాణౌ - నీ హస్తము, విధివత్ - శాస్త్ర ప్రకారముగా, గృహీతే (సతి) - గ్రహింపఁబడినదికాగా, గుర్వీ - గొప్పదియైన, మహీ, ఇవ - భూమివలె, రత్నానువిద్ధార్ణవ మేఖలాయాః — రత్నానువిద్ధార్ణవ - రత్నములచేత వ్యాప్తమై యున్న సముద్రమే, మేఖలాయాః - మొలనూలుగాఁ గలదైన, దక్షిణస్యాః దిశః- దక్షిణ దిక్కునకు, సపత్నీ - సవతివి, భవ - అగుము. ఇతనిచే పాలింపఁబడు భూదేవి దక్కు మరియొక సవతి నీకుండదని సూచనచేయుచు గొప్ప వంశపువాఁడైన యితనిని వరించి దక్షిణ దిక్కుకు సపత్నివికమ్మని చెప్పెను.

శ్లో. తాంబూలవల్లీ పరిణద్ధ పూగా
స్వేలా లతా లింగిత చందనాసు
తమాల పత్రాస్తరణాసు శశ్వత్
ప్రసీద రంతుం మలయస్థలీషు. 64

వ్యాఖ్య: తాంబూలవల్లీపరిణద్ధపూగాసు — తాంబూలవల్లీ - తమలపాకుల తీగలచేత, పరిణద్ధ - చుట్టుకొనఁబడిన (ఆలింగనము చేసుకోఁబడిన), పూగాసు - పోకచెట్లు గలవియు, ఏలాలతాలింగిత చందనాసు - ఏలకి తీగలచేత ఆలింగనము చేసుకోబడిన గంధపుచెట్లు గలవియు, తమాలపత్రాస్తరణాసు—తమాలపత్ర - క్రానుగఆకులు, ఆస్తరణాసు - నేలపైఁ బఱచిన తివాచీలుగా గలవియునగు, మలయస్థలీషు - మలయ పర్వతముమీద నేలలయందు, శశ్వత్ - నిరంతరమును, రంతుం - క్రీడించుటకు, ప్రసీద - ప్రసన్నురాలవుకమ్ము. తమలపాకుల తీగల చేత చుట్టుకోబడిన పోకమ్రాకులు, ఏలకిలతలచేత చుట్టుకోబడిన శ్రీగంధము చెట్లునుగల మలయ పర్వతముమీద క్రానుగాకులు పరచిన నేలలపై నితనితో క్రీడించి సుఖింపుమని భావము.

శ్లో. ఇందీవరశ్యామ తనుర్నృపోఽసౌ
త్వం రోచనా గౌర శరీర యష్టిః
అన్యోన్యశోభా పరివృద్ధయే వాం
యోగ స్తటిత్తోయద యోరివాస్తు. 65

వ్యాఖ్య: అసౌ - ఈ. నృపః - రాజు, ఇందీవర శ్యామతనుః - కలువ వంటి నలుపుగల దేహమువాఁడు, త్వం - నీవు, రోచనాగౌర శరీరయష్టిః—రోచనాగౌర - గోరోచనముపంటి పచ్చని, శరీరయష్టిః - చక్కని శరీరము గలదానవు, తటిత్తోయదయోఃఇవ - మెఱుపుతీఁగ మేఘములకువలె, వాం - మీ యిద్దరికిని, యోగః - సంబంధము, అన్యోన్య శోభాపరివృద్ధయే - పరస్పర కాంతియొక్క ఆధిక్యముకొఱకు, అస్తు - అగునుగాక. కలువనలుపు మేనుగల యీ రాజుకును గోరోచనా కాంతిగల నీకును గలుగబోవు సంబంధము, మేఘమునకున్ను మెఱవు తీగకును గల సంబంధమువలె రమణీయముగా నుండునని భావము.

శ్లో. స్వసు ర్విదర్భాధిపతే స్తదీయో
లేభేఽన్తరం చేతసి నోపదేశః
దివాకరాదర్శన బద్ధకోశే
నక్షత్రనాథాంశు రివారవిందే. 66

వ్యాఖ్య: విదర్భాధిపతేః - విదర్భరాజుయొక్క, స్వసుః - చెల్లెలియొక్క (ఇందుమతియొక్క), చేతసి - మనస్సునందు, తదీయః - ఆ సునందదియగు, ఉపదేశః - వాక్యము, దివాకరాదర్శన బద్ధకోశే—దివాకరాదర్శన - సూర్యుని ఆదర్శనముచేత, బద్ధకోశే - మొగ్గగా ముకుళించుకపోయిన, అరవిందే - కమలమునందు, నక్షత్రనాథాంశుః, ఇవ - చంద్రునియొక్క కిరణమువలె, అంతరం - అవకాశమును, నలేభే - పొందలేదు. సూర్యకిరణ స్పర్శకోసము ఎదురుచూచుచున్న తామరమొగ్గపై చంద్రకిరణము పడినను అది వికసించనట్లు, తనకు నచ్చువానికై యెదురుచూచుచున్న యిందుమతిచిత్తము ఆ రాజును చూచినను ఉన్ముఖమై వికసింపలేదని భావము.

శ్లో. సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ
యం యం వ్యతీయాయ పతింవరా సా
నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే
వివర్ణభావం స స భూమిపాలః. 67

వ్యాఖ్య: పతింవరా - భర్తను వరించునదియగు, సా - ఆ యిందుమతి, రాత్రౌ - రాత్రివేళయందు, సంచారిణీ - నడచుచున్న, దీపశిఖేవ - (దీపశిఖా + ఇవ) - దీపజ్వాలవలె, యం యం - ఏ యే రాజును, వ్యతీయాయ - అతిక్రమించి వెళ్లెనో, సః సః - ఆయా, భూమిపాలః - రాజు, నరేంద్రమార్గాట్టః, ఇవ- నరేంద్రమార్గ - రాజవీథి యందలి, అట్టః ఇవ - అట్టాలమువలె, వివర్ణభావం - కాంతిహీనతను (ప్రకాశరాహిత్యమును), ప్రపేదే - పొందెను. నడచుచున్న దీపశిఖవంటి యిందుమతి యే యే రాజును వరింపక విడిచి ముందుకు సాగుచుండెనో ఆయా వెనుకబడిన రాజు ముఖము కాంతిహీనమై నల్లబడెను. అది యెట్లున్నదనగా రాజమార్గమునందు పెద్ద దివ్వెటీని పట్టుకొని వెళ్లునప్పుడు వెనుకకు పోయిన మేడలమీది యట్టాలక గృహములు (మీది బాల్కనీల గదులు) చీకటిలోబడి ప్రకాశరాహిత్యమును పొందినట్లున్నదట. ఇది కాళిదాసు లోకానుభవమును సూచించునట్టి గొప్ప ఉపమాలంకారము. ఈ శ్లోకమువలన కాళిదాసుకు "దీపశిఖా కాళిదాసు" అని ప్రసిద్ధి కలిగినట్లు పరంపరాగతమైన అభియుక్తోక్తి.

శ్లో. తస్యాం రఘోః సూను రుపస్థితాయాం
వృణీత వా నేతి సమాకులోఽభూత్
వామేతరః సంశయ మస్య బాహుః
కేయూరబంధోచ్ఛ్వసితై ర్ననోద. 68

వ్యాఖ్య: తస్యాం ఉపస్థితాయాం - ఆ యిందుమతీదేవి సమీపించినది కాగా, రఘోః సూనుః - రఘుమహారాజుయొక్క కుమారుడు (అజుడు), వృణీత - వరించునా? న వా - లేదా, ఇతి - ఇట్లవి, సమాకులః, అభూత్ - సంశయము కలవాడాయెను, అస్య - ఈతనియొక్క, వామేతరః, బాహుః - కుడిభుజము, కేయూరబంధోచ్ఛ్వసితైః—కేయూరబంధ - భుజకీర్తులు కట్టుకొను

ప్రదేశముయొక్క, ఉచ్ఛ్వసితైః - అదరుపాటులచేత, సంశయం - సందేహమును, నునోద - పోగొట్టెను. ఇందుమతి తనవద్దికి వచ్చినప్పుడామె తనను వరించునా? లేదా? యని యజుఁడు సంశయించెను. కాని యతని కుడిభుజము పదేపదే యదరుచుండెను. అది శుభశకునము గాపున నతని సంశయముతీరెను. శాకుంతలమునందును శకుంతలా దర్శనమునకన్న ముందుగా దుష్యంతుని భుజము అదరెను. "స్ఫురతిచ మే బాహుః కుతః ఫలమిహాస్య?" అని దుష్యంత వచనము.

శ్లో. తం ప్రాప్య సర్వావయవా ఽనవద్యం
న్యవర్తతా న్యోపగమాత్ కుమారీ
న హి ప్రఫుల్లం సహకార మేత్య
వృక్షాంతరం కాంక్షతి షట్పదాళిః. 69

వ్యాఖ్య: కుమారీ - ఇందుమతి, సర్వావయవానవద్యం - అన్ని అవయవములందును దోషరహితుఁడైన, తం - ఆ యజుని, ప్రాప్య - సమీపించి, అన్యోపగమాత్ - మరియొకనిని సమీపించుటనుండి, న్యవర్తత - మరలెను (ముందుకు వెళ్లుట మానెను), తథాహి - అంతేకదా! షట్పదాళిః - తుమ్మెదలు, ప్రఫుల్లం - బాగా పూచిన, సహకారం - తీయమామిడి చెట్టును, ఏత్య - చేరి, వృక్షాంతరం - మరియొక చెట్టును, న కాంక్షతి - కోరదు. సర్వోత్కృష్టమైన వస్తువు లభించినప్పుడు, మరియొక వస్తువుపై అభిలాష కలుగదు కనుక తనకు నచ్చిన వరుఁడైన అజుడు కనపడగానే ముందుకు సాగుట మానెనని భావము.

శ్లో. తస్మిన్ సమావేశిత చిత్తవృత్తి
మిందుప్రభా మిందుమతీ మవేక్ష్య
ప్రచక్రమే వక్తు మనుక్రమజ్ఞా
సవిస్తరం వాక్య మిదం సునందా. 70

వ్యాఖ్య: తస్మిన్ - ఆ యజునియందు, సమావేశిత చిత్తవృత్తిం - చేర్చఁబడిన మనోవ్యాపారము గలదియు, ఇందుప్రభాం - చంద్రునియొక్క కాంతివంటి కాంతి గలదియునగు, ఇందుమతీం - ఇందుమతిని, అవేక్ష్య - చూచి, అను

క్రమజ్ఞా - పూర్వాపరవాక్య క్రమము నెఱిఁగినది యగు, సునందా - సునంద, సవిస్తరం - వివరములతోఁ గూడిన, ఇదం వాక్యం - ఈ చెప్పఁబోవు వాక్యమును, వక్తుం - చెప్పుటకు, ప్రచక్రమే - మొదలిడెను. ఇందుమతి యభిప్రాయమును గ్రహించిన సునంద అజుని పూర్వచరిత్రను చక్కని క్రమముతోఁ జెప్పుటకు ప్రారంభించెను,

శ్లో. ఇక్ష్వాకువంశ్యః కకుదం నృపాణాం
కకుత్స్థ ఇత్యాహితలక్షణోఽభూత్
కాకుత్స్థశబ్దం యత ఉన్నతేచ్ఛాః
శ్లాఘ్యం దధత్యుత్తర కోసలేంద్రాః 71

వ్యాఖ్య : ఇక్ష్వాకువంశ్యః - మనువు పుత్రుఁడైన యిక్ష్వాకుని వంశమునందు పుట్టినవాఁడును, నృపాణాం - రాజులలో, కకుదం - శ్రేష్ఠుడును, ఆహిత లక్షణః - ప్రఖ్యాత గుణములు కలవాఁడును నగు, కకుత్స్థఇతి - కకుత్స్థుఁడను రాజు, అభూత్ - ఉండెను; యతః - ఏకకుత్స్థుని నుండి (అతనితో ప్రారంభించి) ఉన్నతేచ్ఛాః - ఉన్నతాశయులైన, ఉత్తరకోసలేంద్రాః - ఉత్తర కోసలదేశాధిపతులైన దిలీపాదులు, శ్లాఘ్యం - ప్రసిద్ధమైన (మెప్పును బడసిన), కాకుత్స్థశబ్దం-కాకుస్థ అను శబ్దమును, దధతి - ధరించుచున్నారో! కకుది (వృషభము మీద) తిష్ఠతి,ఇతి (కూర్చుండువాడు కనుక) కకుత్స్థః అని వ్యుత్పత్తి, కకుత్స్థస్య అపత్యం పుమాన్ 'కాకుత్స్థః' (కకుత్స్థుని పుత్రుఁడు, లేదా ఆవంశమున బుట్టినవాఁడు కాకుత్స్థుఁడు). పూర్వము విష్ణుమూర్తి యొక్క అంశావతారముగా, ఇక్ష్వాకు వంశము నందు పురంజయుఁడను రాజు పుట్టెను, అతఁడు దేవతలతో కలిసి, వారి కోరిక ప్రకారము మహావృషభ రూపమును ధరించిన యింద్రునిపై నెక్కి, శివ లీలావిలాసము గలవాఁడై నిఖిలమైన రాక్షస సంఘముఘ వధించి "కకుత్స్థః" అను బిరుదమును పొందెను. అ బిరుదము వంశమునకుఁ గీర్తిని దెచ్చునది కనుక నాటినుండి "ఇక్ష్వాకు వంశము" కకుత్స్థ వంశముగూడ నయ్యెను. కనుక ఆ వంశము వారికి "ఇక్ష్వాకులు కాకుత్స్థులు" అను రెండు పేర్లను గలిగి వాఙ్మయము నందు స్థిరపడినవి. ఉత్తర కోసల రాజుల కది యింటి పేరయ్యెను.

శ్లో. మహేంద్ర మాస్థాయ మహోక్షరూపం
యం సంయతి స్మ ప్రసినాకిలీలః

చకార బాణై రసురాంగనానాం
గండస్థలీః ప్రోషిత పత్రరేఖాః 72

వ్యాఖ్య: యః - ఏకకుత్స్ప మహారాజు, సంయతి - యుద్ధము నందు, మహోక్ష రూపం - ఆఁబోతు రూపము నొందిన, మహేంద్రం - దేవేంద్రుని, ఆస్థాయ - ఎక్కి, ప్రాప్తపినాకిలీలః - పొందబడిన శివవిలాసము గలవాఁడై బాణైః - బాణములచేత, అసురాంగనానాం - రాక్షస స్త్రీల యొక్క, గండస్థలీః - చెక్కిటి ప్రదేశములను, ప్రోషిత పత్రరేఖాః - ఎడబాసిన మకరికాది పత్ర రచనలు కలవానినిగా, చకార - చేసెనో, రాక్షస స్త్రీలు తమ భర్తలను కకుత్స్నుడు చంపుట చేత వారు విధవలై సొగసు చేసికొనుట మానిరి కనుక వారి చెక్కిళ్లు మకరికాది పత్ర రచనలు లేని వయ్యెనని భావము.

శ్లో. ఐరావణాస్ఫాలన విశ్లథం యః
సంఘట్టయ న్నంగద మంగదేన
ఉపేయుషః స్వామపి మూర్తి మగ్ర్యా
మర్ధాసనం గోత్రభిదో ఽధితస్థౌ 78

వ్యాఖ్య: యః - ఏకకుత్స్నరాజు, ఐరావణాస్ఫాలనవిశ్లథం—ఐరావణ-ఐరావతము యొక్క, ఆస్ఫాలన - అప్పళించుటచేత, విశ్లథం - వదులయిన, ఆంగదం - ఇంద్రుని భుజకీర్తిని, అంగదేన - తన భుజకీర్తితో, సంఘట్టయన్-రాచుకొనునట్లు చేయుచు, స్వాం, అగ్ర్యాం, మూర్తిం - తన శ్రేష్ఠమైన రూపమును ఉపేయుషః.అపి - పొందియున్న వాఁడై నను, గోత్రభిదః - ఇంద్రుని యొక్క అర్ధాసనం - సింహాసనార్ధ భాగమును, అధితస్థౌ - ఎక్కెనో, కకుత్స్నుఁడు వృషభ రూప ధారియైన యింద్రుని బుజముపై నెక్కుటయేకాదు, రాక్షస వధానంతరము నిజరూప ధారియైన యింద్రుని ప్రక్కన నతని సింహాసనార్ధ భాగమున తన భుజ కీర్తితో నింద్రుని భుజకీర్తిని రాచుకొనుచు గూర్చున్న గొప్ప పరాక్రమ వంతుఁడని భావము. 'తస్థౌ' అను క్రియను "అధితస్థౌ" అని ప్రయోగించుట పాండితీ విశేషస్ఫోరకము.

శ్లో. జాతః కులే తస్య కిలోరుకీర్తిః
కులప్రదీపో నృపతి ర్దిలీపః

అతిష్ఠ దేకోన శతక్రతుత్వే
శ్శాకాభ్యసూయా వినివృత్తయే యః 74

వ్యాఖ్య: ఉరుకీర్తి: - గొప్ప కీర్తిగల వాఁడును, కులప్రదీపః - వంశ ప్రకాశకుఁడును అయిన, దీలీపఃనృపతిః - దిలీపుఁడనురాజు, తస్య - కూటస్థుఁడైన ఆకకుత్థ్సుని యొక్క, కులే - వంశమునందు. జాతఃకిల - పుట్టెను సుమా; యః - ఏదిలీపుఁడైతే, శక్రాభ్యసూయావినివృత్తయే - ఇంద్రుని యసూయ తొలఁగుటకై, ఏకోన శతక్రతుత్వే - ఒకటి తక్కువగా నూరశ్వమేధములు చేసిన వాని స్థానమునందు, అతిష్ఠత్ - నిలిచెనో! దిలీపుడు నూఱవ క్రతువును పూర్తి చేయఁగల శక్తియున్నను, ఇంద్రునికి తనపై నసూయ కలుగకుండుటకును, ఇంద్ర ప్రీతి కొఱకును, తొంబది తొమ్మిది అశ్వమేధ యాగములు మాత్రము చేసి విరవించెనని భావము.

శ్లో. యస్మిన్ మహీం శాసతి వాణినీనాం
నిద్రాం విహారార్ధపథే గతానామ్
వాతోఒపి నాస్రంసయ దంశుకాని
కో లంబయే దాహరణాయ వాస్తమ్ 75

వ్యాఖ్య:: యస్మిన్ మహీం శాసతి - యే దిలీపమహారాజు భూమినిపాలించు చుండగా. విహారార్ధపథే - క్రీడా స్థానము యొక్క సగము దారి యందు, నిద్రాం-నిద్రను, గతానాం - పొందిన. వాణినీనాం - మత్తెక్కిన స్త్రీల యొక్క. అంశుకాని - వస్త్రములను. వాతోఒపి - గాలికూడా. నాస్రంసయత్ (న+అస్రంసయత్) - కదిలింప జాలకపోయెనో, ఆహరణాయ - ఆ వస్త్రములను లాగుట కొఱకు. కః - ఎవఁడు, హస్తం. లంబయేత్ - చేతిని జాచును? దిలీపునిరాజ్యము నందతని యాజ్ఞాప్రభావము వలన జార చోరత్వములు లేవనియు, ప్రజలు నిర్భయముగా సంచరించుచుండెడి వారనియు అందువలన మధుపానమత్తలైన స్త్రీల శీలము చెడకుండెననియు భావము. "వాణినీ నర్తకీ మత్తా విదగ్ధవనితాసు చ" అని విశ్వకోశము. "మత్తా విదగ్ధా వాణిన్వౌ" అని యమరము. వాణిని యనగా మత్తెక్కిన మగువ.

శ్లో. పుత్రో రఘు స్తస్య పదం ప్రపేదే
ఎవాక్రతో ర్విశ్వజితః ప్రయోక్తా
చతుర్దిగావర్జిత సంభృతాం యో
మృత్పాత్ర శేషా మకరో ద్విభూతిమ్ 76

వ్యాఖ్య : విశ్వజితః, మహాక్రతోః - 'విశ్వజిత్' అను పేరుగల మహా యాగము యొక్క, ప్రయోక్తా - అనుష్ఠాతయు (చేసినవాడైన), తస్యపుత్రః - ఆ దిలీపుని యొక్క కుమారుడునగు, రఘుః - రఘుమహారాజు, పదం - ఆస్థాన మును (రాష్టమును), ప్రపేదే - పాలించుచున్నాడు; యః - ఏ రఘుమహా రాజు, చతుర్దిగా వర్జితసంభృతాం—చతుర్దిక్ - నాలుగుదిక్కుల నుండి, ఆవర్జిత-తేబడినదియు, సంభృతాం - కూడబెట్ట బడినదియు నగు, విభూతిం - సంపదను మృత్పాత్రశేషాం - మట్టి ముంత మాత్రమే మిగులుదల గల దానినిగా, అకరోత్-చేసెనో. ఉన్నది, తెచ్చినది, కూడ బెట్టినదియునగు సంపదనంతటిని అయాగము నందు దానము చేసిన ఆ రఘుమహారాజు ప్రస్తుతము రాజ్యము చేయుచున్నాడు. "విశ్వజి ద్యాగము సర్వస్వ దక్షిణాకము" కనుక అట్లు చేసెను.

శ్లో. ఆరూఢ మద్రీ నుదధీన్ వితీర్ణం
భుజంగమానాం వసతిం ప్రవిష్టమ్
ఊర్ధ్వం గతం యస్య న చానుబంధి
యశః పరిచ్ఛేత్తు మియ త్తయాఽలమ్ 77

వ్యాఖ్య : అద్రీన్ - పర్వతములను, ఆరూఢం - యెక్కినది, ఉదధీన్-సముద్రములను, వితీర్ణం - చొచ్చుక పోయినది, భుజంగమానాం-వసతిం - సర్ప ములకు నివాసమైన పాతాళమును, ప్రవిష్టం - ప్రవేశించినది. ఊర్ధ్వం - స్వర్గాదిక మును, గతం - చేరినది. (ఇట్లు) అనుబంధి - అవిచ్ఛిన్నము కాలత్రయ వ్యాపక మునైన, యస్య - ఏ రఘుమహారాజుయొక్క, యశః - కీర్తి, ఇయత్తయా-ఇంత అని తెలుపు దానిచేత, పరిచ్ఛేత్తుం - కొలుచుటకు, న,అలం - శక్యముకాదో! "అనుబధ్నాతి ఇతి అనుబంధి" అనగా తెంపులేనిది యని అర్థము. ఇయత్తయా-ఇంత ప్రదేశము నాక్రమించినది, ఇంత కాలముండును. అని దేశతః, కాలతః

కొలుచు కొలమానము చేత, పరిచ్ఛేత్తుం - కొలుచుటకు వీలులేని వైశాల్యము గల యశస్సు గలవాడు రఘు మహారాజు అని భావము.

శ్లో. అసౌ కుమార స్తమజోఽనుజాతః
త్రివిష్టపస్యేవ పతిం జయంతః
ధుర్యం ధురం యో భువనస్య పిత్రా
ధుర్యేణ దమ్యః సదృశం బిభర్తి 78

వ్యాఖ్య: అజః - అజుఁడను పేరుగల, అసౌ,కుమారః - ఈ యువకుడు, త్రివిష్టపస్య,పతిం - స్వర్గమునకు అధిపతియగు నింద్రుని, జయంతః,ఇవ- జయంతుఁడువలె, తం - ఆ రఘుమహారాజును. అనుజాతః - అనుసరించి పుట్టిన వాఁడు (వంశక్రమమునందు రఘువు తరువాత అజఁడు; రఘు మహారాజు పుత్రుడని యర్థము). దమ్యః - శిక్షణ నీయవలసిన వయస్సులోనున్న, యః- ఏయితఁడు, ధుర్యం - బరువైన, భువనస్య, ధురం - జగము యొక్క భారమును, ధుర్యేణ,పిత్రా - భారమును మోయఁగలిగిన తండ్రితో, సదృశం - సమానమగు నట్లుగా, బిభర్తి - మోయుచున్నాఁడో! రఘు మహారాజుతో కలిసి రాజ్యము చేయు చున్నాడు. ఒక కోడె మహావృషభముతో సమానముగా బరువును మోయుచున్నట్లు అన్న పోలిక స్ఫురించుటచేత, ఇది ఉపమాలంకారధ్వని. "దమ్యః వత్సతరః" అనునవి కోడెపేర్లు. ఇచ్చటి "అనుజాత" శబ్దము పుత్రార్థకము.

శ్లో. కులేన కాంత్యా వయసా నవేన
గుణైశ్చ తైస్తై ర్వినయప్రధానైః
త్వ మాత్మన స్తుల్య మముం వృణీష్వ
రత్నం సమాగచ్ఛతు కాంచనేన 79

వ్యాఖ్య: కులేన - వంశముచేతను, కాంత్యా - లావణ్యము చేతను, నవేన వయసా - యౌవనము చేతను, వినయప్రధానైః - వినయము ముఖ్యముగాఁగల, తైః తైః గుణైః చ - విద్యాశీలాదులగు నాయాగుణముల చేతను, ఆత్మనః, తుల్యం - నీకు తగిన వాడైన అముం - ఇతనిని (ఈయజమహా రాజును) త్వం - నీవు, వృణీష్వ - వరింపుము. రత్నం - మణి, కాంచనేన - బంగారముతో,

సమాగచ్ఛతు - కూడునుగాక. రత్నము కాంచనమువలె మిక్కిలి యానురూప్యము గల మీయుభయుల సమాగమము చూడ ముచ్చటగా నుండును కనుక వరింపుమని ఇందుమతిని బోధించెను.

శ్లో. తతః సునందా వచనావసానే
లజ్జాం తనూకృత్య నరేంద్రకన్యా
దృష్ట్యా ప్రసాదామలయా కుమారం
ప్రత్యగ్రహీత్ సంవరణస్రజేవ. 80

వ్యాఖ్య: తతః - తరువాత, సునందావచనావసానే - సునంద మాటలు ముగియగానే, నరేంద్రకన్యా - రాజకుమారి (ఇందుమతి), లజ్జాం - సిగ్గును, తనూకృత్య - తగ్గించుకుని, ప్రసాదామలయా - మనోనైర్మల్యము చేత తేటయైన, దృష్ట్యా - చూపుచేత, సంవరణ స్రజేవ - స్వయంవరణమాల చేతవలె, కుమారం - అజ మహారాజును, ప్రత్యగ్రహీత్ - అంగీకరించెను. ఇందుమతి ఆజునిఁ జక్కగా ప్రేమతో చూచెననియు, అప్రేక్షణ పరంపర స్వయంవర మాలవలె నుండెననియు భావము. ఇచ్చటి "కన్యా, కుమార, సంవరణ స్రజా" అను పదములు మానసిక స్వయంవర వివాహము జరిగినట్లు సూచించుచున్నవి.

శ్లో. సా యూని తస్మి న్నభిలాషబంధం
శశాక శాలీ తయా న వక్తుమ్
రోమాంచలక్ష్యేణ స గాత్రయష్టిం
భిత్త్వా నిరాక్రామ దరాళకేశ్యాః. 81

వ్యాఖ్య: సా - ఆ యిందుమతి, యూని, తస్మిన్ - యువకుఁడైన ఆతని యందు, అభిలాషబంధం - ప్రేమబంధమును, శాలీనతయా - సిగ్గరితనము చేత, వక్తుం - చెప్పుటకు, న శశాక - శక్తురాలు కాకపోయెను (అయినను), అరాళ కేశ్యాః - వంకరలు దీరిన శిరోజములుగల ఆ యిందుమతియొక్క, సః - ఆ ప్రేమబంధము, రోమాంచ లక్ష్యేణ - గగుర్పాటుయొక్క మిషచేత, గాత్రయష్టిం - చక్కని యామె శరీరమును, భిత్త్వా - పొడుచుకొని. నిరాక్రామత్ - బయటికి వచ్చెను. మనస్సులోనున్న ప్రేమ, పులకలరూపమున శరీరమునుండి వెలువడుట

చేత సిగ్గుతో ఆమె చెప్పకపోయినను ఆమె యజమహారాజును ప్రేమించుచున్నట్లు సునందకు తెలిసెనని భావము.

శ్లో. తథాగతాయాం పరిహాసపూర్వం
సఖ్యాం సఖీ వేత్రభృ దాబభాషే
"ఆర్యే! వ్రజావోఽన్యత" ఇత్యథైనాం
వధూ రసూయా కుటిలం దదర్శ. 82

వ్యాఖ్య: సఖ్యాం, తథాగతాయాం (సత్యాం) - స్నేహితురాలైన యిందుమతి అట్టి పరిస్థితి నొందినదికాగా (అనురాగ ప్రకటనమును చేయగా), సఖీ, వేత్రభృత్ - సఖియు, ప్రతీహారిణీయు నగు సునంద, ఆర్యే! - ఓ పూజ్యురాలా, అన్యతః - మరియొక రాజువద్దికి, వ్రజావః - వెళ్లుదము, ఇతి - అని, పరిహాసపూర్వం - వేళాకోళముగా, ఆబభాషే - పలికెను, అథ - అంతట, వధూః - పెండ్లికూతురు కాబోవునట్టి యిందుమతి, ఏనాం - అట్లు పలికిన సునందను, అసూయాకుటిలం - ఇష్టములేని వంకరచూపుతో, దదర్శ - చూచెను. సునంద పరిహాసమునకై ముందుకుపద అని యనగా ఇందుమతి ఎందుకు? అని ప్రశ్నించుచున్న వంకరచూపు చూచెనని భావము.

శ్లో. సా చూర్ణగౌరం రఘునందనస్య
ధాత్రీకరాభ్యాం కరభోపమోరూ:
ఆసంజయామాస యథాప్రదేశం
కంఠే గుణం మూర్తమివానురాగమ్. 83

వ్యాఖ్య: కరభోపమోరూ: - కరభ - మణికట్టు మొదలు చిటికెనవ్రేలి వరకుగల చేతిభాగము, ఉపమ - ఉపమానముగాఁగల, ఊరూ: - తొడలు గలదైన, సా - ఆ యిందుమతి, చూర్ణగౌరం - కుంకుమ పొడిచేత ఎఱ్ఱనైన (లేదా పసుపుపొడిచేత పచ్చనిదైన), గుణం - మాలికను, మూర్తం - రూపమును ధరించిన, అనురాగమివ - ప్రేమనువలె, ధాత్రీకరాభ్యాం - దాదియైన సునంద చేతులతో, రఘునందనస్య - అజమహారాజుయొక్క, కంఠే - కంఠమునందు, యథాప్రదేశం - సరియైన చోట, ఆసంజయామాస - వేయించెను. బహుజన మధ్య

మున స్వయంవర మాలను స్వయముగా ఆజుని కంఠమునం దుంచుట యౌచిత్య కాదని, సరియైన ప్రదేశమును జూపుచు సునందతో ఆ స్వయంవరణ మాలను వేయించి యిందుమతి అజ మహారాజును వరించెనని భావము.

శ్లో. తయా ప్రజా మంగళపుష్పమయ్యా
విశాల వక్షస్థల లంబయా సః
అమంస్త కంఠార్పిత బాహుపాశాం
విదర్భ రాజావరజాం వరేణ్యాః. 84

వ్యాఖ్య: వరేణ్యాః, సః - వరించుట కర్హుడైన ఆ యజమహారాజు, మంగళపుష్పమయ్యా - శుభపుష్పమయ మైనదియు, విశాల వక్షస్థలలంబయా - విశాలమైన తన వక్షస్థలమునందు వ్రేలాడుచున్న, తయా, ప్రజా - ఇందుమతి తన కంఠమునందు వేసిన ఆ మాలికచేత, విదర్భరాజా వరజాం - భోజరాజు చెల్లెలైన యిందుమతీదేవిని, కంఠార్పిత బాహుపాశాం - తనకంఠము చుట్టుంచబడిన బాహువులు కలదానినిగా, అమంస్త - తలంచెను. ఇందుమతీ బాహుబంధన సౌఖ్యమును మనస్సున భావించు అజుఁడు ఆ మాలను తన వక్షస్థలమున యిష్టపూర్వకముగా ధరించెను.

శ్లో. శశిన ముపగతేయం కౌముదీ మేఘముక్తం
జలనిధి మనురూపం జహ్నుకన్యా ఽవతీర్ణా
ఇతి సమగుణయోగ ప్రీతయ స్తత్ర పౌరాః
శ్రవణకటు నృపాణా మేక వాక్యం వివవ్రుః. 85

వ్యాఖ్య: తత్ర - ఆ స్వయంవర మంటపమునందలి, సమగుణయోగ ప్రీతయః - సమాన గుణవంతులైన యిందుమతీ రఘునందనులయొక్క సంబంధముచేత ప్రీతినిజెందిన, పౌరాః - పురజనులు, ఇయం - అజునిఁ జేరిన ఈ యిందుమతి, మేఘముక్తం - మేఘములచేత విడువఁబడిన, శశినం - చంద్రుని (శరచ్చంద్రుని), ఉపగతా - చేరినట్టి, కౌముదీ - వెన్నెల, అనురూపం, జలనిధిం - తనకుఁదగిన సముద్రునిఁగూర్చి, అవతీర్ణా, జహ్నుకన్యా - ప్రవేశించిన గంగానది, ఇతి - అని, నృపాణాం, శ్రవణకటు - స్వయంవరమునకు వచ్చిన

రాజుల చెవులకు పరుషమైన, ఏకవాక్యం - ఒకేమాటను (పరస్పర విరుద్ధముగాని మాటను), వివ్రుఁ - స్ఫుటముగాఁ బలికిరి. స్వయంవరమంటపమునందలి పుర జనులు ఈ యిందుమతి శరచ్చంద్రునిజేరిన కౌముది, సముద్రుని జేరిన గంగ అని ఐకకంఠ్యముగా బలికిరి. అది యితరరాజులకు శ్రుతికటువుగా నుండెను. చంద్ర చంద్రికా, జాహ్నవీ సాగరముల యౌపమ్యము ఇందుమతీ రఘునందనుల యవినాభావ సంబంధమును, ఆహ్లాదకర జీవితమును, పవిత్ర దాంపత్యమును సూచించుచున్నది.

శ్లో. ప్రముదిత వరపక్ష మేకత స్తత్
క్షితిపతి మండల మన్యతో వితానమ్
ఉషసి సర ఇవ ప్రఫుల్లపద్మం
కుముదవన ప్రతిపన్న నిద్ర మాసిత్. 86

వ్యాఖ్య: ఏకతః - ఒక ప్రక్కన, ప్రముదిత వరపక్షం - హర్షము చెందిన వరుని పక్షమైనదియు, అన్యతః - మరియొక ప్రక్కన, వితానం - సంతోష శూన్యమైనదియునగు, తత్, క్షితిపతి మండలం - ఆ స్వయంవరాగత రాజ సమూహము, ఉషసి - ప్రాతఃకాలమునందు, ప్రఫుల్ల పద్మం - వికసించిన కమలములు గలదియు, కుముదవన ప్రతిపన్న నిద్రం - ముకుళించిన కలువగుంపు గలదియునగు, సరః ఇవ - సరస్సువలె, ఆసీత్ - ఉండెను. ఇందుమతి వరింపని రాజులలో అజుని పక్షమువారి ముఖములు పద్మములుగాను ఇతరులవి ముకుళించిన కలువలుగాను గనపడుటచేత రాజమండలము కమలములును గలువలును గల కాసారమువలె నున్నట్లు గోచరించెను.అజుని పక్షమువా రానందోత్ఫుల్ల వదనులు కాగా, అతని శత్రుపక్షమువారు ఖిన్నవదనులైరని తాత్పర్యము.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ కావ్యమున

యాఱవ సర్గమునకు

తెలుఁగు లఘువ్యాఖ్య

మహాకవి కాళిదాసకృత రఘువంశము

సప్తమ సర్గము

శ్లో. అథోపయంత్రా సదృశేన యుక్తాం
స్కందేన సాక్షాదివ దేవసేనాం
స్వసార మాదాయ విదర్భనాథః
పురప్రవేశాభిముఖో బభూవ. 1

వ్యాఖ్య: అథ - పిమ్మట, విదర్భనాథః - భోజుడు, సదృశేన - సమానుడైన, ఉపయంత్రా - వరునితో, యుక్తాం - కూడినదియు, సాక్షాత్, స్కందేన - ప్రత్యక్షముగా కుమారస్వామితో, యుక్తాం, దేవసేనాం ఇవ - కలుసుకొనియున్న దేవసేనవలె నున్న, స్వసారం - చెల్లెలిని (ఇందుమతిని), ఆదాయ - పిలుచుకొని, పురప్రవేశాభిముఖః - నగర ప్రవేశమునకు బయలుదేరిన వాడు, బభూవ - అయ్యెను. స్వయంవర మండపము బహువిశాలముగా నుండ వలసినట్టిది కనుక నగర బహిర్భాగమునందు దానిని తాత్కాలికముగా నిర్మించి రనియు, స్వయంవర కార్యము పూర్తికాగానే భోజుడు వధూవరులను నగర ప్రవేశమునకై తీసుకవెళ్లెననియు భావము.

శ్లో. సేనానివేశాన్ పృథివీక్షితోఽపి
జగ్ముర్విభాత గ్రహ మందభాసః
భోజ్యాం ప్రతి వ్యర్థమనోరథత్వాత్
రూపేషు వేషేషు చ సాభ్యసూయాః. 2

వ్యాఖ్య: భోజ్యాం ప్రతి - ఇందుమతిని గురించి, వ్యర్థమనోరథత్వాత్ - వృథయైన కోరికలుగలవా రగుటవలన, రూపేషు - తమ చక్కదనముల విషయమునను, వేషేషు చ - వస్త్రాలంకరణాది నేపథ్యముల విషయమునను, సాభ్యసూయాః - అసూయ కలవారును (వృథా అని నిందించుకొనుచున్నవారును),

మరియు, విభాత గ్రహమందహాసః—విభాత - ప్రాతఃకాలమునందలి, గ్రహ - చంద్రాది గ్రహములవలె, మందభాసః - తగ్గిపోయిన ముఖకాంతులు గలవారును నగు, పృథివీక్షితః, అపి - స్వయంవర మంటపమునకు వచ్చిన రాజులుసైతము, సేనానివేశాన్ - తమ తమ శిబిరములను (విడుదులను) జగ్ముః - చేరిరి. ఇందు మతి తమను వరింపకపోవుటచేత తమతమ సౌందర్య వేష భూషాదులు వృథాయని నిందించుకొనుచు తమ విడుదులకు వెళ్లిపోయిరి.

శ్లో. సాన్నిధ్యయోగాత్ కిల తత్ర శచ్యాః
స్వయంవర క్షోభకృతా మభావః
కాకుత్థ్స ముద్దిశ్య సమత్సరోఽపి
శశామ తేన క్షితిపాలలోకః. 3

వ్యాఖ్య: తత్ర - ఆ స్వయంవర మంటపమువందు, శచ్యాః - ఇంద్రుని భార్యయగు శచీదేవియొక్క, సాన్నిధ్యయోగాత్ - సన్నిధి సంబంధము వలన (శచీదేవి అచ్చట నుండుటవలన), స్వయంవరక్షోభకృతాం - స్వయంవరమునకు విఘ్నము కలిగించువారియొక్క, అభావః, కిల - లేకపోవుట జరిగినదిసుమా! తేన - ఆ కారణముచేతనే, కాకుత్థ్సం, ఉద్దిశ్య - ఆ యజమహారాజును గుఱించి, సమత్సరః, అపి - వైరము కలదియైనను, క్షితిపాలలోకః - రాజసమూహము, శశామ - శాంతి వహించియుండెను. స్వయంవరవిఘ్నములు శచీదేవిచేత నణంప జేయబడుచుండునని యాగమశాస్త్రము. కనుక అల్లరి చేయ దలచిన భగ్న మనోరథుల ఆట సాగలేదని భావము.

శ్లో. తావత్ప్రకీర్ణాభినవోపచార
మింద్రాయుధ ద్యోతిత తోరణాంకమ్
వరః స వధ్వా సహ రాజమార్గం
ప్రాప ధ్వజచ్ఛాయ నివారితోష్ణమ్. 4

వ్యాఖ్య: తావత్ప్రకీర్ణాభినవోపచారం (తావత్ + ప్రకీర్ణ + అభినవ + ఉపచారం) - పూర్తిగా చల్లబడిన క్రొత్తపువ్వులు మొదలయిన ఉపచారములు గలదియును, ఇంద్రాయుధద్యోతిత తోరణాంకం - ఇంద్రధనుస్సులవలె ప్రకాశించు

చున్న తోరణములతో కూడినదియు, ధ్వజచ్ఛాయ నివారితోష్ణం - జెండాల నీడల చేత తొలగింపఁబడిన యెండ గలదియునగు. రాజమార్గం - నగరమునందలి ప్రధానమార్గమును, సః. వరః - ఆ వరుఁడైన యజుఁడు, వధ్వాసహా - వధువైన ఇందుమతితో గూడ, ప్రాప - ప్రవేశించెను. నవవధువగు ఇందుమతితో సహ అజుడు తోరణములు, జెండాలుకట్టి పూలుచల్లిన నగర రాజమార్గమునందు ప్రవేశించెను. "యావత్తావచ్చసాకల్యే" అని యమరము. కనుక యిచ్చట 'తావత్' అనగా పూర్తిగా (అంతట) అని యర్థము. కనుకనే తెలుఁగులో మొత్తము అను అర్థమునందు "యావత్తు" అని యనుచుందురు.

శ్లో. తత స్తదాలోకన తత్పరాణాం
సౌధేషు చామీకరజాలవత్సు
బభూవు రిత్థం పురసుందరీణాం
త్యక్తాన్యకార్యాణి విచేష్టితాని. 5

వ్యాఖ్య: తతః - తరువాత, చామీకరజాలవత్సు - బంగారు గవాక్షములు (కిటికీలు) కలవియగు, సౌధేషు - మేడలయందు, తదాలోకన తత్పరాణాం— తత్ - అజుని, ఆలోకన - చూచుటయందు, తత్పరాణాం - ఆసక్తిగల, పుర సుందరీణాం - నగరస్త్రీలయొక్క. త్యక్తాన్యకార్యాణి - విడిచిపెట్టబడిన యితర కార్యములుగల (కేశాలంకరణ వస్త్రధారణాది కార్యములు), విచేష్టితాని - వ్యాపారములు (ప్రవృత్తులు), ఇత్థం, బభూవుః - ఇకముందు చెప్పఁబోవు రీతిగా జరిగినవి. (ఇత్థం - ఇట్లు) ఆ స్త్రీల చేష్టలు ఈ క్రింది యైదు శ్లోకములలో వర్ణింపఁబడినవి. నగరస్త్రీలు తమ పనులు విడిచి ఊరేగింపుగా వచ్చుచున్న వధూవరులను చూచుటకు మేడలమీది కిటికీల వద్దికిఁ జేరుచుండిరి.

శ్లో. ఆలోకమార్గం సహసా వ్రజంత్యా
కయాచి దుద్వేష్టన వాంతమాల్యః
బంధుం న సంభావిత ఏవ తావత్
క్రరేణ రుద్ధోఽపి చ కేశపాశః. 6

వ్యాఖ్య: సహసా - హఠాత్తుగా, ఆలోకమార్గం - గవాక్షము వద్దికి, వ్రజంత్యా - వెళ్లుచున్న, కయాచిత్ - ఒకానొక పురకాంతచేత, ఉద్వేష్టనవాంత

మాల్యః—ఉద్వేష్టన - ఊడిపోయిన ముడి కలదియగుటచేత, వాంత - జారిపడిన, మాల్యః - పూలదండకలదియు, కరేణ - చేతితో, రుద్ధః, అపి (రుద్ధోఒపి) - పట్టుకోబడినదై నను, కేశ పాశః - కేశకలాపము (జుట్టు), తావత్ - అంతవఱకు (కిటికీవద్దకు చేరువరకు), బంధుం - ముడివేపికొనుటకు, న, సంభావితః, ఏవ - ఆలోచింపఁ బడనేలేదు. కొప్పుముడి యూడుటచేత జారిపడిన పూలదండ గల జుట్టును చేతితో పట్టుకొనియే కిటికీవద్దికి హఠాత్తుగా పరుగెత్తిన ఒక సుందరి జుట్టు ముడివేసుకొను విషయమునే మరచినదని భావము. నవ దంపతులను జూడవలె ననను త్వరతో నామె యట్లు ప్రవర్తించినది. వాంత - జాఱిన; ఇది గౌణ ప్రయోగము. శబ్దార్థమును వాచ్యముగాఁ జెప్పినచో క్రక్కిన, వమనము చేయబడిన యని చెప్పవలెను, అట్లు చెప్పరాదు. గౌణవృత్తి నాశ్రయించియే చెప్పవలెను. "నిష్ఠ్యూతో ద్గీర్ణ వాంతాది గౌణవృత్తి వ్యపాశ్రయం, అతిసుందర మన్యత్ర గ్రామ్య కక్షాం విగాహతే", అని దండి.

శ్లో. ప్రసాధికా లంబిత మగ్రపాద
మాక్షిప్య కాచిత్ ద్రవరాగ మేవ
ఉత్సృష్ట లీలాగతి రాగవాక్షాత్
అలక్తకాంకాం పదవీం తతాన. 7

వ్యాఖ్య: కాచిత్ - ఒకానొక సుందరి, ప్రసాధికాలంబితం - అలంకారము చేయు దాసిచేత పట్టుకోబడిన, అగ్రపాదం - పాదాగ్రమును, ద్రవరాగం. ఏవ - దవ రూపమైన లత్తుక కలదానినిగానే, ఆక్షిప్య - లాగుకొని, ఉత్సృష్టలీలాగతిః - విడిచి పెట్టబడిన మంద గమనము కలదియగుచు (త్వరత్వరగా పరుగెత్తుచు), ఆగవాక్షాత్ - కిటికీ వరకుండిన, పదవీం - దారిని, అలక్తకాంకాం - లాక్షారసము చేత గుర్తులు కలదానినిగా, తతాన - విస్తరింపజేసెను. కారుచున్న లాక్షారసముతో మందగమనమును వదలి పరుగెత్తుట చేత కిటికీ దారి యంతయు లక్క గుర్తులు పడెననియు, ఆకాంత, తన యలంకారమును, సహజగమనమును. మరచి వధూవరులను జూచుటకు కిటికీ వద్దికి పరుగెత్తె ననియు భావము. "అగ్రపాదం" పాదాగ్రం అనుటకు బదులిట్లు ప్రయోగించెను. "అగ్రశ్చాసౌ పాదశ్చ అగ్రపాదః" అని కర్మధారయ సమాసమును జెప్పవలెను. ఇట్టి ప్రయోగములను "హస్తాగ్ర

గ్రహస్తాదయో గుణ గుణినోర్భేదాభేదాభ్యామ్" అని, కావ్యాలంకార సూత్ర కర్త యగు వామనుఁడు సమర్థించెను. ఇచ్చటి "తతాన" యను క్రియ దారినిండుగా లాక్షారసమయ్యెనని తెలుపును.

శ్లో. విలోచనం దక్షిణ మంజనేన
సంభావ్య తద్వంచిత వామనేత్రా
తథైవ వాతాయన సన్నికర్షం
యయౌ శలాకా మపరా వహంతీ 8

వ్యాఖ్య: అపరా - మరియొక సుందరి, దక్షిణం, విలోచనం - కుడి కంటిని, అంజనేన - కాటుకచేత, సంభావ్య - అలంకరించుకొని, తద్వంచిత వామనేత్రా—తత్ - ఆ కాటుకచేత, వంచిత - మోసగింపఁబడిన. అనగా వర్జింపఁబడిన, వామనేత్రా - ఎడమ కన్ను గలది యగుచు (ఎడమ కంటికి కాటుక పెట్టుకొనక) తథైవ - అట్లే, శలాకాం - కాటుకకుంచెను, వహంతీ - పట్టుకొన్నది యగుచు, వాతాయన సన్నికర్షం - గవాక్ష సమీపమును, యయౌ - చేరెను. ఒక సుందరి ఒక్క కంటికే కాటుకను బెట్టుకొని పరుగెత్తెను. 'దక్షిణం' అనుట, త్వరచేత మొదట వామనేత్రమునకు బెట్టుకొనుట మరచెనని సూచించుటకు. సవ్యం హిపూర్వం మనుష్యా అంజతే" అను శ్రుతివలన మొదట సవ్యం అనగా ఎడమ కంటిని అలంకరించుకొనవలెను. అట్టి యాచారమును వధూవర దర్శన లాలసత్వ మున మరచెనట.

శ్లో. జాలాంతర ప్రేషిత దృష్టి రన్యా
ప్రస్థానభిన్నాం న బబంధ నీవీమ్
నాభిప్రవిష్టాభరణ ప్రభేణ
హస్తేన తస్థౌ వవలంబ్య వాసః 9

వ్యాఖ్య: అన్యా - మరియొక్క స్త్రీ, జాలాంతరప్రేషితదృష్టిః—జాలాంతర - గవాక్ష మధ్యమునుండి, ప్రేషిత - పంపబడిన, దృష్టిం - చూపుగలది యగుచు (గవాక్షమునుండి చూచుచు), ప్రస్థానభిన్నాం - శీఘ్రగమనముచేత ఊడి పోయిన, నీవీం - చీరముడిని, నబబంధ - మరల ముడివేసుకోలేదు; (కాని)

నాభిప్రవిష్టాభరణప్రభేణ—నాభిప్రవిష్ట - బొడ్డున ప్రవేశించిన, ఆభరణప్రభేణ-రత్నాంగుళీయక,కంకణాద్యాభరణముల యొక్క- కాంతులుగల, హస్తేన - చేతితో వాసః - సడలిన వస్త్రమును, అవలంబ్య - పట్టుకొని. తస్థౌ-నిలుచుండెను (ఊడిన చీరముడిని మరల బిగించుకొను నంతటి యవకాశము లేక ఒక సుందరి వధూవరులను చూచుటకు నిలుచుండె ననియు, ఆమె హస్తము నందలి రత్నాభరణముల కాంతులే నాభి ప్రదేశమును గప్పివైచి అక్కడ వస్త్రములేని లోపమును దీర్చె ననియు భావము.

శ్లో. అర్ధాంచితా సత్వర ముత్థితాయాః
పదే పదే దుర్నిమితే గలంతీ
కస్యాశ్చి దాసీ ద్రశనా తదానీం
అంగుష్ఠమూలార్పిత సూత్ర శేషా. 10

వ్యాఖ్య: సత్వరం,ఉత్థితాయాః - తొందరపాటున లేచి నిలుచున్న, కస్యాశ్చిత్ - ఒకానొక సుందరి యొక్క, అర్ధాంచితా - సగము కూర్చబడిన మణులు కలదియై, దుర్నిమితే - వ్యత్యస్తముగా వేయబడిన (సంభ్రమము వలన), పదే పదే - ప్రతి యడుగు నందును, గలంతీ - జారుచున్న రత్నములు గలది యగుచున్న, రశనా - మేఖల (మొలనూలు). తదానీం - అప్పుడు, అంగుష్ఠమూలార్పిత సూత్రశేషా—అంగుష్ఠమూల - చేతిబొట్టన వేలి మొదట. అర్పిత - ఉంచబడిన, సూత్ర - దారమే, శేషా - మిగిలినదిగాగలది, ఆసీత్ - అయ్యెను. తన మొల నూలుకు రత్నము లెక్కించు కొనుచున్న ఒక యంగన హఠాత్తుగా లేచి, గబగబ వెళ్లుచున్నందున ఆమేఖల యందు సగము కూర్చిన రత్నము లడుగడుగునను జాటి పోయి చివరికా మేఖల బొట్టన వ్రేలికి చుట్టుకున్న దారము మాత్రమే మిగిలి యుండెనని భావము.

శ్లో. తాసాం ముఖై రాసవగంధ గర్భైః
వ్యాప్తాంతరాః సాంద్ర కుతూహలానామ్
విలోల నేత్రభ్రమరై ర్గవాక్షాః
సపాత్రపత్రాభరణా ఇవాసన్. 11

వ్యాఖ్య : అప్పుడు,సాంద్రకుతూహలానాం - మిక్కుటమైన కుతూహలము గల, తాసాం - ఆ పురస్త్రీల యొక్క, ఆసవగంధగర్భైః - పానీయముల పరిమళము గలవియు (ఆసవ గంధము గర్భమునందు కలవి), విలోలనేత్రభ్రమరైః- చంచలములగు నేత్రములను తుమ్మెదలు గలవియునగు, ముఖైః - ముఖముల చేత, వ్యాప్తాంతరాః - కప్పబడిన మధ్యభాగములుగల, గవాక్షాః - గవాక్షములు, సహస్రపత్రాభరణాఇవ—సహస్రపత్ర - కమలములు, ఆభరణాఇవ - ఆభరణములుగాగలవి వలె, ఆసన్ - ఉండినవి. గవాక్షముల యందు మూగి చూచుచున్న ఆ పుర సుందరుల ముఖములచేత నిండిన గవాక్షములు కమలాలంకృతములైనట్లుగా గనపడెనని భావము. కమలముల యందు పరిమళముండుట, దళములు చలించుట సహజము. వాటిపోలిక సరిపోవుటకై నారీ ముఖములందు మత్తు పానీయముల పరిమళము, నేత్రముల చంచలత్వమును కూర్పబడినది. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. తా రాఘవం దృష్టిభి రాపిబంత్యో
నార్యో న జగ్మ్మ ర్విషయాంతరాణి
తథాహి శేషేంద్రియవృత్తిరాసాం
సర్వాత్మనా చక్షు రివ ప్రవిష్టా. 12

వ్యాఖ్య: తాఃనార్యః - ఆపురస్త్రీలు, రాఘవం - రఘుకుమారుడైనయజుని, దృష్టిభిః - కన్నులతో, ఆపిబంత్యః - త్రాగుచున్నవారగుచు (మిక్కిలి యాసక్తితో చూచుచున్న వారగుచు), విషయాంతరాణి - అన్య విషయములను, న జగ్మ్మః- తెలిసికొన లేకపోయిరి. తథాహి - అదియట్లే, ఆసాం ఆస్త్రీలయొక్క, శేషేంద్రియవృత్తిః—శేష - కన్నులుకాక తక్కిన, ఇంద్రియ - శ్రోత్రాదులైన యింద్రియముల యొక్క, వృత్తిః - వ్యాపారము, సర్వాత్మనా - సంపూర్ణ స్వస్వరూపము చేత, చక్షుః - నేత్రేంద్రియమును, ప్రవిష్టా, ఇవ - ప్రవేశించినదివలె నున్నది. అ పుర స్త్రీలు అజమహారాజును ఆసక్తితో చూచుచున్నప్పుడు వారికి ప్రక్కవారి మాటలుగాని, స్పర్శగాని యెఱుక పడుట లేదు. అట్లగుటకు, శ్రవణాదీంద్రియములు అజరూపమును సాక్షాత్తుగా అనుభవింపజాలక చక్షురింద్రియము నందే తాము సర్వాత్మ నా ప్రవేశించి యట్టి యనుభవమును పొందుచుండుటయే కారణము కాబోలునని భావము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. స్థానే వృతా భూపతిభిః పరోక్షైః
స్వయంవరం సాధు మమంస్త భోజ్యా
పద్మేవ నారాయణ మన్యథాసౌ
లభేత కాంతం కథ మాత్మతుల్యమ్ 13

వ్యాఖ్య: ఈశ్లోకము మొదలు మూడు శ్లోకములలో పౌర స్త్రీలు వధూ వరుల యానురూప్య, సౌందర్యములను గూర్చి ముచ్చటించుకొనుట వర్ణింపఁ బడినది. భోజ్యా - ఇందుమతి, పరోక్షైః - తనచే చూడబడని, భూపతిభిఃరాజుల చేత, వృతా - వరింపబడినదైనను, స్వయంవరం - స్వయంవరమును, సాధుం-మేలైన దానినిగా, అమంస్త - తలచినది, స్థానే - ఇది యుక్తముగా నున్నది (తనను కోరుచున్న ఒక రాజును తాను చూడకయే వరించుటకంటే స్వయం వరమును ప్రకటింప మనుట యుక్తముగా నున్నదని భావము). అన్యథా - అట్లు కానిచో, అసౌ - ఈయిందుమతి, పద్మా - లక్ష్మీదేవి, నారాయణం,ఇవ - విష్ణు మూర్తినివలె, ఆత్మతుల్యం - తనకు తగిన, కాంతం - పతిని, కథంలభేత - ఎట్లు పొందఁగలిగి యుండును? సదసద్వివేక సౌకర్యము స్వయంవరము నందే కలదు, కనుక తగిన భర్తను ఎన్నుకొనఁ గలుగుటకు తగిన యవకాశము ఇందుమతికి లభించినదని పౌరస్త్రీలు ముచ్చటించుకొనిరి. పద్మం అస్యాఃఅస్తి ఇతి పద్మా అని వ్యుత్పత్తి. "అర్శ ఆదిభ్యోఽచ్" అని వ్యాకరణసూత్రము. "స్థానే" యుక్తమే అను నర్థముగల అవ్యయము. భోజ్యా - భోజస్య అపత్యం స్త్రీ 'భోజ్యా' అని వ్యుత్పత్తి.

శ్లో. పరస్పరేణ స్పృహణీయశోభం
నచే దిదం ద్వంద్వ మయోజయిష్యత్
అస్మిన్ ద్వయే రూపవిధానయత్నః
పత్యుఃప్రజానాం విఫలోఽభవిష్యత్. 14

వ్యాఖ్య: స్పృహణీయశోభం - వాంఛనీయమైన సౌందర్యముగల, ఇదం, ద్వంద్వం - ఈ జంటను, పరస్పరేణ - ఒకరితో నొకరిని, న, అయోజయిష్యత్, చేత్ - కూర్చకపోయి యుండినచో, ప్రజానాం, పత్యుః - బ్రహ్మదేవునియొక్క, అస్మిన్, ద్వయే - ఈ జంటయందలి, రూపవిధానయత్నః - సౌందర్య నిర్మాణ

ప్రయాసము, వితథః - విఫలమైనది, అభవిష్యత్ - అయియుండ గలిగెడిది (వీరికి వీరేకాని, ఇందుమతికిఁ దగిన మరియొక పురుషుడుగాని, అజునికిఁ దగిన మరియొక స్త్రీగాని సృష్టిలోలేరు) కనుక తన సృష్టినైపుణ్యము సఫలమగునట్లు బ్రహ్మ ఈ జంటను గూర్చెనని భావము.

శ్లో. రతిస్మరౌ నూన మిమా వభూతాం
రాజ్ఞాం సహస్రేషు తథాహి బాలా
గతేయ మాత్మప్రతిరూప మేవ
మనోహి జన్మాంతర సంగతి జ్ఞమ్. 15

వ్యాఖ్య: రతిస్మరౌ - (నిత్యసహచరులైన) రతిమన్మథులు, నూనం - నిజముగా, ఇమౌ - ఈ యిద్దఱుగా (దంపతులుగా). అభూతాం - ఆయిరి. తథాహి - అది యట్లే, ఇయం, బాలా - ఈ పడుచు, రాజ్ఞాం, సహస్రేషు - రాజులయొక్క సహస్రములయందు (అంతమంది రాజులలో). ఆత్మప్రతిరూపం, ఏవ - తనకు తగినవానినే, గతా - చేరినది, హి - ఎందువల్లనైతే, మనః - మనస్సు, జన్మాంతర సంగతిజ్ఞం - జన్మాంతర సంబంధమును, జ్ఞం - ఎఱుఁగునట్టిదో, లేదా, మనః - మనస్సు, జన్మాంతరసంగతిజ్ఞం, హి - జన్మాంతర సంబంధము నెఱుఁగునట్టిదికదా! ఈ దంపతులు పూర్వజన్మమునందు రతిమన్మథులు. కనుక పూర్వజన్మవాసనతో ఇందుమతి అందఱు రాజులలో తన భర్తయైన అజమహారాజునే వరించినదని యనుకొనిరి. అదియే ఇది యను ప్రత్యభిజ్ఞానము లేకున్నను, వాసనా విశేషమువలన మనస్సు జన్మాంతర సంబంధమును గుర్తించును. కనుక ఇచ్చట జన్మాంతర సాహచర్యమే ప్రవర్తకమని భావము.

శ్లో. ఇత్యుద్గతాః పౌరవధూ ముఖేభ్యః
శృణ్వన్ కథాః శ్రోత్రసుఖాః కుమారః
ఉదాహృసితం మంగల సంవిధాభిః
సంబంధినః సద్మ సమాసపాద. 16

వ్యాఖ్య: ఇతి - ఈ విధముగా ('స్థానేవృతా' అను శ్లోకము మొదలుకొని చెప్పఁబడినరీతిగా), పౌరవధూముఖేభ్యః - పురస్త్రీల ముఖములనుండి, ఉద్గతాః -

బయలువెడలినవియు, శ్రోత్రసుఖాః - చెవులకింపయినవియునగు, కథాః - ప్రసంగములను, శ్రుణ్వన్ - వినుచు, కుమారః - అజుఁడు, మంగలసంవిదాభిః - శుభసూచక వస్తురచనలచేత (మామిడి తోరణములు, పుష్పమాలాద్యలంకారములు కూర్చుటచేత), ఉద్భావితం - ఎక్కువగా ప్రకాశించునట్లు చేయఁబడిన, సంబంధినః, సద్మ - కన్యాదాతయొక్క గృహమును, సమాససాద - చేరెను. అట్లు చెవులకింపయిన పౌరస్త్రీ వచనములను వినుచు అజుడు అలంకరింపబడిన పెండ్లియింటిలో ప్రవేశించెను. "సంబంధి" అనగా వియ్యముచేసిన వ్యక్తి. ఇప్పటికిని "ఈతఁడు మా సంబంధి" అనుట వ్యవహారమునందున్నది.

శ్లో. తతోఽవతీర్యాశు కరేణుకాయాఃస కామరూపేశ్వర దత్త హస్తఃవైదర్భ నిర్దిష్ట మథో వివేశహారీమనాంసీవ చతుష్క మంతఃం. 17

వ్యాఖ్య: తతః - అనంతరము, కరేణుకాయాః - ఆడయేనుఁగుపైనుండి, ఆశు - శీఘ్రముగా, అవతీర్య - దిగి, కామరూపేశ్వర దత్తహస్తః - కామరూపదేశాధిపతిమీద ఉంచబడిన చేయికలవాడైన అజుఁడు. అథో - వెంటనే, వైదర్భ నిర్దిష్టం - భోజునిచేత చూపఁబడిన, అంతఃచతుష్కం - చతుశ్శాల భవంతిలోని భాగమును, హారీమనాంసి, ఇవ - అచ్చటి స్త్రీల మనస్సులనువలె, వివేశ - ప్రవేశించెను. అజుని యెక్కించుకొని వచ్చినది ఆడయేనుఁగుమీద, అది శుభకరము, భయరహితమును గనుక, మగయేనుఁగుకు హఠాత్తుగా మదమెక్కవచ్చును కనుక శుభకార్యములందు కరేణుకనువాడుట సంప్రదాయము. స్త్రీల మనస్సులందు ప్రవేశించినట్లని చెప్పుట అజుని సౌందర్య విశేష ద్యోతకము.

శ్లో. మహార్హ సింహాసన సంస్థితోఽసౌసరత్న మర్ఘ్యం మధుపర్కమిశ్రమ్భోజోపనీతం చ దుకూలయుగ్మంజగ్రాహ సార్ధం వనితాకటాక్షైఃం. 18

వ్యాఖ్య: మహార్హ సింహాసన సంస్థితః - ఎక్కువ విలువగల సింహాసనముసందు కూర్చునియున్న. అసౌ - ఈ యజుఁడు, భోజోపనీతం (భోజ + ఉప

సీత ం) - భోజునిచేత గొనిరాబడిన, సరత్నం . రత్నసహితమైనదియు, మధు పర్క-మిశ్ర ం - మధుపర్క-ముతో కూడినదియు నగు, అర్ఘ్య ం - పూజాసాధన వస్తుసామగ్రిని, దుకూలయుగ్మంచ - పట్టుపంచల జతనుగూడ, వనితాకటాక్షై: సార్థం - అచ్చటచేరిన వనితల క్రేగంటి చూపులతోగూడ, జగ్రాహ - స్వీకరిం చెను. వనితలు ఆ పెండ్లికొడుకు చక్కదనమునకు మనస్సులు చలించి క్రేగంటి చూపులతో జూచుటను అజుడు గ్రహించెననియు మధుపర్క-లను స్వీకరించె ననియు భావము. "మధుపర్క-ము" అనగా దధిమధుమిశ్రమము (పెరుగును, తేనెను కలి యుంచినది) దీనిని కన్యాదాత వరునికి కన్యాదానము చేయునపుడు ముందుగా ఇచ్చి తీర్థమువలె తీసుకొనునట్లు చేయవలెను. ఈ సమయమునందిచ్చు వస్త్రములకు "మధుపర్క-ములు" అని లోకవ్యవహారము.

శ్లో. దుకూలవాసాః స వధూసమీపం
నిన్యే వినీతై రవరోధరక్షైః
వేలాసకాశం స్ఫుట ఫేనరాజిః
నవై రుదన్వా నివ చంద్రపాదైః. 19

వ్యాఖ్య: దుకూలవాసాః - తెల్లని పట్టువస్త్రములు ధరించిన, సః - ఆ యజమహారాజు, వినీతైః - నమ్రులైన, అవరోధరక్షైః - అతఃపురోద్యోగుల చేత, వధూసమీపం - పెండ్లికూతురు వద్దికి, స్ఫుటఫేనరాజిః - స్పష్టమైన నుఱు గుల బారులుగల, ఉదన్వాన్ - సముద్రుడు, నవైః, చంద్రపాదైః - క్రొత్త చంద్రకిరణములచేత, వేలావకాశం, ఇవ - చెలియలికట్ట వద్దికివలె, నిన్యే - చేర్చ బడెను. తెల్లని వస్త్రములు ధరించిన యజుడు చంద్ర కిరణములచేత సముద్రుడు వేలా సమీపమునకువలె వధువువద్దికి తీసుకపోబడెను. వధూ వేలా శబ్దములు స్త్రీ లింగము లగుటచేతను, ఇతర పదసామ్యముచేతను ఇచ్చట దృష్టాంతాలంకారము.

శ్లో. తత్రార్చితో భోజపతేః పురోధాః
హుతాగ్ని మాజ్యాదిభి రగ్నికల్పైః
తమేవ చాధాయ వివాహ సాక్ష్యే
వధూవరౌ సంగమయాంచకార. 20

వ్యాఖ్య: తత్ర - అచ్చట (విదర్భ రాజభవనమునందు), అర్చితః - పూజింపఁబడిన వాఁడును, అగ్నికల్పః - అగ్నితో సమానుఁడును (పవిత్రత యందని యర్థము), భోజపతేః - భోజదేశాధీశ్వరునియొక్క, పురోధాః - పురోహితుఁడు, ఆజ్యాదిభిః - నెయ్యి మొదంగు హోమ ద్రవ్యములచేత, అగ్నిం - అగ్నిని, హుత్వా - హోమముచేసి, తమేవ (తం+ఏవ) - ఆయగ్నినే, వివాహసాక్ష్యే - వివాహముయొక్క సాక్ష్యమునందు, ఆధాయ - నిలిపి, వధూవరౌ - వధూవరులను, సంగమయాంచకార - కూర్చెను. అగ్నిసాక్షికముగా ఇద్దరికి బ్రహ్మముడివేసి పురోహితుఁడు వివాహకర్మను సమంత్రకముగా ఆరంభించెను.

శ్లో. హస్తేన హస్తం పరిగృహ్య వధ్వాః
స రాజసూనుః సుతరాం చకాశే
అనంతరాశోకలతాప్రవాళం
ప్రాప్యేవ చూతః ప్రతిపల్లవేన. 21

వ్యాఖ్య: సః, రాజసూనుః - ఆ రాజకుమారుఁడు, హస్తేన - తన చేతితో, వధ్వాః - పెండ్లికూతురుయొక్క, హస్తం - చేతిని, పరిగృహ్య - పట్టుకొని, అనంతరాశోకలతా ప్రవాళం—అనంతర - తన ప్రక్కనయున్న, అశోకలతా - అశోకలతయొక్క, ప్రవాళం - చిగురాకును, ప్రతిపల్లవేన - దాని కెదురుగానున్న తన చిగురాకుచేత, ప్రాప్య - అంటుకొని యుండిన, చూతః, ఇవ - మామిడిచెట్టువలె, సుతరాం - ఎక్కువగా, చకాశే - ప్రకాశించెను. వధూవరులకు పాణిగ్రహణ మహోత్సవము జరిగెననియు, అది అశోకలతాచూత సమాగమము వలె నుండెననియు భావము. అశోక పల్లవములు, చూత పల్లవములును ఎట్టనివై యుండుట సామాన్యమే కాని, ఆవి వ్రేళ్ళవలె దీర్ఘాకారము గలవియై యుండుట విశేషము. కనుక హస్తములకు చక్కని యుపమానమైనవి. చూతాశోకములు మంగళకరము లగుట మరియొక విశేషము.

శ్లో. ఆసీ ద్వరః కంటకిత ప్రకోష్ఠః
స్వినాంగులిః సంవవృతే కుమారీ
తస్మిన్ ద్వయే తత్క్షణ మాత్మవృత్తిః
సమం విభక్తేవ మనోభవేన. 22

వ్యాఖ్య: వరః - పెండ్లికుమారుఁడు, కంటకీత ప్రకోష్ఠః - పులకలెత్తిన ముంజేయి కలవాఁడు, ఆసీత్ - అయ్యెను, కుమారీ - పెండ్లికూతురు, స్విన్నాంగులిః - చెమర్చినవ్రేళ్లు గలదియై, సంవవృతే - మనసార వరించెను, అస్మిన్ద్వయే - ఆ జంటయందు, తత్క్షణం - ఆ క్షణము నందు, ఆత్మవృత్తిః - సాత్త్వికోదయ రూపమైన తన వ్యాపారము, మనోభవేవ - మన్మథునిచేత, సమం - సమానముగా, విభక్తేవ (విభక్తా+ఇవ) - విభజించబడినట్లుండినది అంతకు ముందే యిద్దటికిని అనురాగము సమానముగానే యుండినను, పాణిస్పర్శ వలన గలిగిన పులకాంకుర స్వేదముల వలన ఇప్పుడు వ్యక్తమైనను విభక్తమై యుండి నట్లూహించుట కవకాశము గలిగినదని భావము. వధూవరులకు పరస్పరానురాగ మున్నదో లేదో పరీక్షించుటకు ఇవి వాత్స్యాయనుఁడు కామ సూత్రములందు చెప్పెను. "కన్యాతు ప్రథమ సమాగమే స్విన్నాంగులిః స్విన్నముఖీ చ భవతి, పురుషస్తు రోమాంచితో భవతి ఏభిరనయోర్భావం పరీక్షేత."

శ్లో. తయో రపాంగ ప్రతిసారితాని
క్రియాసమాపత్తి నివర్తితాని
హ్రీయంత్రణా మానశిరే మనోజ్ఞా
మన్యోన్యలోలాని విలోచనాని. 28

వ్యాఖ్య: అపాంగ ప్రతిసారితాని—అపాంగ - కన్నుల చివరియందు, ప్రతిసారితాని - ప్రసరింపఁ జేయబడినవియు, క్రియా సమాపత్తి నివర్తితాని—క్రియా - ఒకరినొకరు చూచుటయందు, సమాపత్తి - అప్రయత్నముగా కలుసుకొనుటచేత, నివర్తితాని - వెనుకకు మరల్చబడిసవియు, అన్యోన్యలోలాని - ఒడొరులయందు ఆశగలవియు (నగు), తయోఃు, విలోచనాని - ఆ దంపతులిద్దటియొక్క చూపులు, మనోజ్ఞాం - రమ్యమైన, హ్రీయంత్రణాం - సిగ్గుచేత కలుగు సంకోచమును, ఆనశిరే - పొందెను. ఆ వధూవరులు ఒకరినొకరు చూడవలెనను వాంఛతో కనుదమ్ముల చివరలనుండి చూపులను ప్రసరింపఁజేయుచు, ఒకరి చూపు లొకరి చూపుల నెదుర్కొన్నప్పుడు వాటి నుపసంహరించుకొనుచు, మరలనొకరియం దొకరి చూపులు ప్రసరింపగా సిగ్గుతో సంకోచమును పొందించుకొనుట చూచువారికి మిక్కిలి రమణీయముగా నుండెనని భావము. నాయికా నాయకుల లజ్జావలోకనములను ఇంత రమణీయముగా వర్ణించిన కవి యరుదు.

శ్లో. ప్రదక్షిణ ప్రక్రమణాత్ కృశానోః
ఉదర్చిష స్తన్మిథునం చకాశే
మేరో రుపాంతేష్వివ వర్తమాన
మన్యోన్య సంసక్త మహాస్త్రియామమ్. 24

వ్యాఖ్య: తన్మిథునం - ఆ దంపతుల జంట, ఉదర్చిషః - ఎగయుచున్న జ్వాలలుగల, కృశానోః - అగ్నియొక్క, ప్రదక్షిణ ప్రక్రమణాత్ - ప్రదక్షిణారంభమువలన, మేరోః - మేరు పర్వతముయొక్క, ఉపాంతేషు - సమీప ప్రదేశముల యందు, వర్తమానం - తిరుగుచున్నట్టియు (మేరువునకు ప్రదక్షిణము చేయుచున్న), అన్యోన్య సంసక్తం - పరస్పరము కలుసుకొన్నదియు నగు, అహస్త్రియామం, ఇవ - అహోరాత్రుల జంటపలె, చకాశే - ప్రకాశించెను. "అన్యోన్య సంసక్తం" అను విశేషణము ఉభయత్ర అన్వయించును. "సువర్ణంతైజసమ్" బంగారము తేజోద్రవ్యమని తర్కశాస్త్రము చెప్పుటచేత మేరుపర్వతము అగ్నితో పోల్పఁబడినది. అహస్సు అజుఁడుగాను, ఇందుమతి త్రియామ (రాత్రి) గాను ఉపమింపబడినారు. అలంకారము: ఉపమ. వధూవరులు అగ్నిప్రదక్షిణకర్మ నాచరించిరనియు, అది మేరువుచుట్టు దినము రాత్రియు తిరుగుచున్న ట్లుండెవనియు భావము.

శ్లో. నితంబగుర్వీ గురుణా ప్రయుక్తా
వధూ ర్విధాతృప్రతిమేన తేన
చకార సా మత్తచకోరనేత్రా
లజ్జావతీ లాజవిసర్గ మగ్నౌ. 25

వ్యాఖ్య: నితంబగుర్వీ - నితంబభాగము చేత లావుగా కనబడుచున్నదియై, విధాతృప్రతిమేన, తేన, గురుణా - బ్రహ్మతో సమానుఁడైన ఆ పురోహితుని చేత, ప్రయుక్తా - 'హోమము చేయుము' అని నిమోగింపఁబడిన, మత్తచకోర నేత్రా - మదించిన చకోరముయొక్క కన్నులవంటి కన్నులుగలదియు, లజ్జావతీ - సిగ్గరియునగు, సా, వధూః - ఆ పెండ్లికూతురగు ఇందుమతి, అగ్నౌ - హోమాగ్నియందు, లాజవిసర్గం - వరి పేలాలు వేయుటను, చకార - చేసెను. తన నితంబభారాది సౌందర్యము నితరులు చూచి పోదురను సిగ్గుతో, పురోహితుని

యాజ్ఞమేరకు ఇందుమతి "లాజాహోమ" మను వివాహకృత్యమును నెరవేర్చెనని భావము. అలంకారము: పరికరము.

శ్లో. హవిఃశమీ పల్లవ లాజ గంధీ
పుణ్యఃకృశానో రుదియాయ ధూమఃకపోల సంసర్పి శిఖఃస తస్యాఃముహూర్త కర్ణోత్పలతాం ప్రపేదే. 26

వ్యాఖ్య: హవిఃశమీపల్లవ లాజగంధీ—హవిఃఆజ్యము మొదలయిన వస్తువులయొక్కయు, శమీపల్లవ - జమ్మియాకుల యొక్కయు, లాజ - ప్రేలాల యొక్కయు, గంధీ - పరిమళము గలదియు, పుణ్యఃపవిత్రమైనదియు నగు, ధూమఃపొగ, కృశానోఃఆ యగ్నినుండి, ఉదియాయ - పైకి లేచెను. కపోల సంసర్పిశిఖఃకపోల - ఇందుమతి చెక్కిళ్లయందు, సంసర్పి - ప్రాకుచున్న, శిఖఃకొనలు కలదియై, తస్యాఃఆమెకు, ముహూర్తకర్ణోత్పలతాం—ముహూర్త - క్షణకాలము, కర్ణోత్పలతాం - చెవి సందున నుంచుకొను కలువ పూవగుటను, ప్రపేదే - పొందెను. హోమాగ్నినుండి లేచి పైకి ఎగబ్రాకుచున్న పొగ ఇందుమతి చెవులపై గలుపరేకులవలె గనబడుచుండెనని భావము, అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. తదంజనక్లేద సమాకులాక్షం
ప్రమ్లాన బీజాంకుర కర్ణపూరమ్
వధూముఖం పాటల గండలేఖ
మాచార ధూమ గ్రహణా దభూవ. 27

వ్యాఖ్య: తత్, వధూముఖం - ఆ పెండ్లికూతురు మొగము, ఆచారధూమ గ్రహణాత్ - ఆచారప్రాప్తమైన ధూమమును గ్రహించుటచేత, అంజనక్లేద సమాకులాక్షం—అంజనక్లేద - కాటుక కన్నీళ్లచేత, సమాకులాక్షం - చెదరిన కన్నులు గలదియు, ప్రమ్లాన బీజాంకుర కర్ణపూరం - వాడిపోయిన యవాంకురములనెడు అవతంసములు గలదియు, పాటలగండరేఖం - ఎఱ్ఱబడిన చెక్కిళ్లు గలదియు, బభూవ - అయ్యెను, ఇందుమతి ముఖము, ఆ లాజాహోమ సమయమునందు

కాటుక కన్నీటితో చెదరిన కన్నులు, వాడిపోయిన అవతంసాంకురములు, ఎట్టబడిన చెక్కిళ్లుగలది యయ్యెనని భావము. ఇట్లు గత మూడు శ్లోకములందును ఇందుమతి యొంపుసొంపులను వర్ణించెను.

MEMORIAL LIBRARY V.R NARLA D.P.R.I. Acc. No.

శ్లో. తౌ స్నాతకై ర్బంధుమతా చ రాజ్ఞా
పురంధ్రిభిశ్చ క్రమశః ప్రయుక్తా
కన్యా కుమారౌ కనకాసనస్థౌ
ఆర్ద్రాక్షతారోపణ మన్వభూతామ్. 28

వ్యాఖ్య: కనకాసనస్థౌ - బంగారు గద్దెలపైఁ గూర్చునియున్న, తౌ, కన్యా కుమారౌ - ఆ పెండ్లికూతురును, పెండ్లికొమరుఁడును, స్నాతకైః - వ్రతనియమముగల గృహస్థులచేతను, బంధుమతా, రాజ్ఞా చ - బంధు సహితుండైన భోజరాజు చేతను, పురంధ్రిభిశ్చ - పతిపుత్రవతులైన ముత్తైదువలచేతను, క్రమశః - వరుసగా (ఒకరి తరువాత నొకరుగా), ప్రయుక్తం - చేయఁబడిన, ఆర్ద్రాక్షతారోపణం - పసుపుతోఁ గలిపిన అక్షతలను తలపై నుంచుటను, అన్వభూతాం - అనుభవించిరి. ఆ వధూవరుల తలలపై గృహస్థులు, ముత్తైదువలు బంధు సహితుడై నభోజుడు వరుసగా తలంబ్రాల నుంచిరి. "అక్షతారోపణ" మనఁగా తలంబ్రాలు పోయుట, సేసలు వెట్టుట; 'పురంధ్రి' యనఁగా భర్తయు పుత్రులును గల ముత్తైదువ.

శ్లో. ఇతి స్వసు ర్భోజకుల ప్రదీపః
సంపాద్య పాణిగ్రహణం స రాజా
మహీపతీనాం పృథ గర్హ్ణార్థం
సమాదిదేశాధికృతా నధిశ్రీః. 29

వ్యాఖ్య: అధిశ్రీః - అధిక సంపన్నుఁడును, భోజకుల ప్రదీపః - భోజ వంశమునకు పేరుతెచ్చిన, సః, రాజా - ఆరాజు, ఇతి - ఈ వెనుక చెప్పిన విధముగా, స్వసుః - చెల్లెలియొక్క (ఇందుమతియొక్క), పాణిగ్రహణం - వివాహమును, సంపాద్య - జరిపించి, మహీపతీనాం - స్వయంవరమునకువచ్చిన రాజుల యొక్క, పృథక్, అర్హ్ణార్థం - ఒక్కొక్కరినిగా గౌరవించుటకొఱకు, అధికృ

తాన్ - ఉద్యోగులను, సమాదిదేశ - ఆజ్ఞాపించెను. చెల్లెలి వివాహమును పూర్తి చేసిన భోజుడు పెండ్లికి వచ్చినవారి కందఱికిని అర్చనలు, కట్నములు, కానుకలు చెందునట్లు చేయుటకు అధికారులను నియమించెను.

శ్లో. లింగై ర్ముదః సంవృతవిక్రియా స్తే
హ్రదాః ప్రసన్నా ఇవ గూఢనక్రాః
వై దర్భ మామంత్ర్య యయు స్తదీయాం
ప్రత్యర్ప్య పూజా ముపదాచలేన. 80

వ్యాఖ్య: ముదః - సంతోషముయొక్క, లింగైః - చిహ్నములచేత (కపటపు నవ్వు మొదలయినవాటిచేత), సంవృత విక్రియాః - దాచుకొనఁబడిన మత్సరము గలవారై, ప్రసన్నాః - పైన నిర్మలోదకము గలవియు, గూఢనక్రాః - లోనదాగిన మొసళ్లుకలవియునగు, హ్రదాః, ఇవ - మడుగులవలె, (స్థితాః - ఉండిన). తే - ఆ రాజులు, వైదర్భం, ఆమంత్ర్య - విదర్భరాజుతో వెళ్లివచ్చెదమని చెప్పి, తదీయాం, పూజాం - అతడు తమకు చేసిన పూజను (బహుమానమును), ఉపదాచ్ఛలేన - కానుకలర్పించుట యను నెపముతో, ప్రత్యర్ప్య - వెనుకకిచ్చివేసి, యయుః - వెళ్లిపోయిరి. ఆ రాజులకు తమను ఇందుమతి వరింపలేదను కోపమును, అజునియందు మత్సరమును ఉండుటవలన పైకి మాత్రము సంతోషమును ప్రకటించుచు, తమకిచ్చిన బహుమతులను, కానుకల నెపమున తిరిగియిచ్చివేసి, అసమ్మతితో వెళ్లిపోయిరని భావము.

శ్లో. స రాజలోకః కృతపూర్వ సంవి
దారంభసిద్ధౌ సమయోపలభ్యమ్
ఆదాస్యమానః ప్రమదామిషం త
దావృత్య పంథాన మజస్య తస్థౌ 81

వ్యాఖ్య : ఆరంభసిద్ధౌ - కార్యసిద్ధి విషయమై, కృతపూర్వ సంవిత్ - పూర్వము చేసుకోబడిన సంకేతముగల, సః, రాజలోకః - అ రాజసమూహము, సమయోపలభ్యం - అజుని ప్రయాణ సమయమునందు లభ్యమైన, తత్, ప్రమదామిషం - ఆస్త్రీయను భోగ్యవస్తువుమ, ఆదాస్యమానః - గ్రహింప బోవునది

యగుచు, అజస్య. పంథానం - అజుని యొక్క మార్గమును. ఆవృత్య - అడ్డగించి, తస్థౌ - నిలిచియుండెను - ఒంటిరిగా వెళ్లినట్టి యజునివద్ది నుండి యిందుమతిని అపహరించుకొని పోవుటకై ముందే సంకేతము నేర్పాటు చేసుకొన్న రాజ సమూహమంతయు మార్గము నడ్డగించి నిలచి యుండెనని భావము. - "సంవిత్" - యుద్ధము, ప్రతిజ్ఞ, సంకేతము, ఆచారము. పేరు అని నానార్థములు; ఆమిషము - మాంసము, భోగ్యవస్తువు.

శ్లో. భర్తాపి తావత్ ప్రథకైశికానాం
అనుష్ఠి తానంతరజా వివాహః
సత్త్వానురూపాహరణీకృత శ్రీః
ప్రాస్థాపయ ద్రాఘువ మన్వగాచ్చ. 82

వ్యాఖ్య: అనుష్ఠితానంతరజావివాహః - అనుష్ఠిత - చేయఁబడిన, అనంతరజా - చెల్లెలియొక్క, వివాహః - వివాహముగల వాడైన, ప్రథకైశికానాం, భర్తా, అపి - ప్రథకైశిక దేశమునకు ప్రభువైన భోజుఁడుకూడా, తావత్ - అప్పుడు, సత్త్వానురూపాహరణీ కృతశ్రీః - సత్త్వాను రూప - ఉత్సాహమునకు తగినట్లుగా ఆహరణీకృత - ఎక్కువ అరణముగాఁ జేయఁబడిన, శ్రీః - సంపదకలవాఁడై, రాఘువం - అజుని, ప్రాస్థాపయత్ - ప్రయాణము చేయించెను, అన్వగాత్చ - తానును సాగనంపుటకు వెంటవెళ్లెను. చెల్లెలికి దాస దాసీ జన ధనకనకాదులను విశేషముగా అరణమిచ్చి పంపెననియు, తాను సాగనంపుటకు వెంటవెళ్లెననియు భావము. "హరణం" అనగా పుట్టింటివారు కన్యకిచ్చి పంపు ధనము. ఈ శబ్దమే తెలుఁగున "అరణము"గా మారినది.

శ్లో. త్రిస్త్రిలోకప్రథితేన సార్థ
మజేన మార్గే వసతీ రుషిత్వా
తస్మా దపావర్తత కుండినేశః
పర్యాత్యయే సోమ ఇవోష్ణరశ్మేః. 83

వ్యాఖ్య: కుండినేశః - కుండిన నగరాధిపతియగు భోజుఁడు (కుండిన నగరము విదర్భ దేశమునకు రాజధాని). త్రిలోక ప్రథితేన - మూడు లోకము

లందును ప్రసిద్ధుఁడైన, అజేన, సార్ధం - అజునితోఁగూడ, మార్గే - దారిలో, త్రిస్రః, వసతీః - మూడు రాత్రులు, ఉషిత్వా - ఉండి. పర్వాత్యయే - 'దర్శ' యను పర్వము ముగియగానే, ఉష్ణరశ్మేః - సూర్యుని వద్దినుండి, సోమః, ఇవ - చంద్రుఁడువలె, తస్మాత్ - ఆయజునివద్దినుండి, అపావర్తత - వెనుకకు మరలెను. మూడు రాత్రులు నూతనదంపతులవెంట ప్రయాణముచేసి వారిని సాగనంపి యింటికి మరలి వెళ్లెనని భావము "త్రిలోక ప్రథితేన" అను విశేషణము అజుని అసహాయశూరత్వమును వెల్లడించు చున్నది. "దర్శః" అనగా సూర్యచంద్రులొక్కచోట కలియునట్టి అమావాస్య. "దర్శః సూర్యేందుసంగమః" అని యమరము. అది యొక పర్వము.

శ్లో. ప్రమన్యవః ప్రాగపి కోసలేంద్రే
ప్రత్యేక మాత్తస్వతయా బభూపుః
అతో నృపా శ్చక్షమిరే సమేతాః
స్త్రీరత్నలాభం న తదాత్మజస్య. 34

వ్యాఖ్య : నృపాః . ఆదారిలో నుండిన రాజులు, ప్రాగపి (ప్రాక్ + అపి)-పూర్వముగూడ, ప్రత్యేకం - ఒక్కొక్కరుగా. ఆత్తస్వతయా - (దిగ్విజయయాత్ర యందు రఘుమహారాజు చేత) తీసుకోఁబడిన ధనముగల వారగుటచేత, కోసలేంద్రే - రఘు మహారాజుపైన, ప్రమన్యవః - అధిక కోపముగల వారు, బభూవుః - అయియుండిరి; అతః - ఈ కారణమువలన, సమేతాః - ఏకీభవించిన వారగుచు, తదాత్మజస్య - ఆతని కుమారుని యొక్క (రఘు కుమారుఁడైన యజునియొక్క), స్త్రీరత్న లాభం - ఉత్తమస్త్రీ లాభమును, న చక్షమిరే - సహింపలేక పోయిరి. ఆ రాజసమూహము యొక్క అసహనమునకు స్వయంవర పరాభవముతో పాటు పూర్వవైరము గూడ కారణమై యుండెననియు అందువలన అందఱును చేరి అజుని జయించి యిందుమతిని అపహరించుకొని పోవుటకు సిద్ధపడిరనియు భావము.

శ్లో. త ముద్వహంతం పథి భోజకన్యాం
రురోధ రాజన్యగణః స దృప్తః

బలిప్రదిష్టాం శ్రియ మాదదానం
త్రైవిక్రమం పాద మివేంద్రశత్రుః. 85

వ్యాఖ్య: దృప్తః - గర్వించిన, సః, రాజన్యగుణః - ఆ రాజసమూహము, భోజకన్యాం - ఇందుమతిని, ఉద్వహంతం - తీసుకొని వెళ్లుచున్న, తం - ఆ యజమహారాజును, బలి ప్రదిష్టాం - బలిచక్రవర్తిచేత ఈయఁబడిన, శ్రియం - సంపదను, ఆదదానం - స్వీకరించుచున్నదియు, త్రైవిక్రమం - వామనునిదియు నగు, పాదం - పాదమును, ఇంద్రశత్రుః - ప్రహ్లాదుఁడువలె, పథి \ మార్గమునందు, రురోధ - అడ్డగించెను. ప్రహ్లాదుఁడు విష్ణుభక్తుఁడేయైనను ఇంద్రశత్రువు ఉపేంద్రుఁడైన వామనుని పాదము స్వర్గాదుల నాక్రమించుటను సహింపలేక దానిని అడ్డగించెనని బ్రహ్మాండపురాణమునఁ గలదు. "విరోచన విరోధేఽపి ప్రహ్లాదః ప్రాక్తనం స్మరన్, విష్ణోస్త్రిక్రమమాణస్య పాదాంభోజం రురోధహ" అట్లు వారు అజుని నాపి యుద్ధమునకుఁ బూనిరి.

శ్లో. తస్యాః సరక్షార్థ మనల్పయోధం
ఆదిశ్య పిత్ర్యం సచివం కుమారః
ప్రత్యగ్రహీత్ పార్థివవాహినీం తాం
భాగీరథీం శోణ ఇవోత్తరంగః. 86

వ్యాఖ్య: సః, కుమారః - ఆ యజుఁడు, తస్యాః, రక్షార్థం - ఇందుమతి యొక్క రక్షణముకొఱకు, అనల్పయోధం - ఎక్కువమంది యుద్ధభటులు కలవాఁడును, పిత్ర్యం - తన తండ్రి కాలమునుండి వచ్చుచున్నవాఁడును (ఆప్తుఁడని యర్థము) అగు, సచివం - మంత్రిని, ఆదిశ్య - ఆజ్ఞాపించి, తాం, పార్థివ వాహినీం - ఆ రాజసైన్యమును, భాగీరథీం - గంగానదిని, ఉత్తరంగః - ఏగయుచున్న యలలుగల, శోణః, ఇవ - శోణనదమువలె, ప్రత్యగ్రహీత్ - ఎదుర్కొనెను. ఇందుమతి రక్షణార్థమై బహుళ సైన్య సమేతుఁడై, ఆప్తుడైన మంత్రిని నియమించి, కొడ్డిపాటి సైన్యముతో తాను శత్రుసేనపై దూకెనని భావము. శోణనదము పెద్దపెద్ద యలలతో భాగీరథిని ముంచివేయును.

శ్లో. పత్తిః పదాతి రథినం రథేశః
తురంగసాదీ తురగాధిరూఢమ్

యంతా గజస్యాభ్యపతత్ గజస్థం
తుల్య ప్రతిద్వంది బభూవ యుద్ధమ్. 37

వ్యాఖ్య: పత్తిః - కాలిబంటు, పదాతిం - కాలిబంటును, అభ్యపతత్ - ఎదుర్కొనెను; రథేశః - రథికుఁడు, రథినం - రథముగల వానిని, అభ్యపతత్ - ఎదుర్కొనెను, తురంగసాధీ - గుఱ్ఱపురౌతు, తురంగాధిరూఢం - గుఱ్ఱమునెక్కిన సైనికుని, అభ్యపతత్ - ఎదుర్కొనెను, గజస్య, యంతా - ఏనుగుయొక్క శిక్షకుఁడు (గజసైనికుఁడు), గజస్థం - ఏనుగుపైనున్న భటుని, అభ్యతతత్ - ఎదుర్కొనెను, (ఇత్థం - ఇట్లు) తుల్యప్రతిద్వంది - సమానమైన ప్రతిభటులుగల, యుద్ధం - యుద్ధము, బభూవ - జరిగెను. ఏ తెగకుచెందిన యుద్ధభటుడు అ తెగ భటునితో తలపడెనని భావము.

శ్లో. నదత్సు తూర్యేష్వవిభావ్య వాచో
నోదీరయంతిస్మ కులోపదేశాన్
బాణాంకరైరేవ పరస్పరస్య
నామోర్జితం చాపభృతః శశంసుః. 38

వ్యాఖ్య: తూర్యేషు, నదత్సు - వాద్యములు ప్రయోగచుండగా, అవిభావ్య వాచః - తెలిసికొనుట వీలుపడని పలుకులుగల, చాపభృతః - విలుకాండ్రు, కులోపదేశాన్ - వంశనామములను, నోదీరయంతిస్మ (న + ఉదీరయంతి + స్మ) చెప్పుటలేదు (పేరుచెప్పి బాణమువేయుట శూరుని లక్షణము), (కింతు - కాని) బాణాక్షరైరేవ - బాణములమీద చెక్కబడిన యక్షరములచేతనే, పరస్పరస్య - ఒండొరులయొక్క, ఊర్జితం - ప్రఖ్యాతమైన, నామ - పేరును, శశంసుః - తెలిపి, బాణములపైగల యక్షరములతోనే తమనుతాము పరిచయము చేయుచుండిరట.

శ్లో. ఉత్థాపితః సంయతి రేణు రశ్వైః
సాంద్రీకృతః స్యందన వంశ చక్రైః
విస్తారితః కుంజరకర్ణతాలైః
నేత్రక్రమేణోపరురోధ సూర్యమ్. 39

వ్యాఖ్య: సంయతి - యుద్ధమునందు, అశ్వైఃశ - గుఱ్ఱములచేత, ఉత్థాపితః - ఎగురగొట్టఁబడినదియు, స్యందన వంశచక్రైఃశ - రథ సమూహముయొక్క చక్రములచేత, సాంద్రీకృతః - దట్టముగాఁ జేయఁబడినదియు, కుంజర కర్ణతాలైఃశ - ఏనుగుల చెవుల తాడనలచేత, విస్తారితః - వ్యాపింపఁ జేయఁబడినదియు నగు, రేణుఃశ - ధూళి, నేత్రక్రమేణ - వస్త్రమును పరచినరీతిగా, సూర్యం - సూర్యుని, ఉపరురోధ - కప్పి అడ్డగించెను. యుద్ధమున బయలుదేరిన ధూళి ఆకాశమును గప్పివైచెనని భావము. 'నేత్ర' శబ్దమునకు వస్త్రమనియు, 'క్రమ' శబ్దమునకు రీతియనియు నర్థములు.

శ్లో. మత్స్యధ్వజా వాయువశాత్ విదీర్ణైఃశ
ముఖైఃశ ప్రవృద్ధ ధ్వజినీ రజాంసి
బభుఃశ పిబంతఃశ పరమార్థ మత్స్యాఃశ
పర్యావిలానీవ నవోదకాని. 40

వ్యాఖ్య: వాయువశాత్ - గాలిమూలమున, విదీర్ణైఃశ - చిరిగిన, ముఖైఃశ - కొనలచేత, ప్రవృద్ధధ్వజినీ రజాంసి—ప్రవృద్ధ - పైకి లేచిన, ధ్వజినీ రజాంసి - సైన్య ధూళులను, పిబంతఃశ - గ్రహించుచున్న, మత్స్యధ్వజాఃశ - మత్స్యాకారము గల జెండాగుడ్డలు, పర్యావిలాని - అంతట కలుషితములైన (ఒండుమట్టితో కలిసిన), నవోదకాని - క్రొత్తనీళ్లను, పిబంతఃశ - త్రాగుచున్న, పరమార్థమత్స్యాఃశ ఇవ - నిజమైన చేపలవలె, బభుఃశ - ప్రకాశించినవి. గాలివలన పైన కదలుచు ధూళిలో రెపరెపలాడుచున్న చిరిగిన జెండాగుడ్డపేలికలు ఒండ్రుమట్టి కలిసిన క్రొత్త నీటిని త్రాగుచున్న నిజమైన చేపలవలెఁ గనఁబడుచుండెను. అలంకారము: ఉపమ.

శ్లో. రథో రథాంగధ్వనినా విజజ్ఞే
ఘిలోల ఘంటాక్వణితేన నాగఃశ
స్వభర్తృ నామగ్రహణా దబూభవ
త్సాంద్రే రజ స్యాత్మ పరావబోధఃశ. 41

వ్యాఖ్య: సాంద్రే, రజసి - దట్టముగా వ్యాపించిన ఆ ధూళియందు, రథః - రథము, రథాంగ ధ్వనినా - చక్రముల ధ్వనిచేతనే, విజజ్ఞే - తెలియఁబడెను, నాగః - గజము, విలోలఘంటా క్వణితేన - కదలుచున్న గంటలయొక్క మ్రోతచేతనే, విజజ్ఞే - తెలియఁబడెను, ఆత్మ పరావబోధః - తమవాఁడు, శత్రు పక్షమువాఁడు అను వివేకము (యుద్ధభటులకు), స్వభర్తృనామ గ్రహణాత్ — స్వభర్తృ - తమ ప్రభువుయొక్క, నామగ్రహణాత్ - పేరును ఉచ్చరించుట వలననే, బభూవ - కలిగెను ఆ రజోంధకారమునందు భటులందఱును స్వపర భేదమును ఆయా శబ్దమువలననే తెలిసికొని యుద్ధము చేయుచుండిరని భావము.

శ్లో. ఆవృణ్వతో లోచనమార్గ మాజౌ
రజోఽంధకారస్య విజృంభితస్య
శస్త్రక్షతాశ్వ ద్విప వీర జన్మా
బాలారుణోఽభూత్ రుధిరప్రవాహః. 42

వ్యాఖ్య: లోచనమార్గం - దృష్టి పథమును, ఆవృణ్వతః - కప్పివేయుచున్నట్టియు, ఆజౌ - యుద్ధభూమియందు, విజృంభితస్య - ఉద్ధృతముగా వ్యాపించినట్టి,దగు రజోంధకారస్య - ధూళియను నంధకారమునకు, శస్త్రక్షితాశ్వ ద్విపవీర జన్మా—శస్త్రక్షత - ఖడ్గముచేత నఱుకబడిన, అశ్వ ద్విపవీర - గుఱ్ఱములనుండి, ఏనుగులనుండి వీరభటులనుండియు, జన్మా - పుట్టిన, రుధిర ప్రవాహః - రక్త ప్రవాహము, బాలారుణః - బాల సూర్యుఁడు, అభూత్ - అయ్యెను. ఆ దుమ్ము రూపమునన్న అంధకారమునకు శస్త్రహతులవలన పుట్టిన రక్తప్రవాహము బాల భానుఁడయ్యెను. అనఁగా అంధకారమును తగ్గించుటలో రుధిరము సూర్యునివంటిదయ్యెనని భావము. 'అరుణ' శబ్దమునకు సూర్యుఁడనియు నర్థము. బాల విశేషణము రుధిరముతో సమానమైన వర్ణము కలిగియుండుటకు; ఇఁకమీద ధూళివ్యాప్తి తగ్గుటను వర్ణించుట జరుగును గనుక ఇది సముచిత రూపకము. ధూళి చీకటి, రక్త ప్రవాహము సూర్యుఁడని రూపణము.

శ్లో. స చ్ఛిన్నమూలః పతతా జేన రేణుః
తస్యోపరిష్టాత్ పవనావధూతః
అంగార శేషస్య హుతాశనస్య
పూర్వోత్థితో ధూమ ఇవాబభాసే. 43

వ్యాఖ్య: క్షతజేన - రక్తముచేత. ఛిన్నమూలః - వదిలింప బడిన ఆధారము కలదియు, తస్య - ఆ రక్తముయొక్క, ఉపరిష్టాత్ - పై భాగమునందు, పవనావధూతః - గాలిచేత కంపింపఁబడినదియు నగు, సః, రేణుః - ఆ ధూళి, అంగార శేషస్య - బొగ్గులతో మిగిలిన, హుతాశనస్య - అగ్నియొక్క, పూర్వోత్థితః - అగ్ని వెలుగుటకంటె ముందు బయలుదేరిన, ధూమః ఇవ - పొగవలె, ఆబభాసే - ప్రకాశించెను. రక్తముచేత నేల తడియుటవలన అచ్చటలేక, గాలిచేత మరికొంచము పై కెగురగొట్టఁబడిన దుమ్ము, అగ్నిసంబంధములేక పై కెగసిన పొగవలె నుండెనని భావము. అలంకారము: ఉత్ప్రేక్ష.

శ్లో. ప్రహార మూర్ఛాపగమే రథస్థాః
యంత్రా నుపాలభ్య నివర్తితాశ్వాన్
యైః సాదితా ఽక్షితపూర్వ కేతూనే
తానేవ సామర్షతయా నిజఘ్నుః. 44

వ్యాఖ్య: రథస్థాః - ఆ యుద్ధము నందలి రథికులు, ప్రహార మూర్ఛాపగమే - శత్రువుకొట్టిన దెబ్బచేత కలిగిన మూర్ఛ తొలగగానే, నివర్తితాశ్వాన్ - మరల్పఁబడిన గుఱ్ఱములుగల, యంత్రాన్ - సారథులను, ఉపాలభ్య - నిందించి, యైః - ఏ వ్యక్తులచేత, సాదితాః - పూర్వము తాము కొట్ట బడియుండిరో, లక్షిత పూర్వకేతూన్ — లక్షితపూర్వ - పూర్వము చూడఁబడిన, కేతూన్ - పతాకములు గల, తానేవ (తాన్ + ఏవ) - ఆ వ్యక్తులనే, సామర్షయా - క్రుద్ధభావము చేత, నిజఘ్నుః - బాగా కొట్టిరి. రథికులు శత్రు ఘాతములచేత మూర్ఛపడగా ప్రాణ రక్షణార్థమై సారథులు వారి రథములను మరల్చిరనియు, మూర్ఛనుండి తేఱిన యా రథికులు అట్లేల చేసితిరని సారథులను తిట్టి, యుద్ధరంగమున తమపై దెబ్బవేసిన వ్యక్తిని, వాని రథపతాకముతో గుర్తించి తిరుగు దెబ్బ కొట్టిరనియు భావము. అది యుద్ధ ధర్మము కదా!

శ్లో. అపవ్యగ్ధమార్గే పరిభ్రాణ లూనా
ధనుర్భృతాం హస్తవతాం పృషత్కాః
సంప్రాపు రేవాత్మజవానువృత్త్యా
పూర్వార్ధభాగైః ఫలిభిః శరవ్యమ్. 45

వ్యాఖ్య: అర్ధమార్గే - సగము దారిలో, పరబాణలూనాః, అపి - శత్రువుల బాణములచేత ఛేదింపఁబడినవి యైనను, హస్తవతాం - కృతహస్తులైన (విలువిద్యయందు నేర్పరులైన), ధనుర్భృతాం - విలుకాండ్రయొక్క, పృషత్కాః - శరములు, ఆత్మజవానువృత్త్యా - తమ వేగము ననుసరించుటచేత, ఫలిభిః - లోహాగ్రములుగల (ఇనుప పిడులుగల), పూర్వార్ధభాగైః - మొదటి సగభాగములచేత, శరవ్యం - లక్ష్యమును (చేరవలసిన చోటును), సంప్రాపురేవ (సంప్రాపుః + ఏవ) - చేరనే చేరినవి. కృతహస్తులైన విలుకాండ్ర బాణములు విరిగియు దారిలో పడిపోలేదని భావము. "సస్య భాణాగ్రయోః ఫలమ్" అని విశ్వనిఘంటువు. కనుక ఫలమనఁగా నిచ్చట బాణాగ్రమని యర్థము.

శ్లో. ఆధోరణానాం గజ సన్నిపాతే
శిరాంసి చక్రైర్నిశితైః క్షురాగ్రైః
హృతాన్యపి శ్యేన నఖాగ్రకోటి
వ్యాసక్త కేశాని చిరేణ పేతుః. 46

వ్యాఖ్య: గజసన్నిపాతే - గజ యుద్ధమునందు, నిశితైః - వాడియైనవియు, క్షురాగ్రైః - మంగలి కత్తులయొక్క పదునువంటి పదునుగల అంచులుగలవియు నగు. చక్రైః - చక్రాయుధములచేత, హృతాని, అపి - ఛేదింపఁబడినవైనను, శ్యేననఖాగ్ర కోటి వ్యాసక్తకేశాని—శ్యేన - డేగపక్షులయొక్క, నఖ - గోళ్లయొక్క, అగ్రకోటి - చివరి యంచులయందు, వ్యాసక్త - తగులుకొన్న, కేశాని - జుట్లుగల, ఆధోరణానాం - గజారోహకులయొక్క, శిరాంసి - తలకాయలు, చిరేణ - చాల ఆలస్యముగా, పేతుః - నేలపైఁ బడినవి (తలలు తెగీ తెగకముందే వానిని పట్టుకొని రక్తమాంసములు తిను డేగలు (గ్రద్దలవంటివి) ఆకాశముపై కెగురుటచేత, ఆ డేగల కాలిగోళ్లలో చిక్కుకొన్న జుట్లుగల గజసైనికుల తలలు చాలాసేపటికి ఆకసమునుండి నేలపైఁ బడుచుండెనని భావము.

శ్లో. పూర్వం ప్రహర్తా న జఘాన భూయః
ప్రతిప్రహారాతుర మభ్యసాదీ
తురంగమ స్కంధ నిషణ్ణ దేహం
ప్రత్యాశ్వసంతం రిపు మాచకాంక్ష. 47

వ్యాఖ్య: పూర్వం - మొదట, ప్రహర్తా - కొట్టిన వాఁడగు, అశ్వసాదీ - గుఱ్ఱపుబంటు, ప్రతిప్రహారాక్షమం - తనను మరలఁ గొట్టుటయందు శక్తుఁడు కానట్టియు, తురంగమస్కంధ నిషణ్ణదేహం—తురంగమస్కంధ - గుఱ్ఱము వీపు మీద, నిషణ్ణదేహం - నిలచిన శరీరముగల (మూర్ఛితుఁడైన), రిపుం - శత్రువును, భూయః - మరల, న జఘాన - కొట్టలేదు. (కింతు - మరియు) ప్రత్యాశ్వసంతం - మరల నిట్టూర్పు విడుచువానినిగా (మరల బ్రతుకువానిగా), ఆచకాంక్ష - కోరెను. తాను వేసిన మొదటి దెబ్బతోనే మూర్ఛితుఁ డగువానిని, మరలకొట్టక అతఁడు బ్రతకవలెనని ఆశ్వికసైనికుఁడు కోరుచుండెనట. ఆ యుధము లేనివానిని, ఆర్తుఁడగువానిని, ఎక్కువ దెబ్బలు తిన్నవానిని కొట్టుట యుద్ధధర్మము కాదని మానివేసెనని భావము.

శ్లో. తనుత్యజాం వర్మభృతాం వికోశైః
బృహత్సు దంతేష్వసిభిః పతద్భిః
ఉద్యంత మగ్నిం శమయాంబభూవు
ర్గజా వివిగ్నాః కర శీకరేణ. 48

వ్యాఖ్య: తనుత్యజాం - నిస్పృహతో శరీరములు విడుచుచున్న, వర్మభృతాం - కవచములుగల సైనికులయొక్క (వారికి సంబంధించినవియు), బృహత్సు - పెద్దవియైన, దంతేషు - తమ దంతములమీద, పతద్భిః - పడుచున్నట్టివి కనుకనే, వికోశైః - ఒరలనుండి పైకి తీయబడిన, అసిభిః - ఖడ్గములచేత, ఉద్యంతం - పైకి లేచుచున్న, అగ్నిం - అగ్నిని, వివిగ్నాః - భయపడిన, గజాః - ఏనుగులు, కరశీకరేణ - తొండమునుండి స్రవించు జలకణముచేత, శమయాం బభూవుః - చల్లార్చినవి. ఏనుగులు తమ దంతములపై బడిన ఖడ్గములవల్ల బయలుదేరిన అగ్నిని తొండపు తుంపురులచేత చల్లార్చినవి.

శ్లో. శిలీముఖోత్కృత్త శిరః ఫలాఢ్యా
చ్యుతైః శిరస్త్రైర్ఞ్చషకోత్తరేవ
రణక్షితిః శోణిత మద్యకుల్యా
రరాజ మృత్యోరివ పానభూమిః. 49

వ్యాఖ్య: శలీ....ఫలాఢ్యా—శలీముఖ - బాణములచేత, ఉత్కృత్త - నటికి వేయఁబడిన, శిరఃఫలాఢ్యా - శిరస్సులనెడి ఫలములతో కూడినదియు, చ్యుతైఃశిరస్త్రాణములనగా సైనికులు తలకు పడిన, శిరస్త్రైశ్చ - శిరస్త్రాణముల చేతనేమో (పెట్టుకొనునట్టి లోహపు టోపీలు), చషకోత్తరేవ - పానపాత్రలు కలదియో యను నట్లున్నదియు, శోణితమద్యకుల్యా - రక్తమనెడి మద్యముయొక్క కాలువలు గల దియు నగు. రణక్షితిః - యుద్ధభూమి, మృత్యోః - మృత్యు దేవతయొక్క, పాన భూమిః, ఇవ - మద్యపాన ప్రదేశమువలె, రరాజ - ప్రకాశించెను. ఆ రణభూమి తెగిన తలలనెడు పండ్లతోను, పడిన శిరస్త్రాణములనెడి పానపాత్రలతోను, రక్తమ నెడి మద్యపు కాలువలతోను నిండి మృత్యుదేవత మద్యపాన ప్రదేశమువలె నుండె నని భావము.

శ్లో. ఉపాంతయో ర్నిష్కుషితం విహంగైః
ఆక్షిప్య తేభ్యః పిశితప్రియాపి
కేయూరకోటి క్షత తాలుదేశా
శివా భుజచ్ఛేద మపాచకార. 50

వ్యాఖ్య: ఉపాంతయోః - రెండు పార్శ్వములయందును, విహంగైః - పక్షులచేత, నిష్కుషితం - ఖండింపబడినదియగు, భుజచ్ఛేదం - భుజఖండమును (ఒక సైనికుని భుజపుముక్కను), తేభ్యః - ఆ పక్షులనుండి, ఆక్షిప్య - లాగు కొని, పిశితప్రియాపి - మాంసమునందు ప్రీతి గలదియైనను, శివా - అడునక్క, కేయూరకోటి క్షతతాలుదేశా—కేయూరకోటి - భుజకీర్తి యంచులచేత, క్షత - తెగిన, తాలుదేశా - దవడలు కలది యగుచు, అపాచకార - పారవేసెను. ఒక నక్క భుజఖండమును తినబోయి, ఆ భుజఖండపు భుజకీర్తి యంచులు గ్రుచ్చు కొని దవడలు తెగుటవలన దానిని దూరముగా పారవేసెనని భావము. 'శివా' యనఁగా ఆడునక్క, కనుక భయపడెను. "శివః కీలఃశివా క్రోష్ట్రీ" అని విశ్వ విఘంటువు.

శ్లో. కశ్చి ద్విషక్షుణ్ణ హృతోత్తమాంగః
సద్యో విమానప్రభుతా మవేత్య

వామాంగ సంసక్త సురాంగనః స్వం
నృత్యత్కబంధం సమరే దదర్శ. 51

వ్యాఖ్య: ద్విషద్ఖడ్గ హృతోత్తమాంగః — ద్విషద్ఖడ్గ - శత్రువుయొక్క ఖడ్గముచేత, హృత - నఱికి వేయఁబడిన, ఉత్తమాంగః - శిరస్సుగల, కశ్చిత్ - ఒకానొక యుద్ధవీరుఁడు, సద్యః - అప్పుడే, విమాన ప్రభుతాం - విమానమునకు అధిపతియగుటను (దేవత్వమును). ఉపేత్య - పొంది, వామాంగసంసక్తసురాంగనః—వామాంగ - ఎడమతొడపైన, సంసక్త - కూర్చున్న, సురాంగనః - ఒక దేవ వేశ్య కలవాఁడగుచు, సమరే - యుద్ధరంగమునందు, నృత్యత్ - నాట్యము చేయుచున్న, స్వం, కబంధం-తన మొండెమును, దదర్శ-చూచెను. తల తెగగానే దేవత్వమునుపొందిన ఒకఁడు తన సంపూర్ణ దైవదేహముతో సురాంగనాయుతుఁడై, నేలపై నర్తన చేయుచున్న తన మొండెమును చూచెనని భావము. తల లేక పోయినను కదలుచున్న మొండెమునకు "కబంధము" అని పేరు "కబంధోఽ స్త్రీ క్రియాయుక్త మపమూర్ధ కశేబరమ్" అమరము.

శ్లో. అన్యోన్య సూతోన్మథనా దభూతాం
తావేవ సూతౌ రథినౌ చ కాచిత్
వ్యశ్వౌ గదావ్యాయత సంప్రహారౌ
భగ్నాయుధౌ బాహువిమర్ద నిష్ఠౌ. 52

వ్యాఖ్య: కాచిత్ - ఒక యిద్దఱు వీరులు, అన్యోన్యసూతోన్మథనాత్ - ఒకరి సారథి నొకరు చంపుటవలన, తావేవ (తౌ+ఏవ) - వారే, సూతౌ - సారథులుగాను, రథినౌచ - రథికులుగాను, అభూతాం - అయిరి, వ్యశ్వౌ - గుఱ్ఱములుగూడా చచ్చిన ఆ యిద్దరే, గదావ్యాయత సంప్రహారౌ - గదలచేత సుదీర్ఘమైన యుద్ధము కలవారుగాను, అభూతాం . అయిరి, భగ్నాయుధౌ - విరిగిన గదాయుధములుగల ఆ యిద్దరే, బాహువిమర్దనిష్ఠౌ—బాహువిమర్ద - బాహులతో కొట్టుకొనుటయందు, నిష్ఠౌ - చనిపోయినవారు, అభూతాం - అయిరి. ఒక యిద్దరు పరస్పరం సారథులను చంపుకొని, తామే సారథులై, గుఱ్ఱములను చంపుకొని రథములు విడిచి, గదలతోను అవి విరుగగా బాహు యుద్ధముచేసి చచ్చిరి. 'నిష్ఠా' అనఁగా నాశము. "నిష్ఠా నిష్పత్తి నాశాంతాః" అని యమరము.

శ్లో. పరస్పరేణ ఋతయోః ప్రహర్త్రోః
ఉత్క్రాంతవాయ్వోః సమకాల మేవ
అమర్త్యభావేఽపి కయోశ్చ దాసీత్
ఏకాప్సరఃప్రార్థితయో ర్వివాదః. 53

వ్యాఖ్య: పరస్పరేణ - ఒకనిచేత నొకఁడు, ఋతయోః - నఱుకఁబడి నట్టియు, సమకాలమేవ - ఒకే సమయమునందు, ఉత్క్రాంతవాయ్వోః - పైకి వెళ్లిపోయిన ప్రాణములు గలిగినట్టియు, ఏకాప్సరః ప్రార్థితయోః - ఒకే యప్స రస యందు కోరిక గలిగియున్నట్టి, కయోశ్చిత్, ప్రహర్త్రోః - ఒక యిద్దఱు యుద్ధభటులకు, అమర్త్యభావేఽపి - దేవత్వము వచ్చినపిమ్మటగూడ, వివాదః - కలహము, ఆసీత్ - జరిగెను. ఇద్దఱు భటులు ఒకే సమయమున ఒకరినొకరు నఱుకుకొని. గతప్రాణులై, స్వర్గమార్గమును బట్టగా, వారియెదుట నిల్చిన యప్స రసలలో నొకతె మిక్కిలి చక్కనిదై యుండెను. ఆమెయే నాకంబే నాకు కావలెనని వారు మరల కలహించుకొనిరని భావము. దేవత్వము వచ్చినదికాని వైరము పోలేదు. ఏకవస్తువాంఛ గొప్ప వైరమునకు బీజము.

శ్లో. వ్యూహౌ ఉభౌ తావితరేతరస్మాత్
భంగం జయం చాపతు రవ్యవస్థమ్
పశ్చాత్పురో మారుతయోః ప్రవృద్ధౌ
పర్యాయవృత్త్యేవ మహార్ణవోర్మ్మి. 54

వ్యాఖ్య: తౌ. ఉభౌ, వ్యూహౌ - ఆ రెండు సైన్య వ్యూహములును (వ్యూహ మనగా ఒన పద్ధతిపై నిల్చిన సైన్య విన్యాసము), పశ్చాత్పురోమారు తయోః - వెనుకకును ముందునకును వీచుచున్న వాయువులయొక్క, పర్యాయ వృత్త్యా - క్రమవర్తనముచేత, ప్రవృద్ధౌ - వృద్ధిని పొందిన, మహార్ణవోర్మ్మిఇవ - రెండు గొప్ప సముద్ర తరంగములవలె, ఇతరేతరస్మాత్ - ఒకదానివలన నొకటి. అవ్యవస్థం - నిలుకడలేని, జయం - జయమును, భంగం చ - పరాజయమును గూడ, ఆపతుః - పొందినవి. ఒకప్పు డజుని సైన్యమునకును మరియొకప్పుడు శత్రు సైన్యమునకును జయ పరాజయములు కలుగుచుండెననియు, నది గాలి తాకి

అకరోత్ - పూ ర్తిగా భస్మీపటలము చేసెను (వ్యర్థముచేసెను). ఇతరః - ఇతరుఁ డైన రఘువు, జ్ఞానమయేన - త త్త్వజ్ఞాన ప్రచురమైన, వహ్నినా - అగ్నిచేత, స్వకర్మణాం - సంసారబీజ భూతములైన తన కర్మలయొక్క, దహనే - భస్మీ కరణమునందు, వవృతే - ప్రవ ర్తించెను. ఉభయులకును ఇది లక్ష్యసాధనలో రెండవమెట్టు. ఆగామి, సంచిత, ప్రారబ్ధరూపములైన కర్మఫలముల నన్నిటిని జ్ఞానాగ్ని (ఆత్మసాక్షాత్కారము) దహించివేయునని శాస్త్రము. "జ్ఞానాగ్నిః సర్వ కర్మాణి భస్మసాత్ కురుతే తథా" అని గీతావచనము. కనుక రఘువు జ్ఞానాగ్నిచేత అంతశ్శత్రువులను జయింపగా అజుఁడు బాహ్యశత్రువులను జయించెనని భావము.

శ్లో. పణబంధ మఖాన్ గుణా నజః
షడుపాయుం క్త సమీక్ష్య తత్ఫలమ్
రఘు రప్యజయ ద్గుణత్రయం
ప్రకృతిస్థం సమలోష్ఠకాంచనః 21

వ్యాఖ్య: అజః - అజుఁడు, పణబంధమఖాన్ - సంధి మొదలగు, షట్ గుణాన్ - ఆరు గుణములను, తత్ఫలం - వాటి ఫలమును, సమీక్ష్య - ఆలో చించి, ఉపాయుం క్త - ప్రయోగించెను, సమలోష్ఠ కాంచనః - సమానముగా భావింపఁబడిన మట్టిగడ్డయు, బంగారమును గల, (నిస్పృహుఁడైన) రఘురపి - రఘుమహారాజుగూడ, గుణత్రయం - స త్త్వము మొదలగు మూడుగుణములను, ప్రకృతిస్థం - వికార శూన్యములగునట్లుగా, అజయత్ - జయించెను. అజుఁడు, శత్రువులపై ప్రయోగింపలవసిన సంధి విగ్రహాది గుణములలో నేది ఫలింపఁ గలదో దానినే ప్రయోగించెననియు, రఘురాజు సత్త్వరజ స్తమోగుణముల యుద్రేక మును యోగశ క్తిచేత తగ్గించి వాటిని సామ్యావస్థలో అనగా వికారరహితముల నుగా నుంచెననియు భావము. "పణబంధః" అనగా సంధియని, కౌటిల్యార్థ శాస్త్రము, "సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, సమాశ్ర యము" అను ఆరుగుణములు రాజు తనశత్రువులపైఁ బ్రయోగింపఁ దగిన యుపాయములు.

శ్లో. న నవః ప్రభు రాఫలో దయాత్
స్థిరకర్మా విరరామ కర్మణః

న చ యోగవిధే ర్న వేతరః
స్థిరధీ రాపరమాత్మ దర్శనాత్. 22

వ్యాఖ్య: స్థిరకర్మా - చేపట్టిన పనిని ఫలించువఱకును విడువనట్టి, నవః, ప్రభుః - క్రొత్తరాజు (అజుఁడు), అఫలోదయాత్ - ఫలసిద్ధి పర్యంతము, కర్మణః - ప్రయత్నమునుండి, న విరరామ - మరలలేదు (ప్రయత్నమును మాన లేదు), స్థిరధీః - నిశ్చల చిత్తుఁడైన, నవేతరశ్చ - ప్రాతరాజుకూడ (రఘువు), ఆపరమాత్మ ధర్శనాత్ - పరమాత్మ సాక్షాత్కార పర్యంతము. యోగవిధేః - ఐక్యాను సంధానమునుండి, న విరరామ - విరమింపలేదు. ఆరంభించిన పనిని ఫల సిద్ధియగువఱకు ఉభయులును విడుచువారు కారనియు, విడువలేదనియు భావము.

శ్లో. ఇతి శత్రుషు చేంద్రియేషు చ
ప్రతిషిద్ధ ప్రసరేషు జాగ్రతౌ
ప్రసితా వుదయాపవర్గయోః
ఉభయీం సిద్ధి ముభా వవాపతుః. 23

వ్యాఖ్య: ఇతి - ఇట్లు, ప్రతిషిద్ధప్రసరేషు - నిషేధింపబడియు ముందుకు వచ్చినట్టి, శత్రుషు - శత్రువుల విషయమునను, ఇంద్రియేషు చ - ఇంద్రియముల విషయమునను, జాగ్రతౌ - జాగ్రత్త గలవారును, ఉదయాపవర్గయోః - అభ్యుదయ మోక్షములయందు. ప్రసితౌ - ఆసక్తులును నగు, ఉభౌ - ఇద్దఱును (అజ రఘువులు), ఉభయీం - రెండు విధములయిన (అభ్యుదయ, మోక్షరూపమైన), సిద్ధిం - ఫలసిద్ధిని, అవాపతుః - పొందిరి. అజుఁడు శత్రునిర్మూలన రూపమైన అభ్యుదయమును, రఘువు ఇంద్రియ నిగ్రహమూలకమైన మోక్షమును పొందిరని భావము. "ప్రతిషిద్ధప్రసరేషు" వద్దని వెనుకకు త్రోసినను స్వార్థపరులైన శత్రువులు ముందుకు వచ్చుచుందురు; అట్లే ఇంద్రియములు నిగ్రహింపబడుచున్నను భోగ్యవిషయముల మీదికి ప్రసరించుచుండునన్న భావమును ఈ పదము చక్కగా వివరించుచున్నది.

శ్లో. అథ కాశ్చి దజవ్యపేక్షయా
గమయిత్వా సమదర్శనః సమాః

తమసః పర మాప దవ్యయం
పురుషం యోగసమాధినా రఘుః. 24

వ్యాఖ్య: అథ - పిమ్మట, రఘుః - రఘుమహారాజు, సమదర్శనః - సర్వభూతములయందును సమాన దృష్టిగలవాఁడగుచు, అజవ్యపేక్షయా - అజుని యొక్క కోరిక ననుసరించి, కాశ్చిత్, సమాః - కొన్ని సంవత్సరములు, గమయిత్వా - గడపి, యోగసమాధినా - జీవాత్మ పరమాత్మల అనుసంధానముచేత, అవ్యయం - నాశము లేనివాఁడును, తమసః పరం - అజ్ఞానమునకు దూరమైన వాఁడును అగు (అవిద్యకు పరమైనవాఁడు మాయాతీతుఁడు అని యర్థము), పురుషం - పరమాత్మని, ఆపత్ - చేరెను. యోగసమాధిచేత సాయుజ్య మోక్షమును పొందెనని భావము.

శ్లో. శ్రుత దేహావిసర్జనః పితుః
చిర మశ్రూణి విముచ్య రాఘవః
విదధే విధి మస్య నైష్ఠికం
యతిభిః సార్ధ మనగ్ని మగ్నిచిత్. 25

వ్యాఖ్య: అగ్నిచిత్ - ఆహితాగ్నియైన (యజ్ఞములు చేసినట్టి), రాఘవః - రఘుకుమారుఁడు (అజుఁడు), పితుః - తండ్రియొక్క, శ్రుతదేహ విసర్జనః - వినఁబడిన శరీర త్యాగవార్తగలవాఁడై (తండ్రి మరణవార్త విన్నవాఁడగుచు), చిరం - చాలాసేపు, అశ్రూణి, విముచ్య - కన్నీళ్లుకార్చి, అస్య - అతనికి (తండ్రికి). అనగ్నిం - అగ్ని సంస్కారరహిత మైనదియు, నైష్ఠికం - తపోనిష్ఠయొక్క అంతమందుఁ జేయఁదగినదియు నగు, విధిం - ఆచారమును (అంత్యకర్మను), యతిభిః, సార్ధం - సన్యాసులతోగూడ, విదధే - చేసెను. రఘు శరీరమును దహనముచేయక ఖననము చేసి సమాధి చేయించెనని యర్థము. సర్వసంగ పరిత్యాగము చేసి, ధ్యానయోగ రతుఁడైనవాని దేహమును కాల్చివేయఁగూడదనియు, గుంటలో శరీరమునుంచి ఓంకారోచ్చారణము చేయుచు మట్టి కప్పవలయుననియు 'అనగ్ని' విధిని శౌనక స్మృతి నిర్దేశించినది. "సర్వసంగ నివృత్తస్య ధ్యానయోగరతస్య చ. న తస్య దహనం కార్యం, నైవ పిండోదకక్రియా, నిదధ్యాత్ ప్రణవేనైవ బిలే భిక్షోః కలేబరమ్, ప్రోక్షణం ఖననం చైవ సర్వంతే

నైప కారయేత్" అని. కనుక అజుడు తండ్రికి దహనముకాక సమాధిని చేయించె నని భావము.

శ్లో. అకరో త్స తదౌర్ధ్వ దైహికం
పితృ భక్త్యా పితృకార్య కల్పవిత్
న హి తేన పథా తనుత్యజః
తనయావర్జిత పిండ కాంక్షిణః 26

వ్యాఖ్య: పితృకార్యకల్పవిత్ - తండ్రియొక్క శ్రాద్ధవిధానము నెఱిగిన, సః - ఆ యజుడు, పితృభక్త్యా - తండ్రియందలి ప్రేమచేత, తస్య - ఆ రఘుమహారాజుకు, ఔర్ధ్వ దైహికం - శరీరమును విడిచిన పిమ్మట చేయవలసిన తిలోదక, పిండదానాదికమును, అకరోత్ - చేసెను, తేనపథా - ఆ మార్గముచేత (యోగమార్గముచేత), తనుత్యజః - శరీరమును విడిచినివారు, తనయావర్జిత పిండ కాంక్షిణః - కుమారునిచేత నీయబడిన పిండాదికమును గోరువారు, నహి భవంతి - కారుసుమా! అజుడు తండ్రిపైన ప్రేమచేత తిలోదకాదులను ఇచ్చెనేకాని అది విధి విహితముకాదని భావము.

శ్లో. స పరార్ధ్యగతే రశోచ్యతాం
పితు రుద్దిస్య సదర్థవేదిభిః
శమితాధి రధిజ్య కార్ముకః
కృతవా నప్రతిశాసనం జగత్.
27

వ్యాఖ్య: పరార్ధ్యగతేః - ప్రశస్తమైన గతిగల (మోక్షమును పొందిన), పితుః - తండ్రియొక్క, అశోచ్యతాం - అశోచనీయత్వమును, ఉద్దిశ్య - బోధించి (శోకించుట తగదని యుపదేశించి), సదర్థవేదిభిః - వరమార్థము నెఱిం గిన విద్వాంసులచేత, శమితాధిః - నివారింపఁబడిన మనోవ్యధగల, సః - ఆ యజుఁడు, అధిజ్య కార్ముకః - ఎక్కు పెట్టఁబడిన ధనుస్సుగలవాఁ డగుచు, జగత్ - లోకమును, అప్రతిశాసనం - రెండవవాని యాజ్ఞ లేనిదానినిగా, కృత వాన్ - చేసెను. విద్వాంసుల యోదార్పుచేత పితృమరణ దుఃఖమునుండి తేఱు కొని మఱల రాజ్యపాలన తత్పరుఁడయ్యెననియు శత్రురాజుల నణచి ఏకచ్ఛత్రాధి పతి యయ్యెననియు భావము.

శ్లో. క్షితి రిందుమతీ చ భామినీ
పతి మాసాద్య త మగ్ర్యపౌరుషమ్
ప్రథమా బహురత్నసూ రభూ
దపరా వీర మజీజన త్సుతమ్. 28

వ్యాఖ్య: క్షితిః - భూమియు, భామినీ - ప్రియురాలైన, ఇందుమతీచ - ఇందుమతియు. అగ్ర్యపౌరుషం-గొప్ప పరాక్రమమును, ఉత్కృష్ట భోగనైపుణ్య మునుగల, తం - ఆ యజుని, పతిం - భర్తనుగా, ఆసాద్య - పొందిన, ప్రథమా - మొదటిదియగు భూమి (పెద్దభార్యయని ధ్వని). బహురత్నసూః - అనేక శ్రేష్ఠవస్తువులను, రత్నములను ప్రసవించినది, అభూత్ - అయ్యెను, అపరా - రెండవది యగు ఇందుమతి, వీరంసుతం - వీరుడైన కుమారుని, అజీజనత్ - కనెను. సత్పరిపాలనము వలన భూమి రత్నరాసులను గ్రుమ్మరించె నవియు, ప్రేమోపలాలితయగు ఇందుమతి చక్కని కుమారునిఁ గనెననియు భావము. భిన్న ధర్మములుగల జంటనుకలిపి వర్ణింపవలయునను మనోభావముతో కాళిదాసు పూర్వశ్లోకమువలకు అజరఘువులను గలిపి వర్ణించెను. ఈ శ్లోకమునందు భూదేవిని, ఇందుమతినిఁ గలిపి వర్ణించుచు, అజునియొక్క వీర శృంగార నాయ కత్వమును సూచించినాడు.

శ్లో. దశరశ్మిశతోపమ ద్యుతిం
యశసా దిక్షు దశస్వపి శ్రుతమ్
దశపూర్వరథం య మాఖ్యయా
దశకంఠారిగురుం విదు ర్బుధాః. 29

వ్యాఖ్య: దశరశ్మి శతోపమద్యుతిం—దశరశ్మిశత - పది కిరణ శతములు గల సూర్యుఁడు (సహస్రకిరణుఁడవి యర్థము), ఉపమా - సాటిగాగల, ద్యుతిం- కాంతి గలవాఁడును, యశసా - కీర్తిచేత, దశస్వపి, దిక్షు - పది దిక్కులయందును, శ్రుతం - ప్రసిద్ధుఁడును, దశకంఠారిగురుం—దశకంఠారి - రావణునికి శత్రువైన రామునికి, గురుం - తండ్రి యగువాఁడును అగు, యం - ఏ కుమారుని, ఆఖ్యయా - పేరుచేత, దశపూర్వరథం - దశశబ్దము మొదటగల

'రథ' శబ్దవాచ్యునిగా (దశరథ నామధేయునిగా), బుధాః - పండితులు, విదుః - చెప్పుచుండిరో అట్టికుమారుని ఇందుమతి కనెనని యర్థము. దశ సంఖ్యగల యా బాలుఁడు దశరథుఁడను పేరున ప్రసిద్ధుఁడగుట యుక్తమని పండితులు నుడివిరి. "దశపూర్వరథం" అనునది ఒక చమత్కార శబ్ద ప్రయోగము. కాళిదాసు మేఘ దూతమునందుఁగూడ ఇట్టి ప్రయోగముఁ జేసెను. "దేవపూర్వం గిరిం తే"దేవగిరి అని యర్థము. మాఘకవి "హిరణ్యపూర్వం కశిపుం ప్రచక్షతే" అని ప్రయోగిం చెను. హిరణ్యకశిపుఁడని యర్థము. భారవి "ధనురుపపద మస్మై వేదమన్వాది దేశ" అని ప్రయోగించెను. ధనుర్వేదమని యర్థము.

శ్లో. ఋషి దేవగణ స్వధా భుజాం
శ్రుత యాగ ప్రసవైః స పార్థివః
అనృణత్వ ముపేయివాన్ బభౌ
పరిధే ర్ముక్త ఇవోష్ణదీధితిః. 30

వ్యాఖ్య: శ్రుత, యాగ, ప్రసవైః — శ్రుత - వేద శాస్త్రాధ్యయనము చేతను, యాగ - యజ్ఞములచేతను, ప్రసవైః - సంతానము చేతను (యథా సంఖ్యముగా, వరుసగా), ఋషి దేవగణ స్వధాభుజాం.—ఋషి - మంత్రద్రష్ట లును, శాస్త్రకర్తలునునగు ఋషులయొక్కయు, దేవగణ - ఇంద్రాది దేవతల యొక్కయు, స్వధాభుజాం - పితృదేవతలయొక్కయు, అనృణత్వం - ఋణము లేకుండుటను (వారివారి ఋణములనుండి విముక్తిఁ జెందుటను). ఉపేయివాన్ - పొందినవాఁడగు, సః పార్థివః - ఆరాజు (అజుఁడు), పరిధేః - పరివేషమునుండి, ముక్తః - వెడలి బయటికి వచ్చిన, ఉష్ణదీధితిః ఇవ - సూర్యుఁడువలె, బభౌ - ప్రకాశించెను (ఋణత్రయ విముక్తుఁడయ్యెను). మానవుఁడు ఋణత్రయ విము క్తుఁడు కావలెనని ధర్మశాస్త్రము. అవి పుట్టగానే ప్రతివానికిని తగులును. ఋషి ఋణ దేవఋణ పితృఋణములు క్రమముగా అధ్యయన, యజ్ఞ, పుత్రోదయముల చేత తీరిపోవును. కనుక అజుఁ డిట్లు చేసెనని భావము.

శ్లో. బల మార్త భయోపశాంతయే
విదుషాం సత్కృతయే బహుశ్రుతమే
వసు తస్య విభో ర్న కేవలం
గుణవత్తాపి పరప్రయోజనా. 31

వ్యాఖ్య: తస్య, విభోః - ఆ ప్రభువుయొక్క (అజునియొక్క), కేవలం, వసు - ఒక ధనముమాత్రమే, పరప్రయోజనం - ఇతరుల కుపకరించునది, న - కాలేదు, గుణవత్తా, అపి - అతని సుగుణత్వముకూడ, పరప్రయోజనా - ఇతరుల ప్రయోజనముగలది యయ్యేను (ఎలాగనగా), బలం - అతని పౌరుషము, ఆర్తభయోపశాంతయే - ఆపన్నులయొక్క భయము శాంతించుట కొఱకును, బహు - అధికమైన, శ్రుతం - విద్య, విదుషాం సత్కృతయే - పండితుల యొక్క సత్కారము కొఱకును, (బభూవ - అయ్యెను). అజమహారాజుయొక్క ధనము ప్రజలకే యుపయోగించుచుండె ననుటలో గొప్పలేదు, ఆయన సద్గుణము లన్నిటికినీ పరప్రయోజనమే ఫలముగాని స్వార్థముగాని, పరపీడనముగాని లక్ష్యముకాదు; తాను బలవంతుఁడగుటకు ఫలము ఆర్తుల యాపదలను శమింపఁజేయుటకును, విద్యావంతుఁడగుటకు ఫలము తన రాజ్యమునందుఁగల విజ్ఞులను అజ్ఞులను గుర్తించి, విద్వాంసులను సత్కరించుటకేకాని తాను గర్వపడుటకు కాదని భావము. రాజు (పరిపాలకుఁడు) ధనబల విద్యాగుణములు కలిగి యుండవలెననియు, వాటిని స్వార్థమునకు పరపీడా పరాయణత్వమునకును వినియోగింపక, ప్రజల మేలునకై వినియోగించునట్టి బుద్ధిమంతుఁడు కావలయుననియు, అజుఁడట్టి వాఁడై యుండెవనియు కవిహృదయము.

శ్లో. స కదాచి దవేక్షితప్రజః
సహ దేవ్యా విజహార సుప్రజః
నగరోపవనే శచీసఖో
మరుతాం పాలయితేవ నందనే. 82

వ్యాఖ్య: అవేక్షితప్రజః - చక్కగాఁ జూడబడిన ప్రజలుగల (ఏలాటి భయము కష్టములు లేనట్లుగా ప్రజలను సుఖపెట్టు వాఁడగు). సః - ఆ యజుఁడు, సుప్రజః - మంచికుమారుఁడు కలవాఁడై (కుమారునిపై భారము నుంచినవాఁడై), కదాచిత్ - ఒకప్పుడు, దేవ్యాసహ - ఇందుమతితో గూడ, నగరోపవనే - నగర సమీపమునందలి యుద్యానవనమునందు, నందనే - స్వర్గపట్టణ సమీపముననున్న నందనవనమునందు, శచీసఖః - శచీదేవితోగూడ, మరుతాం - దేవతలయొక్క, పాలయితా ఇవ - పాలకుఁడగు ఇంద్రునివలె, విజహార - విహారము చేసెను. ఒకప్పుడు అజుఁడు ఇందుమతితో కలిసి యుద్యానవన విహారమునకు వెళ్ళి

యచ్చట, నందనోద్యానమునందు శచీదేవితో ఇంద్రుడు విహరించుచున్నట్లు విహరించుచుండెను.

శ్లో. అథ రోధసి దక్షిణోదధేః
శ్రిత గోకర్ణనికేత మీశ్వరమ్
ఉపవీణయితుం యయౌ రవే
రుదయావృత్తిపథేన నారదః. 33

వ్యాఖ్య: అథ - పిమ్మట (ఆ తరువాతకథ యేమనగా), దక్షిణోదధేః - దక్షిణ సముద్రముయొక్క, రోధసి - తీరమునందు. శ్రితగోకర్ణ నికేతం - ఆధివసింపబడిన గోకర్ణ క్షేత్రముగల, ఈశ్వరం - శివుని, ఉపవీణయితుం - వీణా గానముతో సేవించుట కొఱకు, నారదః - నారదుఁడు, రవేః - సూర్యునియొక్క, ఉదయావృత్తి పథేన - ఉదయ మార్గము అనగా ఆకాశమార్గముద్వారా, యయౌ - వెళ్లెను. సూర్యమార్గమనుటచేత నారదుఁడు మహా తేజస్వియై తన వీణానాదము చేత గోకర్ణక్షేత్ర నిలయుఁడైన శివుని సేవకై ఆకాశమున వెళ్లుచుండెనని భావము.

శ్లో. కుసుమై ర్గ్రథితా మపార్థివై ఃప్రజ మాతోద్య శిరో నివేశితామ్
అహరత్ కిల తస్య వేగవాన్
అధివాస స్పృహయేవ మారుతః. 34

వ్యాఖ్య: అపార్థివై ఃకుసుమైఃగ్రథితాం - భూమిమీద పుట్టినవి కానట్టి (స్వర్గజాతములని యర్థము). కుసుమైఃగ్రథితాం - పువ్వులచేత, గ్రథితాం - అల్లఁబడినదియు, తస్య - ఆ నారదునియొక్క, ఆతోద్య శిరోనివేశితాం — ఆతోద్య - వీణావాద్యముయొక్క, శిరః - అగ్రమునందు, నివేశితాం - ఉంచబడినదియు నగు, స్రజం - మాలను. వేగవాన్మారుతః - వేగముగల వాయువు, అధివాసస్పృహయా ఇవ - అలంకరించుకొను కోరికచేత వలె, అహరత్కిల - అపహరించినదట. నారదుని వీణ కొసనగల పుష్పమాల గాలికి జారి పడినదని భావము.

శ్లో. భ్రమరైఃకుసుమా నుసారిభిఃపరికీర్ణా పరివాదినీ మునేః

దదృశే పవనావలేపజం
సృజతీ భాష్ప మివాంజనా విలమ్. 35

వ్యాఖ్య: కుసుమానుసారిభిః - పువ్వులవెంట వచ్చుచున్న, భ్రమరైః - తుమ్మెదలచేత, పరికీర్ణా - వ్యాపించిన, మునేః పరివాదినీ - నారదునియొక్క వీణ, పవనావలేపజం - వాయువుయొక్క గర్వముచేత పుట్టినదియు, అంజనా విలం - కాటుకచేత కలుషితమైనదియు నగు, భాష్పం - కన్నీటిని, సృజతీ ఇవ - విడుచుచున్నదివలె, దదృశే - కనఁబడెను. పువ్వులమీది తుమ్మెదలతోపాటు నేలకు జాఱుచున్న పుష్పమాల, నారదుని వీణ, వాయుదేవుని అధిక్షేపమునకు దుఃఖించుచు విడిచిన కాటుక కన్నీటి ధారవలె నుండెనని భావము. "పరివాదిని" యనగా ఏడు తంత్రులుగల వీణ.

శ్లో. అభిభూయ విభూతి మార్తవీం
మధుగంధాతిశయేన వీరుధామ్
నృపతే రమరస్రగాప సా
దయితోరు స్తన కోటి సుస్థితిమ్. 36

వ్యాఖ్య: సా, అమరస్రక్ - ఆ దివ్యమాల, మధుగంధాతిశయేన - మకరందము యొక్కయు, పరిమళముయొక్కయు ఆధిక్యముచేత, వీరుధాం - తీగలయొక్క (నేలమీదివని యర్థము), ఆర్తవీం - ఋతువులవలన సంప్రాప్తించిన, విభూతిం - సమృద్ధిని, అభిభూయ - తిరస్కరించి, నృపతేః - అజునియొక్క, దయితోరు స్తన కోటిసుస్థితం - ప్రియురాలి పెద్ద స్తనముల చూచుకములయందు చక్కని స్థితిని, ఆప - పొందెను. నారదుని వీణనైనుండి జారిన యా మాలిక యిందుమతియొక్క స్తనచూచుకములు బిగువుగా నుండిన కారణమున అచ్చటపడి నిలుకడగా వ్రేలాడుచుండెనని భావము. ఇందుమతి నిలుచునియే యుండెననియు, ఆమె స్తనములు ముందుకు నిక్కిపొడుచుకొని యుండెననియు గ్రహింపవలయును. అది కామోద్రేక సూచకము.

శ్లో. క్షణమాత్ర సఖం సుజాతయోః
స్తనయో స్తా మవలోక్య విహ్వలా

నిమిమీల నరో త్తమ ప్రియా
హృతచంద్రా తమసేవ కౌముదీ. 37

వ్యాఖ్య: సుజాతయోః - చక్కగ పుట్టిన (సుందరములైన), స్తనయోః-స్తనములయందు, క్షణమాత్రసఖీం - క్షణకాలము మాత్రమే చెలిక త్తెగా నుండిన, తాం - ఆ మాలను, అవలోక్య - చూచి, విహ్వలా - పరవశురాలైన, నరో త్తమ ప్రియా - ఇందుమతి, తమసా - రాహువుచేత, హృతచంద్రా - అపహరింపఁబడిన చంద్రుఁడుగల, కౌముదీ ఇవ - చంద్రికవలె (వెన్నెలవలె), నిమిమీల - మూర్ఛిల్లెను (మరణించెను). గ్రహణ సమయమునందు రాహువువలన చంద్రుఁడు ఆచ్ఛాదితుఁడు కాగా వెన్నెల ముడుచుకుపోవుచు అదృశ్యమైనట్లు ఇందుమతి కనులు మూయుచు తెలివిదప్పి గతప్రాణయై పడినదని భావము. అద్భుతమైన పోలికగల యుపమాలంకారము.

శ్లో. వపుషా కరణోజ్ఝి తేన సా
నిపతంతీ పతి మప్యపాతయత్
నను తై లనిషేక బిందునా
సహ దీపార్చి రుపై తి మేదినీమ్. 38

వ్యాఖ్య: కరణోజ్ఝి తేన - ఇంద్రియముల చేత విడువబడిన, వపుషా - శరీరముతో, నిపతంతీ - పడుచున్నదియగు, సా - ఆ యిందుమతి, పతిం అపి - అజునిగూడ, అపాతయత్ - పడునట్లు చేసెను; (ఎలాగనగా) తై లనిషేక బిందునా సహ - తై లనిషేక - తై లస్రావముయొక్క (కారుచున్న నూనెయొక్క), బిందునాసహ - బిందువుతోగూడ, దీపార్చిః - ద్వీపజ్వాల, మేదినీం - భూమిని, ఉపై తి నను - చేరును కదా! నిమీలితనేత్రయై పరవశురాలైయున్న యిందుమతిని అజుఁడు పట్టుకొనగా ఆమె నేలపై బడుటయు ఆధారముగానున్న అజుఁడు సైతము పడుటయు జరిగెను. ఇద్దఱును నేలపై వ్రాలిరని భావము. ఇచ్చట దీపార్చి (దీపజ్వాల) ఇందుమతికి ఉపమానము; అజునికి తై లబిందు వుపమానము; దీపజ్వాల పైనుండి నేలకు జారునప్పుడు తై లబిందువును ఆధారముగా జేసికొనియే జారును. అట్లే ఇందుమతి అజ సహితముగా నేలపై గూలెను. ఈ యౌపమ్యము నందలి విశేషమేమనగా దీపజ్వాల చల్లారినట్లు ఇందుమతి మరణించెననియు, తై ల బిందువు శేషించినట్లు అజుఁడు బ్రతికియుండెననియు భావము. గొప్పదృష్టాంతము.

శ్లో. ఉభయో రపి పార్శ్వ వర్తినాం
తుములే నార్తరవేణ వేజితాః
విహగాః కమలాకరాలయాః
సమదుఃఖా ఇవ తత్ర చుక్రుశుః. 39

వ్యాఖ్య: ఉభయోః - ఇద్దఱియొక్కయు (ఇందుమత్యజులయొక్క). పార్శ్వవర్తినాం - ప్రక్కనఉన్న సేవకులయొక్క, తుములేన - సంకులమైన, ఆర్తరవేణ - శోక ధ్వనిచేత, వేజితాః - భయపడిన, కమలాకరాలయాః విహగాః - సరోవరమున నివసించు పక్షులు, తత్ర - అచ్చట, సమదుఃఖాః ఇవ - పరిజనమునకు సమానమైన శోకము గలవివలె, చుక్రుశుః - అరచినవి. పక్షుల యరపునందు గూడ శోకము వ్యక్తమైనదని భావము,

శ్లో. నృపతే ర్వ్యజనాదిభి స్తమో
నుదే సా తు తథైవ సంస్థితా
ప్రతికార విధాన మాయుషః
సతి శేషే హి ఫలాయ కల్పతే. 40

వ్యాఖ్య: నృపతేః - అజునియొక్క, తమః - మూర్ఛ, వ్యజనాదిభిః - విసనకఱ్ఱ మొదలయినవాటిచేత, నుదే - తొలగింపఁబడెను, సాతు - ఇందుమతియేమో తథైవ - అట్లే నేలపైఁబడి, సంస్థితా - మరణించినది, హి - అదియట్లే, ప్రతికారవిధానం - చికిత్స, ఆయుషః - జీవితకాలముయొక్క, శేషే - శేషము, సతి - ఉన్నదైనచో, ఫలాయ - ఆరోగ్యసిద్ధి కొఱకు, కల్పతే - సమర్థమగును. అజునికి ఆయుశ్శేషముండుటచేత చికిత్సలు ఫలించెననియు, ఇందుమతికి జీవితకాలము శేషింపనందున చికిత్సలు ఫలింపక ఆమె మరణించెననియు భావము. ఇచ్చట "వ్యజనాది" శబ్దములోని ఆది శబ్దమునకు నీరుచల్లుట, కర్పూరము రాచుట మొదలైన చికిత్సలు అర్థము.

శ్లో. ప్రతియోజయితవ్య వల్లకీ
సమవస్థా మథ సత్త్వవిప్లవాత్

స నిశాయ నితాంతవత్సలః
పరిగృహ్యోచిత మంక మంగనామ్. 41

వ్యాఖ్య: అథ - తరువాత, సత్త్వవిప్లవాత్ - ప్రాణము పోయినందు వలన, ప్రతియోజయితవ్య వల్లకీ సమవస్థాం — ప్రతియోజయితవ్య - తీగలతో కూర్పఁదగినదియగు, వల్లకీ - వీణయొక్క, సమవస్థాం - దశ (స్థితి)గలదియగు, అంగనాం - భార్యను, నితాంతవత్సలః - మిక్కిలి ప్రేమగలవాఁడగు, సః - ఆ యజుఁడు, పరిగృహ్య - చేతులలో నెత్తుకొని, ఉచితం - పరిచితమైన, అంకం - తన తొడను, నినాయ - చేర్చెను. వీణ తంత్రులు తెగినదశలో నున్నట్లు దయ నీయస్థితిలోనున్న యిందుమతిని చేతులతోనెత్తి తన తొడపై మిక్కిలి ప్రేమతో అజుఁడుంచుకొనెనని భావము.

శ్లో. పతి రంకనిషణ్ణయా తయా
కరణాపాయ విభిన్న వర్ణయా
సమలక్ష్యత బిభ్ర దావిలాం
మృగలేఖా ముషసీవ చంద్రమాః 42

వ్యాఖ్య: పతిః - భర్తయగు అజుఁడు, అంకనిషణ్ణయా - తొడ మీద నుండినదియు, కరణాపాయ విభిన్నవర్ణయా — కరణాపాయ - ఇంద్రియముల యొక్క వినాశముచేత, విభిన్నవర్ణయా - మారినరంగు గల, తయా - ఆ యిందు మతిచేత, ఉషసి - ప్రాతఃకాలమునందు, ఆవిలాం - మలినమైన, మృగలేఖాం - చిహ్నమగు మృగరూపమును, బిభ్రత్ - ధరించుచున్న, చంద్రమాః ఇవ - చంద్రుఁడువలె, సమలక్ష్యత - కనఁబడెను. మరణముచేత కాంతిహీనయగు ఇందు మతిని తొడపై నిదుకొన్న యజుఁడు కళాహీనమగు చిహ్నమును ధరించిన చం ద్రునివలె నుండెనని భావము. అలంకారము: ఉపమ.

శ్లో. విలలాప స బాష్పగద్గదం
సహజా మప్యపహాయ ధీరతాం
అభితప్త మయోఽపి మార్దవం
భజతే కైవ కథా శరీరిషు. 43

వ్యాఖ్య: సః - అజుఁడు, సహజాం, అపి - స్వభావసిద్ధమైనదేయైనను, ధీరతాం - ధైర్యమును, అపహాయ - పోగొట్టుకొని, బాష్పగద్గదం - డగ్గుత్తికతో వణకు పలుకులు గలుగునట్లుగా. విలలాప - ఏడ్చెను; అభితప్తం - అగ్నిచేత తపింపఁజేయబడిన, అయోపి (అయః + అపి) - అచేతనమైన ఇనుము కూడ, మార్దవం - మెత్తదనమును, భజతే - పొందును, శరీరిషు - సంతప్తులైన మనుష్యుల విషయమున, కైవకథా - ఏమి సంగతి? (చెప్పనే అక్కరలేదు). సహజ ధీరుఁడయ్యును ధైర్యము సడలి యజుఁడు గద్గదస్వరముతో విలపించెనని భావము. (ఆవిలాప వచనములు రాబోవు శ్లోకమునుండి యారంభమగును) అగ్నితప్తమైన ఇనుము కూడ మెత్తబడుచున్నప్పుడు దుఃఖతప్తులైన మానవులు తమ సహజ ధైర్యమును గోల్పోవుటలో నేమి వింతగలదు?

శ్లో. కుసుమాన్యపి గాత్ర సంగమాత్
ప్రభవం త్యాయు రపోహితుం యది
న భవిష్యతి హంత సాధనం
కిమివాన్యత్ ప్రహరిష్యతో విధేః 44

వ్యాఖ్య: కుసుమాని, అపి - మిక్కిలి మెత్తని పువ్వులు గూడ, గాత్ర సంగమాత్ - దేహసంసర్గము వలన, ఆయుః - ఆయుష్యమును, అపోహితుం - అపహరించుటకు, ప్రభవంతియది - సమర్థములగుచున్నచో, హంత - అయ్యో, ప్రహరిష్యతః - చంపదలచుకొన్న, విధేః - దైవమునకు, అన్యత్ - మరియొకటి యగు (కుసుమాతిరిక్తమైన), కిమివ (కిం + ఇవ) ఏ వస్తువు, సాధనం - ఆయుధము, నభవిష్యతి - కాజాలదు? చంపదలఁచుకొన్న దైవమునకు పువ్వులే ఆయుధమైనప్పుడు ఇక ఆయుధము కానిదేమున్నది, విధి దేనితోనైనను చంపఁగలదని భావము. 'హంత' ఇది అవ్యయము. ఇది సంతోషమును, దయను, దుఃఖమును తెలుపును. ప్రకృతమున దుఃఖార్థకము. దీనిని వాక్యారంభమునందు సైతముపయోగించుట కలదు. ఈ శ్లోకమునందలి 'ఇవ' శబ్దము వాక్యాలంకారము కొఱకే, దానికి ప్రత్యేకమైన యర్థములేదు.

శ్లో. అథవా మృదు వస్తు హింసితుం
మృదునైవ వారభతే ప్రజాంతకః

శ్లో. ధ్రువ మస్మి శఠ శ్చిస్మితే !
విదితః కైతవవత్సల స్తవ
పరలోక మసన్నివృత్త యే
య దనాపృచ్ఛ్య గతాసి మా మితః. 49

వ్యాఖ్య: హే ఋచిస్మితే - ఓ చిఱునగవు మోముదానా ! (ఓ ఇందుమతీ!) శఠః - మోసగాడను, కైతవవత్సలః - కపటప్రేమగలవాడను అని, ధ్రువం - నిజముగా, తవ విదితః - నీచేత తెలుసుకున్న వాడను, అస్మి - అగుచున్నాను, యత్ - ఏ కారణమువలన నైతే, మాం - నన్ను, అనాపృచ్ఛ్య - వెళ్లివచ్చెద నని యడుగక, ఇతః - ఈ లోకమునుండి, పరలోకం - స్వర్గమును, అసన్ని వృత్తయే - మరల తిరిగి రాకుండుటకై, గతాసి - చేరితివో. నేను మోసగాడ ననియు, నా ప్రేమ కపటప్రేమ యనియు నీవు తలంచి యుండవలెను. అందు చేతనే ఈ లోకమునుండి స్వర్గమునకు వెళ్లునప్పుడు నైతము వెళ్లివచ్చెదనని చెప్పక వెళ్లిపోయితివని యజుడు చచ్చిపడియున్న ఇందుమతి నుద్దేశించి పలుకుచు విలపించెనని భావము.

శ్లో. దయితాం యది తావ దన్వగాత్
వినివృత్తం కిమిదం తయా వినా
సహతాం హతజీవితం మమ
ప్రబలా మాత్మకృతేన వేదనామ్. 50

వ్యాఖ్య: ఇదం, మమ, హతజీవితం, తావత్ - ఈ నాయొక్క పాడు జీవితమున్నదే, (ఆడౌ - మొదట) దయితాం - ప్రియురాలిని, అన్వగాత్, యది - అనుసరించియే వెళ్లినది (మొదట అజుడు నైతము మూర్ఛిల్లుట వలన). (తర్హి - అట్లయితే), తయావినా - ప్రియురాలు లేకుండా, కిం - ఎందుకొఱకై, వినివృత్తం - తిరిగి వచ్చినది? (అత ఏవ - అందువల్లనే) ఆత్మకృతేన - తన దుశ్చేష్టారూప మైన తప్పిదముచేత, ప్రబలాం - అత్యధికమైన, వేదనాం - బాధను, సహతాం - సహించునుగాక, ఇందుమతి మూర్ఛిజెందినప్పుడు అజుడును మూర్ఛిల్లుటచేత, తన జీవితము ఇందుమతి వెంట వెళ్లి, ఆమెతో మరల తిరిగిరాక ఒంటరిగా వచ్చిన

స్వయం కృతాపరాధమునకుఁ దగిన శాస్తిగా ఈ దుర్భర వేదనను సహింపవలసినదే యని యజుడు విలపించెను.

శ్లో. సురత శ్రమ సంభృతో ముఖే
శ్రియతే స్వేదలవోద్గమోఽపి తే
అథచాస్తమితా త్వ మాత్మనా
ధిగిమాం దేహభృతా మసారతామ్. 51

వ్యాఖ్య: సురతశ్రమ సంభృతః - సంభోగము యొక్క అలసట చేత కలిగిన, స్వేదలవోద్గమః, అపి - చెమట చుక్కల పుట్టుకగూడ, తే - నీయొక్క, ముఖే - ముఖము మీద, శ్రియతే - ఇంకను ఉన్నది. అథచ - మరియేమో, త్వం - నీవు, ఆత్మనా - ప్రాణముచేత, అస్తం - నాశమును, ఇతా - పొందితివి. (అతః - ఈ కారణము వలన) దేహభృతాం - ప్రాణులయొక్క, ఇమాం - ఈ, అసారతాం - అస్థిరత్వమును గూర్చి, ధిక్ - నిందయగు గాక (ఛీ! అని యర్థము). నీ మొగము మీద సంభోగ శ్రమవలన మొలచిన చెమట చుక్కలింకను ఆరలేదు, నీవేమో ప్రాణమును విడచితివి, ఇంత స్వల్పకాలమునం దింతటి మార్పా? ఛీ! ప్రాణుల యస్థిరత్వమింతటిదే కదా! యని యజుని భావము.

శ్లో. మనసాపి న విప్రియం మయా
కృతపూర్వం తవ కిం జహాసి మామ్
నను శబ్దపతిః క్షితే రహం
త్వయి మే భావనిబంధనా రతిః. 52

వ్యాఖ్య: మయా - నాచేత, మనసాపి - మనస్సుతోనైనను, తవ - నీకు' విప్రియం - ప్రియము కానిది, నకృతపూర్వం - పూర్వము చేయబడలేదు (ఇంతకు ముందెప్పుడు చేయలేదు). కిం - ఏ కారణము చేత (ఎందుకు), మాం, జహాసి - నన్ను విడుచుచున్నావు? నను - ఓ ప్రియా! అహం - నేను, క్షితేః - భూమికి, శబ్దపతిః - శబ్దమాత్రము చేతనే భర్తను (అర్థము వలన కాదని భావము) భావ నిబంధనా - అభిప్రాయ హేతుకమైన, మే - నాయొక్క, రతిః - ప్రేమ, త్వయి - నీయందే (కలదు). పేరుకు మాత్రమే నేను భూమికి పతినిగాని భార్యపై నుండ

వలసిన ప్రేమ మాత్రము నీయందే కలదనియు, రాజ్యమునందు కంటే భూమి మీది కంటె నీయందే అధిక ప్రేమ కలదనియు భావము.

శ్లో. కుసుమోత్ఖచితాన్ వలీభృతః
చలయన్ భృంగరుచ స్తవాలకాన్
కరభోరు'కరోతి మారుతః
త్వదుపావర్తన శంకి మే మనః. 53

వ్యాఖ్య: కుసుమోత్ఖచితాన్ - పూలచేత నెత్తి కట్టబడినవియు, వలీభృతః - ఉంగరాలు తిరిగినవియు, భృంగరుచః - తుమ్మెదలవలె నల్లనైనవియునగు, తవ అలకాన్ - నీ ముంగురులను, చలయన్ - కదలించుచున్న, మారుతః - వాయువు, హేకరభోరు - చక్కని యూరువులు గలదానా! మే - నాయొక్క, మనః - మనస్సును, త్వదుపావర్తన శంకి - నీయొక్క పునరాగమన సందేహము కల దానినిగా, కరోతి - చేయుచున్నది. మనోహరమైన నీ ముంగురులు గాలికి కదలు చుండుట చేత నీవు మరల బ్రతుకుదువను ఆశ కలుగుచున్నదని భావము.

శ్లో. తదపోహితు మర్హసి ప్రియే
ప్రతిబోధేన విషాద మాశు మే
జ్వలితేన గుహాగతం తమః
తుహినాద్రే రివ నక్త మోషధిః. 54

వ్యాఖ్య: హే ప్రియే - ఓ ప్రియురాలా! తత్ - అందువలన, ఆశు - శీఘ్రముగా, మే - నాయొక్క, విషాదం - దుఃఖమును, నక్తం - రాత్రియందు, ఓషధిః - తృణజ్యోతియను పేరుగల లత, జ్వలితేన - తన ప్రకాశముచేత, తుహినాద్రేః - హిమాచలముయొక్క, గుహాగతం - గుహయందున్న, తమః ఇవ - అంధకారమును వలె, ప్రతిబోధేన - మేలుకొనుటచేత, అపోహితుం - తొలగించుటకు, అర్హసి - తగుదువు. నీవు ఈ నిద్రనుండిలేచి నా విషాదమును తొలగింపుమని భావము. అజుని విషాదమును హిమాచలగుహా గతమైన అంధ కారముతోను, ఇందుమతిని తృణజ్యోతిర్లతతోను పోల్చుట మిక్కిలి రమణీయ ముగా నున్నది.

శ్లో. ఇద ముచ్ఛ్వసితాలకం ముఖం
తవ విశ్రాంతకథం దునోతి మామ్
నిశి సుప్త మివైక పంకజం
విరతాభ్యంతర షట్పద స్వనమ్. 55

వ్యాఖ్య: ఇదం - ఈ, ఉచ్ఛ్వసితాలకం - కదలుచున్న ముంగురులు గల దియు, విశ్రాంతకథం - విశ్రమించిన సల్లాపములు కలదియునగు, తవముఖం - నీ ముఖము, నిశి - రాత్రియందు, సుప్తం - ముకుళించినదియు, విరతాభ్యంతర షట్పదస్వనం—విరత - ఆగిపోయిన, అభ్యంతరషట్పద - లోపలనున్న తుమ్మెదలయొక్క, స్వనం - ధ్వనిగలదియు నగు, ఏకపంకజం ఇవ - ఆద్వితీయమైన, కమలమువలె, మాం దునోతి - నన్ను పరితపింపఁజేయుచున్నది. నిశ్శబ్దభృంగమై ముకుళించిన మంచి కమలమువలె, కదలుచున్న అలకలతో పలుకులేని నీ ముఖమీ నన్నెంతగానో బాధించుచున్నదని యజుడు విలపించెను. ఉచ్ఛ్వసిత, విశ్రాంత, సుప్త శబ్దములు గౌణార్థకములు.

శ్లో. శశినం పున రేతి శర్వరీ
దయితా ద్వంద్వచరం పతత్త్రిణమ్
ఇతి తౌ విరహాంతరక్షమౌ
కథ మత్యంతగతా న మాం దహేః. 56

వ్యాఖ్య: శర్వరీ - రాత్రి, శశినం - చంద్రుని, పునరేతి (పునః + ఏతి) - తిరిగి చేరును, ద్వంద్వచరం - జంటగా తిరుగునట్టి, పతత్త్రిణం - పక్షిని (చక్రవాకమును), దయితా - ప్రియురాలైన యాడుచక్రవాకము, పునరేతి - మళ్ళీ చేరును, ఇతి - ఈ కారణము వలన, తౌ - ఆ చంద్ర చక్రవాకములు, విరహాంతరక్షమౌ - విరహకాలమునొక్క అవధిని సహించునవై యున్నవి. అత్యంతగతా - అసలే వెళ్లిపోయిన, త్వం - నీవు. కథం - ఎట్లు, మాం - నన్ను, న దహేః - దహింపకుందువు? తప్పక దహింతువని యర్థము. కనుక చంద్ర చక్రవాకములవలె నేను ప్రియావియోగమును సహింపఁజాలను. వాటికి ప్రియురాలు తిరిగివచ్చునను ఆశకలదు. నాకు అట్టియాశ లేదుగదా! కనుక పరితపించి పోవుచున్నాను. ఇచ్చట 'అంతర' శబ్దమునకు అవధి (హద్దు)అని యర్థము.

శ్లో. నవ పల్లవ సంస్తరేఽపి తే
మృదు దూయేత యదంగ మర్పితమ్
తదిదం విషహిష్యతే కథం
వద వామోరు! చితాధిరోహణమ్. 57

వ్యాఖ్య: నవపల్లవ సంస్తరే - క్రొత్త చిగుళ్ల పరుపుమీద, అర్పితం - ఉంచబడినదియై, మృదు - సుకుమారమైన, తే - నీయొక్క, యదంగం - ఏ శరీరము, దూయేత - బాధనొందెడిదో, వామోరు! - అందమైన తొడలు గలదానా! తదిదం - ఆ యీ శరీరము, చితాధిరోహణం - కాష్ఠము నెక్కుటను. కథంసహిష్యతే - ఎట్లు సహింపగలదు? వద - చెప్పుము. చిగురాకు పడకమీదనే యొత్తిడిని సహింపలేని నీ శరీరము కాష్ఠముల చితిమీద నెట్లు పరుండగలదు? 'వామ' శబ్దమునకు సుందరము, సవ్యము అని యర్థములు. "వామంస్యాత్సుందరే సవ్యే" అని కేశవ నిఘంటువు. 'చితా' యనగా చితి - కాష్ఠసంచయము.

శ్లో. ఇయ మప్రతిబోధ శాయినీం
రశనా త్వాం ప్రథమా రహఃసఖీ
గతి విభ్రమ సాద నీరవా
న శుచా నానుమృతేవ లక్ష్యతే. 58

వ్యాఖ్య: ఇయం - ఈ, ప్రథమా, రహఃసఖీ - మొట్టమొదటి రహస్యసఖియైనదియు, గతివిభ్రమ సాదనీరవా — గతివిభ్రమ - నీ గమన విలాసమునొయొక్క, సాద - వినాశముచేత, నీరవా - నిశ్శబ్దమైనదియు నగు, రశనా - మేఖల (మొలనూలు), అప్రతిబోధ శాయినీం - మరల మేలుకొనుటలేని నిద్రను పోవుచున్న (చచ్చిపోయిన), త్వాం అను - నీతో గూడి, శుచా - శోకముచేత, మృతేవ - చనిపోయిన దానివలె, న లక్ష్యతేన - కనబడుటలేదు అనునదిలేదు (కనబడుచునేయున్నది). నీవు దీర్ఘనిద్రను పొందియుండగా నీ ముఖ్య సఖియగు నీ మొలనూలుకూడా గమనవిలాసము, పలుకులేక చనిపోయిన దానివలె నున్నది. 'రశనా' మొలనూలును. మొదటి లేక ముఖ్యమైన రహస్యసఖి యని చెప్పుటకు కారణము అది సంభోగ సమయమునందును విడువక వెంటవచ్చునది కనుక. నీ విలాసగమన సమయములందు గల్లుమని మ్రోగు మేఖల యిప్పుడు నిశ్శబ్దమై నీతోపాటు మరణించినట్లు కనపడుచున్నదని భావము.

శ్లో. కల మన్యభృతాసు భాషితం
కలహంసీషు మదాలసం గతమ్
పృషతీషు ఽలోల మీక్షితం
పవనాధూత లతాసు విభ్రమాః. 59

త్రిదివోత్సుకయా ప్యవేక్ష్య మాం
నిహితాః సత్య మమీ గుణా స్త్వయా
విరహే తవ మే గురువ్యథం
హృదయం న త్వవలంబితుం క్షమాః. 60

వ్యాఖ్య: ఇది యుగ్మము, రెండు శ్లోకములకును కలిపియే యన్వయము; అన్యభృతాసు - ఆడుకోకిలల యందు, కలం భాషితం - మధుర భాషణమును, కలహంసీషు - విశిష్టమైన హంసాంగనలయందు, మదాలసం, గతం - మంద గమనమును, పృషతీషు - అడులేళ్ల యందు, విలోలం ఈక్షితం - చంచలమైన దృష్టిని, పవనాధూతలతాసు—పవన - వాయువుచేత, ఆ ధూత - కొద్దిగా కదల్చ బడిన, లతాసు - తీగలయందు, విభ్రమాః - విలాసములను, ఇతి - ఇట్లు, అమీ గుణాః - ఈ నీ గుణములు, ఏషు - ఈ కోకిలాదులయందు, త్రిదివోత్సుకయా - స్వర్గమునకు వెళ్లుటకై త్వరపడుచున్న, త్వయా - నీచేత, మాం, అవేక్ష్య - నన్ను చూచి (నేను నీ విరహమును సహింపజాలనని గ్రహించి), సత్యం నిహితాః - నిజముగా ఉంచబడినవి (నా ప్రాణమును కాపాడుటకై యుంచబడినవి), కాని, తవవిరహే - నీ వియోగమునందు, గురు వ్యథం - అతి దుఃఖముగల, మే హృదయం - నా మనస్సును, అవలంబితుం - నిలకడగా నుంచుటకు, నక్షమాః - సమర్థములు కాకున్నవి. నేను నీ విరహమును సహింపజాలనని యెఱిగి నీ మృదుభాషణ మందగమన, చంచలదృష్టి విలాసాదులను కోకిలాదులయం దుంచి వెళ్లినావు కాని అవి యన్నియు నీతో నేను కలిసియున్నప్పుడే యానందమును జేకూర్చగలిగెడివి. నీవు లేనప్పుడు వృథాయగుచున్నవి. మీదుమిక్కిలి ఇప్పు డవి యన్నియు నా ప్రాణాపహారకములై యున్నవి అని తాత్పర్యము.

శ్లో. మిథునం పరికల్పితం త్వయా
సహకారః ఫలినీ చ నన్వియమ్

అవిధాయ వివాహ సత్క్రియా
మనయో ర్గమ్యత ఇత్యసాంప్రతమ్. 61

వ్యాఖ్య: ననుఁ - ఓ ప్రియురాలా! సహకారఃఁ - తియ్యమామిడిగున్నయు, ఫలినీచ - ప్రియంగు లతయు, ఇమౌ - ఈ రెండును, త్వయా - నీచేత, మిథునం - జంటగా, పరికల్పితం - కల్పింపఁబడినది, అనయోఃఁ - ఈ ఫలినీ సహకారములకు, వివాహసత్క్రియాం - వివాహ మంగళమును, అవిధాయ - చేయక, గమ్యతే - నీచే వెళ్లబడుచున్నది, ఇతి - ఇట్లు వెళ్లుట, అసాంప్రతం - అయుక్తము. నీవు పెంచి పెద్దచేసి దంపతులను చేయదలచుకొన్న వీటికి వివాహ మంగళమును జరుపక నీవు స్వర్గమునకువెళ్లినచో మాతృహీనములగు నివి మిక్కిలి దుఃఖించునని భావము.

శ్లో. కుసుమం కృతదోహద స్త్వయా
యదశోకోఽయ ముదీరయిష్యతి
అలకాభరణం కథం ను తత్
తవ నేష్యామి నివాపమాల్యతామ్. 62

వ్యాఖ్య: త్వయా - నీచేత, కృతదోహదఃఁ - చేయబడిన పాదతాడన రూపమగు దోహదముగల, అయం అశోకఃఁ - ఈ యశోకవృక్షము, యత్ కుసుమం - ఏ పుష్పమును, ఉదీరయిష్యతి - పూయఁగలదో, తవ - నీకు, అలకా భరణం - ముంగురులయందు ముడువదగిన సొమ్ముగు, తత్ - ఆ పుష్పమును, కథంను - ఏ విధముగా, నివాపమాల్యతాం - దహనసమయ కుసుమాంజలిత్వ మును, నేష్యామి - పొందింపగలను? ప్రతికియుండి ముంగురులపై నలంకరించు కొనుట కుద్దేశింపబడిన యశోక పుష్పములను శవాలంకారముగా నెట్లు మార్చగల నని యజుఁడు విలపించెనని భావము. స్త్రీపాదతాడనము అశోకమునకు దోహదము 'నివాప' మనగా పితృదానము. చనిపోయిన వారికి విడుచు తర్పణజలము, పూజా ద్రవ్యములు నివాప శబ్దముచేత చెప్పబడును.

శ్లో. స్మరతేవ సశబ్ద నూపురం
చరణానుగ్రహ మన్యదుర్లభమ్

అమునా కుసుమాక్రు వర్షిణా
త్వ మశోకేన సుగాత్రి! శోచ్యసే. 63

వ్యాఖ్య: అన్యదుర్లభం - ఇతరులకు లభ్యముకానిదియు, నళబ్దనూపురం - ధ్వనించు మంజీరము గలదయిన, చరణానుగ్రహం - పాదముయొక్క తాడన రూపమైన యనుగ్రహమును, స్మరతేవ (స్మరతా + ఇవ) - స్మరించుచున్న దాని చేతవలె, కుసుమాక్రు వర్షిణా - పువ్వులనెడు కన్నీళ్లను కురియుచున్న, అమునా అశోకేన - ఈ యశోక వృక్షముచేత, హే సుగాత్రి! - ఓ సుందరి! త్వం - నీవు, శోచ్యసే - దుఃఖింపబడుచున్నావు. నిన్ను గుఱించి యేడ్చుచున్న యీ యశోకము నీ దోహదమును స్మరించి పూలరూపమున కన్నీళ్లు రాల్చుచున్నది సుమా! "అన్యదుర్లభం" అనగా అశోకమునకు మాత్రమే అపాదతాడన మొక ప్పుడు లభ్యమైనదనియు, అదియు నికమీద స్మరణయోగ్యమేకాని అనుభవ యోగ్యము కాజాలదనియు భావము. అది అశోకమయ్యును నేడు శోకించుచున్నది. 'సుగాత్రి' శబ్దము సార్థకము. కనుకనే స్మృతి హేతువు.

శ్లో. తవ నిశ్వసి తానుకారిభిః
వకులై ర్ధచితాం సమం మయా
అసమాప్య విలాసమేఖలాం
కిమిదం కిన్నరకంఠి! సుప్యతే. 64

వ్యాఖ్య: తవ - నీయొక్క, నిశ్వసితానుకారిభిః - నిట్టూర్పులను బోలిన, వకులైః - పొగడ పూవులచేత, మయాసమం - నాతో గూడ, అర్ధచితాం - సగమే కూర్చబడిన, విలాస మేఖలాం - విలాసార్థమైన మొలనూలును, అసమాప్య - పూర్తిచేయక, హే కిన్నరకంఠి! ఓ కిన్నరుల కంఠస్వరమువంటి కంఠస్వరము గలదానా! కిమిదం - ఏమిటి? సుప్యతే - నిద్రబోవుచున్నావు. నాతో కలసి సగము మాత్రమే కూర్చబడిన పొగడదండను పూర్తిచేయక ఇట్లు నిద్రించుట తగునా? వకుళ పుష్పములు ఇందుమతి నిట్టూర్పులను బోలియున్నవనుట పరిమళసామ్యము, ఇందుమతి నిట్టూర్పులు పొగడపూవుల వాసనవంటి మంచి పరిమళము గలిగి యుండెనని భావము. 'కిన్నరకంఠి' శబ్దము మూగవోయిన ఇందుమతి కంఠమును స్మరింపజేయుచు అజుని పరితాపమును వెల్లడించును. తదితరములగు పదముల భావ విశేషములను చదువరు ఊహించుకొనవలెను.

శ్లో. సమ దుఃఖ సుఖః సఖీజనః
ప్రతిపచ్చంద్ర నిభోయ మాత్మజః
అహ మేకరస స్తథాపి తే
వ్యవసాయః ప్రతిప త్తి నిష్ఠురః. 65

వ్యాఖ్య: సఖీజనః - నీ చెలిక త్తెలు, సమదుఃఖ సుఖః - నీ సుఖ దుఃఖములను సమానముగా పంచుకొనునట్టివారు (నీవు సుఖించిన తాము సుఖించుచు, నీవు దుఃఖించిన తాము దుఃఖించుచు నుండువారని యర్థము), అయం ఆత్మజః - ఈ నీ కుమారుఁడు, ప్రతిపచ్చంద్రనిభః - పాడ్యమినాటి చంద్రునితో సమానుఁడు (ప్రయత్న పూర్వకముగా చూడదగిన వర్ధిష్ణువు, అతిబాలుఁడు అని భావము). అహం - నేను, ఏకరసః - నీ యభిరుచికి భిన్నము గాని యనురాగము గల వాఁడను, తథాపి - అట్లయినను (నీకు కావలసిన జీవితసామగ్రి యంతయు నున్న ప్పటికిని). తే - నీయొక్క. వ్యవసాయః - వ్యాపారము (మమ్ములను విడిచి వెళ్లుట). ప్రతిప త్తినిష్ఠురః - నీ నిశ్చయమునేత కఠినమై యున్నది. విలపించు చున్న నీ సఖీజనమును, పసికందుగానున్న కుమారుని, నీ యందే, నీ యభిరుచికి భిన్నముగాని, యేకరసుఁడనై న నన్నువిడిచి నీవు వెళ్లుట క్రూరమైనపని. తలచు టకుగూడ కఠినముగాకున్నది ఇక ననుభవించుట యెట్లని భావము.

శ్లో. ధృతి ర స్తమి తా రతి శ్చ్యుతా
విరతం గేయ మృతు ర్నిరుత్సవః
గత మాభరణ ప్రయోజనం
పరిశూన్యం శయనీయ మద్య మే. 66

వ్యాఖ్య: అద్య - ఇ ప్పు డు, మే - నాయొక్క, ధృతిః - ధైర్యము (లేదాకీ ర్తి), అ స్తం - నాశమును, ఇతా - పొందినది, రతిః - క్రీడ, చ్యుతా - పోయినది, గేయం - గానము, విరతం - ఆగిపోయినది, ఋతుః - వసంతాదికము, నిరుత్సవః - ఉత్సవములేనిదై నది, ఆభరణ ప్రయోజనం - ఆభరణముల ప్రయోజనము, గతం - తొలఁగిపోయినది, శయనీయం - తల్పము, పరిశూన్యం - శూన్యమైనది. నీవు లేనప్పుడు నాకుగల సరస్వమును నిష్ఫలమే, ధైర్యము సడలి

నది, ఇచ్ఛ, గానము, ఋతువిలాసము, ఆభరణ ప్రయోజనము అన్నియు పోయి నవి. నాతల్పము శూన్యమైనది.

శ్లో. గృహిణీ సచివః నఖీ మిథః
ప్రియశిష్యా ఽలితే కలావిధౌ
కరుణావిముఖేన మృత్యునా
హరతా త్వాం వద కిం న మే హృతమ్. 67

వ్యాఖ్య: త్వమేవ - నీవే, గృహిణీ - గృహిణివి (సర్వకుటుంబ భారము నీదేయని యర్థము), సచివః - బుద్ధికి సహాయభూతవైన మంత్రివి, మిథః - ఏకాంతమునందు, సఖీ - నర్మసచివురాలవు (నా సర్వోప భోగములకును నీవే యాధారము), లలితే కలావిధౌ - మనోహరమైన వాదిత్రాది చతుఃషష్టి కళల యందు, ప్రియశిష్యా - కళా ప్రయోగమునకుఁ దగిన శిష్యురాలవు, నా సర్వానంద మునకును ముఖ్యకారణమవై యున్నావు కనుక, త్వాం - నిన్ను, హరతా - అప హరింపబడుచున్న, కరుణావిముఖేన, మృత్యునా - కృపాశూన్యమైన మృతువుచేత, మే కిం - నాకు సంబంధించిన యే వస్తువు, నహృతం - అపహరింపబడలేదో, వద - చెప్పుము. గృహిణివి, మంత్రివి, ప్రియసఖివి, కళా ప్రయోగ శిష్యురాలవు నయిన నీవు మృత్యువుచేత హరింపఁబడినప్పుడు ఇక నాకు మిగిలిన దేమున్నది? అంతయు అపహరింపబడినట్లే, అన్నిటికినీ నీవు సమష్టి రూపిణివికాదా? చెప్పుము, అని యజుడు విలపించెను.

శ్లో. మదిరాక్షి! మదాననార్పితం
మధు పీత్వా రసవత్కథం ను మే
అనుపాస్యసి బాష్పదూషితం
పరలోకోపనతం జలాంజలిమ్. 68

వ్యాఖ్య: మదిరాక్షి - దర్శనమాత్రముచేత మత్తెక్కించునట్టి కన్నులుగల దానా! మదాననార్పితం - నా నోటితో నీయఁబడినదియు, రసవత్ - మిక్కిలి రుచికరమైనదియునగు, మధు - మద్యమును, పీత్వా - త్రాగి, బాష్పదూషితం - కన్నీటిచేత వేడియెక్కినదియు, పరలోకోపనతం - స్వర్గమునందు ప్రాప్తించి

నదియునగు, మే జలాంజలిం - నే నిచ్చు తిలోదకాంజలిని, కథం-ఎట్లు, అనుపాస్యసి - దాని తరువాత త్రాగఁగలవు? నా నోటితో నందింపబడిన మధుపానానంతరము నేనిప్పుడిచ్చు తిలాంజలిని త్రాగుట నీకెట్లు రుచింపఁగలదు? అంతేకాక అది వైద్యశాస్త్ర విరుద్ధము. బ్రతికియున్నప్పుడు మధుర మధుపానము చేయించిన నేను ఇప్పుడు తిలాంజలి నీయవలసి వచ్చినదికదా! ఇది మధుపాన ప్రసక్తికనుక మది రాక్షి అని సంబోధించుట మిక్కిలి సమంజసము. 'అనుపాస్యసి' యనఁగా అనుపానముగా త్రాగెదవని యర్థము. పెఱుగు, మద్యము, ద్రాక్ష, మరికొన్ని సేవించిన వెంటనే వేడినీరు త్రాగరాదని వైద్యశాస్త్రము. కనుక ఇచ్చట లభించు శీతజలమే యుక్తముగాని, నా కన్నీరుపడి వేడి యెక్కిన తిలాంజలి జలము అనుపానముగా పనికిరాదని భావము. "అనుపానం హిమజలం యవగోధూమ నిర్మితే, దధ్నిమద్యే విషేద్రాక్షే పిష్టే పిష్టమయేఽపిచ", అని భట్టమల్లుఁడు చెప్పెను. కనుక మద్యపానమువెంట చల్లని నీటినే త్రాగవలయును.

శ్లో. విభవేఽపి సతి త్వయా వినా
సుఖ మేతావ దజస్య గణ్యతామ్
అహృతస్య విలోభనాంతరై
ర్మమ సర్వే విషయా స్త్వదాశ్రయాః. 69

వ్యాఖ్య: విభవే. సతి. అపి - ఐశ్వర్య మున్నప్పటికిని, త్వయావినా - నీవు లేనప్పుడు, అజస్య - అజునికి, ఏతావత్ - ఇంతవఱకు మాత్రమే, సుఖం - సుఖమని, గణ్యతాం - లెక్కింపబడునుగాక (దీని తరువాత సుఖమేదియు నుండబోదని యెఱుఁగుము) ఎందువలన ననగా, విలోభనాంతరైః - ఇతర భోగ్య విషయములచేత, అహృతస్య - ఆకర్షింపఁబడనట్టి, మమ - నాయొక్క. సర్వే విషయాః - సర్వభోగములును, త్వదాశ్రయాః - నీ యధీనములే యై యున్నవి. నీవు లేక నాకు ఏ భోగముకూడ రుచింపదని భావము. సర్వోత్కృష్ట సౌందర్య గుణ సాహచర్యాది సద్గుణములుగల నీవు నాకు దక్కియున్నప్పుడు, ఇతర భోగ్య విషయములేవియు నన్నాకర్షింపలేక పోయినవనియు, ఇప్పుడుకూడా నా మనస్సునందు స్మృతి రూపమున నీవు సాక్షాత్కరించియే యుండుటవలన మరియొక విషయము నన్నాకర్షించు ప్రసక్తి లేనేలేదనియు "అహృతస్య విలోభనాంతరైః" అను

వాక్యమునకు తాత్పర్యము. కనుకనే నా సుఖము నీ వుండువఱకే యని లెక్కిం పుము, ఇక నేను సుఖించుట యసంభవము.

శ్లో. విలప న్నితి కోసలాధిపః
కరుణార్థగ్రథితం ప్రియాం ప్రతి
అకరోత్ పృథివీరుహా న పి
|సుత శాఖారస బాష్ప దూషితాన్. 70

వ్యాఖ్య: కోసలాధిపః - కోసల దేశాధిపతియగు అజుఁడు, ఇతి - ఈ విధముగా, కరుణార్థ గ్రథితం - శోక రసార్థముచేత కూర్చబడినట్లుగా, ప్రియాం ప్రతి - ప్రియురాలిని గురించి, విలపన్ - దుఃఖించుచు, పృథివీరుహాన్. అపి - వృక్షములసుగూడ, స్రుతశాఖారస భాష్పదూషితాన్ — స్రుత - స్రవించుచున్న, శాఖారస - మకరందములనెడు, బాష్ప - కన్నీళ్లచేత, దూషితాత్ - మలినమైన వానినిగా, అకరోత్ - చేసెను. ఆజుడు తాను దుఃఖించుచు తన సమీపము నందున్న వృక్షాద్యచేతనములను సైతము దుఃఖింపఁజేసెననియు ఆ వృక్షములు ప్రేక్షకవర్గమనియు భావము. "కరుణార్థ గ్రథితం" కరుణరసము ప్రధానమగునట్లు కూర్పఁబడినది అని యర్థము. ఇందలి యర్థశబ్దము వ్యంగ్యార్థపరము. ఆ వ్యంగ్యార్థమే కరుణరస కావ్యఖండమని కాళిదాసు హృదయము కానోపును.

శ్లో. అథ తస్య కథంచి దంకతః
స్వజన స్తా మపనీయ సుందరీమ్
విససర్జ త దంత్య మండనాం
అనలా యాగురు చంద నైధసే. 71

వ్యాఖ్య: అథ - పిమ్మట, స్వజనః - బంధువర్గము, తస్య - ఆ యజుని యొక్క, అంకతః - తొడనుండి, కథంచిత్ - అతి కష్టముతో, అపనీయ - ప్రక్కకు తొలగించి, తదంత్యమండనాం—తత్-ఆ దివ్యకుసుమమాలయే, అంత్య మండనాం - చివరి అలంకారముగా గల, తాం సుందరీం - ఆ యిందుమతిని, అగురుచందనైధసే - అగురు చందన కాష్ఠములు ఇంధనములుగాఁగల, అన లాయ - అగ్నికొఱకు, విససర్జ - వదలిపెట్టెను. ఏడ్చుచున్న యజుని తొడమీది

నుండి అతి ప్రయత్నముచేత ఇందుమతి శరీరమును ప్రక్కకుతీసి, బంధువర్గ మామె కా సుమమాలనే తుది యలంకారముగా చేసి, చందనాగురు కాష్ఠములతో మండు చితాగ్నికి సమర్పించిరని భావము.

శ్లో. ప్రమదా మను సంస్థితః శుచా
నృపతిః సన్నపి వాచ్యదర్శనాత్
న చకార శరీర మగ్నిసాత్
సహ దేవ్యా నతు జీవితాశయా. 72

వ్యాఖ్య: నృపతిః - అజుఁడు, సన్నపి (సన్ + అపి) - విద్వాంసుఁడైనను, శుచా - శోకముచేత, ప్రమదాం, అను - భార్యతోగూడ, సంస్థితః - చనిపోయినాడు, ఇతి - ఇట్లను, వాచ్యదర్శనాత్ - నింద నెటిగి యుండుటవలన, దేవ్యాసహ - ఇందుమతితో పాటు, శరీరం - తన శరీరమును, అగ్నిసాత్ - అగ్నికి అధీనముగా, న చకార - చేయలేదు, జీవితాశయా తు - ప్రాణములమీది యాశతోనైతే, న - కాదు. "అజుఁడు పండితుఁడైకూడ శోకోపహతుఁడై ఆడు దానిమీది ప్రేమతో చచ్చె" నని లోకము నిందింపబోవునను కారణముచేత తన శరీరమును ప్రియాదేహముతో పాటు ఆగ్నికి అర్పింపలేదుగాని, ప్రాణముమీది తీపి చేత తాను బ్రతికి యుండుటకు కాదని భావము.

శ్లో. అథ తేన దశాహతః పరే
గుణశేషా ముపదిశ్య భామినీమ్
విదుషా విధయో మహార్ధయః
పుర ఏవోపవనే సమాపితాః 73

వ్యాఖ్య: అథ - పిమ్మట, విదుషా - విద్వాంసుఁడైన, తేన - ఆ యజుని చేత, గుణశేషాం - గుణములు మాత్రమే మిగిలినట్టి, భామినీం-ఇందుమతిని, ఉపదిశ్య - ఉద్దేశించి, దశాహతః - పదియవ దినముకంటె, పరే - తరువాత చేయదగినట్టి, మహార్ధయః - మహాసమృద్ధములయిన, విధయః - అపరక్రియలు, పురః - పట్టణముయొక్క, ఉపవనే ఏవ - ఉద్యానవనమునందే, సమాపితాః - పూర్తిగావింపఁబడినవి. ఇందుమతికి చేయవలసిన ఉత్తర క్రియలు శాస్త్రీయము

గాను, కావలసిన యు త్తమ వస్తుసంపదతోను నిర్వహింప఼బడి ప్రేతకర్మ పూ ర్తి చేయబడినది. ఇచ్చటి "గుణశేషా" శబ్దము, ఈ కాలమున వా఼డబడుచున్న "కీ ర్తిశేషులు" వంటి ప్రయోగము. "దశాహతః" విప్రఃశుద్ధ్యేత్ దశాహేన, ద్వాదశాహేన భూమిపః" ఆను మనువచన విరోధము క఼బడుచున్నది. బ్రాహ్మ ణునికి పదిరోజులతోను, క్షత్రియునికి పన్నెండు రోజులతోను మృతాశౌచము తీరు నని మనువచనమున కర్థము కాని, ఆది సామాన్యులగు క్షత్రియుల విషయమునియు, గుణవంతు఼డగు క్షత్రియునికి కాదనియు పరాశరు఼డు తన స్మృతిలో నిట్లు చెప్పెను. "క్షత్రియస్తు దశాహేన స్వధర్మ నిరతః శుచిః" రఘువంశరాజులు స్వధర్మ నిర తులు, వేదవే త్తలు, యజ్ఞక ర్తలు నగుటచేత పరాశర వచనానుసారముగా఼గల ధర్మరహస్యము నెఱి఼గిన కాళిదాసు అజునికి "విదుషా" అను విశేషణము వేసి "దశాహతః" అని చెప్పెను. అందువలన ధర్మవిరోధ మెంతమాత్రమును లేదు.

శ్లో. స వివేశ పురీం తయా వినా
క్షణదాపాయ శశాంక దర్శ నః
వరివాహ మివావలోకయన్
స్వశుచః పౌరవధూ ముఖాశ్రుషు. 74

వ్యాఖ్య: తయావినా - ఆమెలేక (ఇందుమతి లేక), క్షణదాపాయ శశాంక దర్శనః — క్షణదా - రాత్రియొక్క, అపాయ - తొలగుటయందలి, శశాంక దర్శనః - చంద్రునిలె఼ గన఼బడుచున్న (కాంతిహీను఼డగు ప్రాతఃకాల చంద్రుని వలెనున్న), సః - ఆ యజు఼డు, పౌరవధూ ముఖాశ్రుషు - పురస్త్రీల ముఖము లపై స్రవించు కన్నీళ్లయందు, స్వశుచః - తన దుఃఖముయొక్క, పరివాహం - వెల్లువను, అవలోకయన్ - చూచుచు, పురీం - పట్టణమును, వివేశ - ప్రవేశిం చెను. పురస్త్రీలు దుఃఖించుచుండగా వారి ముఖములమీది జలధారలయందు తన శోకజల ప్రవాహముయొక్క ప్రతిబింబమును చూచుచు అజు఼డు నగరమును ప్రవేశించెనని భావము. ఇక్కడ ఇందుమతీ మరణానంతరమున్న అజు఼డు నిశా వసానమండలి చంద్రు డుగా ఉపమింప఼బడుట చక్కని పోలిక.

శ్లో. అథ తం సవనాయ దీక్షితః
ప్రణిధానాత్ గురు రాశ్రమస్థితః

అభిషంగ జడం విజజ్ఞివాన్
ఇతి శిష్యేణ కిలా న్వబోధయత్. 75

వ్యాఖ్య: అథ - తరువాత, సవనాయ - ఒకానొక యాగముకొఱకై, దీక్షితః - దీక్ష వహించినట్టి, గురుః - కులగురువైన వసిష్ఠుడు, ఆశ్రమస్థితః సన్ - తన యాశ్రమమునందున్న వాఁడగుచునే, తం - అజునిని, అభిషంగజడం - దుఃఖమోహితునిగా, ప్రణిధానాత్ - చిత్తమునొక్క ఏకాగ్రతవలన, విజజ్ఞివాన్ - తెలుసుకున్నాఁడు, ఇతి - ముందు చెప్పబోవురీతిగా (ఇట్లని), శిష్యేణ - శిష్యుని ద్వారా, అన్వబోధయన్ కిల - తెలియఁజేసెనుగూడ. యజ్ఞదీక్షితుఁడు పొలిమేరను దాటరాదు కనుక వసిష్ఠుఁడు స్వయముగా రాలేదు. యోగదృష్టిచేతనే యజునికి వచ్చిన ఆపత్తును దెలిసికొని, తన శిష్యునిద్వారా ఓదార్పును (ఆదరింపుమాటలను) దెలిపెను.

శ్లో. అసమాప్త విధి ర్యతో ముని
స్తవ విద్వానపి తాపకారణమ్
న భవంత ముపస్థితః స్వయం
ప్రకృతౌ స్థాపయితుం పథశ్చ్యుతమ్. 76

వ్యాఖ్య: యతః - ఏ కారణమువలన నైతే, మునిః - వసిష్ఠుఁడు, అసమాప్తవిధిః - పూర్తిచేయఁబడని యాగము కలవాఁడై యున్నాడో, తతః - ఆ కారణము వలననే, తవ - నీయొక్క, తాపకారణం - దుఃఖ హేతువును (కళత్ర నాశరూపమైనట్టిది), విద్వాన్ఆపి - తెలుసుకొన్నవాఁ డైనప్పటికిని, పథశ్చ్యుతం - మార్గమునుండి జాఱిన (మనస్సు సరిగాలేని), భవంతం - నిన్ను, ప్రకృతౌ - స్వభావమునందు (మామూలు పరిస్థితియందు), స్థాపయితుం - నిలువుటకు (ఓదార్చుటకు), స్వయం - స్వయముగా, న ఉపస్థితః - రాలేదు. యాగదీక్షితుఁడైయున్న వసిష్ఠుఁడు, నీ దుఃఖము నెఱిఁగి యున్నప్పటికిని రాజాలక, నా ద్వారా ఓదార్పుమాటలను జెప్పి పంపినాడని శిష్యుడజునితోఁ జెప్పెను.

శ్లో. మయి తస్య సువృత్త వర్తతే
లఘు సందేశ పదా సరస్వతీ

శ్రుణు విశ్రుతసత్వసార ! తాం
హృది చైనా ముపధాతు మర్హసి. 77

వ్యాఖ్య: ఆ శిష్యుడిట్లు చెప్పుచున్నాడు: హే సువృత్త - ఓ సదాచారము గలవాఁడా ! లఘు సందేశపదా—లఘు - సంక్షిప్తములైన, సందేశపదా - చెప్పవలసిన యర్థమును దెలుపు పదములుగల, తస్య సరస్వతీ - ఆ వసిష్ఠునియొక్క వాక్కు, మయి - నాయందు, వర్తతే - ఉన్నది, హే విశ్రుత సత్త్వసార - ఓ ప్రఖ్యాత ధైర్య స్థైర్యములు గలవాఁడా ! తాం - ఆ వాక్కును, శ్రుణు - వినుము, ఏనాం - ఈ యా చెప్పబోవు ఋషివాక్కును, హృది - హృదయమునందు, ఉపధాతుంచ - నిలుపుకొనుటకును, అర్హసి - తగుదువు. వసిష్ఠుని ఆ మాటలు చక్కగావిని మనస్సున నిలుపుకొనుమని శిష్యుఁడనెను.

శ్లో. పురుషస్య పదే ష్వజన్మనః
సమతీతం చ భవచ్చ భావిచ
స హి నిష్ప్రతిఘేన చక్షుషా
త్రితయం జ్ఞానమయేన పశ్యతి. 78

వ్యాఖ్య: అజన్మనః పురుషస్య - జన్మలేని పురుషుడగు విష్ణువుయొక్క (వామనావతారము), పదేషు - పాదముద్రలయందు (మూడు లోకముల యందును). సమతీతంచ, భవచ్చ, భావిచ - భూతము, వర్తమానము, భవిష్యత్తు అవబడు, త్రితయం - మూడింటిని, సః - ఆ వసిష్ఠముని, నిష్ప్రతిఘేన - ఏ ప్రతిబంధమును లేని, జ్ఞానమయేన చక్షుషా - జ్ఞాన నేత్రముచేత, పశ్యతి హి - చూచునుగదా ! భూత భవిష్యద్ వర్తమాన కాలములందు ముల్లోకములలో నేమి జరుగునో జ్ఞాననేత్రముచేత ఆ వసిష్ఠముని తెలుసుకొనును గనుక ఆయన పలుకులు విశ్వసనీయములని భావము.

శ్లో. చరతః కిల దుశ్చరం తప
స్తృణ బిందోః పరిశంకితః పురా
ప్రజిఘాయ సమాధిభేదినీం
హరి రస్మై హరిణీం సురాంగనామ్. 79

వ్యాఖ్య: పురాకిల - పూర్వాకాలాన, దుశ్చరం - తీవ్రమైన, తపః - తపస్సును, చరతః - ఆచరించుచున్న, తృణబిందోః - తృణబిందుఁడను పేరుగల ఋషివలన, పరిశంకితః - భయపడినవాఁడగు, హరిః - ఇంద్రుఁడు, సమాధి భేదినీం - ఆ ముని తపస్సును భంగము జేయగల, హరిణీం - హరిణియను పేరుగల అప్సరసను, అస్మై - ఆ తృణబిందు మునికొఱకు, ప్రజిఘాయ - పంపెను. పూర్వ మొకప్పుడు తృణబిందుడను ముని ఘోరతపస్సును జేయుచుండగా నతని తపస్సును భగ్నము చేయుటకై యింద్రుఁడు 'హరిణి' అను అప్సరసను ఆ ముని వద్దికి పంపెను.

శ్లో. స తపఃప్రతిబంధ మన్యునా
ప్రముఖావిష్కృత చారు విభ్రమామ్
అశపత్ భవ మానుషీతి తాం
శమ వేలా ప్రలయోర్మిణా భుని. 80

వ్యాఖ్య సః - ఆ ముని, శమవేలా ప్రలయోర్మిణా — శమ - శాంతి యనెడు, వేలా - చెలియలికట్టకు (హద్దుకు), ప్రలయోర్మిణా - ప్రళయకాలపు తరంగమువంటిదైన (శాంతి విఘాతుకమైన అని యర్థము). తపః ప్రతిబంధ మన్యునా - తపస్సుయొక్క విఘ్నముచేత కలిగిన కోపముచేత. ప్రముఖావిష్కృత చారువిభ్రమాం—ప్రముఖ - తన యెట్టయెదుట, అవిష్కృత - ప్రకటింపఁబడిన, చారువిభ్రమాం - మనోహరములగు విలాసములు గల (ఎదుట నిల్చి కచ కుచ నితంబాదుల వయ్యారములను జూపినట్టి), తాం - ఆ హరిణియను దేవాంగనను, "భుని, మానుషీ, భవ" - భూలోకమునందు మనుష్యస్త్రీవి కమ్ము, ఇతి - ఇట్లని, అశపత్ - శపించెను. ఆ ముని తపస్సును భంగపరచుటకై హరిణి తన విలాసములను జూపగా మునికి తీవ్రకోపమువచ్చి నీవు మానవస్త్రీగా పుట్టుమని శపించెను.

శ్లో. భగవన్ !పరవా నయం జనః
ప్రతికూలాచరితం క్షమస్వ మే
ఇతి చోపనతాం క్షితిస్పృశం
కృతవా నా సుర పుష్ప దర్శనాత్. 81

వ్యాఖ్య: హే భగవన్ - ఓ షడ్గుణైశ్వర్య సంపన్నుఁడా! (ఓ మహర్షి). అయంజనః - ఈ నేను, పరవాన్ - పరాధీనురాలను (ఒకరి యాజ్ఞ ప్రకారము వర్తించు దానను). మే - నాయొక్క, ప్రతికూలాచరితం - విరుద్ధమైన నడవడివి (అపరాధమును). క్షమస్వ - క్షమింపుము, ఇతి - ఇట్లని ప్రార్థించుచు. ఉప నతాం - శరణువేడిన యా హరిణిని. ఆ సురపుష్ప దర్శనాత్ - దేవతా పుష్పము లను దర్శించువఱకు, క్షితిస్పృశం - నేలనంటి యుండుదానినిగా (మానవస్త్రీయై యుండుదానినిగా), కృతవాన్ - చేసెను. అట్లు శపించిన తృణబిందు మహర్షినిజేరి మహాత్మా! నేను ఇంద్రుని యాజ్ఞవలన ఇట్లు మీకు విరుద్ధముగా ప్రవర్తించి నందులకు క్షమింపుమని హరిణి వేడుకొనగా ప్రసన్నుడైన ముని "నీకు దివ్య పుష్ప దర్శన పర్యంతమే మానవత్వ ముండుననియు, ఆ వెంటనే మరల దేవ త్వము కలుగుననియు" శాపావధిని అనుగ్రహించెనని భావము.

శ్లో. క్రథకైశిక వంశ సంభవా
తవ భూత్వా మహీషీ చిరాయ సా
ఉపలబ్ధవతీ దివ శ్చ్యుతం
విశా శాప నివృత్తి కారణమ్. 82

వ్యాఖ్య: క్రథకైశిక వంశసంభవా - క్రథకైశిక దేశాధిపతులైన రాజుల వంశమునందు పుట్టుకగలదియై, సా - ఆ హరిణి, తవ - నీకు, మహిషీభూత్వా - పట్టపు రాణియై, చిరాయ - బహుకాలమునకు, దివః - స్వర్గమునుండి, చ్యుతం - జాఱిపడిన, శాపనివృత్తి కారణం - శాపము తొలఁగుటకు హేతువైన పుష్పధామ మును, ఉపలబ్ధవతీ - పొందినదియై, విశా - మృతిచెందినది, అభూత్ - అయ్యెను. ఆ హరిణి విదర్భరాజుల వంశమునందు పుట్టి, చిరకాలము నీకు భార్యగానుండి, ఇప్పుడు దేవకుసుమ దర్శనముకాగా శాపకాలము ముగిసి మృతి నొందినది.

శ్లో. త దలం తదపాయ చింతయా
విప దుత్పత్తిమతా మ.పస్థితా
వసుధేయ మవేక్ష్యతాం త్వయా
వసుమత్యా హి నృపాః కళత్రిణః. 83

వ్యాఖ్య: తత్ - అందువలన, తదపాయ చింతయా - ఆమె వినాశము వలని చింతచేత, అలం - చాలును (ఆమె మరణమును గుఱించి చింతింపవద్దని భావము), ఎందుకనగా, ఉత్పత్తిమతాం - పుట్టుకగల వారికి, విపత్ - మరణము, ఉపస్థితా - సిద్ధమై యున్నది (తప్పనిది). కళత్రములేని జీవితము వృథాయని తలంపక, త్వయా - నీచేత, ఇయం, వసుధా - ఈ భూమి, అవేక్ష్యతాం - చూడ బడునుగాక (పాలింపబడునుగాక). హి - ఎందువలన ననగా, నృపాః - రాజులు, వసుమత్యా - భూదేవిచేతనే, కలత్రిణః - భార్యావంతులు. అందువలన ఇందు మతిని గుఱించి దుఃఖింప వలదని భావము.

శ్లో. ఉదయే మదవాచ్య ముజ్ఝితా
శ్రుత మానిష్కృత మాత్మవత్తయా
• మనస స్తదుపస్థితే జ్వరే
పున రక్లీబతయా ప్రకాశ్యతామ్. 84

వ్యాఖ్య: ఉదయే (సతి) - అభ్యుదయము కలిగిన సమయమునందు, మదవాచ్యం - మదముచేత కలుగు నిందా దుఃఖమును, ఉజ్ఝితా - పరిహరించు నట్టి, త్వయా - నీచేత, ఆత్మవత్తయా - అధ్యాత్మభావము కలిగియుండిన కారణ మున, శ్రుతం - శాస్త్రజ్ఞానము, ఆవిష్కృతం - వెల్లడింపబడినదో, తత్ - ఆ శాస్త్రజ్ఞానము, మనసః - మనస్సునకు, జ్వరే, ఉపస్థితే - సంతాపము కలిగినప్పు డును, అక్లీబతయా - ధైర్యముచేత, పునః - మరల, ప్రకాశ్యతాం - వెల్లడింప బడునుగాక. సంపదభ్యుదయ సమయమునందు "ఇతఁడు సంపద్గర్వము గలవాఁ డని" లోకము నిందిచునని వెఱచి మదోన్మత్తుఁడవు గాక శాస్త్రజ్ఞానమును వెల్ల డించినట్లే, అనగా దమరూపమైన ఇంద్రియ నిగ్రహముగలిగి యుండినట్లే, ఈ విప త్సమయమునందును "ఆడుదానికై శోకించుచున్నాఁడను లోకనిందకు లోనుగాక, ధైర్యరూపమున మరల నీ శాస్త్రజ్ఞానమును ప్రకటింపుమని భావము. విద్వాంసుఁడు సర్వావస్థల యందును ధీరుఁడై యుండవలయునని సారాంశము.

శ్లో. రుదతా కుతఏవ సా పున
ర్భవతా నానుమృతాపి లభ్యతే
పరలోకజుషాం స్వకర్మభిః
గతయో భిన్నపథా హి దేహినామ్, 85

వ్యాఖ్య: రుదతా - దుఃఖించుచున్న, భవతా - నీచేత, సా - ఆ యిందు మతి, కుతఏవ - ఎక్కడినుండి, లభ్యతే - లభించును? (లభింపదని యర్థము), అనుమృతా, అపి - ఆమె వెంటనే మరణించు వాడవైనను, భవతా - నీచేత, పునః నలభ్యతే-మళ్లీ పొందఁబడదు, ఎందువల్ల ననగా, పరలోక జుషాం-స్వర్గాదులను పొందునట్టి, దేహినాం - మనుష్యులయొక్క. గతయః - గమ్యస్థానములు, స్వకర్మభిః - తమతమ పుణ్య పాపములయొక్క ఫలములచేత, భిన్నపథాః హి - వేరువేరుగా నున్నమార్గములు కలవిసుమా! నీవు ఏడ్చినచో ఆమె ఎక్కడినుండి వచ్చును? నీవు ఆమెవెంట చనిపోయినప్పటికిని ఆమె నీకు దొరకదు. కారణ మేమనగా పరలోకమునకు వెళ్లు మానవుల గమ్యస్థానములు, ఆ స్థానములకు మార్గ ములు భిన్న భిన్నములుగా నుండును, కనుక నీవు సహగమనము చేయఁదలచినను అది సిద్ధింపదు. ఆమె యేదారిన వెళ్లునో నీ వేదారిన వెళ్లుదువో తెలియదు. కనుక అట్టివన్నియు వ్యర్థప్రయత్నములని భావము.

శ్లో. అపశోకమనాః కటుంబినీం
అనుగృహ్ణీష్వ నివాపదత్తిభిః
స్వజనాశ్రు కిలా తిసంతతం
దహతి ప్రేత మితి ప్రచక్షతే. 86

వ్యాఖ్య: అపశోకమనాః - దుఃఖము తొలగిన మనస్సుకల వాఁడవగుచు, కుటుంబినీం - భార్యను, నివాపదత్తిభిః - పిండోదకాది దానములచేత, అనుగృహ్ణీ ష్వ - అనుగ్రహింపుము (తర్పణము చేయుమని యర్థము), అతి సంతతం - అవిచ్ఛిన్నమైన, స్వజనాశ్రు - ఆత్మబంధువుల కన్నీరు, ప్రేతం - చచ్చినవానిని, దహతి ఇతి - కాల్చివేయునని (బాధించునని), ప్రచక్షతే కిల - చెప్పుదురు గదా! నీ వామెకు తర్పణాదులు చేయుట తగునుగాని ఏడ్చుట తగదు.

"శ్లేష్మాశ్రు బంధుభిర్ముక్తం ప్రేతో భుంక్తే యతోఽవశః,
అతో న రోదితవ్యంహి క్రియాః కార్యాః స్వశక్తితః.

అని యాజ్ఞవల్క్య స్మృతి చెప్పుచున్నది. ప్రేతమనగా చనిపోయిన వ్యక్తి స్వర్గ నరకములను చేరుటకుముందుగల యాతనా శరీరముతోఁ గూడిన ప్రాణి. అతఁడు తన బంధువులు విడిచిన కన్నీటిని, శ్లేష్మమును అవశుఁడై భక్షించును. కనుక

బంధువులు ఏడ్చుటమాని చనిపోయిన వ్యక్తికి యధాశక్తిగా అంత్యక్రియలు పిండోదకాదులచేత చేయవలయునని స్మృత్యర్థము. కనుక వసిష్ఠుడు ఇందు మతినిఁగూర్చి యేడ్చుచుఁ గూర్చున్న లాభములేదని యజునికిఁ జెప్పి పంపెను.

శ్లో. మరణం ప్రకృతిః శరీరిణాం
వికృతి ర్జీవిత ముచ్యతే బుధైః
క్షణ మప్యవతిష్ఠతే శ్వసన్
యది జంతు ర్ననుం లాభవా నసౌ. 87

వ్యాఖ్య: శరీరిణాం - మనుష్యులకు (దేహముగల ప్రాణులన్నిటికిని), మరణం - మరణము, ప్రకృతిః - సహజము, జీవితం - జీవించి యుండుట, వికృతిః - యాదృచ్ఛికము (ఎలాగో వచ్చినట్టిది) అని, బుధైః - పండితులచేత, ఉచ్యతే - చెప్పఁబడుచున్నది, (ఇలావుండగా) జంతుః - ప్రాణి, క్షణమపి - ఒక్కక్షణమైనను, శ్వసన్ - నిట్టూర్పు విడుచుచు (జీవించుచు), అవతిష్ఠతేయది - నిలిచి యున్నట్లయితే, అసౌ - ఆ క్షణజీవి, లాభవాన్ నను - లాభము కలవాఁడే కదా, జీవుఁడు, నిర్గుణము, నిర్వికారమునైన శూన్యమువంటి శుద్ధ చైతన్యమునుండి అవిద్యా మూలమున వేరుపడి, తాను "జనన మరణములుగల ప్రాణిని" అని భ్రమపడుచున్నాఁడు. నిజమునకు నిత్యసత్యమైన లయమునందే అతనికి స్థానము. కనుక మరణము ప్రకృతి అని చెప్పఁబడినది. ఇక పుణ్య పాప ఫలములుగల కర్మల నాచరించుటచేత ఆ కర్మఫలానుభూతికై యాదృచ్ఛికముగా తనకు వికృతి రూపమైన దేహము, జీవితము లభించుచున్నవి. కనుక ఒక వ్యక్తి మరణించుట యనగా తన చోటునకు తాను చేరుట ,జీవించుట, సుఖాదుల ననుభవించుట యెంత లభించితే అంతకే సంతోషపడ వలెనుగాని, మరణమునకు శోకించుట తగదని తాత్పర్యము. వేదాంతశాస్త్ర రహస్యమంతయు నీ శ్లోకము నందున్నది.

శ్లో. అవగచ్ఛతి మూఢచేతనః
ప్రియనాశం హృది శల్య మర్పితమ్
స్థిరధీస్తు తదేవ మన్యతే
కుశలద్వారతయా సముద్ధృతమ్. 88

వ్యాఖ్య : మూఢచేతనః - భ్రాంతిచెందిన బుద్ధిగలవాఁడు, ప్రియనాశం - తనకు ప్రియమైన వస్తువుయొక్క నాశమును, హృది - హృదయమునందు, అర్పితం - క్రుచ్చఁబడిన, శల్యం - శంకువునుగా (ఇనుప మేకునుగా), అవ గచ్ఛతి - తలఁచుచున్నాఁడు; స్థిరధీఃతు - విద్వాంసుఁడై నచో (స్థితప్రజ్ఞుడైనచో) తదేవ - ఆశల్యమే, సముద్ధృతం - హృదయమునుండి తీసివేయఁబడిన దానినిగా, మన్యతే - తలఁచును. (ఎందుకనగా) కుశల ద్వారతయా - ఆప్రియనాశము మోక్షోపాయ మగుటచేత అని యర్థము. భోగ్యవస్తువుల లాభము మంచిదనియు, తద్వినాశము అహితమనియు పామరులు తలంతురు. విద్వాంసులు దానికి విపరీత ముగా అనగా ప్రియవస్తు నాశము శ్రేయస్కరమనియు, తల్లాభము దుఃఖ దాయక మనియు భావింతురని భావము.

శ్లో. స్వశరీర శరీరిణా వపి
శ్రుత సంయోగ విపర్యయౌ యదా
విరహాః కిమి వానుతాపయేత్
వద బాహ్యా ర్విషయై ర్విపశ్చితమ్. 89

వ్యాఖ్య : స్వశరీర శరీరిణౌ, అపి - తనయొక్క దేహము, ఆత్మయు కూడ, యదా-ఎప్పుడై తే (ఏకారణమువలన నై తే) శ్రుతసంయోగ విపర్యయౌ - శ్రుత - మనచే విని తెలుసుకోఁబడిన, సంయోగ - సంబంధమును, విపర్యయౌ - సంబంధము విడిపోవుటయును గలిగి యున్నవో, తదా - అప్పుడు (అట్టి పరిస్థితి యందు) బాహ్యాః - వెలుపటివి యగు, విషయైః - పుత్రమిత్ర కళత్రాదులచేత, విరహాః - ఎడబాటు, విపశ్చితం - విద్వాంసుని, కిమివ - ఏమని, అనుతాపయేత్ - సంతాపము గలవానిని గా జేయఁ గలుగునో ! వద - చెప్పుము. తన శరీరము, ఆత్మ, కొంతకాలము కలిసియుండుటయు, తరువాత నొకదాని కొకటి దూరమగు టయు నెఱిఁగిన విద్వాంసుని, దూరమునందున్న పుత్రమిత్ర కళత్రాదుల వియోగము ఏవిధముగా సంతాపతప్తుని జేయునో నీవే చెప్పుము. తనవిగా భావింపఁబడిన దేహాత్మలకే నిత్యసంబంధము లేనప్పుడు, బాహ్యవస్తువు లగువానిని తనవిగా భావించి దుఃఖించుట వివేకవంతుని లక్షణము కాదని తాత్పర్యము.

శ్లో. న పృథగ్జనవ చ్ఛోచో వశం
వశినా ముత్తమ ! గంతు మర్హ్సి
ద్రుమ సానుమతాం కి మంతరం
యది వాయౌ ద్వితయేఒపి తే చలాఃయది. 90

వ్యాఖ్య : హే వశినాం ఉత్తమ ! - ఓ జితేంద్రియులలో శ్రేష్ఠుడా !, పృథక్ జనవత్ - ఇతరునివలె (పామరునివలె), శుచః - శోకమునకు, వశం గంతుం - లొంగిపోవుటకు, న అర్హ్సి - తగవు; వాయౌ (సతి)-గాలివీచినప్పుడు, ద్వితయేఒపి - భిన్నధర్మములు కలవియై యున్నను, తే - అవి, చలాఃయది - చలించునవియే యైనచో, ద్రుమ సానుమతాం - వృక్షములకును పర్వతములకును, కిం అంతరం - ఏమిభేదము ? గాలివచ్చినప్పుడు వృక్షములు చలించినట్లే పర్వత ములును చలించినచో వాటికి "అచలములు" అను పేరెందుకు ? అట్లే పామరుని వలె దుఃమునకు పండితుడును లోనైనచో వారిద్దఱికిని భేదమేమి కలదు ? కనుక నీవు శోకింపరాదని వసిష్ఠ వచనము. "వశినాం ఉత్తమ" నీవు జితేంద్రియుడవు కనుక శోకింపఁ దగదని చెప్పుటకు వేసిన సంబోధనమిది. ఇచ్చట పామరునికి పోలికగా "ద్రుమ" శబ్దమును వాడుట మిక్కిలి రమణీయముగా నున్నది. "ద్రు - గతౌ" అనుధాతువుమీద ద్రుమశబ్ద మేర్పడినది కనుక అది చల మనియు, సాను మంతమగు పర్వతము "అచల"మనియు భావము. అచలము అజునికి ఉపమానము.

శ్లో. స తథేతి వినేతు రుదారమతేః
ప్రతిగృహ్య వచో విససర్జ మునిమ్
తదలబ్ధపదం హృది శోకఘనే
ప్రతియాత మివాంతిక మస్య గురోః 91

వ్యాఖ్య : సః - అజుడు, ఉదారమతేః - విశాల బుద్ధియగు, వినేతుః - గురువగు వసిష్ఠునియొక్క. వచః - ఉపదేశ వాక్యమును, తథేతి - అట్లేయని, ప్రతిగృహ్య - అంగీకరించి, మునిం - వసిష్ఠ శిష్యుడగు మునిని. విససర్జ - పంపివేసెను; (కింతు - కాని) తత్ - ఆ గురువచనము, శోకఘనే - దుఃఖముతో నిండిన, అస్య, హృది - ఈ యజునియొక్క హృదయమునందు, అలబ్ధపదం - దొరకని యవకాశముగలది యగుచు. గురోః - వసిష్ఠునియొక్క, అంతికం -

సమీపమును, ప్రతియాతం ఇవ - తిరిగి చేరినట్లున్నది ; కులగురు వగు వసిష్ఠుని యుపదేశ వాక్యమును కాదనలేక అజుఁడు స్వీకరించి గురు శిష్యునిఁ బంపివేసెను కాని, ఆ గురు వచనము శోకఘనమైన యజుని హృదయమును జొరఁ జాలక తిరిగి వసిష్ఠుని చెంతకే వెళ్ళిపోయెనా ? యేమి యనునట్లుండెను. అనఁగా గురూప దేశము ననుసరింపలేక యజుఁడు ప్రియావియోగ దుఃఖము ననుభవించుచునే యుండెనని తాత్పర్యము. "శోకఘన" అలబ్ధపద" శబ్దములు సార్థకములు. అలం కారము: ఉత్ప్రేక్ష.

శ్లో. తేనాష్టౌ పరిగమితాః సమాః కథంచిత్
బాలత్వా దవితథసూనృతేన సూనోః
సాదృశ్య ప్రతికృతి దర్శనైః ప్రియాయాః
స్వప్నేషు క్షణిక సమాగమోత్సవైశ్చ. 92

వ్యాఖ్య : అవితథ సూనృతేన - సత్యప్రియ వచనుఁడైన, తేన - ఆ యజునిచేత, సూనోః బాలత్వాత్ - కుమారుఁడగు దశరథుఁడు బాలుఁడైయుండుట వలన, ప్రియాయాః - ప్రియ భార్యయగు ఇందుమతియొక్క, సాదృశ్య ప్రతికృతి దర్శనైః - పోలికగల వస్తువులయొక్కయు, చిత్తరువుల యొక్కయు దర్శన ముల చేతను, స్వప్నేషు - స్వప్నములయందలి, క్షణిక సమాగమోత్సవైశ్చ - క్షణకాలము సంభవించునట్టి సమాగమ సుఖానుభవములచేతను, కథం చిత్ - అతి కష్టముగా, అష్టౌ - ఎనిమిది, సమాః - సంవత్సరములు, పరిగమితాః - గడపఁ బడినవి; కుమారుఁడు పనివాఁడై రాజ్యముచేయుటకు శక్తుఁడు కానందున ప్రియా వియోగ దుఃఖము నెట్లో భరించుచు నెనిమిది సంవత్సరములను గడిపెనని భావము.

శ్లో. తస్య ప్రసహ్య హృదయం కిల శోకశంకుః
ప్లక్షప్రరోహ ఇవ సౌధతలం బిభేద
ప్రాణాంతహేతు మపి తం భిషజా మసాధ్యం
లాభం ప్రియానుగమనే త్వరయా స మేనే. 93

వ్యాఖ్య : శోకశంకుః - దుఃఖమనెడు మేకు, తస్య - ఆ యజునియొక్క, హృదయం - హృదయమును, ప్లక్షప్రరోహః - రావిమొలక, సౌధతలం ఇవ -

మేడనువలె, ప్రసహ్య - బలాత్కారముగా, విభేదకిల - ప్రయ్యలుచేసెను సుమా! నః - అజుఁడు, ప్రాణాంతహేతుం, అపి - మరణమునకు కారణమైన దయినప్పటికిని, భిషజాం - వైద్యులకు, అసాధ్యం - చికిత్సచేయుటకు సాధ్యముగాని తం - ఆశోకశంకువును, (రోగముగా మారిన దుఃఖమును), ప్రియానుగమనే - ప్రియురాలగు ఇందుమతిని అనుసరించి వెళ్ళుట యందలి, త్వరయా - ఉత్కంఠ చేత, లాభం మేనే - లాభమునుగాఁ దలంచెను. మొదట మొలకగానున్నను క్రమక్రమముగా మహావృక్షముగా మారిన రావిచెట్టు తనకాశ్రయమైన సౌధము యొక్క గోడలను ప్రయ్యలుచేసి సౌధమునే కూల్చినట్లు ఆజుని హృదయమున నాటుకొన్న యిందుమతీ విరహజన్యమైన శోకశంకువు అతని హృదయమును బ్రద్దలుచేసి, ప్రాణాంతకమైన రోగముగా మారెను. అట్లుమారుట తాను ప్రియురాలి వెంట వెళ్ళుటకు తగిన యుపాయమే యని దానిని అజుఁడు లాభముగానే భావించెనని భావము.

శ్లో. సమ్యగ్వినీత మథ వర్మహరం కుమార
మాదిశ్య రక్షణవిధౌ విధివత్ ప్రజానామ్
రోగోపసృష్ట తను దుర్వసతిం ముముక్షుః
ప్రాయోపవేశనమతిః నృపతి ర్బభూవ. 94

వ్యాఖ్య : అథ - తరువాత, నృపతిః - అజుఁడు, సమ్యగ్వినీతం - స్వభావముచేతను, విద్యాది సంస్కారములచేతను వినయవంతుఁడై నట్టియును, వర్మహరం - కవచమును ధరించుట కర్హమైన వయస్సు కలవాఁడును నగు, కుమారం - పుత్రుఁడైన దశరథుని, ప్రజానాం - ప్రజలయొక్క, రక్షణవిధౌ - పరిపాలనమునందు (రాజ్యమునందు), విధివత్ - యథాశాస్త్రముగా (శాస్త్రోక్త ప్రకారముగా), ఆదిశ్య - నియోగించి, రోగోపసృష్టతను దుర్వసతిం — రోగోపసృష్ట - రోగముచేత వ్యాప్తమైన, తను దుర్వసతిం - శరీరముయొక్క దుఃఖావస్థితిని, ముముక్షుఃసన్ - వదిలింపదలచుకున్న వాఁడగుచు, ప్రాయోపవేశనమతిః - ఆహారమును విడిచి యుండుటయందు మనస్సుగలవాఁడు. బభూవ - అయ్యెను. కుమారుఁడు కొంచెము ఎదిగి వచ్చుటచేత అతనిపై రాజ్యభారము నుంచి అజుఁడు రోగముతో బాధపడలేక త్వరగా చనిపోవుటకై నిరాహారదీక్షను బూనెనని భావము. మహాపాతకములచేతగాని, చికిత్స చేయుటకు సాధ్యగాని రోగములచేత బాధపడు

వాఁడుగాని, మరణకాలము ఆసన్న మైనప్పుడు మోక్ష స్వర్గాదులను పొందుటకై అగ్ని ప్రవేశమునుగాని, ప్రాయోపవేశముగాని చేయ వచ్చునని ఈ క్రింది పురాణ వచనము తెలుపుచున్నది. కనుక అజుఁడు ప్రాయోపవేశమును జేసెననియు నది ఆత్మహత్యాదోషము గాదనియు భావము.

శ్లో. "సమాసక్తో భవేద్యస్తు పాతకై ర్మహ దాదిభిః
దుశ్చికిత్సై ర్మహారోగై ః పిడితో వా భవే త్తుయః
స్వయం దేహవినాశస్య కాలే ప్రాప్తే మహామతిః
ఆ బ్రహ్మణం వా స్వర్గాది మహాఫల జిగీషయా
ప్రవిశేత్ జ్వలనం దీప్తం కుర్యాదనశనం తథా
ఏతేషా మధికారోఽస్తి నాన్యేషాం సర్వజంతుషు
నరాణా మథ నారీణాం సర్వవర్ణేషు సర్వదా."

శ్లో. తీర్థే తోయవ్యతికరభవే జహ్నుకన్యా సరయ్వోః
దేహత్యాగా దమరగణనా లేఖ్య మాసాద్య సద్యః
పూర్వాకారా దధికతర రుచా సంగతః కాంతయాఽసౌ
లీలాగారే ష్వరమత పున ర్నందనాభ్యంతరేషు. 95

వ్యాఖ్య: అసౌ - అజుఁడు, జహ్నుకన్యా సరయ్వోః - గంగా సరయూ నదులయొక్క, తోయవ్యతికరభవే - ప్రవాహముల తాకిడిచేత నేర్పడిన, తీర్థే - గంగా సరయూ సంగమ తీర్థమునందు (తీర్థమనగా నదిలోనికి దిగు మార్గము), దేహత్యాగాత్ - శరీరమును విడుచుటవలన, సద్యః - వెంటనే, అమరగణనాలేఖ్యం - దేవతల లెక్కలో వ్రాయబడుటను, అసాద్య - పొంది, పూర్వాకారాత్ - పూర్వపు రూపముకంటె, అధికతరరుచా - మిక్కిలి యెక్కువకాంతిగల, కాంతయా - ప్రియురాలిచేత (పూర్వము ఇందుమతి, ఇప్పుడు హరిణి), సంగతః సన్ - కలుసుకొన్నవాఁడగుచు, నందనాభ్యంతరేషు - ఇంద్రునియొక్క నందన వనములోన నున్న, లీలాగారేషు - క్రీడాగృహములయందు, పునః - మరల, అరమత - క్రీడించెను, రోగగ్రస్తమైన శరీరమును గంగా సరయూ సంగమతీర్థమునందు విడుచుటచేత మరణించిన తక్షణమే అజునిపేరు దేవతల జాపితాలో వ్రాయఁబడెననియు, దేవత్వ లాభమునకు ఫలముగా నొక యప్సరఃకాంత యతని కప్ప

గింపఁ బడెననియు, ఆ యప్సరఃకాంత భూలోకమునందు ఇందుమతియై పుట్టి తన సహధర్మచారిణిగా నుండిన హరిణియే యగుటచేత నజుఁడు నందనోద్యానము నందలి విలాస భవనములయందు మరల తన యిష్టసఖిని గూడి యదేష్టముగా సుఖము ననుభవించెననియు భావము. మానవ దేహములందు శృంగార కరుణరస ముల కాలంబనములుగా వరింపఁబడిన యీ నాయికా నాయకులకు దేహాంతర ప్రాప్తియందు (దేవత్వమును పొందిన పిమ్మట) మరల శృంగారము లభించుట చేత అజ విలాపకావ్యమునందు ప్రతీయమానమైన రసము విప్రలంభ శృంగార ముగా ముగిసినదని భావింపవచ్చును.

ఇది మహాకవి కాళిదాస కృత రఘువంశ

కావ్యమునందలి అష్టమ సర్గకు

తెలుఁగు లఘువ్యాఖ్య

మహాకవి కాళిదాసకృత రఘువంశము

నవమ సర్గము

శ్లో. పితు రనంతర ముత్తరకోసలాన్
సమధిగమ్య సమాధి జితేంద్రియః
దశరథః ప్రశశాస మహారథో
యమవతా మవతాంచ ధురి స్థితః 1

వ్యాఖ్య: సమాధిజితేంద్రియః - నియమముచేత జయింపఁబడిన యింద్రియములు గలవాఁడును, యమవతాం - నియమముగల వారియొక్కయు, అవతాంచ - పాలకులగు రాజులయొక్కయు, ధురి - అగ్రస్థానమునందు, స్థితః - నిలిచిన వాఁడును, మహారథః - మహారథుఁడును నగు. దశరథః - దశరథుఁడు, పితుః, ఆనంతరం - తండ్రియగు అజుని తరువాత, ఉత్తర కోసలాన్ - ఉత్తర కోసలదేశమును, సమధిగమ్య - చక్కగా స్వాయత్తము చేసికొని, ప్రశశాస - బాగుగా నేలెను. అజుని పిమ్మట దశరథుఁడు రాజయ్యెననియు నతడు ఇంద్రియ నిగ్రహము గలిగి, రాజాధిరాజై ఉత్తర కోసలదేశమును చక్కగా పాలింపగలిగె ననియు భావము. బాణవిద్యయందు ప్రవీణుఁడై పదివేల ధనుర్ధరులను తా నొక్కఁడే జయింపఁగల వీరునికి "మహారథుఁడని" పేరు. "ఏకో దశసహస్రాణి యోధ యేత్ యస్తుధన్వినామ్। శస్త్రశాస్త్ర ప్రవీణశ్చ స మహారథ ఉచ్యతే॥"అని ప్రమాణము. ఈ సర్గయందలి శ్లోకములు ద్రుతవిలంబిత వృత్తమున రచింపఁబడినవి.

శ్లో. అధిగతం నిధివ ద్యదపాలయత్
ప్రకృతిమండల మాత్మకులోచితమ్
అభవ దస్య తతో గుణవత్తరం
సనగరం నగ రంధ్ర కరౌజసః. 2

వ్యాఖ్య: అధిగతం - తనకు ప్రాప్తించినదియు, ఆత్మకులోచితం - తమ వంశానుగత మైనదియు, స నగరం - నగర జన సహితమైనదియు నగు. ప్రకృతి మండలం - జానపద మండలమును, యత్ - ఏ కారణము వలన నైతే, విధివత్ - శాస్త్రప్రకారముగా, అపాలయత్ - పాలించెనో, తతః - ఆ కారణము వలననే, నగరంధ్రకరౌజసః—నగరంధ్రకర - క్రౌంచ పర్వతమునకు రంధ్రము చేసిన కుమారస్వామియొక్క, ఓజసః - పరాక్రమమువంటి పరాక్రమముగల, అస్య - ఆ దశరథునికి, గుణవత్తరం - పూర్వముకంటె మంచి గుణములు గలది. అభవత్ - అయ్యెను. చక్కగా పాలించుచున్న దశరథునిపై పౌరజానపద మండలము అధికతరమైన ఆసక్తిని జూపెనని భావము. ఈ సర్గయందు కాళిదాసు ద్రుతవిలంబిత వృత్తమును స్వీకరించి, పూర్వసర్గల యందుకంటె కొంచెమెక్కువగా శబ్దాలంకారములకు స్థాన మొసగెను.

శ్లో. ఉభయ మేవ వదంతి మనీషిణిః
సమయవర్షితయా కృతకర్మణామ్
బలనిషూదన మరపతిం చ తం
శ్రమనుదం మను దండధరాన్వయమ్. 8

వ్యాఖ్య: మనీషిణః - విద్వాంసులు. బలనిషూదనం - ఇంద్రుని. మను దండ ధరాన్వయం - మను వంశీయుఁడగు. తం అర్థపతించ - ఆ దశరథుని, ఉభయమేవ - ఈ జంటనే, సమయవర్షితయా - అవసరమునందు జలమును, ధనమును వర్షించువా రగుటచేత, కృతకర్మణాం - స్వకర్మ నిరతులకు, శ్రమనుదం - శ్రమను పోగొట్టుదానినిగా, వదంతి - చెప్పుచున్నారు. భూ మండలమునందు ఎందఱు రాజులున్నను శ్రమజీవులగువారి శ్రమను పోగొట్టగలవారు ఇంద్రుఁడు, దశరథుఁడు మాత్రమే యని యర్థము. ఇంద్రుఁడు కల్షకులకు వర్షము కురిపించును, దశరథుడు ధనమును కుఱిపించును. కనుక ఆ జంటకు మరియొకరి సామ్యము లేదని భావము. దశరథుఁ డింద్రుని యంతవాఁడనుట. దండధరుఁ డనగా రాజు, మను దండధరుఁ డనగా మనువు; ఇందలి "దండధర, అర్థపతి, కృతకర్మ శబ్దములు సాభిప్రాయములు.

శ్లో. జనపదే న గదః పద మాదధా
అభిభవః కుత ఏవ సపత్నజః

క్షితి రభూత్ ఫలవ త్యజనందనే
శమరతే ఽమరతేజసి పార్థివే. 4

వ్యాఖ్య: శమరతే - శాంతిపరుఁడును, అమరతేజసి - దేవతేజస్సు గల వాడును నగు, ఆజనందనే - దశరథుఁడు, పార్థివే సతి - పృథివీ పతియై యుండగా, జనపదే - దేశమునందు, గదః - వ్యాధి, పదం - అడుగును, న ఆదధౌ - పెట్టలేదు, సపత్నజః - శత్రుజన్యమైన, అభిభవః - తిరస్కారము, కుతవీవ - ఎక్కడిది? క్షితిః - భూమి, ఫలవతీ - పంటలు పండునది, అభూత్ - అయినది. ఈ శ్లోకమునందు దశరథునికిఁ జేర్చిన "శమరతే, అమర తేజసి, పార్థివే"అను విశేషణములు సాభిప్రాయములు. శమగుణము ప్రజలలో వ్యాపించుట వలన ఆయా చిత్తవికార హేతువులగు వ్యాధులు వారికి రాలేదు; అమర తేజస్సుగల దశరథుని రాజ్యమునం దడుగుపెట్టుట కితరరాజులు జంకిరిగావున ప్రజలకు శత్రుభయము పోయినది; ఈతఁడు పృథివీపతి యగుటవలన పృథివి సర్వ సస్యములను ఫలించినదని భావము. అలంకారము: పరికరము.

శ్లో. దశదిగంత జితా రఘుణా యథా
శ్రియ మపుష్య దజేన తతః పరమ్
త మధిగమ్య తథైవ పున ర్బభౌ
న న మహీన మహీన పరాక్రమమ్. 5

వ్యాఖ్య: మ హీ - భూమి, దశదిగంతజితా - దశదిశలను జయించిన రఘుణా - రఘుమహారాజుచేత, యథా - ఏ ప్రకారమున, శ్రియం, అపుష్యత్ - కాంతిని పెంచుకొనెనో, తతఃపరం - ఆతని యనంతరము, అజేనచ - అజునిచేత గూడ నెట్లు విరాజిల్లెనో, తథైవ - ఆ ప్రకారముననే, అహీన పరాక్రమం - వారి కంటే తక్కువకాని శౌర్యముకల, తం - దశరథుని, ఇనం - రాజునుగా, అధిగమ్య - పొంది, పునః - మరల, న బభౌఇతిన - ప్రకాశింపలేదు అనునదిలేదు (ప్రకాశించెననియే యర్థము). తాత తండ్రుల పరిపాలనమునందు వలెనే దశరథుని యేలుబడియందును దేశము చక్కగా విరాజిల్లెనని భావము.

శ్లో. సమతయా వసు వృష్టి విసర్జనై ఃr
నియమనా దసతాంచ నరాధిపః

అనుయయౌ యమ పుణ్యజనేశ్వరౌ
సవరుణౌ వరుణాగ్రసరం రుచా. 6

వ్యాఖ్య: నరాధిపతిః - దశరథుఁడు, సమతయా - అందఱి యందును సమభావము గలవాఁ డగుటచేతను (మధ్యస్థుఁ డగుటచేత), వసువృష్టివిసర్జనైః - ధనవర్షమును గురిపించుటచేతను, అసతాం - దుష్టులయొక్క, నియమనాత్ చ - నిగ్రహము వలనను, సవరుణౌ - వరుణదేవ సహితులైన, యమ పుణ్యజనేశ్వరౌ - యమ కుబేరులను, అనుయయౌ-అనుకరించెను. రుచా-శరీరకాంతిచేత, అరుణాగ్రసరం - సూర్యుని, అనుయయౌ - అనుకరించెను. దుష్టశిక్షణ సమతా భావములచేత యమునిని, ధనదానముచేత వరుణ కుబేరులను, తేజస్సుచేత సూర్యునిఁ బోలియుండెనని భావము. "వసువృష్టి విసర్జనైః" అనుచోట సభంగ శ్లేష దశరథుని పరముగా ధనవర్షములు కురిపించుటచేతనని యర్థము. వసువిసర్జనము కుబేరుని పక్షమునను, వృష్టి విసర్జనము వరుణుని పక్షమునను గ్రహింప వలయును. "అరుణాగ్రసర" శబ్ద మనుప్రాస కొఱకేగాక తేజస్సుయొక్క అరుణిమను సూచించుటకు వేయఁబడినది. అరుణుడు ముందుగలవాఁడు సూర్యుఁడని యర్థము. అలంకారము: శ్లేష.

శ్లో. న మృగయాభిరతి ర్న దురోదరం
నచ శశిప్రతిమాభరణం మధు
త మదయాయ న వా నవయౌవనా
ప్రియతమా యతమాన మపాహరత్. 7

వ్యాఖ్య: ఉదయాయ - అభ్యుదయము కొఱకు, యతమానం - ప్రయత్నించుచున్న, తం - ఆ దశరథుని, మృగయాభిరతిః - వేటయందలి వాంఛ, న అపాహరత్ - ఆకర్షింపలేదు, దురోదరం - జూదము, నాపాహరత్ - ఆకర్షింపలేదు, శశిప్రతిమాభరణం - చంద్రుని ప్రతిబింబము ఆభరణముగా గల, మధుచ - మద్యముగూడ, నా పాహరత్ - అకర్షింపలేదు, నవ యౌవనా - క్రొత్త జవ్వనముగల, ప్రియతమావా - ప్రేమపాత్రము గాఁదగిన స్త్రీ గూడా, నాపాహరత్ - ఆకర్షింపలేదు. అతనికి ఏ వ్యసనము నందును ఆసక్తి లేకుండెనని యు సజ్జనుఁడనియు భావము. "శశి ప్రతిమాభరణం మధు" అనగా వెన్నెల రాత్రులలో మధుపాత్రయనందు చంద్రుని ప్రతిబింబము కనఁబడుచుండగా, ప్రియురాలితో గలసి

మధుపానము చేయుట మహోభోగ లక్షణముగా రసికులు భావింతురు. అట్టిదానిని గూడ దశరథుఁడు విడనాడెననియు, అభ్యుదయ ప్రయత్నమునందే నిమగ్నుఁడై యుండె ననియు భావము.

శ్లో. న కృపణా ప్రభవత్యసి వాసవే
న వితథా పరిహాస కథాస్వపి
న చ సపత్న జనేష్వపి తేన వా
గపరుషా పరుషాక్షర మీరితా. 8

వ్యాఖ్య : తేన - ఆదశరథునిచేత, ప్రభవతి - ప్రభుత్వమును నెఱపు చున్న, వాసవే అపి - ఇంద్రుని విషయమునఁగూడ, కృపణా - దీనమైన, వాక్ - వాక్కు, న ఈరితా - పలుకఁబడలేదు; పరిహాసకథాసు అపి - హాస్యకథల యందుఁ గూడ, వితథా, వాక్ - అసత్యవాక్కు, నేరితా - పలుకఁబడలేదు; చ - మరియు, అపరుషా - రోషశూన్యుఁడైన (పోయినకోపముగల, "అపగతారుట్ యస్యసః అపరుట్, తేన అపరుషా" అని విగ్రహము), తేన ఆదశరథునిచేత, సపత్నజనేషు అపివా - శత్రుజనుల విషయమునందు సైతము, పరుషాక్షరం - కఠినాక్షరములు గలుగునట్లుగా, వాక్ - వాక్కు, నేరితా - పలుకబడలేదు; ఇక నితర ప్రదేశములను గుఱించి యేమి చెప్పవలెననియు, దశరథుని వాక్కు అదీ నము, సత్యనిరతము, మధురమునై యుండెననియు తాత్పర్యము.

శ్లో. ఉదయ మస్తమయం చ రఘూద్వహో
దుభయ మానశిరే వసుధాధిపాః
స హి నిదేశ మలంఘయతా మభూత్
సుహృ దయోహృదయః ప్రతిగర్జతామ్. 9

వ్యాఖ్య : వసుధాధిపాః - దేశమునందలి రాజులు, రఘూద్వహాత్ - రఘు వంశపు రాజులలో నాయకుఁడైన ఆ దశరథుని వలన, ఉదయం - అభివృద్ధిని, అస్తమయంచ - నాశమును, ఉభయం - రెండింటిని, ఆ నశిరే పొందిరి; (ఎందు వలన ననగా) హి - ఏ కారణమువలననై తే, సః - ఆ దశరథుఁడు, నిదేశం - ఆజ్ఞను, అలంఘయతాం - అతిక్రమింపని వారికి (పాలించువారికి), సుహృత్ - మంచి హృదయముగల మిత్రుఁడు, అభూత్ - అయ్యెనో, ప్రతిగర్జితాం - ఎది

రించు వారికి (ఎదురుపల్కఁ బొగరుబోతులకు). అయో హృదయః - ఉక్కఁ మనస్సు గలవాఁడు (కఠిన చిత్తుఁడు), అభూత్ - అయ్యెనో; వినయవంతులను రక్షించుచుండెను. గర్వముగలవారిని శిక్షించుచుండెను. కనుక కొందఱు అభ్యుదయమును పొందగా మరికొందఱు గర్వముచే నశించిరని భావము.

శ్లో. అజయ దేకరథేన స మేదినీ
ముదధినేమి మధిజ్య శరాసనః
జయ మఘోషయ దస్య తు కేవలం
గజవతీ జవతీప్రహయా చమూఃః. 10

వ్యాఖ్య : అధిజ్యశరాసనః - అల్లె త్రాడు కూర్చబడిన ధనువుగల, సః ఆదశరథుఁడు, ఉదధినేమిం - సముద్రముచే చుట్టఁబడిన, మేదినీం భూమిని, ఏకరథేన - ఒకే రథముచేత, అజయత్ - జయించెను (తానొక్కడే జయించెనని యర్థము). గజవతీ - ఏనుగులు కలదియు, జవతీప్రహయా - వేగాధిక్యముగల గుఱ్ఱములు గలదియునగు, చమూఃతు - సైన్యమైతే, అస్య - దశరథునియొక్క కేవలం జయం - విజయమును మాత్రము, అఘోషయత్ - ప్రకటించెను. ఏక వీరుఁడగు నతనికి సైన్యము కేవల ముపకరణ మాత్ర ముగా నుండెననియు తానొక్కడే విజయమును సంపాదించుచు సమస్త భూమండలమును స్వాధీనపరచుకొనెననియు భావము. నేమి, యనగా బండిచక్రము చుట్టునుండు ఇనుపకమ్మి; సముద్రము భూచక్రమున కట్లుండెనని యర్థము.

శ్లో. అవని మేకరథేన వరూథినా
జితవతః కిల తస్య ధనుర్భృతః
విజయ దుందుభితాం యయు రర్ణవా
ఘనరవా నరవాహన సంపదః. 11

వ్యాఖ్య : వరూథినా - ఇతరులకు గోచరింపని, ఏకరథేన అసాధారణమైన రథముచేత, అవనిం - భూమిని, జితవతః - జయించినట్టియు, ధనుర్భృతః - ఉత్తమ ధనుర్ధరుఁడైనట్టియు, నరవాహసంపదః - కుబేరునియొక్క సంపదవంటి సంపదగలవాడును నగు తస్య - ఆ దశరథునికి, ఘనరవాః - మేఘగర్జనముల

వంటి ధ్వనులుగల, అర్ణవాః - నాలుగు సముద్రములును, విజయ దుంధుభితాం - విజయ దుందుభుల భావమును, యయుఃకిల - పొందినవి సుమా! "ఆ సముద్ర క్షితీశానాం" అని మొదటి సర్గలో చెప్పినట్లు సర్వభూభాగములను జయించినట్టి దశరథునికి నాలుగు దిక్కులందున్న సముద్రములు విజయ దుందుభులై యతని మేటి విలుకానితనమును, కుబేరునివంటి సంపన్నతను, అద్వితీయ రథికత్వమును చాటించినవని భావము. సముద్రఘోషలు నగారామ్రోతలుగా రూపణచేయబడినవి. "వరూథః" అనగా రథగుప్తి వేగాధిక్యముచేత, లేక మంత్రశక్తిచేత, రథము తిరోధానమును పొంది శత్రువులకంటికి కనబడకుండుట. వరూథః అస్య అస్తీతి వరూథీ ఆని విగ్రహము. దాని తృతీయా విభక్తి యేకవచమున "వరూథినా" యని యగును.

శ్లో. శమితపక్షబలః శతకోటినా
శిఖరిణాం కులిశేన పురందరః
స శరవృష్టిముచా ధనుషా ద్విషాం
స్వనవతా నవ తామరసాననః. 12

వ్యాఖ్య: పురందరః - ఇంద్రుడు, శతకోటినా - నూరు అంచులుగల, కులిశేన - వజ్రాయుధముచేత, శిఖరిణాం - పర్వతములయొక్క, శమిత పక్షబలః- నశింపజేయబడిన తెక్కల బలిమి గలవాడు, నవ తామరసాననః - నూతన కమలమువంటి ముఖము గలవాడగు, సః - ఆ దశరథుడు, శరవృష్టిముచా - బాణ వర్షమును గురియునదియు, స్వనవతా - టంకార ధ్వనితో గూడినదియు నగు, ధనుషా - ధనుస్సుచేత, ద్విషాం - శత్రువులయొక్క, శమిత పక్షబలః - నశింపజేయబడిన సహాయమును, బలమును గలవాడు. శమితపక్ష బలత్వమునందు ఇద్దఱును సమానులేయనియు, నింద్రుడు వజ్రాయుధముచేత చేయగలిగిన పనిని దశరథుడు తన ధనుస్సుచేతనే చేయగలిగెననియు భావము.

శ్లో. చరణయో ర్నఖరాగ సమృద్ధిభిః
ముకుట రత్న మరీచిభి రస్పృశన్
నృపతయః శతశో మరుతో యథా
శతమఖం త మఖండిత పౌరుషమ్. 13

వ్యాఖ్య: శతశః - నూర్లకొలఁదిగా, నృపతయః - రాజులు, అఖండిత పౌరుషం - మొక్కవోని మగటిమిగల, తం - ఆ దశరథుని, మరుతః - దేవతలు, శతమఖం, యథా - ఇంద్రునిఁవలె, నఖరాగ సమృద్ధిభిః - దశరథుని పాదనఖ కాంతులచేత సంతరించుకొన్న యభివృద్ధిగల, ముకుట రత్న మరీచిభిః - కిరీట మణి కాంతులతో, చరణయోః - పాదములపై ని, అస్పృశన్ - తాకిరి. రాజులందఱును కిరీట రత్నకాంతులతో వెలుగు ఱస్సులతో దశరథుని పాదములను నమస్కరించిరనియు అది దేవత లందఱును నింద్రునికి నమస్కరించినట్టు లుండెనని యీ భావము.

శ్లో. నివవృతే స మహార్ణవరోధసః
సచివ కారిత బాల సుతాంజలీన్
సమనుకంప్య సపత్న పరిగహా
ననలకా నలకానవమాం పురీమ్. 14

వ్యాఖ్య: సః-ఆ దశరథుఁడు, సచివ కారిత బాలసుతాంజలీన్ - మంత్రుల చేత చేయింపబడిన బాలకులగు కుమారులయొక్క అంజలులు గలవారును, అనలకాన్ - మంగురులు లేనివారును (అనగా చంపబడిన భర్తలుగలవా రగుటచేత అలకలు దువ్వుకొనని వారని యర్థము), అగు సపత్న పరిగ్రహాన్ - శత్రువుల భార్యలను, సమనుకంప్య - దయతో ఆదరించి, అలకా నవమాం (అలకా + అనవమాం) - అలకా పట్టణముకంటె తక్కువకానిఁ పురీం - అయోధ్యా నగరమును గురించి, మహార్ణవ రోధసః - సముద్రముయొక్క ఒడ్డునుండి, నివవృతే - వెనుకకు మరలెను (తిరుగు ప్రయాణము చేసెను). దశరథునిచే నిహతులగు శత్రువులయొక్క భార్యలు తాము రాణివాసస్త్రీ లగుటచేత దశరథుని యెదుటఁబడక, వసిబాలురగు తమ కుమారులను మంత్రులద్వారా పంపి మంత్రులు చేయించిన బాలుర ప్రార్థనాంజలులతో వేడుకొనగా, హత భర్తృకలైన ఆ స్త్రీల నందరిని దయతో పరామర్శించి వెనుకకు మరలెనని భావము. "సపత్నః" అనగా శత్రువనియు, "పరిగ్రహః" అనగా భార్యయనియు నర్థములు.

శ్లో. ఉపగతోఽపిచ మండల నాభితా
మనుదితాన్య సితాతప వారణః

శ్రియ మవేక్ష్య స రంధ్రచలా మభూ
దనఘసో ఽనల సోమ సమ ద్యుతిః. 15

వ్యాఖ్య: అనుదితాన్య సితాతపవారణః — అనుదిత - పైకి యెత్తబడిని, అన్య - మరియొకనియొక్క, సితాతపవారణః (సిత + ఆతపవారణః) - శ్వేత చ్ఛత్రముగల వాఁడును, అనల సోమ సమద్యుతిః - అగ్ని చంద్రులకు సమాన మగు తేజస్సు, కాంతియు గలవాఁడును, శ్రియం - లక్ష్మిని, రంధ్రచలాం - అన్యాయ, ఆలస్యాది దోషములయందు చలించునట్టిదానినిగా, అవేక్ష్య - గుర్తించి యుండిన వాఁడునగు, సః - ఆ దశరథుఁడు, మండల నాభితాం - ద్వాదశ రాజ మండలమునకు ప్రధాన మహీపతిత్వమును, ఉపగతః అపి - పొందినవాఁడై యున్నను (చక్రవర్తియై యున్నను), అనలసః - అప్రమత్తుఁడు, అభూత్ - అయ్యెను. సర్వ శత్రువులను జయించి చక్రవర్తియై యున్నను, ఇంకను జయింప వలసినవా రున్నట్లు జాగరూకుఁడై యుండెను. ద్వాదశ రాజమండలమును గుఱించి కామందకుఁ డిట్లు చెప్పెను, "తన శత్రువు, తన మిత్రుడు, శత్రువుయొక్క మిత్రుఁడు, తన మిత్రుని మిత్రుఁడు, శత్రువు మిత్రుని మిత్రుఁడు, పార్ష్ణిగ్రాహుఁడు, ఆక్రందుడు, పార్ష్ణిగ్రాహాసారుఁడు, ఆక్రందాసారుడు, మధ్యముఁడు, ఉదాసీనుఁడు, విజిగీషువు" అని వారు పన్నెండుగురు. ఇందులోముఖ్యుడు విజిగీషువు. అతడు మధ్యలో రథచక్రము నడిమి కుండవలె నిల్చి, ఇతరుల నందఱినీ చక్రాకారముగ నిల్చునట్లుచేసి జయించినవాఁడు చక్రవర్తి యనఁబడును. మొదటి అయిదుగురు తనకు ముందుగాను, తరువాతి నలుగురు వెనుకభాగమునందును, ఉదాసీన, మధ్యములు తనకు దక్షిణ భాగమునందును ఉండునట్లు చేసికొని విజిగీషువు (దిగ్విజయము చేయ దలఁచిన రాజు) ఉత్తరాభిముఖుఁడై యుండవలెనట. దశరథుఁడట్టి చక్రవర్తియై యుండెనని భావము.

శ్లో. త మపహాయ కకుస్థ కులోద్భవం
పురుష మాత్మభవఁచ పతివ్రతా
నృపతి మన్య మసేవత దేవతా
సకమలా క మలా ఘవ మర్థిషు. 16

వ్యాఖ్య: పతివ్రతా - పతివ్రతయగు, సకమలా, దేవతా - కమలహస్త దేవత, అనగా లక్ష్మీదేవి, అర్థిషు - యాచకుల విషయమున, అలాఘవం - చులక దనమును చూపని, కకుస్థ కులోద్భవం, తం - కకుస్థ వంశమునందు పుట్టిన ఆ దశరథ మహారాజును, ఆత్మభవం, పురుషం, చ - విష్ణుమూర్తిని, అపహాయ - తప్ప, అన్యం - మరియొకఁడగు, కం, నృపతిం - ఏ రాజును, అసేవత - సేవిం చెసుఃr (సేవింపలేదని యర్థము). విష్ణువునందును, విష్ణుతుల్యఁడైన దశరథుని యందు మాత్రమే లక్ష్మీదేవి స్థిరత్వమును బొందియుండెనని భావము.

శ్లో. త మలభంత పతిం పతిదేవతాఃr
శిఖరిణా మివ సాగర మాపగాఃr
మగధ కోసల కేకయ శాసినాం
దుహితరో ఽహితరోపిత మార్గణమ్. 17

వ్యాఖ్య: పతిదేవతాఃr - పతివ్రతలైన, మగధ కోసల కేకయ శాసినాం - మగధ, కోసల, కేకయ దేశములను పాలించు రాజులయొక్క, దుహితరఃr - కుమార్తెలు (సుమిత్ర, కౌసల్య, కైకేయి). అహితరోపిత మార్గణం - శత్రువుల పై నాటబడిన శరములుగల, తం - ఆ దశరథుని. శిఖరిణాం - పర్వతముల యొక్క, దుహితరఃr - కుమార్తెలయిన, ఆపగాఃr - నదులు, సాగరం, ఇవ - సముద్రమునువలె, పతిం - భర్తనుగా. అలభంత - పొందిరి. మగధ రాజపుత్రిక యగు సుమిత్ర, దక్షిణకోసలాధిపతి కూతురు కౌసల్య, కేకయరాజు కుమారి కైక దశరథుని పరాక్రమాది గుణములు విని స్వయముగా వరించి భార్యలైరి. ఇచ్చట దశరథ పత్నుల పేర్లలో క్రమమును పాటింపలేదు.

శ్లో. ప్రియతమాభి రసౌ తిసృభి ర్బభౌ
తిసృభిరేవ భువం సహ శక్తిభిఃr
ఉపగతో వినీషు రివ ప్రజాఃr
హరిహయో ఽరిహయోగ విచక్షణఃr. 18

వ్యాఖ్య: అరిహయోగ విచక్షణఃr—అరిహ - శత్రు వినాశకరములగు, యోగ - ఉపాయములందు, విచక్షణఃr - దక్షుఁడగు, అసౌ - ఈ దశరథుఁడు,

తిసృభిః - ముగ్గురగు, ప్రియతమాభిః సహ - ప్రియురాండ్రతో గూడ, ప్రజాః - ప్రజలను, వినీషుః - శిక్షింపఁదలచిన వాడగుచు (నీతిమార్గమును నేర్పఁ దలచిన వాఁడై). తిసృభిరేవ - మూడేయైన, శక్తిభిః - ప్రభు మంత్రోత్సాహ శక్తులతో గూడ, భువం - భూలోకమును, ఉపగతః - చేరిన, హరిహయః ఇవ - ఇంద్రుఁడువలె, బభౌ - ప్రకాశించెను. ప్రజా పాలనమునకు వలసిన శక్తిత్రయము సాక్షాత్కరించిన విధమునన్నున్న ముగ్గురు భార్యలును ప్రజలను నీతి మార్గమున నడపుటకుఁ దోడ్పడుచుండిరి, దశరథుఁడు రెండవ యింద్రుఁడుగా ప్రకాశించెను.

శ్లో. స కిల సంయుగమూర్ధ్ని సహాయతాం
మఘవతః ప్రతిపద్య మహారథః
స్వభుజవీర్య మగాపయ దుచ్ఛ్రితం
సురవధూ రవధూతభయాః శరైః. 19

వ్యాఖ్య: మహారథః సః - మహారథుఁడైన ఆ దశరథుఁడు, సంయుగ మూర్ధ్ని - రణాంగణమునందు, మఘవతః - ఇంద్రునికి, సహాయతాం - సహాయమును, ప్రతివద్య - పొంది, శరైః - బాణములచేత, అవధూత భయాః - తొలగింపఁబడిన భయముగల, సురవధూః - దేవకాంతలను, ఉచ్ఛ్రితం - ఉన్నతమైన, స్వభుజవీర్యం - తన బాహు పరాక్రమమును, అగాపయత్, కిల - గానము చేయించెను సుమా ! దేవదానవుల యుద్ధములందు ఇంద్రునికి తోడ్పడి విజయములు సాధించుటచేత, భయము తొలఁగిన దేవకాంతలు దశరథుని పరాక్రమమును గానము చేసిరని భావము.

శ్లో. క్రతుషు తేన విసర్జితమౌలినా
భుజ సమాహృత దిగ్వసునా కృతాః
కనక యూప సముచ్ఛ్రయ శోభినో
వితమసా తమసాసరయూ తటాః. 20

వ్యాఖ్య : క్రతుషు - అశ్వమేధయాగములందు, విసర్జితమౌలినా - తీసియుంచిన కిరీటముగలవాఁడును, భుజ సమాహృత దిగ్వసునా - భుజబలార్జితమైన

దిగంతసంపదలు గలవాడును, వితమసా - తమోగుణ రహితుడును నగు, తేన - ఆ దశరథునిచేత, తమసా, సరయూతటాః - తమసా, సరయూనదులతీరములు, కనకయూప సముచ్ఛ్రియ శోభినః—కనకయూప - బంగారపుయూప స్తంభముల యొక్క, సముచ్ఛ్రియ - ఉన్నమనముచేత (ఎత్తుగా నుంచుటచేత), శోభినః - ప్రకాశించునవిగా, కృతాః - చేయఁబడినవి. అయోధ్యానగరమున కిరువైపు లందున్న తమసా, సరయూనదుల తీరములు దశరథుఁడు చేసిన అశ్వమేధ పశు బంధన స్తంభములతో విరాజిల్లెనని భావము. "విసర్జితమౌలినా" యనుట రాజు, యజ్ఞ సమర్పమున రాజ చిహ్నాములు ధరింపరాదు గనుక, అప్పుడు అధ్వర్యుఁడే సర్వాధికుఁడు; దిగ్విజయము క్షత్రియునికి విహిత ధర్మము. 'యూప, మనగా యజ్ఞమునందు యజ్ఞపశువును గట్టివేయు స్తంభము. అది కనకమయముగా నుండెనని వర్ణించుట శోభార్థమేకాని విధికాదు, అవి సమున్నతములై దశరథుఁడు చేసిన బహుయాగములను సూచించుచు, తమసా సరయూనదీ తీరముల కలంకారములుగా నుండెనని భావము.

శ్లో. అజిన దండ భృతం కుశమేఖలాం
యతగిరం మృగశృంగ పరిగ్రహామ్
అధివసం స్తమ మధ్వరదీక్షితా
మసమభాస మభాసయ దీశ్వరః. 21

వ్యాఖ్య : ఈశ్వరః - అష్టమూర్తియగు శివుఁడు, అజినదండ భృతం - కృష్ణాజినమును, ఔదుంబరదండమును ధరించినట్టియును (లేడి చర్మమును, మేడి కట్టను యజ్ఞదీక్షితుఁడు ధరింపవలయునని ప్రమాణ వచనము), కుశమేఖలాం - దర్భలతో చేసిన త్రాడు కలదియును, యతగిరం - నియమము చేయఁబడిన వాక్కులు గలదియును, మృగశృంగ పరిగ్రహం - లేడికొమ్ము కండూయన సాధనముగాఁ గలదియును, అధ్వర దీక్షితాం - సంస్కార విశేషముతో గూడినదియు నగు, తనుం - దశరథుని శరీరమును, అధిపసన్ - అధిష్ఠించిన వాఁడగుచు, అసమభాసం - అసాధారణమైన కాంతులు గలుగునట్లుగా, అభాసయత్ - ప్రకాశింపఁజేసెను. ఈవుని అష్టమూర్తులు "భూతార్కచంద్రయజ్వానో మూర్తయోష్టౌ ప్రకీర్తితాః" అను ప్రమాణ వచనముచేత పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుఁడు, చంద్రుఁడు, యజ్ఞముచేయు సోమయాజి అనునవి; వాటిలో

యజ్ఞదీక్షితుఁడైన దశరథుఁడు ప్రకృతమున ఒక శివమూర్తి. కనుక అట్టి సంస్కారమును పొందిన దశరథుని తనువునందు శివుఁడు ప్రవేశించి యా తనువును మిక్కిలి ప్రకాశింపఁ జేసెనని తాత్పర్యము. ఇందులో శ్రుతి స్మృతి ప్రమాణాను సారముగా యజ్ఞదీక్షితుని స్వరూపమును కవి వర్ణించెను.

శ్లో. అవభృథ ప్రయతో నియతేంద్రియః
సుర సమాజ సమాక్రమణోచితః
నమయతిస్మ స కేవల మున్నతం
వనముచే ర్నముచే రరయే శిరః. 22

వ్యాఖ్య: అవభృథ ప్రయతః - అవభృథ స్నానముచేత నియమ నిష్ఠలు గలవాఁడును, నియతేంద్రియః - నిగ్రహింపబడిన యింద్రియములు గలవాఁడును, సుర సమాజ సమాక్రమణోచితః - దేవ సంఘమునకు సమానమగు పీఠమునకు దగినవాఁడును నగు, సః - ఆ దశరథుఁడు, ఉన్నతం - ఎత్తఁబడిన, శిరః - తన శిరస్సును, వనముచే - అవభృథ జలమును తనపై వర్షించునట్టి, నముచేః ఆరయే- ఇంద్రుని కొఱకు మాత్రమే (నముచికి శత్రువు). నమయతిస్మ - వంచెను. తన తలపై అవభృథ జలము నభిషేకించు సమయమునందును ఒక యింద్రునికొఱకు మాత్రమే తలను వంచెనుగాని, మనుష్యమాత్రుని కెవ్వనికిని తలవంచలేదనియు అట్టి ధీర గంభీర శాంతమూర్తి యనియు భావము. 'అవభృథ' మనగా శుభకర్మ యొక్క దీక్షాంతమున జేయునట్టి స్నానము; ఇచ్చట 'ఆక్రమణ'మనగా పీఠము.

శ్లో. అసకృ దేకరథేన తరస్వినా
హరిహయాగ్రసరేణ ధనుర్భృతా
దినకరాభిముఖా రణ రేణవో
రురుధిరే రుధిరేణ సురద్విషామ్. 23

వ్యాఖ్య: ఏకరథేన - అద్వితీయమైన రథము గలిగినట్టియును, తరస్వినా- బలవంతుఁడైనట్టియును, హరిహయాగ్రసరేణ - ఇంద్రునికి ముందునడచునట్టి, ధనుర్భృతా - విలుకాఁడైన దశరథునిచేత, అసకృత్ - అనేక పర్యాయములు, దినకరాభిముఖాః - సూర్యునికి యెదురుగా లేచిన, రణరేణవః - యుద్ధసంబంధమైన

ధూళులు, సురద్విషాం, రుధిరేణ - రాక్షసులయొక్క రక్తముచేత, రురుధిరే - నివారింపఁ బడినవి. ఇంద్రుడు తూర్పుదిక్కునుండి పశ్చిమాభిముఖుఁడై రాక్షసులతో జేయుచున్న యుద్ధములలో, నతనికి తోడుగా అగ్రభాగమున నిల్చి యుద్ధమునందు రేగి సూర్యునిఁ గప్పివేయుచున్న రణధూళిని దశరథుఁ డెన్నో పర్యాయములు రాక్షస రక్తముతో నణచివేసెనని భావము. అనగా దశరథుఁ డనేక పర్యాయములు యుద్ధములం దింద్రునికిఁ దోడ్పడి రాక్షస సంహారముఁ జేసెనని భావము.

శ్లో. అథ సమావవృతే కుసుమై ర్నవై
స్త మివ సేవితు మేకనరాధిపమ్
యమ కుబేర జలేశ్వర వజ్రిణాం
సమధురం మధు రంజిత విక్రమమ్. 24

వ్యాఖ్య: అథ - పిమ్మట, యమ కుబేర జలేశ్వర వజ్రిణాం - యమ కుబేర, వరుణేంద్రులకు, సమధురం - సమానమైన భారము గలవాఁడును (వారితో సమానుడు), అంచిత విక్రమం - మెచ్చుకొనబడిన పరాక్రమము గలవాఁడును, ఏకనరాధిపం - అద్వితీయ ప్రజాపాలకుండునైన, తం - ఆ దశరథుని, సేవితుం, ఇవ - సేవించుటకువలె, మధుః - వసంతుఁడు, నవైః, కుసుమైః - నూత్నములగు పుష్పములతో (పుష్పహస్తుఁడై), సమావవృతే - వచ్చెను (తిరిగి వచ్చెను) దశరథుఁడు, ధర్మాధర్మ నిర్ణయమునందు యమధర్మరాజుతోను, ధనము నిచ్చుటయందు కుబేరునితోను, నియమ పరిపాలనమున వరుణునితోను, ఐశ్వర్యమునం దింద్రునితోను సమానుఁడై యుండెను. "రిక్త హస్తేన నోపేయాత్ రాజానం, దేవతాం, గురుమ్" అను వచనముచేత వసంతుఁడు రాజైన దశరథుని వద్దికి వట్టి చేతులతో కాక సపుష్పహస్తుఁడై వచ్చి దర్శించెను. అనగా వసంతఋతువు వచ్చెనని భావము.

శ్లో. జిగమిషు ర్ధనదాధ్యుషితాం దిశం
రథయుజా పరివర్తిత వాహనః
దినముఖాని రవి ర్హిమనిగ్రహై
ర్విమలయన్ మలయం నగ మత్యజత్. 25

వ్యాఖ్య: ధనదాధ్యుషితాం - కుబేరునిచేత నివసింపబడిన, దిశం - దిక్కును (ఉత్తర దిక్కునని యర్థము), జిగమిషుః - చేరదలచినవాడై, రథ యుజా (రథమును కట్టువాడు) - సారథిచేత, పరివర్తిత వాహనః - ప్రక్కకు త్రిప్పబడిన గుఱ్ఱములుగల, రవిః - సూర్యుడు, హిమనిగ్రహైాః - మంచును తొలగించుటచేత, దిన ముఖాని - ప్రాతః కాలములను, విమలయన్ - స్వచ్ఛ పర చుచు, మలయం, నగం - మలయ పర్వతమును, అత్యజత్ - విడిచెను. దక్షిణ దిక్కును విడిచెనని యర్థము. ఉత్తరాయణ ప్రారంభముకాగా సూర్యుడు దక్షిణ దిశను విడిచి యుత్తరమున నడచుట ప్రారంభించెను.

శ్లో. కుసుమజన్మ తతో నవపల్లవాః
తదను షట్పద కోకిలకూజితమ్
ఇతి యథాక్రమ మావిరభూ న్మధుః
ద్రుమవతీ మవతీర్య వనస్థలీమ్. 26

వ్యాఖ్య: కుసుమజన్మ - మొదట పువ్వులు పూయుట, తతః - తరువాత, నవపల్లవాః - లేఁ జిగురాకులు, తదను - ఆ తరువాత, షట్పదకోకిల కూజితం - తుమ్మెదల యొక్కయు, కోయిలల యొక్కయు ధ్వని, ఇతి - ఈ విధముగా, యథాక్రమం - వరుసగా, ద్రుమవతీం - వృక్షములుగల, వనస్థలీం - వనభూమిని, అవతీర్య - చేరి (వనభూమి మీద దిగియని యర్థము). మధుః - వసంతుఁడు, ఆవిరభూత్ - ఆవిర్భవించెను. వసంతుఁ డావిధముగా సాక్షాత్కరించెనని భావము. మొదట చిగురాకులు తరువాత పువ్వులు పుట్టుట సాధారణముగా నన్ని చెట్ల యందును గనపడును. కాని కొన్ని వృక్షములు మొదటనే పువ్వులు పూయునవి కలవు. ఆ విశేష జ్ఞానముగల కాళిదాసు "కుసుమజన్మ"అని ప్రారంభించెను.

శ్లో. నయగుణోపచితా మివ భూపతేః
సదుపకార ఫలాం శ్రియ మర్థినః
అభియయుః సరసో మధుసంభృతాం
కమలినీ మలి నీరపతి త్రిణః 27

వ్యాఖ్య: నయగుణోపచితాం - నీతియుక్తములగు శౌర్యాది గుణముల చేత, ఉపచితాం - అభివృద్ధిని పొందింపబడినట్టిదియును, సదుపకార ఫలాం -

సజ్జనుల కుపకారము చేయుటయే ఫలముగాగలదియు నగు, భూపతేః, శ్రియం - దశరథునియొక్క సంపదను, అర్థినః ఇవ - యాచకులువలె, మధుసంభృతాం - వసంతునిచేత చక్కగా పోషింపఁబడినది యగు, సరసః, కమలినీం - కాసారము యొక్క తామరతీగను, అలినీర పత త్రిణఃఅలి - తుమ్మెదలును, నీర పత తి ణఃజలపక్షులె న హంసాదులును, అభియయుఃచేరెను. దశరథుని సంపదకై యర్థులు గుంపులు గుంపులుగా చేరునట్లు, సరోవరములందలి పద్మలతల వద్దికి తుమ్మెదలు, హంసలు మొదలయినవి చేరెనని భావము. దీనివలన దశరథుని యీవి, వసంతశోభ విరివిగా వర్ణితములై నవి.

శ్లో. కుసుమ మేవ న కేవల మా ర్తవం
నవ మశోకతరోః స్మరదీపనమ్
కిసలయ ప్రసవోఽపి విలాసినాం
మదయితా దయితా శ్రవణార్పితః. 28

వ్యాఖ్య: ఆ ర్తవం - ఋతుకాలమున వచ్చిన, నవం - నూతనమగు. అశోకతరోః - అశోక వృక్షముయొక్క, కేవలం - ఒక, కుసుమమేవ - పుష్పము మాత్రమే, స్మరదీపనం - మన్మథోద్దీపము, న - కాలేదు, కింతు - ఇక నేమ నగా, విలాసినాం - భోగాభిలాష గలవారికి, మదయితా - మత్తెక్కించునట్టి, దయి తాశ్రవణార్పితః - ప్రియురాలి చెవిసందున నుంచబడిన, కిసలయ ప్రసవః, అపి - చిగుఱాకు జొంపమునై తము, స్మరదీపనః - మన్మథో ద్దీపకములయ్యెను. విలాస వంతులకు అశోకపుష్పము, ప్రియురాలి వసంత పల్లవము, ఏకకాలమున మదనో ద్దీపకము లై నని.

శ్లో. విరచితా మధు నోపవనశ్రియా
మభినవా ఇవ పత్రవిశేషకాః
మధులిహాం మధుదాన విచారదాః
కురవకా రవ కారణతాం యయుః 29

వ్యాఖ్య: మధునా - వసంతునిచేత, విరచితాః - విరచింపబడిన, ఉపవన శ్రియాం - ఉద్యానవన లక్ష్ములయొక్క, అభినవాః - నూతనములై న, పత్రవిశేష

కాఃఇవ - మకరికాది పత్రవిషశేములవలె నున్న, మధుదాన విశారదాఃమద్యమును దానము చేయుటయందు నేర్పరులైన, కురవకాఃగోరంటచెట్లు, మధులిహాం - తుమ్మెదలయొక్క, రవకారణతాం - ఝంకారమునకు కారణమగుటను, యయుఃపొందినవి. పుష్పించిన గోరంటచెట్లు వసంతుడు వనలక్ష్ముల బుగ్గలపై రచించిన మకరికాది పత్రరచనలను బోలియుండి, విస్తారమైన తమ మకరంద మధువును భ్రమరములకు దానముచేసి, వాటిచేత ఝంకార రూపమున వసంత స్తోత్రములను జేయించెనని భావము. అర్థిజనులు దాన శౌండులను స్తుతించుట లోక పరిపాటిగదా!

శ్లో. సువదనా వదనాసవ సంభృత
స్తదనువాది గుణఃకుసుమోద్గమఃః
మధుకరై రకరో న్మధులోలుపైఃః
వకుల మాకుల మాయత పంక్తిభిఃః 30

వ్యాఖ్య: సువదనా వదనాసవ సంభృతఃః — సువదనా - చక్కని స్త్రీల యొక్క, వదనాసవ - పుక్కిలింపు మద్యముచేత, సంభృతఃః - పుట్టి పుంజుకొన్న, కుసుమోద్గమఃః - పుష్పోద్గమము, తదనువాదిగుణఃః - ఆ మద్యమును పోలిన గుణముగలదియై, మధులోలుపైఃః - మకరందముపై మక్కువగలదియు. ఆయత పంక్తిభిఃః - దీర్ఘములైన పంక్తులు దీరినవియు నగు, మధుకరైఃః-తుమ్మెదలచేత, వకులం - పొగడచెట్టును, ఆకులం - చలించుదానినిగా, అకరోత్ - చేసెను. వనితల పుక్కిలింపు మద్యముచేత పుట్టుకవచ్చిన పొగడపూల మొత్తము "కారణా గుణాఃకార్యే సంక్రామంతి" అను న్యాయమున మద్యమునుపోలిన మకరందము గలదియై, ఆ మకరందపానము చేయుటకు పొడవైన బారులుదీరి వచ్చిన తుమ్మె దలచేత పొగడచెట్టు కదలునట్లు చేసెను. అనగా మధుపానమువలన తుమ్మెదలు మత్తెక్కి తనపై సోలిపడగా, తానును (పొగడచెట్టు) సోలిపోయెననిగాని, సువ దనా వదన మద్యప్రభావము పుష్ప సమూహమునకును, బంభరములకును, తదా శ్రయమైన వకుళ వృక్షమునకును సోకెనని తాత్పర్యము. వనితల పుక్కిలింపు మద్యము పొగడచెట్టు పూచుటకు దోహదము.

శ్లో. ఉపహితం శిశిరాపగమ శ్రియా
ముకులజాల మశోభత కింశుకైఃః

ప్రణయి నీవ నఖక్షతమండనం
ప్రమదయా మద యాపిత లజ్జయా. 81

వ్యాఖ్య: శిరాపగమశ్రియా - వసంతలక్ష్మిచేత, కింశుకే - మోదుగచెట్టు నందు, ఉపహితం - ఉంచఁబడిన, ముకులజాలం - మొగ్గల మొత్తము, మద యాపితలజ్జయా - మదముచేత తొలగింప బడిన సిగ్గుగల, ప్రమదయా - జవ్వని చేత, ప్రణయిని-ప్రియునిమీద, ఉపహితం - ఉంచబడిన, నఖక్షత మండనం ఇవ-నఖక్షతములను భూషణమువలె, అశోభత - ప్రకాశించెను. వసంతర్తువునందు మోదుగుచెట్టుపై నుప్పతిల్లిన మొగ్గలు, మదిరా మదవశమున జాఱవిడిచిన సిగ్గుగల పడుచు తన ప్రియుని దేహముపై నుంచిన నఖక్షతములవలె ప్రకాశించెనని భావము.

శ్లో. వ్రణి గురు ప్రమదాధర దుఃసహాం
జఘన నిర్విషయీకృత మేఖలమ్
న ఖలు తావ దశేష మపోహితుం
రవి రలం విరలం కృతవాన్ హిమమ్. 82

వ్యాఖ్య: వ్రణగురు ప్రమదాధర దుస్సహం — వ్రణగురు - దంతక్షత వ్రణములచేత పెద్దవియైన, ప్రమదాధర - స్త్రీల యధరోష్ఠములచేత, దుస్సహం - ఓర్చుటకు శక్యముగానిదియు, జఘన నిర్విషయీకృత మేఖలమ్—జఘన - స్త్రీల కటి ప్రదేశముమీద, నిర్విషయీకృత - లేకుండా చేయఁబడిన, మేఖలం - మొల నూలు గలదియునగు, హిమం - మంచును, రవిః - సూర్యుఁడు, తావత్ - అంత వఱకు (వసంతర్తువు వచ్చువఱకు), అశేషం - నిశ్శేషముగా, అపోహితుం - తొలగించుటకు, న, అలం ఖలు - సమర్థుఁడు కాలేదు సుమా: (కాని) విరలం - పలచబడినదానినిగా, కృతవాన్ - చేసెను. శిరర్తువునందు మంచు గాఢముగా నుండి వసంతము రాగానే సూర్యకిరణములచే పలచబాఱెననియు, అది శృంగార నాయికలకు కొంతమేలు చేసెననియు భావము. దంతక్షతములచేత పుండుబడిన స్త్రీల యధరోష్ఠములమీద మంచుబడినచో మిక్కిలి బాధగలుగుచుండెనట: అంతే కాక యా వనితలు స్వర్ణ రజతములతో జేయబడిన వడ్డాణములు చలికాలమున మిక్కిలి చల్లనివై బాధించునవి యగుటచేత వానిని జఘనములపై ధరింపకుండి రట: దీనికి మూలమైన హిమమును సూర్యుఁడప్పుడు తొలగింపలేకపోయినను

వసంతారంభమునుండి కొంచ కొంచముగా పలచబాఁ జేయుచుండెనట: ప్రకృతి యందలి యే వస్తువునైనను రసదృష్టితో మలచుట కాళిదాసు విశిష్టత. సూర్యుఁడా విధముగా నారీ జనమునకు మేలుచేసెనట.

శ్లో. అభినయాన్ పరిచేతు మివోద్యతా
మలయమారుత కంపిత పల్లవా
అమదయ త్సహకార లతా మనః
సకలికా కలి కామజితా మపి. 83

వ్యాఖ్య: అభినయాన్ - అభినయములను (అర్థవ్యంజకములైన వ్యాపారములను), పరిచేతుం - అభ్యసించుటకు, ఉద్యతా ఇవ - నిలుచున్నదివలె (ప్రయత్నము చేయుచున్నదివలె), మలయ మారుత కంపితపల్లవా—మలయమారుత - దక్షిణపు గాలిచేత, కంపిత - కదల్పఁబడిన, పల్లవా - చిగురాకులు గలదియును, సకలికా - మొగ్గలతో గూడినదియు నైన, సహకారలతా - మామిడితీగ, కలికామ జితాం, అపి - రాగద్వేషములను జయించినవారి యొక్కయు, మనః - మనస్సును, అమదయత్ - మదింపజేసెను. మందమారుతముచేతఁ గరల్పబడుచున్న చిగురుటాకులు, మొగ్గలుగల తీఁగమామిడి, యభినయమును నేర్చుకొనుచున్న పడుచువలె మనోహరముగా నుండెనని భావము. ఇచ్చట సహకార లత బాలనర్తకి, పల్లవములు ఆమె హస్తములు. మలయ మారుతము అభినయమును నేర్పుచున్న గురువు, సకలికా యనుట ఆమె స్తనోద్గమ సూచకము, కనుకనే ఆమె జితేంద్రియుల మనస్సునుగూడ మదింపజేయఁ గల్గినది.

శ్లో. ప్రథమ మన్యభృతాభి రుదీరితాః
ప్రవిరలా ఇవ ముగ్ధవధూ కథాః
సురభిగంధిషు శుశ్రువిరే గిరః
కుసుమితాసు మితా వనరాజిషు. 84

వ్యాఖ్య: సురభిగంధిషు - సువాసనలుగలవియు, కుసుమితాసు - పువ్వులుగలవియు నగు, వనరాజిషు - వనపంక్తులయందు, అన్యభృతాభిః - ఆడుకోకిలలచేత, ప్రథమం - ప్రారంభ సమయములందు, ఉదీరితాః - పలుకబడినవియై,

మితాః - పరిమితములైన, గిరః - పలుకులు (ఆలాపములు), ప్రవిరలాః - మిక్కిలి మితములైన. ముగ్ధవధూకథాః ఇవ - ముగ్ధస్త్రీ ప్రసంగములవలె, శుశ్రువిరే - వినఁబడినవి. వసంతారంభమునందు కొంచము కొంచముగా వినవచ్చుచున్న కోకిలాలాపములు, సిగ్గుతనము తగ్గని ముగ్ధల ప్రసంగములవలె మనోహరముగా నుండెనని భావము.

శ్లో. శ్రుతిసుఖ భ్రమరస్వన గీతయః
కుసుమ కోమల దంతరుచో బభుః
ఉపవనాంత లతాః పవనాహతైః
కిసలయైః సలయైరివ పాణిభిః 35

వ్యాఖ్య: శ్రుతిసుఖభ్రమర స్వనగీతయః —శ్రుతిసుఖ - చెవుల కింపైన, భ్రమరస్వన - తుమ్మెదల ఝంకారము లనెడు, గీతయః - గీతములు గలవియు, కుసుమకోమల దంతరుచః - పువ్వులనెడు కోమలదంతముల కాంతులు గలవియు నగు, ఉపవనాంత లతాః - ఉద్యానవనము నందలి లతలు, పవనాహతైః - గాలి చేత కదల్పఁబడిన, కిసలయైః - చిగురాకులచేత, సలయైః పాణిభిః ఇవ - అభినయముతో కూడిన హస్తములచేత వలె, బభుః - ప్రకాశించినవి. ఉద్యాన లతలు పువ్వులనెడు దంతములు కనబడునట్లు భ్రమర ఝంకారములనెడు గానములు చేయుచు, చిగురాకు చేతులతో నభినయమును జేయుచు, నర్తకీ సామ్యమును పొంది యుండెనని భావము. రాగతాళాభినయములుగల నర్తకీ భావము లతలయందు చక్కగా ఆరోపింపఁబడినది.

శ్లో. లలిత విభ్రమ బంధ విచక్షణం
సురభి గంధ పరాజిత కేసరమ్
పతిషు నిర్వినిశు ర్మధు మంగనాః
స్మరసఖం రసఖండన వర్జితమ్. 36

వ్యాఖ్య: అంగనాః - స్త్రీలు, లలితవిభ్రమ బంధ విచక్షణం—లలిత విభ్రమ - సుందర విలాసములయొక్క, బంధ - కూర్చుటయందు, విచక్షణం - నేర్పరియైనదియు, సురభిగంధ పరాజిత కేసరం—సురభిగంధ - తన మంచి పరి

మళముచేత, పరాజిత కేసరం - ఓడింపఁబడిన పొగడపువ్వులు గలదియు, స్మర సఖం - మన్మదోద్దీపకమును సగు, మధుం - మద్యమును, పతిషు - భర్తల విషయమున, రసఖండన వర్జితం - అనురాగ భంగరహితముగా, నిర్విశుఃఁ - అనుభవించిరి. స్త్రీలు పరస్పరానురాగ పూర్వకముగా నవిలాసముగా పతులతోఁ గలిసి మధుర మధుపానము చేసిరని భావము. ఆ మధువు పొగడ వాసనగలది. ఇచ్చట మధుశబ్దము పుంలింగముగాఁ బ్రయోగింపఁబడినది.

శ్లో. శుశుభిరే స్మిత చారుత రాననాఃఁ
స్త్రియ ఇవ శ్లథ శింజిత మేఖలాఃఁ
వికచ తామరసా గృహదీర్ఘికాఃఁ
మదక లోదక లోల విహంగ మాఃఁ 37

వ్యాఖ్య: వికచ తామరసాఃఁ - వికసించిన తామరపువ్వులు గలవియు, మదక లోదక లోలవిహంగమాఃఁ—మదకల - మదముచేత, అవ్యక్త మధురముగా పలుకుచున్న, ఉదకలోల విహంగమాఃఁ - జల ప్రియములైన హంసాది పక్షులు గలవియునగు, గృహదీర్ఘికాఃఁ - ఇండ్లయందలి దిగుడుబావులు, స్మితచారు తరాననాఃఁ - చిఱునగవుచేత మిక్కిలి యందమైన ముఖములుగల వారును, శ్లథ శించిత మేఖలాఃఁ - జాఱినవియు, ధ్వనించునవియు నగు మొలనూళ్లు (వడ్డాణములు) గలవారునునగు, స్త్రియఃఁ ఇవ - స్త్రీలవలె శుశుభిరే - ప్రకాశించినవి. 'దీర్ఘికా' శబ్దము స్త్రీలింగ మగుటచేత స్త్రీలతో దీర్ఘికలు పోల్పఁబడినవి. జలపక్షుల కలకలములు స్త్రీల జాఱిన యొడ్డాణముల గజ్జెల చప్పుడులుగా పోల్చుట రమణీయముగా నున్నది. దీర్ఘికలు (బావులు) స్త్రీలవలె మధురాలాప తనూవిలాస సౌందర్యమునఁ బొల్చెనని భావము.

శ్లో. ఉపయయౌ తనుతాం మధుఖండితా
హిమకరోదయ పాండు ముఃఖచ్ఛవిఃఁ
సదృశ మిష్ట సమాగమ నిర్వృతిం
వనిత యానితయా రజనీవధూఃఁ. 38

వ్యాఖ్య: మధుఖండితా - వసంత సమయముచేత కుఱుచగాఁ జేయఁబడినదియు, హిమక రోదయ పాండుముఖచ్ఛనిఃఁ—హిమకర - చంద్రునియొక్క,

ఉదయ - ఉదయముచేత, పాండు - తెల్లబడిన, ముఖచ్ఛవిః - ప్రదోషకాంతి గలదియు (సాయంకాలశోభ)నగు, రజనీవధూః - రాత్రియనెఁడు కాంత, ఇష్టసమాగమనిర్వృతిం—ఇష్ట - ప్రియునియొక్క, సమాగమనిర్వృతిం - సమాగమ సుఖమును, అనితయా - పొందజాలనట్టి, వనితయా - స్త్రీతో, సదృశం - సమాన మగు తనుతాం - కృశత్వమును, ఉపయయౌ - పొందెను. 'ఖండితా' శబ్దము చేత ధ్వనించు నాయికా పక్షమున, ఆమె మధువను ప్రియునికై వేచియుండి, చంద్రునివలె తెల్లబడిన ముఖకాంతి గలదియై, ప్రియ సమాగమ సుఖమును పొందని కారణమున కృశించిపోయెనని యర్థము. వేసవి కాలమున రాత్రులు కుఱుచగా నుండుటను ఇట్లు నాయికాపరముగా వర్ణించెను. అలంకారము: రూపకము, ఉపమ. "స్వాధీనపతిక, వాసకసజ్జిక, విరహోత్కంఠిత, విప్రలబ్ధ, ఖండిత, కలహాంతరిత, ప్రోషిత భర్తృక, అభిసారిక", అని శృంగార నాయికలు ఎనిమిది విధములు. అందులో "ఖండిత" యనగా ప్రియుడు రాత్రినొకచోట గడిపి, ఇతర స్త్రీ సంభోగ చిహ్నములతో నింటికి వచ్చినపుడు చూచి కోపముతో మండిపడునట్టి నాయిక, ఇచ్చట కృశించినది.

శ్లో. అపతుషారతయా విశదప్రభైః
సురత సంగ పరిశ్రమ నోదిభిః
కుసుమచాప మతేజయ దంశుభిః
హిమకరో మకరోర్జిత కేతనమ్. 39

వ్యాఖ్య: హిమకరః - చంద్రుఁడు. అపతుషారతయా - మంచు తొలగియున్న కారణముచేత, విశదప్రభైః - నిర్మలమైన కాంతులు గలవియును, సురత సంగ పరిశ్రమ నోదిభిః - సంభోగము వలన కలిగిన యలసటను తొలగించునవియునగు, అంశుభిః - కిరణములచేత, మకరోర్జిత కేతనం - ఎత్తబడిన మకరధ్వజముగల, కుసుమచాపం - మన్మథుని, అతేజయత్ - పదునెక్కునట్లు చేసెను. విశదములైన చంద్ర కిరణములు మరికొంచెము మదనోద్దీపకము లయ్యెననియు, చంద్రమన్మథులు పరస్పర సహాయముతో విలాసి జనమునకు సంభోగవాంఛ లధికముగా జేసిరనియు భావము.

శ్లో. హుత హుతాశన దీప్తి వనశ్రియః
ప్రతినిధిః కనకాభరణస్య యత్

యువతయః కుసుమం దధు రాహితం
తదలకే దల కేసర పేశలమ్. 40

వ్యాఖ్య: హుత హుతాశన దీప్తి - హోమము చేయబడిన అగ్నియొక్క కాంతివంటి కాంతిగల, యత్ - ఏకర్ణికార పుష్పము (కొండగోగుపూవు), వన శ్రియః - ఉద్యాన లక్ష్మికి, కనకాభరణస్య - బంగారు నగకు, ప్రతినిధిః - బదులుగా నుండెనో, దలకేసర పేశలం - దళములయందును, కింజల్కములయందును, మిక్కిలి మెత్తనిదియగు, ఆహితం - ప్రియులచేత తేబడిన, తత్ - ఆ కర్ణికార పుష్పమును, యువతయః - పడుచులు, అలకే - ముంగురులయందు, దధుః - ధరించిరి బంగారు నగవలె ప్రకాశించుచున్న కొండగోగు పూవును ప్రియులుతెచ్చి యీయగా పడుచులు తమ ముంగురులపై ధరించిరి. ఇచ్చట కర్ణికారముయొక్క రంగు, సౌకుమార్యము తెలుప బడినవి. అది చొక్కపు బంగారువలెను, అగ్నిజ్వాల వలెను ప్రకాశించును. దాని దళములు సన్నగా దారములంతటివిగా మృదువుగా నుండును. కొంచెము పెదది గనుక యువతు లొక్కొక్క పువ్వునే ముంగురులయందు ముడుచుకొనిరట. మార్దవము గల యీ పుష్పము పరిమళము లేనిదైనను కాళిదాసుకు ప్రియమైనట్టిది. "వర్ణ ప్రకర్షే సతి కర్ణికారం దునోతి నిర్గంధతయాస్మచేతః" అని కుమారసంభవము నందు దీనికి పరిమళమును లేకుండ సృజించినందులకు బాధపడుచు బ్రహ్మను నిందించెను.

శ్లో. అలిభి రంజనబిందు మనోహరైః
కుసుమ పంక్తి నిపాతిభి రంకితః
న ఖలు శోభయతిస్మ వనస్థలీం
న తిలక స్తిలకః ప్రమదా మివ. 41

వ్యాఖ్య: అంజన బిందు మనోహరైః - కాటుక చుక్కలవలె నందమైన వియు, కుసుమపంక్తి నిపాతిభిః - పువ్వుల వరుసలపై బడుచున్నవియు నగు, అలిభిః - తుమ్మెదలచేత, అంకితః - చిహ్నములు గలిగిన, తిలకః - తిలకపు చెట్టు, వనస్థలీం - ఉపవనస్థలిని (ఇచ్చట స్థల శబ్దము స్త్రీ లింగముగా వాడబడినది, దానినట్లే గ్రహించుట యుచితము), తిలకః - పుట్టుమచ్చ, ప్రమదాం ఇవ -

యువతినివలె, నోభయతిన్మ నఖలు - అలంకరింపలేదనునది లేదుసుమా ! ఎక్కువగా నలంకరించెనని యర్థము. తుమ్మెదలు వ్రాలిన తిలకపుచెట్టు వనస్థలిని, పుట్టుమచ్చ యువతి నలంకరించినట్లు ప్రకాశింపఁ జేసెనని భావము.

శ్లో. అమదయ న్మధుగంధ సనాథయా
కిసలయాధర సంగతయా మనః
కుసుమ సంభృతయా నవమల్లికా
స్మితరుచా తరు చారువిలాసినీ. 42

వ్యాఖ్య: తరుచారు విలాసినీ—తరు - వృక్షమునకు (పురుషునికి), చారు విలాసినీ - అందమైన వయ్యారియగు, నవమల్లికా - విరజాజితీగ, మధుగంధ సనాథయా—మధు - మకరందముయొక్క (మద్యముయొక్క), గంధసనాథయా-గంధముతోఁ గూడినదియు, కిసలయాధర సంగతయా—కిసలయాధర - చిగురనెడు పెదవియందు (చిగురువంటి పెదవియందు), సంగతయా - ప్రసరించినదియు, కుసుమ సంభృతయా - పువ్వులచేత సంపాదింపబడినదియు (పుష్పరూపమైనదియగు), స్మితరుచా - చిఱునగవు వంటి కాంతిచేత (చిఱునవ్వుచేత), మనః - చూచువారి మనస్సును, అమదయత్ - మత్తెక్కించెను. నవ మల్లికా లత మకరంద పరిమళముతో చిగురులపైని పువ్వులతో వృక్షము నల్లుకొని యుండగా నది మద్యపానముచేసిన యువతినిబోలుచు ప్రియునిఁ గౌఁగిలించుకొన్నట్లుండి చూచువారికి మత్తెక్కించెనట. ఇచ్చట నవమల్లికయందు నాయికా ధర్మము లారోపింపఁబడినవి.

శ్లో. అరుణరాగ నిషేధిభి రంశుకైః
శ్రవణ లబ్ధ పదైశ్చ యవాంకురైః
పరభృతావిరుతైశ్చ విలాసినః
స్మరబలై రబలైకరసాః కృతాః. 43

వ్యాఖ్య: విలాసినః - భోగ పరాయణులైన పురుషులు, అరుణరాగ నిషేధిభిః - తిరస్కరించునవియగు (కుసుంభరాగము గల, చెంగావి రంగుగల), అంశుకైః - వస్త్రములచేతను, శ్రవణలబ్ధపదైః—శ్రవణ - చెవులయందు, లబ్ధ

డికి వెనుకకును ముందునకును వచ్చుచు పోవుచున్న రెండు గొప్ప సముద్ర తరంగముల కదలికవలె మనోహరముగా నుండెననియు భావము.

శ్లో. పరేణ భగ్నేఽపి బలే మహాజాః
యయౌ వజః ప్రత్యరిసైన్య మేవ
ధూమో నివర్త్యేత సమీరణేన
యతస్తు కక్షస్తత ఏవ వహ్నిః. 55

వ్యాఖ్య: బలే - తన సైన్యము, పరేణ - శత్రుసైన్యముచేత, భగ్నేఽపి- పరాజయము నొందినదైనను; మహాజాః - మహాబల సంపన్నుఁడైన, అజిః - అజుఁడు, అరిసైన్యం, ప్రతి, ఏవ - శత్రుసైన్యము మీదికే, యయౌ - వెళ్లెను, సమీరణేన - గాలిచేత, ధూమః - పొగ, నివర్త్యేత - మరలింపబడవచ్చును (గడ్డిపరకల మీదినుండి పొగను గాలిప్రక్కకు త్రోయఁ గలుగవచ్చును). వహ్నిః తు - అగ్నియైనచో, యతః - ఎచ్చట, కక్షః - గడ్డికలదో, తతః ఏవ - అచ్చటనే జ్వలించును. సైన్యము పొగవలె చలించినను, ఆజుఁ డగ్నివలె చలింపక శత్రు సైన్యమును దహించెనని భావము.

శ్లో. రథీ నిషంగీ కవచీ ధనుష్మాన్
దృప్తః స రాజన్యక మేకవీరః
నివారయామాస మహోవరాహః
కల్పక్షయోద్వృత్త మివార్ణవాంభః. 56

వ్యాఖ్య: రథీ - రథారూఢుడు, నిషంగీ - తూణీరమును (అమ్ముల పొదిని) ధరించినవాఁడును, కవచీ - మంచి కవచమును దొడిగిన వాడును, ధనుష్మాన్ - ధనుర్ధరుఁడును, దృప్తః - రణ గర్వితుఁడును, ఏకవీరః - అసహాయ శూరుఁడును నగు, సః - ఆ యజమహారాజు, రాజన్యకం - రాజ సమూహమును, మహా వరాహః - వరహావతారమునెత్తిన విష్ణువు, కల్పక్షయోద్వృత్తం - ప్రళయ కాలమునందు చెలియలికట్టలు దాటి యెగసి పడుచున్న, అర్ణవాంభః ఇవ సముద్ర జలమునువలె, నివారయామాస - వెనుకకు నెట్టివేసెను. అజుఁడు శత్రు సైన్యమును వెనుకకు నెట్టివేసెను. కల్పమనగా బ్రహ్మకల్పము (సృష్టి); దానిక్షయము ప్రళయము.

శ్లో. స దక్షిణం తూణముఖేన వామం
వ్యాపారయన్ హస్త మలక్ష్య తాజౌ
ఆకర్ణకృష్టా సకృ దస్య యోద్ధుః
మౌర్వీవ బాణాన్ సుషువే రిపుఘ్నాన్. 57

వ్యాఖ్య: సః - ఆ యజుఁడు, ఆజౌ - యుద్ధమునందు, దక్షిణం. హస్తం - కుడిచేతిని, తూణముఖేన - తూణీర రంధ్రముతో, వామం - అతి సుందరముగా, వ్యాపారయన్ - పనికలదానినిగా చేయుచున్నవాఁడై, అలక్ష్యత - ఇతరులచేత చూడఁబడెను (అతని కుడిచేయి అమ్ములపొది రంధ్రమువద్ద కదలు చున్నట్లు కనపడుచుండెనే కాని బాణములు తీయుట వేయుట మొదలైన కదలికలు కనఁ బడకుండెను) సకృత్ - ఒకప్పుడు, ఆకర్ణకృష్టా - చెవివరకును లాగఁ బడినదియగు, యోద్ధుః, అస్య, మౌర్వీ - యుద్ధవీరుఁడగు నతని యల్లెత్రాడు, రిపుఘ్నాన్ - శత్రువులను చంపునట్టి, బాణాన్ - శరములను, సుషువే, ఇవ - ప్రసవించినదివలె నుండెను (మౌర్వి నుండి బాణములు బయలుదేరుటయే తప్ప వాని నతఁడు నిషంగమునుండి తీసి సంధించినది కనపడకుండెనని భావము. అనఁగా నంతవేగముగా శరసంధానాదులు జరిగినవని తాత్పర్యము). అలంకారము: ఉత్ప్రేక్ష. 'మౌర్వీ' స్త్రీ లింగము కనుక బాణములను ప్రసవింపఁ గలిగినది.

శ్లో. స రోషదష్టాధిక లోహితోష్ఠైః
వ్యక్తోర్ధ్వరేఖా భ్రుకుటీ ర్వహద్భిః
తస్తార గాం భల్లనికృత్త కంఠైః
హుంకారగర్భైః ద్విషతాం శిరోభిః. 58

వ్యాఖ్య: సః - ఆ యజుఁడు, రోషదష్టాధిక లోహితోష్ఠైః - క్రోధము చేత కొఱుకబడి యెక్కువ యెఱ్ఱబారిన పెదవులు గలవియును, వ్యక్తోర్ధ్వ రేఖాః - స్పష్టముగాఁ గనపడుచున్న ఊర్ధ్వరేఖలుగలవియు నగు, భ్రుకుటీః - బొమముడు లను, వహద్భిః - కలిగియున్నట్టివియు, భల్లనికృత్త కంఠైః - బల్లెములచేత తెగ వేయఁబడిన కంఠములు గలవియు, హుంకారగర్భైః-'హుం' అని పలుచున్నవియు నగు, ద్విషతాం, శిరోభిః - శత్రువులయొక్క శిరస్సులచేత, గాం - భూమిని,

తస్తార - పరచివేసెను. క్రోధముచేత పెదవులు గఱచిపట్టి, బొమముడులు వేసికొని తెగిపడిన శత్రువుల తలలతో అజుఁడు భూమిని పరచివేసెనని భావము.

శ్లో. సైన్యై ర్బలాంగై ర్ద్విరద ప్రధానైః
సర్వాయుధైః కంకటభేదిభిశ్చ
సర్వప్రయత్నేన చ భూమిపాలాః
తస్మిన్ ప్రజహ్రుు ర్యుధి సర్వ ఏవ. 59

వ్యాఖ్య: ద్విరద ప్రధానైః-ఏనుగులు మొదలయిన, సైన్యైః, బలాంగైః-అన్ని సేనాంగములచేతను, కంకటభేదిభిః - కవచములను జీల్చగల, సర్వాయుధైశ్చ - అన్ని ఆయుధములచేతను, సర్వప్రయత్నేనచ - సమస్త ప్రయత్నము చేతను, సర్వఏవ (సర్వే+ఏవ) - అందరునుగూడ, భూమిపాలాః - రాజులు, యుధి - యుద్ధమునందు, తస్మిన్ - ఆ యజునియందు, ప్రజహ్రుుః - ఎక్కువగా కొట్టిరి (అతనిని కొట్టిరని యర్థము). ఒకనిపై నందఱు గవిసిరి. ఇచ్చట 'తస్మిన్' అను సప్తమ్యంతము, 'తం' అను ద్వితీయా విభక్త్యర్థమునందు ప్రయోగింపఁబడినది. అతని పైఁబడి కొట్టిరనిభావము.

శ్లో. సోఽస్త్రవ్రజై శ్ఛన్నరథః పరేషాం
ధ్వజాగ్ర మాత్రేణ బభూవ లక్ష్యః
నీహార మగ్నో దిన పూర్వభాగః
కించిత్ ప్రకాశేన వివస్వతేవ. 60

వ్యాఖ్య: పరేషాం - శత్రువులయొక్క, అస్త్రవ్రజైః - బాణ సమూహములచేత, ఛన్నరథః - కప్పిచేయబడిన రథముగల, సః - ఆ యజుఁడు, నీహారమగ్నః - మంచుచేత ముంచివేయఁబడిన, దినపూర్వభాగః - ప్రాతఃకాలము, కించిత్ ప్రకాశేన-కొంచెముగా కనపడుచున్న, వివస్వతేవ (వివస్వతా+ఇవ) సూర్యునిచేతవలె, ధ్వజాగ్రమాత్రేణ - రథ పతాకముయొక్క చివరి భాగము చేత మాత్రము, లక్ష్యః - కనపడువాడు, బభూవ - అయ్యెను. ఆ పతాకాగ్ర భాగముతప్ప మరి యేదియు చూపఱులకు గానరాకుండెనని భావము.

శ్లో. ప్రియంవదాత్ ప్రాప్త మసౌ కుమారః
ప్రాయుంక్త రాజ స్వధిరాజసూనుః
గాంధర్వ మస్త్రం కుసుమాస్త్ర కాంతః
ప్రస్వాపనం స్వప్న నివృత్త లౌల్యః. 61

వ్యాఖ్య: అధిరాజసూనుః - మహారాజపుత్రుఁడును, కుసుమాస్త్ర కాంతః - మదన సుందరుఁడును, స్వప్న నివృత్తలౌల్యః—స్వప్న - నిద్రనుండి, నివృత్త - మరలిన, లౌల్యః - చాపల్యము గలవా డునునగు (అనగా జాగరూకుఁడు), అసౌ కుమారః - ఈ అజమహారాజు, ప్రియంవదాత్ - పూర్వముచెప్పిన ప్రియంవదుఁడును గంధర్వునివలన, ప్రాప్తం - లభించిన, గాంధర్వం - గంధర్వ దేవతాక మైనదియు, ప్రస్వాపనం - నిద్రింపఁ జేయునదియునగు, అస్త్రం - అస్త్రమును, రాజసు - రాజులమీద, ప్రాయుంక్త - ప్రయోగించెను. మిక్కిలి జాగ్రత్తగల యతఁడు వారి పై తనవద్దనున్న గాంధర్వాస్త్రమును ప్రయోగించెను. అజుఁడు స్వయంవరార్థము భోజరాజధానికి బయలుదేరినప్పుడు దారిలో నర్మదానది నుండి లేచి వచ్చిన వనగజముగా నుండిన గంధర్వుఁడే యీ ప్రియంవదుఁడు. అట్టి అస్త్రమువేసి ఆ రాజులందఱును మూర్ఛిల్లునట్లు చేసెనని భావము.

శ్లో. తతో ధనుష్కర్షణ మూఢ హస్త
మేకాంస పర్యస్త శిరస్త్ర జాలమ్
తస్థౌ ధ్వజస్తంభ నిషణ్ణ దేహం
నిద్రావిధేయం నరదేవ సైన్యమ్. 62

వ్యాఖ్య: తతః - తర్వాత, ధనుష్కర్షణమూఢహస్తం—ధనుష్కర్షణ - చాపమును లాగుటయందు, మూఢహస్తం - పనిచేయని చేతులు కలదియును, ఏకాంస పర్యస్త శిరస్త్రజాలం—ఏకాంస - ఒక బుజముమీద, పర్యస్త - జారి పడిన, శిరస్త్రజాలం - కిరీటములు కలదియును, ధ్వజస్తంభ నిషణ్ణదేహం - తమ తమ జెండా కట్టలమీద జేరఁగిలబడిన శరీరములు కలదియునగు, నరదేవసైన్యం - శత్రురాజులయొక్క సైన్యము, నిద్రావిధేయం - నిద్రకు వశమైనదియై, తస్థౌ - కదలక నిలచిపోయెను. అనగా ప్రతిసైనికుఁడును ధనుస్సును లాగలేక, కిరీటము

భుజముపై జాటి, జెండాకొయ్యకుఁ జేరగిలపడి, నిద్రపోయెనట; అనగా మూర్ఛిల్లె వని భావము.

శ్లో. తతఃప్రియోపాత్తరసే ఽధరోష్ఠే
నివేశ్య దధ్మౌ జలజం కుమారః
తేన స్వహస్తార్జిత మేకవీరః
పిబన్ యశో మూర్త మివావభాసే. 63

వ్యాఖ్య: తతః - పిమ్మట, కుమారః - అజుఁడు, ప్రియోపాత్తరసే— ప్రియా - ప్రియురాలైన యిందుమతిచేత, ఉపాత్త - ఆస్వాదింపబడిన, రసే - మాధుర్యముగల, అధరోష్ఠే - క్రింది పెదవిమీద, జలజం - శంఖమును, నివేశ్య- ఉంచుకొని, దధ్మౌ - పూరించెను, తేన - ఆ శంఖముచేత, ఏకవీరః - అసహాయ శూరుడైన యతఁడు, స్వహస్తార్జితం - తనచేతితో సంపాదింప బడినదియు, మూర్తం - ఒక స్వరూపము ధరించినదియునగు, యశః - కీర్తిని, పిబన్, ఇవ - త్రాగుచున్నవాఁడువలె, అవభాసే - ప్రకాశించెను (యశస్సు తెల్లనిది కనుక శంఖము మూర్తిమంతమైన యశస్సుగా నూహింపఁబడినది). 'జలజ' శబ్దమునకు కమల మనియు, శంఖ మనియు నర్థములు. విజయసూచక శంఖారావమును జేసె నని భావము.

శ్లో. శంఖస్వనాభిజ్ఞతయా నివృత్తాః
తం సన్నశత్రుం దదృశుః స్వయోధాః
నిమీలితానా మివ పంకజానాం
మధ్యే స్ఫురంతం ప్రతిమాశశాంకమ్. 64

వ్యాఖ్య: శంఖ స్వనాభిజ్ఞతయా - ఆ శంఖ నాదము నెఱిఁగి యుండుట చేత, నివృత్తాః - వెనుకకు మరలివచ్చిన. స్వయోధాః - తన సైనికులు, సన్న శత్రుం - మూర్ఛితులైన శత్రువులుగల, తం - ఆ యజమహారాజును, నిమీలి తానాం - ముకుళించినట్టి, పంకజానాం - కమలములయొక్క, మధ్యే - మధ్య ప్రదేశమునందు, స్ఫురంతం - ప్రకాశించుచున్న, ప్రతిమాశశాంకం, ఇవ - ప్రతి బింబరూపమున నున్న చంద్రునివలె, దదృశుః - చూచిరి. చంద్రుఁడున్న సమయ

మున కమలములు ముకుళించును కనుక కనులు మూసుకొని పడియున్న శత్రుముఖ ముల నడుమ ప్రకాశించుచున్న అజుఁడు చంద్రుని ప్రతిబింబముగా నూహింపఁ బడినాడు. అట్లున్న యజుని వెనుకకు మరలివచ్చిన యతని సైనికులు సంతోషమున జూచిరి.

శ్లో. సశోణితైస్తేన శిలీముఖాగ్రైః
నిక్షేపితాః కేతుషు పార్థివానామ్
"యశో హృతం సంప్రతి రాఘవేణ
న జీవితం వః కృపయేతి" వర్ణాః. 65

వ్యాఖ్య: సంప్రతి - ఇప్పుడు, రాఘవేణ - రఘుకుమారుఁడైన అజుని చేత (పూర్వము రఘు మహారాజుచేత నని భావము), హే రాజానః - ఓ రాజులారా! వః - మీయొక్క, యశః - కీర్తి, హృతం - హరింపఁ బడినది, జీవితం - ప్రాణము, కృపయా - దయచేత, న - హరింపఁ బడలేదు, ఇతివర్ణాః - ఈ విధమైన అక్షరములు, సశోణితైః - రక్తముతో తడిసిన, శిలీముఖాగ్రైః - బాణాగ్రములచేత, తేన - ఆ యజునిచేత, పార్థివానాం - మూర్ఛితులైన రాజుల యొక్క, కేతుషు - జెండాలమీద, నిక్షేపితాః - వ్రాయింపబడినవి". ఓ రాజులారా! రఘు కుమారుఁడైన యజునిచేత మీకీర్తి మాత్రమే హరింపఁ బడినది, దయచేత మీ ప్రాణములు హరింపఁ బడలేదు" అను వాక్యమును రక్తముతో వారి ధ్వజస్తంభములమీద వ్రాయించెను. అది చూచుకొని వారు తమ తమ రాజ్యములకు వెళ్లిపోవలయునని యభిప్రాయము.

శ్లో. స చాపకోటీ నిహితైకబాహుః
శిరస్త్ర నిష్కర్షణ భిన్న మౌలిః
లలాటబద్ధ శ్రమవారి బిందుః
భీతాం ప్రియా మేత్య వచో బభాషే. 66

వ్యాఖ్య: చాపకోటీ నిహితైకబాహుః — చాపకోటీ - వింటికప్పుమీద, నిహిత - ఉంచబడిన, ఏకబాహుః - ఒక బాహువు కలవాడును, శిరస్త్ర నిష్కర్షణ భిన్నమౌలిః — శిరస్త్ర నిష్కర్ష - కిరీటమును తీయుటచేత, భిన్నమౌలిః - చెదరిన

జుట్టు కలవాఁడును, లలాటబద్ధ శ్రమవారిబిందుః - లలాటమునందు నిల్చిన చెమట చుక్కలు కలవాఁడును నగు. సః - ఆ యజమహారాజు, భీతాం - భయపడి యున్న, ప్రియాం - ప్రియురాలైన యిందుమతిని, ఏత్య - చేరి, వచః బభాషే - మాట్లాడెను. యుద్ధమును విరమించిన యుజుడు వింటికొప్పుపై బాహువును పెట్టుకొని కిరీటముతీసి చెదరిన జుట్టుతో చెమటపట్టిన ముఖముతో ఇందుమతిని పలుకరించెను. అంతవఱకు యుద్ధాసక్తుఁడై ప్రియురాలినిసైతము పలుకరింపలేదని భావము. ఇందులో అజునిమూర్తి చక్కగా చిత్రింపఁబడినది.

అవ: ఏమని భాషించెనో చెప్పుచున్నాడు.

శ్లో. ఇతఃపరా నర్భక హార్య శస్త్రాన్
వైదర్భి! వశ్యానుమతా మయాసి
ఏవం విధేనాహవ చేష్టితేన
త్వాం ప్రార్థ్యసే హస్తగతా మమైభిః. 67

వ్యాఖ్య: హే వైదర్భి! - ఓ యిందుమతీ! ఇతః - ఇటువైపున, అర్భక హార్య శస్త్రాన్ - పసివానిచేత గూడ నెత్తుకుపోవుటకు వీలైన శస్త్రములుగల, పరాన్ - శత్రువులను, పశ్య - చూడుము, మయా - నాచేత, అనుమతా, అసి - చూచుట కంగీకరింపఁ బడితివి (నీవు చూడవచ్చును), ఏభిః - ఈ రాజులచేత, ఏవంవిధేన - ఈ విధమైన (నిద్రారూపమైన), చేష్టితేన - రణకర్మచేత, మమ, హస్తగతా - నా చేతిలోనున్న, త్వం - నీవు, ప్రార్థ్యసే - కోరబడుచున్నావు (అపహరింప దలపబడుచున్నావు). అనగా ఇంత శౌర్య హీనులైన వీరు నిన్ను నా చేతినుండి తప్పించి యెత్తుకుపోదలఁచి యున్నారని చేతితో వారిని జూపుచు ఇందుమతితో పరిహాస పూర్వకముగా భాషించెను. పసిపిల్లలుగూడ ఇప్పుడు వారి చేతిలోని శస్త్రములను లాగుకొనవచ్చును, కనుక నీవు నిర్భయముగా చూడుమని భావము.

శ్లో. తస్యాః ప్రతిధ్వందిభవా ద్విషాదాత్
సద్యో విముక్తం ముఖ మాబభాసే
నిశ్వాస బాష్పాపగమా త్ప్రపన్నః
ప్రసాద మాత్మీయ మివా త్మదర్శః. 68

వ్యాఖ్య: ప్రతిద్వంది భవాత్ - శత్రువులవలన కలిగిన, విషాదాత్ - దైన్యమునుండి, సద్యః - వెంటనే, విముక్తం - విడువఁబడిన, తస్యాః, ముఖం- ఆ యిందుమతియొక్క ముఖము, నిశ్వాస బాష్పాపగమాత్ - నిట్టూర్పు యొక్క ఆవిరి తొలఁగిపోవుట వలన, ఆత్మీయం - తనదియైన, ప్రసాదం - నిర్మలత్వ మును, ప్రపన్నః - పొందిన, ఆత్మదర్శః, ఇవ - అద్దమువలె, ఆబభాసే - చక్కగా ప్రకాశించెను. ఆ మాటలువిని దుఃఖమును విడిచిన ఇందుమతి ముఖము ప్రసన్నమై దర్పణము వలె ప్రకాశించెను. "ఆత్మదర్శః" అనగా అద్దము, ఆత్మా - స్వరూపం, దృశ్యతే అనేన ఇతి ఆత్మదర్శః అని విగ్రహము. అనగా దీనిచేత మన స్వరూపము చూపబడునని యర్థము. దీనికి పర్యాయపదము "ఆదర్శము". "దర్పణే ముకురాదర్శౌ" అని యమరము.

శ్లో. హృష్టాఽపి సా హ్రీవిజితా న సాక్షాత్
వాగ్భిః సఖీనాం ప్రియ మభ్యనందత్
స్థలీ నవాంభఃపృషతాభివృష్టా
మయూరకేకాభి రివాభ్ర బృందమ్. 89

వ్యాఖ్య: సా - ఆ యిందుమతి, హృష్టాపి - భర్తయొక్క పౌరుషము చేత మిక్కిలి సంతోషించినదైనను, హ్రీవిజితా - సిగ్గుచేత జయింపఁబడినదియై యుండుటవలన (ముగ్ధ కావున ఇంకను సిగ్గే ఆమెకు ఎక్కువగా నుండెనని భావము), ప్రియం - పతియగు నజుని. సాక్షాత్ - తానుగా, న అభ్యనందత్ - మెచ్చుకొనలేదు, (కింతు - కాని), నవాంభఃపృషతాభివృష్టా—నవాంభఃపృషత - తొలకరి వాన చినుకులచేత, అభివృష్టా - బాగా వర్షింపఁబడిన (తడుపబడిన), స్థలీ - భూమి, అభ్రబృందం - మేఘ సంఘమును, మయూరకేకాభిః, ఇవ - నెమలికేకలచేత వలె, సఖీనాం, వాగ్భిః - చెలికత్తెల వాక్కులచేత (చెలుల పలు కులద్వారా) అభ్యనందత్ - ప్రశంసించెను. తొలకరి వర్షముచేత తృప్తిపడిన భూమి నెమలి కేకలద్వారా మేఘమును ప్రశంసించినట్లు, ముగ్ధయైన యిందుమతి, హర్షించినదైనను, సిగ్గుచేత తాను స్వయముగా గాక చెలికత్తెలద్వారా వీరాగ్రేసరు డైన యజునికి అభినందనములు తెలిపెనని భావము.

శ్లో. ఇతి శిరసి స వామం పాద మాధాయ రాజ్ఞాం
ఉదవహ దనవద్యాం తా మవద్యా దపేతః

రథ తురగ రజోభి స్తస్య రూక్షాలకాగ్రా
సమరవిజయలక్ష్మీ స్సైవ మూర్తా బభూవ 70

వ్యాఖ్య: అవద్యాత్, అపేతః - నింద్యమునుండి తొలఁగిన (నిర్దోషి యైన), సః - ఆ యజుఁడు, ఇతి - ఈ విధముగా (వెనుక చెప్పినట్లు), రాజ్ఞాం - రాజులయెక్క, శిరసి - తలమీద, వామం, పాదం - ఎడమకాలిని, ఆధాయ - ఉంచి (అందఱిని ఓడించి), అనవద్యాం - దోషరహితయైన, తాం - ఆ యిందుమతిని, ఉదవహత్ - తీసుకవెళ్లెను (తనదానినిగాఁ జేసికొనెను). తస్య - ఆ యజువికి, రథతురగరజోభిః - రథముల యొక్కయు, గుఱ్ఱముల యొక్కయు దుమ్ములచేత, రూక్షాలకాగ్రా—రూక్ష - గలుసుబాఱిన (మెత్తదనము పోయిన), అలకాగ్రా - ముంగురుల కొనలుగల, సైవ (సా + ఏవ) - ఆ యిందుమతియే, మూర్తా - శరీరమును ధరించిన, సమర విజయలక్ష్మీః - యుద్ధమునందు లభించిన విజయలక్ష్మి, బభూవ - అయ్యెను. అట్లు శత్రువుల నోడించి, తన రథముపైఁ దీసుక పోబడుచున్న యిందుమతి సైన్య ధూళిచే గలుసుబారిన ముంగురులు గలది యగుచు, విజయలక్ష్మి సాక్షాత్కరించి అజుని రథముపై నెక్కివచ్చుచున్న ట్లుండెనని భావము. అంతకంటె వేరైన విజయలక్ష్మి లాభమేమున్నది?

శ్లో. ప్రథమపరిగతార్థ స్తం రఘుః సన్నివృత్తం
విజయిన మభినంద్య శ్లాఘ్య జాయా సమేతమ్
తదుపహితకుటుంబః శాంతిమార్గోత్సుకోఽభూత్
న హి సతి కులదుర్యే సూర్యవంశ్యా గృహాయ. 71

వ్యాఖ్య: ప్రథమ పరిగతార్థః—ప్రథమ - అజుఁడు రాకముందే, పరిగత - తెలియబడిన, అర్థః - వివాహ, విజయరూపమైన విషయముగల. రఘుః - రఘు మహారాజు, విజయినం - విజయముతోఁ గూడిన వాఁడును, శ్లాఘ్యజాయా సమేతం - మెచ్చుకో దగిన భార్యతోఁ గూడిన వాఁడును, సంనివృత్తం - తిరిగి వచ్చిన వాఁడునునగు, తం - ఆ యజుని, అభినంద్య - అభినందించి, తదుపహిత కుటుంబఃసన్ - ఆ యజుని పోషణము నందుంచబడిన భార్య గలవాఁడగుచు (తన భార్యను కుమారుఁడైన యజునివద్దనుంచి), శాంతి మార్గోత్సుకః—శాంతిమార్గ -

మోక్షమార్గమునందు, ఉత్సుకః - అభిలాష గలవాఁడు. అభూత్ - అయ్యెను, హి - అదియుక్తమే, కులధుర్యే - ఇంటిని చక్కఁదిద్దగలవాఁడు లేదా కుటుంబభారమును మోయఁగలవాఁడు, సతి - ఉన్నవాఁడుకాగా, సూర్యవంశ్యాః - సూర్యవంశమునందు పుట్టిన రాజులు, గృహాయ - గృహస్థాశ్రమముకొఱకై, నభవంతి - ఉండరు. చారులద్వారా ముందే అజుని వృత్తాంతము నెఱిఁగిన రఘు మహారాజు ఆతడు రాగానే అభినందించి, విజయవంతుడు యోగ్యురాలైన భార్యగలవాడు నగు అజుని పోషణమునందు తల్లిని నిల్పి, తమ వంశాచారానుసారముగా మోక్షార్థమై వానప్రస్థాశ్రమమును స్వీకరించుటకు ఉద్యుక్తుఁడయ్యెను. "వార్ధకే మునివృత్తీనాం" అని పూర్వము చెప్పఁబడిన రీతిగా నని భావము.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ

కావ్యమున సప్తమ సర్గమునకు

తెలుఁగు లఘువ్యాఖ్య

మహాకవి కాళిదాసకృత రఘువంశము

అష్టమ సర్గము

శ్లో. అథ తస్య వివాహ కౌతుకం
లలితం బిభ్రత ఏవ పార్థివః
వసుధా మపి హస్తగామినీం
అకరో దిందుమతీ మివాపరామ్. 1

వ్యాఖ్య: అథ - తరువాత, పార్థివః - రఘుమహారాజు, లలితం - మనోహరమైన, వివాహకౌతుకం - వివాహ మంగళమును (వివాహ దీక్షాకంకణమును), బిభ్రతః, ఏవ - ధరించినవాఁడగుదుండగానే, తస్య - ఆ యజునికి, అపరాం - రెండవదియైన, ఇందుమతీం, ఇవ - ఇందుమతినివలె, వసుధాం, అపి - భూమిని గూడ, హస్తగామినీం - చేతికి వచ్చినదానిని (స్వాధీనమైన దానినిగా), అకరోత్ - చేసెను. వివాహదీక్షా కంకణ విసర్జనం చేయకమునుపే అజునిపై రాజ్యభారము నుంచి కోసలభూపతిని జేసెనని భావము.

శ్లో. దురితై రపి కర్తు మాత్మసాత్
ప్రయతంతే నృపసూనవో హి యత్
త దుపస్థిత మగ్రహీ దజః
పితు రాజ్ఞేతి న భోగతృష్ణయా. 2

వ్యాఖ్య: నృపసూనవః - రాజపుత్రులు, యత్ - ఏ రాజ్యమును, దురితైః, అపి - పాపకృత్యముల చేతఁగూడ (తండ్రికి, అన్నలకు విషముపెట్టుట, రహస్యముగా చంపుట మొదలైన అకృత్యములచేత నని యర్థము), ఆత్మసాత్, కర్తుం - స్వాధీనము చేసుకొనుటకొఱకు, ప్రయతంతేహి - ప్రయత్నించుచుం దురుగదా! ఉపస్థితం - అప్రయత్నముగా వచ్చిన, తత్ - అట్టి రాజ్యమును, అజః - అజుఁడు, పితురాజ్ఞేతి (పితుః + ఆజ్ఞా + ఇతి) - తండ్రియొక్క ఆజ్ఞగదా

అను కారణమువలననే, అగ్రహీత్ - స్వీకరించెను. భోగాభిలాషచేత గాక తండ్రి యాజ్ఞ అనుల్లంఘనీయమను కారణముచేతనే అజుఁడు రాజ్యభారమును వహించె నని భావము.

శ్లో. అనుభూయ వసిష్ఠసంభృతైః
సలిలై స్తేన సహాభిషేచనమ్
విశదోచ్ఛ్వసితేవ మేదినీ
కథయామాస కృతార్థతాం మివ. 3

వ్యాఖ్య: మేదినీ - భూమి, వసిష్ఠేన - వసిష్ఠమునిచేత, సంభృతైః - సంపాదింపఁ బడిన, సలిలైః - (చతుస్సముద్రములయు, మహానదులయు జల ములచేత) ఉదకములచేత, తేనసహ - ఆ యజమహారాజుతోఁ గూడ, అభిషే చనం - అభిషేకమును (స్నానమును), అనుభూయ - అనుభవించి, విశదోచ్ఛ్వసి తేన - స్ఫుటమైన నిట్టూర్పుచేత, కృతార్థతాం - తన ధన్యత్వమును, కథయామాస, ఇవ - చెప్పినదివలె నుండెను. అజునికి సమంత్రకముగా పట్టాభిషేకము జరిగినది. ఇచ్చట 'మేదినీ' శబ్దమువలన పట్టమహిషికానున్న యిందుమతియు నని ధ్వన్య ర్థము. జలసిక్తమైన భూమి వెచ్చని గాలిని పైకి విడుచుట సహజము. అది యిచ్చటభూదేవి ఉచ్ఛ్వాసముగను, అజునితో కలిసి పట్టాభిషేక సుఖము ననుభవిం చిన యిందుమతియొక్క ఆనంద నిర్మలోచ్ఛ్వాసముగను వర్ణింపఁ బడినది. ఇందు మతియు, భూదేవియు ధన్యం మన్యలైనారని తాత్పర్యము. భూదేవి యితని వల్లనే మిక్కిలి తృప్తురాలైనది పూర్వులైన దిలీపాదులచేత కాలేదని యర్థముకాదు, ఇది అజ ప్రశంసామాత్రపరము.

శ్లో. స బభూవ దురాసదః పరై
గురుణాఽథర్వవిదా కృతక్రియః
పవనాగ్ని సమాగమో హ్యయం
సహితం బిభ్మ్రి య దభ్రతేజసా. 4

వ్యాఖ్య: అథర్వవిదా - అథర్వ వేదము తెలిసిన, గురుణా - కుల గురు వగు వసిష్ఠునిచేత, కృతక్రియః - అథర్వ వేదోక్త విధానముచేత చేయఁబడిన అభి

షేక సంస్కారము గలవాఁడైన, సః - ఆ యజుఁడు, పరైః - శత్రువులచేత, దురాసదః - ఎదిఱించుటకు వీలులేనివాఁడు, బభూవ - అయ్యెను, (తథాహి - అది యుక్తమే), అస్త్రతేజసా - క్షాత్రతేజముచేత, సహితం - కూడిన, యత్, బ్రహ్మ - ఏ బ్రహ్మతేజమైతే కలదో, అయం - ఇది, పవనాగ్ని సమాగమః, హి - అగ్ని వాయువుల కలయికవంటిది గదా ! అజుఁడు క్షాత్రతేజముచేతనే శత్రువులకు ఎదిరింప వీలుపడనివాఁడు, ఇక నతనికి వసిష్ఠ మంత్ర ప్రభావముకూడ చేకూరిననాడు చెప్పవలసిన దేమున్నదని భావము. క్షాత్ర సహాయములేని బ్రహ్మతేజముగాని బ్రహ్మతేజస్సహాయము లేని క్షాత్రతేజము గాని వృద్ధిని జెందఁజాలవు. ఆ రెంటు కలిసి పనిచేయునప్పుడే యైహికా ముష్మికఫలము, దేశశ్రేయస్సు వృద్ధి చెందునని మనువు చెప్పెను. "నాక్షత్రం బ్రహ్మ భవతి, క్షత్రం నాబ్రహ్మ వర్ధతే, బ్రహ్మక్షత్రే తు సంయుక్తే ఇహాముత్ర చ వర్ధతే". అనగా విద్యా వైజ్ఞానిక బలము సైన్య బలము కలిసి పనిచేయుటయే ప్రజాసౌఖ్యమునకు మూలమగునని తాత్పర్యము.

శ్లో. రఘు మేవ నివృత్తయౌవనం
త మమన్యంత నవేశ్వరం ప్రజాః
స హి తస్య న కేవలం శ్రియం
ప్రతిపేదే సకలాన్ గుణా నపి. 5

వ్యాఖ్య: ప్రజాః - ప్రజలు, నవేశ్వరం - క్రొత్త ప్రభువైన, తం - ఆ యజుని, నివృత్తయౌవనం - తిరిగివచ్చిన యౌవనదశగల, రఘుమేవ - రఘు మహారాజును గానే, అమన్యంత - తలంచిరి, హి - ఎందువలన ననగా, సః - అజుఁడు, తస్య - ఆ రఘుమహారాజుయొక్క. కేవలాం, శ్రియం - ఒక రాజ్య లక్ష్మినే. న ప్రతిపేదే - పొందలేదు. సమాన్, గుణాన్ అపి - సమస్తమైన శౌర్యదాక్షిణ్యాది గుణములను సైతము ప్రతిపేదే - పొందెను. అజుఁడు సర్వ విధముల తండ్రిని పోలి యుండుటచేత నతనిని జూచినప్పుడు ప్రజలు రఘు మహారాజుకే తిరిగి యౌవనము వచ్చి యిట్లున్నాడా ? యని భావించుచుండిరని భావము. అలంకారము : ఉత్ప్రేక్ష.

శ్లో. ఆధికం ఋఋభే ఋభంయునా
ద్వితయేన ద్వ్యయ మేవ సంగతమ్
పద మృద్ధ మజేన పైతృకం
వినయేనాస్య నవం చ యౌవనమ్. 6

వ్యాఖ్య: ద్వయమేవ - ఒక జంటయే, శుభంయునా - శుభాన్వితమైన, ద్వితయేన - మరియొక జంటతో, సంగతం - కూడినదియై, ఆధికం - ఎక్కువగా, శుశుభే - ప్రకాశించెను, (ఏ జంట యే జంటతోననగా) పైతృకం - తండ్రి నుండి వచ్చినదియు, ఋద్ధం - సమృద్ధిగల, పదం - రాజ్యస్థానము, అజేన - అజునితోను, అస్య - అజునియొక్క, నవం, యౌవనం - నూతనమైన యౌవనము, వినయేనచ - ఇంద్రియ నిగ్రహ రూపమైన వినయముతోను అని. రాజ్యమునకు అజుఁడు అలంకారముగాను, అజునికి వినయము అలంకారముగాను ఉండెనియు, రాజ్యలాభము వలన ఒక ప్రాకృతునివలె అజుఁడు గర్వము పొందినవాఁడు కాలేదనియు తాత్పర్యము.

శ్లో. సదయం బుభుజే మహోభుజః
సహసోద్వేగ మియం వ్రజేదితి
అచిరోపనతాం స మేదినీం
నవ పాణిగ్రహణాం వధూ మివ. 7

వ్యాఖ్య: మహాభుజః, సః - పరాక్రమవంతుఁడైన ఆ యజుఁడు, అచిరోపనతాం - క్రొత్తగాఁ దనను చేరిన, మేదినీం - భూమిని, నవపాణిగ్రహణాం - క్రొత్తగా వివాహమైన, వధూంఇవ - స్త్రీనివలె, సహసా (చేత్) - బలాత్కారముచేత నైనచో, ఇయం - ఈమేదిని, ఉద్వేగం - భయమును, వ్రజేత్ - పొందవచ్చును, ఇతి - అనుకారణమున, సదయం - దయగలుగునట్లుగా, బుభుజే - అనుభవించెను. నవవధూ సమాగమమునందు బలాత్కారము పనికి రానట్లే, నూతన రాజ్యానుభవమునందు కర్కశ కఠిన కోపములు పనికిరావు కనుక దయాపూర్వకముగా ప్రజాపాలనము చేయుట కారంభించెనని భావము. ఇచ్చట మేదినీ శబ్దము నవవధువుతో పోల్చఁబడుట రమణీయముగా నుండుటయేకాక క్రొత్తగా రాజ్యమునకు వచ్చిన వాఁడెట్లు ప్రవర్తింపవలెనో సూచింపఁబడినది. కాళిదాసు సందేశములన్నియు నిట్లే లలిత లలితములుగా నుండును. అదియేగదా కావ్యమునందలి కాంతాసమ్మితత్వము.

శ్లో. అహా మేవ మతో మహీపతే
రితి పర్యాః ప్రకృతి ష్వచింతయత్

ఉదధే రివ నిమ్న గాశతే

ష్వభవన్నాస్య విమాననా క్వచిత్. 8

వ్యాఖ్య: ప్రకృతిషు - ప్రజలయందు, సర్వః - ప్రతివాఁడును, అహ మేవ - నేనే, మహీపతేః - రాజునకు, మతః - ఇష్టమైనవాఁడను, ఇతి - ఇట్లని, అచింతయత్ - తలంచెను, ఉదధేః - సముద్రమునకు, నిమ్నగాశతేషు, ఇవ - నదీ శతములయందువలె (అనేక నదులయందు వలె), అస్య - ఈ అజమహా రాజునకు, క్వచిదపి - ఎవనియందును, విమాననా - తిరస్కారము, న అభవత్ - లేకుండెను. అజుఁ డెవనినికూడా తక్కువవాఁడుగా చూచుట లేనందున, ప్రతి వాఁడును తానే ప్రభువునకు సమ్మతమైన వాఁడనని తలంచుచుండెనని భావము.

శ్లో. న ఖరో న చ భూయసా మృదుః

పవమానః పృథివీరుహానివ

స పురస్కృత మధ్యమ క్రమో

నమయామాస నృపా ననుద్ధరన్. 9

వ్యాఖ్య: సః - ఆ యజుఁడు, భూయసా - ఎక్కువగా, ఖరః - తీక్ష్ణ మైనవాఁడు, న - కాడు, మృదుః చ - మెత్తని వాఁడును, న - కాఁడు, పుర స్కృత మధ్యమక్రమః సన్ - అంగీకరింపఁబడిన మధ్యమ పరిపాటిగల వాఁ డగుచు, పవమానః - వాయువు, పృథివీరుహాన్, ఇవ - వృక్షములను వలె, శత్రురాజులను, అనుద్ధరన్ - పైకి లాగకయే (పదవీ భ్రష్టులను చేయకయే), నమయామాస - వంచెను (లొంగునట్లు చేసెను) వాయువు వృక్షములను పెకలిం పక వంచినట్లు అజుఁడు పరరాజులను నిర్మూలించుట మాని తనకు లొంగునట్లు మాత్రము చేసెనని భావము. అది రాజనీతి గదా!

శ్లో. అథ వీక్ష్య రఘుః ప్రతిష్ఠితం

ప్రకృతిష్వాత్మజ మాత్మవత్తయా

విషమేషు వినాశధర్మసు

ప్రతివస్తేష్వపి నిస్పృహో ఽభవత్. 10

వ్యాఖ్య: అథ - పిమ్మట, రఘుః - రఘుమహారాజు, ఆత్మజం - పుత్రుని, ఆత్మవత్తయా - నిర్వికార మనస్కుఁడగుటచేత, ప్రకృతిషు - అమాత్యాదులయందు, ప్రతిష్ఠితం - దృఢముగా నిలుపఁబడిన వానినిగా, వీక్ష్య - చూచి (గ్రహించి), వినాశ ధర్మసు - నశించు స్వభావము గలవియగు (అనిత్యము లగునవి), త్రిదివస్థేష్వపి - స్వర్గమునం దున్నవియైనను, విషయేషు - భోగ్యవస్తువులయందు, నిస్పృహః - వాంఛ లేనివాఁడు, అభవత్ - అయ్యెను. కుమారుఁడు రాజ్యమునందు సుప్రతిష్ఠితుఁడై యిక నా సహాయ మక్కఱలేక యున్నాఁడని తోచినపిమ్మట రఘు మహారాజు విషయవాంఛలు విడిచి సంసారమునందు విరక్తుఁడయ్యెనని భావము.

శ్లో. గుణవత్సుత రోపిత శ్రియః
పరిణామే హి దిలీపవంశజాః
పదవీ తరువల్కవాససాం
ప్రయతాః సంయమినాం ప్రపేదిరే. 11

వ్యాఖ్య: దిలీప వంశజాః - దిలీపుని వంశమున పుట్టినవారు, పరిణామేహి - వార్ధక్యమునందు, గుణవత్సుత రోపితశ్రియః - గుణవంతులైన కుమారుల యందు ఉంచబడిన రాజ్యలక్ష్మి కలవారై, ప్రయతాః - నియమవంతులునై, తరువల్కవాససాం - వల్కములే వస్త్రములుగాగల, సంయమినాం - యతీశ్వరుల యొక్క, పదవీం - మార్గమును, ప్రపేదిరే - అనుసరించిరి. దిలీపవంశజు లందును వార్ధక్య దశయందు మునివృత్తి నవలంబించుట పరిపాటి గావున రఘుమహారాజు సైతము యత్యాశ్రమమును స్వీకరించుటకు సిద్ధపడెనని భావము. 'వల్క' శబ్దము 'వల్కల' శబ్దమునకు రూపాంతరము.

శ్లో. తమరణ్య సమాశ్రయోన్ముఖం
శిరసా వేష్టనశోభినా సుతః
పితరం ప్రణిపత్య పాదయోః
అపరిత్యాగ మయాచ తాత్మనః. 12

వ్యాఖ్య: అరణ్య సమాశ్రయోన్ముఖం - వనవాసమునకు సంసిద్ధుఁడైన, పితరం, తం - తండ్రియైన ఆ రఘుమహారాజును, సుతః - కుమారుఁడైన

యజు(డు. వేష్టన శోభినా - తలపాగ చేత అందముగానున్న, శిరసా - శిరస్సుచేత, పాదయోః - పాదములమీద, ప్రణిపత్య - పడి (నమస్కరించి), ఆత్మనః - తన యొక్క, అపరిత్యాగం - విడువకుండుటను, అయాచత - కోరెను. అజు(డు తండ్రి కాళ్లపై(బడి తనను విడిచిపెట్టి వనమునకు వెళ్లవద్దని ప్రార్థించెనని భావము.

శ్లో. రఘు ర శ్రుము ఖస్య తస్య తత్
కృతవా నీప్సిత మాత్మజ ప్రియః
న తు సర్ప ఇవ త్వచం పునః
ప్రతిపేదే వ్యపవర్జితాం శ్రియమ్. 13

వ్యాఖ్య: ఆత్మజప్రియః - పుత్రవాత్సల్యముగల వా(డగు, రఘుః - రఘు మహారాజు, అశ్రుముఖస్య - కన్నీరు గారుచున్న ముఖము గలవా(డగు, తస్య - ఆ యజునియొక్క, తత్ - ఆ యపరిత్యాగ రూపమైన, ఈప్సితం - కోరికను, కృతవాన్ - తీర్చెను, తు - కాని, సర్పః - పాము, త్వచం ఇవ - తన కుబుస మునువలె, వ్యపవర్జితాం - విడిచిపెట్టబడిన, శ్రియం - రాజ్యసంపదను, పునః - మరల, న ప్రతిపేదే - స్వీకరింపలేదు. రఘుమహారాజు రాజ్యసంపదను మరల స్వీకరింపని పద్ధతిలో కుమారునికి సమీపముగా నుండుట కిష్టపడెను.

శ్లో. స కిలాశ్రమ మంత్య మాశితో
నివసన్నావసథే పురా బ్బహిః
సముపాస్యత పుత్రభోగ్యయా
స్నుషయేవా ఽధికృతేంద్రియః శియా. 14

వ్యాఖ్య: సః - ఆ రఘుమహారాజు, అంత్యం ఆశ్రమం - చివరిదియగు నాశ్రమమును (సన్యాసాశ్రమమును), ఆశ్రితః - స్వీకరించిన వా(డై, పురాత్ బహిః - నగరమునకు వెలుపటనున్న, ఆవసథే - స్థానమునందు, నివసన్ - నివసించుచున్నవా డగుచు, అధికృతేంద్రియః - జితేంద్రియు(డై, స్నుషయేవ (స్నుషయా + ఇవ) - కోడలిచేతవలె, పుత్రభోగ్యయా - కుమారుని చేత మాత్రమే అనుభవింప(దగిన, శ్రియా - రాజ్యలక్ష్మిచేత, సముపాస్యత కిల - శుశ్రూషమాత్రము చేయ(బడిన వా(డయ్యెనుసుమా, జితేంద్రియు(డైన యతనికి

కోడలిచేతవలె రాజ్యలక్ష్మిచేతగూడ పుష్పఫలోదకాహరణాది శుశ్రూష తప్ప మరియొక అపేక్షిత వస్తువు లేదయ్యెనని భావము (యతి జీవనము గడపెను). క్షత్రియుఁడు యత్యాశ్రమమును స్వీకరించుట ధర్మ్యమగునా కాదా? యను విషయమును సుదీర్ఘముగా చర్చించి, మల్లినాథుఁడు యత్యాశ్రమమునకు క్షత్రియుఁడు సైతమర్హుఁడే యని యీ శ్లోకవాఖ్యానమునందు నిర్ణయించియున్నాఁడు. కాళిదాసు నభిప్రాయముగూడ నదియే యైనట్లు సోదాహరణముగా నిరూపించియున్నాఁడు.

శ్లో. ప్రథమ స్థిత పూర్వ పార్థివం
కుల మభ్యుద్యత నూతనేశ్వరమ్
నభసా నిభృతేందునా తులాం
ఉదితార్కేణ సమారురోహ తత్. 15

వ్యాఖ్య: ప్రథమస్థిత పూర్వపార్థివం - శాంతి నాశ్రయించిన పూర్వపు రాజు గలదియును, అభ్యుద్యత నూతనేశ్వరం - అభ్యుదయమునొందిన క్రొత్తరాజు (అజుఁడు) గలదియునగు, తత్, కులం - ప్రసిద్ధమైన ఆ దిలీపవంశము, నిభృతేందునా - అస్తమింపనున్న చంద్రుడు గలదియును, ఉదితార్కేణ - ఉదయించిన సూర్యుఁడు గలదియును నగు, నభసా - ఆకాశముచేత, తులాం - సామ్యమును, సమారురోహ - పొందెను. అస్తమింపబోవు చంద్రునితోను, ఉదయించిన సూర్యునితోను గూడిన నిర్మలాకాశమువలె, పూర్వరాజైయత్యాశ్రమమును స్వీకరించిన రఘువుచేతను, నూతన వైభవోపేతుఁడైన అజునిచేతను దిలీపవంశము మిక్కిలి శ్లాఘాపాత్రముగ నుండెనని భావము.

శ్లో. యతి పార్థివ లింగ ధారిణౌ
దదృశాతే రఘురాఘవౌ జనైః
అపవర్గ మహోదయార్థయోః
భువ మంశా వివ ధర్మయోర్గతౌ. 16

వ్యాఖ్య: యతి పార్థివ లింగ ధారిణౌ — యతి - సన్యాసి యొక్కయు, పార్థివ - రాజుయొక్కయు, లింగ - వేషములను, ధారిణౌ - ధరించినట్టి, రఘు రాఘవౌ - రఘువును, అతని కుమారుఁడగు అజుఁడును, అపవర్గ మహోదయా

ర్థయోః - మోక్షము, అభ్యుదయమును, ఫలములుగాగల. ధర్మయోః - నివ ర్తక, ప్రవ ర్తక, ధర్మములయొక్క, భువంగతౌ - భూలోకమునం దవతరించిన. అంశౌ, ఇవ - అంశములవలె, జనైః - ప్రజలచేత, దదృశాతే - చూడఁబడిరి. జనులకు, రఘువు మోక్షఫలకమైన నివృత్తిధర్మము యొక్క అవతారముగను అజుడు అభ్యుదయ ఫలమైన ప్రవృత్తి యొక్క అవతారము గను గన్పట్టిరని తాత్పర్యము.

శ్లో. అజితాధిగమాయ మంత్రిభిః
యుయుజే నీతివిశారదై రజః
అనపాయి పదోపలబ్ధయే
రఘు రాప్తైః సమియాయ యోగిభిః 17

వ్యాఖ్య: అజః - అజుఁడు, అజితాధిగమాయ - జయింపబడని దేశముల యొక్క విజయముకొఱకు, నీతివిశారదైః - రాజనీతిజ్ఞులైన, మంత్రిభిః - మంత్రులతో, యుయుజే - కలిసికొనెను, రఘుః - రఘుమహారాజుగూడ, అనపాయిపదోపలబ్ధయే—అనపాయిపద వినాశములేని పదము అనగా మోక్షముయొక్క, ఉపలబ్ధయే - ప్రాప్తికొఱకు, ఆప్తైః - సత్యము నెఱిఁగినవారును యథార్థమును జెప్పువారునునగు, యోగిభిః - యోగులతో, సమియాయ - చేరెను. ఉభయులును తమ లక్ష్యము సిద్ధించుటకై ఉపాయాన్వేషణమునకు బూనుకొనిరని భావము.

శ్లో. నృపతిః ప్రకృతీ రవేక్షితుం
వ్యవహారాసన మాదదే యువా
పరిచేతు ముపాంశు ధారణాం
కుశపూతం ప్రవయాస్తు విష్టరమ్. 18

వ్యాఖ్య: యువా, నృపతిః - యువకుఁడైన రాజు (అజుఁడు), ప్రకృతీః - ప్రజలను, అవేక్షితుం - చూచుటకు (కార్యార్థులైన జనులలో దుష్టులను, అదుష్టులను ఎఱుఁగుటకు), వ్యవహారాసనం - ధర్మాసనమును, ఆదదే - స్వీకరించెను, ప్రవయాః - వృద్ధుఁడగు, నృపతిస్తు - రఘుమహారాజేమో, ధారణాం - మనస్సు యొక్క యేకాగ్రతను, పరిచేతుం - అభ్యసించుటకు (కూర్చుకొనుటకు), ఉపాంశు - విజన ప్రదేశమునందు, కుశపూతం - దర్భలచేత పవిత్రమైన,

విష్టరం - ఆసనమును, ఆదదే - స్వీకరించెను. అజుఁడు ప్రజాపాలనము కొఱకై ధర్మాసనమునెక్కెను. రఘువు యోగాభ్యాసము కొఱకై ఏకాంతమునందలి దర్భాసనముపై గూర్చుండెను. "యమాది గుణసంయుక్తే మనసః స్థితిరాత్మని, ధారణా ప్రోచ్యతే సద్భిర్యోగశాస్త్రవిశారదైః" అని వసిష్ఠస్మృతి ధారణా పదమును నిర్వచించినది. అటి ధారణకు రఘువు పూనెను.

శ్లో. అనయత్ ప్రభుశక్తి సంపదా
వశం మేకో నృపతీ ననంతరాన్
అపరః ప్రణిధాన యోగ్యయా
మరుతః పంచ శరీ గోచరాన్. 19

• వ్యాఖ్య: ఏకః - ఒకడు (అజుఁడు), అనంతరాన్ - తన రాజ్యమున కంటుకొనియున్న దేశములవారగు, నృపతీన్ - రాజులను, ప్రభుశక్తి సంపదా- కోశదండముల మహిమచేత, వశం, అనయత్ - స్వాధీనులనుగాఁ జేసికొనెను, అపరః - రెండవవాఁడు (రఘుమహారాజు), ప్రణిధానయోగ్యయా - సమాధియొక్క అభ్యాసముచేత, శరీరగోచరాన్ - దేహము నాశ్రయించియున్న, పంచ, మరుతః - అయిదు వాయువులను (పంచప్రాణము లనఁబడు ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులను) వశం, అనయత్ - స్వాధీనపరచుకొనెను. రాజ్య స్థైర్యమునకై యజుఁడు కోశదండ ప్రభావముచేత ఇరుగు పొరుగు రాజులను స్వాధీనము చేసికొనెననియు, మోక్షప్రాప్తికై రఘువు యోగాభ్యాసముచేత ప్రాణాయామమునందు కృతార్థుఁడయ్యెననియు భావము. ఇద్దఱును వారి లక్ష్యమునందు మొదటిమెట్టు నెక్కిరని తాత్పర్యము.

శ్లో. అచిరేశ్వరః క్షితౌ
ద్విష దారంభఫలాని భస్మసాత్
ఇతరో దవానే స్వకర్మణాం
వవృతే జ్ఞానమయేన వహ్నినా. 20

వ్యాఖ్య: అచిరేశ్వరః - కొద్దికాలముక్రింద రాజైన (అజుఁడు), క్షితౌ - భూమిమీద, ద్విషదారంభఫలాని - శత్రుప్రయత్నముల ఫలితములను, భస్మసాత్,

పదైః - పొందబడిన స్థానముగల (చెవి నందున నుంచబడిన), యవాంకురైశ్చ - గటీక పరవలచేత, పరభృతావిరుతైశ్చ - ఆడు కోయిలల కూతలచేతను (ఈ మొదలగు), స్మరబలైః - మన్మథ సైన్యములచేత, అబలైకరసాఃఅబలా - స్త్రీలయందే, ఏకరసాః - అనురాగైకరసనిమగ్నులుగా (నిరంతర స్త్రీ పరాయణులుగా), కృతాః - చేయఁబడిరి. నాయికా నాయకులు చెంగావి వస్త్రములు ధరించి గటీకపరకలు మొదలయిన ప్రకృతి భూషణములను ధరించి కోకిలాలాప, భ్రమర ఝంకారాది మద్మథోద్దీపనముల నడుమ విహరించిరని భావము. ప్రణయినీ ప్రియులు చెంగావి వస్త్రములు ధరించుట కామోద్దీపనము; అంతియేకాక నఖక్షతాదుల వవన గలిగిన రక్త ప్రసారమును మరుగు పరచుటకు వీలగునని భావము.

శ్లో. ఉపచితావయవా శుచిభిః కణై
రలి కదంబక యోగ ముపేయుషీ
సదృశకాంతి రలక్ష్యత మంజరీ
తిలకజా లకజాలక మౌక్తికైః 44

వ్యాఖ్య: శుచిభిః - తెల్లనివి యగు, కణైః - పుప్పొడులచేత, ఉపచితావయవా - పుష్టిచెందిన యవయవములుగలవియు, అలికదంబక యోగం - తుమ్మెదల గుంపుయొక్క సంబంధమును, ఉపేయుషీ - పొందిన:యు, తిలకజా - తిలక వృక్షమునుండి పుట్టిన, మంజరీ - పుష్పగుచ్ఛము, అలక జాలక మౌక్తికైఃఅలక - ముంగురులయందలి, జాలక - జాలకమను పేరుగల ఆభరణము యొక్క, మౌక్తికైః - ముత్తెములతో, సదృశకాతిః - సమానమైన కాంతి గలదియై, అలక్ష్యత - కనఁబడెను. తుమ్మెదలతో కూడిన తెల్లని తిలక మంజరి ఒక స్త్రీ నల్లని ముంగురులపై క్రేలాడుచున్న మత్స్యాల కుచ్చువలె మనోహరముగా నుండెనని భావము.

శ్లో. ధ్వజపటం మదనస్య ధనుర్భృతః
చపికరం ముఖచూర్ణ మృతుశ్రియః
కుసుమ కేసర రేణు మలివ్రజాః
సపద నోపపనోత్థిత మన్వయుః. 45

వ్యాఖ్య: అలివ్రజాః - తుమ్మెదల మొత్తములు, ధనుర్భృతః - విలుకాడైన, మదనస్య - మన్మథునియొక్క, ధ్వజపటం - జెండాబట్ట వంటిదియు, ఋతుశ్రియః - వసంతఋతు లక్ష్మికి, ఛవికరం - కాంతిని గలిగించునట్టి, ముఖ చూర్ణం - ముఖచూర్ణము వంటిదియు (ఈ కాలపు ఫేస్‌పౌడరు), సపవనోపవనో త్థితం—సపవన - గాలితో కూడిన, ఉపవన - ఉద్యాన వనమునందు, ఉత్థితం - లేచిన, కుసుమకేసర రేణుం - పువ్వులయొక్క కింజల్కములయందలి పుప్పొడిని, అన్వయుః - అనుసరించి వెళ్లినవి. తెల్లని పుప్పొడి గాలికి వస్త్రమువలె పటుచు కొని పోవుచుండగా దానివెంట నల్లని తుమ్మెద గుంపులు వెళ్లుచుండుట ఒక మనో హర దృశ్యముగా నుండెనని భావము. ఆ పుప్పొడి మన్మథుని జెండాబట్టగాను, వసంతలక్ష్మి ముఖచూర్ణముగాను ఉత్ప్రేక్షింపబడినది.

శ్లో. అనుభవ న్నవదోల మృతూత్సవం
పటు రపి ప్రియకంఠ జిఘృక్షయా
అనయ దాసనరజ్జు పరిగ్రహే
భుజలతాం జలతా మబలాజనః 46

వ్యాఖ్య: నవదోలం - క్రొత్త ఉయ్యాల లూగునట్టి, ఋతూత్సవం - వసంతోత్సవమును, అనుభవన్ - అనుభవించుచున్న, అబలాజనః - స్త్రీ జనము, పటుః అపి - నైపుణ్యము గలదియైనను (ఉయ్యాల లూగుటయందు మంచి నేర్పు గలదియైనను), ప్రియకంఠ జిగృక్షయా - ప్రియుని కంఠమును ఆలింగనము చేసు కొనవలయునను కోరికచేత, ఆసనరజ్జు పరిగ్రహే - పీఠమునకు గట్టిన పగ్గమును పట్టుకొనుటయందు, భుజలతాం - లతవలె మృదువైన బాహువును, జలతాం - శైథిల్యమును (పట్టు వదలుటను). అనయత్ - పొందించెను. డోలా క్రీడల యందు పడిపోవుదుమను భయమును నటించి, పీఠమునకు గట్టిన త్రాటినివదలి వసంతోత్సవ సంబంధమైన డోలాక్రీడలను జేయుచున్న స్త్రీ జనము ప్రియుని కంఠము నాలింగనము చేసికొని తమ ప్రియులనే కాక చూపరులనుసైత మానంద పరచిరి. "జలతాం" లడయోరభేదః అను వచనమువలన నిది "జడతాం" అను శబ్దము. బాహువునకు జడత్వముకలిగి త్రాటిని పట్టుకొను శక్తి పోయినదని భావము. 'జడతాం' అని ప్రయోగింపక శబ్దాలంకార నిమిత్తమై 'జలతాం' అని ప్రయోగించెనని గ్రహింపవలయును.

శ్లో. త్యజత మాన మలంబత విగ్రహైః
న పున రేతి గతం చతురం వయః
పరభృతాభి రితీవ నివేదితే
స్మరమతే రమతేస్మ వధూజనః. 47

వ్యాఖ్య: బత - ఏమండోయ్! (ఓ అంగనలారా!), మానం - కోపమునుఃత్యజత - విడవండి, విగ్రహైఃః - కలహములచేత, అలం - చాలును (కలహింపకుఁడని యర్థము), గతం --గడిచిపోయిన, చతురం,వయంఃః - ఉపభోగ నైపుణ్యము గల యౌవనము, పునఃః. న, ఏతి (పునర్నైతి) తిరిగిరాదు, ఇతి - ఈవిధమైన, స్మరమతే - మన్మథుని యభిప్రాయము, పరభృతాభిఃః - ఆడుకోకిలల చేత, నివేదితే (సతి) ఇవ - చెప్పబడిన దగుచున్నందువలననేమో! వధూజనఃః - స్త్రీ జనము, రమతేస్మ - క్రీడించెను. కోకిలా కూజితములచేత ఉద్దీపిత కామము గల స్త్రీ జనము, కామఁడు శిక్షించునను భయము వలనవలె, ఉచ్ఛృంఖలముగా రతిక్రీడ సలిపెనని తాత్పర్యము. ఇచ్చట ఆడు కోకిలములు స్త్రీ జనముతో నిట్లు చెప్పుట మిక్కిలి సమంజసముగా నున్నది. స్త్రీల యౌవనము ప్రసవాంతమే, మీ యౌవనము స్వల్పకాలముననే ముగియును కనుక మాన విగ్రహాదులతో కాలము బుచ్చకుఁడని ఆడుకోయిలలు చెప్పుటలో నౌచిత్యమున్నది, అవి యెరుగును గావున. ''మాన''మనగా ప్రియుఁడు ఇతర స్త్రీ సక్తుడైనప్పుడు. ఈర్ష్యచేఁగలుగు ప్రియురాలి కోపము, ''విగ్రహ'' మనఁగా మగనితోఁజేసెడి కలహము. 'బత' అను నవ్యయము వలన ఖేదము. దయ, సంతోషము, విస్మయము, ఆమంత్రణము (పిలుపు) అను నర్థములు తెలుపఁబడును. ప్రకృతము నందలి 'బత' ఆమంత్రణార్థకము.

శ్లో. అథ యథాసుఖ మార్తవ ముత్సవం
సమనుభూయ విలాసవతీ సుఖైఃః
నరపతి శ్చకమే మృగయారతిం
స మధుమన్మధు మన్మథ సన్నిభఃః. 48

వ్యాఖ్య: అథ-పిమ్మట, మధుమన్మధుమన్మథసన్నిభఃః—మధుమత్-విష్ణువునకును, మధు - వసంతునికిని, మన్మథ - మన్మథునికిని, సన్నిభఃః – సమానుఁడైన

సః నరపతిః - ఆ దశరథుఁడు, విలాసవతీసఖః - విలాసినులతో గూడిన వాఁడ గుచు, ఆర్తవం - వసంత ఋతువు వచ్చుటచేత నేర్పడిన, ఉత్సవం - వసంతో త్సవమును, యథాసుఖం - సుఖముగా, సమనుభూయ - అనుభవించి, మృగయా రతిం - వేటయందలి వేడుకను, చకమే - కోరెను. దశరథుఁడు సైతము విలాసినులతోఁగలిసి యథేష్టముగా వసంతోత్సవ విశేషముల ననుభవించిన పిమ్మట వేటకై వెళ్లుట కిష్టపడెను.

శ్లో. పరిచయం చల లక్ష్య నిపాతనే
భయరుషోశ్చ తదింగిత బోధనమ్
శ్రమజయాత్ ప్రగుణాం చ కరో త్యసౌ
తను మతోఽనుమతః సచివై ర్యయౌ. 49

వ్యాఖ్య: అసౌ - ఈవేట, చలలక్ష్యనిపాతనే - కదలుచున్న లక్ష్యము యొక్క [లేళ్లు మనుబోతులు మొదలయిన వానియొక్క) పడగొట్టుట యందు, పరిచయం - అభ్యాసమును కరోతి - చేయును. భయరుషోః - భయక్రోధముల యందు, తదింగిత బోధనం__తత్ - ఆకదలుచున్న మృగముల యొక్క, ఇంగిత - చేష్టితములయొక్క, బోధనం - జ్ఞానమును (తెలిసికొనుటను) కరోతి - కలిగించును. తనుం - శరీరమును, శ్రమజయాత్ - అలసటను తొలగించుటవలన, ప్రగుణాంచ - మంచి లాఘవము కల దానినిగా కూడా. కరోతి - చేయును. అతఃఽ - ఈ కారణముల వలన, సచివైఃఽ - మంత్రులచేత, అనుమతః - ఆమోదింపబడినవాఁడగుచు, యయౌ - వెళ్లెను. వేట వలన, కదలుచున్న లక్ష్యమును కొట్టగల శక్తి, మృగముల భయక్రోధ భావముల నెరుగుట,శరీర లాఘవము మొదలయిన గుణములు రాజున కను కబ్బునుక మంత్రులు వేటకు వెళ్లుమని దశరథుని ప్రోత్సహించిరి. ఇట్టి ఉపయోగము లన్నియు యుద్ధపాటవమును గలిగించునన్న భావముతో మృగయాప్రవృత్తి కాని వ్యసనముచేఁ గాదని భావము.

శ్లో. మృగవనోపగమ ఉమ వేషభృత్
విపుల కంఠ నిషక్త శరాసనః
గగన మశ్వఖురోద్ధత రేణుభిః
నృసవితా సవితాన మివాకరోత్. 50

వ్యాఖ్య: మృగవనోపగమక్షమవేషభృత్ - మృగవన - మృగారణ్యము యొక్క, ఉపగమ - ప్రవేశమునకు, క్షమ - తగిన, వేషభృత్ - వేషమును ధరించినవాఁడును, విపులకంఠ - నిషక్తశరాసనః - విశాలమైన కంఠమునందుంచ బడిన ధనస్సుగల వాఁడును, అగు, నృసవితా - పురుషశ్రేష్ఠుఁడైన దశరథుఁడు, అశ్వఖురోద్ధత రేణుభిః - గుఱ్ఱపు గెట్టెలచే నెగుర వేయఁబడిన పరాగ రేణువుల చేత, గగనం - ఆకాశమును, సవితానం, ఇవ - చాందినీ బట్టకల దానివలె, అకరోత్ - చేసెను. మృగయావేషమును ధరించి వెళ్లుచున్న దశరథుని గుఱ్ఱపు గిట్టలచే రేగిన ధూళి ఆకసము క్రింద చాందినీబట్ట కట్టినట్లుండెనని భావము. ఈట్లు బయలు దేరెను. "నృసవితా" ఇచ్చట సూర్యవాచకమైన సవిత్ర శబ్దము, ఇంద్రసింహ శార్దూలాది శబ్దములవలె శ్రేష్ఠవాచకము. ఇది నరేంద్ర, పురుష సింహాది శబ్దముల వలె ఉపమిత సమాసము.

శ్లో. గ్రథితమౌలి రసౌ వనమాలయా
తరుపలాశ సవర్ణ తనుచ్ఛదః
తురగవల్గన చంచల కుండలో
విరురుచే రురు చేష్టిత భూమిషు. 51

వ్యాఖ్య: వనమాలయా - వనపుష్పముల మాలికచేత, గ్రథితమౌలిః - కట్ట బడిన శిఖగల వాఁడును, తరుపలాశ సవర్ణతనుచ్ఛదః — తరుపలాశ - చెట్ల యాకులతో, సవర్ణ - సమానమైన రంగుగల, తనుచ్ఛదః - కవచము గల వాఁడును (కవచము ఆకుపచ్చగా నుండెననుట మృగాదుల విశ్వాసార్థము), తురగ వల్గన చంచల కుండలః - గుఱ్ఱము యొక్క కదనువలన చలించుచున్న కర్ణ భూషణములు గలవాడునుగు, అసౌ - దశరథుఁడు, రురుచేష్టిత భూమిషు— రురు - నల్లచారల దుప్పులచేత, చేష్టిత - తిరుగబడినట్టి, భూమిషు - ప్రదేశముల యందు, విరురుచే - మిక్కిలి ప్రకాశించెను. మృగములు బెదిరి చెదిరిపోకుండ అడవి పువ్వులనే తలకు జుట్టుకొని, ఆకుపచ్చని కవచము ధరించి, గుఱ్ఱముపై నెక్కి, ఎక్కువగా దుప్పులు, వేళ్లను తిరుగాడు ప్రదేశములకు వెళ్లెను.

శ్లో. తను లతా వినివేశిత విగ్రహాః
భ్రమర సంక్రమి తేతణవృత్తయః

దదృశు రధ్వని తం వనదేవతాః
సునయనం నయ నందిత కోసలమ్. 52

వ్యాఖ్య : తనులతా వినివేశిత విగ్రహాః — తనులతా - సుకుమారమైన లతలయందు, వినివేశిత - సంక్రమింపఁజేయఁబడిన విగ్రహాః - దేహములు గల వారును, భ్రమర సంక్రమితేక్షణ వృత్తయః - తుమ్మెదల యందు చేర్చఁబడిన చూపులుగల వారునగు, వనదేవతాః - వనదేవతలు, సునయనం - అందమైన కన్నులుగల వాఁడును, నయసందిత కోసలమ్— నయ - నీతి చేత, నందిత కోసలమ్ - సంతోష పరుపఁబడిన కోసల దేశము గలవాడును నగు, తం- ఆ దశరథుని, అధ్వని - మార్గమునందు, దదృశుః - చూచిరి. ప్రసన్న రూపము గల యతనిని వనదేవతలు సైతము చాటున నుండి లతల యందు చేర్చబడిన దేహములు, తుమ్మెదల యందు జేర్చబడిన చూపులు గలవారై చూచిరి.

శ్లో. శ్వగణి వాగురికైః ప్రథమాస్థితం
వ్యపగతానల దస్యు వివేశ సః
స్థిర తురంగమ భూమి నిపానవ
న్మృగ వయో గవయో పచితం వనమ్. 53

వ్యాఖ్య: సః - ఆ దశరథుఁడు, శ్వగణి - వేటకుక్కల గుంపుల నాయకుల చేతను, వాగురికైః - మృగములను పట్టుకొనుటకు వలలు పరచు వారిచేతను, ప్రథమాస్థితం - మొదట ఆక్రమింపఁబడినదియు, వ్యపగతానలదస్యు - తొలగిన దావాగ్నియు చోరులును గలదియు, స్థిరతురంగమ భూమి — స్థిర - బురద లేక గట్టిపడినవియు, తురంగమ - గుఱ్ఱములు నడచుటకు యోగ్యమైన, భూమి - నేలలు గలదియు, నిపానవత్ - సమీపమున బావులు చెఱువులు గలదియు, మృగ వయోగవయోపచితం—మృగ - లేళ్లు మొదలయిన వాని చేతను, వయో - పక్షుల చేతను. గవయ - ఆవుల వంటి మనుబోతులచేతను, ఉపచితం - సమృద్ధమై యున్న, వనం - అరణ్యమును, వివేశ - ప్రవేశించెను. అతడు మృగములు, పక్షులు గలిగి, వేటకు యోగ్యమైన అరణ్యమున ప్రవేశించునప్పుడు ముందుగా కొందరిని బంపి, దావాగ్నియు, దొంగలును లేకుండఁజేసి, అప్తులగు శస్త్రధారులను వెంట నిడుకొని పోయెను. కామందక నీతిశాస్త్రము చెప్పు మృగయా విధానమును దశరథుఁ డనుసరించెనని భావము.

శ్లో. అథ నభస్య ఇవ త్రిదశాయుధం
కనకపింగ తడిద్గుణ సంయుతమ్
ధను రధిజ్య మనాధి రుపాదదే
నరవరో రవరోషిత కేసరీ. 54

వ్యాఖ్య: అథ - ఆతరువాత, అనాధిః-మనోవ్యథా రహితుఁడైన, నరవరః-దశరథుఁడు, రవరోషిత కేసరీ - ధనుష్టంకార ధ్వనిచేత, రోషిత - క్రుద్ధములైన, కేసరీ - సింహములు గలవాఁడగుచును, కనకపింగ తడిద్గుణసంయుతమ్—కనక పింగ - బంగారమువలె పచ్చనిదైన, తటిద్గుణ - మెఱుపు తీగయను అల్లెత్రాటితో, సంయుతమ్ - కూడివట్టియును, త్రిదశాయుధం - ఇంద్ర ధనస్సును, నభస్యఃఇవ-భాద్రపద మాసమువలె, అధిజ్యం - ఎక్కు-పెట్టబడిన అల్లెత్రాడుగల, ధనుః - విల్లును, ఉపాదదే - స్వీకరించెను. భాద్రపద, త్రిదశాయుధోపమానములచేత నిండు వర్షాకాలము నందలి వర్షధారలవలె దశరథుఁ డరణ్య మృగములపై శర వర్షము గురిపింప నున్నాఁడను విషయము స్ఫురించును. మేఘధ్వని విని సింహములు కోపముతో ప్రతిగర్జనము చేయును. ఇంద్ర ధనుస్సుకు మెఱుపు అల్లెత్రాటివలె నుండును.

శ్లో. తస్య స్తన ప్రణయిభి ర్ముహు రేణశాబై
ర్వ్యాహన్యమాన హరిణీగమనం పురస్తాత్
ఆవిర్బభూవ కుశగర్భ ముఖం మృగాణాం
యూథం తదగ్రసర గర్విత కృష్ణసారమ్. 55

వ్యాఖ్య: స్తనప్రణయిభిః - పాలు త్రాగుటయందు మక్కువగల, ఏణ శాబైఃఃః

రథుని యొక్క- పురస్తాత్ - ఎదుట ఆవిర్భూవ - అగపడెను. పిల్లలు పాలు త్రాగుతూ ఆపగా ఆగిన యాడులేళ్ళతోను, దర్భలు నమలుచున్న నోళ్లతోను, ముందు నడచుచున్న గంభీర కృష్ణసారముతోను ఒకలేళ్లమంద దశరథుని యెదుట బడెను. ఇచ్చటి నుండి కొన్ని శ్లోకముల వఱకు వసంత తిలకావృత్తము.

శ్లో. తత్ ప్రార్థితం జవన వాజి గతేన రాజ్ఞా
తూణీముఖోద్ధృత శరేణ విశీర్ణపంక్తి
శ్యామీచకార వన మాకుల దృష్టిపాతైః
వాతేరితోత్పల దలప్రకరై రివార్ద్రైః 56

వ్యాఖ్య: జవనవాజి గతేన - వేగముగ నడచు గుఱ్ఱముపై నెక్కినవాఁడును తూణీముఖోద్ధృత శరేణ - తూణీరము నుండి పైకి తీయఁబడిన బాణము గల వాఁడునునగు, రాజ్ఞా - దశరథునిచేత, ప్రార్థితం - ఎదురుకోబడినదియై, విశీర్ణ పంక్తి - చెదిరిపోయిన వరుసలుగల, తత్ - ఆ లేళ్లమంద, ఆర్ద్రైః - తడిసిన (భయముచే కన్నీరు గ్రమ్మిననట్టి)ఆకుల, దృష్టిపాతైః-భయచకితములైన చూపుల చేత, వాతేరితోత్పల దల ప్రకరైః. ఇవ—వాతేరిత - గాలిచే కదల్చబడిన, ఉత్పలదల - కలువ రేకులయొక్క, ప్రకరైః ఇవ - మొత్తములచేత వలె, వనం అరణ్యమును,శ్యామీచకార - నల్లగాఁజేసెను. గుఱ్ఱపు వేగముతో ఉద్ధృతశరుఁడైన దశరథుఁ డెదురుపడుటచేత ఆలేళ్ల మంద చెదిరి చీలిపోయిన లేళ్ల యొక్క భయ కంపితములైన చూపులచేత, నల్లకలువ రేకులు పరచినట్లు వనము శ్యామల వర్ణ ముగా మారెనని తాత్పర్యము. ఇచ్చటి 'ప్రార్థిత' శబ్దమునకు అభియానము (ఎదురుపడుట) అర్థము.

శ్లో. లక్ష్యీకృతస్య హరిణస్య హరిప్రభావః
ప్రేత్య స్థితాం సహచరీం వ్యవధాయ దేహమ్
ఆకర్ణకృష్ట మపి కామితయా స ధన్వీ
బాణం కృపామృదుమనాః ప్రతి సంజహార. 57

వ్యాఖ్య: హరిప్రభావః - ఇంద్రుడు లేదా విష్ణువు యొక్క ప్రభావము వంటి ప్రభావముగల, ధన్వీసః - విలుకాఁడైన ఆ దశరథుఁడు, లక్ష్యీకృతస్య -

బాణము వేయుటకు గుఱి పెట్టబడిన, హరిణస్య - మగలేడి యొక్క, దేహం - శరీరమును, వ్యవధాయ - చాటుపరచి, స్థితాం - నిలుచుని యున్న, సహచరీం - సహచరియగు ఆడులేడిని, ప్రేక్ష్య - చూచి, కామితయా - తాను కాముకుడగుట వలన, కృపామృదుమనాః - దయచేత మెత్తబడిన మనస్సు గల వాడగుచు, ఆ కర్ణకృష్టం అపి - చెవి వఱకు లాగబడినదైనను (ఉపసంహరించుటకు వీలుపడని దైనను), బాణం - బాణమును, ప్రతిసంజహార - నేర్పుతో ఉపసంహరించెను. మేటి విలుకాడైన దశరథుఁ డొక మగలేడిపై శరమును విడువబోగా దాని ప్రియురాలైన యొక ఆడు లేడి లక్ష్యమున కడ్డము వచ్చెను. కృపాళుడై బాణము నుపసంహరించెను. "ధన్వీ" పదము పై నైపుణ్యమును సమర్థించును.

శ్లో. తస్యాపరేష్వపి మృగేషు శరాన్ ముముక్షోః
కర్ణాంత మేత్య బిభిదే నిబిడోఽపి ముష్టిః
త్రాసాతిమాత్రచటులైః స్మరతః సునేత్రైః
ప్రౌఢప్రియా నయన విభ్రమ చేష్టితాని. 58

వ్యాఖ్య: త్రాసాతిమాత్రచటులైః— త్రాస - భయము వలన, అతిమాత్రచటులైః - మిక్కిలి చలించుచున్న, సునేత్రైఃఁ - లేళ్ల యొక్క అందమైన కనులచేత (కారణము). ప్రౌఢప్రియానయన విభ్రమచేష్టితాని—ప్రౌఢప్రియా - గడుసు కత్తెలైన తన ప్రియురాండ్రయొక్క. నయన విభ్రమ చేష్టితాని - కన్నుల వయ్యారితనవు చేష్టితములను. స్మరతః - స్మరించున్నట్టియు అపరేషు, మృగేషు, అపి - ఇతరములగు లేళ్ళమీదను, శరాన్ - బాణములను, ముముక్షోః - విడువ దలచుకొనుచున్న వాడునుగు. తస్య - ఆ దశరథుని యొక్క, ముష్టిః - పిడికిలి, నిబిడోపి (నిబిడః, అపి) - దృఢమైనదే యైనను, కర్ణాంతం - చెవి చివరిని, ఏత్య - చేరి. బిభిదే - సడలిపోయెను. కాముకుఁడైన యతనియొక్క ముష్టి ప్రియానేత్ర విభ్రమస్మృతి చేత, లేళ్లయందుఁగల్గిన కృపాతిశయముచేత, సడలిపోయెనే గాని, నైపుణ్యము లేక కాదని తాత్పర్యార్థము.

శ్లో. ఉత్తస్థుషః సపది పల్వలపంక మధ్యాత్
ముస్తాప్రరోహ కబలావయ వానుకీర్ణమ్

జగ్రాహ సద్రుతవరాహకులస్య మార్గం
సువ్యక్త మార్ద్రపద పంక్తిభి రాయతాభిః 59

వ్యాఖ్య: సః - అతఁడు, ముస్తాప్రరోహకబలావయవానుకీర్ణం—ముస్తా ప్రరోహ - తుంగ మొలకలయొక్క, కబలావయవ - కబళ శకలములచేత, అనుకీర్ణం - వరుసగా వ్యాపించినదియు, ఆయతాభిః - పొడువుగా నున్న, ఆర్ద్రపద పంక్తిభిః - తడిసిన ఆడుగుల వరుసలచేత, సువ్యక్తం - స్పష్టముగాఁగనబడుచున్నదియు, సపది అప్పుడే, పల్వలపంక మధ్యాత్—పల్వల - చిన్ననీటి గుంటలలోని, పంకమధ్యాత్ - బురదనడిమినుండి, ఉత్తస్థుషః - పైకిలేచిన, ద్రుతవరాహ కులస్య - పరుగెత్తిపోయిన పందుల మంద యొక్క, మార్గం - దారిని, జగ్రాహ - అనుసరించెను. - లేడి గుంపును వదలి, నమిలిన తుంగముక్కలుపడి, తడిసిన యడుగుల జాడలతో, అప్పుడే నీటి గుంటల నుండి పైకిలేచి పారిపోయిన పందుల మంద దారినిబట్టెనని భావము.

శ్లో. తం వాహనా దవన తోత్తరకాయ మీషత్
విధ్యంత ముద్ధృతసటాః ప్రతిహంతు మీషుః
నాత్మాన మస్య వివిదుః సహసా వరాహా
వృక్షేషు విద్ధ మిషుభి ర్జఘనాశ్రయేషు 60

వ్యాఖ్య: వరాహాః - పందులు, వాహనాత్ - గుట్టము నుండి, ఈషత్ - కొంచముగా, అవనతోత్తరకాయం- వంచబడిన శరీరోర్ధ్వ భాగము గలిగినట్టియు, విధ్యంతం - బాణము వేయుచున్నట్టియు, తం - ఆ దశరథుని, ఉద్ధృతసటాః - నిక్కబొడుచుకున్న జడలు కలవి యగుచు, ప్రతి హంతుం - ఎదురు దెబ్బ తీయుటకు, ఈషుః - తలచినవి, అస్య - ఈ దశరథునియొక్క, ఇషుభిః - బాణముల చేత, సహసా - హఠాత్తుగా, జఘనాశ్రయేషు - తమ కటిప్రదేశముల కాధార భూతములైన, వృక్షేషు - చెట్ల యందు, విద్ధం - క్రుచ్చియుంచబడిన, ఆత్మానం- తమను, న వివిదుః - తెలిసికొన లేకపోయినవి. తమను కొట్టుచున్న రాజుపైకి దుమికుద మనుకొనుచుండగనే పందులు తామానుకొన్న చెట్లకు బాణములచే నతికింపఁబడిపోయిన విషయమును గ్రహింపలేక చనిపోయెను. ఈ శ్లోకమునందు అడవి పందుల మనస్తత్వమును, దశరథుని హస్తలాఘవమును చక్కగా వర్ణింపఁబడినవి.

శ్లో. తేనాభిఘాత రభసస్య వికృష్య పత్రీ
వన్యస్య నేత్ర వివరే మహిషస్య ముక్తః
నిర్భిద్య విగ్రహ మశోణితలిప్త పుంఖః
తం పాతయాం ప్రథమ మాస పపాత పశ్చాత్ 61

వ్యాఖ్య: అభిఘాత రభసస్య - మీదపడి చంపుటకు వేగిర పడుచున్న, వన్యస్య మహిషస్య - అడవి దున్నయొక్క, నేత్రవివరే - కంటి నడుమ, తేన - ఆ దశరథునిచేత, వికృష్య - బాగుగాలాగి, ముక్తః - విడువఁబడినట్టి - పత్రీ - బాణము, విగ్రహం - ఆ దున్న శరీరమును, నిర్భిద్య - చీల్చుకొని, అశోణితలిప్త పుంఖః - రక్తముచే పూయబడని పిడికలది యగుచు, తం - ఆ మహిషమును, ప్రథమం - మొదట, పాతయామాస (పాతయాం + ఆస) - నేలపై పడవేసెను. పశ్చాత్ - తరువాత, పపాత - తాను క్రిందపడెను. తనను చంపుటకు పైఁబడి పచ్చుచున్న యడవి దున్న కంటికిఁదాకునట్లు విడిచిన దశరథుని బాణము మొదట మహిషమును జీల్చి నేలపైఁబడగొట్టి, పిమ్మట తాను నేలపై బడెను. "అశోణితలిప్త పుంఖః" సామాన్యముగా ఖడ్గముగాని, బాణము గాని యొక శరీరమును దూసుకొని పోవునప్పుడు రక్తలిప్తమగును. ఇచ్చట బాణము గాక, బాణపు పిడి సైతము రక్తముచేత పూయబడలేదట. అతి వేగముగా దూసుకొని పోవుటచేత మహిష రక్తము లావుగా వున్న పుంఖమునకు గూడ అంటలేదన్నచో నిక బాణపు మొనకంటుట అసంభవము గదా! ఆ బాణమంత వేగము, పటిమ గలదియై యుండెనని కవి భావము.

శ్లో. ప్రాయో విషాణపరిమోక్ష లఘూత్తమాంగాన్
ఖడ్గాం శ్చకార నృపతి ర్నిశితై: క్షురప్రై:
శృంగం స దృప్త వినయాభికృతః పరేషాం
అత్యుచ్ఛితం న మమృషే నతు దీర్ఘ మాయుః 62

వ్యాఖ్య: నృపతిః -దశరథుఁడు, క్షురప్రైః - ఒక విధమగు బాణములచేత, ఖడ్గాన్ - ఖడ్గమృగములను, ప్రాయః - ఎక్కువగా, విషాణ పరిమోక్షలఘూత్తమాంగాన్ — విషాణపరిమోక్ష - కొమ్ములను ఊడగొట్టుట చేత, లఘు - బరువు తగ్గిన, ఉత్తమాంగాన్ - తలలు కలవానినిగా, చకార - చేసెను (కొమ్ములను

ఱడగొట్టెను గాని చంపలేదని యర్థము). (కుతః - ఎందువలననగా) దృప్త వినయాధికృతః - దృప్త - గర్వించిన వారిని, వినయ - శిక్షించుట యందు, అధికృతః - అధికారము గలవాడగు (దుష్టనిగ్రహము చేయువాఁడని యర్థము) సః - ఆ దశరథుఁడు, పరేషాం - ప్రతికూలురైన వారియొక్క, అత్యుచ్ఛ్రితం-మిక్కిలి పైకెగసిన, శృంగం - కొమ్మును (ప్రాధాన్యమును), నమయ్యే - సహింపకుండెను, తు - కాని, దీర్ఘం, ఆయుః - దీర్ఘాయుష్యమును (జీవిత కాలమును) న - కాదు. గర్వముచేత కొమ్ములు తిరిగినట్లు వ్యవహరించు వారికి శృంగభంగమగునట్లుచేసి యణచి యుంచుటయే కాని, వారిని జీవింపనీయకుండుట దశరథుని స్వభావము కాదు, కనుక ఖడ్గ మృగములకు ముఖముపై మొలచిన శృంగములను భంగము గావించి, వానికి తలబిరువు తగ్గునట్లు చేసి, చంపక విడిచెనని భావము.

శ్లో: వ్యాఘ్రా నభీ రభిముఖోత్పతితాన్ గుహాభ్యః
పుల్లాసనాగ్రవిటపా నివ వాయురుగ్ణాన్
శిక్షావిశేష లఘుహస్తతయా నిమేషా
త్తూణీచకార శరపూరిత వక్త్రరంధ్రాన్. 68

వ్యాఖ్య: అభీః - భయరహితుఁడైన ఆ దశరథుఁడు, గుహాభ్యః - గుహలనుండి, అభిముఖోత్పతితాన్ - తనకెదురుగా పైకి యెగిరినట్టివియు, వాయురుగ్ణాన్-గాలిచేత విరుగగొట్టబడిన, పుల్లాసనాగ్ర విటపాన్ ఇవ - పూచిన వేగిచెట్టు పెద్ద కొమ్మలవలె నున్నట్టివియు, శరపూరిత వక్త్రరంధ్రాన్ - బాణములచేత నింపఁబడిన నోళ్లు కలవియునగు, వ్యాఘ్రాన్ - పెద్దపులులను, శిక్షావిశేష లఘుహస్తతయా — శిక్షావిశేష - అభ్యాసాతిశయముచేత, లఘుహస్తతయా - హస్తలాఘవము గలవాఁడగుటచేత, నిమేషాత్ - క్షణమాత్రములో, తూణీచకార - అంబులపొదులనుగా జేసెను. బాణములతో వ్యాఘ్రములనోళ్లను నింపివేసెనని యర్థము. పులులు చిత్రవర్ణము గలవగుటచేత పుష్పించిన వేగిచెట్ల పెద్ద కొమ్మలు ఉపమానముగాఁజెప్పబడినవి. గుహల నుండి ఇవతలికి యెగిరి నోళ్లు తెఱచిన పులులు, గాలికి విరిగి, చెట్టు నుండి దూరమై రంధ్రములు గలవియై యున్న అగ్రవిటపములుగా నుపమింపబడినవి. తెఱచిన నోళ్ల నిండ శరములు నింపి పులులనే తూణీరములుగాఁజేసెననుట చక్కని కల్పన.

V. R. NARLA MEMORIAL LIBRARY
379
V.R. NARLA
D. P. R. I.
Acc. No.

శ్లో. నిర్ఘాతోగ్రైః కుంజలీనాన్ జిఘాంసు
ర్జ్యానిర్ఘోషైః క్షోభయామాస సింహాన్
నూనం తేషా మభ్యసూయా పరోఽభూ
ద్వీర్యోద్రగే రాజశబ్దే మృగేషు.

వ్యాఖ్య: కుంజలీనాన్ - పొదరిండ్లలో దాగిన, సింహాన్ - సింహములను, జిఘాంసుః - చంపఁదలచినవాడై, నిర్ఘాతోగ్రైః - పిడుగు చప్పుడువలె భయంకరములైన, జ్యానిర్ఘోషైః - ధనుష్టంకారములచేత, క్షోభయామాస - కలవరపెట్టెను, తేషాం - ఆ సింహముల యొక్క, వీర్యోద్రగే - శౌర్యముచేత ఉన్నతమైన, మృగేషు, రాజశబ్దే - మృగముల విషయమున నేర్పడిన రాజశబ్దమునందు (మృగరాజ శబ్దము నందు) అభ్యసూయాపరః - అసూయాపఁరుడు, - అభూత్, నూనం - అయియుండెనేమో! (కానిచో సింహములను వెదకి చంపనేల? యని భావము) ఇది శాలినీవృత్తము.

శ్లో. తాన్ హత్వా గజకులబద్ధ తీవ్రవై రాన్
కాకుస్థః కుటిల నఖాగ్ర లగ్న ముక్తాన్
ఆత్మానం రణకృత కర్మణాం గజానా
మానృణ్యం గత మివ మార్గణై రమంస్త. 65

వ్యాఖ్య : కాకుస్థః - దశరథుఁడు, గజకులబద్ధ తీవ్రవైరాన్ — గజకుల - ఏనుగుల జాతియందు, బద్ధ - స్థిరముగా నేర్పబడిన, తీవ్రవైరాన్ - అత్యంత శత్రుత్వము గలవియును, కుటిల నఖాగ్రలగ్నముక్తాన్ - కుటిల - వంకరలు దీరిన నఖాగ్ర - గోటి కొనల యందు, లగ్న - తగులుకొన్న (ఇటికిన), ముక్తాన్ - గజకుంభమౌక్తికములు గలవియునగు, తాన్ - ఆ సింహములను, హత్వా - చంపి, ఆత్మానం - తనను, రణకృతకర్మణాం - యుద్ధముల యందు తనకు చేయబడిన యుపకారములు గల, గజానాం - ఏనుఁగుల యొక్క, అనృణ్యం - అనృణత్వమును (అప్పు తీర్చుకొనుటను) మార్గణైః - బాణములచేత (బాణములు తనకు తోడ్పడుటచేత) గతం ఇవ - పొందిన వానినిగా. అమంస్త - తలచెను. తనకు యుద్ధములందు ఉపకారము చేసిన గజముల యొక్క ఋణమును, వాటికి బద్ధ శత్రువులైన సింహములను చంపి తీర్చుకొన్నట్లు భావించెనని తాత్పర్యము. సింహ

ములు కుటిల నఖాగ్రములతో గజములను గ్రుచ్చినవి కనుక, దశరథుఁడు శరము లతో సింహములను గ్రుచ్చుట ఏనుగులకు సంతోషకరము గదా! ఇదియు శాలినీ వృత్తమే.

శ్లో. చమరాన్ పరితః ప్రవర్తితాశ్వాః
క్వచి దాకర్ణవికృష్ట భల్లవర్షీ
నృపతీ నివ తాన్ వియోజ్య సద్యః
సిత వాలవ్యజనై ర్జగామ శాంతిమ్. 66

వ్యాఖ్య: క్వచిత్ - ఒకచోట, చమరాన్ పరితః - చమరీ మృగముల పార్శ్వములందంతటను, ప్రవర్తితాశ్వాః - పరుగెత్తింపఁబడిన గుఱ్ఱము గలవాడును ఆకర్ణవికృష్టభల్లవర్షీ— ఆ కర్ణవికృష్ట - చెవిదాక లాగబడిన, భల్ల - బిల్లెములను బాణములను, వర్షీ - వర్షించువాడునునగు దశరథుఁడు, నృపతీనివ (నృపతీన్ + ఇవ) - రాజులనువలె, తాన్ - ఆ చమరీ మృగములను, సితవాలవ్యజనైః-తెల్లని వాలములనెడు వీవనలతో, వియోజ్య - ఎడబాటు గలిగించి, సద్యః - వెంటనే, శాంతిం జగామ - శాంతిని పొందెను. చమరీ మృగములకు అలంకారములును, గర్వకారణములునైన వాలములను మాత్రము ఖండించి వానిని చంపక విడిచెను. ఇది ఔపచ్ఛందసిక వృత్తము. శూరులకు పరుల యైశ్వర్యమే సహింపరానిదికాని, వారి జీవితము కాదు కనుక, రాజులకువలె మాకును రాజచిహ్నములగు వ్యజన ములు గలవని గర్వపడు చమర మృగములను శత్రురాజులనుగా భావించి, వాటి వాలవ్యజనములమ మాత్రము తొలగించెనని తాత్పర్యము.

శ్లో. అపి తురగసమీపా దుత్పతంతం మయూరం
న స రుచిరకలాపం బాణలక్ష్యీచకార
సపది గత మనస్కశ్చిత్ర మాల్యానుకీర్ణే
రతివిగలితబంధే కేశపాశే ప్రియాయాః. 67

వ్యాఖ్య: సః - ఆ దశరథుఁడు, తురగసమీపాత్ - తన గుఱ్ఱము వద్దనే, ఉత్పతంతమపి - ఎగురుచున్నదియైనను (సులభముగా కొట్టుటకు వీలున్నప్పటికిని యని యర్థము), రుచిరకలాపం - కాంతిమంతమైన పింఛముగల, మయూరం -

నెమలిని, చిత్రమాల్యానుకీర్ణే - రంగురంగుల పూలమాలలచేత వ్యాప్తమైనదియు, రతివిగళితబంధే - సంభోగ సమయమునందు వదలిపోయినముడికలదియునగు, ప్రియాయాః కేశపాశే - ప్రియురాలి యొక్క కొప్పు మీదికి. సపది - అప్పుడే, గతమనస్కః - వెళ్లిన మనస్సు గలవాఁడగుచు, న బాణలక్ష్యీచకార - బాణము నకు గుఱినిగా చేయకపోయెను. ఒక నెమలి తన ప్రక్కన యెగురుచున్నను, దాని పింఛమును చూచుటవలన రతి సమయమున నడలిపోయిన తన ప్రియురాలి కేశపాశము స్మృతికి వచ్చి. ఆ నెమలిని కొట్టుట మానెనని భావము. చిత్రవర్ణము గల నెమలి పింఛమును జూడగానే రతి సమయమున ముడియూడి పరచుకపోయిన కేశములును వానివెంట రాలి చెదిరిపడిన పూలును గల ప్రియురాలి ధమ్మిల్లము స్మృతికి పచ్చెనని చెప్పుటలో చక్కని పోలిక యున్నది. మాలినీవృత్తము.

శ్లో. తస్య కర్కశవిహార సంభవం
స్వేద మానన విలగ్న జాలకమ్
ఆచచామ సతుషార శీకరో
భిన్న పల్లవపుటో వనానిలః 68

వ్యాఖ్య: కర్కశ విహార సంభవం - కఠినమైన మృగయా విహారమువలన గలిగినదియు. ఆననవిలగ్నజాలకం - ముఖముమీద కదలుచున్న బిందువుల మొత్తముగలదియునగు, తస్య - ఆ దశరథుని యొక్క, స్వేదం - చెమటను, సతుషారశీకరః - చల్లని నీటి తుంపురులతోఁగూడినదియు, భిన్నపల్లవపుటః—భిన్న - విచ్చునట్లు చేయబడిన, పల్లవపుటః - దొన్నెలవంటి చిగురాకులు గలదియునగు, వనానిలః - వనవాయువు. ఆచచామ - ఆచమనము చేసెను (సులభముగా తొలగించెనని యర్థము). వేటలో నెడతెగక పరిశ్రమించుటచేత దశరథుని మొగముపై చెమట చుక్కలు నిండుగా నేర్పడెననియు, ఆ స్వేదకణములను చల్లని, మెల్లని వనవాయువు వీచి తొలగించెననియు భావము. "ఆచచామ" ఆచమనము చేయుటకు కొద్దిపాటి జలమే యవసరము. ఇచ్చట పానము చేసెనను నర్థముగల "పపౌ" మొదలగు క్రియల నుపయోగించుట యుక్తముగా నుండదు. కొద్దిపాటి స్వేదకణములకు ఆచమనక్రియ సరిపోయినట్లు ఇతర క్రియలు సరిపోవు కనుగ యిట్టి గౌణార్థము గల క్రియ నుపయోగించెను. రథోద్ధతా వృత్తము.

శ్లో. ఇతి విస్మృతాన్యకరణీయ మాత్మనః
సచివావలంబిత ధురం ధరాధిపమ్
పరివృద్ధరాగ మనుబంధసేవయా
మృగయా జహార చతురేవ కామినీ 69

వ్యాఖ్య: ఇతి - ఇట్లు (పూర్వము చెప్పినట్లు), ఆత్మనః - తనయొక్క, విస్మృతాన్యకరణీయం - మరువబడిన ఇతర కర్తవ్యము గలవాఁడును, సచివావలంబితధురం— సచివ - మంత్రులచేత, అవలంబిత ధురం - ధరింపబడిన రాజ్యభారము గలవాఁడును. అనుబంధ సేవయా - ఎడతెగని సేవచేత, పరివృద్ధ రాగం- అభివృద్ధి చెందిన రక్తిగలవాడును నగు, ధరాధిపం - దశరథ మహారాజును, మృగయా - వేట, చతురా - నేర్పరియైన, కామినీ ఇవ - కాముకురాలువలె, జహార - ఆకర్షించెను. (అపహరించెనని పదార్థము). వినోదమునకై ఆరంభింపబడిన వేట వ్యసనముగా మాఱి దశరథుని విస్మృతాన్యకరణీయునిగాఁజేసి దూరముగానిపోయెనని భావము. ''పరివృద్ధరాగమనుబంధసేవయా'' కోరికలను నిరంతరముగాఁదీర్చుచుఁబోయినచో నవి వృద్ధి జెందునేకాని తగ్గవని తాత్పర్యము. ''నజాతు కామః కామానాం ఉపభోగేన శామ్యతి, హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏ వాభి వర్ధతే'' అని గీతా వాక్యము.

శ్లో. స లలిత కుసుమ ప్రవాల శయ్యాం
జ్వలిత మహౌషధి దీపికా సనాథామ్
సరపతి రతివాహయాం బభూవ
క్వచి దసమేతపరిచ్ఛద స్త్రియామామ్. 70

వ్యాఖ్య: సః - ఆ దశరథుఁడు, లలితకుసుమ ప్రవాలశయ్యాం—లలిత-సుకుమారములైన కుసుమ, ప్రవాల - పువ్వులు, చిగురాకులు, శయ్యాం పడకగా గలదియును, జ్వలిత మహౌషధిదీపికాసనాథాం—జ్వలిత - వెలిగిన, మహౌషధి - ఉత్తమ ఓషధులనెడు, దీపికా - చిఱుదీపములతో, సనాథాం - కూడినదియునగు, త్రియామాం - రాత్రిని, క్వచిత్ - ఒకానొకచోట, అసమేత పరిచ్ఛదః - వెంబడింపని పరివారము గలవాఁడగుచు, అతివాహయాంబభూవ - గడపెను. పువ్వులను, చిగురాకులను పడకగా చేసుకొని, రాత్రివేళ వెలుగు కొన్ని మొక్కల

వెలుగులో నొంటరిగా నొకచోట నిద్రించి, రాత్రిని గడపెననియు మృగయావ్యసన మట్లు ఒంటరిని జేసెననియు భావము. ''అసమేత పరిచ్ఛదః'' అనుటకుఁగారణము దారిలేని యరణ్యమున స్వేచ్ఛగా గుఱ్ఱమును నడపుచు రాత్రియగు పఱకును దశరథుఁడు వేటాడు చుండుటచేత సేవకజన మతనిని గలుసుకొనలేకపోవుటయే.

శ్లో. ఉషసి స గజయూథ కర్ణతాలైః
పటు పటహ ధ్వనిభి ర్వినీతని|దః
అరమత మధురాణి తత్ర శృణ్వన్
విహగ వికూజిత వందిమంగలాని. 71

వ్యాఖ్య: ఉషసి - ప్రాతఃకాలమునందు, పటుపటహధ్వనిభిః - గట్టితప్పెటుల యొక్క ధ్వనులతో సమానమైన ధ్వనులుగల, గజయూథకర్ణ తాలైః- గజయూథ. ఏనుగుల మంద యొక్క, కర్ణతాలైః చెవులనెడు తాళములచేత, వినీతనిద్రః - తొలగింపబడిన నిద్రగల, సః- ఆ దశరథుఁడు, తత్ర - ఆ వనమునందు, మధు రాణి -చెవుల కింపైన, విహగవికూజితవందిమంగలాని— విహగవికూజిత - పక్షుల యఱుపులనెడు, వందిమంగలాని- స్తుతి పాఠకుల మంగళ గీతములను, శృణ్వన్- వినుచున్నవాఁడగుచు, అరమత-ఆనందించెను. అరణ్యమునందు సైతము దశరథునికి, రాజుకు దగిన పఱుపు, వందిమాగధ గీతములు, మంగళవాద్య ధ్వనులు మొదలగు వానిని ప్రకృతియే చేకూర్చెననియు అట్లు సుఖనిద్ర జెంది మేల్కొనె ననియు, ''క్వభోగ మాప్నోతి న భాగ్యభాక్ జనః'' అదృష్టవంతుఁడు ఎచ్చట సుఖమును పొందఁడు? ఎచ్చటనైనను సుఖమే అనుభవింపఁగలుగుననియు తాత్పర్యము.

శ్లో. అథ జాతు రురో ర్గృహీతవర్త్మా
విపినే పార్శ్వచరై రలక్ష్యచూణః
|శమఫేనముచా తపిస్వి గాఢాం
తమసాం |పాప నదీం తురంగమేణ. 72

వ్యాఖ్య: అథ- పిమ్మట. జాతు - ఒకప్పుడు (మృగయా వ్యసనమునఁబడి రోజులు గడుపుచుండగా నొకనాడని యర్థము). రురోః - ఒకవిధమైన లేడియొక్క

గృహీతవర్త్మా - స్వీకరింపఁబడిన మార్గముగలవాఁడై, (అది వెళ్లిన మార్గమున వెళ్ళుచున్నవాఁడై) విపినే - అరణ్యమునందు, పార్శ్వచరైః - ప్రక్కనవచ్చు సేవకులచేత, అలక్ష్యమాణః - కనఁబడనివాఁడగుచు (తురగ వేగముచేతనవి యర్థము), శ్రమఫేనముచా - శ్రమచే నుఱుగును విడుచుచున్న, తురంగమేణ - గుఱ్ఱముతో, తపస్విగాఢాం - మునులచేత మునుకలు వేయబడుచున్న (స్నానార్థమై ప్రవేశించిన మునులు గల), తమసాం - "తమసా"యను పేరుగల, నదీం - నదిని, ప్రాప - చేరెను, ఒక లేడి వెంటఁబడి అలసిన గుఱ్ఱముతో తమసా నదిని జేరెను. "రురుః" అనగా నల్ల చారల దుప్పి. ఇచ్చట 'తమసాం' అనగా తమసా నదీతీరమునని లాక్షణికార్థమును జెప్పవలెను. లేనిచో ముందు రాఁబోవు శ్లోకార్థముతో విరోధించును.

శ్లో. కుంభపూరణ భవః పటు రుచ్చైః
రుచ్చచార నినదోఽంభసి తస్యాః
తత్ర స ద్విరదబృంహిత శంకీ
శబ్దపాతిన మిషుం విససర్జ 78

వ్యాఖ్య: తస్యాః - ఆ తమసా నదియొక్క, అంభసి - ఉదకమునందు, కుంభపూరణ భవః — కుంభపూరణ - కడవను నింపుటచేత, భవః - పుట్టిన దియు, పటుః-గట్టిదియు, ఉచ్చైఃః - పెద్దదియునగు, నినదః - ధ్వని, ఉచ్చచార— సైకి వినవచ్చెను. తత్ర - ఆధ్వని విషయమున, సః - ఆ దశరథుఁడు, ద్విరద బృంహితశంకీసన్ - ద్విరద - ఏనుగుయొక్క, బృంహిత - ధ్వనినిగా, శంకీ స... - అనుమానించుచున్నవాఁడై, శబ్దపాతినం - శబ్దము ననుసరించి పడునట్టి, ఇషుం - బాణమును, విససర్జ - విడిచెను, తమసానది యొడ్డున కొంచము దూర ముగానున్న దశరథుఁడు, లక్ష్యమును చూడజాలక తన మేటివిలుకానితనమును జూపుటకై నదీజలము నుండి లేచిన శబ్దము కుంభపూరణము వలన గలిగినదని గుర్తింపక పోలికనుబట్టి గజబృంహిత మనుకొని సరిగా నచ్చటపడునట్టి శబ్దవేధి బాణమును విడిచెనని భావము. ఇది స్వాగతావృత్తము.

శ్లో. నృపతేః ప్రతిషిద్ధ మేవ తత్
కృతవాన్ పంక్తిరథో విలంఘ్య యత్

అపథే పద మర్పయంతి హి
శ్రుతవంతోఽపి రజో నిమీలితాః 74

వ్యాఖ్య: తత్ - అది (అట్లు బాణమును విడుచుట), నృపతేః- క్షత్రియునికి, ప్రతిషిద్ధమేవ - నిషిద్ధమైనదే, యత్ - ఏ యాగజవధరూపమైన కర్మను, పంక్తిరథః - దశరథుఁడు, విలంఘ్య - శాస్త్రమును ఉల్లంఘించి, కృతవాన్ - చేసెనో; శ్రుతవంతః అపి- విద్వాంసులు సైతము, రజోనిమీలితాః- రజోగుణము చేత ఆవరింపబడిన వారైనప్పుడు, అపథే - అపమార్గము నందు, పదం - అడుగును, అర్పయంతి హి - పెట్టుదురు గదా! గజవధ శాస్త్రనిషిద్ధమను సంగతిని మరచి బాణమును వేసెను. "లక్ష్మీకామో యుద్ధాదన్యత్ర కరివధం న కుర్యాత్" ఐశ్వర్య కాముఁడైన రాజు యుద్ధరంగమునందు తప్ప యితరత్ర గజమును చంపరాదని శాస్త్రము. అట్టి శాస్త్రమున్ను ల్లంఘించి, కరిబృంహణమని గుర్తింప గలిగిన దశరథుఁడు బాణమునెట్లు ప్రయోగించెననగా, విద్వాంసు లైనవారును రజోగుణదూషితులై యొకప్పుడు కానిమార్గమున అడుగుపెట్టుదురు కదా! అట్లే దశరథుఁడు రజోగుణదూషితుఁడై యీతప్పును జేసెనని భావము. వైతాలీయ వృత్తము.

శ్లో. హా తాతేతి క్రందిత మాకర్ణ్య విషణ్ణః
తస్యా న్విష్యన్ వేతస గూఢం ప్రభవం సః
శల్యప్రోతం ప్రేక్ష్య సకుంభం మునిపుత్రం
తాపా దంతఃశల్య ఇవాసీత్ క్షితిపోఽపి. 75

వ్యాఖ్య: హా తాత! ఇతి - ఓ తండ్రీ! యనెడు, క్రందితం - దుఃఖసహితమగు పిలుపును, ఆకర్ణ్య - విని, విషణ్ణః - భగ్నోత్సాహుఁడగుచు, తస్య - ఆ యాక్రందనమునకు, వేతసగూఢం - ప్రబ్బలిచెట్లచేత చాటైయున్న, ప్రభవం - కారణమును, అన్విష్యన్ - వెదకుచున్న వాడగుచు, శల్యప్రోతం - బాణముచేత గ్రుచ్చబడిన వాడును, సకుంభం - కడవను పట్టుకొని యున్నవాడును నగు, మునిపుత్రం - మునికుమారుని, ప్రేక్ష్య - చూచి, సఃక్షితిపః అపి - ఆ దశరథుఁడు గూడ, తాపాత్ - దుఃఖమువలన, అంతఃశల్యఇవ - హృదయమునందు గ్రుచ్చుకొన్న శల్యము గలవాఁడువలె, ఆసీత్ - అయ్యెను. తాను బాణము విడిచిన

వెంటనే "హా తాత!" అను ఆక్రందనము వినవచ్చుటచేత, ప్రబ్బలి పొదచాటు నుండి వచ్చిన యా యలుపునకు కారణమును వెదుకబోవ్చు, అచ్చట బాణ విద్ధుడై జలకుంభమును పట్టుకొనియున్న యొక మునికుమారునిఁ జూచి దశరథుఁడు దుఃఖితుఁడై తన గుండెలో బాణము గ్రుచ్చుకొన్న వానివలె బాధపడెనని భావము. "శల్యం శంకౌ శరే వంశే" అని విశ్వనిఘంటువు. ఇది మయూర వృత్తము.

శ్లో. తేనా వతీర్య తురగాత్ ప్రథితాన్వయేన
పృష్టాన్వయః స జలకుంభ నిషణ్ణ దేహాః
తస్మై ద్విజేతర తపస్విసుతం స్ఖలద్భి
రాత్మాన మక్షరపదై ః కథయాంబభూవ. 76

వ్యాఖ్య: ప్రథితాన్వయేన - ప్రసిద్ధమైన వంశముగల (దీనివలన పాప భీరుత్వము సూచింపబడుచున్నది), తేన - ఆ దశరథునిచేత, తురగాత్ - గుఱ్ఱము పైనుండి, అవతీర్య - దిగి, పృష్టాన్వయః - అడుగబడిన కులము గలవాఁడును, జలకుంభ నిషణ్ణదేహాః - నీటికడవమీద పడిపోయిన శరీరము గలవాఁడును నగు, సః - ఆ మునికుమారుఁడు, తస్మై - ఆ దశరథుని కొఱకు, స్ఖలద్భిః - తొట్రు పడుచున్న, అక్షరపదైః - అక్షర ప్రాయములైన పదములచేత, ఆత్మానం - తనను, ద్విజేతర తపస్విసుతం—ద్విజేతర - ద్విజుడు కానియట్టి, తపస్విసుతం - మునికుమారునిగా, కథయాంబభూవ - చెప్పెను. బ్రహ్మహత్య జరిగెనా? యేమి యని భయవడుచు గుఱ్ఱముమీదినుండి దిగిన దశరథుఁడు ముందుగా "నీ కులమేది" యని యడుగగా నీటికడవ యాధారముగా నిల్పుకొనిన దేహముగల యా బాలుఁడు తొట్రుపడుచున్న యక్షరములుగల పదములతో శక్తిలేక ఒక్కొక్క పదమునం దొకటి రెం డక్షరములుగా పలుకుచు, నేను ద్విజేతరకులము వాఁడనని చెప్పెను. బ్రహ్మ క్షత్రియ వైశ్య జాతులకు భిన్నమైన కులమున బుట్టిన ముని కుమారుఁడ నని చెప్పెనని భావము. ఇచ్చట రామాయణము, "బ్రహ్మహత్యాకృతం పాపం హృదయా దపనీయతాం। న ద్విజాతి రహం రాజన్ మా భూత్తే మనసోవ్యథా। శూద్రాయా మస్మి వైశ్యేన జాతో జనపదాధిప!" అని చెప్పినది. రాజా! బ్రహ్మ హత్య చేసితినని బాధపడకుము. నేను ద్విజాతివాఁడను కాను, వైశ్యునికి శూద్ర స్త్రీ యందుఁ బుట్టిన వాఁడనని రామాయణార్థము.

శ్లో. తచ్ఛోదితశ్చ తమనుద్ధతశల్య మేవ
పిత్రోఃసకాశమవసన్నదృశో ర్నినాయ
తాభ్యాం తథాగత ముపేత్య తమేకపుత్ర
మజ్ఞానతఃస్వచరితం నృపతిఃశశంస. 77

వ్యాఖ్య: తచ్ఛోదితః - ఆ ముని కుమారునిచేత కోరఁబడిన వాఁడై, నృపతిః - దశరథుఁడు, అనుద్ధత శల్యమేవ - ఊడదీయబడని బాణముగలి వానిని గానే, తం - అతనిని, అవసన్న దృశోః - నఱంచిపోయిన కన్నులుగల (గ్రుడ్డి వారైన), పిత్రోః - తల్లి దండ్రులయొక్క, సకాశం - సమీపమును, నినాయ - చేర్చెను, తథాగతం - ఆ విధముగా ప్రబ్బలి పొదమాటున నున్నట్టి, ఏకపుత్రం - ఒకే కుమారుఁడైయున్న, తం - ఆ మునికుమారుని, ఉపేత్య - సమీపమునకుఁ జేరి, అజ్ఞానతః - మనుష్య డవి తెలియక పోయనందువలన (ఏనుగను భ్రాంతి చేత) జరిగిన, స్వచరితం - తాను చేసినపనిని, తాభ్యాం - ఆ తల్లిదండ్రులకు, శశంస - చెప్పెను. ఆ మునికుమారుఁడు మా తల్లి దండ్రులవద్దికిఁ నన్నుజేర్పు మని కోరగా దశరథుఁడు నాటుకొన్న బాణముతో గూడ నతనిని గ్రుడ్డివారైన తల్లి దండ్రుల వద్దికిఁ గొనిపోయి, "ఏకైక పుత్రుఁడైన మీ కుమారుఁడు తమసా నదిలో ప్రబ్బలి పొదచాటున కడవను నింపుకొనుచుండగా వచ్చిన శబ్దమును కరి బృంహితమనుకొని పొరపాటున బాణము వేసితిని. ఇప్పుడు మీ సమీపమున జేర్చి తిని" అని తాను చేసిన అకృత్యమును దుఃఖితుఁడై దశరథుఁడు వారికి విన్నవిం చెను. "పిత్రోః - మాతాచ పితాచ పితరౌ, తయోఃపిత్రోః" అని విగ్రహము. "పితామాత్రా" అను సూత్రముచేత నేర్పడిన ఏక శేష సమాసము. వాల్మీకి రామా యణమునందు దశరథుఁడు చనిపోయిన మునికుమారువివద్ది కతని తల్లిదండ్రు లను తానే తీసికొనివచ్చి, అంధులయిన వారి చేతులతో మృతుఁడైన కుమారుని స్పృశింపఁ జేసినట్లున్నది. "అథాహ మేకస్తం దేశం నీత్వా తౌ భృశ దుఃఖితౌ, అస్పర్శ్యయ మహం పుత్రం తం మునిం సహభార్యయా". దశరథుఁ డంధ దంప తుల వద్దికి తానుమాత్రము వెళ్లి, వారి కుమారుఁడు చనిపోయినట్లు తెలిసి, వారిని తీసికొని వచ్చి. కుమారుని మృత కళేబరమును స్పృశింపఁ జేయునట్టి విలంబము మొదలయినవి సత్యేతిహాసమగు రామాయణమునకుఁ జెల్లునుగాని, రసైక ప్రధాన మైన కావ్యమునకుఁ జెల్లవను భావముతోను, దశరథుని దయావంతునిగాఁ

జిత్రించు తలంపుతోను, కాళిదాసు ఇట్లు మార్చి, సజీవుఁడై, బాణవిద్ధుఁడై యున్న యేకైక పుత్రుని నతని యంధ పితరుల వద్దికి తానే, వెంటనే తీసుకొనిపోయినట్లు వర్ణించెను.

శ్లో. తౌ దంపతీ బహువిలప్య శిశోః ప్రహర్తా
శల్యం నిఖాత ముదహారయతా ముర స్తః
సోఽభూత్ పరాసు రథ భూమిపతిం శశాప
హస్తార్పితై ర్నయనవారిభి రేవ వృద్ధః. 78

వ్యాఖ్య: తౌ దంపతీ - ఆ వృద్ధదంపతులు, బహు - అనేక విధము లుగా, విలప్య - శోకించి, శిశోః - బాలునియొక్క, ఉర స్తః - వక్షస్థలమునుండి, నిఖాతం, శల్యం - నాటబడియున్న బాణమును, ప్రహర్తా - దానిని వేసిన దశ రథునిచేతనే, ఉదహారయతాం - పైకి లాగించిరి (ఫలితముగా), సః - ఆ బాలుఁడు, పరాసుః - గత ప్రాణుఁడు, అభూత్ - అయ్యెను (చనిపోయెను), అథ - తరువాత, వృద్ధః-ఆ వృద్ధుఁడు, హస్తార్పితై ఃతన చేతుల యందుంచుకొన బడిన, నయన వారిభిః ఏవ - కన్నీళ్లచేతనే, భూమిపతిం - రాజును, శశాప - శపించెను. దశరథునిచే తమ ముందుంచబడిన బాలుని స్పృశించుచు ఆ వృద్ధ దంప తులు పెక్కు- విధముల శోకించి, బాలుని యెడదపై నాటుకొన్న బాణమును దానిని వేసిన రాజుచేతనే పైకి లాగించిరి. తత్ఫలితముగా బాలుఁడు మరణించెను. క్రుద్ధుఁ డైన అంధ వృద్ధుఁడు తన దోసిలినిండిన కన్నీళ్లతో దశరథుని శపించెను. శాప మును జల పూర్వకముగా నిచ్చట పరిపాటి కనుక ఇచ్చట శోకజల మాపని కుప యోగించెను.

శ్లో. దిష్టాంత మాప్స్యతి భవానపి పుత్రశోకా
దంత్యే వయస్యహ మివేతి త ముక్తవంతమ్
ఆక్రాంతపూర్వ మివ ముక్తఃషం భుజంగం
ప్రోవాచ కోసలపతిః ప్రథమాపరాద్ధః. 79

వ్యాఖ్య: హే రాజన్ - ఓ రాజా! భవానసి (భవాన్ + అపి) - నీవు కూడ, అంత్యే, వయసి - చివరి వయస్సునందు (వృద్ధత్వమునందు) అహమివ -

నేనువలెనే, పుత్రశోకాత్ - పుత్రదుఃఖమువలన, దిష్టాంతం - కాలావసానమును (మరణమును), ఆప్స్యతి - పొందగలవు, ఇతి - ఇట్లని, ఉక్తవంతం - పలికిన వాడును, ఆక్రాంతపూర్వం - మొదట కాలిచేత క్రౌక్కబడినదియై, ముక్తవిషం - తరువాత విషమును వదలిపెట్టిన, భుజంగం ఇవ - సర్పమువలె నున్న, తం - ఆ వృద్ధుని గుఱించి, ప్రథమాపరాద్ధః - మొదట తప్పుచేసినట్టి, కోసలపతిః - దశరథుఁడు, ప్రోవాచ - పలికెను. 'రాజా! నీవుగూడ నా వలెనే వార్ధక్యమునందు పుత్రశోకముచేత మరణింతువుగాక' అని శాపముపెట్టిన మునిని, మొదట కాలిచేత క్రౌక్కబడి, కోపముతో కాటువేసిన సర్పముతో సమానముగా భావించి, మొదటి తప్పు తనది కనుక శాపమును సహించి, దశరథుఁడా మునితో నిట్లు పలికెనని భావము.

శ్లో. శాపోఽప్యదృష్ట తనయాన పద్మశోభే
సానుగ్రహో భగవతా మయి పాతితోఽయమ్
కృష్ణాం దహన్నపి ఖలు క్షితి మింధనేద్ధో
బీజప్రరోహ జననీం జ్వలనః కరోతి. 80

వ్యాఖ్య: అదృష్ట తనయాన పద్మశోభే—అదృష్ట - చూడబడని' తనయ - కుమారుని యొక్క, ఆనన పద్మశోభే - ముఖకమల కాంతి గల (అపుత్రకుఁడనైన), మయి - నా యందు, భగవతా - షడ్గుణైశ్వర్య సంపన్నుఁడవైన నీచేత, పాతితః - పడవేయఁ బడిన, శాపోఽపి (శాపః + అపి) - శాపమునైతము, సానుగ్రహః - అనుగ్రహముతోఁ గూడినట్టిదే; ఇంధనేద్ధః - కట్టలచేత ప్రజ్వలించిన, జ్వలనః - అగ్ని, కృష్ణాం - దున్నుటకు దగిన, క్షితిం - భూమిని, దహన్, అపి - కాల్చుచున్న దగుచునే, బీజప్రరోహజననీం - బీజాంకురములయొక్క ఉత్పాదన శక్తికల దానినిగా, కరోతి - చేయుచున్నది' కట్టలచేత బాగా మండిన అగ్ని, దున్ని విత్తనములు వేయదగిన భూమికి అంకురోత్పాదన శక్తి నిచ్చినట్లు, క్రుద్ధుఁడవైన నీవు నాపైఁ బడవేసిన పిడుగువంటి శాపము "పుత్రశోకముచేత మరణింపుము" అనునది, పుత్రుని మొగమునే యెఱుఁగని అపుత్రకుఁడనైన నాకు పుత్రోత్పత్తిని గలిగించునట్టి ఫలముగలది యగుటచేత అనుగ్రహపూర్వక మైనదిగానే యున్నదని దశరథుఁడు వృద్ధమునితో పలికెను.

శ్లో. ఇత్థంగతే గతఘృణః కిమయం విధత్తా
వధ్యస్తవేత్యభిహితో వసుధాధిపేన
ఏధాంసి హుతాశనవతః స మునిర్యయాచే
పుత్రం పరాసు మనుగంతుమనాః సదారః. 81

వ్యాఖ్య: ఇత్థం, గతే - ఇట్లు జరిగినదికాగా, వసుధాధిపేన - దశరథుని చేత, "గతఘృణః - కరుణాహీనుఁడైన వాడును, తవ - నీకు, వధ్యః - వధార్హుఁడునగు, అయం - ఈ జనుఁడు, కిం విధత్తాం - ఏమి చేయవలయును", ఇతి - అని, అభిహితః - అడుగబడిన, సః, మునిః - ఆ ముని, సదారః - భార్యా సహితుఁడై, పరాసుం, పుత్రం - చనిపోయిన పుత్రుని, అనుగంతుమనాః సన్ - అనుసరించి వెళ్లవలెనను మనస్సు గలవాడగుచు, హుతాశనవతః - అగ్నితో కూడిన, ఏధాన్ - కాష్ఠములను, యయాచే - కోరెను. ఇట్టి అకృత్యము జరిగిపోగా దశరథుఁడు నిర్వేదముతో తనమీద తనకే అసహ్యము కలిగి, ఆ మునిని "నిష్కరుణుఁడై, నీకు వధార్హుఁడైన యీ జనుఁడు ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుము" అని యడిగెను. ఆ వృద్ధముని భార్యా సహితుఁడై కుమారునివెంట అనుమరణము చేయఁ దలచిన వాఁడై మా అందఱికిని సరిపడునట్టి అగ్నిసంస్కారము గల కాష్ఠములను దెచ్చి చితిని గావింపుమని దశరథునిఁ గోరెను. ఇట్టి అనుమరణమువలన ఆత్మఘాత దోషము గలుగదని ధర్మశాస్త్రము: "అనుష్ఠానాసమర్థస్య వానప్రస్థస్య జీర్యతః। భృగ్వగ్ని జలసంపాతై ర్మరణం ప్రవిధీయతే" అని. స్నాన సంధ్యా ద్యనుష్ఠానములు చేసుకొనుటకు శక్తిలేక, నానాటికిని కృంచి పోవుచున్న వానప్రస్థునికి భృగుపాత, అగ్నిపాత, జలపాతములచేత మరణము విధింపఁబడుచున్నది. కనుక అంధులై, వృద్ధులై, అపుత్రకులై యున్న ఆ దంపతులు కాష్ఠాగ్ని ప్రవేశముతో పుత్రానుమరణము చేయుట అధర్మముకాదు, వారికి ఆత్మహత్యాదోషము లేదని భావము.

శ్లో. ప్రాప్తానుగః సపది శాసన మస్య రాజా
సుపాద్య పాతకవిలుప్తఫలాం ర్నివృత్తః
అంతర్నిషిక్తపద మాత్మవినాశహేతుం
శాపం దధత్ జ్వలన మౌర్వ మివాంబురాశిః. 82

వ్యాఖ్య: ప్రాప్తానుగః - తనవద్దికిఁ జేరిన యనుచరులుగల, రాజా - దశరథుఁడు, సద్యః - తక్షణమే. అస్య - ఆ మునియొక్క, శాసనం - కాష్ఠములతో, చితిని పేర్చుమని చెప్పిన యాజ్ఞను (మొదట నొక్కఁడే యున్నను ఇప్పుడనుచరులందఱును జేరుటచేత), సంపాద్య - పూర్తిచేసి, పాతకవిలుప్తధృతిః—పాతక - పాపముచేత, విలుప్త - లోపించిన, ధృతిః - ధైర్యము గలవాఁడగుచు, అంతర్నివిష్టపదం - తనలో నుంచఁబడిన పాదముగలదియు, ఆత్మ వినాశ హేతుం - తన వినాశమునకు కారణమైనదియు నగు, శాపం - శాపమును, అంబురాశిః - సముద్రము, ఔర్వం, జ్వలనం ఇవ - బడబాగ్నినివలె, దధత్ - ధరించుచున్న వాఁడగుచు, నివృత్తః - వనమునుండి గృహమునకు మరలిన వాఁడయ్యెను. దశరథుఁడట్లు వృద్ధమునితో సంభాషించుచుండగా రాజ సేవకులందఱును అచ్చటికి చేరుటచేత, ముని కోరిన చితిని సులభముగాఁ బేర్చి ఆ ముగ్గురికిని దహన సంస్కారమును గావించి, ముని బాలక వధ రూపమైన పాతకముచేత ధైర్యమును గోలుపోయిన వాఁడగుచును, తనలో ప్రవేశించి తన వినాశమునకు కారణమైన శాపమును సముద్రుఁడు తనలో బడబాగ్నిని దాచుకొన్నట్లు ధరించుచును, నిరుత్సాహవంతుఁడై యరణ్యమునుండి అయోధ్యానగరమునకు వెళ్లిపోయెనని భావము. పాతకము (పాపము) మానసిక సంస్కార రూపము కనుక మనస్సు నందున్న ధైర్యమును ప్రక్కకుద్రోసి తా నచ్చట కాలూనెనని యర్థము. శాపముగూడ జీవమునకు, మనస్సునకును అంటుకొనునట్టి సంస్కారమే కనుక ఆ రెండింటిని ధరించి, తన్మూలముగా నుత్సాహమును గోలుపోయి దశరథుఁడు వనమునుండి యింటికి పోయెనని సమన్వయము.

ఇది మహాకవి కాళిదాసకృత రఘువంశ మహాకావ్యమున
నవమ సర్గకు తెలుఁగు లఘువ్యాఖ్య.

మొదటి భాగము

సంపూర్ణము

f

తప్పుల పట్టిక

పుట	శ్లోకం/పంక్తి	ఉన్నది	ఉండవలసినది
1	3వ పంక్తి	పాపన	పావన
35	శ్లో. 84	వవృధా	వభృథా
,,	15 పంక్తి	అవభృథాత్	అవభృథాత్ అపి-
54	శ్లో. 29	కేసరిణాం	కేసరిణం
60	5వ పంక్తి	అశక్యరక్ష్యం-	అశక్యరక్షం-
74	శ్లో. 68	ప్రసన్నేందు మఖః	ప్రసన్నేందుముఖః
77	శ్లో 74	మాపసంజ	మాససంజ
89	,, 19	పద్మని	సద్మని
98	శ్లో. 36	అగచ్ఛదంశే	అగచ్ఛదంశేన
101	,, 41	జవేన	జలేన
104	,, 46	మహాగ్రతో థమం	మహాక్రతోరమం
106	పంక్తి 20	బోలియున్ను	బోలియున్న
111	,, 23	పత్రిణాం	పత్రిణా
113	శ్లో 62	శస్త్రవ్యపహార	శస్త్రవ్యవహార
,,	పంక్తి 20	అసంగతం	అసంగం
134	పంక్తి 5	నేతా	నేతా, సః
,,	శ్లో 38	న తీర్త్వా	స తీర్త్వా
140	,, 52	వ్రస్తాంఙుక	స్రస్తాంఙుక
150	,, 75	అసన్నోష	ఆసన్నోష
151	,, 77	ఛేసణీయాశ్మ	ఛేపణీయాశ్మ
154	,, 84	రత్నపుష్పోప	రత్నపుష్పోప
167	,, 16	వృద్ధేః	వృద్ధేః
169	,, 20	పురస్తాత్	పురస్తాత్
179	,, 37	స్మాత్	స్వాత్
182	,, 42	శీకరార్ద్రైః	శీకరార్ద్రైః
193	,, 61	చంద్ర	చంద్రం

పుట	శ్లోకం/పంక్తి	ఉన్నది	ఉండవలసినది
199	శ్లో 70	నిర్ధాత	నిర్ధౌత
,,	,, ,,	పరభాగతయ	పరభాగతయా
203	,, 75	ముజ్ఝాం	ముజ్ఝాం
220	,, 29	స్తతీయా	స్తృతీయా
223	,, 34	స్రదోషాన్	ప్రదోషాన్
225	పంక్తి 11	యనూనరాజు	యనూపరాజు
234	శ్లో 55	బందీకృలానా	బందీకృతానా
236	,, 58	దసావర్తత	దపావర్తత
237	,, 61	సౌస్నాలికో	సౌస్నాతికో
248	,, 81	కాలీతయా	కాలీనతయా
256	,, 8	పన్నికర్షం	సన్నికర్షం
,,	,, 9	రవ్యా	రన్యా
272	,, 38	నిభావ్య	విభావ్య
274	,, 42	రుధిరప్రవాహాః	రుధిరప్రవాహః
287	,, 67	వశ్యానుమతా	పశ్యానుమతా
,,	,, 68	ప్రతిద్వంది	ప్రతిద్వంద్వి
288	పంక్తి 1	,,	,,
297	శ్లో 14	సమపాస్యత	సముపాస్యత
299	,, 17	యుయజే	యుయుజే
300	,, 19	పంచశకీ	పంచశరీర
309	,, 36	విభూలి	విభూతి
328	,, 72	సస్థితః	సంస్థితః
329	,, 74	వరివాహ	పరివాహ
333	,, 83	మపస్థితా	ముపస్థితా
334	,, 84	మానిష్కృత	మావిష్కృత
356	,, 24	మధురంజిత	మధు రంచిత
379	,, 64	క్షోభయామాప	క్షోభయామాస
383	,, 72	తపిస్వీగాఢాం	తపస్వీగాఢాం

BCZ

AOUA02B133

AOUA

